
# యండమూరి వీరేంద్రనాథ్

# ది డైరీ ఆఫ్
# మిసెస్ శారద



# ది డైరీ ఆఫ్ మిసెస్ శారద

యండమూరి వీరేంద్రనాథ్

Kinige

THE DIARY OF Mrs. SARADA

By :
YANDAMOORI VEERENDRANATH
36, U.B.I. Colony,
Road No. 3, Banjara Hills,
HYDERABAD – 500 034
Ph. 924 650 2662
yandamoori@hotmail.com
yandamoori.com

SARASWATHI VIDYA PEETAM,
Kakinada - Samalkot Road,
MADHAVAPATNAM,
E.G.Dist. (A.P.)

Publishers :
NAVASAHITHI BOOK HOUSE
Eluru Road, Near Ramamandiram,
Vijayawada - 520 002.
Ph : 0866 - 2432 885
E-mail : navasahithiravi@gmail.com

This book is digitized and brought to you by KINIGE

© Author
© Yandamoori Veerendranath
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

మంచిని నిలబెట్టటం కోసం

చెడుతో యుద్ధం తప్పనప్పుడు

గెలుపు కోసం మనిషి

మరో చెడుని ఆశ్రయించనవసరం లేదు.

చరిత్ర చెప్పినా

భగవద్గీత చెప్పినా – అదే సూత్రం

విలక్షణమైన పాత్రలతో

సలక్షణమైన ఇతివృత్తంతో

యండమూరి వీరేంద్రనాథ్

ఆ సూత్రాన్ని చరిత్రాత్మకంగా

చెప్పిన నవల

ది డైరీ ఆఫ్ మిసెస్ శారద

# ది డైరీ ఆఫ్ మిసెస్ శారద

## ప్రొలోగ్ :

"ఏమిట్రా అంత దీక్షగా చదువుతున్నావ్?" గ్లాసులో మందు పోస్తూ ఒకడు రెండోవాణ్ణి అడిగాడు. పచ్చిమిరపకాయ బజ్జీల పొట్లం విప్పి, బజ్జీల్ని ప్లేట్లో పడేసి, కాగితం పారెయ్యబోతూ ఆగి దాన్ని చదువుతున్న రెండోవాడు తలెత్తి –

"ఇదేదో ఇంటరెస్టింగ్‌గా వుందిరా. డైరీలో కాగితంలా వుంది" అన్నాడు. ఎప్పటిదో పాత డైరీలో కాగితం.

"ఇదేదో ఆడపిల్ల డైరీలో కాగితంలా వుంది. క్రింద 'శారద' అని వుంది".

"ఆడపిల్ల డైరీలో కాగితమా? ఏమైనా ఇంటరెస్టింగ్‌గా వుందా?" ఉత్సాహంగా ముందుకి వంగాడు మొదటివాడు.

"ఏ బోయ్ ఫ్రెండ్ గురించైనా వుంటే, మందు ప్రారంభించబోయే ముందు హుషారుగా వుంటుంది".

మూడోవాడు ఆ కాగితాన్ని లాక్కొని బిగ్గరగా చదవటం ప్రారంభించాడు.

"మనుష్యులు రెండు రకాలు.

తెలివైన వాళ్ళు.

తెలివితక్కువ వాళ్ళు.

---

మనుష్యులు రెండు రకాలు.

బలమున్న వాళ్ళు.

బలంలేని వాళ్ళు.

---

తెలివిగానీ, బలముగానీ లేనివాళ్ళు
సామాన్యులవుతారు.

---

బలం వున్నవాడు
నీతిని వదిలేస్తే
పొలిటీషియన్ అవుతాడు.

---

తెలివి వున్నవాడు నీతిని వదిలేస్తే
కాపిటలిస్ట్ అవుతాడు.

---

తెలివైనవాడు నీతిని వదిలెయ్యకపోతే
టీచరో, మేధావో అయి సంతృప్తి చెందుతాడు.

---

బలమైనవాడు నీతిని వదిలెయ్యకపోతే
శ్రామికుడై శక్తి ధారపోస్తాడు.

---

నా జీవితాన్ని దర్పణంగా చేసి, నలభై సంవత్సరాల చరిత్రని అందులో ప్రతిబింబంగా చేసి చూస్తే నాకు తెలిసిన సత్యం ఇది. **The ceuntrr through my eyes.** ఎందుకో ఈ రాత్రి నా జీవితంలో ఆఖరిరోజు అనిపిస్తుంది. ఇదే నా డైరీలో ఆఖరి పేజీ అనిపిస్తుంది.

- శారద"

బిగ్గరగా చదవటం పూర్తిచేసి "ఏమిటిరా ఈ సుత్తి?" అంటూ కాగితం పక్కవాడి కిచ్చాడు.

"ఎవరీ శారద?"

"ఏ శారదైతేనేం? ప్రతి శారద చరిత్రం – ఒక పురుషుడి పాదఘట్టపీడన చరితం..." కవిత్వం చెపుతున్నట్టు అన్నాడు ఒకడు.

"ఇది అలాంటి చరిత్ర కాదనుకుంటాను. ఏదో – తెలివీ – దేశమూ అంటోందిగా".

"ఒరేయ్. మీ అందరికీ మతిపోయిందిరా!"

"ఎందుకు గురూ?"

"లేకపోతే ఏమిట్రా? మందు గ్లాసులు ముందు పెట్టుకుని మన దేశం, డైరీ గురించి మాట్లాడతారు" అంటూ ఆ కాగితం విసురుగా లాక్కొని, వుండచుట్టి బలంగా కిటికీలోంచి బయటకు విసిరేశాడు.

అది వెళ్ళి రోడ్డుమీద పడి, పల్లంలోకి జారి పక్కనున్న కాలువలోకి జారింది.

జీవనదులు ఎండిపోయినా, దేశంలో ఎప్పుడూ నిండుగా పారే మురిక్కాలువ ఆ కాగితం వుండని తనలో కలిపేసుకుని ముందుకు ప్రవహించింది.

రాజకీయ పార్టీ వూరేగింపుకి లారీల్లో తెచ్చిన జనంలా ఆ కాగితం గమ్యం లేకుండా సాగిపోయింది.

# అధ్యాయం -1

**బాపూజీ కలలు కన్న స్వాతంత్ర్యం వచ్చిన ఇరవై సంవత్సరాల తరువాత... నగరానికి చెరోవైపు నుంచీ ఒక అర్థరాత్రి –**

**ఇద్దరాడవాళ్ళు ఒంటరిగా రోడ్డుమీద కొచ్చారు. ఒకరు నగరానికి తూర్పున వున్న నేతాజీ సుభాస్ చంద్రబోస్ వీధిలోంచి – మరొకరు శ్మశానం పక్కన వున్న దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ నగర్ సందులోంచి.**

దేశ్ ముఖ్ నగర్ సందులోంచి వచ్చిన అమ్మాయికి పధ్నాలుగేళ్ళుంటాయి. జాకెట్టు భుజాల దగ్గిర చిరిగింది. లంగా బాగా మాసిపోయి వుంది. భయం భయంగా, చెత్తకుండీ పక్కనుంచి మెయిన్ రోడ్డు మీదకి వస్తూండగా –

"ఏయ్ ఆగు" అని వినిపించింది. ఆ అమ్మాయి బెదురుచూపుల్తో ఆగింది. సైకిల్ మీద వెడుతున్న కానిస్టేబుల్ ధర్మరాజు దగ్గిరకొచ్చి క్రిందకి దిగకుండానే ఒక కాలు నేలమీద అన్చి, కళ్ళజోడు సర్దుకుంటూ "ఎవర్నువ్వు? ఎక్కడ మీ ఇల్లు" అని అడిగాడు.

ఆ అమ్మాయి సమాధానం చెప్పలేదు. సైకిల్ స్టాండేసి, దగ్గిరకొచ్చి మళ్ళీ అడిగాడు. "అర్థరాత్రి ఎక్కడికెళ్తున్నావ్?"

"మా అమ్మ చచ్చిపోయింది".

"ఇల్లెక్కడంటే అమ్మ సచ్చిపోయిందంటావేటే? మీ నాన్నేం చేస్తాడు?"

....

"ఆడు కూడా సచ్చిందా?"

"మా నాన్న చిన్నప్పుడే చచ్చిపోయాడు. అమ్మని గంట క్రితమే చంపేశారు".

కానిస్టేబుల్ ఉలిక్కిపడ్డాడు. "...చంపేశారా?" అన్నాడు.

"అవును, ఆ నెహ్రూ బొమ్మ వెనకాల పొడిచి చంపేశారు. వాళ్ళే తీసుకెళ్ళి శ్మశానంలో పాతిపెట్టారు" చెంపలమీదకు జారుతున్న కన్నీళ్ళని చేత్తో తుడుచుకుంది.

"ఎంతసేపయింది చంపేసి?"

"గంట క్రితమే".

"మరి నువ్వేం చేస్తున్నావ్?"

"మా అమ్మ అరవొద్దని చెప్పింది. నన్ను చూస్తే- నన్ను కూడా చంపేస్తారంది".

"శ్మశానంలో పాతిపెట్టటాన్ని నువ్వు స్వయంగా చూశావా?"

"అక్కణ్ణుంచే వస్తున్నా".

పోలీసుకి నమ్మకం కుదర్లేదు. చూద్దాం పదమంటూ ఆ పిల్లని తీసుకుని బయల్దేరాడు...

...చీకట్లో శ్మశానం 'దేశం'లా వుంది. కాంగ్రెసు ఊడ్చి తినేసిన విస్తరిలా వుంది. కమ్యూనిస్టులు కాల్చేసిన బస్సు తాలూకు పొగలా అక్కడక్కడా చితుల్లోంచి పొగ లేస్తుంది. బి.జె.పి. యాత్ర తరువాత మిగిలే శూన్యం అప్పుడే అక్కడ

పేరుకుంది. జనతాదళ్ నిర్ణయంతో ఆత్మాహుతి చేసుకున్న మండల్ కమీషన్ యువకుల శరీరాల్లా కొన్ని శవాలు కాలీ కాలకుండా వున్నాయక్కడ.

"ఇదే..." అంది ఆ పిల్ల ఓ గుట్ట దగ్గిర ఆగి. గుంట తవ్వి, అప్పుడే మళ్ళీ మట్టి కప్పేసినట్టు ఇంకా తడి ఆరలేదు. డాక్టర్ లేని ప్రైమరీ హాస్పిటల్ అరుగుమీద పడుకున్న నిండుచూలాల్లా వుంది ఆ గుట్ట. ఆ పిల్ల నిజం చెపుతోందన్న నమ్మకం కుదిరింది. పోలీస్ స్టేషన్ కెళ్ళి రిపోర్టిద్దామా అనుకున్నాడు. చంపింది నెహ్రూ బొమ్మెనకాల. వన్ టౌన్లోకి పోద్ది. పాతిపెట్టింది దుర్గాబాయ్ శ్మశానంలో. అంటే త్రీ టౌన్. తనదేమో గాంధీనగర్ టూటౌన్.

"పద పోదాం" అన్నాడు, ఆ సమాధిని జ్ఞాపకాల్లో సమాధి చేసేస్తూ! ఆ పిల్ల అతన్ని అనుసరించింది. అప్పటివరకూ బాగానే వున్నా, ఆ తల్లి శవం మీద మట్టి చూసి మళ్ళీ ఏడవసాగింది.

"మీ అమ్మ ఏం పని చేసేది?" శ్మశానం నుంచి కొంచెం దూరమొచ్చాక అడిగాడు.

"బిచ్చమెత్తేది" ఏడుపు ఆపుకుంటూ అంది.

కానిస్టేబుల్ ఆ పిల్లవంక ఆశ్చర్యంగా చూశాడు. "బిచ్చమెత్తేదాని కూతురివా నువ్వు" అని అడిగాడు. ఆ అమ్మాయికి ఆ ప్రశ్న అర్థం కాలేదు. తనకే అర్థంకానట్టుగా తోచి, "నీ భాష అలా లేదే చదువుకున్నదాన్లా వుంది" అన్నాడు తన అనుమానాన్ని సమర్థించుకుంటూన్నట్టు.

"నే నెనిమిదో క్లాసు చదువుతున్నా!"

అతడా పిల్లవైపు చిత్రంగా చూసి "అడుక్కునేదాని కూతురు ఎనిమిదో క్లాసా?" అన్నాడు.

"మా అమ్మెప్పుడూ నేను బి.ఎ. చదవాలనేది".

అదిరిపడి "బి.ఏ.,నా?" అతి విస్మయంతో అడిగాడు.

"అవును. బి.ఎ. ఎకనామిక్స్. మా అమ్మ కూడా అదే చదివింది" అన్నదా పిల్ల. ఆ కానిస్టేబుల్‌కి మొట్టమొదటిసారి తను ఏ దెయ్యంతోనో మాట్లాడుతున్నానేమో అనుమానం కలిగింది. శ్మశానానికి తీసుకెళ్ళి గుట్ట చూపించటం, అమ్మని రౌడీలు చంపేసేరనటం, అమ్మ బి.ఎ. చదివి బిచ్చమెత్తుకుంటోందనటం...

"మీ అమ్మని ఎందుకు చంపేసేరు?"

"నాకు తెలియదు".

"నిష్కారణంగా ఓ అడుక్కునేదాన్ని ఎవరన్నా చంపేస్తారా?"

ఆ అమ్మాయి దానిక్కూడా సమాధానం చెప్పలేదు. అతనే అన్నాడు. "పోనీ దాచుకున్న దాని కోసం అనుకుంటే, అలా చంపేక శవాన్ని తీసుకెళ్ళి శ్మశానంలో పాతిపెట్టరు కదా! ఎవరో పెద్ద రౌడీలు అయివుంటారు. పాత కక్ష లేమయినా వున్నాయేమో, అయినా అడుక్కునే దానికి అంత పెద్ద రౌడీల్తో పాత కక్ష లేముంటాయబ్బా? పోనీ మీ నాన్న కేమయినా ఆళ్ళతో సంబంధాలున్నాయేమో, అన్నట్టు మీ నాన్న ఏం చేసేవాడు?"

"తెలీదు. నేను పుట్టకముందే చంపేసేరు?"

"ఆడ్ని కూడా చంపేసారా? ఎవరు ... రౌడీలే".

"కాదు, పోలీసులు".

గుటక పడలేదు. ఇదేదో తవ్వేకొద్దీ తిరకాసయ్యే వ్యవహారంలా కనిపించింది. అమ్మాయి వైపు చూసేడు. పధ్నాలుగు నిండివుంటాయి. భుజాలు అప్పుడప్పుడే గుండ్రంగా తయారవుతున్నాయి.

జాకెట్టు పొట్టిదవటంవల్ల కడుపు కనబడుతూంది.

"మీ అమ్మా, నువ్వూ ఎక్కడుండేవారు?"

"సత్రంలో .... నా పుస్తకాలు కూడా అక్కడే వున్నాయి".

"అందరూ సచ్చినాక పుస్తకాలెందుకే? ఎక్కడుండి చదువుకుంటావు?"

ఆ పిల్ల సమాధానం చెప్పకుండా కళ్ళు తుడుచుకుంది.

"మా ఇంటికి వెళ్దాం పద. ఇంత రాత్రప్పుడు ఆ సత్రానికి వెళ్ళటం కూడా కష్టమే. మా ఇంట్లోనే వుందూగానీ, రేప్పొద్దునెళ్ళి పుస్తకాలూ, బట్టలూ తెచ్చుకోవచ్చులే" అంటూ ఇంటికి తీసుకొచ్చాడు.

ఇంటికొస్తున్నంత సేపూ పెళ్ళానికి ఏం చెప్పాలా అని ఆలోచించాడు. ఇల్లు వందగజాల దూరంలో వుందనగా ఆలోచన వెలిగింది. నిటారుగా నడుస్తూ ఇంటికెళ్ళాడు.

తలుపు తీసిన పెళ్ళాంతో, "...ముగ్గురూ కొడుకులే కూతుళ్ళు లేరు అని ఏడ్చినావు కదా ఇన్నాళ్ళూ. చూడు నీకో కూతుర్ని తెచ్చా" అన్నాడు ఆవిడ మొహం చిట్లించి "ఏవరీ పిల్ల?" అంది.

"ముందు లోపలికి రానీ చెప్తా" అన్నాడు. అందరూ నిద్రపోయాక, "నాకెప్పట్నుంచో వుందే ఈ ఆలోచన. ఇన్నాళ్ళకి కరెక్టు పిల్ల దొరికింది" అంటూ

తన మనసులో ఆలోచన చెప్పాడు. ఆవిడ మొహం విప్పారింది. అయినా అనుమానంగా "ఇందులో ప్రమాదమేమీ లేదు కదా" అంది.

"ఏమీ లేదు. అంతా నేను చూసుకుంటాను కదా" అన్నాడు. ఆ తరువాత కొంచెంసేపటికి, రెండు మూడుసార్లు తట్టి, పెళ్ళాం గాఢంగా నిద్రపోయిందని నిశ్చయించుకున్నాక లేచి ముందు గదిలోకి వచ్చి ఆ అమ్మాయి పక్కనే చేరాడు.

ఆ పిల్ల బుగ్గన నీటి చారికలు ఎండిన పొలంలో పగిలిన భూమి బీటల్లా వున్నాయి. తల్లిని చంపుతూన్న దృశ్యం ఇంకా కళ్ళముందు నించి చెదరలేదేమో – సన్నగా వణుకుతూంది.

పక్కనే పడుకుని మీద చెయ్యేసేడు. ఆ అమ్మాయి వులిక్కిపడి కళ్ళు విప్పింది. "...నీకు భయంగా వుందేమో పక్కన పడుకొమ్మంది" అన్నాడు.

పులి వచ్చినప్పుడు పారిపొమ్మని జింకపిల్లకి 'అనుభవం' నేర్పదు. ప్రకృతి నేర్పుతుంది. అప్రయత్నంగా దూరం జరిగింది.

"అలా వణుకుతున్నావేంటి? దగ్గిరకు రా" లంగాకీ జాకెట్టుకీ మధ్య నున్న నడుముమీద చేత్తో రాస్తూ దగ్గిరకు తీసుకున్నాడు. "...నేను చెప్పినట్టు వింటే నీకు తిండికీ గుడ్డకీ లోటు రాకుండా చూసుకుంట. సరేనా?" అన్నాడు ధర్మరాజు.

"నేను చదువుకుంటా".

"చదుకుందుగాన్లే. ఇట్లా పక్కలోకొచ్చి పడుకున్నానని మీ అమ్మతో చెప్పమాక".

"మా అమ్మ చచ్చిపోయిందిగా!"

"ఛస్. అమ్మంటే మీ అమ్మకాదు, నా పెండ్లాం. నీకు అమ్మాలాంటిది. అర్థమైందా?"

అయిందన్నట్టు తలూపింది. ఆ తరువాత అతను ఆ పిల్లని తనవైపు తిప్పుకుని, మోకాలిమీద చెయ్యివేసి మామూలుగా జరిపినట్టు పైకి జరిపాడు. ఆ అమ్మాయి అప్రయత్నంగా అతని చేతిని తొలగించి ఏడవసాగింది. భయం పోగొట్టటానికి అడిగాడో, అప్పటివరకు అడగలేదని గుర్తొచ్చి అడిగాడో గానీ "ఏమిటి నీ పేరు?" అని అడిగాడు.

"**విశారద**" అంది బెదిరి దూరంగా జరుగుతూ.

*　　　*　　　*

నగరానికి రెండోవైపున నేతాజీ సుభాష్ చంద్రబోస్ వీధిలోంచి వచ్చిన స్త్రీకి ఇరవై రెండేళ్ళు వుంటాయి. పోత పోసిన బొమ్మలా వుంది. చీకటే ఆ అమ్మాయి మీదపడి వెన్నెలగా మెరుస్తూంది.

అర్ధరాత్రి దాటడం మూలాన వీధి నిర్మానుష్యంగా వుంది. ఆ నిశ్శబ్దాన్ని విచ్ఛిన్నం చేస్తూ వెనుక నుంచి ఒక మోటార్ సైకిల్ వచ్చి ఆగింది. "ఏయ్, ఎవర్నువ్వు?"

ఆమె నడక ఆపి, వాహనం మీద వున్న వ్యక్తి వైపు చూసింది. వేసుకున్న చారల బనీన్ విప్పి, ఆ వ్యక్తి కత్తి పట్టుకుంటే కైమా కొట్టేవాడిలా వుంటాడు. ఖద్దరేసి టోపి పెడ్తే మినిష్టర్లా వుంటాడు. మొత్తానికి 'సి' క్లాసు గూండాలా వున్నాడు.

"ఎవర్నువ్వు అంటే మాట్లాడవేం? ఇంత అర్ధరాత్రప్పుడు ఎటెళ్తున్నావ్?"

ఒకప్పుడయితే భయంతో స్పృహ తప్పి పడిపోయేదేమో కానీ ఇప్పుడు అలాంటిదేమీ జరగలేదు. అనుభవం పాఠం నేర్పిందో – చలి నిండా ముంచిందో–

"మా ఆయన ఇంట్లోంచి గెంటేసేడు. ఎక్కడికి వెళ్ళాలా అని ఆలోచిస్తున్నాను" అంది. ఊహించని ఈ సమాధానానికి అంత రౌడీ కూడా తబ్బిబ్బు అయ్యాడు.

"అర్థరాత్రి ఇంట్లోంచి గెంటేసేడా? ఎందుకు?" అని అడిగాడు.

"ఎందుకు?" ఆమె తనని తానే ప్రశ్నించుకుంది. ప్రశ్న చాలా చిన్నది. సమాధానం మాత్రం చరిత్ర అంత పెద్దది!

"ఎక్కడ మీ ఇల్లు?" అతనే తిరిగి ప్రశ్నించాడు. ఆమె చెప్పింది.

"అది నా ఏరియాయే. నాతో మా ఇంటికి రా. రేప్రొద్దున్న మీ ఇంట్లో దింపేస్తాను".

"ఆయన నన్ను చంపేస్తాడు. మా అత్తా ఆడపడుచులు వూరుకోరు"?

"నేను స్వయంగా తీసుకొచ్చి దింపాక కూడా వూరుకోరా? మీ ఏరియాలో నా పేరెప్పుడూ వినలేదా?... మాట్కా మస్తాన్. అయినా ఈ అర్థరాత్రి ఎక్కడికి వెళతావ్?"

అది కూడా చిన్న ప్రశ్నే! కానీ సమాధానం మాత్రం స్త్రీ నిస్సహాయత అంత పెద్దది!

"నీ సమస్యకి నేనో పరిష్కారం చెపుతాను నిర్ణయించుకో" తాపీగా సిగరెట్ వెలిగించుకుంటూ అన్నాడు. ఆమె ఆశగా చూసింది. ఒక కుక్క తోకూపుకుంటూ వాళ్ళ దగ్గరకొచ్చి చూసి, తనకి సంబంధించిన విషయం కానట్టు వెళ్ళిపోయింది.

మస్తాన్ చెప్పాడు. "...ఈ రాత్రంతా నువ్వు నాతో వుంటావ్ అంటే నా మనిషవై పోతావన్నమాట. ఒకసారి నా మనిషివై పోయాక ఇక మీ ఆయన నిన్నేమీ చేయడు. పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. నేను నెల రోజులకో, రెండు నెలలకో ఓసారి మీ ఇంటికే వచ్చి నువ్వు ఎలా వున్నావో చూసుకుంటూ ఉంటాను. ఆ రాత్రికి మీ ఇంట్లోనే వుంటానన్నమాట. మీ ఆయన ఏం చేస్తాడు? చుట్టుపక్కలోళ్ళకి చెపుతాడా? చెప్పడు. గౌరవం బజారు కీడ్చుకోడు! కుక్కిన పేన్లా పడుంటాడు. ఎప్పుడయినా నిన్ను పల్లెత్తుమాట అన్నాడనుకో. నేనొచ్చినపుడు చెపుతావన్నమాట ! ఏ చిటికెనవేలో విరిచేస్తాను. నీకు చిన్న ప్రమాదం జరిగినా ఆడి ప్రాణం పోయినట్టే. ఆడి తల్లీ, నీ ఆడపడుచూ చచ్చినట్టే. అలా భయం పెట్టేస్తాను. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. దానికి బదులుగా నువ్వు నన్ను నీ స్నేహితుడిలా వుంచుకుంటావన్న మాట. పెద్ద ఇబ్బంది పెట్టన్లే. నెలకోసారి మూడోకంటికి తెలియకుండా గెస్టులా వస్తాను. నీకూ నాకూ మీ ఆయనకీ తప్ప మూడోకంటికి తెలీదు. నీ సంసారం బాగుపర్చే పూచీ నాది. నేను చెప్పిన ప్రపోజల్ బావుందా?"

...చలంగానీ, మార్క్స గానీ, మనువుగానీ, చెప్పని ఈ కొత్త థియరీ అర్థంకాకో, అర్థం అయినా జీర్ణంకాకో ఆమె అయోమయంగా చూస్తుండిపోయింది.

"ఏమిటి అలా చూస్తావ్? నే చెప్పింది అర్థంకాలేదా? ఇంతకీ నీ పేరేమిటి?"

"లక్ష్మీ శారద".

"చూడూ... నేన్నిన్ను అనుభవించటం అన్నది ఈ రాత్రి ఎలాగూ జరుగుద్ది. నువ్వొప్పుకుంటే నీ సంసారం బాగుపడుద్ది. వప్పుకోకపోతే రేప్ జరుగుద్ది. ఇక్కడే, ఈ రోడ్డు పక్కనే... నీకేది కావాలో ఆలోచించుకో".

ఆడది అర్ధరాత్రి నిర్భయంగా తిరిగేరోజు ఎప్పుడొస్తుందో తెలీదు గానీ, భయం భయంగా బయటకొచ్చిన ఇద్దరాడవాళ్ళు మాత్రం ఆ రకంగా ఇరుక్కుపోయే పరిస్థితి ఏర్పడింది.

ఒకరు పోలీసు చేతిలో.

మరొకరు గుండా చేతిలో.

## 2

**మట్కా మస్తాన్** ఆమెవైపే చూస్తున్నాడు.

లక్ష్మీ శారద తల వంచుకుని నిలబడింది. ఆమె మాత్రం ఏం సమాధానం చెపుతుంది?

"నువ్వొప్పుకుంటే నీ సంసారం బాగుపడుద్ది. వప్పుకోకపోతే రేప్ జరుగుద్ది. రెండింటిలో ఏది కావాలో ఆలోచించుకో..." అని మట్కా మస్తాన్ ఆమెకి రెండు ఛాయిస్ లిచ్చాడు.

ఎన్నికల్లో నిలబడేవారు ఓటరు దగ్గరకొచ్చి –

"నేను వెధవని, లంచగొండిని. కానీ అవతలివాడు హంతకుడు, గూండా. నువ్వెవరికిస్తావు వోటు?" అని అడిగితే కలిగే అయోమయమే ఆమెకీ కలిగింది.

ఆమె ఇంట్లోంచి ఎన్నడూ బయటకొచ్చింది కాదు. బయట ప్రపంచం ఇలా వుంటుందని కూడా ఆమెకు తెలీదు.

ఇంట్లో మొగుడు హింసిస్తాడని మాత్రమే తెలుసు. బయటికొస్తే రౌడీలు హింసిస్తారని తెలీదు.

తెల్లవారే వరకూ ఇలా బయటే ఉంటే మొగకుక్క కూడా బేరం పెడుతుందని తెలీదు.

అయినా....

ఇంటికెళ్ళాలా? వద్దా? అన్న నిర్ణయం కాదు ఆమె చెయ్యాల్సింది. ఎదురుగా వున్న రౌడీని ఇంటికి తీసుకెళ్ళి పర్మనెంటు చేసుకోవాలా? చెత్తకుండీ పక్కన టెంపరరీ చేసుకోవాలా? అన్నది నిర్ణయించాలి.

ఆమె ఏ నిర్ణయమూ తీసుకోకపోవటం చూసి "ఏమిటిది? ఇంతసేపు ఆలోచిస్తున్నావ్? తొందరగా తెముల్చు. అయినా, నేనే మీ ఇంటికొచ్చి మొత్తం వ్యవహారమంతా సెటిల్ చేసి నీ సంసారం చక్కదిద్దుతానంటే దానికి ఇంత ఆలోచిస్తున్నావేటి?" అన్నాడు.

ఆ సమయంలో అక్కడికి ఓ కుర్రాడు సైకిల్ మీద వచ్చాడు. సెకెండ్ షో సినిమాలో సోడాలమ్మి ఇంటికెళ్తున్నాడు అతను.

లైటు వెలుతుర్లో ఆ అమ్మాయిని గుర్తుపట్టి "శారదగారూ, మీరా" అన్నాడు ఆశ్చర్యంగా.

ఆమె తలెత్తి అతన్ని చూసింది. ఆమె తనని గుర్తుపట్టలేదని అతడు ముందే ఊహించినట్టున్నాడు. ఆమె పెళ్ళయిన రోజు నుంచి ఇప్పటి వరకూ వీధి గుమ్మంలో కనిపించలేదు.

"నేను మీ ఇంటి ఎదురింటిలో వుంటానండీ. నా పేరు బోసుబాబు" అన్నాడు.

"అయితే ఏమిట్రా? నువ్విక్కణ్ణుంచి వెళ్ళు" అన్నాడు మస్తాను కల్పించుకుని. బోసు అతడి మాటలు పట్టించుకోకుండా "ఈ సమయంలో మీరిక్కడ వున్నారేమిటి?" అన్నాడు. శారద తలెత్తి అతనివైపు చూసింది. బోసుకి పాతికేళ్ళుంటాయి. కానీ అంత వయసున్నట్టు కనపడడు. చంద్రకిరణం వెలుగులో అమాయకంగా అందంగా వున్నాడు. ప్రపంచంలోని కల్మషం ఇంకా అతని కళ్ళల్లోకి చేరలేదు.

లక్ష్మి శారద ఏదో చెప్పాలని అనుకుంది. పెదవులు కదిలాయి. మాట రాలేదు. తన వీధిలో అబ్బాయి ఈ విధంగా కనపడటం మాత్రం ఆమెక్కాస్త హాయిగా అనిపించింది. ఈ మొత్తం వ్యవహారంలో చిరాగ్గా వున్నది మట్కా మస్తాన్ వొక్కడే. పార్టీతో బేరం సెటిల్ చేసుకోబోయే కానిస్టేబుల్‌కి, వ్యవహారం మధ్యలో అనుకోకుండా యస్సై స్టేషన్ కొచ్చేస్తే ఎంత వళ్ళు మండుద్దో – అంత చిరాగ్గా వుంది అతనికి, "పోరా... నీ కిక్కడేం పని – పో" అని కసిరాడు.

బోసుకి ఏమీ అర్థంకాలేదు. ఒకసారి ఆమెవైపూ, మస్తానువైపు చూసి సైకిల్‌తో సహా ముందుకు కదలబోయాడు. అప్పుడు శారద కదిలి "ఏవండీ, నేనూ మీతో వచ్చేస్తాను " అంది.

మస్తాన్‌కి మరింత వళ్ళు మండింది. "పార్టీని మార్చేసి పోటానికి ఇదేవన్నా రాజకీయమనుకున్నావా?.. వ్యభిచారం... ఆగూ" అన్నాడు రెక్కపట్టుకుని. అదే సమయానికి సైకిల్ మీద ఓ కానిస్టేబుల్ వచ్చాడు. సన్నగా పొడుగ్గా వున్నాడు. అతన్ని చూసి జెండాకర్ర సిగ్గుపడుద్ది. కొక్కేనికి ఖాకీ బట్టలు తగిలించినట్టున్నాడు. అర్థరాత్రి ఇద్దరు మొగాళ్ళూ మధ్యలో ఒక ఆడదాన్ని చూసి చచ్చిన దున్నపోతును చూసి రివ్వునవాలే డేగలా సైకిల్ మీద వేగంగా దగ్గిరకొచ్చాడు. మస్తానుని చూసి బతికున్న తేలుని బూటులో చూసినట్టు బెదిరి సెల్యూట్ చేశాడు.

మస్తాన్ ఆ సెల్యూట్‌ని పట్టించుకోకుండా ఆవిడ చెయ్యి పట్టుకుని 'పద' అన్నాడు. లక్ష్మీ శారద అప్రయత్నంగా విదిలించుకుంది. ఈ లోపులో బోసు ఆ పోలీసు దగ్గిరకెళ్ళి "చూడండి, ఈమె మా వీధిలోనే వుంటారు. ఈ రౌడీ ఆమెని అల్లరి పెడుతున్నాడు" అన్నాడు.

అప్పుడు పడింది వెనుకనుంచి దెబ్బ – బోసు ముందుకీ, సైకిలు వెనక్కీ పడ్డారు. మోచేతులు కొట్టుకుపోయాయి. అతడేదో అనే లోపులో మస్తాను మళ్ళీ అతన్ని కాలరు పట్టుకుని పైకెత్తి గెడ్డం క్రింద మళ్ళీ కొట్టాడు. బోసు పళ్ళు కదిలాయి. ఆ దెబ్బకి లక్ష్మీశారదకే కళ్ళనీళ్ళు తిరిగాయి.

"వొదిలెయ్ అన్నా పాపం!" అన్నాడు పోలీసు మస్తాన్‌తో. అంతకన్నా ఎక్కువ మాట్లాడటం డేంజరస్ అని తెలుసు.

గొడవలు జరక్కుండా చూడటమే కదా పోలీసుల పని. అందుకే వదిలేయన్నా అన్నాడు.

బోసుని పైకి లేపి "ఎక్కడ పనిచేస్తావ్‌రా నువ్వు?" అన్నాడు. బోసు జవాబు చెప్పలేదు. నోట్లోంచి కారుతూన్న రక్తాన్ని మోచేత్తో తుడుచుకున్నాడు.

"ఏమిటి నీ పేరు?"

"బోసు".

"ఓహో, సుభాస్ చంద్రబోసా?"

"కాదు, జగదీష్ చంద్రబోసు".

"సరే పో. ఇంకెప్పుడూ ఇట్లాటి విషయాల్లో జోక్యం కలిగించుకోమాకు. మేం మేం చూసుకుంటాంలే..." అన్నాడు పోలీసు.

అప్పుడు ఆ చీకట్లో – బోసు ఎగిరి మస్తానుని తన్నాడు. అక్కడున్న మిగతా ముగ్గురూ వూహించలేదు అలా జరుగుతుందని. అంత వేగంగా జరిగిందా సంఘటన. కాపలా కాయాల్సిన పోలీసే రౌడీని రేప్ చేయమని ప్రోత్సహించటం వల్ల వచ్చిన ఆవేశమో, ఇంకేమీ చేయకపోతే లాభం లేదన్న తెగింపో అతనిని ఆ పనికి పురికొల్పాయి. ఆనకట్టల్ని తెగ్గోసే గోదారి కూడా పాయగానే ప్రారంభమవుతుంది. మొత్తం జీవితాన్ని మార్చేసే మలుపు కూడా చిన్న సంఘటనతోనే జరుగుద్ది.

మస్తాను వూహించలేదు. అరడుగుల ఎత్తూ, పదహారు సంవత్సరాల అనుభవమూ వున్న తనని ఆ కుర్రాడు అలా కొడతాడని అనుకోకపోవటంతో బిత్తరపోయాడు. ఆ కొట్టటం కూడా ఏదో చిన్న కుర్రాడు ఆవేశంతో కొట్టినట్టు కాకుండా, ప్రొఫెషనల్‌గా కొట్టినట్టు గమనించాడు. ఆ కుర్రాడికి బాక్సింగో, కుస్తీయో వచ్చినట్టు గ్రహించుకున్నాడు. బిత్తరపోవడానికి రెండు సెకన్లూ,

గ్రహించుకోవటానికి ఒక సెకనూ పట్టాయి. అయితే బోసు ఆ మూడు సెకన్లూ వూరుకోలేదు. టైమిస్తే అవతలివాడు రేజైపోతాడని తెలుసు. అందుకే మళ్ళీ ఇంకొకసారి కొట్టాడు. ఈ కొట్టటం కూడా అరికాలి మడమతో మస్తాను మోకాలి చిప్పమీద కొట్టాడు.

అందులో కూడా ప్రొఫెషనలిజం వుందని మస్తాను గ్రహించే లోపులోనే బాధ నెత్తివరకూ పాకింది.

మోకాలు చిప్ప పక్కకి తొలగడంతో రోడ్డు మధ్యలో నిలువుగా విరిగిన చెట్టులా పడ్డాడు.

తన ముందే ఒక రౌడీ అలా తన్నులు తినడం చూస్తూ వూరుకోలేక పోలీసు బోసుని అడ్డుకోబోయాడు. ఒక రౌడీని ఒక మామూలు మనిషి కొట్టటం పోలీసు వ్యవస్థకే అవమానం అన్నట్టు ఎదుర్కొబోయాడు. బోసు అతన్ని గట్టిగా పట్టుకుని పైకి లేపాడు. శరీరాన్ని గాలిలో ఎత్తి మస్తాను విరిగిన కాలుమీద పడేశాడు. మస్తాను గట్టిగా కేకపెట్టాడు.

బోసు చప్పున క్రిందపడిన సైకిల్ తీసి నిలబెట్టి, "...రండి" అన్నాడు కంగారుగా.

లక్ష్మీ శారద అయోమయంగా అతనివైపు చూసింది.

"తొందరగా ఎక్కండి" అంటూ ఆమె చెయ్యి పట్టుకుని దాదాపుగా బలవంతంగా లాగి ముందు కూర్చోబెట్టుకుని వేగంగా తొక్కసాగాడు.

చల్లటి గాలి నెమ్మదిగా వీస్తోంది. రెండు మూడు మలుపులు తిరిగి, వాళ్ళు దూరమయ్యారని నమ్మకం కుదిరాక సైకిల్ వేగం తగ్గించాడు. ఆమె ఇంకా ఆ షాక్ నుంచే తేరుకోలేదు.

"ఇంత రాత్రిపూట ఇలా ఎందుకు రావల్సి వచ్చింది" అడిగాడు. ఆమె వెంటనే మాట్లాడలేకపోయింది. కొంచెం ఆగి, "పుట్టింటికెళ్ళి కట్నం తీసుకురాకపోతే తిరిగి రానవసరం లేదని గెంటేసేరు" అంది నెమ్మదిగా.

"అర్థరాత్రా?" ఆశ్చర్యంగా అడిగాడు.

ఆమె ఆ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా "నేనూ విసిగిపోయాను. దీనికన్నా చావే మంచిదని బయటపడ్డాను" అంది. "...కానీ బయటకొచ్చిన తరువాత భయమేసింది. చావటానికి కూడా ధైర్యం కావాలని తెలిసింది".

"పెళ్ళయి మీరు అత్తవారింటికి వచ్చినప్పుడు చూశాను. తలవంచుకుని కారు దిగారు. అదే ఆఖరిసారి... మేముండేది మీ ఎదురింట్లోనే. మీరు అసలు వీధిలోకి కూడా తొంగి చూడరనుకుంటాను".

ఆమె జవాబు చెప్పలేదు.

అతడికి స్త్రీ కొత్త. అనుభవం లేదు. అందుకని అతడికే ఫీలింగూ లేదు. కానీ ఆమె వివాహిత. అతడికి దగ్గిరగా కూర్చుని వుంది. అతడి ఛాతి ఆమె భుజానికి తగుల్తోంది. ముంగురులు అతని గెడ్డానికి తగులుతూ వున్న స్పర్శ తెలుస్తోంది. భర్తతో కలిసి ఆమె ఎప్పుడూ బయటకి రాలేదు. ఇంత దగ్గరగా ఇలా ప్రయాణించటం అదోలా వుంది. ఇబ్బందికరమైన అనుభూతి.

"నా పేరు మీకెలా తెలుసు?" ఏదో మాట్లాడాలి అన్నట్టు అడిగింది.

"ఎదురింటి వాళ్ళు పెళ్ళి కార్డు ఇచ్చారు".

ఆమె సిగ్గుపడింది. ఇంత చిన్న విషయం తట్టనందుకు ఇంత కాలం ఆ పేరు తనకెలా గుర్తుందో వివరణ ఇస్తున్నట్టు అతను అన్నాడు. "మిమ్మల్ని నేను ఒకే ఒకసారి చూశానని చెప్పానుగా. పెళ్ళయి అత్తవారింటికి వచ్చారు. అందరం కిటికీల్లోంచి, తలుపుల దగ్గిర నిల్చొని చూశాం. ఎదురింట్లో కొత్త పెళ్ళి కూతురొస్తుందంటే, ఎలా వుంటుందో చూద్దామని అందరికీ కుతూహలమే కదా. అద్దె కారులోంచి మీరు దిగారు. నాకు బాగా గుర్తు. మీరు భుజాల నిండుగా పైట కప్పుకుని, తలదించుకుని భర్త వెనుకే అడుగులు వేస్తూ మెట్లెక్కి మీ పై పోర్షన్‌లోకి వెళ్ళిపోయారు. మా అమ్మ అంది– "ఆ అమ్మాయి పేరు లక్ష్మీ శారదట. పేరుకి తగ్గట్టే ఒద్దిగ్గా వుందిరా చిన్నా!" అని. ఆ మాటలూ, ఆ దృశ్యమూ బాగా గుర్తుండిపోయాయి. అందుకే చూడగానే మిమ్మల్ని గుర్తుపట్టగలిగాను. అప్పుడప్పుడు మా యింట్లో అందరం అనుకుంటూ వుంటాం. ఇరవై నాలుగు గంటలూ మీరు ఇంట్లోనే వుండి ఏం చేస్తూ వుంటారా? అని".

"ఏడుస్తూ వుంటాను" మనసులో అనుకుందామె.

ఇద్దరూ తమ వీధి దగ్గరకి చేరుకున్నారు. చిన్నసందు అది. మూడువైపులా ఇళ్ళు వున్నాయి.

అతడు సైకిల్ స్టాండ్ వేసి 'రండి' అన్నాడు. ఆమెకు భయం వేసింది. వణుకుతున్న కాళ్ళతో అతడిని అనుసరిస్తూ మెట్లెక్కింది. అతడు తలుపుకొట్టాడు. అయిదు నిముషాల తరువాత ఆమె భర్త వచ్చి తలుపు తీశాడు.

అర్ధరాత్రి ఒంటిగంటకి ఎదురింటి కుర్రాడినీ, ఆ వెనుకే తన పెళ్ళాన్నీ చూసి తన బెడ్‌రూమ్‌లో తన పక్కమీద అపోజిషన్ లీడర్‌తో తన పెళ్ళాన్ని చూసిన మంత్రిలా ముందు ఆశ్చర్యపోయి – తరువాత కోపంతో వణికిపోయాడు. ఒక బూతుమాట – ఇక్కడ వ్రాయకూడనిదీ – కేవలం వ్యభిచారులూ, తాగుబోతులూ, పోలీసులూ వాడేదీ – ఉపయోగించి "ఎందుకొచ్చావే మళ్ళీ" అని అడిగాడు.

బోసు కల్పించుకుని "రోడ్డుమీద రౌడీలు వెంటబడితే తీసుకొచ్చానండీ" అన్నాడు వినయంగా.

'చెయ్యి ఖాళీలేదు' అన్నంత విసురుగా "పొండి పొండి" అంటూ తలుపు ధడేలున వేసేశాడు భర్త.

ఆ తలుపులు పడిన శబ్దం కన్నా, ఆ తరువాతి నిశ్శబ్దం ఆమెని భయపెట్టింది. ఆ నిశ్శబ్దం వేయి ప్రశ్నలుగా తయారై ఆమెని నిలబెట్టింది.

ఆ 'పొండి –పొండి' లో – 'అర్ధరాత్రి ఇంటినీ, సంసారాన్నీ వదిలేసి వెళ్ళిన ఆడది రెండు గంటల తరువాత తిరిగొస్తే ఏలుకోవటానికి నేనేమన్నా శ్రీ రామచంద్రుడినా' అన్న చీదరింపు వుంది. ఆ మాటకొస్తే శ్రీ రామచంద్రుడే ఏలుకోలేదు.

బోసు నెమ్మదిగా వెనుదిరిగి 'పదండి' అన్నాడు అక్కడ చేసేదేమీ లేనట్టు. ఆమె కూడా పరిస్థితి అర్థం చేసుకుంది. గొడవ పెట్టుకునే తెగువగానీ, ధైర్యం కానీ లేవు. అతడి వెనుకే మెట్లు దిగసాగింది.

...కొంత కాలం క్రితం కొత్త పెళ్ళికూతురిలా తలవంచుకుని పైట నిండుగా కప్పుకుని ఆమె భర్త వెనుకే నడుస్తూ ఆ మెట్లు ఎక్కింది. ఇప్పుడు దిగుతోంది.

## 3

**"నీ పేరు?"**

"విశారద"

"వయసు?"

"పధ్నాలుగు".

"నీ తండ్రి ఏం చేస్తుంటాడు?" మేజిస్రేటు అడిగాడు.

"లేడు, చంపేశారు".

"ఎవరు?"

"పోలీసులు".

"ఓహో! దొంగన్న మాట".

పోలీసులు చంపేసిన వాళ్ళందరూ దొంగలెలా అవుతారో ఆ చిన్నబుర్రకి అర్థంకాలేదు. మేజిస్రేట్ బోనులో అమ్మాయివైపు విసుగ్గా చూశాడు. ఆ అమ్మాయి పొందికగా, పెరట్లో తులసి మొక్కలా వుంది.

"ఎంతకాలం నుంచి నువ్విలా దొంగతనాలు చేస్తున్నావు?" శిక్షేసెయ్యాలన్న తొందరలో వున్నాడు మేజిస్ట్రేట్. ఆ అమ్మాయి వెంటనే జవాబు చెప్పలేదు. తల్లిని చంపేసి రౌడీలు శవాన్ని శ్మశానంలో పాతి పెట్టిన రాత్రి

ఏడుస్తుంటే పోలీసొచ్చి ఇంటికి తీసికెళ్ళటం, మరుసటి రోజు నుంచి పనిలో పెట్టటం గుర్తొచ్చింది. పనంటే పెద్ద పనేం కాదు. రిస్కు పని.

రాత్రి చాలా సేపు చదువుకోవటం, ప్రొద్దున్నే లేచి ఇంటెడు చాకిరీ చేయటం, తరువాత పోలీసు తండ్రి (?) తో కలిసి బయట కెళ్ళటం... అక్కడ 'అసలు పని' మొదలయ్యేది. పోలీసు దూరంగా నిలబడేవాడు. ఆమె జనంలోకి వెళ్ళి ఏ పర్సో కొట్టేసి, తీసుకొచ్చి యిచ్చేది.

నాలుగైదు పర్సులు కొట్టేసాక తండ్రి స్టేషన్‌కి వెళ్ళిపోయేవాడు. ఆ అమ్మాయి యింటికొచ్చి చదువులో కూర్చునేది.

ఈ విధంగా చాలా కాలంగా జరుగుతూ వచ్చింది. మొదట్లో దొంగతనం చెయ్యనన్నందుకు పోలీసు ఆమెను చచ్చేట్టు కొట్టి వొప్పించాడు. వప్పుకునేవరకూ ఆ పోలీసోడి భార్య తిండి పెట్టకుండా మాడ్చింది. చివరికా అమ్మాయి వొప్పుకుంది. జేబులు కొట్టెయ్యడం ఎలాగో పోలీసే ట్రెయినింగ్ యిచ్చాడు. తరువాత రేసులో గుర్రాన్ని వదిలినట్టు మార్కెట్‌లో వదిలాడు.

మొదటి నెల సంపాదన మూడు వేలొచ్చింది. అప్పటికి ఆ పెళ్ళానికి తన మొగుడి తెలివితేటల మీద నమ్మకం కుదిరింది. రెండు పూటలా భోజనం పెడితే ఇంటెడు చాకిరీ చేసి మూడువేలు సంపాదించే పిల్ల దొరకటం సామాన్యం కాదు.

...ఒక్కోసారి జేబులు కొట్టేస్తూండగా దొరికిపోయేది. ఆడపిల్ల కాబట్టి జనం కొట్టేవారు కాదు. ఆ టైముకి పోలీసు రంగంలో ప్రవేశించి హడావుడి చేసేవాడు. స్టేషన్‌లో అప్పజెపుతానని తీసుకుపోయేవాడు. మరో చోటుకి స్థలం మార్చేవాడు.

ఇలా జరుగుతూ వుండేది.

ఆ అమ్మాయిని స్కూలు మానిపించేసేరు. కానీ ఆ అమ్మాయి చదువు మానలేదు. ఒక్కతే కూర్చుని చదువుకునేది. రాత్రిళ్ళు తల్లి గుర్తుకొచ్చేది. ఆప్యాయంగా తలమీద చెయ్యేసి "ఒసేయ్ విశారదా, నువ్వు బి.ఎ. చదవాలి" అనటం గుర్తొచ్చేది. మోకాళ్ళమీద తలపెట్టుకుని నిశ్శబ్దంగా ఏడ్చేది. తన చదువుకోసం తల్లి ముష్టెత్తటం మళ్ళీ గుర్తొచ్చి కళ్ళు తుడుచుకొని చదువు కొనసాగింది. ప్రైవేటుగానైనా చదవాలని ఆ అమ్మాయి ఉద్దేశ్యం.

కానీ రోజులు ఎప్పుడూ ఒకలా వుండవు. ఒకరోజు బస్‌స్టాండులో నిలబడి పర్సు కొట్టేస్తూ వుండగా పట్టుబడిపోయింది. యధాప్రకారం పోలీసు వెళ్ళబోయి ఆగిపోయాడు. ఆ స్టాపులోనే యస్సై పెళ్ళాంతో సహా వున్నాడు. విశారద కొట్టేయబోయింది యస్సై పర్సే!

కుడదామనుకున్న తేలు దొంగ చేతికున్న గ్లవుసు చూసి ఆగిపోయినట్టు ఆగిపోయాడు. ఫలితమే ఈ కేసు.

పేరు – విశారద; వయసు – పధ్నాలుగు; తండ్రి – లేదు; వృత్తి – దొంగతనం. "ఎక్కడుంటావు నువ్వు?" మేజిస్ట్రేటు అడిగాడు.

కోర్టు హాల్లోనే ఒక మూల నిలబడి వున్న పోలీసు ధర్మరాజుని చూపించి "ఆయనింట్లోనండి" అంది. మేజిస్ట్రేటు గారికి చిరాకుతోపాటు కోపం కూడా వచ్చింది. దేశం ఎటు పోతోందో అర్థంకాలేదు.

"పోలీసు ఇంట్లో వుంటూ దొంగతనాలు చేస్తావా?" అన్నాడు. "ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వుంటూ వ్యభిచారం చేస్తావా?" అన్నట్టు.

"ఆయనే నాతో ఈ పని చేయిస్తాడండీ" అంది విశారద అమాయకంగా. కోర్టు ఒక్కసారి నిశ్శబ్దమైంది.

అప్పుడా పోలీసు, రాత్రి గడిపిన వేశ్యకి ఎయిడ్స్ వుందని మరుసటి రోజు పేపరులో చదివిన విటుడిలా వణికేడు.

బోనెక్కి సవినయంగా మనవి చేసుకున్నాడు. "అయ్యా ఉరుము ఉరిమి మంగలం మీద పడటం అంటే ఇదేలా వుందండి. ఏదో తల్లిలేని పిల్లకదా అని చేరదీస్తే ఈ.... లం... ముం... ఇంత పని చేస్తుందనుకోలేదు".

"అన్ పార్లమెంటరీ లాంగ్వేజి. అలాంటి భాష ఇక్కడ ఉపయోగించకూడదు" ఇంగ్లీషులో కోప్పడ్డారు మేజిస్ట్రేటుగారు. కానిస్టేబుల్‌కి పార్లమెంట్ అన్నమాట ఒకటే అర్థమైంది.

"అవునండయ్యా, ఆ లాంగ్వేజి పార్లమెంటులోనే ఉపయోగించాలి. ఇక్కడ ఉపయోగించకూడదని నాకు తెలీదు" అన్నాడు వినమ్రతగా.

మేజిస్ట్రేటు మరింత చిరాకుతో "అక్కడ కూడా ఉపయోగించకూడదు" అన్నాడు కరుగ్గా.

"క్షమించండి. పోలీసు స్టేషన్ అనుకున్నాను. ఏం చెప్తున్నానండీ? అదే. తల్లి లేని పిల్ల కదా అని చేరదీసి పోషిస్తే, బయట దొంగతనాలు చేస్తూ పట్టుబడి, పైగా దాన్ని నా మీదకే తోసేసింది."

"సరే ఇక నువ్వెళ్ళొచ్చు –" అన్నారు కోర్టువారు. కానిస్టేబుల్ బోను దిగుతూ విశారదవైపు చూశాడు. ఆ పిల్ల తనవైపు చూసిన చూపుకి ఉలిక్కిపడ్డాడు.

ఆ అమ్మాయి కళ్ళలో కోపంగానీ, ద్వేషంగానీ కనపడలేదు. అవయితే తల తిప్పుకుని మామూలుగా వెళ్ళిపోయేవాడు.

ఆమె కళ్ళలో అతనిపట్ల జాలి కనపడింది.

అందుకని ఉలిక్కిపడ్డాడు.

అతను బోను దిగిపోయిన తరువాత మళ్ళీ ఆ అమ్మాయిని ప్రశ్నలు అడగటం ప్రారంభించారు కోర్టువారు.

"నీ పెంపుడు తండ్రి చెప్పిందంతా నిజమేనా? నీ అసలు తండ్రిని ఎన్‌కౌంటర్‌లో పోలీసులు చంపేశారా?"

"చంపేరండీ కానీ..." అంటూ ఇంకా ఏదో చెప్పబోతూంటే చెప్పనివ్వకుండా అడ్డుకుని "కోర్టులో అడిగిన ప్రశ్నకి మాత్రమే సమాధానం చెప్పాలి" అన్నారు కోర్టువారు. మాక్కావలసిన సమాధానాలు రాబట్టుకునే ప్రశ్నలు మాత్రమే అడిగే హక్కు మాకుందని అన్యాపదేశంగా చెప్తూ కొనసాగించారు.

"మీ నాన్న గజదొంగ అని తెలుసా?"

"ఆయన దొంగ కాదండి – రైతు"

"అని ఎవరు చెప్పారు?"

"రైతుల్ని పోలీసులు ఎందుకు చంపుతారు?"

ఆ అమ్మాయి జవాబు చెప్పలేదు. రైతుల్ని పోలీసులు ఎందుకు చంపుతారో లేక అంతకు ముందన్నట్టు పోలీసులు చంపిన వాళ్ళందరూ దొంగలెలా అవుతారో ఆ అమ్మాయికి తెలీదు. ఇంకా అంతదూరం చదువుకోలేదు – సమాజాన్ని గానీ – ఎకనామిక్సు గానీ...."

"ఏ అమ్మాయినా కూతురికి 'నీ తండ్రి దొంగ' అని చెప్పదు కదా. ఏదో కథ అల్లి చెపుతుంది. దాన్ని నమ్మెయ్యకూడదు" అన్నారు కోర్టువారు.

"మరి పోలీసులు చంపేసేరని నిజమే చెప్పింది కదండీ –"

"అదుగో – అదే... కోర్టులో నీ అభిప్రాయాలు చెప్పకూడదు. ప్రశ్నకి సమాధానం మాత్రమే చెప్పాలి".

ఆ అమ్మాయికే కడుపులో ఎవరో బల్లెంతో పొడుస్తున్నట్టు నొప్పి ప్రారంభమయింది.

"మీ అమ్మని రౌడీలు చంపేసిన మాట నిజమేనా?"

మా అమ్మాయి తలూపింది.

"అలా తలూపటం కాదు. నోటితో సమాధానం చెప్పాలి" అన్నాడు ప్రాసిక్యూటరు.

మేజస్ట్రేటుకి చిర్రెత్తింది. ఇలాటి చిల్లర దొంగతనాల కేసులూ, వ్యభిచారం జడ్జిమెంట్లూ అంటే ఆయనకి చిరాకు. వీటిల్లో నయాపైసా లాభం వుండదు. ఏదైనా పెద్ద కంపెనీ ఫ్రాడ్ కేసు అయితే వేలు కళ్ళ చూడొచ్చు. ఆ చిరాకుతో "ఏవయ్యా–కేసు తేలుస్తావా? లేకపోతే ఆ పిల్లకి కోర్టులో ఎలా సమాధానాలు చెప్పాలో పాఠాలు నేర్పుతావా?" అని కోప్పడ్డాడు.

ప్రాసిక్యూటరు దాన్నో జోకుగా తీసుకుని "దీన్ని చూస్తోంటే ఆర్నెల్లకోసారి కోర్టుకి వచ్చేరకం లాగానే కనపడుతూంది కదండీ, అందుకని నేర్పినా ఫర్వాలేదండీ" అన్నాడు.

జనం అంతా నవ్వారు.

"ఐ అబ్జెక్టం"టూ లేచాడు డిఫెన్సు న్యాయవాది. "ఒక స్త్రీని 'అది' అని సంబోధించటం స్త్రీ జాతికే అవమానం. నా క్లయింటు ఒక స్త్రీ. ఆమెని సరి అయిన విధానంలో పేర్కొనవలసిందిగా ప్రాసిక్యూషన్‌ను ఆదేశించమని కోర్టువారిని కోరుకుంటున్నాను" ఆవేశంగా అన్నాడు డిఫెన్సు లాయరు.

ముద్దాయి ఫీజు చెల్లించే స్థితిలో లేనందువలన కోర్టువారు ఈ లాయర్ని అప్పాయింట్‌మెంట్ చేశారు. అతనే ఉరిశిక్ష పడిన ఖైదీలా ఉన్నాడు. కేసుల్లేక జాలిచూపులు చూస్తున్నాడు. ముద్దాయి గురించి వాదించటం మానేసి స్త్రీని "అదీ–ఇదీ" అని సంబోధించవచ్చా లేదా అని అరగంటసేపు వాదోపవాదాలు జరిగాక కోర్టువారు జడ్జిమెంటు చదివి వినిపించారు.

"....భారతదేశంలో స్త్రీని ఆది నుంచీ అపారమయిన విలువ ఇవ్వబడుతూ వచ్చింది. అటువంటి దేశంలో పుట్టిన ఈ అమ్మాయి చిన్న వయసులోనే ఇలా దొంగతనాలు చేయటం చాలా అవమానకరమయిన విషయం! ఇటువంటి కేసుల్లో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. మొదట్లోనే కఠోర నిర్ణయాలు తీసుకోక పోతే ఈ అమ్మాయి పెద్దయ్యాక తండ్రి గుణాలు పుణికి పుచ్చుకుని పెద్ద గజదొంగగా మారవచ్చు లేదా తల్లిలా వేశ్య అవ్వచ్చు. దీన్ని అరికట్టవలసిన బాధ్యత ఈ న్యాయస్థానం మీదే వుంది. కేసు పూర్వాపరాలు అన్నీ గమనించి ముద్దాయికి రెండేళ్ళు కారాగార శిక్ష విధిస్తున్నాను" అంటూ తీర్పు చెప్పటం ముగించారు.

ఒక్కసారిగా విశారద ఏడుస్తూ బోనులో కూలిపోయింది. ఆ పధ్నాలుగేళ్ళ అమ్మాయి ఏడ్చింది – తనకు పడిన శిక్ష గురించి కాదు. తెల్లదనం బాల్యం మీద విస్తరిస్తున్న తన ప్రప్రథమపు ఎరుపు చూసి అర్థంకాని భయంతో...!

ఆ అమ్మాయికి తల్లి గుర్తొచ్చింది. సత్రంలో ఒక మూల తాము దాచుకున్న రెండు జతల బట్టల మూట గుర్తొచ్చింది. ఆ మూట అడుగున అమ్మ అతి జాగ్రత్తగా దాచుకున్న 'నాన్న జ్ఞాపకం' గుర్తొచ్చింది.

అదీ గుడ్డ ముక్కే...

**శిథిలమైన ఎర్రజెండా!**

మనిషి జననం ఎరుపుతో ప్రారంభమవుతుంది

ఉద్యమం ఎరుపుతో ప్రారంభమవుతుంది.

స్త్రీ బాధ ఎరుపుతో ప్రారంభమవుతుంది.

"బ్లిడ్జ్" ఎడిటర్ని ఎవరో "నిరోధ్ మీద ఎర్రరంగు ఎందుకు?" అన్న ప్రశ్నకి... "ఇండియా ఈజ్ ఇన్ మెన్సెస్" అన్నాట్ట.

"న్యాయస్థానాల్లో ఇలాంటి తీర్పులెందుకు చెపుతారు?" అని అడిగితే "న్యాయదేవత (కోర్టు) బయటున్నందుకు " అని చెపుతాడేమో.

ఒకటి రెండు నిముషాల్లో అక్కడ జరిగిందేమిటో అందరరకీ అర్థమైంది. కోర్టు నిర్విణ్ణమైంది. అక్కడే వున్న ఒక జర్నలిస్టు చప్పున ఆ దృశ్యాన్ని ఫోటో తీయబోయాడు. మానవత్వం మిగిలున్న ఓ మహిళా కానిస్టేబులు ఆ అమ్మాయి చుట్టూ తువ్వాలు కప్పింది.

"కోర్టులో పెద్దమనిషి అయిన బాలిక" అన్న బాక్స్ ఐటమ్‌కి ఫోటో మిస్సయినందుకు బాధపడ్డాడు ఆ జర్నలిస్టు.

పెద్దమనిషిగా న్యాయం చెపుతున్నప్పుడు పెద్దమనిషయినందుకు చిరాకుపడి లేచి వెళ్ళిపోయాడు మేజిస్ట్రేట్.

ఇద్దరు మహిళా కానిస్టేబుల్స్ చెరోవైపూ పట్టుకోగా, పెద్దమనుష్యుల మధ్య నుంచి ఆ అమ్మాయి హాలు బయటకు నడిచింది.... చెరసాల వైపు.

## 4

**అస్తమిస్తున్న సూర్యుడికేసి** కిటికీలోంచి చూస్తూ కూర్చుంది లక్ష్మీ శారద. ఎక్కడ ప్రారంభమైన జీవితం ఎటు వెళ్తూందో ఆమెకి అర్థం కాలేదు. కిటికీలోంచి తన ఇల్లు కూడా కనపడుతుంది.

తన ఇల్లేనా?

బోసుబాబుతో కలిసి ఆ అర్థరాత్రి మెట్లు దిగుతూ క్రిందికి వచ్చెయ్యటం ఆమెకి సజీవంగా గుర్తుంది. ఇంటి వెనుకవైపు తలుపు తాళం తీస్తూ "నేనిలా ప్రతిరోజు వెనుకనుంచే లోపలికి వెళతాను. సెకండ్ షో వరకూ సినిమాహాలు దగ్గిర షోడాలూ అవీ అమ్ముతాను. అప్పుడొచ్చి ఇంట్లో వాళ్ళని నిద్రలేపటం ఎందుకని నేనే తాళం తీసుకుంటాను. రండి " అంటూ లోపలికి ప్రవేశించాడు.

తను మౌనంగా అతన్ని అనుసరించింది.

నిద్రపోతున్న వాళ్ళందర్నీ ఆ స్థితిలోనే పరిచయం చేశాడు. "ఆయన మా నాన్నగారు. ఇంకొద్ది రోజుల్లోనే రిటైర్ అవబోతూన్న ప్రభుత్యోద్యోగి. పేరు

పరమేశ్వర శాస్త్రి. ఆ ప్రక్కన పడుకున్నది మా అన్నయ్య రామ్మూర్తి నిరుద్యోగి. ఎవరో పిల్చి ఉద్యోగం ఇస్తారని ఎదురుచూస్తూనే వుంటాడు. ఆ చిరాకంతా ఇంటిమీదా, ప్రభుత్వం మీదా చూపిస్తాడు. ఆ మూల పడుకున్నది నా అక్కయ్య. మీలాగే పెళ్ళయింది. కట్నం ఇస్తేగానీ ఏలుకోనని మా బావగారు తిరిగి పంపేసేరు. పేరు అహల్య. ఆ పక్కన పడుకున్నది నా చెల్లి – గోమతి. ఇంకా చిన్నపిల్ల. ఈ ప్రపంచపు చీకటి ఇంకా తెలీదు."

"మీ అమ్మగారు?"

"లేరు, పోయారు" అన్నాడు. "మీరు ఇక్కడ పడుకోండి. ఇది నా పక్కే! ప్రొద్దున్న మాత్రం మీ పరిచయం మీరే చేసుకోవలసి వుంటుంది. ఎందుకంటే మీరు లేచేసరికి నేను వుండను. పాల ప్యాకెట్లు ఇవ్వటానికి వెళ్ళాలి".

"మళ్ళీ ఎప్పుడొస్తారు?" భయంగా అడిగింది.

"అట్నుంచి అటే బట్టలషాపుకి వెళ్తాను. అక్కడ సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాను".

"మళ్ళీ రాత్రికి సినిమాహాల్లో?"

"అవును..." నవ్వేడు. "డబ్బు అవసరం మాకు చాలా వుంది. అక్కని అత్తవారింటికి పంపాలి. మా బావ ఆఖరి తేదీ కూడా చెప్పేసేడు. లేకపోతే వేరే పెళ్ళి చేసుకుంటాడట"

"అందుకని ఇంత కష్టపడతారా?"

"మా నాన్నగారు ఈ వయసులో కూడా సాయంత్రం పూట సారా కొట్లో లెక్కలు వ్రాస్తారు. డబ్బు అవసరం అలాంటిది. మీరింకేమీ ఆలోచించకుండా నిద్రపొండి. గుడ్ నైట్..."

...ప్రొద్దున్న లేచేసరికి, అనుకున్నట్టే ఆ ఇంటివారందరి మొహాల్లోనూ దిగ్భ్రాంతి కనిపించింది. రాత్రిలేనిది, ప్రొద్దున్నకల్లా హఠాత్తుగా కొడుకు పక్కమీద ఇంకెవరో అమ్మాయి కనిపిస్తే ఎవరికయినా అలాగే వుంటుంది. ఆ కనిపించింది ఎదురింటివాళ్ళ కోడలు అని తెలియగానే వాళ్లు మరింత కంగారుపడ్డారు.

తనముందు మాట్లాడలేదు గానీ, ఆ తరువాత రోజు సాయంత్రం స్నానం చేస్తుండగా మాటలు వినిపించాయి. తను లేకుండా అతడితో మాట్లాడటం కోసం అప్పటివరకూ ఆగి వుంటారని అనుకుంది. వాళ్ళ సంస్కారానికి మనసులో మెచ్చుకుంది కూడా.

"అవును. ఆ అమ్మాయి అర్ధరాత్రి ఎక్కడికి వెళ్తుంది? అందుకే తీసుకొచ్చాను".

"మరిప్పుడేం చేస్తావు?"

"వాళ్ళ నాన్నగారు వచ్చేవరకూ మనింట్లోనే వుంటుంది. టెలిగ్రాం ఇచ్చాను".

ఇంకేం మాట్లాడలేకపోయాడు పరమేశ్వరశాస్త్రి. "కానీ... ఎందుకొచ్చిందిరా మనకిదంతా? లేనిపోని విషయాల్లో తలదూర్చటం" అన్నాడు.

"నాన్నా! ప్రతిరోజూ ప్రొద్దున్నే నువ్వు మూల కూర్చుని శ్లోకాలు చదువుతావు. మేము మా దినచర్య చేసుకుంటూ, ఆ పద్యాలు వింటూ వుంటాం.

ఆ రాత్రి శారదగార్ని రక్షించినరోజు ప్రొద్దున్న నువ్వు చదివిన శ్లోకం ఏమిటో తెలుసా నాన్నా? శారదగారిని ఇంటికితీసుకొస్తుంటే నాకు ఆ శ్లోకమే గుర్తొచ్చింది. అందుకని బాగా నాకు జ్ఞాపకం వుంది. "ఎక్కడయితే స్త్రీలు కష్టపడతారో అక్కడ సౌభాగ్యం నిలవదు. స్త్రీ కన్నీటిని తుడవటం కోసం ప్రాణాలు ఇచ్చినా తప్పులేదు..." అని. మనం చదివింది మనం ఆచరించటం కుదరనప్పుడు, చదవటం మాత్రం దేనికి నాన్నా".

వింటూన్న శారద కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి.

బోసుబాబు తండ్రి కూడా ఏమీ సమాధానం చెప్పలేకపోయాడు.

ఈలోపులో ఒక అనూహ్యమైన సంఘటన జరిగింది. ఆమె వంటింట్లో వుండగా గుమ్మం దగ్గిర అలికిడి అయింది. తండ్రి లోపలికి వస్తూ కనిపించాడు. అయన మొహంలో ఆశించినంత ఉద్వేగమేమీ కనబడలేదు. అంతా ముందే నిర్ణయించుకున్నట్టు ఒకసారి బోసుబాబు వైపు చూసి "నువ్వేనన్నమాట" అన్నాడు. బోసుబాబు, లక్ష్మీ శారద ఇద్దరూ స్థాణువులయ్యారు.

ముందు లక్ష్మీ శారదే కదిలి "నాన్నా – ఈయన..." అంటూ ఏదో చెప్పబోయింది.

"తెలుసు" అన్నాడు ముక్తసరిగా.

మరేమీ బోసుతో మాట్లాడకుండా, కూతురి వైపు తిరిగి, "నేను ఇప్పుడు వచ్చింది నేను ఇంటికి తీసుకు వెళ్ళటానికి కాదు. పొరపాటున ఇంటికి వస్తావేమో, రావొద్దని చెప్పటానికి" అన్నాడు.

బోసు మొహంలోకి రక్తం చివ్వున చిమ్మింది. "మీరు కూడా మీ కూతుర్ని నమ్మరా? అర్థరాత్రి మీ అల్లుడు ఇంట్లోంచి తోసేస్తే నడిరోడ్డు మీద నుంచి నేను మా ఇంటికి తీసుకొచ్చాను" అన్నాడు. ఆ మాటలు పట్టించుకోకుండా తండ్రి ఆమె దగ్గరగా వచ్చాడు. "చూడమ్మా ! నాకు ఇంకా ముగ్గురు కూతుళ్ళున్నారు. వాళ్ళకి పెళ్ళిళ్ళు కావాలి. నీ ప్రవర్తన ఇలాటిదని తెలిస్తే ఎవరూ మన గడపకూడా తొక్కరు. ఇక్కడికి రావటానికి ముందు నేను అల్లుడు గారి దగ్గరకు వెళ్ళాను. ఇంత జరిగాక నీ మొహం కూడా చూడనన్నాడు. అతని మాట కొంతవరకు కరెక్టే అనిపించింది. మరేం చేస్తావో నీ ఇష్టం. వెళ్ళొస్తాను" అంటూ వెనుదిరిగి వెళ్ళబోయాడు.

బోసుబాబు అతన్ని భుజం పట్టుకుని బలంగా ఆపుచేశాడు. అతడి ఆవేశాన్ని చూసి లక్ష్మి శారదే భయపడింది. అతి కష్టం మీద తనని తాను సంభాళించుకుంటూ అన్నాడు. "మీరు ఆత్మవంచన చేసుకుంటున్నారు. అది మీకు తెలుసు. ఆ విషయం వప్పుకోండి" అన్నాడు కటువుగా.

ఆయనో క్షణం బిత్తరపోయి చూశాడు. .. బోసుబాబు మాట గుండెల్లో ఏ మూలనో సూటిగా తగిలినట్టు ఆయన మొహం మారిపోయింది. కొంచెం వేదన కనపడింది. కళ్ళల్లో తడి కదలాడింది. "అవును" అన్నాడు. అంతా చెప్పెయ్యటానికి నిశ్చయించుకున్నట్టు... "ఇప్పుడీ కూతుర్ని తీసుకుని వెళ్ళి పోషించుకోలేను. చావో బ్రతుకో అత్తారింట్లోనే సాగాలని... సా...గా...ల...ని... నేను రాలేదు. టెలిగ్రాం అందినా రాలేదు". అక్కడి నిశ్శబ్దం సముద్రం అడుగున

నిశ్శబ్దం. అక్కడి నిశ్శబ్దం బీదతనం చీకట్లో భయంకర నిజం. సమాజం వప్పుకోలేని సత్యం.

"కూతురికి తిండి పెట్టలేని వాడివి నువ్వసలు కన్నతండ్రివేనా? అని మీరందరూ అంటారు. మీకేం తెలుస్తుంది? ఇంకా ముగ్గురి పెళ్ళి చేయాలి. ఆ కష్టం అనుభవిస్తే తెలుస్తుంది. అనుభవిస్తే తె...లు...స్తుం...ది" గొణుక్కుంటూ ఆ వృద్ధుడు గడపదాటి కూతురి బాధల వైతరిణి దాటి – భారంగా నడుస్తూ – దూరపు చీకట్లో కలిసిపోయాడు. వాళ్ళిద్దరే మిగిలారు. చీకటి మిగిలింది, బోసు ఆమెవైపు చూశాడు.

ఆమె మొహంలో ఏమీ తెలియటం లేదు. అతడు ఆమె దగ్గరగా వెళ్ళి "మీరేమీ బాధపడకండి" అన్నాడు.

ఆమె నవ్వటానికి విఫలయత్నం చేసి "...బాధ ఎందుకు?" అంది. అతడు విచలితుడై చూడగా. "ఈ నిజాన్ని గుర్తించటానికి భయపడుతున్నానంతే" అంది.

"మీకు చెప్పేటంత గొప్పవాణ్ణి కాదు. కానీ నాకు తెలిసినంతలో పరిష్కారంలేని సమస్య అంటూ ఏదీలేదు. ప్రయత్నిస్తే ఏదైనా ఉద్యోగం దొరక్కపోదు. ఇప్పుడు మీ తండ్రిగారు కూడా కాదన్నారు. కాబట్టి, ముందు మీ కాళ్ళమీద మీరు నిలబడటానికి ప్రయత్నించండి. మీరు ఇక్కడే వుంటానన్నా ఏ అభ్యంతరమూ లేదు. ఇక్కడ ఇబ్బందిగా వుంటే ఏ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లోనే చేరుదురుగాని. అన్నిటికన్నా ముందు మీరు కాస్త ధైర్యం తెచ్చుకోండి. భవిష్యత్తులో అదీ కావలసింది" అని అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

# 5

**ఇల్లు కాలి** ఒకడేడిస్తే వళ్ళు కాలి ఇంకోడేడ్చాడంట. ఇల్లొకడిదీ వళ్ళొకడిదీ కాల్తే ఫర్వాలేదు. బాధని సగం సగం పంచుకోవచ్చు, అక్కడ అందరూ ఇల్లూ, వళ్ళూ కాలినోళ్ళే.

ఇక్కడి తిండి బావుండదు. వసతి బావుండదు. వెలుతురుండదు. మనిషికీ మనిషికీ మధ్య స్నేహం వుండదు.

అక్కడ మనుష్యులు వికృతంగా వుంటారు. అయితే వాళ్ళ మొహాలు వికృతంగా వుండవు. కళ్ళలో కసీ పెదాలమధ్య నిర్లిప్తతా వికృతంగా తయారుచేస్తాయి.

అక్కడ వ్యభిచారులుంటారు. రాత్రి సంపాదించిన వంద రూపాయలూ లాగేసుకుని రికార్డుల్లో చూపించటం కోసం కోర్టుకి తీసుకువస్తే, జరిమానా కట్టలేక కటకటాల పాలయిన వ్యభిచారులుంటారు.

అక్కడ సంసారులుంటారు. కట్టుకున్నోడు ప్రతిరోజూ తాగొచ్చి రక్తం వొచ్చేట్టు చావబాదుతూంటే భరించలేక 'లేచిపోయి' చివరికక్కడ చేరిన సంసారులుంటారు.

బయట సమాజం స్త్రీని కట్టుబాటల గోడల మధ్య బంధిస్తే, అక్కడ స్త్రీలని పైన ముళ్ళ తీగెలున్న గోడల మధ్య బంధిస్తారు.

కుక్కల్లో జాతి కుక్కలు, మంచి కుక్కలు వున్నట్టే అధికారుల లోనూ కఠినాత్ములు, కొంచెం కరుణ మిగిలిన వాళ్ళూ వుంటారు. రెండో రకం వాళ్ళు పైకి కనపడరు. పోలీసు స్టేషన్ల లోనూ, జైళ్ళ ఆఫీసుల్లోనూ అసలు కనపడరు. విషయం

తేలే వరకూ అందరూ నేరస్థులే అన్నట్లు మొహం మీద గాంభీర్యము ముసుగేసుకుని వుంటారు. విశారదని చూసినప్పుడు ఆ జైలరు ముసుగు కాస్త తొలగింది.

జైల్లో ఖైదీలకి పని అప్పగించాల్సిన బాధ్యత అతనిదే. చీరెలు నేయటం నుంచి వంట వండటం వరకూ, అందుకని ఆ అమ్మాయిని అడిగాడు –'శిక్షా కాలంలో ఏం పని చేస్తావని?'

"చదువుకుంటాను" అంది విశారద.

అతడాశ్చర్యంగా "చదువుకుంటావా?" అన్నాడు. ఆ అమ్మాయి తలూపింది. జైలరు దగ్గరకొచ్చి భుజంతట్టి "వెరీగుడ్ చదువుకో. పుస్తకాలు తెప్పిస్తాను. ఇక్కణ్ణుంచి వెళ్ళే లోపులో పదవ తరగతి పాసు చేయించే పూచీ నాది!" అన్నాడు హామీ యిస్తున్నట్టు.

అప్పుడా అమ్మాయి ఏడ్చింది. పెంపుడు తండ్రి దొంగతనాలు చేయమని కొట్టినప్పుడు ఏడవలేదు. జడ్జి శిక్ష వేసినప్పుడు ఏడవలేదు. ఇప్పుడు ఏడ్చింది. ఆనందంతో ఏడ్చింది.

రోజులు వారాలయ్యాయి. ఆ అమ్మాయి పూర్తిగా చదువులో మునిగిపోయింది. అప్పుడప్పుడు జైలరు ఆమెని గమనిస్తూ వుండేవాడు. ఆ అమ్మాయి చేతివ్రాత ముత్యాల్లా వుండేది. ఒంటరిగా గుడ్డిలైటు వెలుతురులో కూర్చుని చదువుకుంటున్న విశారదని చూసి ఆమె పెద్దయ్యాక గొప్పదవుతుంది అనుకునేవాడు ఆ జైలరు. కానీ –

ఎప్పుడు ఒకేలా ప్రవహిస్తే అది నది అవదు.

ఎప్పుడూ ఒకేలా సాగితే అది కాలం అవదు.

* * *

"నీ కోసం ఎవరో వచ్చారు" అనగానే ఆశ్చర్యపడింది విశారద.

తన కోసం వచ్చేవాళ్ళు ఈ ప్రపంచంలో ఎవరున్నారన్న ఆశ్చర్యంతోనే విజిటర్సు రూముకొచ్చింది.

అక్కడ కానిస్టేబుల్ ధర్మరాజున్నాడు. కాపురాని కెళ్ళి సంవత్సరం తరువాత పూచిక పుల్లలా తయారై పుట్టింటికొచ్చిన కూతుర్ని చూసి ఏడ్చేసిన తల్లిలా కంటనీరు పెట్టుకున్నాడు.

"ఇలా అయిపోయావేమిటమ్మా" అని రుద్దంగా అన్నాడు. నిజానికి ఇంట్లోకన్నా ఇక్కడే బావుంది ఆ అమ్మాయి. ఆ ఇంటి తిండి ఈ జైలు కూడు కంటే అధ్వాన్నంగా వుండేది.

"మీ అమ్మ నిన్ను చూడాలని తహతహలాడుతోంది. ఇంటికి పోదాం పద. నాలుగు రోజులు ఇంట్లో వుండడానికి 'పెరోల్' మీద పర్మిషన్ తీసుకున్నాను" అన్నాడు. ఆమె మరింత ఆశ్చర్యపడింది. "...అమ్మకి సీరియస్‌గా వుందని అనుమతి తీసుకున్నానులే" అని చెప్పాడు.

ఇద్దరూ జైలు బయటకొచ్చారు.

అక్కడ జీపుంది. అది ఎక్కి వెళ్తూండగా అన్నాడు. "నేనూ, అమ్మా నీ కోసం చాలా బాధపడ్డాం తల్లీ. కోర్టులో ఏం చెప్పాలో తెలియలేదు. నేనే నేరం చేయించానంటే నీకు శిక్ష తగ్గదు సరికదా నాకూ ఉద్యోగం పోతుంది. ఇద్దరం నష్టపోవటమెందుకు నువ్వే చెప్పు".

ఏం చెప్పాలో చెప్పేటంత జ్ఞానం ఆ పదహారేళ్ళ అమ్మాయికి లేదు. అందుకని నిశ్శబ్దంగా వుండిపోయింది. జీపు గతుకుల రోడ్డు కుదుపుల్లో పడుతూ లేస్తూ వెళ్తూంది. ధర్మరాజుకి టెన్షన్‌గా వుంది. యస్సై సింహాచలానికి ఈ అమ్మాయి నచ్చుతుందో లేదో అని.

"నా కర్జంటుగా ఓ చిలక కావాలి" సింహాచలం చెప్పినప్పుడు ధర్మరాజు ఉలిక్కిపడ్డాడు.

ఈయనగారి పెళ్ళాం సంవత్సరం నుంచి శ్రీకాకుళంలో వుండిపోయింది. కాబట్టి ఇప్పుడీ కోరిక కలిగిందేమో అనుకున్నాడు. కానీ తరువాత తెలిసింది. ఇంకెవరో 'పై వాళ్ళకి' సప్లయ్ చేయటం కోసం సరుకు కావాల్సొచ్చిందని.

"మంచోళ్ళు ఎవరున్నారండి? అంతా చెత్త సరుకేనండీ" అని తప్పించుకోబోయాడు.

"మొన్న బస్టాపులో నా పర్సు కొట్టేస్తూ పట్టుబడిన అమ్మాయి పేరేమిటి? విశారద కదూ – ఆ అమ్మాయి గురించి ఎంక్వయిరీ చేశానోయ్. అంతకుముందు రెండు సార్లు జనాలకి పట్టుబడిందటగా" అన్నాడు ఓరగా చూస్తూ.

"అవునటండీ".

"అటండీ – అంటావేమిటి? రెండుసార్లూ నువ్వే వున్నావటగా అక్కడ. జనం నీకే అప్ప చెప్పారట" అని ఆగి... "రెండుసార్లూ నువ్వు అక్కడే వుండటం, అదీ డ్రస్సులో వుండటం చిత్రంగా లేదూ?" అంటూ పూర్తి చేశాడు.

ధర్మరాజు గతుక్కుమన్నాడు.

అన్నంత స్పష్టంగా అతడికి యస్సై చెప్పేది అర్థమైంది.

సాయం చెయ్యకపోతే కేసు తిరగతోడతాడని తెలిశాక ధర్మరాజు ఆలస్యం చేయకుండా అమ్మాయిల వేటలో పడ్డాడు. అయితే అతనన్నట్టే ఎవరూ దొరకలేదు.

రెండు గంటలు అయ్యేసరికి తన ఉద్యోగం పోవడం ఖాయమని తెలిసి పోయింది. అప్పుడే 'విశారద' ఆలోచనలో వచ్చింది. ఇక ఆలస్యం చెయ్యకుండా జైలుకొచ్చాడు. మినిష్టరు తల్చుకుంటే పెరోలెంతసేపు?... ఫలితమే ఈ ప్రయాణం.

....ఇంటికెళ్ళకుండా జీపు పోలీస్ స్టేషన్ ముందు ఆగేసరికి విశారద ధర్మరాజు వైపు చూసింది.

ధర్మరాజు కూడా జీపు దిగలేదు. స్టేషన్ లోంచి యస్సై సింహాచలం వచ్చి జీపెక్కాడు.

ఎక్కుతూ వెనుక సీట్లో కూర్చున్న విశారదవైపు చూశాడు. అతడి కళ్ళల్లో మెచ్చుకోలు కనపడింది. తనకి ట్రాన్స్ఫర్ అయిపోయినట్టే అనుకున్నాడు.

జీపు ప్రభుత్వ అతిథి గృహం ముందు ఆగింది.

"దిగు" అన్నాడు సింహాచలం. విశారద కేమీ అర్థంకాలేదు. భయంగా క్రిందికి దిగింది.

ఆ ప్రభుత్వ విడిది గృహమే ఓ ఖరీదైన హోటల్లా వుంది.

ప్రజల సొమ్ము ఎలా ఖర్చవుతుందో చెప్పటానికి హర్షద్ మెహతా అవసరం లేదు. ఆ విశ్రాంతి భవనం చాలు.

సింహాచలం లోపలికి వెళ్ళి పర్వతాల నాయుడికి సెల్యూట్ చేసి విషయం చెప్పాడు. అప్పటికి నాయుడు ఇంకా మొదటి రౌండ్ పూర్తి చేయలేదు. కుర్చీలోంచి లేచొచ్చి పై అంతస్థు బాల్కనీలోంచి క్రిందున్న విశారదని చూశాడు.

హెలికాప్టర్‌లోంచి వరద గోదావరిని చూసినంత అందంగా కనిపించింది. ఆనందంగా సింహాచలం భుజం తట్టి "వెళ్ళిరా" అన్నాడు. "నీ పని అయినట్టే.. వెళ్ళిరా" అన్నట్టుగా ఆ మాటలు వినిపించి, సింహాచలం అమితమైన ఆనందంతో సెల్యూట్ చేసి అక్కడి నుంచి కానిస్టేబుల్ ధర్మరాజుతో సహా గది బయటకు నిష్క్రమించాడు.

కింద హాల్లో విశారద ఒంటరిగా మిగిలింది. ఆ ఏకాంతంలో ఆమెకి విషయం కొద్దిగా అర్థమైంది.

ఒకప్పుడు కానిస్టేబుల్ ధర్మరాజు పక్కకు చేరితే ఎందుకో తెలియలేదు. ఇప్పుడు వయస్సూ, ఊహా పెరిగాయి. జరుగుతున్నదంతా తెలుస్తూంది. తన పెంపుడు తండ్రి 'పెరోల్' మీద జైలునుంచి తీసుకొచ్చి పై అధికారికి అప్పగించటం, ఆ అధికారి ఇక్కడకి తీసుకురావటంలో అంతర్యం అర్థమయ్యాయి.

తన కన్యాత్వాన్ని దోచుకోబోయేవాడి బారి నుండి ఎలా తప్పించుకోవాలా అని ఆలోచించటం లేదు. మనుష్యుల గురించి ఆలోచిస్తూంది. ఆమె వయసులో చిన్నదే. కానీ పరిస్థితులు ఆమెకు ఎన్నో సత్యాల్ని నేర్పాయి. తల్లితో కలిసి వీధుల వెంట అడుక్కుతినే స్థితి నుంచి.... ఇప్పటివరకూ.

తల్లి మాటల్లో సత్యం ఆమెకి ఇప్పుడిప్పుడే అర్థమవుతూంది. నాలుగైదు వీధుల్లో అడుక్కుని తెచ్చింది సత్రం అరుగుమీద కూర్చుని తింటూ రాత్రిళ్ళు ఆమె తల్లి ఆమెకి దోచుకోవటం గురించీ, దోచుకోబడటం గురించీ బోధించేది. ఆ

రెండూ లేని సమాజం గురించి వూహించి చెప్పేది.పన్నెండేళ్ళ శారదకి ఆ రోజుల్లో అవేమీ అర్థమయ్యేవి కావు.

ఇప్పుడవుతున్నాయి.

డబ్బుకోసం దొంగతనాలు చేయించటం.... అధికారం కోసం ఆడపిల్లని తార్చడం – అమ్మ వూహించిన సమాజంలో ఎందుకుండవో ఆమెకి క్రమక్రమంగా అవగతమవుతోంది. ఆమెచుట్టూ చెడు పెరిగేకొద్దీ ఆ అమ్మాయి 'మంచి' అంటే ఏమిటో తెలుసుకోగలుగుతూంది. ప్రకృతి కన్నా గొప్పగా పాఠం ఎవరు చెప్పగలరు? అనుభవం కన్నా గొప్పగా జీవిత వజ్రాన్ని ఎవరు సానబెట్టగలరు? తలుపు దగ్గర అలికిడికి తలెత్తి చూసింది.

పర్వతాల నాయుడు హాల్లోకి వచ్చాడు. "నిన్ను ఇక్కడే కూర్చోబెట్టేశారా? లోపలికి పద" అంటూ వెనుదిరిగాడు.

విశారద అతడితోపాటే లోపలికి వెళ్ళింది. అతడు రొటీన్‌గా తలుపువేసి గడియపెట్టాడు. లోపల విశాలమైన మంచం వుంది. ఎయిర్ కండిషనర్ చప్పుడు మాత్రం వినిపిస్తోంది.

"దా కూర్చో" అని చెయ్యి పట్టుకుని మంచం దగ్గరికి లాగుతూ, ఆమె మొహంలోకి పరీక్షగా చూసిన పర్వతాల నాయుడు, పాముని వదిలేసినట్టు ఆమె చేతిని వదిలేశాడు. బలంగా ఎవరో మొహంమీద చరిచినట్టయి "నువ్వు... నువ్వు..." అన్నాడు. విశారద అతనివైపు ఆశ్చర్యంగా చూస్తోంది. అతడి మాటలు తడబడినాయ్. అచ్చుగుద్దినట్టు అవే పోలికలు...

"నువ్వు... సరస్వతి కేమవుతావ్?"

"సరస్వతి మా అమ్మ" అంది. గొంతే తడారిందో, ఆ వాతావరణమే సిగ్గుపడటం వల్ల వెన్ను వణికిందో... "అంటే... నారాయణమూర్తి కూతురివా నువ్వు?" అన్నాడు అస్పష్టంగా.

ఆ అమ్మాయి తలూపింది. పర్వతాల నాయుడు మొహంనిండా చెమట్లు పట్టాయి. మనిషిలా లేడు. లోపల్లోపలే ఏదో అంతర్మధనం జరుగుతున్నట్టు కదిలిపోయి కనిపించాడు. జ్ఞాపకం మనసును ఛెర్నాకోలతో కొడుతున్నట్టు తలదించుకొన్నాడు. హృదయం అట్టడుగుకు మిగిలిపోయిన ఏ నిజాయితీనో పైనున్న వ్యాపార పొరల్ని చీల్చుతున్నట్టు – కవ్వం కదులుతున్నట్టు – విలవిలలాడేడు... పర్వతాల నాయుడు ఆలోచన్లు గతంలోకి సాగాయి. గతంలో అతడు పర్వతాల నాయుడు కాదు. 'పర్వతాలు' మాత్రమే.

* * *

స్వాతంత్ర్యం వొచ్చి దశాబ్దం కాలేదు. అదొక పల్లె. నాగరికతకు దూరంగా పచ్చగా వుంది. అర్థరాత్రి ఒంటిగంట దాటాక ఆ ఊర్లో ఒక ఇంటి తలుపు తడుతూ నెమ్మదిగా పిలిచాడు పర్వతాలు "నారాయణన్నా... నారాయణన్నా..."

రెండు నిముషాల తరువాత తలుపు తెరుచుకుంది. సరస్వతి తలుపు తీసింది.

"నారాయణన్న లేడా?"

"పొలం నుంచి ఆలస్యంగా వచ్చారు. నిద్రపోతున్నారు" జవాబిచ్చింది సరస్వతి.

నారాయణమూర్తికి ఆ పల్లెలో రెండెకరాల పొలం వుంది. కానీ అది చాలా చిన్న విషయం. ఒక సిద్ధాంతం కోసం పోరాడే వర్గానికి అతని మీద అంతులేని విశ్వాసం వుంది. అదీ ముఖ్యమైన విషయం. పైకి అతడు చాలా మామూలు రైతు. కానీ నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలు పెడతాడు. ఆ విషయం పెద్దలకి తెలుసు.

"ఏమిటీ విషయం" అడిగింది సరస్వతి. ఆమె నారాయణమూర్తి భార్య. వారి వివాహం జరిగి నాలుగు సంవత్సరాలైంది. సరస్వతి బి.ఏ. చదువుకుంది. ఆ రోజుల్లో బి.ఏ. అంటే సామాన్యం కాదు. అందులోనూ స్త్రీ గ్రాడ్యుయేటు అవటం మరీ విశేషం. నారాయణమూర్తి వ్యక్తిత్వం చూసి ఆకర్షితురాలై వివాహం చేసుకుంది.

పర్వతాలు ఏదో చెప్పబోతూంటే వెనుకనుంచి నారాయణమూర్తి వచ్చాడు. భార్యతో "ఏమిటి గుమ్మంలో నిలబడి మాట్లాడుతున్నావు? లోపలికి రానివ్వవా వాళ్ళని" అన్నాడు. ఆమె అడ్డు తొలగింది.

పర్వతాలు చిన్న కాదరు మనిషి. నారాయణమూర్తితో రహస్యంగా "ఇతన్ని మీ దగ్గర కొంతకాలంపాటు వుంచాలట. పోలీసులు వెతుకుతున్నారు. పైనుంచి ఆదేశం" అన్నాడు.

అప్పుడు చూశారు దంపతులు అతనివైపు. అయిదున్నర అడుగుల ఎత్తుంటాడు. పెద్ద అందంగా కూడా లేదుగానీ, మొహంలో బాగా తెలివితేటలు కనబడుతున్నాయి. దానికన్నా ముఖ్యంగా, ఎదుటివారిని తన మాటల్తో ప్రభావితం చేయగల వ్యక్తిలా కనపడుతున్నాడు.

"పేరు ధనుంజయరావు" అన్నాడు. పర్వతాలు.

అంతకన్నా ఎక్కువ పరిచయం చేయటానికి అతని దగ్గర కూడా వివరాలు లేవు. ఉండవని నారాయణమూర్తికి కూడా తెలుసు.

"నువ్వు వెళ్ళిరా. ఈ రోజు నుంచి ఆయన రక్షణ భారం మాది" అన్నాడు. పర్వతాలు చీకట్లో కలిసిపోయాడు.

* * *

రోజులు గడుస్తున్నాయి.నారాయణమూర్తి దంపతులు ధనుంజయరావుని ఎంత జాగ్రత్తగా చూసుకున్నారంటే ఇంట్లో పనిచేసే మనిషికి కూడా తెలియదు.

రెండు నెలలయ్యాయి. ఉద్యమం నెమ్మదిగా క్షీణిస్తోంది. పోలీసులు అనుమానం వచ్చినవాడినల్లా కాల్చి చంపుతున్నారు.

అయినా, సిద్ధాంతాన్ని మనసా వాచా నమ్మినవాళ్ళు దానికోసం చివరి వూపిరి వరకూ పోరాడుతూనే వున్నారు. కొందరు జనస్రవంతిలో కలిసిపోయారు. మనుషులు మారొచ్చు. ఘర్షణ ఆగదు. అది నిరంతరం.

బయట జరుగుతున్న విషయాలు ఆ ఇంట్లో వారికి తెలియవు. వారికి తెలిసినదల్లా తమకి అప్పగించిన పనిని నిర్వర్తించటం. దాన్ని తు.చ. తప్పకుండా చేస్తున్నారు.

మొదట కొన్ని రోజులు ధనుంజయరావు చాలా మొహమాటంగా వుండేవాడు. సరస్వతే అతడికి కావలసినవన్నీ అమర్చి పెడుతూండేది. నారాయణమూర్తి తెల్లవారుఝామూనే పొలానికి వెళ్ళిపోయేవాడు. చీకటి పడిన తరువాత వచ్చేవాడు. ఇంట్లో ఇద్దరే వుండేవారు. విషయం సరస్వతికి తెలుసు. ఆ లోటు లేకుండా వీలైనంత ఎక్కువగా తనే మాట్లాడేది. ఆమె తెలివితేటలకీ,

లక్ష్యంపట్ల ఆమెకున్న అవగాహనకీ అతను ఆశ్చర్యపోయేవాడు. ఆమె బియ్యే చదివిందని తెలిసి మరింత విస్మయం చెందాడు. "లాండ్ అందరిదీ... లేబర్ కంపల్సరీ చేస్తే, కాపిటలూ ఆర్గనైజేషనూ కొందరు వ్యక్తుల చేతుల్లోనే ఎలా కేంద్రీకృతమై ఉండగల్గుతుంది? ఇంత బెసిక్ ఎకనమిక్స్ ఎవరూ అర్థం చేసుకోరేం?" అని ఆవేశంగా వాదించేది.

అతడు నవ్వుతూ "పోనీ నువ్వే ఒక స్కూలు పెట్టరాదా సరస్వతి" అన్నాడు. ఆమె ఆ మాటల్ని తేలికగా తీసుకోలేదు. "...మీరు మా మార్గదర్శకులు. నిజంగా మన ధ్యేయం నెరవేరుతుందంటే నేను తప్పక ఆ పనిచేస్తాను " అంది.

"మంచి ఆలోచనే. ఇదిగో ఈ గొడవ కాస్త తగ్గనీ, నా చేతుల్తో స్వయంగా నేనే 'సరస్వతీ నిలయా'నికి శంకుస్థాపన చేస్తాను".

...ఆమె వూహల్లో సరస్వతీ నిలయం అప్పుడే పూర్తిగా రూపురేఖలు దిద్దుకుంది. ఏమేం చెప్పాలో అంతా నోట్సు వ్రాసి పెట్టుకునేది.

"ఇదంతా జరిగే పనంటావా?" నారాయణమూర్తి నవ్వుతూ అనేవాడు.

"నేను చెయ్యలేకపోయినా నా కొడుకుతోనో, కూతురుతోనే అయినా పెట్టిస్తాను" అనేది.

అతడు ఆశగా, "అలాంటి విశేషం ఏదైనా వుందా?" అనేవాడు. ఆమె సిగ్గుతో "లేదు లెండి" అని, దూరంగా జరుగుతూ, అంతలో ఏదో గుర్తొచ్చినట్లు "ఇదిగో ముందే చెపుతున్నాను. మనకి కూతురు పుడితే 'విశారద' అని పెట్టాల్సిందే. మళ్ళీ అప్పుడు కాదంటే కుదర్దు" అనేది.

"సరస్వతీ నిలయాన్ని 'విశారద' నడుపుతుందన్న మాట, భలే!"

ఈ విధంగా జరిగేది సంభాషణ.

అప్పుడప్పుడు పర్వతాలు రహస్యంగా ఆ ఇంటికి వచ్చి బయట విశేషాలు చెప్పి వెళ్తూ వుండేవాడు. పోలీసుల నిఘా మరింత ఎక్కువైందనీ, ఉద్యమం తీవ్రత తక్కువైందనీ చెప్పి వెళ్ళాడు. ధనుంజయరావు చాలా కలత చెందితే సరస్వతే అతన్ని ఓదార్చింది.

ధనుంజయరావు రాత్రిపూట చాలాసేపటి వరకూ పుస్తకాలు చదివేవాడు. పగలంతా అలసిపోయి వుండటంచేత నారాయణమూర్తి పొలం నుంచి వచ్చాక ఒక గంటసేపు అతనితో సంభాషించి వెళ్ళి పడుకునేవాడు. సరస్వతి అప్పుడప్పుడు వెళ్ళి 'టీ' కావాలేమో కనుక్కునేది. ఆమె అలా వస్తున్నందుకు మందలించాడో రోజు.

"ఇప్పుడు టైమెంతయిందో తెలుసా? అర్థరాత్రిదాటింది. పోయి పడుకోరాదా – టీ కావాలంటే నేను పెట్టుకుంటాను కదా".

ఆమె నొచ్చుకుంటూ, "అయ్యో. ఇందులో శ్రమేం వుంది? ఒక ఆశయ సాధన కోసం పెళ్ళాం బిడ్డలకి దూరమై అజ్ఞాతవాసంలో ఏళ్ళ తరబడి గడుపుతున్నారు. ఉద్యమానికి వూపిరైన మీలాంటి వారి శ్రమతో పోల్చుకుంటే మాదొక శ్రమా? మీ కోసం మాలాంటి అల్పజీవులం ప్రాణాలు ఇవ్వటం కూడా ఒక అదృష్టంగా భావిస్తాం" అంది వినమ్రతగా.

ద్రోణుడి ముందు ఏకలవ్యుడిలో పెల్లుబికిన భక్తి భావం ఆమె కళ్ళల్లో ఆ క్షణం కదలాడింది.

అతడు పుస్తకం మూసేస్తూ "నీలాటివారు పల్లె కొకరుంటే మన శ్రమ ఎప్పుడో ఫలించేది" అన్నాడు మెచ్చుకోలుగా.

ఆ రాత్రి అతడు చాలా సేపటి వరకు చదువుకుని దాదాపు తెల్లవారుతూండగా పడుకున్నాడు. ప్రొద్దున్న లేచేసరికి పది అయింది. నిద్రకళ్ళతోనే పెరట్లోకి వచ్చాడు. ఇంటికి కొద్ది దూరంగా వెదురు తడికల్తో స్నానాల గది వుంది. అతడు చూసుకోకుండా తలుపు తీశాడు. దానికి కట్టిన పాత పురికొస తెగి తలుపు తెరుచుకుంది.

లోపల స్నానం చేస్తున్న సరస్వతి దండెంమీద చీరె అందుకోవటం కోసం అప్పుడే లేస్తూంది.

ధనుంజయరావుని చూసి ఆమె స్త్రీ సహజమైన సిగ్గుతో చప్పున మోకాళ్ళమీద ముణగదీసుకు కూర్చుండిపోయింది. అతడు తలుపు వేగంగా వెనక్కి లాగి అక్కడనుంచి వచ్చేశాడు.

ఆ రోజంతా ఆమె అతడిని చూడటానికి బిడియపడింది. కానీ తప్పదు. అన్నీ ఆమే సమకూర్చాలి. అందువల్ల వీలైనంతవరకూ, మామూలుగా వుండడానికి ప్రయత్నిస్తూ ఆమె కాఫీ కప్పు తీసుకొని అతని గదిలో ప్రవేశించింది.

అతడు బల్లముందు కుర్చీలో కూర్చుని బల్లమీద మోచేతులు అన్చి, అరచేతుల్లో మొహం కప్పుకుని నిశ్శబ్దంగా వున్నాడు. అతడి భార్యాబిడ్డలు ఎక్కడ వున్నారో తెలీదు. అసలు బ్రతికి వున్నారో, మరణించారో తెలీదు. ఎన్నాళ్ళ కోరికో అది –

చిన్న పిల్లవాడయితే ఆకలికి బిగ్గరగా ఏడుస్తాడు. పెద్దవాడు నిశ్శబ్దంగా ఏడుస్తాడు. తన పిల్లాడు ఎందుకు ఏడుస్తున్నాడో ఏ తల్లికి చెప్పనవసరం లేదు.

ఆ క్షణం ఆమె అతడికి తల్లి అయింది.

*                    *                    *

నెలలు గడిచాయి.

వర్షాకాలం వచ్చింది. ఆకాశం చిల్లుపడినట్టుంది ఆ రాత్రి. పిడుగులు భూమిని చీల్చటానికి కంకణం కట్టుకున్నాయి. హరికెన్ లాంతరు వెలుగు కూడా ప్రకృతి వైపరీత్యానికి భయపడినట్టు మినుక్కు మినుక్కుమని వెలుగుతోంది. ఆ శబ్దాల్లో బయట తలుపు దబదబా బాదిన చప్పుడు కూడా వెంటనే వినపడలేదు.

ఏదో పుస్తకం చదువుకుంటున్న సరస్వతికి ఆ చప్పుడు మొదట లీలగా వినిపించింది. వెళ్ళి తలుపు తీసింది. ఈ లోపులో నారాయణమూర్తి కూడా తన గదిలోంచి బయటకు వచ్చాడు.

సరస్వతి తలుపు తీయటానికి కొంచెం ఆలస్యమైంది. ఆమె నిండు గర్భవతి. ఈ లోపులోనే బయట నుంచి మళ్ళీ చప్పుడు.

ఆమె తలుపు పూర్తిగా తీయకుండానే అవతల్నుంచి బలంగా తోశాడు పర్వతాలు. అతడు రొప్పుతున్నాడు. వర్షంలో పూర్తిగా తడిసి ముద్దయి వున్నాడు.

"పో....లీ....సు...లు... పో...లీ.... సు....లు..."

అప్పుడే గదిలోంచి బయటకు వస్తూన్న ధనుంజయరావు ఆ మాటలకి చప్పున లోపలికి పరుగెత్తాడు. ఒక సుశిక్షితుడైన సైనికుడిలా అరక్షణంలో తయారయ్యాడు. తనకి కావల్సిన సామాన్లు చకచకా తీసుకున్నాడు.

అప్పుడే ఒక సెర్చిలైటు చెట్ల మధ్యగా వెలిగి – ఆ గాఢమైన వెలుతురు ఇంటిమీద పడింది. ఇంట్లోవాళ్ళు అది వూహించలేదు. పోలీసులు అంత తొందరగా వస్తారనుకోలేదు. సరస్వతి బిత్తరపోయింది. నారాయణమూర్తి కంగారుపడ్డాడు.

ధనుంజయరావు మెరుపు వేగంతో తలుపువేసేసి, హాలు వెనుక వైపుకి పరుగెత్తాడు.

లైటు వెలుతురు పడగానే తలుపులు మూసుకుపోవటం గమనించిన పోలీసు ఇన్‌స్పెక్టర్ "వెనుకవైపు నుంచి పారిపోతున్నాడేమో – అటు వెళ్ళండి" అని గట్టిగా అరవటం నారాయణమూర్తికి వినిపించింది. అప్పటికే ధనుంజయరావు ఇంటి వెనుక తలుపు తీస్తున్నాడు. పోలీసులు అటువైపు వస్తున్నారని అతడికి తెలీదు.

పోలీసులు ఇంటి వెనుక వైపుకి చేరుకోవటం చాలా సులభం. వాళ్ళని అటు వెళ్ళనివ్వకుండా చెయ్యాలంటే ఒకే మార్గం వుంది.

నారాయణమూర్తి మరి ఆలోచించలేదు. ముందు తలుపులు రివ్వున తీసుకుని బయటకి వచ్చాడు. అతడినే ధనుజయరావు అనుకున్నారు పోలీసులు. 'ఫైర్' అని ఇన్‌స్పెక్టర్ అరవటం, తుపాకులు పేలటం ఒకేసారి జరిగింది. ఏం జరిగిందో సరస్వతి గ్రహించేలోపులో దిక్కులదిరేలా భర్త ఆర్తనాదం వినిపించింది.

ఇంటి వెనుకవైపుకి వెళుతూన్న పోలీసులు ఆ అరుపు విని అటు వెళ్ళటం మాని, తిరిగి ముందుకొచ్చారు. ఆ అవకాశం కోసమే చూస్తున్న ధనుంజయరావు నిశ్శబ్దంగా వెనుక తలుపు తీసుకుని చీకట్లో కలిసి పోయాడు.

సరస్వతి ఆగలేదు. ముందు వెనుక చూడలేదు. నిండు గర్భవతినని ఆలోచించలేదు. బయటకొచ్చి భర్త దగ్గరకు పరుగెత్తింది. అదే వేగంతో వెలుగులోకి దూసుకుపోయింది. పడివున్న భర్త దగ్గరగా పరుగెత్తింది.

వస్తూన్నది స్త్రీ అని గ్రహించేలోపునే పోలీసులు మరో రౌండు కాల్పులు జరిపారు. ఒక గుండు ఆమె కుడి భుజంలోకి, రెండు గుళ్ళు ఎడమ మోచేతిలోకి దూసుకుపోయాయి. భర్త పక్కన ఆమె కూలిపోయింది.

తమకు కావలసిన వ్యక్తులు వాళ్ళు కాదని గ్రహించిన ఇన్‌స్పెక్టర్ పోలీసుల్ని నాలుగువైపులకీ పరుగెత్తించాడు.

ఆ దంపతులు ఏకాంతంగా మిగిలేరు.

ఆ చీకట్లో.... రక్తంతో ఎర్రబడిన వర్షపుధారల మధ్య నిస్సహాయంగా పడివున్నారు వాళ్ళిద్దరూ.

ఆమె మోచేతి దగ్గర దూసుకుపోయిన బుల్లెట్, ఎముకని రెండుగా విరిచేసింది. ఆ చెయ్యి తోటకూర కాడలాగా వేలాడుతోంది. భుజం దగ్గర దూసుకుపోయింది, మరో చేతిని అచేతనంగా చేసింది. ఆ చెయ్యి పైకి ఎత్తడానికి వీల్లేకుండా పోయింది. విశ్వాన్ని సాకిన చేతులు నిర్వీర్యం అయ్యాయి.

కొనప్రాణం గొంతులో కొట్టుకొంటూండగా, ఆమెని దగ్గిరగా తీసుకున్నాడు. బాధని అతికష్టంమీద అణుచుకుంటోంది. ఆమె కళ్ళ ఎదుట భర్త మరణం ముందు ఆ బాధ తక్కువే. సజల నేత్రాలతో అతడివైపు చూసింది.

"...సరస్వతీ..." అతడి గొంతు బలహీనంగా పలికింది. "ధనుంజయ తప్పించుకున్నాడా?"

వెనుకనుంచి కాల్పులేవీ వినిపించటం లేదు. ఆమె అస్పష్టంగా తలూపింది. అతడు తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు. వర్షం మరింత ఎక్కువైంది. అతడి చెయ్యి ఆమె కడుపుని లాలనగా తాకింది. "...పాప ...పాప జాగ్రత్త " అన్నాడు వీడ్కోలు చెపుతున్నట్లు.

ఆ మాటలకి ఆమెలో అగ్నిపర్వతం బ్రద్ధలైంది. "నేను...నేను" అంది. ఆ తరువాత ఏమి చెప్పాలో తెలియలేదు. కానీ చెప్పక తప్పదు. అతడు తన భర్త. చివరి క్షణాల్లో వున్నాడు. ఇక అతడిని తను మోసం చేయలేదు. ప్రేమ తప్ప తనకి మరొకటి తెలీదు. ఇక చెప్పకుండా యెలా వుండగలదు.

"నేను... నేను మిమ్మల్ని మోసం చేశానండీ. ఈ అంశ.... ధనుంజయ రావుది".

ఆకాశం చీలినట్టు అక్కడ భయంకరమైన నిశ్శబ్దం వినిపించింది. వేయి కోట్ల కాగడాల వెలుగు మేఘాల రాపిడి మధ్య ఉద్భవించి, మనుష్యుల్ని మాడ్చెయ్యటానికా అన్నట్టు అక్కడ వ్యాపించింది. అయినా అతడి చెయ్యి ఆమె మీద నుంచి కదల్లేదు. మెరుపు వెలుగులో అతడి మొహం మరింత ప్రశాంతంగా కనిపించింది. ఏ విద్యుద్ఘాతమూ భంగపరచలేని ప్రశాంతతది. ఆప్యాయంగా "నువ్వు నన్ను మోసం చేశావా సరస్వతీ?" అన్నాడు. అతడికి ప్రాణం పోవటం తెలుస్తూంది. అయినా, తన మనసులో భావాల్ని చెప్పటం కోసం శక్తిని కూడగట్టుకున్నాడు. ఈ క్షణం ఇది చెప్పలేకపోతే, జీవితాంతం తన భార్య కుమిలిపోతూనే వుంటుంది.

"...నీకు మోసం చేయటం కూడా తెలుసునా సరస్వతీ? ఊహూ. నువ్వెవర్నీ మోసం చేయలేవు. ప్రేమించగలవు అంతే. నీలో పెరుగుతోంది ధనుంజయరావు అంశ కాదు. ఒక సిద్ధాంతం మీద నీకున్న బలమైన నమ్మకం తాలూకు అంశ. ఆ సిద్దాంతం మీద ప్రేమతో, అతడి మీద జాలితో నిన్ను నువ్వు త్యాగం చేసుకుని వుంటావు. అవునా?..."

ఆ మాటలకి వర్షం కూడా అనిర్వచనీయమైన అనుభూతి పొందినట్టు ఆగింది. ప్రకృతి పులకించింది. తనకన్నా బాగా తనని అర్థం చేసుకున్న తన భర్తని చూసి ఆమె ఆనందంతో దుఃఖించింది.

ప్రాణాలు గాలిలో కలిసిపోతూండగా అతడు చివరిగా చెప్పాడు.

"...ఇంతకాలం నేను మనవారికోసం ఏం చేయగలిగానా అని బాధపడుతూ వచ్చాను. ఇప్పుడిక నేనుపోయినా ఫర్వాలేదు. నాకన్నా ఎక్కువ తెలివితేటలు వున్న ప్రాణిని నా భార్య ద్వారా నా వాళ్ళకి ఇస్తున్నాను..." ఆగి అన్నాడు. "పుట్టబోయే 'శారద' ని గొప్పగా తీర్చిదిద్దు సరస్వతీ. మనం పోయినా మన ఆశయం బ్రతకాలి. మన శారద దాన్ని బ్రతికించేలా తీర్చిదిద్దు. ధనుంజయ కూడా సంతోషిస్తాడు..."

...అతడి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వర్షపు నీరు అతడి శరీరాన్ని పవిత్ర స్నానం చేయిస్తోంది. నాగరికతకూ కుత్సితత్వానికి దూరంగా... ఎక్కడో మారుమూల అడవి పక్క పల్లెటూర్లో పుట్టిన ఆ బీదరైతు, ఆ క్షణం ఆకాశానికన్నా ఉన్నతంగా ఎదిగిపోయాడు. అతడు వూహించిన ప్రపంచం రావచ్చు –

రాకపోవచ్చు. వచ్చిన తరువాత కూడా అతని పేరు చరిత్ర పుటల్లో ఎక్కకపోవచ్చు. ఆ అజ్ఞాత వీరుడి త్యాగం సువర్ణాక్షరాలతో లిఖింపబడకపోవచ్చు.

సామాన్యమైన కర్షకుడు అతడు. ఉద్యమాలన్నీ సామాన్యుల నుంచే ఉద్భవిస్తాయన్న సత్యానికి ప్రతీక అతడు.

...ఇన్స్పెక్టర్ అక్కడికి వచ్చాడు. శవాన్ని తీసుకుపోయే ఏర్పాటు జరుగుతున్నాయి. సరస్వతిని అరెస్టు చేశారు. ఇల్లు స్వాధీనం చేసుకున్నారు.

దూరంగా చెట్ల చాటు నుంచి అదంతా చూస్తున్న పర్వతాలు ఇక అక్కడ వుండి చేసేదేమీ లేనట్టు చీకట్లో కలిసిపోయాడు. అదీ జరిగింది.

*　　　*　　　*

మిగతా కథ విశారదకి తెలుసు.

అంతేకాదు. తెగిపోయిన లింకులకి ఆధారం కూడా దొరికినట్టు అయింది. కోర్టులో తన తల్లిమీద కేసు నిలవలేదు. వదిలేశారు. కానీ ఈ లోపులోనే ఆమె ప్రసవించింది. ఆ విధంగా తను జైల్లో పుట్టింది. తరువాత తల్లితో కలిసి సుదూర తీరాలకి....

తన తల్లి కుడిచేయి కాస్త కదిలేది. ఎడమచేయి పూర్తిగా చచ్చుబడిపోయింది. అడుక్కోవటానికి కూడా చేతులు స్వాధీనంలో లేని స్థితిలో ఆమె తనని పెంచి పెద్దచేసింది. ఒక పాడుపడిన సత్రపు అరుగుని నివాసంగా చేసుకుంది. తనని ఎనిమిదో క్లాసు వరకూ చదివించింది. ఇంకా చదివించేదే.

ఆ రోజు ఆమె జె.డి.జె.ని చూడకపోతే.

# 6

డబ్బుకీ డబ్బుకీ మధ్య బంగారం సిమ్మెంటు చేసి కట్టినట్టుంది ఆ భవంతి.

ఆరంతస్థుల భవంతి అది. దాని ముందున్న గూర్ఖా కేవలం డబ్బు సంపాదనకి ఉపయోగపడే వాళ్ళని మాత్రమే లోపలికి పంపటానికి అక్కడ నియమింపబడినట్టున్నాడు.

ఫుట్‌పాత్ మీద నడుస్తున్న సరస్వతి ఎవరో ఆపినట్టు ఆగిపోయింది.

అప్పుడే ఆ భవంతిలోకి ప్రవేశిస్తూంది ఆ కారు. అందులోని వ్యక్తినే తన తల్లి విస్తుబోయి చూస్తూ వుండడం గమనించింది విశారద. 'తను చూస్తున్నది నిజమేనా' అన్న భావం తల్లి మొహంలో కొట్టొచ్చినట్టు కనబడుతూంది.

ప్రహారీ గోడ పక్కనే వున్న ఎత్తయిన బోర్డు మీదకు దృష్టి సారించింది సరస్వతి. విశారద కూడా అటు చూసింది. దానిమీద బంగారు రంగు అక్షరాలు మెరుస్తున్నాయి.

'జె.డి.జె. ఇండస్ట్రీస్'.

తన తల్లి మొహంలో అంత కోపం విశారద ఎప్పుడూ చూడలేదు.

ఆ అమ్మాయి భయపడి తల్లి చెయ్యి గట్టిగా పట్టుకుంది. సరస్వతి మొహంలో కేవలం కోపమే కాదు రోషం, ద్వేషం, నిస్సహాయత, అవమానం – అన్నీ కలగలిపిన భావం. ఆమె మొహం ఉదయిస్తూన్న సూర్యుడిలా ఎర్రబడింది.

లోపలికి ప్రవేశిస్తూన్న తల్లీ కూతుళ్ళని గూర్ఖా అడ్డుకున్నాడు. "లోపలికి వెళ్ళి చెప్పు. నా పేరు సరస్వతి..."

ఆమె కంఠంలో కమేండ్‌కి గూర్ఖా అప్రయత్నంగా లోపలికి ఫోన్ చేశాడు. లోపలికి పంపమని కబురొచ్చింది.

విశారద తల్లి చెయ్యి పట్టుకుని వింతగా చుట్టూ పరిసరాల్ని చూస్తూ నడవసాగింది. తల్లి గాంభీర్యం చూసి పలకరించడానికి భయపడింది. విశాలమైన మెట్లు ఎక్కి ముందు హాల్లోకి ప్రవేశించారు. అక్కడ ఒక నౌకరు వారిని లిఫ్ట్ దగ్గరికి తీసుకువెళ్ళాడు. అలాంటి వాతావరణాన్ని చూడడం పధ్నాలుగేళ్ళ విశారదకి అదే మొదటిసారి. లిఫ్ట్ నెమ్మదిగా పైకి కదుల్తూంటే ఆమెకి మొదట అర్థంకాలేదు. వళ్ళంతా అగాధంలోకి జారిపోతున్నట్టు అనిపించింది.

నాలుగో అంతస్థులో లిఫ్ట్ ఆగింది. ఛైర్మన్ ఛాంబర్స్ అది.

బిచ్చగత్తెల్లా వున్న ఇద్దరాడవాళ్ళు జె.డి.జె. గ్రూపు కంపెనీల అధినేతని కలుసుకోవటానికి వెళ్తూంటే – ఛైర్మన్ ఆఫీసులో అందరూ తలమునకలయ్యేటంత ఆశ్చర్యంతో చిత్రంగా చూడసాగారు.

....ఎనిమిది అడుగుల ఎత్తున్న ద్వారాన్ని చప్పుడు కాకుండా తెరిచి, లోపలికి దారి చూపించాడు నౌకరు.

ఆ లోపలి గదంతా ఒక విధమైన సువాసనతో నిండి వుంది. ఆ గదిలో గాలి బాగా చల్లబడి వుండడం వలన, ఆ పరిమళం కూడా ఒక అరిస్టోక్రసీని సంతరించుకుంది. ఆ గదిలో వున్న ఫర్నీచర్ ఖర్చుతో ఇద్దరు వ్యక్తులు నెలరోజులపాటు ప్రపంచం పర్యటన చెయ్యొచ్చు. నేల మీద పరిచి వున్న కార్పెట్ ఖరీదుని బ్యాంక్‌లో వేస్తే, వచ్చే వడ్డీతో ఒక కుటుంబం జీవితాంతం బ్రతకొచ్చు.

మూడు వందల చదరపు అడుగుల విశాలమైన గది మధ్యలో –రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చుని వున్నాడు జె.డి.జె.

ధనుంజయ జె.

సరస్వతిని చూడగానే అతను కుర్చీలోంచి లేచి దగ్గిరకొస్తూ, "బావున్నావా సరస్వతీ" అని అడిగాడు.

ఆమె సమాధానం చెప్పలేదు. అతడామెని పరీక్షగా చూసివుంటే, తనని తాను కంట్రోలు చేసుకోవడానికి ఆమె ఎంత ప్రయత్నిస్తూందో అర్థమై వుండేది. అది గమనించకుండా అతనన్నాడు. "అప్పుడే మీ కోసం వెతికాను. కొంతకాలం జైల్లో వున్నావన్నారు. ఆ తరువాత ఏమయ్యావో తెలీదన్నారు. ప్రస్తుతం ఏం చేస్తున్నావు?"

ఆమె అతడి కళ్ళల్లోకే సూటిగా చూస్తూ, "బాధపడుతున్నాను" అంది కసిగా. అప్పటికే ఆమె మెడమీద రక్తనాళాలు ఉబికాయి. ఆమె మొహం మండుతున్న అగ్నిగోళంలా వుంది. "...నీ కోసం నేను మలినమయినప్పుడు బాధపడలేదు. నిన్ను రక్షించటం కోసం నా భర్త మరణించినప్పుడు బాధపడలేదు. పోలీసుల తుపాకీ గుళ్ళకి నా ఈ రెండు చేతులూ చచ్చుబడినందుకు... ఈ రోజు... ఈ క్షణం... నిన్ను చెంప బ్రద్దలు కొట్టలేకపోయానే అని బాధపడుతున్నాను. ఒరేయ్! నీ కోసమూ.... మేమందరం సర్వనాశనమయ్యాం? నీ ఆకలి తీర్చటం కోసమా మేము బలి పశువులమయ్యం?" ఆమె కంఠం వణికింది.

ఆమె సంబోధనకి అతని మొహం ఎఱ్ఱగా మారింది. తనని తాను కంట్రోలు చేసుకుంటూ," అయిందేదో అయిపోయింది సరస్వతి. ఇక నుంచీ మీకేలోటూ రాకుండా నేను చూసుకుంటాను" అన్నాడు అడుగు ముందుకు వేస్తూ.

"ఆగు, దగ్గరకి రాకు. వస్తే ఏం చేస్తానో నాకే తెలీదు" అంది. అతడు ఆమె ఆవేశానికి భయపడ్డట్టు ఆగిపోయాడు. ఆమెలో క్రమంగా ఆవేశం తగ్గి ఆవేదన ఎక్కువైంది. మ్లానమైన మొహంతో, సానుభూతిగా అంది. "ప్లీమత్ కారు నీలం అద్దాల వెనుక అస్పష్టంగా నువ్వు కనపడినప్పుడు 'అతడు ధనుంజయరావు కాకపోతే ఎంత బావుండును' అని అనుకున్నాను. నీ కారు ప్రవేశించిన కాంపౌండ్ బయట 'జె.డి.జె.' అని బోర్డు చూసినప్పుడు, ధనుంజయ ఇంటిపేరు 'జె' కాకపోతే ఎంత బావుండునని అనుకున్నాను. ఆ రెండూ నిజమైనా కూడా నేనింత నిబ్బరంగా ఎలా వుండగలుగుతున్నానో అర్థం కావటం లేదు. వేలాది ప్రజలు ఒక మనిషి కోసం తమ జీవితాల్ని త్యాగం చేస్తే... ఒక మనిషి కోసం తమ వాళ్ళని కూడా బలిపెడితే... ఆ మనిషి ఇంత సుఖంగా తన పంథా మార్చుకుని, భవిష్యత్తుని 'క్యా...ష్' చేసుకుంటాడని.... మూర్ఖులం... మేమెందుకు ఆలోచించకపోయాం?"

"మారుతున్న జీవిత విధానంలో అందరూ మారక తప్పదు. ఎప్పుడో మారబోయేదానికి ఇప్పటి నుంచీ మడికట్టుకు కూర్చోలేం".

"ఓహో!.... 'అందరూ మారిన తరువాత మనమూ మారదాం. అంతవరకూ ప్రసుతం సమాజంలో రెండు వర్గాలు తప్పవు కాబటి – మనం ఉన్నత వర్గంలో చేరిపోయి, క్రింది వర్గానికి ఏమీ చేయలేకపోతున్నామే అన్న

బాధతో ఖరీదైన బార్లలో తాగుదాం'... అన్నదా ప్రస్తుతం నీ సిద్ధాంతం?" వెటకారంగా అంది.

"చెప్పానుగా – ఎప్పుడో మారబోయే సమాజం గురించి ఇప్పటి నుంచే అన్నీ వదులుకోలేను. నాకు తెలివితేటలున్నాయి. ఆ తెలివితేటల్ని వాడుకునే అవకాశం ప్రస్తుతం వున్న ప్రభుత్వం కలగచేస్తోంది. ఆ రకంగా తప్పు చేయటం లేదు. ఆ మాటకొస్తే అందరూ చేస్తున్నది అదే..."

అతడి మాటలు ఆమె వినటం లేదు. తనలో తనే గొణుక్కుంటున్నట్టు అన్నది. "ఇంత మంచి సిద్ధాంతాన్ని– వివరణలో ఏ తప్పూ లేని ఈ సిద్ధాంతాన్ని... ఆచరణలో పెట్టటానికి సర్వమానవాళీ ఎందుకు సంశయిస్తుందా అని ఇంతకాలం ఆశ్చర్యపడుతూ వచ్చాను. ఇప్పుడు నాకు సమాధానం దొరికింది. తెలివైనవాడు నీతిని వదిలేస్తే తన వాదనని ఎంత బలంగా నిర్మించుకుంటాడో అర్థమైంది".

అతను బిగ్గరగా నవ్వేడు. "డైరీలో వ్రాసుకోదగినంత గొప్ప కొటేషన్ చెప్పావు సరస్వతీ! తెలివైనవాడు నీతిని వదిలేస్తే, కాపిటలిస్ట్ అవుతాడు. వదిలెయ్యకపోతే మేధావో, టీచరో అవుతాడు. అందుకే నువ్వు నీ 'సరస్వతీ నిలయం' స్థాపించి, నీ సిద్ధాంతాన్ని జీవితాంతం బోధించు సరిపోతుంది".

విశారద ఇద్దరివైపూ చూస్తోంది. తన తల్లి నిస్సహాయతని గమనిస్తోంది. ఆ అమ్మాయి ఆలోచన్లు ఇంకా పరిపక్వం కాలేదు. కానీ తల్లి నిజాయితీ తెలుస్తోంది. అతని వాదనలో బలం లేకపోయినా, తెలివితేటల్తో దాన్ని కప్పిపుచ్చుకోవటం ఆ అమ్మాయికి అర్థమైంది.

ఈ లోపులో సరస్వతీ కూతురితో సహా అక్కణ్ణుంచి కదిలి, గుమ్మంవైపు నడిచింది. వెనుకనుంచి "...సరస్వతీ" అని పిలిచాడు. ఆమె ఆగింది.

"మనిద్దరి మధ్యా వున్న గొడవలకి ఆ అమ్మాయిని బలిపెట్టకు. నువ్వుకూడా నాతో వుంటే సరే. లేనిపక్షంలో నా కూతుర్ని నాకు వదిలిపెట్టు".

చివరిమాటకి విశారద మొహం మీద ఎవరో బలంగా చరిచినట్లు అయింది. తల్లినీ, అతడినీ మార్చి మార్చి చూసింది. ఆమెకిప్పుడు మొత్తం అర్థం అయింది.

తలుపు దగ్గర ఆగిన సరస్వతి నెమ్మదిగా అంది– "ప్రతి మనిషీ కష్టపడి పని చేయాలన్న నా సిద్ధాంతానికి విధి అడ్డుతగిలి, నా చేతుల్ని నిర్వీర్యం చేసి... నన్ను అడుక్కుతినేలా చేసింది. అయినా నేను కృంగిపోలేదు. ఎందుకో తెలుసా ధనుంజయా? అదే విధి.... ఇదిగో – ఈ అమ్మాయిని నాకిచ్చి, నా కర్తవ్యాన్ని నా ముందుంచింది. ఎప్పటికయినా నేను నా కూతురి ద్వారానే మేము కలలు కన్నకొత్త ప్రపంచాన్ని సాధిస్తాను. ఇటీవల మారిన నీ ఆలోచనల్లో ఎక్కడ తప్పుందో నీవే స్వయంగా తెలుసుకునేలా చేస్తాను."

తల్లి మాటల్లో ఆవేశం లేకపోవటాన్ని విశారద గమనించింది. దానికి కారణం కరెక్టుగా ఊహించింది కూడా. తన తల్లి ఆశయం అతడిని దెబ్బకొట్టటం కాదు. అంతకన్నా పెద్దది. అది సమాజం గురించి! అంత పెద్ద ఆశయం ముందు ధనుంజయరావు వ్యవహారం చాలా చిన్నది.

సరస్వతి మాటలకి అతడు ఆమెవైపు సానుభూతిగా చూస్తూ అన్నాడు. "నా ఆలోచనలు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఒకేలా వున్నాయి సరస్వతీ! వాటిలో

మార్పులేదు. ఎందుకంటే, నువ్వు అనుకున్నట్టు నా అసలు పేరు ధనుంజయ కాదు. నేను మీ వర్గపు మనిషిని కూడా కాదు. మీ పార్టీ ధనంజయ ఎవరో నాకు తెలీదు".

వెనుకనుంచి సూటిగా ఒక బాణం వచ్చి అమాయకంగా పచ్చిక మేస్తున్న లేడిపిల్ల నడుముని నిలువుగా చీల్చినట్టు ఆమె విలవిలలాడిపోయింది.

అతడు నవ్వేడు.

"నేను కలకత్తాలో దొంగ వ్యాపారం చేసేవాడిని. ఒక హత్యానేరంలో ఇరుక్కుని, పారిపోయి మీ వూరు వచ్చాను. ఎక్కడయినా కొన్నాళ్ళపాటు తలదాచుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ సమయంలోనే పర్వతాలు పరిచయం అయ్యాడు. నన్ను ధనుంజయని అనుకున్నాడు. ఆ అవకాశాన్ని నేను ఉపయోగించుకున్నాను. మీరు నాకు ఆశ్రయమిచ్చారు. నాకు అది బాగానే వుందనిపించింది. గొప్ప తెలివితేటలూ, అవగాహనా వున్నట్టు మాట్లాడేవాడిని. నా ఒంటరితనాన్ని పోగొట్టటానికి నువ్వు నాకు దగ్గరవటంతో రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు అయింది. పోలీసులు ఆ రాత్రి నన్ను వెంటాడినప్పుడు పారిపోయాను. ఈ లోపల అసలు ధనుంజయను చంపేశారు. నాకేమో ఈ పేరు కలిసి వచ్చినట్టు అనిపించింది. తిరిగి కలకత్తా వెళ్ళకుండా ఇక్కడే వ్యాపారం మొదలు పెట్టాను. కోట్లు సంపాదించాను...." అంటూ అతడు చెప్పడం పూర్తి చేశాడు.

లాకప్ రూమ్‌లో నేరస్తుడిని చంపేసిన తరువాత – పోలీస్ స్టేషన్‌లో ఏర్పడే శ్మశాన నిశ్శబ్దం ఆ గదిలోనూ వ్యాపించింది. విశారద స్థాణువై చూస్తోంది. అయితే సరస్వతి మొహం మాత్రం అతని మాటలు అర్థమవుతున్న కొద్దీ క్రమంగా

తేటబారింది.... "నాకిప్పుడు సంతోషంగా వుంది" అంది తేలికపడినట్టు. "....కనీసం మా వాళ్ళెవరూ మమ్మల్ని మోసం చేయలేదు. మా వాళ్ళమీద నాకున్న నమ్మకం వమ్ముకాలేదు" అని ఆగి, చివరగా అన్నది–

"కర్ణుడి చావుకి మరో కారణం ఈ రోజు తెలుసుకున్నాను! గమ్యంవైపు పారిపోయే నదికి, ఇరుపక్కల నుంచీ మురిక్కాలవలు వచ్చి చేరినట్టే, నీలాటి లుచ్ఛాలు మాలో చేరబట్టే మా ఉద్యమం ఆలస్యమవుతుంది"అని ఆ గదిలోంచి బయటకు వచ్చేసింది.

* * *

చాలాసేపటివరకూ విశారదకి తాము ఎక్కడికి వెళుతున్నామో అర్థంకాలేదు.

అరగంట నడిచి, వాళ్ళు పోలీస్ స్టేషన్‌లో ప్రవేశించారు. ఇన్‌స్పెక్టర్ ముందు మొహం చూడటానికి కూడా అంత శ్రద్ధ చూపించలేదు. ఆమె ధనుంజయ పేరు చెప్పేసరికి అటెన్షన్‌లోకి వచ్చాడు. సరస్వతి అంతా చెప్పి, "ఇన్‌స్పెక్టర్ గారూ! పధ్నాలుగు సంవత్సరాల క్రితం వ్యవహారమిది. మీరు కలకత్తాకి ఈ వార్త పంపితే మొత్తం వ్యవహారమంతా బయటపడుతుంది..." అని చెప్పింది.

విశారద అనాసక్తంగా ఇదంతా వింటూంది. ఇంతక్రితం ప్రత్యక్షంగా చూసిన సంఘటన తాలూకు షాక్ నుంచి ఆ అమ్మాయి యింకా తేరుకోలేదు. కొంచెం సేపు గది చుట్టూ చూసింది. గోడలకి గాంధీ, నెహ్రూల బొమ్మలున్నాయి. మసకబారి, బూజుపట్టి ఆ ఫోటోలే లాకప్పులో ఖైదీల్లా వున్నాయి. ఆ తరువాత ఆ

అమ్మాయి ఇన్‌స్పెక్టర్ టేబిల్‌పై వున్న ప్లేటు మీద అతని పేరు చదివింది. 'సింహాచలం' అని వుంది.

ఈ లోపులో సరస్వతి చెప్పటం పూర్తిచేసింది. ఆమె చెప్పిందంతా విని, "కొంచెం కూర్చోండి. ఇప్పుడే వస్తాను" అని లోపలికి వెళ్ళాడు సింహాచలం. రెండు నిముషాలు గడిచాక సరస్వతి కూతురితో, "నాకేదో అనుమానంగా వుంది శారదా" అంది. విశారద లేచి కూజాలో మంచినీళ్ళు కోసం వెళ్ళినట్టు వెళ్ళివచ్చి "ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నాడమ్మా" అంది.

"మనం వెళ్ళపోదాం పద" అంది సరస్వతి. ఇద్దరూ నిశ్శబ్దంగా బయటకొచ్చేశారు.

సింహాచలం చాలా ఆనందంగా వున్నాడు. ధనుంజయలాటి కోటీశ్వరుడి వెనుక కథ పట్టుకోవటం అంటే మాటలు కాదు. బంగారు గుడ్లు పెట్టే బాతు దొరికినట్టే. అందుకే ఫోన్ చేశాడు.

శత్రుశేషాన్ని అసలు వుంచదల్చుకోలేదు ధనుంజయ. సరస్వతి బ్రతికి వుండడం ఎప్పటికయినా ప్రమాదమని అతడికి తెలుసు. ఆ రాత్రి అకస్మాత్తుగా ఎందుకో మెలకువ వచ్చిన విశారద సత్రం దగ్గర మోటార్ సైకిల్స్ ఆగటం చూసి, తల్లిని లేపింది. అప్పటికే వాళ్ళు 'మెట్లెక్కు'తున్నారు. సత్రం అరుగుమీద బిచ్చగాళ్ళు కకావికలయిపోయారు. చాలా దారుణమైన సంఘటన అది. హృదయవిదారకమైన దృశ్యం అది. చెట్లలోనూ, తుప్పల్లోనూ, నిస్సహాయమైన జంతువుని పులుల మంద వేటాడినట్టు వెంటాడారు. 'అరవకమ్మా, అరిస్తే నువ్వా బ్రతకవు...' అని తల్లి అంతకుముందే హెచ్చరించటం వలన, శారద సాక్షి

మాత్రమే అయింది. తల్లి శరీరంలో కత్తులు దిగటాన్ని నీళ్ళు నిండిన కళ్ళతో చూసింది.

వాళ్ళు శవాన్ని కూడా మిగల్చదల్చుకోలేదు. శ్మశానంలో అర్ధరాత్రి స్వయంగా తవ్వి పాతిపెట్టేరు. చేతులు పూర్తిగా కడుక్కుని వెళ్ళిపోయారు.

అంతా చూస్తున్న విశారద ఒంటరిగా మిగిలింది శ్మశానంలోనూ, జీవితంలోనూ...

అక్కణ్ణించి నెహ్రూ బొమ్మ పక్కగా, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వీధిలోకి వచ్చి, గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కి సంబంధించిన ధర్మరాజు చేతుల్లో ఇరుక్కుంది.

అదీ జరిగిన కథ.

* * *

హోం మినిష్టర్ చెప్పిన కథకి తను చూసింది అన్వయించుకోగా, విశారదకి మొత్తం కథ తెలిసింది. ఆమెకేమీ ఉత్తేజం కలుగలేదు. ఉద్విగ్నత గానీ, ఆవేశం గానీ రాలేదు. అలా రావటానికి జీవితం – చలన చిత్రం కాదు. గత పుస్తకాల ఆధారంగా, భవిష్యత్ పరీక్షలు వ్రాయటానికి, వర్తమానం చెపుతూన్న పాఠం.

పర్వతాల నాయుడు చాలా బాధపడిన మాట నిజమే. బహుశా ఆ బాధలో నిజాయితీ కూడా వుండి వుండవచ్చు. కానీ నిశ్చయంగా, నిశ్చయాతి నిశ్చయంగా అది తాత్కాలికమే.

పోతే – పాత సంఘటనలు గుర్తుకువచ్చి – మనస్సు అట్టడుగు పొరల్లో ఏదో నిజాయితీ కదిలి, సరస్వతిని తల్చుకుని ఏడ్చాడంతే.

తాను వెళ్ళిపోగానే, ఇంకో గంటలో తేరుకుని, ఇంకో అమ్మాయి కోసం కబురు చేసినా ఆశ్చర్యం లేదు. ఇంకో నెలరోజులు పోయాక ఏదో మందుపార్టీలో దీన్నో అద్భుతమైన సంఘటనగా స్నేహితులకి వర్ణించి చెప్పినా ఆశ్చర్యపోనవసరం లేదు.

ఇదంతా ఒక రకంగా మేలే అయింది. జైల్లో పుట్టి – కోర్టులో ఈడేరిన తనకి – ప్రభుత్వ గృహంలో శోభనం జరగలేదు. అంతవరకూ నయం.

...పోలీసు జీపు వెనుక సీటులో కూర్చొని జైలుకి తిరిగి వెళ్తూన్న విశారద, తన చేతిలో వున్న విజిటింగ్ కార్డ్‌ని మరోసారి చూసుకుంది. 'జైలు నుంచి బయటకు రాగానే నన్ను కలుసుకో, నీకే లోటూ రాకుండా చూసే బాధ్యత నాది' అంటూ హోం మినిష్టర్ ఇచ్చిన విజిటింగ్ కార్డ్ అది.

...విశారదకి తన తల్లి గుర్తొచ్చింది.

"నా ఈ రెండు చేతుల్లో కనీసం ఒక్క చేతికి కదిలే శక్తివున్నా, ఇలా అడుక్కుతింటూ నిన్ను సత్రం అరుగుమీదా, వంతెనల క్రిందా పడుకోబెట్టేదాన్ని కాదు. 'శ్రమ' కి విలువ ఏమిటో చెప్పేదాన్ని" అన్న తల్లి మాటలు గుర్తొచ్చాయి.

పర్వతాల నాయుడు ఒకప్పుడు అడవికీ, పల్లెకీ, వంతెన వేసినవాడు. ప్రస్తుతం పోలిటిక్స్‌కి, పొజిషన్‌కి వంతెన వేస్తున్నాడు.

ఆ వంతెన క్రింద తను ఆశ్రయం తీసుకోదు.

...వెళ్తున్న జీపులోంచి ఆమె విజిటింగ్ కార్డుని విసిరేసింది.

# 7

**గోమతి** ఓణీ అంచు చిరిగిపోతే కుట్టుకుంటూంది. విరిగిపోవటానికి సిద్ధంగా వున్న కుర్చీలో కూర్చుని పరమేశ్వర శాస్త్రి రామకోటి వ్రాసుకుంటున్నాడు. అహల్య ఒక మూల గోడకి ఆనుకుని కూర్చుని చేటలో బియ్యం ఏరుతూంది. లక్ష్మి శారద పెరట్లో స్నానం చేస్తోంది. రేడియోలో హోమ్ మినిష్టర్ పర్వతాల నాయుడు స్పీచ్ ఏదో వస్తోంది.

శాస్త్రిగారి పెద్దకొడుకు రామ్మూర్తి రెండ్రోజుల్నుంచీ నిరాహారదీక్ష చేస్తున్నాడు. బొంబాయి ఇంటర్వ్యూకి వెళ్ళటానికి తండ్రి డబ్బు లివ్వలేదని అలిగి భోజనం మానేసేడు. 'ఆ ఉద్యోగం ఎలాగూ రాదు, ఎందుకంట డబ్బు వేస్టు' అంటే వినడు. 'మీరు నాకెలాగూ ఉద్యోగం చూపించరు. నేను చూసుకుంటానంటే సాయం కూడా చెయ్యరు' అని గట్టిగా అరిచాడు.

"ఒరేయ్ అన్నయ్యా! ఆ వెయ్యి రూపాయల జీతం కోసం ఇక్కణ్ణుంచి బొంబాయి వెళ్ళటం ఎందుకు చెప్పు? నీలాంటివాళ్ళు చాలామంది వస్తారు. నీకు నిజంగా ఉద్యోగం కావాలంటే నాన్నే చూపించాలా? తెల్లవారుఝాము నుంచీ అర్ధరాత్రి వరకూ చిన్నన్నయ్య చేయటంలా?" అంది గోమతి. దాంతో అలిగి భోజనం మానేశాడు. మానెయ్యటం అంటే పూర్తిగా కాదు. రాత్రి పెట్టిన అన్నం గిన్నెలో ప్రొద్దున్నకి తక్కువ వుండేది. అది చూసి గోమతి నవ్వుకుంది. తండ్రికి కూడా చెప్పింది. తన నిరాహారదీక్షని ఎవరూ సీరియస్‌గా తీసుకోకపోవటంతో మరింత అలిగాడు రామ్మూర్తి.

"నేను చదువుకున్నాను. అలా పాలపాకెట్లూ, సోడా అమ్మలేను" అన్నాడు.

అహల్య కల్పించుకుని "బోసూ నీలాగే చదువుకున్నాడు. ఆ మాటకొస్తే నాన్నగారూ నీకన్నా ఎక్కువ సంస్కృతమే చదువుకున్నాడు. సాయంత్రం పూట సారాకొట్లో లెక్కలు వ్రాయటంలే?" అంది. దాంతో రామ్మూర్తి మరింత ఇరిటేట్ అయి, ఆ ఆవేశంలో – "మొగుడు వదిలేసిన దానివి. నువ్వు కూడా నాకు చెప్పొచ్చావుటే " అన్నాడు అసహ్యంగా.

ఆ మాటలకి అహల్య ఏడుస్తూ కూర్చుంది. గోమతే అక్కయ్యని ఓదార్చింది. 'ఇంత చిన్న వయసులో ఈ పిల్లకి ఎంత పెద్దరికం వచ్చిందీ! బహుశా పరిస్థితులే ఆడపిల్లలకి ఈ విషయాలన్నీ నేర్పుతాయేమో' అనుకున్నాడు.

ఆయన రామకోటి వ్రాయటం పూర్తిచేసి, వేళ్ళు విరుచుకుంటూండగా గుమ్మంలో పొడవాటి నీడ పడింది, తలెత్తి చూశాడు.

"బోసు వున్నాడా?" ఆ గొంతు బొంగురుగా, కర్కశంగా వినిపించింది.

పెరట్లో స్నానం పూర్తి చేసి, తడిక మీదనుంచి తీసి లంగా వేసుకోబోతున్న లక్ష్మీ శారద ఆ కంఠం ఎక్కడో విన్నట్టుందే అనుకుంది.

"లేడు, షాపు కెళ్ళాడు" పరమేశ్వరశాస్త్రి సమాధానమిచ్చాడు.

"శారదుందా?"

స్నానాల గదిలో లక్ష్మీ శారద వొణికింది. అంత ఆరుబయట.... అప్పుడే స్నానం చేసినా కూడా – నగ్నంగా వున్న ఆమె వొళ్ళు చెమటతో క్షణాల్లో తడిసిపోయింది ఆ గొంతు ఎవరిదో గుర్తుపట్టి.

అది మస్తాన్‌ది.

ఆమె లోపలే ఆగిపోయింది.

"శారదుందా అని అడుగుతున్నాను. వినబడ్లేదా?" గద్దించాడు. శాస్త్రి ఏదో సమాధానం చెప్పబోయేలోపులో "లేదు" అని వెనుకనించి సమాధానం ఇచ్చింది గోమతి.

"ఎప్పుడో వెళ్ళిపోయింది".

"ఎక్కడికి?"

"మాకు తెలీదు".

"బోసు ఎప్పుడొస్తాడు?"

"అర్ధరాత్రి దాటాక" భయం భయంగా సమాధానం ఇస్తున్నారు కుటుంబ సభ్యులు.

"ఆ శారదని ప్రపంచంలో ఎక్కడున్నా సరే... వదిలి పెట్టను" అన్నాడు – మధ్యలో ఒక బూతు మాట ఉపయోగిస్తూ. ఎవరూ మాట్లాడలేదు. మళ్ళీ తనే అన్నాడు. "నీ కొడుకు దొంగచాటున నా మోకాలు మీద కొట్టాడు. ఇంతవరకూ నా మీద ఎవరూ చెయ్యి ఎత్తలే, వాడి రక్తం కళ్ళ చూడాల".

"అయిపోయిందేదో అయిపోయింది. వాడు కుర్రవాడు. వదిలిపెట్టు బాబూ..." అన్నాడు పరమేశ్వరశాస్త్రి. ఆయన మాట పూర్తి కాకుండానే "వొదిలిపెట్టటమా? ఆ లం....కొడుకు నోట్లోంచి రక్తం కక్కించయినా సరే శారద ఎక్కడుందో కనుక్కుంటాను. అది నా సరుకు. ప్రపంచంలో ఎక్కడున్నా అనుభవించకుండా వదల్ను".

"మాకు తెలీదన్నాంగా!"

"ఆ పైనున్నోడికి తెలియకుండా వుండదు. వాడిచేత నే చెప్పిస్తాగా. వాడి కాలో, చెయ్యో తీసెయ్యటం ఖాయం. ఇన్నాళ్ళూ అడ్రసు దొరకనిది ఆడి అదృష్టం. రేప్రొద్దున్న ఎనిమిదింటి లోపల ఆడు నా అడ్డా కొచ్చి కనపడాల. ఆ విషయం ఆడితో చెప్పండి. శారదని తీసుకొచ్చి నా కప్పగిస్తే సరే... లేకపోతే... చూసుకుంట..." అని వెళ్ళబోయి ఆగాడు. ఒకసారి నలుగురివైపు చూసి, గోమతి దగ్గరగా నడిచి, ఆ అమ్మాయిని భుజం పట్టుకుని లేపాడు.

గోమతి గట్టిగా కేకవేయబోయింది. మెడమీద చెయ్యివేసి దగ్గరగా లాక్కుని పెదాలు కమిలిపోయేలా గట్టిగా ముద్దు పెట్టుకుని బుగ్గ కొరికి వదిలేశాడు. ఆ చిన్నపిల్ల ఈ హఠాత్ సంఘటనకి బెదిరిపోయి, అలాగే నేలమీద స్పృహ తప్పి కూలిపోయింది.

అందరూ బిత్తరపోయి చూస్తున్నారు.

"రేపు ఎనిమిదింటి లోపల ఆడు నా దగ్గరికి శారదతో గానీ కలిసి రాకపోతే తొమ్మిదింటికి నేనొస్తా. ఈసారి ఒక్కణ్ణే రాను, ఇద్దరాడోళ్ళున్నారుగా! నలుగుర్ని తీసుకొస్త. ఒక్కొక్కళ్ళకి ఇద్దరు..." అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

ఇంకా ఎవరూ ఆ షాక్ నుంచి తేరుకోలేదు.

రాష్టంలో శాంతిభద్రతల మీద హోమ్ మినిష్టర్ ఉపన్యాసం రేడియోలో పూర్తయింది.

లక్ష్మీ శారద గబగబా చీరె కట్టుకుని వచ్చేసరికి ఆ గదిలో ఇంకా అందరూ అలాగే వున్నారు. ఎవరూ తేరుకోలేదు. మస్తాన్ వెళ్ళిపోయి అప్పటికి మూడు నిముషాలైంది.

"ఏం జరిగింది?" అని అహల్యని అడిగింది. ఆమె సమాధానం చెప్పలేదు. రామ్మూర్తి ఏదో పని వున్నవాడిలా అక్కడనుంచి లేచి వెళ్ళిపోయాడు. ఈ లోపులో గోమతి తేరుకుంది.

"ఎవరో వచ్చి గొడవ చేసి వెళ్ళార్లే" అంది అహల్య.

"ఆ రౌడీ కంఠంలా వినిపించింది" అంది శారద.

"అవునమ్మా వాడే వచ్చాడు. నువ్వు ఇంట్లో లేవనీ, ఎప్పుడో వెళ్ళిపోయావనీ చెప్పాం-" అన్నాడు పరమేశ్వరశాస్త్రి. ఆమె మొహం మ్లానమయింది.

ఆ రాత్రి ఎనిమిదింటికి బోసుబాబు షాపు నుంచి వచ్చాడు. వచ్చిన రెండు నిముషాల్లోనే అందరూ అదోలా వుండటాన్ని గమనించి ఏమైందని అడిగాడు.

ఒకళ్ళ మొహాలు ఒకరు చూసుకున్నారు.

శారద తలదించుకుని "సాయంత్రం మస్తాను వచ్చాడు" అంది. బోసుకి ఒక్కసారిగా నిస్సత్తువ కలిగినట్టు కుర్చీలో కూలబడ్డాడు. గోమతి మంచినీళ్ళు తీసుకొచ్చి ఇచ్చింది.

"ఏమన్నాడు?" నీళ్ళు తాగి గ్లాసు కింద పెడుతూ అడిగాడు.

"'శారద ఎక్కడ?' అని అడిగాడు. 'వెళ్ళిపోయింది. ఎక్కడుందో మాకు తెలీదు' అన్నాం. అప్పుడు తను లోపల స్నానం చేస్తోంది".

"తరువాత?"

"శారద ఎక్కడుంటుందో నీకు తెలుస్తుందనీ, రేప్రొద్దున్నలోగా తన అడ్డాకొచ్చి చెప్పకపోతే.." గోమతి ఆగింది.

"ఊ!....చెప్పకపోతే..." అడిగాడు బోసుబాబు.

గోమతి తటపటాయించింది.

బోసుబాబు ప్రశ్నకి సమాధానంగా రామ్మూర్తి కల్పించుకుని, "రేప్రొద్దున్నలోగా వాడి దగ్గరకి నువ్వెళ్ళకపోతే రౌడీల్ని తీసుకొచ్చి మనింటి మీద పడతాడట. నువ్వు వాడి కాలిరగ్గొట్టావుటగా?" అన్నాడు.

"అవును. పొరపాటున తగిలింది. అలా కొట్టకపోతే వాడు మమ్మల్ని వదిలిపెట్టేవాడు కాదు".

"దానికి బదులు తీర్చుకోవటానికి రేప్రొద్దున్న వస్తానన్నాడు. వాళ్ళ సంగతి నాకు బాగా తెలుసు. పొలిటికల్ సపోర్టు కూడా బాగా వుంది" రామ్మూర్తి చెప్పటం ఆపుచేసిన తరువాత అక్కడెవరూ మాట్లాడలేదు. చాలా పాథెటిక్ వాతావరణం అది. ఒక నిస్సహాయమైన బీద కుటుంబం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా పెద్ద సమస్యల్లో ఇరుక్కుపోయింది. అప్పటివరకూ పోలీస్ స్టేషన్ మొహం చూడని ఇంటివాళ్ళ దగ్గరకు పోలీసొచ్చి, "ఇన్‌స్పెక్టర్ గారు ఒకసారి రమ్మంటున్నారు" అని చెప్తే, ఆ భయం వర్ణించలేనంతగా వుంటుంది. తమ పనేదో తాము చేసుకుపోయేవాళ్ళకి మొట్టమొదటిసారి కోర్టు నోటీసొస్తే ఆ భయం చెప్పనలవిగానిది.

ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పరమేశ్వరశాస్త్రి లేచి, "రేప్రొద్దున్న వరకూ టైముంది. ఆలోచిద్దాం. కావాలంటే ప్రొద్దున్నే అందర్నీ మా పెద్దన్నయ్య ఇంటికి పంపుదాం" అన్నాడు అంతకన్నా చేసేదేమీ లేనట్టు.

బోసు చెప్పులేసుకుని బయటకు వెళ్ళబోయాడు.

"ఎక్కడికిరా ?"

"ఇప్పుడే వస్తాను" అని బయల్దేరాడు. నాలుగు ఫర్లాంగుల దూరంలో పోలీస్ స్టేషన్ వుంది. అక్కడికి వెళ్ళాడు.

అప్పుడే ఎలక్షన్లలో ఓడిపోయిన పార్టీ కార్యాలయంలా వుంది ఆ పోలీసు స్టేషను. తెల్లవారుఝాము వరకూ పనిచేసి అలసిపోయిన వేశ్యా గృహంలా వుంది. న్యాయాన్ని నిలబెట్టటానికీ, బలహీనుల్ని బలవంతులబారినుంచి కాపాడటానికీ అక్కడెవరూ లేరు. సగం మంది మంత్రుల కార్లు వెళ్ళే రోడ్ల మీద డ్యూటీలో వున్నారు. మిగతా సగం పక్కనే జరుగుతున్న షూటింగ్ దగ్గర జనాన్ని కంట్రోలు చేయటానికి వెళ్ళారు. ఇద్దరు అరుగుమీద ఒక మూల పులిజూదం ఆడుకుంటున్నారు. సెంట్రీ అడ్డుపెట్టలేదు. బోసుబాబు సరాసరి లోపలికి వెళ్ళాడు. లోపల ఇన్‌స్పెక్టరున్నాడు. అతని పేరు రాధాకృష్ణమాచారి. నుదుటున చిన్న బొట్టుంది. బోసు వెళ్ళేసరికి సంతోషిమాత చైన్ ఉత్తరాలు వ్రాసుకుంటున్నాడు. బోసు రావటం చూసి, ఉత్తరాలు డ్రాయరులోకి తోసేసి, "చెప్పండి" అన్నాడు తేలిగ్గా.

బోసుబాబు కూర్చుని "మీకు మస్తాన్ అనే రౌడి తెలుసనుకుంటాను" అన్నాడు.

"క్రితం ఏడాది కౌన్సిలర్‌గా నిలబడ్డారు. ఆయనేగా?"

"నేను చెప్పేది మట్కా మస్తాన్ గురించండీ?"

"నేను చెప్పేదీ ఆయన గురించే. చెప్పండీ" అన్నాడు రాధాకృష్ణమాచారి.

"ఆయన మా ఇంటికొచ్చి బెదిరించాడు. రేప్పొద్దున్నలోగా నన్ను చిత్రవధ చేస్తానని".

ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా "ఎందుకు?" అన్నాడు.

బోసుబాబు అంతా వివరంగా చెప్పి, చివరగా అన్నాడు.

"మస్తాన్ మమ్మల్ని బెదిరిస్తున్నాడు. మా నాన్నగారయితే ఆడవాళ్ళందర్నీ ఎక్కడికయినా పంపించి ఇల్లు ఖాళీగా ఉంచుదామంటున్నారు. అంతలా బెదిరిపోయారు మా వాళ్ళు. ఆ మస్తాను రేప్రొద్దున్నే మా యింటికి వస్తానన్నాడట. ఏం చెయ్యమంటారు?" అని అడిగాడు. ఇన్‌స్పెక్టర్ ఒక క్షణం ఆలోచించి. "రేప్రొద్దున్నే ఒక పోలీసుని మీ ఇంటికి పంపుతాను. పోలీసుంటే అతను కూడా ఏమీ గొడవ చెయ్యడులెండి" అన్నాడు.

"అప్పుడు వెనక్కిపోయి తిరిగి సాయంత్రం వొస్తే?"

"దానికి నేనేం చెయ్యను?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణమాచారి.

"మరి మమ్మల్ని ఏం చెయ్యమంటారు?" బోసు అడిగాడు. ఈలోపులో ఫోన్ మ్రోగింది. ఇన్‌స్పెక్టర్ రెండు నిముషాలు మాట్లాడి ఒక కానిస్టేబుల్‌ని లోపలికి పిలిచి, "ఇక్కడ వెటర్నరీ హస్పటల్ డాక్టరు గారిల్లు నీకు తెలుసటగా " అన్నాడు.

"తెలుసు సార్ . మన స్టేషన్ ఏరియాలోనే"

"యస్పీగారి కుక్కకి సాయంత్రం నుండీ వాంతులవుతున్నాయట. వాళ్ళ బంగ్లాకెళ్ళి దాన్ని తీసుకుని డాక్టరు గారి దగ్గరకెళ్ళు" అన్నాడు. కానిస్టేబుల్

సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు. ఇన్‌స్పెక్టర్ బోసువైపు తిరిగి, "ఊఁ చెప్పండి" అన్నాడు.

"నేనేం చెప్పను? మీరే చెప్పాలి".

"చూడండి. సాధారణంగా ఇటువంటి కంప్లెయింట్స్ మేము పట్టించుకోము. ఏ గొడవా జరక్కముందే ఒక పోలీసుని మీ దగ్గర డ్యూటీ వేస్తున్నానంటే కేవలం మీ మీదున్న మంచి అభిప్రాయంతో... మీరే ఆలోచించి చూడండి. ప్రతి చిన్న గొడవకీ పోలీసుల్ని రక్షణగా పంపటం మొదలు పెడితే మా స్టేషన్‌కి ఎంతమంది కావాలి? మాకూ పన్లుంటాయి కదా?"

"నిజమే" అన్నాడు బోసుబాబు. "పోనీ మీరా మస్తాన్‌తో మాట్లాడండి. ఇలా ఇళ్ళ మీద కొస్తే మాట దక్కదని చెప్పండి".

"కానీ మీరతన్ని కొట్టారు".

ఊహించని ఈ స్టేట్‌మెంట్‌కి బోసు అవాక్కయి, "నేను కొట్టాలని కొట్టలేదు. అతనా అమ్మాయిని బలవంతంగా తీసుకుపోతుంటే విడిపించానంతే. ఆ సమయంలో అతన్ని పడేయవలసి వచ్చింది".

"అలాంటి విషయాల్లో పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చెయ్యాలి. మీరే చెయ్యి చేసుకోకూడదు".

"అప్పటివరకు అతను అక్కడే రోడ్డు మీద ఆ అమ్మాయితో మాట్లాడుతూ నిలబడి వుండడు కదండీ".

"మీకు నేను చెప్పేది అర్థంకావటం లేదనుకుంటాను. అతను మీ ఇంటికి రేపు వచ్చి గొడవ చెయ్యబోతున్నాడనే కంప్లెయింటు మీద నేను ఏమీ చేయలేను.

కాని మీరతన్ని కొట్టారనే కంప్లెయింటు అతను గానీ ఇస్తే మిమ్మల్ని అరెస్టు చేయవలసి వుంటుంది".

ఈ మాటలకి బోసు కొంచెం సేపు వూరుకొని, "మీరు చెప్పింది నిజమే అయిన పక్షంలో అతను కూడా నేను చెయ్యి చేసుకోగానే వచ్చి మీ దగ్గర రిపోర్టు చేయాలి కదండీ. ఇలా ఇళ్ళమీదకి రావటం దేనికి?"అన్నాడు.

ఇన్స్పెక్టర్ రాధాకృష్ణమాచారి ఈ తర్కానికి ఖంగుతిన్నాడు. వెంటనే సర్దుకుని "అతడు బహూశా మీతోనే విషయం తేల్చుకోవాలనుకుని వుంటాడు" అన్నాడు.

బోసుకి ఇంకేం మాట్లాడాలో తెలియలేదు. లేచి నిలబడి నమస్కారం చేసి "వెళ్ళొస్తాను ఇన్స్పెక్టర్ గారూ" అన్నాడు.

"ఐయామ్ సారీ!"

"దేనికండీ?" నిజాయితీగా అన్నాడు బోసు. "అసలు మీరింత సౌమ్యంగా మాట్లాడతారని నేననుకోలేదు. అయితే నా కొక్కవిషయమే అర్థంకాలేదు. ఒక రౌడీ మా విషయం మాతోనే తేల్చుకోవాలనుకుంటే మీరేమీ మధ్యలో అడ్డురారు. ఒక అన్యాయం జరుగుతూంటే మధ్యలో మేము అడ్డువెళ్ళకుండా మీకు రిపోర్టు చేయాలి. ఏమిటో... ఇదే నాకు సరీగ్గా అర్థం కావటం లేదు" అంటూ అక్కడనుంచి బయటకు నడవబోయాడు.

"బోసుబాబు గారూ..." పిల్చాడు ఇన్స్పెక్టర్. "ఒక్క నిముషం కూర్చోండి".

బోసు ఆశ్చర్యపడుతూ కూర్చున్నాడు. ఇన్స్పెక్టరు కొంచెంసేపు మౌనంగా వూరుకుని అన్నాడు. "మస్తాన్‌తో నన్ను మాట్లాడమని మీరన్నారు. నేను చెబితే అతను వూరుకోకండి. అతని సంగతి నాకు బాగా తెలుసు".

"నన్ను వెళ్ళి క్షమాపణ చెప్పుకోమంటారా?"

"ఒక రకంగా అది మంచిది. కానీ అతని సంగతి నాకు బాగా తెలుసు, పాములాంటివాడు" అని మళ్ళీ ఆగి, "...ఆ శారదని ఎక్కడికయినా పంపించి వేయండి" అన్నాడు.

బోసుకి కోపం వచ్చింది... "ఇదా మీరిచ్చే సలహా?" అన్నాడు.

"మీ మంచి కోసం చెప్పాను. తరువాత మీ ఇష్టం".

"అతను నా స్వంత చెల్లెల్నో, అక్కనో అలా చేసివుంటే?"

"లాజిక్కులు అడక్కండి. మీ మంచి కోరి చెప్పాను, తరువాత మీ ఇష్టం. ఇక్కడ ఆ మస్తాను గురించి మీక్కొంచెం చెప్పాలి. మీకు ధనరాజ్ తెలుసా?"

"వాడెవడు?"

"ధనరాజ్ మొదలియార్. ఈ రాష్ట్రానికి అతనే కింగ్ పిన్. అతని అనుమతి లేకుండా ఇక్కడకి వందరూపాయల జపనీస్ ట్రాన్సిస్టర్ కూడా ప్రవేశించలేదు. అతని చేతి క్రింద ప్రతి టౌన్‌లోనూ ఏజెంట్లు వుంటారు. ఈ వూరి ఏజెంటు మస్తాను".

బోసుకి ఈ టాపిక్ ఎటు వెళ్తొందో అర్థంకాలేదు. కానీ ఎందుకో.. ఒక అగాధంలోకి జారుతున్న భావం కలిగింది. ఈ లోపులో రాధాకృష్ణమాచారి అన్నాడు... "నేను ఆ మస్తాన్‌ని నాలుగు తన్ని లాకప్‌లో వేయించగలను. నాకూ

అక్కా చెల్లెళ్ళున్నారు. దైవభక్తి వుంది. చెప్పానుగా మీరంటే నాకు గౌరవం, అభిమానం ఏర్పడ్డాయని".

"చెప్పారు. అందుకే ఇంతసేపు కూర్చోబెట్టి మాట్లాడుతున్నాను అని కూడా అన్నారు."

ఆ మాటల్లో శ్లేష గుర్తించకుండా ఇన్స్పెక్టర్ కొనసాగించాడు... "ధనరాజ్ మొదలియార్ తన వాళ్ళ మీద ఈగ వాలినా సహించడు. అతనికి ఆసిడ్ కింగ్ అని కూడా పేరుంది. నేను మస్తాన్ మీద చెయ్యి చేసుకున్నానని తెలిసిన మరుక్షణం అతను రియాక్ట్ అవుతాడు. అంటే నన్ను ట్రాన్స్ఫర్ చేయించటం, సస్పెండ్ చేయించటం లాటివి కాదు. మా ఇంట్లోవాళ్ళ మీదో, నా మీదో హఠాత్తుగా ఎవరో వచ్చి ఆసిడ్ పోసి వెళ్ళిపోతారన్న మాట. ఇంకే కేసూ వుండదు. ఇద్దరు ముగ్గురు పోలీసు ఆఫీసర్లకి అలాగే జరిగింది. ఆ ఆఫీసర్లూ చిన్న రాంకులో వాళ్ళు కాదు, యస్పీ లెవల్లో వాళ్ళు".

"మీరూ ఆ ధనరాజ్ మీద ఆసిడ్ పొయ్యొచ్చుగా "?

రాధాకృష్ణమాచారి దెబ్బతిన్నట్టు చూసి "జోకు లేస్తున్నారా?" అన్నాడు.

"లేదు. ఊరికే అన్నాను, చెప్పండి".

"హోం మినిష్టర్ పర్వతాల నాయుడికీ మొదలియార్కి దగ్గర సంబంధాలున్నాయి. నాయుడ్ని చీఫ్ మినిష్టర్ని చేయాలని మొదలియార్కి దగ్గర ఆశయం. ముఖ్యమంత్రికీ, నాయుడికీ పడదు. ఒక రకంగా చెప్పాలంటే పర్వతాల నాయుడు అసమ్మతి వర్గం అన్నమాట".

"మొదలియార్ స్మగ్లర్ అని మీరే అంటున్నారు. ముఖ్యమంత్రి తల్చుకుంటే అతని ఆట కట్టించటం పెద్ద కష్టమైన పని కాదనుకుంటున్నాను. ఒక్కసారి మొదలియార్ పోతే, పర్వతాల నాయుడి వెన్నెముక విరిగినట్టేనా. అసమ్మతి వర్గం పోతుంది..."

"చాలా కరెక్టుగా చెప్పారు. కానీ ఈ మెదలియార్‌కీ, కేంద్రానికీ మధ్య లింకుగా ఇంకొక వ్యక్తి వున్నాడు. అతను ప్రధానమంత్రికి చాలా దగ్గర. ఆ పార్టీకోసం కోట్లు ఖర్చు పెడతాడు... పోతే కేంద్రంలో అధికారంలో వున్న పార్టీయే రాష్ట్రంలో కూడా వుంది కాబట్టి, మన ముఖ్యమంత్రి మొదలియార్‌ని ఏం చేసినా... ప్రధానమంత్రి ఆశీస్సులు కోల్పోతాడు. అందుకని అసమ్మతి వర్గాన్ని చూసీ చూడనట్టు వూరుకోవాల్సిందే".

"ఈ మొదలియార్‌కీ, కేంద్రానికీ మధ్య లింకుగా వున్న వ్యక్తి ఎవరు?"

"జె.డి.జె."

బోస్ ఆశ్చర్యంగా, "మీరు చెప్పేది జె.డి.జె. ఇండస్ట్రీస్ ధనుంజయ గురించా?" అని అడిగాడు "అవును. అతడి మహాసామ్రాజ్యంలో ఆ ఇండ్రస్ట్రీ ఒక నీటిబొట్టు మాత్రమే. అతడికి సి.ఐ.ఎ.తో కూడా సంబంధాలున్నాయంటారు. గౌరవనీయమైన వ్యాపారాలు, విదేశీ సంబంధాలు, దేశ రాజకీయాల్లో పనులూ... అన్నీ ధనుంజయ చూసుకుంటాడు. మరోవైపు మొదలియార్ చీకటి వ్యాపారం చేస్తూ, ధనుంజయకి ఏటా వందకోట్లు చెల్లిస్తాడు. ధనుంజయ ఆ డబ్బుని రాజకీయాల్లో పెట్టుబడిగా పెడతాడు. దాంతో మొదలియార్ జోలికి ఎవరూ పోరు. ఆ విధంగా ధనుంజయ... ప్రభుత్వానికీ మొదలియార్‌కీ మధ్య వారధిగా

వుంటాడు. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, ఆ మస్తాన్ వెనుక ఇంత చరిత్ర వుంది. మేమేం చెయ్యగలం చెప్పండి".

బోసు గాంధీగారి పటానికి పట్టిన బూజుని చూస్తూ, గాఢంగా నిశ్వసించాడు. ఇన్‌స్పెక్టర్ చెప్పటం పూర్తికాగానే లేచి నిలబడుతూ, "థాంక్సండీ మీ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి నాకు తెలియని విషయాలు చాలా చెప్పారు" అన్నాడు ఇంగ్లీషులో "పోలీస్ స్టేషన్‌లో బాధ్యతాయుతమైన పోస్ట్‌లో వుంటూ, సమస్యలతో వచ్చిన నాలాంటి జనాలకి, గొప్ప 'పొలిటికల్ అవేర్‌నెస్'తో..... సమస్యలకి మూలకారణం సోదాహరణతో వివరించి చెప్పి విజ్ఞానవంతుల్ని చేసి పంపిస్తూన్న మీ ఓర్పుకి నా అభినందనలు. వెళ్ళొస్తాను".

రాధాకృష్ణమాచారి కూడా లేచి, "థాంక్స్. నేను వెళ్ళాలి. ఈ రోజు శుక్రవారం కదా. మా ఆవిడ్ని గుడికి తీసుకువెళ్ళాలి" అన్నాడు.

"మా గురించి కూడా కాస్త ప్రార్థించండి ఇన్‌స్పెక్టర్ గారూ?"

"ష్యూర్. తప్పకుండా!... ఆ మస్తాన్ వల్ల మీ కుటుంబానికి ఏ ఆపదా రాకూడదని అర్చన చేయిస్తాను"?

"నేను ప్రార్థించమన్నది మా కుటుంబం గురించి కాదు. దేశం గురించి" అని అక్కణ్ణుంచి బయటకు వచ్చేశాడు.

* * *

అతడు ఇంటికి వచ్చేసరికి అందరూ మెలకువగా వున్నారు. పైకి కనిపించడం లేదు గానీ అందరూ ఆందోళనగానే వున్నారు. ఎవరూ నిద్రపోలేదు.

అతడు ప్రవేశించగానే అందరూ చుట్టుముట్టి "ఏమైంది?" అని అడిగారు.

"ఏమిటి, ఏమైంది?" తిరిగి ప్రశ్నించాడు.

"ఎక్కడికి వెళ్ళావురా ఇంతసేపూ?" పరమేశ్వరశాస్త్రి అడిగాడు.

"ఊరికే. అలా బయటికి వెళ్ళొచ్చాను" అన్నాడు బోసు. అందరి మొహాల్లోనూ నిరాశ కొట్టొచ్చినట్టు కనిపించింది. 'గొడవంతా సెటిల్ అయిపోయింది. నేను ఎవర్నో పట్టుకుని ఇన్‌ఫ్లుయెన్స్ చేయించుకొచ్చాను' అని అతడు అంటాడేమో అనుకున్నట్టున్నారు. వాళ్ళ సమస్య అంత సులభంగా తేలదని తెలిశాక, యుద్ధంలో ఓడిపోయిన సైనికుల్లా ఎవరి పక్కమీద వాళ్ళు వెళ్ళి పడుకున్నారు.

బోసు వంటింట్లోకి వెళ్ళాడు. ఆ రాత్రి ఎవరూ భోజనం చేయలేదని ఆ వంటిల్లు చూస్తుంటే అర్థమైంది. అతడు కూడా మంచినీళ్ళు తాగొచ్చాడు. పక్కమీదకి వెళ్ళలేదు. హాల్లో అందరూ వరసగా పడుకుని వున్నారు. మూలగా వున్న పూజ గదిలోకి వెళ్ళాడు. ఓ పక్కగా పరమేశ్వరశాస్త్రి నిద్రపోతున్నాడు. వెళ్ళి తండ్రి పక్కగా కూర్చున్నాడు. అలికిడికి ఆయన కళ్ళు విప్పి, ఆ సమయంలో కొడుకుని అక్కడ చూసి, ఆశ్చర్యంగా "ఏమిట్రా?" అన్నాడు.

బోసు వెంటనే సమాధానం చెప్పలేదు. కొద్దిసేపు చేతివేళ్ళవైపు చూసుకుంటూ వుండిపోయి, నెమ్మదిగా తలెత్తి "నాన్నా..." అని ఆగాడు. తటపటాయించాడు. "మనమూ ... నేనూ... నేనూ" అని మళ్ళీ ఆగాడు.

"ఏమిట్రా కన్నా. చెప్పరా" అనునయంగా అడిగాడు పరమేశ్వర శాస్త్రి.

"శారదగార్ని మనింట్లో ఉంచుకుందామని బలవంతం చెయ్యటం... ... ... నేనేమైనా తప్పుచేశానా నాన్నా?"

ఆయన వెంటనే సమాధానం చెప్పకుండా, చాలాసేపు ఆగి, "నీకీ అనుమానం ఎందుకొచ్చిందిరా?" అన్నాడు.

బోసుబాబు మాట్లాడలేదు.

ఆయన దగ్గరగా జరిగి కొడుకు వీపు మీద చెయ్యివేసి నిమురుతూ "ఒరేయ్ చిన్నా, నువ్వేమీ కంగారుపడకురా. జరగవలసింది జరిగి తీరుతుంది. దాన్నెవరూ ఆపలేరు" అన్నాడు ఆప్యాయంగా.

బోసు కంఠం గద్గదికమైంది. "నా కెందుకో భయంగా వుంది నాన్నా..." అతడి స్వరంలో సన్నటి నీటిపొర అడ్డుపడింది. "...భయం నా కోసం కాదు. నా వల్ల మీరందరూ ఏమైపోతారో అని".

పరమేశ్వరశాస్త్రి వత్తిగిలి లేచి కూర్చుని, కొడుకుని పొదివి పట్టుకున్నాడు. "ఒరేయ్ చిన్నా, ఎందుకురా అంత బెంబేలు పడిపోతావ్? నువ్వు చేసింది మంచి – అనుకున్నప్పుడు దేనికీ భయపడకూడదురా. నీ వల్ల మేమంతా ఏదో అయిపోవటం ఏమిట్రా? నువ్వు వేరూ, మేము వేరూ కాదురా, 'మనం' అంతా ఒకటి! అర్థమైందా?"

బోసు తేరుకున్నాడు. తండ్రి కంఠం స్పష్టంగా – దగ్గరగా వినిపించింది. "నీతి నిష్కామ కర్మ. నిస్వార్థమైన మంచిని ఏ శక్తీ ఏమీ చేయలేదు. కర్మ 'ఫలము' పట్ల ఆసక్తి విడిచి, కర్మ చేయుటయే సాత్విక త్యాగమని భగవద్గీత – మోక్ష సన్యాసయోగములో శ్రీకృష్ణుడు చెప్పాడు. మనిషి అనేక కష్టనష్టాలకి గురి అయిన తరువాత, ఫలితార్థం చేతికి అందివచ్చేవేళ – ఊహించని వైపరీత్యం ఎదురై ఆత్మస్థయిర్యం అంతరించిపోతే శ్రీకృష్ణుడి మాటలే ముందడుగు వేయిస్తాయి..."

బోసు తలెత్తి తండ్రి మొహంలోకి చూశాడు. అతడికి పోయిన ధైర్యం ఏదో తిరిగి వచ్చి చేరినట్టు అయింది. అక్కడనుంచి లేచి, తన పక్కమీదకు వెళ్ళాడు. అరగంట సేపు పడుకున్నాడు. టైమ్ ఎంతైందో తెలీదు. అంతా నిశ్శబ్దంగా వుంది. ఎవరు నిద్రపోయారో – ఎవరు మెలకువగా వున్నారో తెలీదు. గోమతి నిద్రలో 'వద్దు – వద్దు' అని కలవరిస్తూ వుంది. రామ్మూర్తి అటూ ఇటూ కదుల్తూన్నాడు. మరుసటి రోజు ప్రొద్దునే రాబోతున్న విపత్తు అందరి కలత నిద్రలోనూ స్పష్టంగా తెలుస్తోంది.

అతడు ఇక ఆ సస్పెన్సు భరించలేనట్టు లేచాడు. ఎవరికీ నిద్రాభంగం కలగకుండా చెప్పులేసుకుని, తలుపులు దగ్గరగా వేసి బయటకొచ్చాడు.

బయట చలిగా వుంది, అతడు దాన్ని పట్టించుకోలేదు. రెండు చేతులూ జేబుల్లో పెట్టుకుని అడ్డావైపు నడవసాగాడు. దాదాపు అరగంట నడిచాక అతడు ఆ 'అంగడి' చేరుకున్నాడు. అక్కడ ప్రపంచం అప్పుడే మేల్కొన్నట్టు కళకళలాడుతూంది. అక్కడ మనుష్యులు శవాల్లా, సమాధుల్లాంటి కుండల మధ్య పడివున్నారు. పదవికోసం పైరవీలు చేసే పొలిటీషియన్లలా ఈగలు అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నాయి.

ఆ అంగడి పక్కనుంచి వెళ్ళబోతూ – పాముని తొక్కినట్టు ఆగాడు బోసు. దూరంగా చెట్ల మధ్యనుంచి చీకట్లో ఒక ఆకారం ఇటే వస్తోంది. ఆ నడక అతడు పోల్చుకున్నాడు.

ఆమె లక్ష్మీ శారద.

అతడు వడిగా ఆమె దగ్గిరికి వెళ్ళి వెలుగులో వున్నవాళ్ళు ఆమెను చూడకుండా చీకట్లోనే ఆపి, "మీరిలా వస్తున్నారేమిటి" అని అడిగాడు. అప్పటివరకూ ఆమె అతన్ని గమనించలేదు. హఠాత్తుగా వినిపించిన ఈ ప్రశ్నకి ఆమె స్థాణువై బ్లాంక్‌గా అతనివైపు చూసి, 'అతన'ని తెలిసి తలవంచుకుంది. చాలాసేపు ప్రశ్నించిన తరువాత ఆమె అన్నది...

"నా గురించి మీరందరూ అంతలా కలతపడటం చూసి..." అర్థోక్తిగా ఆపుచేసింది.

"మీ అంతట మీరు వెళ్ళి అతడికి లొంగిపోదామనుకున్నారు కదూ" అన్నాడు. ఆమె సమాధానం చెప్పలేదు. 'మా కుటుంబాన్ని రక్షించటం కోసం మీరు తీసుకున్న నిర్ణయానికి మా అందరి తరఫున కృతజ్ఞతలు' వ్యంగ్యంగా అందామనుకున్నాడు. కానీ ఆమెవైపునించి ఆలోచిస్తే...

- ఆ భావం అతడి మనసులోకి రాగానే అప్పటివరకూ ఆమె మీద పెరిగిన కోపం, ఆమె చర్యపట్ల పెరిగిన కసి తగ్గిపోయి, నిజంగానే మనసంతా కృతజ్ఞతా భావం నిండింది.

"మీరిక్కడే వుండండి. నేను ముందు వెళ్ళి మాట్లాడి వస్తాను. ఏం జరుగుతుందో చూద్దాం" అన్నాడు. ఆమె భయం నిండిన కళ్ళతో అతడివైపు చూసింది. అప్పటికే అతను ఆ పాకవైపు వెళ్ళిపోయాడు.

అతడు ఆ పాకలోకి ప్రవేశించలేదు. వెనుక ఉన్నసందులోకి ఓ పెంకుటింటిలోకి ప్రవేశించాడు. ముందుగదిలో కుర్చీలో కూర్చుని మస్తాను తాగుతున్నాడు. పక్కనే సీకులకు గుచ్చి ఉన్న మాంసం ఎర్రగా కాలుతోంది.

స్పెషల్ కస్టమర్ల కోసం ఏర్పాటు చేసిన అడ్డా అది. బాగా రాత్రవటం వలన ఇంకెవరూ లేరు.

వస్తూన్న మనిషి చూసి మస్తాన్ బరువుగా కళ్ళెత్తి "ఎవరూ?" అన్నాడు.

"నేను బోసుని. ప్రొద్దున్న మా ఇంటికొచ్చావుటగా".

ఎదురుగా వున్నది ఎవరో స్ఫురణకి రాగానే మస్తాను మరి ఆలస్యం చేయలేదు. కుర్చీని కాలితో వెనక్కితోసి, బల్లమీదున్న సీసా మూతవైపు పట్టుకుని, బల్ల అంచుకి బలంగా కొట్టాడు. అది భళ్ళున బ్రద్ధలైంది.

ఏం జరుగుతుందో బోసు గ్రహించే లోపులో, ఏమీ మాట్లాడకుండా, ప్రశ్నలేమీ వేయకుండా, అదే మెరుపువేగంతో బోసు మెడ వెనుక నుంచి గట్టిగా పట్టుకుని, మరో చేతిలో సగం విరిగిన సీసాని అతని కడుపులో బలంగా పొడిచాడు.

కానీ బోసు కూడా అప్రయత్నంగా చెయ్యి అడ్డుపెట్టాడు. సీసా అంచు అరచేతిలో ఇరుక్కుపోవటంతో రక్తం ధారగా ప్రవహించసాగింది. అదే అదనుగా మస్తాను అతన్ని బలంగా ముందుకి తోశాడు! బోసు వేగంగా వెళ్ళి గోడకి కొట్టుకున్నాడు. తల బ్రద్ధలైనంత శబ్దం. "అమ్మా" అని అరిచాడు.

శత్రువు నిర్వీర్యుడు అయ్యాడని తెలుసుకున్నాక మస్తాన్ గట్టిగా నవ్వేడు. కూర్చీలో కూర్చుంటూ –"ఆ రోజు నువ్వు కాలిమీద కొట్టిన దానికి ఇది శిక్ష. ఊఁ ఇప్పుడు చెప్పు ఎందుకొచ్చావు?" అన్నాడు.

నేలమీద శవంలా పడివున్న బోసు బలహీనంగా తలెత్తాడు. "నీ పంతం చెల్లించుకున్నావుగా. ఇక మమ్మల్ని వదిలిపెట్టు" అన్నాడు.

మస్తాన్ సిగరెట్ వెలిగించుకుంటూ, "శారద ఎక్కడుంది?" అని అడిగాడు.

"నాకు తెలీదు".

మస్తాన్ తాపీగా, "అదెక్కడుందో నీకు తెలుసు. చెప్పరా..." అని ఓ బూతు మాట ఉపయోగించాడు. బోసు మాట్లాడలేదు. మస్తాన్ అన్నాడు. "రేప్రొద్దున్నలోగా దాన్ని నా దగ్గర వదిలిపెడితే సరే, లేకపోతే రేపు నేనొచ్చి నీ అక్కా చెల్లెళ్ళిద్దరినీ నీ ముందు అనుభవిస్తాను. మధ్యాహ్నం శాంపిల్ చూపించాగా. అట్లాగే..."

బోసు మొహం చిట్లించి "శాంపిలేమిటి?" అన్నాడు.

"నీ చెల్లెల్ని ముద్దెట్టుకున్నాగా. పెదాలు కూడా కొరికాను" అంటూ కసిగా నవ్వాడు. బోసుకు ఆ మాటలు అర్థం కావటానికి ఓ క్షణం పట్టింది.

అతడికి అంత శక్తి ఎక్కడినుంచి వచ్చిందో తెలీదు. పూనకం పట్టినవాడిలా లేచాడు. రావటమే గాలికన్నా వేగంగా వచ్చి మస్తాన్‌ని తోశాడు. అది వూహించని మస్తాను వెల్లకిలా క్రిందపడ్డాడు. బోసు అదే వేగంతో పక్కనున్న వూచ చేతిలోకి తీసుకొన్నాడు. మాంసాన్ని నిప్పుల మీద ఎర్రగా కాలుస్తున్న సీకు తాలూకు వూచ అది. అతడికి ఆ క్షణం గోమతి మొహంమీద మస్తాను వికృత ముద్ర తప్ప మరేమీ కనబడటం లేదు.

ఒక కాలు మస్తాన్ మెడమీద వుంచి, ఒక చేతితో జుట్టు పట్టుకుని మరో చేతిలో వున్న వూచని అతని పెదాల మీద అడ్డంగా పెట్టి గట్టిగా వత్తాడు. ఆ వేడికి మస్తాన్ గుండెలవిసేలా కేకపెట్టాడు. బోసు అతడి తల కదలకుండా జుట్టు గట్టిగా పట్టుకొని, మరింత గట్టిగా నొక్కాడు. చెంపమీద నుంచి పెదాల మీదుగా, గెడ్డం

వరకూ ... ఒక క్రాసులా మచ్చవేస్తూ నోటిని కాలుస్తోంది వూచ. మాంసం కాలిన వాసన ఆ గదంతా మంద్రంగా వ్యాపించింది. రక్తం తడికి ఆ ఎర్రటి ఊచ చల్లబడేవరకూ అలాగే నొక్కిపట్టి వుంచాడు.

శారద గుమ్మం దగ్గరికి వచ్చి చూసేసరికి అదీ దృశ్యం!

ఆమె ఎక్కువసేపు దూరంగా చీకట్లో వుండలేకపోయింది. అక్కడే దూరంగా చీకట్లో ఆగమని చెప్పి, బోసు మస్తాను దగ్గరికి వచ్చేసిన తరువాత, ఆమె అక్కడ కొంచెంసేపు మాత్రమే వుండగలిగింది. బోసు ఎలాంటి ప్రమాదస్థలంలోకి వెళ్ళాడో ఊహించుకొంటున్న కొద్దీ ఆమెకు భయం, ఆందోళన ఎక్కువయ్యాయి. పాక దగ్గరవున్న వ్యక్తులు ఏమనుకుంటారో, ఏంచేస్తారో అని కూడా ఆలోచించకుండా, వెనుకవైపు నుంచి మస్తాన్ అడ్డాలోకి ప్రవేశించింది. ఆ క్షణం బోసుకి ఏదైనా జరిగితే, అతన్ని రక్షించడం కోసం తనని తాను అర్పించుకోవటానికి కూడా ఆమె సిద్ధపడింది. కానీ అక్కడ ఆమె చూసిన దృశ్యం వేరు!

మనిషిలో అంత రౌద్రం వుంటుందని ఆమెకి తెలీదు. మొదటిసారి చూస్తోంది.

ఆమెకి భయం వెయ్యలేదు. సంతోషం వేసింది.

మనుషులపట్లా, సమాజంపట్లా ఇప్పటివరకూ ఆమె మనసులో పేరుకుంటూ వచ్చిన కసికి... అతడు సమాధానంగా కనబడ్డాడు. ఆమెలో అంతర్లీనంగా పెరిగిన ప్రతీకారానికి అతడు ప్రతీకగా తోచి, ఆమె మనసంతా

సంతృప్తి నిండింది. ఒక అగ్ని పర్వతం బ్రద్ధలై చల్లారిన ఫీలింగు అది. తరువాత రాబోయే పరిణామాలని ఆలోచించనివ్వని సంతృప్తి అది.

*          *          *

చల్లటి గాలి బలంగా వీస్తోంది.

ఇద్దరూ మౌనంగా ఇంటివైపు నడుస్తున్నారు. శారద "వాడిక మన జోలికి రాడనుకుంటాను" అంది. అతడు ఆమెవైపు చూడకుండా, తనలో తనే ఏదో ఆలోచించుకుంటున్న వాడిలా నడుస్తూన్నాడు. ఆ మాటలకి తలెత్తి, "అంత తొందరగా ఒక నిర్ణయానికి రాకూడదు. వాడు ఈసారి ఇక ఊరుకోడు. నన్ను చంపితేకాని వాడి కసి తీరదు" అని ఆగి, మళ్ళీ అన్నాడు "...గోమతిని ముద్దుపెట్టుకున్నాడటగా, ఈ విషయం ఎందుకు చెప్పలేదు నాకు?"

"అంతగా చెప్పుకోవలసిన విషయమా అది?"

"ఆ విషయం అక్కడ తెలిసేసరికి ఇక నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోయాను. వాడి ముందు నేనెంత? అన్న విషయం కూడా స్ఫురణకు రాలేదు".

"మీరేమీ తక్కువకాదు. ఇప్పటికి రెండుసార్లు మిమ్మల్ని చూశాను" అంది. ఆమె చెపుతున్నది కరక్టే అన్నట్టు తలవూపాడు.

"అతడితో ముఖాముఖి తలపడటానికి నాకేమీ అభ్యంతరంలేదు. పోతే ప్రాణాలు పోతాయి. అదికాదు నా భయం. అతడి వెనుక డబ్బూ, అధికారమూ వున్నాయి. నా వెనుక నా కుటుంబ సభ్యులున్నారు. వాళ్ళకి ఏదయినా జరుగుతుందేమోనని నా భయం".

"మీక్కూడా ఏ బంధాలూ లేకపోతే మీరు కూడా డబ్బూ, అధికారం సంపాదించగలరన్న మాట".

అతడు చప్పున తలెత్తాడు. అంతలోనే సర్దుకుని "నా బంధాలన్నీ ఎక్కడికి పోతాయి. నాతోపాటే వుంటాయి కదా" అంటూ నవ్వేశాడు.

"బంధాలకన్నా డబ్బే ముఖ్యమని నా తండ్రీ, నా భర్తా నిరూపించారు కదా" అంది ఆమె కూడా విషాదంగా నవ్వుతూ. అంతలోనే ఆమె ఆలోచనల్లోకి జారుకున్నట్లు అంది. "మా నాన్న నాకు 'లక్ష్మీ శారద' అని పేరు పెట్టాడు. మా చెల్లెళ్ళ పేర్లు లక్ష్మీ దుర్గ, లక్ష్మీ ప్రసన్న. మా ఇంట్లో మాత్రం లక్ష్మి లేదు. అందుకే నా పేరు ముందు నుంచి దాన్ని తీసేశాను. 'లక్ష్మి' కోసం మనం ఏదైనా చెయ్యొచ్చు బోసుగారూ. పైకి ఎవరు ఎన్ని చెప్పినా ఈ ప్రపంచమంతా... నా మొగుడూ, తండ్రులతో సహా అంతా తిరిగేది దాని చుట్టూనే".

అతడు నిరుత్తరుడై ఆమెవైపు చూస్తూ వుండిపోయి, కొంచెం సేపటికి తేరుకుని, వాతావరణాన్ని తేలిక చెయ్యటానికా అన్నట్టు, "ఎక్కడో డైరీలో వ్రాసుకోతగిన కొటేషన్ చెపుతున్నారేమిటి?" అన్నాడు.

ఆమె పైకి మాట్లాడలేదు. మనసులో మాత్రం అనుకుంది. "విషాదాంతమయ్యే ప్రతీ సూర్యాస్తమయమూ జీవితం డైరీలో ఒక కొటేషనే ".

# 8

**హాల్లో** సూదిపడితే వినబడేంత నిశ్శబ్దంగా వుంది.

అహల్య పైట కొంగుతో కళ్ళు తుడుచుకుంటోంది. ఏం చెయ్యాలో తోచనట్టు గోమతి నిశ్చేష్టగా నిలబడిపోయి వుంది.

తనింకో పెళ్ళి చేసుకోబోతున్నానని అహల్య భర్త కబురుచేశాడు. ఆ ఇంట్లో ఆవరించుకుని వున్న విషాదానికి అదీ కారణం!

రామ్మూర్తి బక్క కోపంతో లేచి, "ఏమిటండీ! ఏమిటి మీరు చెప్పేది? ఎలా చేసుకుంటాడు పెళ్ళి? మేమేమన్నా చేతులు ముడుచుకుని కూర్చుంటామా? అరెస్టుచేసి జైల్లో పెట్టిస్తాం. లేదంటే కోర్టుకెళతాం" అంటూ అరిచాడు.

ఇలాంటివి చాలా చూశామన్నట్టు మధ్యవర్తి లేచి, "చెప్పవలసింది చెప్పాను. అరెస్టే చేయిస్తారో, కోర్టుకే వెళతారో మీ ఇష్టం" అన్నాడు. పరమేశ్వరశాస్త్రి అతని చేతులు పట్టుకుని, "కుర్రవాడు అతని మాటలు పట్టించుకోకండి. మాక్కొద్దిగా టైమివ్వండి" అని వేడుకున్నాడు.

"ఇంకా ఎంతకాలమండీ టైమివ్వటం. పెళ్ళిలో వాగ్దానం చేసిన కట్నం... ఇప్పటివరకూ ఇవ్వలేదు. కూతుర్ని ఇంట్లో వుంచేసుకున్నారు. అక్కడ అబ్బాయి ఎంతకాలమని బ్రహ్మచారిగా ఉండగలడు? మీ కొడుకులూ, కూతుళ్లూ అయితే అవసరాలు తీర్చుకోవటం కోసం ఏకంగా మనుష్యుల్ని తెచ్చి ఇంట్లోనే పెట్టేసుకోగలరు. మాకలా చేతకాదే..."

ఆ అవమానానికి పరమేశ్వర శాస్త్రి మొహం ఎర్రబడింది. అయినా ఆడపిల్ల తండ్రి, అవసరం తనది. అందుకని తమాయించుకుని, "చూడండి. నేను వచ్చేవారం రిటైర్ అవుతున్నాను. ఆ డబ్బులు వస్తాయి. వాటినిచ్చి అమ్మాయిని పంపిస్తాను. సరేనా" అన్నాడు. రామ్మూర్తి ఏదో అనబోయి వూరుకున్నాడు.

పరమేశ్వరశాస్త్రి మాటలకి మధ్యవర్తి కొంచెం సంతృప్తి చెందినట్టు, సంతోషించినట్టు కనబడ్డాడు. లేచి వెళ్తూ, "సరే, నీ మాటమీద వారంరోజులు ఆగమని చెపుతాను. కానీ ఇదే ఆఖరిసారి, వారంరోజుల తరువాత ఒక్కరోజు ఆగేదిలేదు" అని వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి బోసు వచ్చాక తండ్రి ఆ విషయం చెప్పాడు. బోసు మాత్రం ఏమంటాడు? "కట్నం ఇస్తామని ఒప్పుకున్నాంగా నాన్నా! ఇవ్వక చేసేది ఏముంది?" అన్నాడు.

"కట్నం ఇవ్వగా, రిటైర్‌మెంటు డబ్బులో ఇంకో అయిదు వేలు కూడా మిగలవురా. గోమతి పెళ్ళి చెయ్యాలి ఇంకా" దిగులుగా అన్నాడాయన.

"నా సంగతి కన్వీనియెట్‌గా మర్చిపోయి, మీలో మీరే మాట్లాడేసుకుంటున్నారే" అన్నాడు రామ్మూర్తి. అతడు గోడకి ఒక మూలగా కూర్చుని ఈ సంభాషణంతా వింటున్నాడు. ఇద్దరూ అతనివైపు చూశాడు.

"నా ఫ్రెండ్ ఒకడు బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. దానికి ముప్పైవేలు కావాలని చెప్పానుగా" అన్నాడు రామ్మూర్తి.

"ఏం ఉద్యోగం?" బోసు అనుమానంగా అడిగాడు.

"తెలీదు. రెండు వేలు జీతం".

"ముప్పైవేల లంచానికి నీకు బ్యాంకు ఉద్యోగం ఇచ్చేదెవర్రా" అన్నాడు పరమేశ్వరశాస్త్రి.

"బ్యాంకు ఛైర్మన్ మేనల్లుడు కొడుకు ఫ్రెండు నా ఫ్రెండుకి ఫ్రెండ్. తప్పనిసరిగా ఉద్యోగం వస్తుంది".

పరమేశ్వరశాస్త్రి నచ్చచెపుతున్నట్టు, "ఒరేయ్, నిన్ను అమాయకుణ్ణిచేసి వాళ్ళు డబ్బు కొట్టేద్దామనుకుంటున్నారు. ఆ మాత్రం గ్రహించలేవా?" అన్నాడు.

"పాతికేళ్ళు పైబడ్డాయి. నేను అమాయకుణ్ణి ఏమిటి?"

"అదికాదురా...."

"ఏమిటి అది కాదు? నాకు డబ్బు ఇవ్వటం ఇష్టం లేకపోతే మానెయ్యండి. అంతా మీ కూతురికే పెట్టుకోండి. మీకన్నా ముందే నేను దేశాలు పట్టిపోతాను. మీకు తలకొరివి పెట్టేవాళ్ళు కూడా ఎవరూ వుండరు. అది గుర్తుంచుకోండి".

బోసుబాబు స్థాణువై "అన్నయ్యా" అన్నాడు.

"నువ్వు మధ్యలో కల్పించకోకు" విసురుగా చెయ్యి వూపుతూ అరిచేడు రామ్మూర్తి. అదే విసురుబాటుతో తండ్రివైపు తిరిగి, "ఇదిగో, నేనిప్పుడే చెపుతున్నాను. ఆ డబ్బు నాకు కావాలి. ఇవ్వకపోతే వురేసుకుని ఛస్తాను" అన్నాడు బిగ్గరగా.

"అది నీ చెల్లెలా ?"

"అవును. అది నాకు చెల్లెలే. నాకు ఇంకో చెల్లెలు కూడా వుందని తెలుసు, మరి దాని పెళ్ళి ఎలా చేస్తారు? దాంతో వ్యాపారం పెట్టిస్తారా?"

కంఠనాళాలు ఉబుకుతుండగా "రామ్మూర్తీ" అని అరిచాడు పరమేశ్వరశాస్త్రి.

"అవును మరి, ఉన్న డబ్బంతా పెద్ద కూతురికి పెట్టి పంపిస్తే రెండో కూతుర్ని ఏం చేస్తారు? ఆగండి... అప్పటి సంగతి అప్పుడు తేల్చుకోవచ్చులే అనకండి. విషయం ఏమిటో ఇప్పుడే తేల్చండి".

అహల్య గుడ్లనీరు కుక్కుకుంటూ, "నేను చచ్చిపోతాన్లే అన్నయ్యా! నా గురించి మీరేం బాధపడనవసరం లేదులే" అంది.

"ఆహా, ఏం డ్రామా ప్లే చేస్తున్నావే. ఇప్పుడు నాన్న పాతికవేలు ఇస్తే ముంగిలా అత్తారింటికి వెళ్ళి కాపురం చేసుకోవూ" అని వెటకారంగా అంటూ తండ్రివైపు తిరిగి "...బోసు సంపాదన ఇంటికి సరిపోతుంది. నాకీ రెండు వేలు ఉద్యోగంవస్తే, ఏడాది తిరిగే సరికల్లా అహల్యని అత్తారింటికి పంపొచ్చు. మరో ఏడాదికల్లా గోమతి పెళ్ళి చెయ్యొచ్చు" అన్నాడు.

బోసు కల్పించుకుంటూ, "నీ మెదడులోకి ఎవరో బాగా ఎక్కించి నట్టున్నారన్నయ్యా! అంత పెద్ద ఉద్యోగం మనకెందుకు ఇస్తారు" అన్నాడు.

"నేను సంపాదించుకోగలను కాబట్టి ఇస్తారు. నీలా చిన్న ఉద్యోగాలు చేయటం నాకు సరిపడదు".

"నువ్వు ఉద్యోగం చేసి డబ్బు కూడబెట్టి దాన్ని అత్తారింటికి పంపేవరకూ వాళ్ళు ఆగర్రా. అల్లుడికి ఇంకో పెళ్ళిచేసి, దీన్ని వెళ్ళగొడతారు" అన్నాడు పరమేశ్వరశాస్త్రి హెచ్చించి. రామ్మూర్తి అంతకన్నా గట్టిగా స్వరం హెచ్చించి, "వెళ్ళగొడితే బయటికొస్తుంది. శారదని మనింటికి బోసు తీసుకొచ్చినట్టే దాన్నీ ఎవడో తనింటికి తీసుకుపోతాడు. పోనీయండి" అన్నాడు.

వెయ్యి పిడుగులు ఒక్కసారి పైన పడినట్టు కంపించిపోయారు అక్కడివారు. రామ్మూర్తి స్వతహాగా మంచివాడే. కానీ ఆవేశమొస్తే ఏం మాట్లాడతాడో అతనికే తెలీదు. ఏది నోటికొస్తే అది అనేస్తాడు. మనసులో మళ్ళీ

ఏముండదు. ఇటువంటి వ్యక్తులు అంతటా తారసపడుతూనే వుంటారు. ముందు మాట అని ఆ తరువాత బాధపడటం వారి అలవాటు.

.... ఆ మాట అన్నాక రామ్మూర్తి కూడా నొచ్చుకున్నట్టు కనిపించాడు. ఏదో పని వున్నట్టు అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. బోసు లోపలికి వెళ్ళాడు. శారద ఈ మాటలు విన్నదేమో అని అతను భయపడ్డాడు. శారద లోపల పెరట్లో వుండటం చూసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

అతడలా వస్తాడని వూహించే శారద పెరట్లోకి వెళ్ళిపోయిందని అతడికి తెలీదు.

*　　　*　　　*

రెండు రోజులు గడిచాయి. ఒక రోజు అర్ధరాత్రి తలుపు చప్పుడై పరమేశ్వరశాస్త్రి నిద్ర మేల్కొన్నాడు. తలుపు తీసుకుని ఎవరో బయటకు వెళుతూన్నట్టు అనిపించింది.

"ఎవరదీ?" అన్నాడు. అట్నుంచి సమాధానం లేదు. "శారదా" అని పిల్చాడు. ఈ లోపులో అడుగుల చప్పుడు ఇంటినుంచి దూరంగా వెళ్తున్నట్టు వినిపించింది. పక్క మీదనుంచి లేచి ముందు గదిలోకి వచ్చాడు.

తలుపు సగం తీసే వుంది.

ఆయన గబగబా బయటికి వచ్చాడు. ఆయన అనుమానం నిజమే. ఆకారం వీధి మలుపు తిరుగుతోంది. "ఆగు" అన్నాడు ఆయన. గబగబా దగ్గరికి వెళ్ళేడు.

వీధి మలుపులో రామ్మూర్తి తల వంచుకుని నిలబడి వున్నాడు. "...ఎక్కడికిరా ఈ ప్రయాణం" అన్నాడు ఆయన.

"చావటానికి".

"బాబూ!" ఆ ముసలాయన కొడుకు చేతిని పట్టుకుంటూ అన్నాడు.

"అవున్నాన్నా! నాలుగు నెలల్లో స్టేట్ గవర్నమెంటు ఉద్యోగం చేసే వయసు కూడా నాకు దాటిపోతుంది" మొహం తిప్పుకుంటూ అన్నాడు.

"ఒరేయ్! నాలుగు రోజుల్లో నేను రిటైర్ అవుతాను. అప్పుడు ఏదైనా ఆలోచిద్దాం".

"ఇద్దరం కలిసి ఎలా చద్దామా అని ఆలోచిద్దామా నాన్నా?" రామ్మూర్తి కసిగా అడిగాడు. శాస్త్రి అతడివైపు అయోమయంగా చూశాడు. "అవును, వచ్చేనెల నుంచీ నీ జీతం కూడా వుండదు. వచ్చే రిటైర్మెంట్ డబ్బులు మన అహల్యని సాగనంపటానికి సరిపోతాయి. ఏం తిని బ్రతుకుతాం. కనీసం నేను ఒక్కణ్ణి బరువు తగ్గినా తగ్గినట్టేగా?"

"అవన్నీ తరువాత ఆలోచిద్దాంరా. నువ్వు ఇంటికి రా"?

"రాను. నేను చావాలి. చచ్చేముందు గుడికి వెళ్ళాలి. ఎందుకని అడగమేం!"

"ఎందుకు?"

"వచ్చే జన్మలోనైనా నీలాటి తండ్రులకి కొడుకుగా పుట్టనివ్వొద్దని వేడుకోవటానికి –"

కొంచెంసేపు బాగా, మరికొంచెంసేపు తలతిక్కగా మాట్లాడే కొడుకువైపు అయోమయంగా, ఆందోళనగా చూశాడు పరమేశ్వరశాస్త్రి. ఇంకొద్ది కాలం ఇలాగే వుంటే అతడు పిచ్చివావటం ఖాయమని అనిపించిందాయనకి. పది నిముషాలపాటు బ్రతిమాలాడు. చివరికి ఎలాగైతేనేం వెనక్కి రావటానికి ఒప్పుకున్నాడు రామ్మూర్తి. నెలరోజుల్లో ఎలాగైనా ఉద్యోగం చూపించే బాధ్యత తనది అని ఆయన వాగ్దానం చేసేక ఇంటివైపు వస్తూంటే అన్నాడు – "నాలుగు రోజుల్లో అహల్యని అత్తారింటికీ, నెలరోజుల్లో నన్ను ఉద్యోగానికీ పంపుతానని ఏ ధీమాతో వాగ్దానం చేశావు నాన్నా?"

ఆయన తలవంచుకుని నడుస్తూ, నెమ్మదైన స్వరంతో, "చూస్తావుగా బాబూ" అన్నాడు.

ఆ మరుసటి రోజు సూపరింటెండెంట్ పరమేశ్వరశాస్త్రిని పిలిచి, "ఈ రోజు సాయంత్రం మీకో చిన్న అభినందన సభ ఏర్పాటు చేస్తున్నాం. ఇన్ని సంవత్సరాలు ఈ ఆఫీసులో ఇంత కష్టపడి పనిచేసి రిటైర్ అవుతున్నందుకు" అన్నాడు.

ఆయన పేలవంగా నవ్వి "అందరూ చేసేదే నేనూ చేశానండీ. ఇందులో వింతేముంది?" అన్నాడు.

"అందరూ వేరు. మీరు వేరు. రేపు రిటైర్ అవుతూ కూడా, ఈ రోజు ఎంతపని చేస్తున్నారో నేను చూస్తూనే వున్నాను".

ఆయన అదే విషాదపూరితమైన నవ్వుతో "నేను పనిచేయటం లేదండీ. పాత జి.వో.లు ఫైళ్ళు చూస్తున్నాను" అన్నాడు.

"కొత్తగా ఉద్యోగంలో చేరేవాళ్ళు చదవాల్సిన జి.వో.లు మీరు చదువుతున్నారేమిటి?" నవ్వేడు సూపరింటెండెంట్. పరమేశ్వరశాస్త్రి ఆయన దగ్గిర శలవు తీసుకుని బయటకు వచ్చి అక్కడ నుంచి లెక్కలు వ్రాసే సారా కొట్టుకి వెళ్ళాడు.

యజమానికి నమ్మస్కరించి "రేపటి నుంచీ నేను రిటైర్ అవుతున్నాను బాబూ. రేపు సాయంత్రంతో అక్కడ ఆఫీసులో పని పూర్తవుతుంది. ఇక్కడ కూడా మానెయ్యాలనుకుంటున్నాను" అన్నాడు.

"అదేమిటి శాస్త్రీ. అక్కడ గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగం అయిపోతే ఇక్కడ కూడా మానెయ్యాలని రూలేమన్నా వుందా ఏమిటి?"

మరికొంచెంసేపు అడిగి, పరమేశ్వరశాస్త్రి ఒప్పుకోకపోవడంతో, డ్రాయరు లోంచి రెండు వేలు తీసి ఇచ్చాడు.

"ఇదెందుకు?"

"ఉంచు శాస్త్రీ" అన్నాడు యజమాని. "శోత్రియుడివైయుండీ పది సంవత్సరాలు సారా కొట్లో లెక్కలు వ్రాసేవంటే నీ నిజాయితీకి ఎంత ఇచ్చినా తక్కువే తీసుకో".

పరమేశ్వరశాస్త్రి ఆ డబ్బు తీసుకుని ఇంటికి వచ్చేసేడు. ఆ రాత్రి బోసు సెకండ్ షో నుంచి ఇంటికొచ్చేసరికి ఆయన గిలగిలా కొట్టుకుంటున్నాడు. నోట్లోంచి నురుగలు వస్తున్నాయి. ఇంటిల్లపాదీ ఏడుస్తున్నారు. కంగారు పడుతున్నారు.

రాత్రికి రాత్రి హడావుడిగా తీసుకెళ్ళి ఆస్పత్రిలో చేర్పించారు. ఇరవై నాలుగు గంటలపాటు ఆయన మృత్యువుతో పోరాడి ఓడిపోయాడు.

మరుసటి రోజు అర్థరాత్రి పన్నెండింటికి ఆయన ప్రాణం పోయింది. అర్థరాత్రి శవం ఇంటికొచ్చింది. ప్రొద్దున్నే శ్మశానానికి బయల్దేరింది. మధ్యాహ్నానికి బూడిదైపోయింది. 'నిన్న రాత్రే రిటైర్‌మెంట్ సందర్భంగా పార్టీ ఏర్పాటు చేశాం. ఈరోజు ఇలా జరిగిపోయింది' అన్నారు స్టాఫ్. బోసుకి ఏదీ స్పృహలో లేదు. అంతా యాదృచ్ఛికంగా కనులముందు కదిలిపోతున్నట్టు వుంది.

తండ్రి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో బోసుకి అర్థం కాలేదు. పోలీసు కేసు కాకుండా వుండడానికి, పోస్టుమార్టం లేకుండా చేయటానికి డాక్టర్లకి డబ్బు ఇచ్చానని రామ్మూర్తి చెప్పాడు. రామ్మూర్తి కూడా ఈ మరణంతో చాలా కదిలిపోయాడు. గోమతి, అహల్య సంగతి ఐతే చెప్పనవసరం లేదు.

....ఖాళీ పడకను తడుముతూ శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తున్న బోసుకి, దిండు క్రింద ఉత్తరం దొరికింది. ఆశ్చర్యంగా విప్పి చదివాడు. తండ్రి వ్రాసింది అది.

"నాయినా – బోసుబాబూ!

ఈ ఉత్తరం నువ్వు చదివే సమయానికి నేనీ లోకంలో వుండను. ఉద్యోగం నుంచి రిటైర్ అవటానికి ఒక్కరోజు ముందే ఈ లోకం నుంచి నిష్క్రమిస్తున్నాను. ఎందుకు నిష్క్రమించవలసి వచ్చిందో చెప్పబోయే ముందు నీకు మరికొన్ని విషయాలు చెప్పనివ్వు.

ఒక రోజు రాత్రి శారద విషయమై నువ్వు నా వద్దకి వచ్చి నీ భయం గురించీ, ఒంటరితనపు దిగులు గురించీ నా దగ్గిర ఓదార్పు పొందావు గుర్తుందా నాయినా! నిన్ను ఓదార్చటమైతే చేయగలిగాను. నీకు నిష్కామ కర్మ గురించీ,

మోక్షసన్యాసం గురించీ చెప్పాను. ఆ రాత్రి నీకైతే చెప్పగలిగాను గానీ, నేను దానిని ఏ విధంగా ఆచరించగలుగుతున్నాను అని ఆలోచనలో పడ్డాను. ప్రతీ ఉదయం గీతా శ్లోకాలతో దినచర్య ఆరంభించే నేనే గీతను సరిగ్గా ఆచరించలేకపోయాను అనిపించింది. నా వైఫల్యానికి ప్రతీకలుగా మీరు నలుగురూ నిలిచారు. నా పెద్దకొడుకు పిచ్చితనపు అంచులో నిలబడి వున్నాడు. నా పెద్ద కూతురు కేవలం నా కూతురుగా పుట్టిన నేరానికి పుట్టింటిలో మగ్గిపోతోంది.

రామ్మూర్తి అన్న మాటలు నిజమే బాబూ! తలకు కొరివి పెట్టబడటానికి కూడా అనర్హుడినైన తండ్రిని నేను. 'ఆశలను వీడి విధులను నడిపెడివాడికి పాపము అంటదు అర్జునా!' అని జ్ఞాన యోగములో కృష్ణుడు చెప్పాడు. అదే నేనూ నిర్వర్తించాను. ఫలితంగా మీరందరూ కష్టపడ్డారు. అదే గీతలో చెప్పబడిన మరో విషయాన్ని నేను మర్చిపోయాను.

జ్ఞానం వేరు. విజ్ఞానము వేరు. అక్షర జ్ఞానము "జ్ఞానము" అని, అనుభవ జ్ఞానము "విజ్ఞానము" అని వేదాలు చదివినవారన్నారు. "తీపి"– అక్షర జ్ఞానమైతే , చెక్కెర తీపికీ, బెల్లం తీపికీ మధ్య తేడా తెలుసుకోవటం అనుభవజ్ఞానం. అదే విజ్ఞానం. ఇది కాక ప్రజ్ఞానమనే మరొక విషయమున్నది. అది పై రెంటికీ మించిన ఆధ్యాత్మిక మనోవిభూతి. ప్రజ్ఞానము సంగతి దేముడెరుగు, నేను విజ్ఞానము కూడా సంపాదించలేకపోయాను. దాని పరిహారార్థమే నేనీ రోజు ఆత్మహత్య చేసుకుంటున్నాను.

ఉద్యోగంలో వున్నవాడు మరణిస్తే అతని సంతానంలో ఒకరికి ఉద్యోగం యివ్వవలెనని పాత రికార్డుల్లో వున్న విషయం నిర్ధారించుకున్నాను. అందుకనే,

రేపు రిటైరవబోయే నేను ఈ రోజే మరణిస్తున్నాను. ఉద్యోగం వుండగా నా మరణానికి వున్న విలువ, రిటైరయిన తరువాత వుండదు. అందుకని యెప్పుడో రాబోయే మరణాన్ని కాస్త ముందుకు జరుపుకున్నాను. నా మరణం, నా కొడుకుని ఉద్యోగస్థుడిని చేస్తే అంతకన్నా కావల్సింది ఏముంది? రిటైర్‌మెంట్ డబ్బు ఎలానూ వస్తాయి. వాటితో అహల్యను అత్తవారింటికి పంపు. నా ఉద్యోగం రామ్మూర్తికి వచ్చే ఏర్పాట్లు చూడు. వాడికి ఎంత తొందరగా ఉద్యోగం వస్తే అంత మంచిది. లేకపోతే వాడు మానసికంగా మనకి దక్కడు.

గోమతి పెళ్ళి బాధ్యత నీ మీద పెడుతున్నాను నాయనా. చిన్న వాడివైనా నీ మీద ఇంత బరువు పెడుతున్నందుకు నన్ను క్షమించు.

చివరగా ఒక మాట, నేను నీ గురించి ఏమీ చేయలేకపోయాను. అందుకు నన్ను క్షమించు బాబూ!

– నీ తండ్రి

ఉత్తరం చదవటం పూర్తిచేసి, చేష్టలుడిగినవాడిలా వుండిపోయాడు బోసు. అతడికి తోడుగా, నిత్యం తండ్రి అర్చన చేసే పూజా పీఠం మిగిలింది. కసురుకుంటే గదిలో ఒక మూల ముణగదీసుకు పడుకున్న కుక్క పిల్లలా వుంది విగ్రహం. కంటిమీద నీటి పొరలా అస్పష్టంగా వుంది దాని ముందున్న కుందె వెలుగు.

**జీవితం – ప్రవాహంలో కొట్టుకుపోయే కొబ్బరి మట్ట అయినప్పుడు**

**సంతోషం – పుస్తకాల్లో దాచుకున్న నెమలికన్ను అయినప్పుడు**

**ఆర్త గీతాలాపనతో – ఆరు ఋతువులూ గ్రీష్మాలే అయినప్పుడు**

**బ్రతకటం కోసం మేము ప్రతి క్షణమూ చావాల్సి వచ్చినప్పుడు**

**ఓ చతురాననా! ఓ విశ్వంభరా! ఓ గంగాధరా!**

**మా ఆనంద సాగరాల్లో నీళ్ళెలాగూ లేవు.**

**ఏడవటానికి మా కళ్ళకి నీళ్ళివ్వు.**

## 9

**ధన్‌రాజ్ మొదలియర్** విసుగ్గా ఉన్నాడు.

అతడి ముందు నిలబడ్డ మునిసిపల్ కమీషనర్ –'మొదటిసారి పోలీస్ స్టేషన్ కొచ్చిన బ్రోతల్' లా వున్నాడు. ఫ్లూకి ఎక్కువా, మలేరియాకి తక్కువ స్టేజిలో వణుకుతున్నాడు.

"దీపావళి వచ్చేసరికి లక్షల్లక్షలు బహుమతులు దొబ్బుతారు. పని చెయ్యాల్సి వచ్చినప్పుడు మొహం చాటేస్తారు. రొంబ చావొచ్చి పడిందే మీతో. మీకన్నా వ్యభిచారం చేసేది నయం కదయ్యా, తీసుకున్న డబ్బుకి కరెక్టుగా పనిచేసి పెడద్ది..."

కమీషనర్ మొహం ఎర్రబడింది. ఈ వ్యవస్థ మీద కోపం వచ్చింది. కొడుక్కి ఇంజనీరింగ్ సీటు కోసం అయిదు లక్షలు ఖర్చు పెట్టవలసి రాకపోతే ఇప్పుడిలా చేతులు కట్టుకు నిలబడాల్సి వచ్చేది కాదు కదా.

"ఏవంటాడా చీఫ్ మినిష్టరు?"

"రిజర్వ్ పోలీసుని తీసుకుని రేపు సాయంత్రానికల్లా పగలగొట్టమన్నారు".

"ఏమిటి పగలగొట్టేది? తలలు పగుల్తాయన్జెప్పు".

ధనరాజు భాష గమ్మత్తుగా వుంటుంది. నెల్లూరూ తూర్పుగోదావరీ కలిసి తెలంగాణాలోకి తర్జుమా చేసినట్టుంటుంది. మధ్య తమిళం అద్దుతాడు.

ఒక అర్ధరాత్రి మొదలియార్ కార్లో వెళ్తూండగా అతడికో ఆలోచన వచ్చింది. రోడ్డు పక్కనున్న పబ్లిక్ యూరినల్స్ స్థానే కొట్లు కట్టి అద్దెకివ్వటం అనే ఆలోచన అది!

మున్సిపాలిటీవాళ్ళు ఈ మూత్రశాలల్ని సాధారణంగా రద్దీగా వుండే మెయిన్ రోడ్డు కూడళ్ళలో నిర్మిస్తారు. వీటి దుర్గంధాన్నించి మిగతా కట్టడాలు దూరంగా ఉంచుతారు. ఆ ఖాళీ స్థలం – ప్లస్ – ఈ యూరినల్స్ కలుపుకుంటే మూడు కోట్లు (మడిగెలు) వస్తాయి. మంచి రద్దీ ఏరియాలో అయితే పగడీయే లక్ష రూపాయల దాకా వస్తుంది. అమ్మేస్తే ఒక్కోకొట్టుకీ అయిదు లక్షలకి తక్కువ రాదు. నగరంలో ఇలాంటి అన్ని స్థలాలూ కలుపుకుంటే, లంచాలూ బహుమతులూ కట్టడం ఖర్చులూ పోను రెండు కోట్లు ఈజీగా మిగులుతుంది.

అద్భుతమైన ఆలోచన!

ఆలోచన రావటం ఏమిటి – అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసి పని ప్రారంభించాడు. సగంలో వచ్చిపడింది చిక్కు. ముఖ్యమంత్రి మునిసిపల్ కమీషనర్ని పిలిచి తలవాచేట్టు చివాట్లు పెట్టాడు. రిజర్వ్ పోలీసుని తీసుకెళ్ళి కట్టడాల్ని తొలగించమని ఆదేశాలిచ్చాడు.

అత్తారింటికి 'రానంటే' మొగుడు చంపుతాడు. 'వెళ్తానంటే' మిండగాడు చంపుతాడు అన్నట్టుంది మునిసిపల్ కమీషనర్ పరిస్థితి. మొదలియార్ని కాదంటే

కష్టం. మెడిసిన్‌లో వచ్చే ఏడాది సీటొస్తుందని ఇప్పట్నుంచే తెల్లకోటు వేసుకుతిరుగుతోంది పెద్దకూతురు.

"సర్లె నువ్వెళ్ళు. ఈ విషయమేదో నేను చూస్తాలే" అన్నాడు మొదలియార్. కమీషనర్ కదల్లేదు. చేతులు నులుముకుంటూ నిలబడ్డాడు. "...ఏందయ్యా?" అన్నాడు మొదలియార్.

"వచ్చే సంవత్సరం నా కూతురి మెడిసిన్ సీటు గురించి గుర్తు చేయమన్నారు" అన్నాడా కమీషనర్ ఎప్పుడేది మాట్లాడాలో తెలియక. మొదలియార్ ఖస్సుమన్నాడు.

"నా ఇండ్లు పడగొట్టి తిరిగి ప్రజలకోసం పిషాబుఖానాలు కట్టాలని ముఖ్యమంత్రి చెప్పినప్పుడు నీ కూతురి విషయం గుర్తురాలేదా? అయినా వచ్చే ఏడాది ప్రతి మండలంలోనూ ఒక డొనేషను కాలేజీ పెడ్తున్నరు కదయ్యా. ఇంకా నా సాయమెందుకు?"

"మా అమ్మాయికి సెకండ్ క్లాసు కూడా వస్తుందో లేదో అనుమానమండీ".

"అదా నీ భయం. అయినా అట్టాటి దాన్ని డాక్టరీ చదివించి ప్రజల మీదకి వదుల్తే పురుగులుపట్టి పోతావయ్యా కమీషనరూ. మా మేనల్లుడు ఇట్లానే ముచ్చటపడితే తమిళనాడు నుంచి కర్ణాటక పంపి చదివించినా, గొంతు నొప్పి అని పేషెంట్ వెళ్తే గుండె కాపరేషను చేసినాడంట. గొడవైతే పీక్కోలేక చచ్చాడు. సర్లే, నువ్వెళ్ళు. నా మరుగుదొడ్ల సంగతి నువ్వు చూడు. నీ కూతురి సంగతి నేను చూస్త..."

కమీషనర్ నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

ధనరాజ్ మొదలియర్ ఒక్క నిముషం నిశ్శబ్దంగా కూర్చుని ఫోన్ డయల్ చేశాడు.

రిసెప్షనిస్టు ఛైర్మన్‌కి కనెక్షన్ ఇచ్చింది. అట్నుంచి ధనుంజయ అన్నాడు. "నేనే నీకు చేద్దామనుకుంటున్నాను. నీతో కాస్త పని వచ్చింది".

"దాని సంగతి వింటాలే. ముందా ప్రైమ్ మినిష్టర్ దగ్గర నీ పలుకుబడి ఉపయోగించి ఈ ముఖ్యమంత్రిని లేపెయ్యమని చెప్పు".

ధనుంజయ అట్నుంచి నవ్వి. "మళ్ళీ ఏమైంది?" అని అడిగాడు.

"నేనేదో నగరం నీట్‌గా వుండాలని పబ్లిక్ యూరినల్స్ అన్నీ పడగొట్టి అందంగా కొట్లు కట్టిస్తూంటే మధ్యలో ముఖ్యమంత్రి కేమయిందయ్యా? అందుకే అసమ్మతి పెరిగిపోతుంది! ఆడ్ని దింపేసి మన పర్వతాల నాయుడ్ని చీఫ్ మినిష్టర్ని చేస్తేగానీ లాభం లేదు".

"హైకమాండ్‌కి పర్వతాల నాయుడి మీద చాలా తక్కువ అభిప్రాయం వుంది. చీర కనిపిస్తే చాలు పిచ్చెక్కిపోతాడని".

"చీఫ్ మినిష్టర్‌కి లేదా చీరెల పిచ్చి? అర్థరాత్రి అత్తవారింటికెళ్ళినట్టు నగరం నిద్రపోగానే ఈడా ఈరారం ఎమ్మెల్యే రంగసాని ఇంటికెళ్ళి పడుకోటంలేదా? ఇదుగో... నన్ను రెచ్చగొట్టొద్దు. నాగ్గానీ తిక్క రేగిందంటే మహిళా విభాగం ప్రెసిడెంట్ పదవి నిస్తానన్జెప్పి ఎంత మంది పార్టీ వర్కర్లని ఈ చీఫ్ మినిష్టర్ పాడుచేశాడో పబ్లిగ్గా పేపర్‌లో ఫోటోలు వేయిస్తాను".

ధనుంజయ నవ్వి, "అసలు విషయం చెప్పు" అన్నాడు.

మొదలియార్ చెప్పాడు.

అంతా విని "ఇంతేనా. సర్లే ఈ విషయం చూసీ చూడనట్టు వదిలెయ్యమని ప్రైమ్ మినిష్టర్‌తో చీఫ్ మినిష్టర్‌కి చెప్పిస్తాలే" అన్నాడు ధనుంజయ.

"ప్చ్! ఏదో ఈ దేశాన్ని తల్చుకుంటే జాలేస్తుంది ధనుంజయా. అయోధ్య రామాలయ కట్టడంలాంటి మేటర్ సెటిల్ చేయాల్సిన ప్రధానమంత్రి – మరుగుదొడ్ల కట్టడం గురించి టైము వేస్టు చేసుకోవాల్సి వస్తోంది. అందుకే మన రాష్ట్రంలో అసమ్మతి యిలా పెరిగిపోతోంది. ప్రతి చిన్న విషయానికీ కలగజేసుకోవద్దని ప్రైమ్ మినిష్టర్‌కి నా మాటగా చెప్పు".

"నేను అడుగుతున్నానని ఏమీ అనుకోకు మొదలియార్. రెండు కోట్ల కోసం ఇంత గొడవెందుకు? నగరంలో పబ్లిక్ యూరినల్స్ అవసరం చాలా వుంది కదా. వాటిమీద పడిందేమిటి నీ కన్ను?"

"ఈ దేశంలో మొగాళ్ళు ఎంతమందున్నారో ఆడాళ్ళూ అంత మందే వున్నారు కదా".

"అవును. అయితే?" అర్థంకాక అడిగాడు.

"మరి ఆడాళ్ళకి లేని వసతి మొగాళ్ళకెందుకు? ఆడాళ్ళు మాత్రం రోడ్ల మీద తిరగటం లేదా? సమసమాజమంటూ పార్టీలో నువ్వూ అరిచినోడివే కదా. నువ్వే జెప్పు".

ఈ లాజిక్‌కి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

"సరే, ఇంతకీ నీదేదో అవసరం అన్నావ్ గదా. అదేంటి" మొదలియార్ అడిగాడు.

"జైల్లో వున్న ఒకళ్ళని బయటకు తీసుకురావాలి".

"దాన్దేముంది. అదే వయస్సున్న మరోడ్ని వీడి ప్లేసులో లోపలికి పంపిద్దాంలే. ఇంతకీ బయటకు తీసుకురావాల్సిన వాడెవడు. గుండానా - స్మగ్లరా?"

"మొగాడు కాదు అమ్మాయి."

"అమ్మాయా?" నిజంగానే ఆశ్చర్యపోయాడు మొదలియార్. "ఇంత గొప్ప పొజిషన్‌లో వుంటూ నీకు జైల్లో అమ్మాయి కావాల్సొచ్చిందా?"

"ఛా... ఆ అమ్మాయి నా కూతురు?"

అదిరిపడ్డాడు మొదలియార్ "కుతురా?"

"ఆ అమ్మాయి అమ్మ చచ్చిపోయింది" క్లుప్తంగా అన్నాడు ధనుంజయ.

"అయ్యో పాపం. ఈ విషయం నాకెప్పుడూ చెప్పలేదే నువ్వు".

"చెప్పాను మొదలియార్... చాలా రోజుల క్రితం నువ్వే, నీ మనుష్యుల్తోనే ఒక సత్రం అరుగుమీద ఆవిడ్ని చంపించావు. గుర్తు లేదా?"

"...స...ర...స్వ...తి... బిచ్చగత్తె" గుర్తు తెచ్చుకుంటూ అన్నాడు.

"అవును.... ఆవిడే".

"ఇంకా ఫ్లాష్ బ్యాకు లొద్దులే. అమ్మాయి పేరు చెప్పు".

"విశారద"

"పేరు బావుందే. నువ్వే పెట్టినావా?"

ధనుంజయ దానికి సమాధానం చెప్పకుండా "నాకు నాల్రోజుల్లో నా కూతురు నా దగ్గరుండాలి" అన్నాడు.

"మరి ప్రైం మినిష్టరూ - నా పబ్లిక్ యూరినల్సూ...."

"రాత్రికి ఢిల్లీ మాట్లాడతాను".

ఫోను పెట్టేశాడు మొదలియార్. కుర్రాడు 'టీ' తీసుకొచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు. టీ తాగుతూండగా ఒక పొడుగాటి వ్యక్తి ఆ గదిలోకి వచ్చాడు. అతని పేరు హనుమంతు – మొదలియార్ కుడిభుజం.

"ఏంటి విషయాలు?" అడిగాడు మొదలియార్.

"సుభాష్ చంద్రబోస్ ఏరియాలో మన సేల్సుటాక్సు వాటా కొంత కాలం నుంచీ రావటం లేదు".

మొదలియార్ మొహం చిట్లించి, "ఎందుకు రావటంలేదు?" అని అడిగాడు.

నగరంలో పెద్ద పెద్ద వ్యాపారస్తులు సేల్సుటాక్సు ఎగ్గొట్టటానికి 'బినామీ' పేర్లమీద షాపు తెరిచి వ్యాపారం చేస్తారు. ఒక సంవత్సరం ఆ పేరు మీద వ్యాపారం చేసిన తరువాత దివాళా తీసినట్టు ప్రకటించి ఆ షాపు మూసేస్తారు. బినామీ పేరు కాబట్టి ఇక ఆ కేసులో ప్రభుత్వం చేసేదేమీ వుండదు. మళ్ళీ అదే షాపు – ఇంకో పేరు మీద తరువాతి సంవత్సరం ప్రారంభించి – మళ్ళీ వ్యాపారం మొదలుపెట్టి అమ్మకాలు కొనసాగిస్తారు. బావలూ, బావమరుదులూ, భార్యలూ, పిల్లలూ – అందరూ ఈ బినామీ పేర్లకు తోడ్పడుతారు.

అయితే ఈ బినామీ పేర్లమీద జరిగే బిజినెస్సులు –'మండీ' లో వుండే గూండాలకి క్షణాల్లో తెలుస్తాయి. రాత్రిళ్ళు షాపుల దగ్గిర సరుకు దింపే లారీల్ని ఆపుచేసి, 'దందా' చేసి, హఫ్తాలు వసూలు చేస్తారు. ఈ గొడవలో పోలీసులు

కల్పించుకోరు. వ్యాపారస్తులు కూడా తాముచేసే మోసాన్ని కప్పిపుచ్చుకోవటానికి ఈ విషయాన్ని ఫిర్యాదు చేయరు. ఇది ఇలా నిరంతరం సాగిపోతూ వుంటుంది.

ఒక్కొక్క ఏరియాలో ఈ వసూళ్ళు నెలకు కొన్ని లక్షలుంటాయి. అలాంటి ఏరియాలు నగరంలో పాతికదాకా వున్నాయి. ఈ విధంగా ధనరాజ్ మొదలియార్‌కి వివిధ ఏరియాల నుంచి కోటి రూపాయల దాకా ముడుతూ వుంటుంది.

సుభాస్ చంద్రబోస్ వీధి నుంచి హఫ్తా రావటం లేదని హనుమంతు చెప్పగానే మొదలియార్ "ఎందుకు రావటంలేదు" అని అడిగాడు.

"ఆ ఏరియాలో మన మనిషి దెబ్బతిన్నాడు".

"మన మనిషి ఎవడక్కడ?"

"మస్తాన్ అని.... వాడిని ఎవరో కొట్టారు".

సగం తాగుతున్న 'టీ' కప్పు చప్పుడయ్యేలా బల్ల మీద విసురుగా పెట్టి లేచాడు ధనరాజ్ మొదలియార్. "మన వాడిని కొట్టిందెవరు?"

"చాలా చిన్న గొడవే. ఎవరో ఆడదాని కోసం.... లోకల్ గొడవ" హనుమంతు చెపుతూనే వున్నాడు. మొదలియార్ వెళ్ళి కారులో కూర్చున్నాడు. హనుమంతు కూడా పరుగెత్తుకు వెళ్ళి ముందు సీటు ఎక్కాడు. కారు కదిలింది.

మొదలియార్ మొహంలో ఇప్పుడు నవ్వులేదు. అయిదు నిమిషాల క్రితం ధనుంజయతో మాట్లాడుతూ, జోకులేసిన, మొదలియార్ వేరు. ఈ వ్యక్తి వేరు. ముందే చెప్పినట్టు అతడు తన 'ఆర్గనైజేషన్' పట్ల చాలా ఏకాగ్రతతో వుంటాడు.

చిన్న విషయాలను కూడా చాలా జాగ్రత్తగా డీల్ చేస్తాడు. తన వాళ్ళ మీద ఈగ కూడా వాలనివ్వడు.

అతని కారు అరగంట ప్రయాణం చేసి వెళ్ళి అడ్డా దగ్గర ఆగింది. కారులోంచి దిగుతున్న మనిషిని అందరూ ఆశ్చర్యంగా చూశారు. ఎవరో సన్నటి స్వరంతో "ధనరాజ్ మొదలియార్" అన్నారు నెమ్మదిగా. క్షణాల్లో ఆ వార్త అక్కడ పాకిపోయింది. మస్తాన్ లాటి 'సి' క్లాసు గూండా ఇంటికి ధనరాజ్ మొదలియార్ రావటం అక్కడ ఎనిమిదో వింతలా వుంది. క్షణాల్లో ఆ ప్రదేశమంతా ఖాళీ అయిపోయింది.

హనుమంతుకి మాత్రం మొదలియార్ ఇంత గొప్పవాడు ఎలా అయ్యాడో అర్థమైంది. ప్రతీ బోల్టూ బావుంటేనే యంత్రం సజావుగా నడుస్తుంది. మొదలియార్ లాటి వ్యక్తి స్వయంగా వచ్చి పలకరించటం వల్ల ఇక మస్తాను జీవితాంతం కృతజ్ఞతతో వుంటాడు. తన వాళ్ళ కోసం మొదలియార్ ఎంత శ్రద్ధ తీసుకుంటాడో చెప్పటానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

మస్తాన్‌ని చూడగానే మొదలియార్‌కి విషయం అర్థమయింది. మస్తాన్ మానసికంగా 'బ్రేక్' అయిపోయాడని చూడగానే తెలుస్తూంది. కొంతమంది గూండాలంతే. మర్డర్లు చేస్తారు. ప్రేవులు తీస్తారు. కానీ తిరిగి తమ మీద అటాక్ జరిగితే బ్రేక్ అయిపోతారు. మస్తాన్ ఆ స్టేజిలోనే వున్నాడని తెలుసుకున్నాడు. అతడిని ఆ మానసికమైన షాక్ నుంచి తప్పించటం మొదటి పనిగా భావించాడు.

"ఏమైంది మస్తాన్? ఏదో గొడవ జరిగిందటగా?" కూర్చుంటూ అడిగాడు. మస్తాన్ సమాధానం చెప్పలేదు. అతడి గెడ్డం మీద నుంచి పెదాల మీదుగా

మాంసం ఇంకా కాలిపోయి పచ్చిగానే వుంది. మొదలియార్‌కే అది భయంకరంగా కనిపించింది. మస్తాన్ ఎందుకింత బెదిరిపోయాడో ఆ గాయం చూస్తూంటే అర్థమయింది.

"మనం అజాగ్రత్తగా వున్నప్పుడు పిల్లి అయినా సరే మనని భయపెడుతుంది మస్తాన్. దాన్ని పట్టించుకోనవసరం లేదు. సేల్సుటాక్సు కమీషన్లు రావటం లేదంటే ఎందుకని అడిగాను. నీ గురించి చెప్పారు... ఆరోగ్యమయితే బాగానే వుందికదా" పరామర్శిస్తున్నట్టు అడిగాడు. దానికి సమాధానం చెప్పకుండా – "వాడిని నేను చంపందే నిద్రపోను" అని కసిగా అన్నాడు మస్తాన్.

"పద మరి" అంతకంటే క్లుప్తంగా అన్నాడు మొదలియార్.

మస్తాన్ బిత్తరపోయి చూశాడు. "...అవును మరి ఇక ఆలస్యం దేనికి?" అంటూ ఫోన్ దగ్గరికి నడిచి, నెంబర్ డయల్ చేసి "హలో పోలీస్ స్టేషనా" అన్నాడు మొదలియార్.

"యస్. రాధాకృష్ణమాచారి స్పీకింగ్".

"నేను సార్! ధనరాజ్ మొదలియార్‌ని మాట్లాడుతున్నాను. వణక్కం".

క్రితం రోజు వ్రాయాల్సిన రామకోటి వ్రాయటం అప్పుడే పూర్తి చేశాడు ఎస్.ఐ. రాధాకృష్ణమాచారి. అవతలివైపు పేరు వినేసరికి 'ఎరెక్ట్' అయ్యాడు. అయితే ఇక్కడో విషయం గమనించాలి. గూండాలూ, దాదాలు బయట ఎంతయినా దాదాగిరి చెలాయిస్తారు. వర్తకుల దగ్గర జులుం చూపిస్తారు. రాజకీయ నాయకుల దగ్గర చనువు ప్రకటిస్తారు. కానీ పోలీసుల దగ్గర మాత్రం

విధేయంగా వుంటారు. అవతలి వ్యక్తి ఐ.జి. కానీ, లేక సాధారణ పోలీసు కానీ, ఎవరయినా సరే, నమ్రత చూపిస్తూ, మర్యాదగా మాట్లాడతారు. ఎంతో పెద్ద రభస అయితే తప్ప పోలీసు మనిషితో జగడం పెట్టుకోరు. ఇన్స్పెక్టర్ స్మగ్లర్ ముందు చేతులు కట్టుకుని నిలబడటం కేవలం సినిమాలలో కనబడుతుంది. ఎంత లంచగొండి అయినా, మందుగొండి అయినా పోలీస్ అధికారి తన (ఫాల్స్?) ప్రిస్టేజి మర్చిపోడు. రౌడీలు కూడా ఆ అధికారాన్ని ఒప్పుకుంటూ, తమ పనులు కొనసాగిస్తారు.

"ఏమిటి చెప్పండి" అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఆ బోసు మీకు తెలుసుగా! మా వాడి మొహంమీద అడ్డంగా కాల్చాడు. ఆ విషయం మాట్లాడటానికి వాడి ఇంటికి వెళుతున్నాం. అహ ఏంలేదు. ఊరికే మీకు చెప్పటానికి ఫోన్ చేశానంతే... అబ్బే ఇంత చిన్న విషయానికి మీరెందుకు సాబ్. మేమూ మేమూ చూసుకుంటాం. మీ భార్యా, పిల్లలూ బావున్నారు కదా అన్నట్టు మీ ఏరియాలో గుడి కట్టిస్తున్నారట కదా! మొన్నెవరో వచ్చి చందా తీసుకెళ్ళారు... ఏంజేస్తాం సారూ డబ్బు సంపాదించి దేముడికి కాస్త యిస్తే పుణ్యం వొస్తది. ఉంటాను సార్ నమస్తే..."

రాధాకృష్ణమాచారి ఫోన్ పెట్టేశాడు. ధనరాజ్ మొదలియార్ ఇచ్చిన 'హింటు' అర్థమయినది '... అతడు మా వాడిని దెబ్బతీశాడు. మేము వాడి అంతు తేల్చదల్చుకున్నాం. మీరు మధ్యలో కల్పించుకోకండి' అని అన్యాపదేశంగా చెప్పాడు.

పెద్ద క్రిమినల్స్ పోలీసు స్టేషన్లకి ఇలాటి 'ఫీలర్లు' పంపటం మామూలే... చేతిలోకి కలం తీసుకుని ఆ రోజు వ్రాయాల్సిన రామకోటి వ్రాయటం ప్రారంభించాడు కృష్ణమాచారి.

అటువైపు మొదలియార్ ఫోన్ పెట్టేశాక బయటకొచ్చి కారులో కూర్చుంటూ "ఊ.... ఇప్పుడు చెప్పు ఏమిటి గొడవ?" అని అడిగాడు.

ప్రయాణం జరుగుతూన్న అయిదు నిముషాల్లో మస్తాన్ మొత్తం విషయం చెప్పాడు.

అంతా విని "ఆ పిల్ల బావుంటుందా?" అని అడిగాడు.

"బావుంటుంది. చాలా బావుంటుంది సాబ్!"

కారు అప్పుడే బోసుబాబు వీధిలోకి తిరగబోతుంది. మొదలియార్ డ్రైవరుతో, "ఇటొద్దు. షేర్‌గంజ్‌కి పోనీ..." అన్నాడు. డ్రైవరు సర్రున కోశాడు. మస్తాన్‌కి ఈ ప్రోగ్రాం అర్థంకాలేదు. కారు షేర్‌గంజ్‌కి వెళ్ళి మోటారు షెడ్డు ముందు ఆగింది. హఫీజు పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"మల్లేశు వున్నాడా?"

"ఉన్నాడు సాబ్!"

"ఇద్దరూ రెండు కార్లలో నన్ను ఫాలో అవండి. సందుకి చెరో పక్కా వుండండి" అంతకన్నా విపులంగా అతనెప్పుడూ సూచన్లు ఇవ్వడు.

కారు కదిలింది.

మస్తాన్‌కి ఈ ఏర్పాటంతా దేనికో అర్థంకాలేదు. సాధారణంగా అవతలి మనిషి మరీ బలవంతుడయితే, స్ట్రీటు ఫైట్ జరక్కుండా చేసే ఏర్పాటు ఇది. ఏదో అడుగుదామని పక్కకి చూసి వులిక్కిపడ్డాడు.

ధనరాజ్ మొహంలో ఏదో మార్పు కనబడుతూంది. 'సాడిస్టు' అన్న పదానికి అర్థం మస్తాన్‌కి తెలీదు. కృష్ణుడి జననం గురించి వినగానే కంసుడిలోంచి బయటకొచ్చినట్టు అతడిలోంచి ఆ సాడిస్టు బయటకు వస్తున్నాడు. లేడి రక్తం తాగటానికి సిద్ధపడుతూన్న పులిలా ఉన్నాడతను. ఒక రకమైన అలౌకిక ఆనందంతో వున్నట్టు బొటనవేలితో చూపుడు వేలుని రాస్తూ "నువ్వెప్పుడయినా ఆడదాన్ని ఆరుబయట అనుభవించావా మస్తాన్!" అని అడిగాడు.

మస్తాన్ ఏదో చెప్పబోతూంటే... కారు బోసుబాబు ఇంటిముందు ఆగింది. మొదలియార్ కారు దిగి, ముందు సీట్లో కూర్చున్న హనుమంతుతో "నువ్వు రా" అన్నాడు.

రోడ్డుకి చెరో పక్క రెండు కార్లు ఆగివున్నాయి. హనుమంతు గుమ్మం దగ్గర నిలబడ్డాడు. ఇద్దరూ లోపలికి ప్రవేశించారు.

అప్పుడే శారద లోపల్నుంచి ముందు గదిలోకి వస్తూంది. మొదలియార్‌ని చూసి "ఎవరు కావాలండీ?" అని అడగబోతూ, వెనుకవున్న మస్తాన్‌ని గమనించి, ఒక భయంకరమయిన దృశ్యం చూస్తున్నట్టు శిలాప్రతిమలా నోటమాటరాక నిలబడిపోయింది.

గడియారం ఆరు గంటలు కొట్టింది.

మస్తాన్ తలుపు గడియ వేసేశాడు.

# 10

**సెకండ్ షో వదిలేశారు.** అమ్మకాలు పెద్దగా లేవు. జనం ఇళ్ళకు వెళ్ళిపోయే హడావుడిలో వున్నారు.

అర్థరాత్రి ... పన్నెండు కావొస్తూంది.

బోసు సైకిలుస్టాండు తీస్తూండగా, "నమస్తే అన్నా" అని వినపడింది. తలతిప్పి చూస్తే సుధాకర్ కనపడ్డాడు.

సుధాకర్ అక్కడే సినిమాహాల్ దగ్గర బ్లాకులో టిక్కెట్లు అమ్ముతాడు. మనిషి ఎప్పుడూ నవ్వుతూ, మనసులో ఏ కల్మషమూ లేనట్టు ప్లెయిన్‌గా వుంటాడు.

బోసు దగ్గరకొచ్చి జేబులోంచి డబ్బు తీసి ఇస్తూ... "ఇదిగో అన్నా నీ నాలుగొందలు" అన్నాడు. అతని దగ్గరనుంచి వస్తున్న వాసన చూసి "ఏమిటి? ఈ రోజు చాలా ఆనందంగా వున్నట్టున్నావు. అప్పు కూడా తీర్చేశావు?" అన్నాడు.

"ప్రొద్దున్నే వెయ్యి రూపాయలు సంపాదించాను. అదీ ఆనందం" అన్నాడు సుధాకర్. "థాంక్స్ అన్నా! అడగ్గానే నాలుగు వందలు ఇచ్చావు".

ఇద్దరూ రోడ్డు మీద నడుస్తూ వస్తున్నారు. సెకండ్ షో వదిలి చాలా సేపవటం వల్ల రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి.

"నువ్వుండేది ఎక్కడ?" బోసు అడిగాడు.

"కాలవ తెలుసుగా, దాని పక్కన గుడిసెల్లో, బిర్లానగర్... నేనే పెట్టాలే దానికి ఆ పేరు..." నవ్వేడు. "...ఎప్పుడన్నా రా అన్నా. మీలాగా పెద్ద యిల్లు

కాదనుకో, చిన్న గుడిసె. నేనొక్కణ్ణేగా.... సరిపోతుంది... ఎక్కువ సేపు వుండద్దులే".

"ఇంత చక్కగా మాట్లాడతావు. ఏం చదువుకున్నావు సుధాకర్ నువ్వు".

సుధాకర్ వెంటనే జవాబు చెప్పకుండా జేబులోంచి విస్కీ తీసి తాగేడు. సీసా తిరిగి లోపల పెడుతూ, "ఈ రోజు వెయ్యి రూపాయలూ ఎలా సంపాదించానని అడగవేం?" అన్నాడు.

"ఎలా సంపాదించావు?"

"చాలా పెద్ద ప్లాను వేశానులే. పది రోజుల నుంచి ఒక బ్యాంకును చూస్తున్నా. లెడ్జర్లన్నీ వెనకాలే ఇష్టం వొచ్చినట్లు పడేస్తారు. పది రూపాయలు పెట్టి అకౌంటు మొదలు పెట్టి, వంద రూపాయలు పెట్టి లాకరు తీసుకున్నా. లాకర్ రూమ్‌లోకి వెళ్తూ – నా అకౌంటున్న లెడ్జరు తీసుకెళ్ళి ఓ వెయ్యి రూపాయలు క్రెడిట్‌లో వ్రాసుకున్నా. గంటాగి వెళ్ళి డబ్బు డ్రా చేసుకున్నా సింపుల్" అంటూ నవ్వేడు. "...మన అడ్రస్ మనకే తెలీదు. ఇంక ఆ బ్యాంకు వాడికేం తెలుస్తుంది?"

బోసు తలమునకలయ్యే ఆశ్చర్యంతో చూశాడు. నాలుగు రోడ్ల కూడలి వచ్చింది.

"వెళ్ళొస్తా అన్నా. మన బిర్లానగర్‌కి దారి ఈ సందులోంచే. మళ్ళీ ఇంకోసారి థాంక్స్ అప్పిచ్చినందుకు".

"ఇంతకీ నువ్వేం చదువుకున్నావో చెప్పలేదు".

సీసా తీసి ఒక్క గుక్కలో ఖాళీచేసి దూరంగా తుప్పల్లోకి విసిరేస్తూ అన్నాడు. "అయిదు సంవత్సరాల క్రితం ఆగస్టు పన్నెండు, ఆంధ్రజ్యోతి దొరికితే నాలుగో పేజీ కుడివైపు మూల ఫోటో చూడు. అది నాదే".

"ఎందుకు పడింది?"

"ఆ రోజే ఎం. కామ్. రిజల్ట్స్ వచ్చాయి"?

- అతడు అంతకన్నా ఎక్కువ వివరణ యివ్వలేదు. ఇప్పుడు అతని మొహంలో నవ్వులేదు. తూలుకుంటూ నెమ్మదిగా నడుస్తూ చీకట్లో కలిసిపోయాడు.

బోసు చాలాసేపు అక్కడే నిలబడిపోయాడు.

నాలుగురోడ్ల కూడలి.

చుట్టూ చీకటి.

సుధాకర్ యిచ్చిన షాక్ నుంచి అతడింకా తేరుకోలేదు.

బోసు కెందుకో ఆ నాలుగురోడ్ల కూడలి ఒక సింబాలిక్ షాట్‌లా కనపడింది. ఒకటి తను వచ్చినదారి. ఇంకొకటి తనింటికి దారి. చెరోవైపు రెండు విభిన్న లొకాలిటీలు.

తన ఆలోచన తనకే నవ్వొచ్చి, సైకిల్ ఎక్కి తొక్కసాగాడు.

చల్లటి గాలి వీస్తోంది.

ఇంటి లోపల సైకిలు పెట్టి, గదిలోకి వచ్చాడు.

ఎవరూ ఇంకా నిద్రపోకపోవటం అతడికి కొంచెం ఆశ్చర్యంగా అనిపించింది. రామ్మూర్తి కూడా పక్కమీద పడుకుని మెలుకువగానే వున్నాడు.

తండ్రి మరణపు విషాదఛాయల నుంచి ఇంకా వాళ్ళెవరూ తేరుకోలేదు. బహుశా అదే కారణమేమో అనుకున్నాడు. గోమతి భోజనం వడ్డించింది. "ఇంకా ఎవరూ నిద్రపోలేదేం?" అని అడిగాడు.

ఆమె సమాధానం చెప్పలేదు.

భోజనం ముగించి అతను ముందు గదిలోకి వచ్చాడు. ఆ వెలితి ఇప్పుడు కొట్టొచ్చినట్టు తెలుస్తోంది.

ఏదో శూన్యత, ఏదో వెలితి.

తన పక్క దగ్గరికి వెళ్తూ అకస్మాత్తుగా ఆగిపోయాడు.

శారద లేదు.

అసలామె తాలూకు 'పడకే' లేదు.

ఆ ఖాళీస్థలమే వెలితి.

"శారదేది ?" అడిగాడు.

ఎవరూ సమాధానం చెప్పలేదు.

"శారదేదీ?" అతడి కంఠం వణికింది.

జవాబు లేదు.

అతడు పిడికిళ్ళు బిగించి గట్టిగా "శారదేది?" అని మళ్ళీ అడిగాడు.

నిశ్శబ్దమే సమాధానమయింది.

అతడు గోమతి దగ్గరకు వెళ్ళి "శారద ఏమైందిరా?" అని బ్రతిమాలుతున్నట్టు అడిగాడు. ఆమె అతడి కళ్ళలోకి ఒకసారి చూసి తలదించుకుంది.

"వెళ్ళిపోయింది" అన్నాడు రామ్మూర్తి. అతడు చప్పున వెనుదిరిగాడు.

"ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయింది. సాయంత్రం నుంచీ వెతికాను. ఉత్తరం ఏదయినా దొరుకుతుందేమోనని యిల్లు కూడా వెతికాము. దొరకలేదు".

అతడు రామ్మూర్తి దగ్గరకు వెళ్ళాడు. ఆ విసురుకీ, వేగానికీ భయపడి రామ్మూర్తి చప్పున పక్కమీద లేచి కూర్చున్నాడు. అయితే బోసుబాబులో ఆవేశం లేదు. మోకాళ్ళమీద కూర్చుని, ప్రార్థిస్తున్నట్టు –"నిజం చెప్పన్నయ్యా! నువ్వేమన్నా అన్నావా?" అని అడిగాడు రుద్ధంగా . రామ్మూర్తి అతడివైపు బాధగా చూశాడు. బోసుబాబు బ్రతిమాలుతున్నట్టు అన్నాడు. "నాన్నగారు బ్రతికి వున్నంతకాలం వుంచుకుని ఇప్పుడు శారదని ఇంట్లోంచి బయటకు గెంటేస్తే నాన్న అత్మ శాంతించదన్నయ్యా, క్షోభిస్తుంది".

"గోమతి మీద ఒట్టేసి చెపుతున్నాను. నేనేమీ అనలేదు. నేనేకాదు, మేము ఎవరమూ ఏమీ అనలేదు."

అతడు నేలకేసి చూస్తూ వుండిపోయాడు.

"నేను దుర్మార్గుణ్ణి అయితే అయ్యుండవచ్చు. కానీ నీచుణ్ణి కాన్రా బోసూ".

బోసుబాబు ఈ ప్రపంచంలో లేడు, శారద ఎందుకు వెళ్ళిపోయిందా అని లక్ష అనుమానాలు.

-పెద్దవాళ్ళు లేని ఇంట్లో తను వుండటం ఎందుకని వెళ్ళిపోయిందా?

- ఆర్థికంగా చితికిపోయిన కుటుంబం మీద ఇంకొక వ్యక్తి బరువు కూడా ఎందుకనుకుందా?

- తన వలన వస్తున్న ప్రమాదాలు చూసి దూరంగా పారిపోయిందా? కారణాలు తెలియని చర్యల వెనకున్న కథలు కాలమే చెప్పాలి.

# అధ్యాయం - 2

తాళం చప్పుడికి కళ్ళు తెరిచింది విశారద. అప్పుడు రాత్రి ఎనిమిదయింది.

సెంట్రీ సెల్ తలుపు తీసి విశారదని బయటకు రమ్మన్నాడు. విశారదకి ఆశ్చర్యమేసింది. సాధారణంగా ఈ సమయంలో ఖైదీలను బయటకు పిలవరు.

ఏమీ అర్థంకానట్టు విశారద అక్కడే నిలబడింది. "వెళ్ళు, నిన్ను వదిలేస్తున్నాం" అన్నాడు. ఆమె అతనివైపు అయోమయంగా చూసింది. "... బయట నీ కోసం ఎవరో వచ్చారు. వెళ్ళు" అన్నాడు. ఆమె అదే మానసిక స్థితిలో చిన్న తలుపుగుండా వంగి బయటకొచ్చింది.

బయట ఒక పొడవాటి కారుంది. రూపాయి కాసుల్ని కొలిమిలో అందంగా కరిగించి, దానికి బంగారుపూత పూసినట్టుంది.

దాని దగ్గర నిలబడ్డ డ్రైవరు కూడా ఒక ఆఫీసర్ లాగానే వున్నాడు.

వినమ్రంగా వంగి, కారు డోరు తీసి 'ఎక్కండి' అన్నట్టు పట్టుకున్నాడు. కలలోలాగే నడిచి కారెక్కింది.

అదే మొదటిసారి ఆమె కారెక్కటం! పూలమీద కూర్చున్నట్టుంది ఆ మెత్తని సీట్లమీద కూర్చుంటే. డబ్బున్నవాడు ప్రతి కష్టాన్ని పైసలు వెదజల్లి అధిగమించినట్టు, రోడ్డు మీద గతుకులు లోపలికి అసలు తెలియటం లేదు.

కారు అరగంట ప్రయాణం చేసి ఒక విశాలమైన భవనంలో ప్రవేశించి పోర్టికోలో ఆగింది.

పై మెట్టుమీద నిలబడి వున్నాడు ధనుంజయ.

అతడామెను లోపలికి తీసుకువెళ్ళాడు.

విశాలమైన హాలు అది. అక్కడ నిలువెత్తు స్తంభాలు హిరణ్య కశిపుడు కూడా బ్రద్దలు కొట్టటానికి వీల్లేనంత పటిష్టంగా వున్నాయి.

"నీ గది బావుందా?" అన్న మాటలకి ఆలోచన్ల నుంచి తేరుకుని చుట్టూ చూసింది. ఆ గదిలో ప్రతి అంగుళంలోనూ కంఫర్టు తాపడం చేసినట్టుంది.

"నీ గదే ఇది. బావుందా?"

"నన్ను జైలునుంచి ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారు?"

"ఇంకా జైలేమిటి? నీ శిక్ష కేన్సిల్ అయిపోయింది".

ఆమె ఆశ్చర్యంగా "... ఎలా?"

"అదంతా ఇప్పుడెందుకు? ఇక ఆ జీవితం సంగతి మర్చిపో. ఈ క్షణం నుంచీ నువ్వు నా కూతురివి" అంటూ అతడు దగ్గరగా వచ్చి అన్నాడు. "నాకంటూ ఎవరూ లేరు. అయిందేదో అయిపోయింది. ఈ ఆస్తంతా నీదే. పాత జీవితం సంగతి మర్చిపో. నువ్వు ఎక్కడ చదువుకుంటానంటే అక్కడ చదివిస్తాను. డార్జిలింగ్... స్విట్జర్లాండ్..."

"మా అమ్మనెందుకు చంపించారు ?"

తన ధోరణిలో తాను చెప్పుకుపోతున్న ధనుంజయ ఆమె నుంచి హఠాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నకి వెంటనే సమాధానం చెప్పలేక తడబడ్డాడు. కానీ వెంటనే సర్దుకుని, "మీ అమ్మ చచ్చిపోయిందా? నాకు తెలీదే" అన్నాడు. ఆమె దాని గురించి రెట్టించలేదు. అతడినే సూటిగా చూస్తూ ఇప్పుడు "నన్ను మీ కూతురుగా వప్పుకుంటానంటున్నారు. మీ ఆఫీసుకి నేనూ, అమ్మా వచ్చినప్పుడు మమ్మల్ని ఎందుకు స్వీకరించలేదు?" అని అడిగింది.

"మీ అమ్మ భావాలన్నీ కరడుగట్టేయి. ఆమెదో వితండవాదం. ఈ డబ్బూ, ఆస్తీ.... వీటన్నిటినీ వొప్పుకోదు"

"మరి ఆమె కూతుర్ని – నేను మాత్రం వొప్పుకుంటానని ఎలా అనుకున్నారు?"

అతడు చిరాకుని అతి కష్టంమీద అణచుకుని "సరస్వతి నా భార్య కాదు. కానీ నువ్వు నా కూతురివి. చాలా... ఈ సమాచారం?" అని "...అసలు నేను ఏ పొజిషన్‌లో నిన్ను వుంచబోతున్నానో నీకేమైనా అర్థమవుతుందా? కోట్ల ఆస్తికి వారసురాలిని చేయబోతున్నాను నిన్ను" అన్నాడు.

"అది నా మీద ప్రేమతో కాదు. పిల్లల్ని కనకుండా మీ భార్య చచ్చిపోయింది కాబట్టి... మీకంటూ వారసులు ఎవరూ లేరు కాబట్టి"

"కనకపు సింహాసనం సామెత గుర్తుచేయకు."

"శునకం సింహాసనం కోసం తన విశ్వాసాన్ని వదులుకోదు".

"గొప్ప నాటకీయంగా మాట్లాడుతున్నావే" వెటకారంగా అన్నాడు.

ఆమె గాఢంగా నిశ్వసించి, "సరే నాన్నగారు. ఒక షరతు మీద మీతో కలసి వుంటాను" అంది.

"మీ కూతురు మీకు కావాలనుకుంటే, మీరు నాతో కలవండి. మొత్తం ఆస్తంతా ఖర్చుపెట్టి ఒక స్కూల్ పెడదాం? అమ్మ ఆత్మ శాంతిస్తుంది".

"నువ్వు విప్లవం సినిమాలు ఎక్కువ చూస్తావనుకుంటాను. నేను అక్కరలేదు గానీ నా ఆస్తి కావాలా నీకు?"

"నేను అనుకున్నది చెప్పానంతే... మీరూ మారితే అంతకన్నా కావల్సిందేమీ లేదు ".

"నా స్నేహితుడు ఒకడుండేవాడు. యవ్వనంలో సిద్ధాంతాన్ని గొప్పగా నమ్మేవాడు. తరువాత వ్యాపారాలు పెట్టి లక్షలు సంపాదించాడు. నీ సిద్ధాంతం ఏమైందిరా... అంటే, 'దాని కోసం పోరాడేవాళ్ళకి చందాలిచ్చి పోషించాలి కదా. అందుకే కాపిటలిస్ట్ అయి నేను సంపాదిస్తున్నాను' అనేవాడు. నీ ఆత్మవంచన కూడా అలానే వుంది" అన్నాడు వెటకారంగా.

ఆమె బాధపడలేదు. అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నది –"నా తల్లి ఒక సామాజిక విలువని నిలబెట్టటం కోసం తన నైతిక విలువని కోల్పోయింది. ఒక వర్గం వంచనని ఎదుర్కోవటానికి నేను ఆత్మవంచన చేసుకుంటున్నాను... దానికి నా తల్లి నన్ను క్షమిస్తుందనుకుంటున్నాను".

....ధనుంజయకి ఆమె ఒక సవాలుగా తోచింది.

ఆమె అజ్ఞానం పట్ల జాలికూడా వేసింది.

దాన్నే అతడు ఆమెకు నిరూపించదల్చుకున్నాడు. "సరే విశారదా! నువ్వు చెప్పినట్టే చేస్తాను. కానీ నాకు దానికి టైమ్ కావాలి. ఇంత ఆస్తిని డబ్బుగా మార్చటానికి నాకు కనీసం నెలరోజులన్నా పడుతుంది. అదీగాక, నా మీద ఆధారపడి చాలా మంది ఉద్యోగస్థులున్నారు. ఒక రోజులో వాళ్ళని తొలగించలేం కదా" అన్నాడు.

ఆమె సంభ్రమంగా అతడివైపు చూసి, "రాత్రికి రాత్రి అన్నీ చేయమని అనటం లేదు నాన్నగారూ! అసలు వాళ్ళనెవర్నీ తొలగించనవసరం లేదు కూడా. మీలో మార్పు వచ్చింది. అది చాలు గొప్ప ప్రారంభానికి నాంది" అంది.

"నాకో నెలరోజులు టైమివ్వు. నువ్వు కోరిన స్కూలుకి కావలసిన స్థలాన్ని సేకరించి, నిర్మాణం పనులు ప్రారంభిస్తాను" అన్నాడు.

అతడి ఆలోచన వేరు. దీన్ని అతడు తన గెలుపు – ఓటముల సమస్యగా తీసుకున్నాడు.

మరుసటి రోజు నుంచీ ఆమెకు డబ్బు ఇచ్చే సుఖాన్ని రుచి చూపించాడు. షవర్స్, ఎయిర్ కండిషనర్స్, వాల్ – టు – వాల్ కార్పెట్స్, ఫైవ్ స్టార్ డిన్నర్స్, వాటర్ – బెడ్స్....

మధ్యతరగతి వారు కలలో కూడా వూహించలేని.... ధనవంతులు కూడా అనుభవించలేని 70 ఎం. ఎం. స్టీరియో – కంప్యూటరైజ్డ్ గేమ్స్ నుంచి – లేసర్ బీమ్ వీడియో వరకూ అన్నీ అమర్చాడు.

చికెన్ కార్న్ సూప్ నుంచి కేరమల్ కస్టర్డ్ వరకూ మొత్తం చైనీస్ – కాంటినెంటల్ ఆహారాలన్నీ ఆమె ముందుంచాడు.

'డబ్బు' అన్న వ్యసనానికి అలవాటుపడితే అది ఎంత హాయినిస్తుందో రుచి చూపించాడు. దాన్నుంచి బయటపడటం ఎంత కష్టమో నెల రోజులపాటు అలవాటయ్యేలా చేశాడు.

ఆకలి 'కసి' ని పెంచుతుంది. ఆహ్లాదం వ్యామోహాన్ని పెంచుతుంది. ఆమె 'కసి' గాయం మీద వ్యామోహం మందు జల్లుకుంటూ వచ్చాడు. ఇక ఆ అరిస్టోక్రసీ వుచ్చులోంచి తప్పించుకోలేని విధంగా బిగించాడు.

నెలరోజులే, గడిచాయి.

* * *

సరిగ్గా రాత్రి తొమ్మిదింటికి ఆమె అతని గదిలో ప్రవేశించింది. అతడు ఏవో కాగితాలు పరిశీలిస్తున్నాడు. "నాన్న గారూ వెళ్ళిచూద్దామా" అంది.

ధనుంజయ తలెత్తి ఆశ్చర్యంగా, "ఏమిటి చూడటం?" అని అడిగాడు.

"స్కూలు కోసం స్థలం".

అతడు కుర్చీలోంచి లేచాడు. "నీకేమైనా మతిపోయిందా? ఇంకా నీ పిచ్చిపోలేదా?"

"నాకు పిచ్చేమిటి?" తెల్లబోతూ అడిగింది.

"నెలరోజులపాటు నీకిన్ని సుఖాలు చూపించాను. ఇంకా నీకు ఆ పోరాట సిద్ధాంతాల పిచ్చి వదల్లేదా?" అన్నాడు.

"నేను పోరాడను నాన్నగారూ! పోరాటం అనేది అమ్మలాటి వాళ్ళ సిద్ధాంతం. నేను ప్రయత్నించేది మనిషిలో మానసిక ప్రరివర్తన కోసం ... సమసమాజం అనేది రక్తపాతాలవల్లా, తుపాకీ గొట్టం ద్వారా వస్తుందని నేను ఎప్పుడూ నమ్మలేదు. అందుకే స్కూలు అన్నాను! ఆవేశంలో వున్న యువకుల్ని వేడిమీద ఆకట్టుకుంటే, ఆ వేడి తగ్గగానే దాని ప్రభావమూ తగ్గిపోతుంది. అదే చిన్న వయసులోనే వాళ్ళ మనస్సులో విత్తనం నాటితే, వాళ్ళతోపాటూ అదీ పెరిగి

మహావృక్షమవుతుంది. ఐ బిలీవ్ ఇన్ హ్యూమనిజం అండ్ మై అమ్యునేషన్ ఈజ్ చిల్డ్రన్...." అంది.

అతడు విస్మయంతో "ఏం చదువుకున్నావు నువ్వు" అని అడిగాడు. ఆమె వివరాలేమీ చెప్పకుండా "అమ్మ ప్రారంభించింది. జైలరు గారి దయవల్ల అది కొనసాగుతోంది" అంది.

"కానీ ఇప్పుడు జైలు రికార్డుల్లో నీ పేరు శాశ్వతంగా తొలగించబడింది. నువ్వు బయట ప్రపంచంలోకి అడుగుపెడితే ఆకలితో చావాల్సి వస్తుంది. నీ జీవితం కుక్కలు చింపిన విస్తరవుతుంది".

ఆమె నవ్వింది. "పధ్నాలుగేళ్ళ వయసులో పగలు బిచ్చమెత్తుకుని, రాత్రిళ్ళు సత్రం అరుగుమీద పడుకున్నప్పుడే నేను నా జీవితానికి అలవాటుపడ్డాను నాన్నగారూ. ఇప్పుడు కొత్తగా పోయేదేమీ లేదు".

అతడు హేళనగా నవ్వేడు. "అడుక్కు తింటూ స్కూలు పెడతావా?"

"నేను ఆశించిన స్కూలు కోసం – అమ్మని 'చంపిన' మీ దగ్గరే నెలరోజులు వున్నాను. అటువంటిది – ఇంకెవరన్నా దయామూర్తుల దగ్గర అడుక్కుంటే తప్పేముంది?" ఆమె మాటలు అతనికి సూటిగా తగిలాయి.

"స్కూలు... స్కూలు... స్కూలు... ఆయుధాలతోనూ, విప్లవాలతోనూ కొత్త ప్రపంచం వస్తుందని నమ్మేవాళ్ళని చూశాను గాని, స్కూళ్ళ వల్ల వ్యవస్థ మారుతుందని నమ్మేదాన్ని నిన్నే చూశాను".

"చెప్పానుగా. నేను మనిషి నైతిక మార్పుని నమ్ముతానని. అందుకే అమ్మని చంపినా మీ పట్ల నాకు కోపం లేదు. డబ్బుకోసం మీరుచేసే పనులు చూసి జాలివేస్తుందంతే... డబ్బు యింకా హీనమైన పనులు చేయిస్తుంది..."

"బెస్టాఫ్ లక్. అయితే ఒక్క విషయం. ఇంకెప్పుడూ నేను నీ తండ్రిని అని బైట చెప్పకోక. ఎటువంటి పరిస్థితుల్లోనూ అది బయట ప్రపంచానికి తెలియటానికి వీల్లేదు. నా సంగతి తెలుసుగా! నాకేదైనా వ్యతిరేకంగా జరిగితే మనిషిని కాను. కేవలం నీ మీద జాలితో నిన్ను వదిలిపెడుతున్నాను".

"థాంక్స్. నేను మీ కూతురు అని చెప్పుకోవటానికి మీరెంత సిగ్గుపడతారో, మీరు నా తండ్రి అని చెప్పుకోవటానికి నేనూ అంతే సిగ్గుపడతాను" అంది.

అతడి మొహం జేవురించింది.

....ఆమె బయటకు నడిచింది.

బయట చీకటిగా వుంది. రాత్రి పదింటికి ఇంటిలోనుంచే బయటకొచ్చిన 'అమ్మగార్ని' చూసి గూర్ఖా ఆశ్చర్యంతో గేటు తీశాడు.

విశాలమైన దారి. కుడివైపుకీ... ఎడమవైపుకీ ఆమె ఒక్క క్షణం ఆగి, కుడివైపు నడవసాగింది! బాగా ధనవంతులు నివసించే ప్రదేశము అవటంవల్ల రోడ్ల మీద జనసంచారం లేదు. ఒకటి రెండు మారుతీ కార్లు ఆమెని చూసి, 'స్లో' అయి, మళ్ళీ వేగంగా వెళ్ళిపోయాయి. ఒకరు లిఫ్ట్ కావాలా అని అడిగి, ఆమె పట్టించుకోకపోవటంతో సాగిపోయారు.

వెనుకనుంచి వస్తూన్న సైకిలిస్ట్‌ని ఆమె ఏదో అడగటానికి చెయ్యి ఎత్తి, మళ్ళీ ఆ ప్రయత్నం విరమించుకుంది. ఆమె సంశయించటం చూసి, అతడు సైకిలాపి, "ఏం కావాలి?" అని అడిగాడు. ఇక తప్పనిసరి అయి....

"దుర్గాబాయి దేశ్‌ముఖ్ వీధి ఇక్కడికి ఎంత దూరం?" అని అడిగింది.

"చాలా దూరం. ఊరికి అటువైపు".

ఆమె మనసులోనే నిరాశగా నిట్టూర్చింది.

"ఎక్కడికి వెళ్ళాలి మీరు?"

"అక్కడో సత్రం వుంది. ఆ సత్రానికి"

అతడు ఆమెవైపు ఆశ్చర్యంగా చూసి "...సత్రానికా?" అన్నాడు. అవునంది. "ఇంత రాత్రి అంత దూరం ఒంటరిగా ఎలా వెళ్తారు? బస్సులు కూడా వుండవే?"

ఆమెకు ఆ పరిస్థితుల్లో కూడా నవ్వొచ్చింది. బస్సులో వెళ్ళటానికి తన దగ్గర డబ్బుల్లేవు. అతడు తనతోపాటు నడవటం చూసి, "మీరు వెళ్ళండి. నేను వెళ్ళగలను" అంది – అతన్ని వదిలించుకోవటానికా అన్నట్టు.

"మిమ్మల్ని రిక్షా వరకూ వచ్చి ఎక్కించి నేను వెళ్తాను. ఒంటరిగా నడుస్తూ వెళ్తే ఏ రౌడీయో, పోలీసో భయపెడతాడు".

"నా దగ్గిర రిక్షాలో వెళ్ళటానికి డబ్బుల్లేవు" అంది నిర్లిప్తంగా.

అతడు విస్మయంగా, "అంత దూరం నడిచి వెళ్తారా ?" అన్నాడు.

ఆమె సమాధానం చెప్పలేదు.

మళ్ళీ అతడే అడిగాడు –"సత్రం దగ్గిర ఎవరింటికి వెళ్ళాలి?"

"ఎవరిల్లూ లేదు, సత్రానికే వెళ్ళాలి".

"ఎవరున్నారక్కడ?"

"బిచ్చగాళ్ళు".

అతడు మరింత చకితుడై "మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థం కావటం లేదు" అన్నాడు.

ఆమె అతడివైపు తల తిప్పకుండా "ఇందులో అర్థం కాకపోవటానికి ఏముంది? నా వాళ్ళంటూ నా కెవరూ లేరు. కాస్త తెలిసిన వాళ్ళు ఆ బిచ్చగాళ్ళు మాత్రమే. ఈ రాత్రి అక్కడ పడుకుంటే వాళ్ళు తోడుంటారు కదా – అనుకున్నాను".

"మీ వాళ్ళంటూ ఎవరూ లేరా? మరి ఇంతకాలం మీరెక్కడ వున్నారు?"

"జైల్లో".

అతడొకసారి ఆమెవైపు చూసి, ఏదో అడగబోయి, మానుకుని "మీ పేరు?" అన్నాడు.

"విశారద".

ఆమె తన పేరు చెప్పేసరికి ఆశ్చర్యం కలిగినా తరువాత అతడికి అప్రయత్నంగా నవ్వొచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నారు?"అడిగింది.

"ఏం లేదు".

"జైల్లో వున్నదానికి ఇలాటి పేరేమిటి అనా?"

"ఛా. అదికాదు".

"ఇంతకీ మీ పేరు చెప్పారు కాదు" అడిగింది.

"బోసుబాబు".

*　　　　　*　　　　　*

"ఆర్రూపాయలు ఇరవై రూపాయలు.... ఆర్రూపాయాలు ఇరవై రూపాయలు. నాలుగు టిక్కెట్లే వున్నాయి. ఆర్రూపాయలు ఇరవై రూపాయలు..."

చకచకా టిక్కెట్లు అమ్ముతున్నాడు సుధాకర్. "నీ ఇంట్లో నా మొగుడు" ఆ రోజే రిలీజయింది. నలుగురైదుగురు ఆడాళ్ళని కూడా పెట్టాడు. టిక్కెట్టుకి ఐదు రూపాయలు వాళ్ళకివ్వాలి. పెద్ద హీరో సినిమా అయితే యాభై రూపాయల దాకాపోతుంది బ్లాకు. మరీ జనం పిచ్చెక్కితే వంద కూడా పలుకుతుంది. దానికయితే పది రూపాయలివ్వాలి. మార్నింగ్ షో బుకింగ్ క్లోజ్ అయిపోగానే మాట్నీ క్యూలో నిలబడాలి. ఆడవాళ్ళకయితే కాస్త సులభం. ఒకసారి కొనగానే వరుసలో వెనక్కి వెళ్ళి రెండోసారి నిల్చోవచ్చు.

టిక్కెట్లన్నీ అమ్మి, తన వాళ్ళకి డబ్బు ఇచ్చేసి వెళ్ళి కిళ్ళీకొట్టు దగ్గిర నిలబడ్డాడు సుధాకర్. అతనితోపాటూ టిక్కెట్లు అమ్మినవాళ్ళు కూడా వచ్చి నిల్చున్నారు.

పది నిమిషాల తరువాత మోటార్ సైకిల్ మీద వచ్చాడు 'కలెక్షన్ కుట్టి' ఏజెంటు! ఏ ఏరియా కా ఏరియా ఏజెంట్లు వుంటారు. వీళ్ళంతా 'కుట్టి' అనే వ్యక్తి ఆధ్వర్యంలో పనిచేస్తూ వుంటారు. బ్లాక్‌లో టిక్కెట్లు అమ్మేవాళ్ళు ఈ ఏజెంట్‌లకి రోజువారీ కలెక్షన్స్ సగం ఇవ్వాలి.

థియేటర్ మేనేజ్‌మెంట్ నుంచీ, పోలీసుల నుంచీ ఏ గొడవా రాకుండా 'కుట్టీ' చూసుకుంటాడు. ఇంకో మనిషెవరూ ఆ థియేటర్‌లో టిక్కెట్లమ్మటానికి

పోటీ రాకుండా కూడా చూసుకుంటాడు. వీటన్నింటి కన్నా ముఖ్యంగా, అతన్ని కాదని ఏ బ్లాక్ మార్కెటీరూ బ్రతకలేదు. పరిశ్రమ పెట్టాలంటే ప్రభుత్వం దగ్గిర లైసెన్సు తీసుకున్నట్టే నగరంలో ఏ థియేటర్ దగ్గిర టిక్కెట్లు అమ్మాలన్నా 'కలెక్షన్ కుట్టి' దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ కలెక్షన్ కుట్టికీ, పోలిటిక్స్‌కి మళ్ళీ సంబంధాలున్నాయి.

....మోటార్ సైకిల్ మీద కూర్చుని, ఒక కాలు క్రింద పెట్టి, విలాసంగా పొగ వూదుతూ చెయ్యి సాచి, "ఎంత ఈ రోజు కలెక్షన్ ?" అని అడిగాడు కుట్టి అసిస్టెంటు.

"పాతిక పెద్దవి. ముప్పై బాల్కానీ... రెండు వేల చిల్లర..." అంటూ అయిదొందల చిల్లర అతని చేతిలో పెట్టాడు. దాన్ని నిర్లక్ష్యంగా బ్యాగ్‌లో వేసుకుని మళ్ళీ సిగరెట్ నోట్లో పెట్టుకున్నాడు.

అంతలో ఇంకో చారల బనీన్ వేసుకున్న వ్యక్తి వచ్చి మరో వంద ఇచ్చాడు. అతను చిన్న క్లాసుల టిక్కెట్లు అమ్ముతాడు. దాన్ని అందుకుంటూ "నిన్న కలెక్షన్ ఎంతరా?" అని క్యాజువల్‌గా అడిగాడు. క్రితం రోజు కలెక్షన్ అడిగినందుకు ఆశ్చర్యపోతూ, "అయిదొందలు" అన్నాడు వాడు... "నూటపాతిక నిన్నే ఇచ్చానుగా?"

ఆ మాట పూర్తి కాలేదు. మోటార్ సైకిల్ మీదనుంచి లేస్తూ ఫెడీల్మని కొట్టాడు కలెక్షన్ కుట్టి మనిషి. చారల బనీను వాడు వెనక్కి పడిపోయాడు. "ఏడొందలు అమ్మి అయిదొందలు అని చెపుతావా నీ యవ్వ..." అంటూ లేపి, మరో రెండుసార్లు పిడికిలి బిగించి కడుపులో గుద్దాడు. "చెప్పు, నిజం చెప్పు."

"ఏ...డొం...ద...లు... అమ్మాను" అతడి మాటలు రెండోసారి పూర్తి కాలేదు. మొహం మీద మళ్ళీ బలంగా చరిచాడు. ముక్కు బ్రద్దలై రక్తం కారసాగింది. మనిషి వెళ్ళి కాలువలో పడ్డాడు.

సుధాకర్ తనున్న ప్రదేశం నుంచి కదిలే ప్రయత్నం ఏమీ చేయలేదు. ఇటువంటి గొడవల్లో ఎవరూ కల్పించుకోరు.

కలెక్షన్ కుట్టి దగ్గర ఇన్ఫార్మర్స్ చాలా మంది వుంటారు. ఏ బ్లాక్ మార్కెటీర్ తప్పుడు లెక్క చూపించినా కుట్టికి వెంటనే తెలిసిపోతుంది. ఫలితం ఇంత భయంకరంగా వుంటుంది.

మోటార్ సైకిల్ వెళ్ళిపోయాక సుధాకర్ వెళ్ళి, వాడిని కాలువలోంచి లేవదీశాడు. బహుశా ఇక వాడి ముక్కు శాశ్వతంగా వంకరగానే వుంటుంది.

ఇంటర్వెల్ కావటానికి ఇంకో పది నిముషాలు టైముంది.

* * *

"నా పేరు చెప్పగానే మీరెందుకు నవ్వేరో చెప్పలేదు" అంది విశారద.

"పోనీయండి. ఇప్పుడా విషయం ఎందుకు?"

"చెప్పటం ఇష్టం లేకపోతే నేనేం చేయలేను. కానీ అది మాత్రం మనసులో వుండిపోతుంది... సరే, ఇక మీరు వెళ్ళిరండి" అంది ముభావంగా.

"అంతదూరం మీరొక్కరే..." అంటూ అర్థోక్తంగా ఆగాడు. ఈ మాటలకి విశారదకి విసుగేసింది. "ఒకమ్మాయి ఒంటరిగా కనపడేసరికి మొగవాడికి ఈ ప్రపంచంలో ఎక్కడలేని పరోపకారమూ, మంచితనమూ వస్తాయనుకుంటా" అని

స్వగతంలో అనుకుంది. అది అతడికి సరీగ్గా వినపడక "ఏమన్నారూ?" అని అడిగాడు.

"ఇదే గానీ నా స్థానంలో ఒక మొగవాడు వుండి వుంటే మీరింత శ్రద్ధ తీసుకునేవారా?" అంది.

అతడి మొహం ఎర్రబడింది. మనసు బాధపడింది.

"తీసుకునేవాడిని కాదేమో! ఎందుకంటే రోడ్ల మీద ఒంటరిగా మొగవాడు అర్థరాత్రి వెళ్ళినా పెద్ద అపాయమేమీ వుండదు కాబట్టి–" అన్నాడు.

అప్పటికే విశారదకి తను తొందరపడ్డాననిపించింది. బోసు అలాటి వ్యక్తి కాదనిపించింది. "సారీ, నేను మాట జారాను" అంది క్షమాపణగా.

"ఫర్వాలేదండీ" అన్నాడు బోసు.

"సత్రంలో బిచ్చగాళ్ళ మధ్యా, జైల్లో ఖైదీల మధ్యా పెరిగిన మీకు మొగవాళ్ళ మీద అటువంటి అభిప్రాయం ఏర్పడ్డంలో తప్పులేదు. కానీ అందరు మొగాళ్ళూ అదే విధంగా వుంటారని అనుకోవద్దు. నాకు కొంత కాలం క్రితం ఒకామె ఇదే విధంగా, విపత్కర పరిస్థితుల్లో అర్థరాత్రి రోడ్డు మీద కలిసింది. ఆమెని ఇంటికి తీసుకువెళ్ళాను. ఆమె పేరు కూడా శారదే... లక్ష్మి శారద".

విశారద ఆశ్చర్యంగా తలెత్తింది.

"ఇంత అర్థరాత్రి మీరు రోడ్డుమీద కనబడేసరికి, మీ పేరు కూడా శారద అని చెప్పేసరికి చాలా ఆశ్చర్యమేసింది! మిమ్మల్ని మా ఇంటికి తీసుకు వెళ్దామనుకున్నాను... నేనెందుకు నవ్వేనో పైకి చెప్తే అంత బాగోదు... మీ పేరు కూడా శారదని తెలిశాక, మా ఇంట్లోవాళ్ళు '... అలా ఎంతమంది శారదల్ని

ఇంటికి తీసుకువస్తావు?' అని అంటారేమో అన్న ఊహ రాగానే నవ్వొచ్చింది. మీరడిగారే - ఇంతకుముందు - ఎందుకు నవ్వేనని? ఇందుకేనండీ" అన్నాడు అమాయకంగా వివరిస్తున్నట్టు.

ఆమె కూడా నవ్వి. "ఆ శారద వచ్చిందేమోగానీ ఈ విశారద రాదు లెండి" అంది.

"ఎందుకని?"

"ఆధారపడటం ప్రారంభిస్తే జీవితమంతా ఆధారపడటమే అవుతుంది...."

"మరి మీరేం చేయదల్చుకున్నారు?"

"నాలుగు ఇళ్ళలో పాచిపని చేసుకునైనా బ్రతుకుతాను కానీ ఇంకొకరి మీద ఆధారపడను. నేను చదువుకోవాలి. ఇంకా ..... ఇంకా చదవాలి...." ఒక ఊహాలోకంలో ఉన్నట్టు అన్నది. ఆమె కళ్ళల్లో పట్టుదల ప్రస్ఫుటమవుతోంది. అతడికి ముచ్చట వేసింది! అప్పటివరకూ అతని పరిధిలో స్త్రీలందరూ అక్కా- చెల్లీ లక్ష్మీ శారదలతో సహా అందరూ- చుట్టూ వున్న పరిస్థితుల్ని తల్చుకుని కుమిలిపోయినవారే. ఎవరో రావాలి- ఏదో చెయ్యాలి అనుకున్నవారే. ఇంతకాలానికి ఒకమ్మాయి -'చీకటి -వెలుగుకి ప్రథమాధ్యాయం' అని నమ్ముతోంది.

"లక్ష్మీ శారద గారు ఇప్పుడు మీ ఇంట్లోనే వున్నారా?" ఆమె మాటలకి ఆలోచన్ల నుంచి తేరుకుని, "లేదు. వెళ్ళిపోయింది, ఎందుకు వెళ్ళిపోయిందో తెలీదు" అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా "ఎందుకు?" అని అడిగింది.

"నాకు తెలీదు. మా తండ్రిగారూ పోయారు. ఆయన లేని ఇంట్లో వుండటమెందుకు అనుకుందో, ఆర్థికభారం మోపటం ఎందుకు అనుకుందో..... ఉత్తరమైనా పెట్టకుండా వెళ్ళిపోయింది. పాపం ఎక్కడున్నదో ఏమిటో?" అతని కంఠంలో జాలి ధ్వనించింది. ఆమె మాట మారుస్తూ "మనం ఇటెక్కడికి వెళ్తున్నాం" అని అడిగింది.

"సినిమా హాలు దగ్గరికి. అక్కడ నా మిత్రుడొకడున్నాడు. వాళ్ళ దగ్గర మీరు వుండొచ్చు".

"చెప్పానుగా. నేను ఎవరిమీదా ఆధారపడనని....."

"చెప్పారు. కానీ మీకీ ప్రపంచం గురించి తెలీదు విశారదగారూ! కొంతకాలమైనా తెలిసినవారి ప్రక్కన వుండండి. మీ బ్రతుకు మీరే బ్రతకండి. కానీ ఆ సత్రంలో వద్దు ప్లీజ్. నా మాట వినండి".

అతడి మాటల్లో నిజం వున్నట్టు ఆమె మౌనంగా వుండిపోయింది.

ఇద్దరూ హాలు దగ్గరికి వెళ్ళేసరికి సుధాకర్ అప్పుడే బయటకు వస్తున్నాడు. "ఏమిటన్నా... ఆ రోజు ఆలస్యంగా –" అంటూ పక్కనే వున్న అమ్మాయిని చూసి సగంలో ఆపేశాడు.

"ఆమె విశారద. తనకంటూ ఎవరూ లేరు. మనమేదన్నా సాయం చేయగలమేమో అని తీసుకొచ్చాను" అంటూ విషయం వివరించాడు.

సుధాకర్ స్నేహపూర్వకంగా నవ్వేశాడు. "ఈ దేశంలో 'విశారద' అనాథ కాబట్టే ఇంత చదువుకున్నా మనం సినిమాహాళ్ళ దగ్గర బండిలో సోడాలూ, బ్లాకులో టిక్కెట్లూ అమ్ముకుంటున్నాం".

విశారదకి విస్మయంగా వుంది. మొగవారిలో కొత్తకోణాన్ని మొదటిసారిగా చూస్తోందా అమ్మాయి.

బోసు అన్నాడు... "విశారదకి ఎవరిమీదా ఆధారపడటం ఇష్టం లేదట".

"అవసరం లేదు" అన్నాడు సుధాకర్.

"నా పాక పక్కనే మరొక పాక వేయిస్తాను. బిర్లానగర్ ప్రెసిడెంట్‌ని నేనే. మన మాట ఎవరూ కాదనరు" అని విశారదవైపు తిరిగి నాటకీయంగా, "కావాలంటే మీరు ఒక వీణ కొనుక్కుని సరస్వతీ దేవిలా దాన్ని వాయించుకుంటూ పిల్లలకి పాఠాలు చెప్పుకోవచ్చు" అన్నాడు.

విశారద ఆహ్లాదంగా నవ్వింది. ఆమె మనసు తేలిగ్గా వుంది.

"ఈ రాత్రికి మీరు మా పాకలో వుండవలసి వస్తుంది. రాత్రికి రాత్రే పాక నిర్మాణం ప్రారంభిస్తే, ఖాళీస్థలాన్ని ఆక్రమించుకునే మినిష్టర్ ఎవరన్నా వొచ్చాడేమో అని కాలనీవాళ్ళు భయపడే అవకాశం వుంది...."

ఈ మాటలకి బోసు కూడా నవ్వేశాడు... ముగ్గురూ కలసి నడవటం ప్రారంభించారు. సుధాకర్ ఇల్లు చేరేసరికి అరగంట పట్టింది. "కొంచెంసేపు నువ్వుకూడా కూర్చో అన్నా" అంటూ, గూట్లో రాముల వారి విగ్రహం వెనుకనుంచి సీసా తీసి, తాగటం మొదలుపెట్టాడు. బోసుతో పిచ్చాపాటీ హస్కు వేసి.... మౌనంగా వున్న విశారదని చూస్తూ, "నేనిలా తాగుతున్నానని మీరేమీ భయపడటం లేదుకదా" అన్నాడు.

"భయమెందుకు?"

"సాధారణంగా ఇటువంటి పరిస్థితుల్లో ఆడవాళ్ళు 'తాగొద్దన్నయా ఆరోగ్యం పాడయిపోతుంది' అంటూ వరసలు కలుపుతారు".

"నాకు అలాంటి వరసల మీద నమ్మకం లేదు. మనసు పవిత్రంగా వుంటే ఇలాంటి వరసలు కలపాలన్న ఆలోచన రాదు" క్లుప్తంగా అంది విశారద.

## 2

**"అవును,** మీ నాన్నగారు నాకు బాగా తెలుసు. చాలా నిస్వార్థజీవి" అన్నాడు ఆఫీసర్ రికార్డులు పరిశీలిస్తూ.

"ఆయన సర్వీసులో ఉండగా మరణించారు. ఆ ఉద్యోగం మా అన్నయ్యకి ఇప్పిస్తే మా కుటుంబం ఆర్థికంగా కాస్త నిలదొక్కుకుంటుంది".

"నువ్వింతగా చెప్పాలా బోసూ! ఆయన మా అందరికీ గురువులాటి వారు. తన కుటుంబ పరిస్థితులు అన్నీ ఎప్పుడూ నాకు చెపుతూండేవాడు. అన్నట్టు మీ అక్కయ్య అత్తవారింటికి వెళ్ళిందా?"

"లేదండీ. ప్రావిడెంట్ ఫండు డబ్బులు రాగానే పంపుతాము. దానికోసమే ఎదురుచూస్తున్నాము".

"అది కూడా ఇంకో నెలరోజుల్లో వచ్చేస్తుంది" అంటూ ఫైల్లో కాగితం చూసి, "ఇదిగో దీనివల్లే మీ అన్నయ్యకి ఉద్యోగం రావటం ఆలస్యమైంది. మీ నాన్నగారికి డెత్ సర్టిఫికెట్టు కావాలి" అన్నాడాయన ఫైల్లోంచి తలెత్తి.

"ఎవరి దగ్గర్నుంచి?"

"మామూలుగా అయితే జనన మరణాల రిజిస్ట్రారు దగ్గర్నుంచి చాలు. కానీ ఇది స్పెషల్ కేసు కాబట్టి, డాక్టరు నుంచి కావాలి".

"రేపు తీసుకొస్తాను" అని బోసు లేచి నమస్కారం పెట్టాడు.

*　　　　*　　　　*

ఆ డాక్టరు కేవలం రోగుల్ని తమ బాధల్నుంచి రక్షించటానికి దిగిన దేవతామూర్తిలా వున్నాడు.

బోసుని చిరునవ్వుతో ఆహ్వానించి "చెప్పండి. మీకు నేనేమి చేయగలను" అని అడిగాడు ఇంగ్లీషులో. బోసు తను వచ్చిన పని చెప్పాడు.

వచ్చిన మనిషి రోగి కాదని తెలియగానే మాయమైన చిరునవ్వు, అతను వచ్చిన పని చెప్పగానే తిరిగి డాక్టరు మొహాన్ని చేరుకుంది. "అవును, మొన్న ఆ ఆఫీసు నుంచి ఎవరో ఆ సర్టిఫికెట్టు కావాలని ఉత్తరం వ్రాసేరు" అన్నాడు.

"మా నాన్నగారి మీద వారికున్న అభిమానం అలాంటిది. ఆ సర్టిఫికెట్టు ఇస్తే మా అన్నయ్యకి ఉద్యోగం దొరుకుతుంది" అన్నాడు బోసు.

"మీ నాన్న ఆత్మహత్య చేసుకున్నాడు కదూ!"

"అవునండీ".

"కేవలం మీ అన్నయ్యకి ఉద్యోగం ఇప్పించటానికి".

బోసు సమాధానం చెప్పలేదు.

"సర్వీసులో వుండగా మరణిస్తే కొడుక్కి ఉద్యోగం ఇవ్వటం... మంచి ఆలోచన".

డాక్టరు తలెత్తి బోసు మొహంలోకి చూస్తూ "మీ నాన్న ఆ రోజు చావలేదు, మరుసటి రోజు... అంటే – రిటైర్ అయ్యాక చచ్చాడు" అని పూర్తి చేశాడు.

బోసు ఏదో కీడు శంకించాడు. డాక్టరు ఇంక అసలు విషయం చెప్పటానికా అన్నట్టు ముందుకు వంగాడు. వంగి అన్నాడు –

"ఆ ఆఫీసునుంచి క్లర్కుని పిలిపించి విషయమంతా పర్సనల్‌గా మాట్లాడాను. నేను సర్టిఫికెట్టు ఇస్తే తప్ప ఉద్యోగం రాదు. అవునా?"

"కానీ నాన్నగారు అర్ధరాత్రి మరణించారు సార్ "?

"అని నువ్వు అంటున్నావు. ఆ రోజు కాకుండా రెండోరోజు ఉదయానికిగానీ ప్రాణం పోలేదని నేను వ్రాశాననుకో, ఎంక్వైరీ పడుతుందట, అప్పటికి రిటైర్ అయిపోయాడు కాబట్టి కొడుక్కి ఉద్యోగం రాదట".

బోసు గొంతులో దుఃఖం అడ్డుపడింది. "కానీ నాన్నగారు ఆ రోజు అర్ధరాత్రే..." ఆపైన మాట పెగల్లేదు. తండ్రి ఎప్పుడు మరణించాడన్న విషయంమీద మాట్లాడవలసి రావటం... అతని మనసు కవ్వంతో చిలికినట్టు అవుతోంది! అతడి బాధతో సంబంధంలేనట్టు డాక్టరు చివరిమాట చెప్పాడు.

"...ఇరవై వేలు ఇవ్వు. నీకు కావల్సిన విధంగా సర్టిఫికెట్టు ఇస్తాను".

పిచ్చికుక్క కరిచినప్పుడు బొడ్డుపక్క ఇంజెక్షన్ గుచ్చగానే మనిషి బాధతో విలవిల్లాడినట్టు బోసు తలెత్తాడు.

ప్రపంచం కుదించుకుపోతున్నట్టు అనిపించింది. కొద్దిసేపు ఏం జరుగుతున్నదీ తెలియలేదు. దుఃఖం తన్నుకొస్తూండగా, "మా నాన్నగారు అంతకు ముందురోజే చచ్చిపోయారు డాక్టర్ గారూ! కేవలం మా అన్నయ్యకి ఉద్యోగం

ఇప్పించటం కోసమే తన నిండు ప్రాణాల్ని తీసేసుకున్నారు" అన్నాడు. అతడి చెంపమీద నీరు ధారగా కారుతూంది.

కంటినీళ్ళూ, గుండెపోట్లూ డాక్టర్లని కలతపెట్టావు. అందుకని ఆ డాక్టరు ముభావంగా వుండిపోయాడు. బోసు తలెత్తి అతనివైపు చూశాడు.

ఆ డాక్టరు అప్పుడే ఆఖరి ప్రేమ తినేసి పెదాల కంటిన రక్తాన్ని నాలుకతో తుడుచుకుంటున్న జంతువులా కనబడ్డాడు. ఒక ఓటు మెజారిటీతో నెగ్గిన ఎమ్మెల్యే, ఓడిపోయిన అభ్యర్థివైపు సానుభూతిగా నవ్వినట్టు బోసుని చూసి నవ్వేడు.

అప్పుడు కొట్టేడు బోసు అతన్ని.

బోసు కొట్టిన దెబ్బకి డాక్టర్ వెనుకవున్న రేకు బేసిన్ మీదపడ్డాడు. చేతులు కడుక్కునే నీళ్ళు ఉవ్వెత్తున ఎగిరి నేలమీదకు చిందాయి. అప్పుడే లోపలికొస్తున్న సిస్టర్ కెవ్వున అరిచింది. ఆ కేకకీ, అంతకుముందు వినిపించిన చప్పుడుకీ, బయట కూర్చున్న పేషెంట్లు స్ప్రింగ్ డోర్ అవతల్నుంచి లోపలికి చూశారు.

ఈ లోపులో గోడమీద పడిన డాక్టర్ని కాలర్ పట్టుకుని లేపి మళ్ళీ కొట్టాడు బోసు.

ఎవరూ లోపలికి వచ్చే ప్రయత్నం కూడా చేయలేదు. లోపలున్న సిస్టర్ కూడా అవాక్కయి చూస్తూ వుంది. డాక్టర్ మొహాన్ని చేతుల్లో కప్పుకుని మోకాళ్ళమీద కూర్చుండిపోయాడు. బోసు అతడిని వదిలేసి లేచాడు. గోడకున్న అద్దంలో తన మొహం కనబడింది. దాన్ని చూసి ఒక్క క్షణం ఆగాడు. అంత ఆవేశంలోనూ అతడికి తన ప్రతిబింబం చూసి ఆశ్చర్యం కలిగింది. తను అంత

భయం కొలిపేలా వుంటానని అతడికి అంతవరకూ తెలీదు. మొహం అస్తమిస్తున్న సూర్యుడిలా ఎర్రగా వుంది. కళ్ళు ఎర్రమందార పువ్వుల్లా వున్నాయి.

అతడు డాక్టర్‌ని లోపలి గదిలో వదిలేసి వచ్చాడు. బయటవున్న పేషెంట్లు, నర్సులు భయంగా, వినమ్రంగా పక్కకి వత్తిగిలి నిలబడ్డారు. అతడికి ఆశ్చర్యం అనిపించిన మరో విషయం అది! వారిలో తనని ఎదుర్కోవాలన్న ఆవేశం లేదు. కనీసం తమ డాక్టర్‌ని రక్షించుకోవాలన్న కోర్కె లేదు. తమకి ఏమవుతుందోనని భయం.

అతడికి ఇంకా చిత్రంగా అనిపించిన విషయం... వాళ్ళలో ఎవరికీ తనపట్ల అసహ్యంగానీ, 'అయ్యో! సాటి మనిషిని కొట్టాడే' అన్న కోపంగానీ, జుగుప్సగానీ లేవు. ఉత్సుకత కలిగించే ఒక సంఘటనని చూస్తూన్న థ్రిల్ మాత్రమే వుంది.

'చెడు' పట్ల మనిషికి 'నెగిటివ్' దృక్పథం తగ్గిపోయి, దాని స్థానే 'థ్రిల్' ఫీలింగ్ ఏర్పడింది. అంతేకానీ ప్రపంచం ఇలా అయిపోతుందన్న బాధలేదు. ఏమైనా బాధపడితే అతనే బాధపడ్డాడు. డాక్టర్ పడిపోగానే అతని ఆవేశం తగ్గిపోయింది. తండ్రి గుర్తొచ్చాడు. అతను సిగ్గుపడ్డాడు. 'నేనింత ఆవేశపడకుండా వుండాల్సింది. నన్ను నేను కంట్రోలు చేసుకుని వుండాల్సింది' అనుకున్నాడు చాలాసార్లు అప్పటికప్పుడే.

తల వంచుకుని అక్కడ నుంచి ఇంటికి వచ్చాడు.

ఇంటిదగ్గిర అందరూ అతని కోసం ఎదురుచూస్తున్నారు.

"ఏమైందిరా?" అని అడిగాడు.

"డాక్టర్ సర్టిఫికెట్టు ఇవ్వటానికి డబ్బు అడిగాడన్నయ్యా" అన్నాడు బోసు.

"ప్రతి దానికి లంచం ఒకటి అలవాటయిపోయింది. వందో, రెండొందలో ఇవ్వలేకపోయావా?"

"వందో, రెండొందలో కాదు. ఇరవై వేలు కావాలట".

ఆ మాటలకి చేటలో బియ్యం ఏరుతున్న అహల్య, కాఫీ అందిస్తూన్న గోమతీ కూడా ఉలిక్కిపడ్డారు.

రామ్మూర్తి ఏదో అనబోతూ వుండగా బయట వాహనం ఆగిన చప్పుడు వినిపించింది. అందరూ బయటకు తొంగిచూశారు.

అది పోలీసు వ్యాను.

గోమతి అప్రయత్నంగా అక్క చెయ్యి పట్టుకుంది. రామ్మూర్తి భయంగా ఆ వాహనంవైపే చూడసాగాడు. బోసు లేచి బయటకు వచ్చేసరికి, ముందు సీటులోంచి పోలీసు దిగుతున్నాడు. ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణమాచారి పంపేడేమో అనుకున్నాడు బోసు.

"నువ్వేనా బోసు?" ఎగాదిగా చూస్తూ అడిగాడు పోలీసు.

"అవును. ఏం ?"

"మా ఇన్‌స్పెక్టర్ గారొకసారి నిన్ను తీసుకురమ్మన్నారు".

"ఎందుకు?"

"చెప్తేగానీ రావా".

అప్పటికే చుట్టుప్రక్కలవాళ్ళు ఆసక్తితో చూడటం బోసు గమనించాడు. లక్ష్మీశారద సంఘటన జరిగినప్పటి నుంచీ అందరికీ తమ ఇంటి మీద 'ఇంటరెస్టు' పెరిగిన సంగతి అతడికి తెలుసు. ఇక వాదనలు పెంచడం ఇష్టంలేక వ్యాన్

ఎక్కాడు. రామ్మూర్తివచ్చి మెట్ల మీద నిలబడి చూస్తున్నాడు. తలుపు వెనుకనుంచి గోమతి చూస్తోంది.

వ్యాన్ కదిలింది.

ఇన్స్పెక్టర్ రాధాకృష్ణమాచారి వుండే పోలీసు స్టేషన్ కాదది. దాదాపు గంట ప్రయాణం చేసి ఎక్కడో దూరంగా వున్న మరో స్టేషన్ ముందు ఆగింది. బోసుని తీసుకెళ్ళారు. బల్లమీద వున్న బోర్డు మీద పేరు చూశాడు '...సింహాచలం' అని వుంది.

'నన్నెందుకు పిలిపించారు?' అని బోసు అడగబోతూండగా ఇన్స్పెక్టర్ పక్క వ్యక్తితో "...వీడేనా" అని అడగటం వినిపించింది. అప్పుడు చూశాడు పక్క కుర్చీలో కూర్చున్న వ్యక్తిని.

డాక్టరు...! తనని లంచం అడిగిన డాక్టరు!!

బోసుని అదోరకంగా చూస్తూ, "ఇతనే" అన్నాడు.

ఇన్స్పెక్టర్ కుర్చీలోంచి లేచి దగ్గిరకొస్తూ "ఏం చేస్తూ వుంటావురా నువ్వు" అని అడిగాడు.

"బట్టలకొట్లో..."

"డాక్టర్ గారిని కొట్టావుట నిజమేనా ?"

"ఆయన నన్ను ఇరవైవేలు..." మాట పూర్తి కాలేదు. ఇన్స్పెక్టర్ పిడికిలి బిగించి కొట్టిన దెబ్బకి బోసు పక్కకి పడి కూలిపోయాడు.

పళ్ళు కదిలి నోట్లో రక్తం ఉప్పగా తగిలింది. బాధగా మూలిగి లేవబోతూంటే బూటు కాలొచ్చి డొక్కల్లో తగిలింది. పక్కటెముకలు విరిగిపోతున్నంత బాధ. 'ఆ...మ్ మ్....మ్మా' అంటూ ముందుకి కూలిపోయాడు.

"వీడిని అంత తొందరగా వదలకు. బాగా బుద్ధిచెప్పకపోతే తామే హీరోలమనుకుంటారు".

"వాడిక జీవితంలో ఎవడిమీదా చెయ్యెత్తకుండా విరిచేస్తాన్లే. వాడి సంగతి మర్చిపో. మనం కలిసి చాలా రోజులయింది".

"ఏదీ ఒకవైపు హాస్పిటలు, మరోవైపు క్లినిక్కూ".

"వచ్చే ఆదివారం కలుద్దాం. మంచి స్కాచ్ వుంది".

"మంచి కంపెనీ నేను తీసుకొస్తాలే ".

"మంచి కంపెనీయా... వెరీగుడ్ ..." హుషారుగా లేస్తూ అన్నాడు సింహాచలం. డాక్టరు కూడా లేచాడు. షేక్ హాండిస్తూ "మా ఏరియా ఇన్‌స్పెక్టరు ఎవరు? కాస్త చెప్పి వుంచు. ఇలాంటి గొడవలేమైనా అయితే ఇంత దూరం రానవసరం వుండదు" అన్నాడు.

"అతని పేరు రాధాకృష్ణమాచారి. రామకోటి వ్రాసుకోటానికి తప్ప మరెందుకూ పనికిరాడు. అతనెందుకులే, నీకే అవసరం వొచ్చినా నాకు ఫోన్ చెయ్యి...."

"వెళ్ళొస్తాను".

"మంచిది. ఆదివారం కలుద్దాం..." డాక్టర్ తాలూకు అడుగుల చప్పుడు దూరమవుతుండగా బోసుకు స్పృహ తప్పింది.

*                    *                    *

సుధాకర్ నమ్మలేనట్టు "నిజమా?" అన్నాడు.

"అవును. మీ మనిషే. పోలీసు స్టేషన్‌లో వున్నాడట" అన్నాడు కుట్టి అసిస్టెంటు.

ఏ యే పోలీస్ స్టేషన్ లాకప్పులో ఎవరెవరున్నారన్న సంగతి ఏరోజుకారోజు 'కుట్టి' లాంటి వాళ్ళకి ఇన్ఫర్మేషను వస్తుంది. తమవాళ్ళు ఎవరన్నా పట్టుబడితే వెంటనే యుద్ధప్రాతిపదికమీద అతన్ని రిలీజు చేయించటానికి ఏర్పాట్లు జరుగుతాయి. ఆ లిస్టులో పేరు కనపడగానే కుట్టి అసిస్టెంటుకి – 'బోసు' సినిమాహాలు దగ్గిర సోడాలమ్మేవాడని గుర్తొచ్చింది. ఆ విషయమే సుధాకర్‌తో మామూలుగా చెప్పాడు.

సుధాకర్‌కి బోసు బాగా ఆప్తుడని తెలియగానే, "అయితే ఓ రెండు వేలు తీసుకెళ్ళి ఆ ఇన్‌స్పెక్టర్ కివ్వు, వదిలేస్తాడు" అన్నాడు.

"రెండు వేలా?" అన్నాడు సుధాకర్ దిగులుగా.

"అవును. అదీ చిన్న కేసయితే... పెద్ద కేసయితే దాన్నిబట్టి రేటు మారుతుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అంత అర్ధరాత్రి రెండు వేలు యెక్కణ్ణుంచి సంపాదించాలో సుధాకర్‌కి అర్థం కాలేదు. అన్యమనస్కంగానే థియేటర్ నుంచి ఇంటి కొచ్చాడు. ఆ రాత్రంతా అతడికి నిద్రలేదు. ప్రొద్దున్నే విశారదకి ఆ విషయం చెప్పాడు. ఆమె భయంగా చూసింది. "పోలీస్ స్టేషన్‌లోనా? ... ఎందుకు?" అంది ఆందోళనగా.

"తెలీదు. మస్తాన్ అనే రౌడీని అప్పుడెప్పుడో కొట్టాడుట. బహుశా అదే కారణం అయివుండొచ్చు".

"మరిప్పుడెలా?"

"తొందరగా వెళ్ళాలి. ఈ లాకప్పులోంచి ఎంత తొందరగా బయటకు తీసుకొస్తే అంతమంచిది. లేకపోతే నరకం. నేనిప్పుడే వెళ్తాను..."

"నేను కూడా వస్తాను" అన్నదామె.

సుధాకర్ ఆమెవైపు ఆశ్చర్యంగా చూసి, "నువ్వా ఎందుకు?" అన్నాడు.

"అదేమిటి సుధాకర్. బోసు అక్కడుంటే మనం చూడకుండా ఎలా వుంటాం? అసలు విషయం ఏమిటో కనుక్కోవాలి కదా ముందు " అంది.

"కానీ..." అర్థోక్తిలో ఆగాడు.

"చెప్పు ఏమిటి?"

"మనం బోసుని బయటకు తీసుకురావాలంటే రెండు మూడు వేల దాకా ఖర్చు పెట్టవలసి రావొచ్చు. నా దగ్గిర అంత డబ్బు లేదు" అన్నాడు. ఆమె ఒక క్షణం ఆలోచించి, ఏదో స్ఫురించినట్టు లోపలికి వెళ్ళి రెండు నిమిషాల్లో వచ్చి "పద వెళ్దాం" అంది. ఇద్దరూ బయల్దేరారు.

"...ముందు ఏదయినా మార్వాడీ షాపుకి వెళ్దాం. ఈ గాజులు అమ్మెయ్యాలి" అంది, తనతోపాటూ తీసుకొచ్చిన గాజులు చూపిస్తూ.

సుధాకర్ ఆమెని తనకు తెలిసిన బంగారం కొట్టుకి తీసుకు వెళ్ళాడు. గాజుల్ని కొట్టువాడు పరీక్షించి, "పదిహేను వేలు ఇస్తాను" అన్నాడు.

సుధాకర్ తలమునకలయ్యేటంత ఆశ్చర్యంతో చూశాడు. అతడికి తను వింటున్నది కలో, నిజమో అర్థంకాలేదు.

విశారద దగ్గిర ప...ది...హే...ను వేలు విలువ చేసే గాజులు!

కొట్టువాడు డబ్బులిచ్చేవరకూ వూరుకొని, బయటకొచ్చాక అడిగాడు – "ఇంత ఖరీదైన గాజులు నీ దగ్గిర ఎలా వున్నాయి విశారద ?"

విశారద మాట్లాడలేదు. ఏం చెప్పుతుంది? తన తండ్రి కోటీశ్వరుడని చెపుతుందా? తనని డబ్బు మత్తులో ముంచటానికి తన తండ్రి తవ్విన బంగారపు గని తాలూకు ఉదాహరణ అని చెపుతుందా? ఏమీ చెప్పలేక మౌనంగా వుండిపోయింది. ఆమె మౌనాన్ని తను వేరేలా అర్థం చేసుకున్నాడు. ఆమెకు చెప్పటం ఇష్టం లేదని భావించి, అతనూ రెట్టించలేదు.

ఇద్దరూ పోలీస్ స్టేషనుకి వచ్చారు.

....అయిదు వేలకి బేరం కుదిరింది.

డబ్బు తీసుకుని "ఆ వెనకాల పెరట్లో వున్నాడు. తీసుకుపొండి" అన్నాడు సింహాచలం. సుధాకర్ స్టేషన్ వెనుక వున్న పెరట్లోకి వెళ్ళాడు.

అక్కడ బోసు పరిస్థితి చూసి ఒక్కసారిగా కళ్ళు నీళ్ళతో చిప్పిల్లాయి. 'సెల్' వెనుకవైపు మురికి కాలువ పక్క శవంలా పడివున్నాడు బోసు. అతడి శరీరంమీద ఈగలు వాలుతున్నాయి. ఒక చెయ్యి – కాలువలో పడి, మురికినీళ్ళలో తడుస్తోంది. చిరిగిన బట్టల్లోపల్నుంచి శరీరం మీద వాతలు కనబడుతున్నాయి. గుండెల దగ్గిర షర్టు ఎర్రగా వుంది. పోలీసులు ఎన్‌కౌంటర్లో చంపేసిన మనిషిలా

వున్నాడు. నక్సలైట్లు పేల్చేసిన రైల్లోంచి బయటకు ఎగిరిన మాంస ఖండంలా వున్నాడు. రెండు ఇరుకుల మధ్య నుజ్జు అయిపోయిన సామాన్యుడిలా వున్నాడు.

స్పృహలేని స్థితిలో ఇంటికి తీసుకొచ్చారు. దాదాపు ఆరు గంటలపాటు పూర్తి స్పృహ రాలేదు. డాక్టరు ఖర్చులే నాలుగు వేలు అయ్యాయి. ఆస్పత్రిలో చేర్చటానికి వీల్లేదని సింహాచలం స్ట్రిక్టుగా చెప్పాడు. ఏ హక్కుల సంఘం వాళ్ళ కంట్లోనో పడితే మళ్ళీ కష్టమని అతని ఉద్దేశ్యం.

తనెక్కడున్నాడో తెలిశాక బోసు వాళ్ళిద్దరివైపు కృతజ్ఞతగా చూశాడు.

"ఈ విషయం మా ఇంట్లో చెప్పారా?" అని అడిగాడు.

"లేదన్నా! మీ ఇల్లెక్కడో నాకు తెలీదు. లేకపోతే ఈ పాకకి ఎందుకు తీసుకొస్తాను?"

"ఇక్కడికి తీసుకురావటమే మంచిదయింది. మా ఇంట్లో అయితే కంగారుపడతారు" అంటూ, తనింటి గుర్తులు చెప్పి, "ఏదో పనిమీద వెళ్ళాడు. రెండు మూడు రోజుల్లో వస్తాడు అని చెప్పు" అని పంపించాడు.

సుధాకర్ వెళ్ళిపోయాక బోసు విశారద వైపు తిరిగి, "నీకు నేనెలా థాంక్స్ చెప్పుకోను? నా కోసం చాలా డబ్బు ఖర్చు పెట్టావుటగా" అన్నాడు.

"ఇందులో కృతజ్ఞతల ప్రసక్తి ఏముంది? అర్ధరాత్రి నిస్సహాయంగా వున్న నాకు ఓ ఇల్లూ, వసతీ మీరందరూ ఏర్పాటు చెయ్యలేదా? అలాగే ఇదీ" అన్నది. 'అంతేనా' అన్నట్టు చూశాడు. ఆమె తలదించుకుని – ఏదో పనివున్నట్టు అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

కాస్త తేరుకునేవరకూ అతను ఇంటికి వెళ్ళదల్చుకోలేదు. ఈ గాయాలు చూస్తే వాళ్ళు బెదిరిపోతాడు. గోమతి అయితే మరీ! ఆ అమ్మాయికి మరీ ఆపేక్ష!

విశారదతోపాటు వున్న రెండు రోజుల్లోనూ అతడు ఆమెలోని అంతర్లీనమైన విశిష్టతని గుర్తించాడు. అతడు లేచేసరికే ఆమె నాలుగిళ్ళల్లో పనికి వెళ్ళేది. పన్నెండవుతూండగా వచ్చి, చదువుకు కూర్చునేది. నాలుగింటికి మళ్ళీ పనిలోకి వెళ్ళేది. ఏడింటినుంచి, రాత్రి తొమ్మిదింటి వరకూ పాఠాలు చెప్పేది.

మనసు మారుమూల పొరల్లో ఎక్కడో అతనిపట్ల అతనికి కాస్త గర్వభావం వుండేది. తను చాలా కష్టపడుతున్నాననీ, తనకు 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' అనేది లేదనీ అనుకుంటూ వుండేవాడు. అయితే ఆ భావం విశారదని చూశాక పోయింది.

తనెంత కష్టపడ్డా అది తన కోసం, తన కుంటుంబం కోసం... కేవలం డబ్బు కోసమే తను ప్రొద్దున్న పాలప్యాకెట్లు, సాయంత్రం సోడాలు అమ్మాడు. ఆమె అలా కాదు. కొంత సమయం పిల్లల కోసం వెచ్చిస్తోంది. కొంతేమిటి? ఆమె విధానం చూస్తూంటే, అసలు జీవితమంతా దానికోసమే అన్నట్టుంది.

....నిలబడగలిగే శక్తి వచ్చాక అతడు వాళ్ళిద్దరి వద్దనుండి శెలవు తీసుకున్నాడు. "అసలేం గొడవ జరగింది?" అని అడిగిన సుధాకర్‌కి విషయం చెప్పలేదు. ఇంటికొచ్చాక –

బస్ ఆక్సిడెంట్ అని చెప్పాడు.

ఎవరు నమ్మేరో, ఎవరు నమ్మలేదో పట్టించుకోలేదు.

ఆ సాయంత్రం అతడు మళ్ళీ డాక్టర్ దగ్గరికి వెళ్ళాడు.

క్లినిక్‌కి కాదు.... ఇంటికి.

*   *   *

డాక్టర్ రామబ్రహ్మం క్లినిక్ నుంచి ఇంటికొచ్చేసరికి ప్రతిరోజూ రాత్రి పదవుతుంది. ఆ రోజు కూడా అలాగే ఇంటికి వచ్చాడు. మామూలు కన్నా కాస్త తేడా కనపడింది. ముందు హాల్లో ఒక వ్యక్తి కూర్చుని వున్నాడు. సాధారణంగా ఇంటికి పేషెంట్లు రారు.

"ఏం కావాలి?" అని అనబోతూ ఆగిపోయాడు రామబ్రహ్మం.

ఆ వ్యక్తి బోసు.

"గుడ్ ఈవెనింగ్ డాక్టర్...." అన్నాడు బోసు. అతడి కంఠం చాలా మామూలుగా వుంది. డాక్టరు తన కంగారునీ, భయాన్నీ అణుచుకుంటూ "ఏం కావాలి? ఎందుకొచ్చావు?" అన్నాడు.

"సర్టిఫికెట్టు కోసం – " క్లుప్తంగా అన్నాడు బోసు.

డాక్టరుకి ఏం మాట్లాడాలో తోచలేదు. 'దానికోసం ఇరవై వేలు అడిగాను కదా' అని అడగలేకపోయాడు. "ఇక్కడి కెందుకొచ్చావ్? ఆస్పత్రికి రా–" అన్నాడు.

"ఆస్పత్రిలో మీరు గవర్నమెంటు డాక్టరు, అంటే ప్రజల డాక్టరు. ఉచితంగా సర్వీసు చెయ్యాలి. చేస్తారా?" అడిగాడు బోసు.

డాక్టరు వాచీ చూసుకుని "ఇలాంటి వన్నీ మాట్లాడటానికి నాకిప్పుడు టైమ్ లేదు. రేపు కలువు" అన్నాడు.

"సారీ డాక్టర్ నేను కలువను. నాకు టైమ్ లేదు" అని ఆగి, అన్నాడు. "....నేనొకసారి సర్టిఫికెట్ల కోసం మీ దగ్గరికి వచ్చాను. దాంతో నా బాధ్యత తీరిపోయింది".

"అయిపోయిందిగా, ఇక వెళ్ళు" అన్నాడు డాక్టర్ వెటకారంగా.

బోసు లేచాడు... "వెళ్తున్నాను డాక్టర్" అంటూ చేతిలో కాగితం బల్లమీద పెట్టాడు. "ఇది నా అడ్రసు. రేప్రొద్దున్న పదింటి లోపులో మీరా సర్టిఫికెట్టు తీసుకుని మా ఇంటికి స్వయంగా వచ్చి అందించబోతున్నారు" అన్నాడు.

ఆ మాటలకి డాక్టరు అవాక్కయ్యాడు. కానీ వెంటనే తేరుకుని, "అందించక పోతే?" అన్నాడు.

బోసు నవ్వి, "అందిస్తున్నారు అంతే" అంటూ తలుపు వద్దకు నడిచాడు. "...ఆగు" అని అరిచాడు డాక్టరు. "...పోలీసు స్టేషన్‌లో అంత కొట్టినా నీకు ఇంకా బుద్ధిరాలేదా? సరే వెళ్ళు అయిదు నిముషాల్లో మీ ఇంటికి పోలీసు వ్యాను పంపించకపోతే నా పేరు రామబ్రహ్మం కాదు."

బోసు నవ్వుతూనే, "నేను ఇప్పుడు ఇంటికి వెళ్ళటం లేదు డాక్టర్, బిర్లానగర్ వెళ్తున్నాను. దాన్ని మీరు గుర్తుపట్టలేరులెండి. రేప్రొద్దున్నే మా ఇంటికి మీరొచ్చి సర్టిఫికెట్టు ఇచ్చారో లేదో కనుక్కుంటాను. ఇవ్వకపోతే అట్నుంచి డైరెక్టుగా మీ ఇంటికే వస్తాను. కాబట్టి పోలీసు వ్యాను మీ ఇంటిముందు వుంచుకోవటమే మంచిది" అంటూ దగ్గిరకి వచ్చాడు. అతడి మొహంలో నవ్వు మాయమైంది. "...నేను నిన్ను కొట్టాను. అందుకని పోలీసులు నన్ను కొట్టారు. నువ్వు గానీ రేపు మా ఇంటికొచ్చి ఆ కాగితం ఇవ్వలేదనుకో, నీ కుడిచేతి వేలు తీసేస్తాను. మర్డర్ చేస్తేనే యావజ్జీవకారాగార శిక్ష! చిటికెనవేలికి ఎంతుంటుంది? మూడేళ్ళు వుంటుంది. కానీ నీ ప్రాక్టీసు? అది పూర్తిగా పోతుంది కదా!"

డాక్టర్ మొహం వివర్ణమైంది.

బోసు అతని భుజం మీద చేయివేశాడు. ఎవరైనా చూస్తే పాత స్నేహితులు అనుకుంటారు. "ఏ నేరం చేస్తే ఎంత శిక్ష వుంటుందో నాకు అంతకుముందు తెలీదు. నీ వల్లే తెలిసింది. మనం ఎవర్నైనా కొట్టదల్చుకుంటే అయిదు వేలు పోలీసుల కోసం జేబులో పెట్టుకుంటే చాలు. అలాగే మూడేళ్ళు జైలుశిక్షకు ప్రిపేర్ అయితే, ఇరవైవేలు లంచం ఇవ్వనవసరం లేకుండా మనకు కావాల్సిన డాక్టరు సర్టిఫికెట్టు పొందవచ్చన్న సత్యం తెలిపినందుకు నీకు మరోసారి కృతజ్ఞతలు...." అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

* * *

"ఈ రాత్రి నేను మీతోపాటు వుండొచ్చా?"

"తప్పకుండా వుండొచ్చు" అంది విశారద.

ఆ మరుసటిరోజు బోసు సుధాకర్‌ని తనింటికి పంపాడు. అతను వెళ్ళి ఒక కవరు తీసుకొచ్చి..."మీ అన్నయ్య లేడు. మీ చెల్లి ఇచ్చింది. ఎవరో డాక్టరు కార్లో వచ్చి యిచ్చాడట" అన్నాడు.

ఫౌంటెన్ విచ్చుకున్నట్టు ఒక్కసారిగా బోసు మొహం మీద విజయపూరితమైన నవ్వు కదలాడింది. విశారదవైపు చూశాడు. ఆమె అభావంగా వుండిపోయింది.

"ఏమిటి విషయం" అడిగాడు సుధాకర్. బోసు మళ్ళీ జరిగినదంతా చెప్పాడు. వింటూ ఎగ్జయిట్ అయిపోయాడు సుధాకర్. తనే ఆ అడ్వెంచరు చేసినట్టు థ్రిల్ ఫీలయ్యాడు. "అద్భుతంగా వుందన్నా. కానీ ఒక్కటే అనుమానం".

"ఏమిటది?"

"అంత ధైర్యంగా వాడిని బెదిరించిన వాడివి... రాత్రి వచ్చి ఇక్కడెందుకు దాక్కున్నావు?"

బోసు నవ్వి, "దాక్కోవటం కాదు. మనం ఏదయినా ఎత్తు వేయగానే, అవతల వాడిలో మొట్టమొదట 'ఆవేశం' పొంగిపొరలుతుంది. ఆ ఆవేశంలో మళ్ళీ పోలీసులకి రిపోర్టు ఇవ్వొచ్చు. అదే నేను ప్రొద్దున్న వరకూ దొరకనని తెలిస్తే – ఆవేశం తగ్గి, ఆ స్థానంలో భయం ప్రారంభమవుతుంది. రాత్రి వున్న ఆవేశం ప్రొద్దున్న వుండదు" అన్నాడు.

సుధాకర్ కళ్ళు పెద్దవిచేసి, "నిన్ను చూస్తూంటే... ఎత్తులు వేయటంలో మా కలెక్షన్ కుట్టిని మించిపోతావనిపిస్తోందన్నా" అన్నాడు.

"ఛా, అదేం పోలిక" అన్నాడు బోసు నవ్వుతూనే.

సుధాకర్ వెళ్ళిపోయాక, విశారదవైపు తిరిగి, "నేను వెళ్ళొస్తాను" అన్నాడు. అతనికి వీడ్కోలు ఇవ్వటానికి ఆమె వీధివరకూ వచ్చింది.

"నేను చేసింది నీకు నచ్చినట్టులేదు కదూ..." అన్నాడు ఆమె పక్కనే నడుస్తూ. ఆమె చాలాసేపు మౌనంగా వుండి... "నచ్చటం నచ్చకపోవటం కాదు, అయినా మీ చర్య నాకు నచ్చాలని ఏముంది? ఎవరిష్టం వారిది" అంది. ఆ మాటలకు అతను నొచ్చుకున్నాడు.

"అతను చేసిన పని నీకు సవ్యంగా తోస్తూందా?" అని అడిగాడు.

"లేదు. కానీ ఒక అపసవ్యమయిన పనికి పరిష్కారం మరొక అపసవ్యమయిన పనా?" అంది. ఆ మాటలకి అతనికి ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు. అప్పటికే ఆమె సిద్ధాంతాలు తెలిసినవాడు అవటంచేత, "నువ్వు

వూహించే సమాజంలో లంచాలూ, బెదిరింపులూ వుండవంటావ్, అంతేగా" అన్నాడు.

"ఒక ఉద్యోగం కోసం ఒక 'చావు సర్టిఫికెట్టు' అడిగే దౌర్భాగ్యపు పరిస్థితి మాత్రం నిశ్చయంగా వుండదు" అంది.

"కానీ నా సమస్య వ్యక్తిగతం. దీనికి నువ్వైతే ఆ డాక్టర్‌ని ఎలా 'టాకిల్' చేస్తావో చెప్పు" అన్నాడు.

"ఆయన కొడుకునీ, కూతుర్నీ కూర్చోబెట్టి... వాళ్ళ తండ్రి ఎలాంటివాడో, రాబందులా ఒక బీద కుటుంబాన్ని ఎలా పీక్కుతింటున్నాడో చెపుతాను. ఒక శవం గురించిన సర్టిఫికెట్టు ఇవ్వటానికి ఇరవైవేలు అడిగిన ఆ తండ్రి పాపిష్టి సంపాదన ఎంత పాపిష్టిదో – ఆ చిన్నారి హృదయాలలో నూరిపోస్తాను. డబ్బు విలువకన్నా శ్రమ విలువ ఎంత గొప్పదో... వాళ్ళ మనసుల్లో నాటటానికి ఇంతకన్నా మంచి ఉదాహరణ మరొకటి ఉంటుందా?"

అతనికి ఆమె చెపుతున్నది మొదట అర్థంకాలేదు. అర్థంకాగానే నవ్వొచ్చింది. అయినా పైకి నవ్వటానికి సంస్కారం అడ్డువచ్చింది.

"చిన్న పిల్లలు వింటారు" అన్నాడు. "కానీ పెద్దయ్యాక... డబ్బు అవసరం తెలిశాక వాళ్ళు తమ అభిప్రాయాల్ని మార్చుకుంటారు" అన్నాడు.

"ప్రతిదానికీ ఎక్కడో ఒక ప్రారంభం వుంటుంది బోసుగారూ" అంది.

ఒక రిక్షావాడు పక్కనొచ్చి ఆగి, "వస్తారా బాబూ" అన్నాడు. అవసరం లేదని చెప్పాడు బోసు. ఇద్దరూ నడక సాగించారు. దూరంగా మైకులోంచి పాట వస్తోంది.

ప్రజా నాట్యమండలీ – ప్రతి గుండె ప్రతిధ్వని

జనజీవన సమరాలకు – శృతి చేసిన రసధుని!!

అతడు ఆ పాట వింటూ, "రాగం కళ్యాణి కదూ" అన్నాడు.

"కాదు కదన కుతూహలం" అంది.

## 3

"**నాకో** సలహా చెపుతావా పద్మావతీ?" అని అడిగాడు సుధాకర్. బోసునీ, విశారదనీ కలపాలని అతడి ఆశ!

పద్మావతి సుధాకరు దగ్గర పనిచేసే అమ్మాయి. సినిమాహాల్లో ప్రతి షో మొదలవటానికి గంట ముందు వచ్చి క్యూలో నిలబడి టిక్కెట్టుకొని యిచ్చి, వాటా తీసుకుంటూ వుంటుంది. చాలా మంచి అమ్మాయి. పైకి తోసేవారు లేక సినిమాహాలు ముందు టిక్కట్లు అమ్ముకుంటోంది గానీ, లేకపోతే ఆ అమ్మాయే తెరమీదుంటే పది రూపాయల టిక్కెట్టు వందకి అమ్ముడుపోయేది.

"అంత చదువుకున్నోడివి నీకేం సలహా చెప్పను సుధాకరూ?" అంది పద్మావతి అమాయకంగా.

"నా చదువంతా ఎడారిలో వెన్నెల్లా గడిచిపోయిందిలేగానీ, ఒక ప్రేమ వ్యవహారంలో నాకు సలహా చెప్పాలి" అన్నాడు. ఆ అమ్మాయి ఆదిరిపడి, "ఏటీ ప్రేమలో పడ్డావా?" అంది.

"ఎదురు ప్రశ్నలెయ్యకు".

ఆ అమ్మాయి దగ్గరగా వంగి "ఎవరితో? నాతోనేనా? అలాటి దేదైనా వుంటే చెప్పు. సలహా అవసరం లేదు. డైరెక్టుగా అడిగెయ్యటమే" అంది.

"ఏటి నీతోనా?"

"ఏం? నాకేం తక్కువ? సంతకం పెట్టటం రాదు గానీ లేకపోతే చీఫ్ మినిష్టరైపోయి వుండేదాన్ని" అని ఆగి, ఏదో గుర్తొచ్చినట్టు "అన్నట్టు నన్నోసారి చీఫ్ మినిష్టరు దగ్గిరకు తీసుకెళ్ళరాదూ" అంది.

"చీఫ్ మినిష్టరంటే ఏవన్నా రాష్ట్రపతి అనుకున్నావా – ఏ పనీ లేకుండా వచ్చినోళ్ళందర్నీ రిసీవ్ చేసుకోవటానికి? అయినా నీకు చీఫ్ మినిష్టరుతో పనేంటే?"

"అమ్మాయెవరన్నా కంటిక్కాస్త నదురుగా కనిపిస్తే పార్టీలో చేర్పించి ఏదైనా కార్పోరేషన్‌కి ఛైర్మన్ పదవి ఇస్తాడటగా?"

"అందుకని వెళ్ళి ఆయన కంటపడదామనుకుంటున్నావా పద్మావతీ దేవీ! నీ మెదడ్ను ఇక్కడ కాదే – ఏడుకొండలమీద మ్యూజియంలో వుంచాలి".

"నిజంగా చీఫ్ మినిష్టరు అట్టాటోడే అంటావా?"

"నేను నా ప్రేమ సంగతి చెప్పమంటే నువ్వు పోలిటిక్స్ సంగతి చెప్తావేంటి పద్మావతీ!"

"మొగోడు పోలిటిక్స్‌లో చేరినా, మర్డర్లు చేసినా అది డబ్బు కోసమే కదా. మరి డబ్బు సంపాదనంతా పెళ్ళానికీ, వుంచుకున్న దానికీ, మళ్ళీ ఆళ్ళ పిల్లల కోసమే కదా. అంటే అది ప్రేమ కదా. కాబట్టి ఆ రకంగా పోలిటిక్స్‌కీ, ప్రేమకీ సంబంధం వుందన్నమాట".

"అమ్మో! నీ మెదడు ఏడుకొండలమీద కాదే, వైట్ హౌస్‌లో పెట్టాలి".

"దానికేంలేగానీ, ఈ మధ్య మన ముఖ్యమంత్రి ఎవరో అమ్మాయిని తగులుకున్నాడటగా. సెక్రట్రియేట్‌కి కూడా రాకుండా ఆవిడతోనే వుండిపోతున్నాడట. నిజమేనా?"

"ఈ పత్తేదారు పని కూడా మొదలెట్టావా? అయినా నీకీ చీఫ్ మినిష్టరు పిచ్చి పట్టిందేవిటే పద్మావతీ?"

"బ్లాకులో టిక్కెట్టులమ్ముకుంటే బతుకంతా బ్లాక్ అవటం తప్ప తెల్లారేదెప్పుడు సుధాకరూ! టెంపరరీగానైనా కొన్నాళ్ళు ఆ చీఫ్ మినిష్టర్ దగ్గిర చేరితే ఇంక ఎండలో మార్నింగ్ షోల దగ్గిర నిలబడక్కర్లేదు కదా".

"తప్పు పద్మావతీ! అలా ఆలోచించకూడదు, అది వ్యభిచారం".

"బ్లాకులో టిక్కెట్లు అమ్ముకోవటం తప్పుకాదా? తప్పులోకూడా లెవల్సుంటాయేమిటి?"

"ప్రేమలోంచి పోలిటిక్స్ లోకీ, పోలిటిక్స్ లోంచి వేదాంతంలోకీ దిగిపోతున్నాం మనం. ఇంతకీ నాకు సలహా చెపుతావా లేదా?"

"ప్రేమలేఖ వ్రాయటమే బెస్టు పద్ధతి. ఇచ్చేసి వెళ్ళిపోతే ఆ తరువాత ఆ అమ్మాయి చెంప బద్దలుకొడదామన్నా నువ్వక్కడ వుండవ్‌గా–"

"అంతేనంటావా?"

"నిశ్చయంగా అంతే".

సుధాకర్ హుషారుగా లేచాడు.

*  *  *

"గుడ్" అన్నాడు ఆఫీసర్ ఫైలు పరిశీలిస్తూ.

"అన్నీ సరిగ్గానే వున్నాయి. ఇంకోవారం పది రోజుల్లో మీ అన్నయ్యకి ఆర్డర్లు పంపిస్తాను" అన్నాడు.

"మా నాన్నగారి ప్రావిడెంట్ ఫండ్" అడిగాడు బోసు.

"అది కూడా ఓ పదిరోజుల్లో వస్తుంది".

"థాంక్స్ సర్. మీ మేలు మరువలేను" నమస్కారం పెట్టి బయటకు వచ్చాడు. మధ్యాహ్నం పన్నెండు కావొస్తూంది. ఎండ ఉధృతంగా వుంది.

ఆఫీసు బయట సుధాకర్ కనిపించాడు. బోసు ఆశ్చర్యంగా,"ఏమిటి ఇలా వచ్చావ్?" అని అడిగాడు.

"నీతో అర్జెంట్ పని వుండి వచ్చాను. అలా పార్కులో కూర్చుందాం పద".

"ఇంత ఎండలోనా?"

"'ప్రేమయాత్రలకు ఎండలో పార్కులే బృందావనాలు' అన్నాడో కవి. పద చెపుతాను" అంటూ చెయ్యిపట్టి లాక్కెళ్ళాడు.

ఇద్దరూ పార్కులో కూర్చున్నాక కాగితమూ, కలమూ అందించి, "ఓ ప్రేమలేఖ రాయి " అన్నాడు.

బోసు అదిరిపడి, "ఏమిటీ?" అని అడిగాడు.

"ఎవరికీ అని అడక్కుండా ఓ అందమైన ప్రేమలేఖ వ్రాయి బోసూ, అదిరిపోవాలి చదవగానే అమ్మాయి. ఆల్రెడీ ఇంకొకరి ప్రేమలో వున్నా కూడా వదిలేసి వచ్చేయాలి. అంత గొప్పగా వుండాలి".

"కానీ...."

"వివరాలడక్కు. ప్లీజ్... స్నేహితుడు కోరితే ఆ మాత్రం సాయం చేయవా?"

నిష్ఠూరంగా అన్నాడు. బోసు ఇంకేమీ మాట్లాడలేక కలం కాగితం తీసుకుని, ఏం వ్రాయాలా అని ఆలోచలో పడ్డాడు.

దూరంగా కొమ్మమీద రెండు ఉడతలు పోట్లాడుకుంటున్నాయి. ఒక కాకి కావు కావు మని అరుస్తోంది. ఒక్క మేఘం కూడా అడ్డు లేకపోవటంతో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ప్రేమలేఖ కాదు కదా, క్షేమ సమాచారాలు అడుగుతూ కార్డు వ్రాయాలన్నా అక్కడ మూడ్ వుండదు.

దాదాపు అరగంట కష్టపడి బోసు ఉత్తరం రాయటం పూర్తి చేశాడు. అంతసేపూ సుధాకర్ అతన్ని ఏమీ డిస్టర్బ్ చేయలేదు. పైగా ఒక భక్తిభావంతో, బాబా దగ్గిర శిష్యుడిలా కూర్చున్నాడు.

ఉత్తరం అయ్యాక దాన్ని సుధాకర్‌కి అందించాడు బోసు. భక్తి శ్రద్ధలతో అందుకుని, గబగబా చదవటం మొదలుపెట్టాడు.

"ప్రియమైన.....(ఫిలప్ ది గ్యాప్).

ఇక్కడ చాలా ఎండగా వుంది. చిన్న వేపపండు కోసం దెబ్బలాడుకుంటున్న రెండు ఉడతల్ని చూస్తూంటే నాకు భగవద్గీతలోని మోక్ష సన్యాస యోగము గుర్తొస్తూంది.

మీకీ ప్రేమలేఖ వ్రాస్తున్నప్పుడు ఒక కాకి కావు మని అరుస్తున్నది. కాకి అనగా నేమి? అది యొక పక్షి. లోకులు కాకులు. కానీ అందరు లోకులూ కాకులవలె నుండరు. కొందరు రాబందులవలె, మరి కొందరు డేగలవలె వుంటారు. మీరు మాత్రమూ "స్వర్గము"లో పావురము, "రూపు"లో కోకిల

(క్షమించండి. ఒకటే కాగితం వుంది. కొట్టివేతలు ఇష్టంలేదు.) స్వర్గములో కోకిల, రూపులో పావురము అని చదువుకోగలరు.

ఇంతకీ ఏం చెబుతున్నాను నేను? భగవద్గీత గురించి కదూ! ప్రేమించేముందు తాను ప్రేమించే మనిషిలో గుణాలను పరీక్షించుకోవాలి. కొందరు గోముఖ వ్యాఘ్రాలుంటారు. మేకతోలు కప్పుకున్న పులులుంటారు. ముందే చెప్పియున్నాను కదా కాకులే కాదు డేగలు కూడా వుంటాయని.

నేనీ ప్రేమలేఖ రాస్తున్న సమయానికి ఆకాశంలో ఒక్క మేఘం కూడా లేదు. సూర్యుడు విజృంభిస్తూ ప్రకాశిస్తున్నాడు. సూర్యుడు స్వయం ప్రకాశితుడు. ప్రేమికుడు సూర్యుడిలా స్వయంప్రకాశితుడై వుండాలి. అంతేకానీ, మిణుగురు పురుగులుగానో, కేవలం చీకట్లోనే బాగా చూడగలిగే పిల్లి లాగానో, కళ్ళు పనిచేయని గబ్బిలం లాగానో వుండకూడదు. క్షమించాలి. ఈ లేఖ నిండా కాకులూ, డేగలూ, రాబందులూ, పిల్లలూ, గబ్బిలాలూ.... వీటి ప్రసక్తి వస్తున్నందుకు! భగద్గీతలో చెప్పినట్టు మనిషిలో వున్న జీవమే వీటిలోనూ వున్నది.

మీ జీవనమూ, నా జీవనమూ కలిపిన అది పరమయోగము. ఆ ఆత్మ సంయమ యోగము నా ఇచ్ఛ. మీ ఇచ్ఛ కూడా అదే అయిన, మనిద్దరం తొందర్లో... 'కలిసి వెచ్చాలు కొనే' రోజు వస్తుందని ఆశిస్తూ – మీ –

నేను".

సీరియస్‌గా చదవటం పూర్తి చేశాడు సుధాకర్. బోసు అతడి అభిప్రాయం ఏమిటా అన్నట్టు సస్పెన్స్‌గా చూశాడు. సుధాకర్ ఏమీ మాట్లాడకుండా దీర్ఘంగా నిట్టూర్చాడు.

"బావోలేదా?"

"నాకిందులో అంత అనుభవం లేదు".

"నాకూ లేదు. మా తండ్రిగారు కేవలము భగవద్గీత మాత్రమే నేర్పారు".

"కొంచెము వేదాంత చర్చ ఎక్కువైనట్టున్నది".

"జీవిత పరమార్థము వేదాంతమే కదా".

"కానీ ఇది ప్రేమలేఖ కదా!"

"ప్రేమకి మూలము వేదాంతము కాదా?"

సుధాకర్ గంభీరంగా తలూపాడు. ఇంకా ఏదో సంశయము మిగిలింది. అనుమానంగా – "ప్రేమలేఖలో వెచ్చాల ప్రసక్తి బావుంటుందంటావా?" అన్నాడు మళ్ళీ.

"తప్పక బావుంటుంది. సాధారణంగా ప్రేమికుడు ప్రేయసితో, 'ఉద్యాన వనమున విహరింతము వస్తువా' అనో, 'నా హృదయములోనికి నడిచి రమ్ము...' అనో అంటాడు కానీ 'వెచ్చాల కొట్టుకు కలసి పోయెదము రమ్ము....' అనడు. అది అతని ప్రాక్టికాలిటీకి నిదర్శనం. ఈ కాలంలో అమ్మాయిలు మారిపోయారు సుధాకర్. 'మెడచుట్టూ చేతులు వేయవద్దు. మంగళసూత్రం వేయమంటున్నారు'. ప్రేయసి నిజంగా దూరదృష్టి వున్నదయితే ఈ ప్రేమలేఖని ఒప్పుకుని తీరుతుంది వెళ్ళిరా" అంటూ పంపాడు.

* * *

"ఏమిటి? ఇవ్వేళ చాలా హుషారుగా ఉన్నావు" అడిగింది విశారద.

"చెపుతాగానీ, నువ్వు నాకు ఓ ప్రేమలేఖ వ్రాసిపెట్టాలి" అన్నాడు సుధాకర్.

ముందు ఆశ్చర్యపోయినా, ఉత్సాహంగా ముందుకు వంగి, "ఎవరా అమ్మాయి?" అని అడిగింది.

"అమ్మాయి కాదు, అబ్బాయే" అన్నాడు క్యాజువల్‌గా.

గాలిలో ఎగిరిపడింది విశారద. అతనివైపు అయోమయంగా చూసి "అబ్బాయిని ప్రేమించావా?" అంది భయం భయంగా.

"ఛా, నాక్కాదు. మా అసిస్టెంటు పద్మావతి అని ఒకమ్మాయి వుందిలే, చదువు అంతగా రాదు. ఆవిడేమో కాస్త చదువుకున్న అబ్బాయిని ప్రేమించింది. ఆ ప్రేమ ఎలా చెప్పాలో తెలియటం లేదు. అందుకే నువ్వు కాస్త సాయం పట్టాలి".

"నాకు మాత్రం ఏం వచ్చు? నా చదువంతా సత్రం అరుగులమీదా, జైలు గోడలమధ్య జరిగినదాయె".

"అంటే ఈ కాలం వాళ్ళంతా చదువుకొని ప్రేమలేఖలు వ్రాస్తున్నారంటావా? ప్రేమ – హృదయంలోంచి పొంగాలి. చదువులోంచి కాదు".

విశారద ఓ అరగంట సేపు వ్రాయటానికి ప్రయత్నించింది. కుదర్లేదు.

"నాకు రావటం లేదు బాబూ! నువ్వే రాసి పెట్టొచ్చు కదా ఆ అమ్మాయికి" అంది కలం పక్కన పెట్టేస్తూ.

"నేను వ్రాస్తే ఎక్కడో ఒకచోట తెలియకుండానే పొరపాటున మొగవాడు రాసినట్టు వచ్చేస్తుంది. ఉదాహరణకి నా మీసాలంటే నాకు చాలా ఇష్టం అనుకో. ఉత్తరంలో 'నీ మీద నాకెంత ప్రేమంటే... నువ్వు కోరితే నా మీసాలయినా యిచ్చేస్తాను – ఇట్లు పద్మావతి' అని రాశాననుకో. పాపం ఆ అమ్మాయిని

ప్రేమించిన కుర్రాడు బెదిరిపోతాడు. అందుకని ప్లీజ్ – రాసిపెడ్దూ" అని బ్రతిమాలాడు.

విశారద కొంచెం ఆలోచించి, "ఇలా నాకూ రాదు గానీ, ఈ రోజు ఎలాగూ లైబ్రరీకి వెళుతున్నాను. అక్కడ ఏ ప్రబంధాన్నో చదివి ఆ ప్రకారం రాస్తాలే. ప్రేమంటే కాస్త కవిత్వమూ అదీ వుండాలి కదా" అంది.

ఆ సాయంత్రం అతను, ఆమె లైబ్రరీ నుంచి రాగానే "వ్రాశావా?" అని అడిగాడు ఆత్రంగా.

ఆమె కాగితం అందిస్తూ, "అమ్మాయి రాసినట్టు, ఆడదాని మనసంతా పెట్టి రాశాను" అంది. అతను చదవటం ప్రారంభించాడు.

"పురుషుడి ప్రథమ స్పర్శకి

మొదట ముకుళించి. ఆ పై విచ్చుకున్న స్త్రీల్లా వున్నాయి నా చిన్ని తోటలోని పూలు... వర్షంలో తడిసి....

...అల్లరిగాలికి ఊగే సన్నజాజి నా బాల్యాన్ని గుర్తుచేసింది.

అప్పుడే వికసిస్తూన్న మందారం యెదిగే నా వయసుకి పోలిక చెప్పింది.

చిరుజల్లుల తాకిడికి మరింత ఎర్రబడిన కనకాంబరాలు నేను తన దగ్గరికి వెళ్ళినప్పుడు, నా చెంపలకి తమ ఎరుపును అరువిస్తామంటున్నాయి.

చినుకుల తడికి చెమ్మగిల్లిన గులాబీ, నన్ను ముద్దుపెట్టుకున్న పెదవుల్ని గుర్తుకు తెస్తోంది.

అసలే తెల్లగా వున్న రజనీగంధ – ఈ చిరుజల్లుకి మరింత స్వచ్ఛమై, వసంతకాల వేడికి కమిలిన నా వంటికి – తమ తెల్లదనాన్ని అద్దుతామంటున్నాయి.

ఇక మల్లెలు... నువ్వు అతని దగ్గిరకు వెళ్ళినప్పుడు 'మమ్మల్ని మాత్రమే పెట్టుకోవాలి సుమా' అన్నట్టు ఆహ్వానిస్తున్నాయి. చిరుజల్లుకి – ఉన్న కాస్త ధూళిపోయి, మరింత పరిమళాన్ని అందజేస్తున్న సంపెంగలు – తమ పరిమళాన్ని నేను కాస్త స్వీకరించి 'తన' దగ్గిర వదిలి రమ్మంటున్నాయి.

ఈ మామిడి కొమ్మల్ని కదిపితే నా తలమీద పడిన చినుకులు – పెళ్ళినాటి అక్షింతల్ని గుర్తు చేస్తున్నాయి.

విరిసీ విరియని ముద్దబంతిపూవు, వర్షంతో భారమై – ఏదో నెలని గుర్తు చేస్తోంది.

చినుకుల వడికి, రాలిపోవటానికి సిద్ధంగా వున్న ముద్దమందారం రాబోయే నా వృద్ధాప్యానికి ప్రతీకగా వుంది.

జాలిగా చూస్తున్న పారిజాతం, ఆ ప్రభువును చేరలేకపోతున్నాను – కనీసం నీ ప్రభువు దగ్గరకైనా తీసుకువెళ్ళమన్నట్టు చూస్తోంది.

నేనేమో – ఈ వర్షం కురిసిన సాయంకాలం, యవ్వనం నుంచి వృద్ధాప్యం వరకూ, ఈ ప్రభువు నుంచి ఆ ప్రభువు చెంత చేరేవరకూ – నా పయనం గురించి ఆలోచిస్తూనే వున్నాను.

ఇట్లు

- నాలోని మీలో నేను."

చదవటం పూర్తి చేశాడు సుధాకర్ .

"ఎలావుంది?" ఆత్రంగా అడిగింది.

అతడేమీ సమాధానం చెప్పకుండా లేచి బయటకు నడిచాడు. వెళ్తూ వెళ్తూ, బోసు వ్రాసిన ఉత్తరాన్ని ఆమె చూడకుండా తలుపు వెనుకపెట్టాడు.

సినిమా హాలుకి వెళ్ళిన తరువాత, బోసు సైకిలుకున్న బ్యాగులో విశారద రాసిన ఉత్తరాన్ని పడేశాడు.

ఆ విధంగా అతడు ఒకరి ఉత్తరాన్ని ఒకరికి అందజేసాడు.

ఆ తరువాత వాళ్ళిద్దరి ప్రేమ ఫలించటానికి ఆ రాత్రి మరో బాటిల్ ఎక్కువ తాగాడు.

* * *

"ఏమిటది?" ఆశ్చర్యంగా అడిగింది విశారద. బోసు చేతిలో స్వీటు ప్యాకెట్ వుంది.

"ముందు నోరు తెరువు, చెపుతాను".

"ఏమిటో చెప్పకూడదా?"

బోసు నవ్వేడు. అదే టైమ్‌కి పక్క పాకనుంచి సుధాకర్ బయటకొచ్చాడు. విశారద ఇంటిముందు బోసు సైకిల్ వుండటంతో అతని మొహంలో చిరునవ్వు కదలాడింది. లోపలికి వెళ్దామా, వద్దా అనుకుంటూ తటపటాయించాడు. ఇక టెన్షన్ ఆపుకోలేక తలుపు దగ్గిరకు వచ్చి నిలబడి లోపలి సంభాషణ వినసాగాడు.

లోపల "నేనూ మీకు ఒక మంచి వార్త చెపుతాను" అంటూంది విశారద.

"సరే – ముందు మీరే చెప్పండి".

"పోనీ మీరు చెప్పండి".

"మీరు చెప్పండి"?

"మీరే!"

"మీరే!"

ఇద్దర్నీ లోపల అలా వుంచేసి పాక బయట తాళం వేసి వెళ్ళి పోదామన్నంత కోపం వచ్చింది సుధాకర్‌కి. 'వీళ్ళిద్దరికేగానీ పెళ్ళయితే ముందు 'మీరే – మీరే' అనుకుంటూ, ఎన్ని శోభనాలు జరిగినా ఈ లెక్కన పిల్లలు పుట్టరు' అనుకున్నాడు. 'పోనీ ఇద్దరూ ఏదో 'సి' క్లాసు సినిమాలోలా ఒకేసారి 'ఐ లవ్యూ' అన్నా బావుండేది' - అనుకున్నాడు. ఇక తను బయటే వుంటే లాభం లేదని, లోపలకి వెళ్ళాడు.

బోసు సుధాకర్‌కి కూడా స్వీటు ఇస్తూ, "మా అన్నయ్యకి ఉద్యోగం వచ్చింది. అదీ శుభవార్త" అన్నాడు.

సుధాకర్‌కి ఆ విషయం విని సంతోషంచాలో అంతకన్నా మంచి వార్త 'ఎక్స్‌పెక్టు' చేయటం వలన హతాశుడవ్వాలో అర్థంకాలేదు. ఈలోపులో బోసు విశారదతో, "మీరేదో మంచి వార్త చెపుతానన్నారు" అన్నాడు.

"ఓ అదా ?" అంటూ విశారద "... ఒక్క నిముషం" అని ట్రంకు పెట్టె దగ్గిరకు వెళ్ళింది.

సుధాకర్ ఊపిరి బిగపట్టాడు. తను అక్కడ వుండటం వాళ్ళ ఒంటరితనానికి భంగం కలిగిస్తుందేమో, 'బయటకు వెళ్ళిపోదామా' అనుకున్నాడు. అంతలోనే విశారద పెట్టి పక్కన వుంచిన రెండు పుస్తకాలు

తీసుకొని వస్తూ, "మొన్న మా ఇంటి దగ్గిర ఓ ఉత్తరం దొరికింది. ఎవరో వేదాంతి అనుకుంటాను. జీవన సారాంశము అనే దాని గురించి రాశారు. పక్క వీధిలో ప్రతి సాయంత్రం రామకృష్ణ మిషన్ వాళ్ళు భగవద్గీత మీద లెక్చర్స్ నిర్వహిస్తున్నారు కదా. నిన్న సాయంత్రం వెళ్ళి ఆ కాగితాన్ని మైకుముందు చదివాను. అందులోని అద్వైతభావాన్ని అందరూ చాలా మెచ్చుకున్నారు. ఆ సభ నిర్వాహకులు ఇదిగో ఈ రెండు పుస్తకాలూ బహుమతిగా ఇచ్చారు. 'నిత్య జీవితంలో సన్యాసము' అని ఒకటి, 'అండర్ స్టాండింగ్ ఆఫ్ కర్మా' ఒకటి. ఆ వేదాంతి ఎవరో అయనకి ప్రణమిల్లాలనిపిస్తోంది. నా గృహ ద్వారము దగ్గిర ఇంత పునీతమైన పత్రాన్ని వదిలి వెళ్ళినందుకు" అంది భక్తిభావంతో.

సుధాకర్‌కి తల తీసుకెళ్ళి రోడ్ రోలర్ కింద పెట్టాలనిపిస్తోంది. బోసుకి ఇవేమీ తెలీవు. "మొన్న నా సైకిల్ బ్యాగులోనూ వాళ్ళ స్కూల్లో బోటనీ టీచర్, ఏదో వ్యాసం వ్రాయమందట. 'మనిషి జీవితంలో పూవుల ప్రాముఖ్యం' అని, నా బ్యాగ్‌లో ఉత్తరం కూడా అదేదో రజనీగంధా – పారిజాతం పూలకి సంబంధించినదే వుంది. నేను మా చెల్లికిస్తే వ్యాసం వ్రాసింది. టీచర్ చాలా మెచ్చుకుంది..."

సుధాకర్ వున్నట్టుండి విరుచుకు పడిపోయాడు.

ఇద్దరూ కంగారుపడ్డారు. "మొహం మీద జల్లటానికి నీళ్ళు తీసుకురానా?" అంది భయంగా విశారద.

"అక్కర్లేదు" అన్నాడు సుధాకర్ పడుకునే.

"అసలు మీ ఇద్దరిలో ప్రేమ విత్తనాన్ని నాటాలనుకోవటం నాదే బుద్ధి తక్కువ. ఒకరి హృదయం రాజస్థానూ, ఇంకొకరిది రాయలసీమానూ" అన్నాడు.

"ప్రేమ విత్తనమేమిటి ?" అన్నారిద్దరూ ఒకేసారి.

"మీరిద్దరూ ఒకర్నొకరు ప్రేమించుకుంటున్నారో లేదో చకచకా తేల్చేయటం మంచిదనుకున్నాను" అన్నాడు – ఉత్తరాల విషయం చెప్పి!!

విశారద బోసువైపు చూసింది.

అదే టైమ్‌కి బోసుకూడా ఆమెవైపు చూశాడు. ఇద్దరి మొహాల్లోనూ అప్రయత్నంగా నవ్వు కదలాడింది.

ప్రేమ పుస్తకపు మొదటి పేజీలో రాసుకోవటానికి చిరునవ్వు కన్నా గొప్ప 'ప్రిఫేసు' వుంటుందా?

## 4

**బోసు** ఇంటికి చాలా హుషారుగా వచ్చాడు. నిజానికి ఆ రోజంతా అతను ఉత్సాహంగా వున్నాడు. అతని హుషారుకు రెండు కారణాలున్నాయి. మొదటిది – అన్నకి ఉద్యోగం రావటం. రెండోది – విశారద.

విశారద అంతరంగం తెలిసి అతడు ఆనందంతో పొంగిపోయాడు. ఆమెను చూసిన మరుక్షణమే అతడికి ఆ భావం కలిగింది. ఇప్పుడు అటు నుంచి కూడా వప్పుకోలు రావటం అతడిని సంతోషంతో నింపింది. సుధాకర్‌కి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. వట్టి కృతజ్ఞతలు సరిపోవని సుధాకర్ ఆ రాత్రి 'ఖర్చు' బోసు పెట్టే షరతుమీద అతడిని వదిలిపెట్టాడు. అది వేరే సంగతి.

బోసు ఇంటికొచ్చేసరికి గోమతి ఇల్లంతా సర్దుతూ కనిపించింది. వున్నంతలో ముందు గది మరింత బాగా కనపడేలా చేయటానికి శతవిధాల ప్రయత్నిస్తోంది.

"ఏమిటి విషయం ?" అని అడిగాడు.

గోమతి ముసి ముసిగా నవ్వుతూ, "అన్నయ్య తన గర్ల్ ఫ్రెండ్‌ని, ఆ అమ్మాయి నాన్నగార్ని మనింటికి తీసుకొస్తున్నాడు" అంది. బోసుకి ఆశ్చర్యం కలిగింది. రామ్మూర్తికి ఒక అమ్మాయితో పరిచయం వుందని అతనికింతవరకు తెలీదు. "నీకీ విషయం ముందే తెలుసా?" అని అడిగాడు.

ఆ అమ్మాయి నవ్వు దాచుకునే ప్రయత్నమేమీ చేయకుండా, "ఇలాంటివి ఎవరయినా ముందు చెల్లెళ్ళకే చెప్పుకుంటారు. నాకు ఎప్పుడో తెలుసు" అంది.

"ఎవరే ఆ అమ్మాయి?" ఉత్సుకంగా అడిగాడు.

"ఎవరో పోలీసు కూతురు అనుకుంటాను. నేనూ చూడలేదు. ఫోటో చూపించాడు" అంది.

"ఇంతకాలం తండ్రికి ఈ విషయం చెప్పటానికి బహుశా భయపడి వుంటాడు" అనుకున్నాడు బోసు. 'ఇప్పుడు ఇంటి పెద్ద తనేగా, అందుకే ఏకంగా కాబోయే భార్యని , మామగార్ని కూడా ఇంటికి ఆహ్వానిస్తున్నాడు –'

గోమతి అన్నది – "ఆ అమ్మాయి బాగా ధైర్యవంతురాలనుకుంటాను. వాళ్ళ ఇంట్లో ఈ సంగతంతా చెప్పినట్టుంది. ఆయనకి అన్నయ్య నచ్చాడట. అందుకే ఇప్పుడు ఇంటికొస్తున్నారు".

'తనకి తెలియకుండా చాలా విషయాలు జరుగుతున్నాయే' అనుకున్నాడు బోసు. మళ్ళీ అంతలోనే – తనుకూడా విశారద విషయం ఇంట్లో చెప్పలేదు కదా అని అనుకున్నాడు.

అదే సమయానికి గోమతి ఒక పెట్టెను వెనక్కి తోస్తూంది. అది లక్ష్మీ శారద పెట్టె.

దాన్ని చూడగానే అతడికి మళ్ళీ పాత విషయాలన్నీ గుర్తొచ్చాయి. పెట్టె కూడా వదిలేసి ఆమె ఎక్కడకు వెళ్ళింది? అన్నది సమాధానం తెలియని ప్రశ్న. పోనీ ఎవరయినా గూండాలు పగబట్టి ఎత్తుకుపోయారా అంటే ఆమె గడపదాటి బయటకు అడుగు పెట్టదు. ఇంట్లో గోమతి, అహల్య వుంటారు.

"ఆ పెట్టెలో ఇంకా బట్టలున్నాయా గోమతీ?" అని అడిగాడు. యధాలాపంగా పనిచేస్తున్న గోమతి ఆ హఠాత్ ప్రశ్నకి ఉలిక్కిపడి అయోమయంగా అన్నవైపు చూసింది.

"చిన్న చేతి సంచీ కూడా తనతో తీసుకువెళ్ళకుండా లక్ష్మీశారద అర్ధరాత్రి ఎలా వెళ్ళిపోయింది?" అని అడిగాడు.

గోమతి ఏదో చెప్పబోతుండగా బయట జీపు ఆగిన శబ్దం వినిపించింది.

"అదిగో వచ్చారు" అంటూ లేడిలా బయటకు పరుగెత్తింది. గోమతి. బోసు కూడా నెమ్మదిగా బయటకు వచ్చాడు.

ముందు రామ్మూర్తి దిగాడు. తరువాత ఆ అమ్మాయి దిగింది. కళ్ళకు కూలింగ్ గ్లాసెస్ వున్నాయి. గీతాంజలి డ్రస్ వేసుకుంది. రామ్మూర్తి కన్నా కాస్త పొడవుగా వున్నట్టు కనిపిస్తోంది. ఒక పాయ జుట్టు చెంపవరకూ 'కట్' చేసింది.

పేరు పక్కన బి.ఎ. ఫెయిల్ అయిన తన క్వాలిఫికేషన్‌ని బ్రాకెట్లో వ్రాసుకునే చౌకబారు సంస్కారం గుర్తొస్తుంది. ఆ అమ్మాయిని చూస్తూంటే అవసరమయిన దానికన్నా ఎక్కువ ఫాషనబుల్‌గా కనపడాలని చేసిన ప్రయత్నం కొట్టొచ్చినట్టు కనపడుతూంది. బాగా బీదగా పుట్టి, ఆ తరువాత తండ్రి లంచాలు పట్టే ఉద్యోగంలో వుండటం వల్ల లక్షలు సంపాదించి, డబ్బుతోపాటు సమానంగా హుందాతనం పెరిగిపోవటంవల్ల వచ్చే 'నియోరిచ్' లేకిదనం చాలా కుటుంబాల్లో చూస్తూ వుంటాం. అలాటిది ఆ అమ్మాయిలో గోచరిస్తూంది. వీటన్నిటినీ కాదు అతను చూస్తూంది. ముందు సీట్లోంచి దిగుతూన్న వ్యక్తిని – ఇన్‌స్పెక్టర్ డ్రస్‌లో వున్నాడు అతను – సింహాచలం! బోసు – ఈ వూహించని పరిణామానికి నిశ్చేష్టుడయ్యాడు. ఈ లోపల వాళ్ళు ముగ్గురూ దగ్గర కొచ్చారు. సింహాచలం బోసుని గుర్తుపట్టి ఆగాడు.

"మా తమ్ముడు" అన్నాడు రామ్మూర్తి.

"వీడు నీ తమ్ముడా ?" మాట్లాడుతోంది – కాబోయే అల్లుడితోనని అయినా గౌరవం లేకుండా మొహం చిట్లిస్తూ అన్నాడు సింహాచలం. "వీడిని మొన్నే మా స్టేషన్‌లో పడేసి కుళ్ళపొడిచాను. పెద్ద గూండా. నీకు తెలుసో తెలీదో" ఆ మాటలకి అక్కడ వున్న వారందరూ స్థాణువులయ్యారు.

వాళ్ళ తమ ఇంటికి వచ్చిన మొదటి క్షణమే తన గురించి చర్చజరగటం బోసుకి ఇష్టం లేకపోయింది. మాట మార్చి – కాఫీ తాగుతారా అని అడగబోయేంతలో గోమతి కల్పించుకుని, "అన్నయ్యకి పొగరేమీ లేదు. చాలా

మంచివాడు" అంది. ఆ పిల్లకి బోసుని ఎవరైనా ఏమయినా అంటే వెంటనే కోపం వస్తుంది.

"మంచివాడా?" అని సింహాచలం ఎగతాళిగా నవ్వేడు.

"సినిమాహాళ్ళ దగ్గిర బ్లాకులో టిక్కెట్లు అమ్మేవాళ్ళు, దొంగ సారా అమ్మే గూండాలూ నీ అన్నయ్య గ్యాంగు మెంబర్లు..." అన్నాడు. బోసు మొహం ఎర్రబడింది.

"అరెస్టు చేసిన వాళ్లని వదలటానికి అయిదువేలు లంచం తీసుకొనే వాళ్ళకన్నా ఆ గ్యాంగు మెంబర్లు మంచివాళ్ళే" అన్నాడు.

రామ్మూర్తి గట్టిగా, "బోసూ" అని అరిచాడు. అప్పటికే బోసుకి తను అవసరమయిన దానికంటే ఎక్కువ మాట్లాడానని అనిపించింది. తల వంచుకుని బయటకు వెళ్ళిపోయాడు.

అయితే ఆ విషయం అక్కడితో సమసిపోలేదు. రామ్మూర్తి తన కాబోయే మమాగార్నీ, భార్యనీ ఇంటివరకూ దింపేసి, కొంచెంసేపు అక్కడ మాట్లాడి వచ్చిన తరువాత, మళ్లీ అదే ప్రసక్తి తీసుకొచ్చాడు. "ఇక్కడి కొచ్చేవరకూ ఆయన (అంటే తనకి కాబోయే మామగారు) బాగానే వున్నారు. కానీ నిన్ను చూశాక మనమీదున్న మంచి అభిప్రాయం పోయింది" అన్నాడు కోపంగా.

అక్కడి వాతావరణాన్ని చల్లబర్చటానికా అన్నట్టు గోమతి నవ్వుతూ, "ఏమిటన్నయ్యా! కాబోయే మామగార్ని అంత వెనుకేసుకొస్తున్నావ్. కొంపదీసి ఇల్లరికం వెళ్లిపోతావా ఏమిటీ?" అంది ఆట పట్టిస్తున్నట్టు. అయితే ఆమె అన్న మాటలు అగ్నిలో ఆజ్యం పోసినట్టు అతడి కోపం పెరగటానికి దోహదం చేశాయి.

"అవునే, వెళతాను. ఇప్పుడు అక్కడ అదే మాట్లాడి వస్తున్నాను. నన్ను అక్కడికే వచ్చెయ్యమన్నారు. ఇలాటి రౌడీలున్న ఇంట్లో కూతుర్నివ్వటానికి ఏ తండ్రి మాత్రం వొప్పుకుంటాడేమిటి?" అన్నాడు.

గోమతి స్వరం హెచ్చించి, "వెళ్తావా, వెళ్ళు, కానీ ఒక్కటి మాత్రం గుర్తుంచుకో. చిన్నన్నయ్య రౌడీ అయితే, నీ మామగారు కేడీ... దొంగలకి మించిన దొంగ" అంది.

బోసు "గోమతి" అంటూ వారించబోయాడు. అయితే ఆ అమ్మాయి అతన్ని పట్టించుకోలేదు. "ఇక్కడలాగా ఖాళీగా ఇల్లరికంలో కూర్చుంటే కుదర్దు. వారం రోజుల్లో ఇంట్లోంచి తోలేస్తారు" అంది.

ఆ మాటలు పూర్తికాకుండానే రామ్మూర్తి బలంగా ఆమె చెంప మీద కొట్టాడు. గోమతి దూరంగా వెళ్లి పడింది.బోసు చప్పున చెల్లెల్ని పట్టుకున్నాడు. రామ్మూర్తి చెల్లెల్ని తిరిగి కొట్టడానికి వెళ్తూ, "నేను ఖాళీగా లేనే... మీరందరూ ఖాళీగా వున్నారు. నేను విదిల్చే మెతుకుల కోసం కాచుక్కూర్చున్నారు. నేను సంపాదించే కట్నం డబ్బుల కోసం కాటికాడ నక్కల్లాగ ఎదురుచూస్తున్నారు" అని అరిచాడు.

కళ్ల నీళ్లు తుడుచుకుంటూ గోమతి బోసు చేతుల్లోంచి విడిపించుకుని విసురుగా ముందుకొచ్చి – "మేమేమీ నీ డబ్బుల కోసం ఎదురుచూడటం లేదు. జీవితాంతం పెళ్లి చేసుకోకుండానయినా వుంటానుగానీ, కట్నం కోసం నీ నుంచి పైసా కూడా తీసుకోను. అయినా 'ఖాళీగా ఉండటం' గురించి నువ్వు మాట్లాడటమేమిటి? నిన్ను ఖాళీగా వుంచకుండా వుండటం కోసం నాన్నగారు

ఆత్మహత్య చేసుకున్నారు. నీ ఉద్యోగం కోసం చిన్నన్నయ్య లాకప్‌లో కూర్చున్నాడు. ఇప్పుడు నువ్వేమో అన్నీ మర్చి ఇల్లరికం పోతానంటున్నావు. అసలు నువ్వు ఇలాటివాడివి కాబట్టే ఆ రోజు శారద..." అంటూ చప్పున మాట జారినట్టు ఆగిపోయింది.

అప్పటివరకూ రామ్మూర్తి – చెల్లెల్ని మళ్ళీ కొట్టకుండా చూడటానికి ప్రయత్నిస్తున్న బోసు – ఈ చివరిమాటకి గోమతిని అప్రయత్నంగా వదిలేసి – "ఆ రోజు....? శారద...? ఏమయింది..." అని అడిగాడు.

గోమతి మాట్లాడలేదు. అహల్య మొహం కూడా పాలిపోయింది.

బోసు చెల్లెల్ని పట్టుకుని వూపేస్తూ, "ఆ రోజు శారదకేమైంది? మీకు తెలుసుకదూ... శారద ఎక్కడికెళ్ళిందో... కనీసం ఎందుకెళ్ళిందో మీకు తెలుసు కదూ" అని అడిగాడు.

ఎవరూ మాట్లాడలేదు. బోసు చెల్లిలితో, "చెప్పకపోతే నా మీద ఒట్టే" అన్నాడు.

రామ్మూర్తి చప్పున అడుగు ముందుకేసి, "గోమతి" అన్నాడు చెప్పవద్దని హెచ్చరిస్తున్నట్టు! కానీ అప్పటికే బోసుబాబు ఆ అమ్మాయి భుజాలు పట్టుకుని వూపేస్తూ, "... చెప్పు శారదకి ఏమయింది?" అని అడిగాడు. అన్నయ్యలో అంత ఆవేశం ఎప్పుడూ చూడని ఆ అమ్మాయి భయంతో బిగుసుకుపోయింది.

బోసు చెల్లెలి చెయ్యితీసి తన తలమీద మళ్ళీ పెట్టుకుని "చెప్పకపోతే నా మీద ఒట్టు!" అన్నాడు.

దాంతో ఆ అమ్మాయి ఒక్కసారిగా బరస్ట్ అయి, "పెద్దన్నయ్య నీకు చెప్పొద్దని భగవద్గీతమీద ఒట్టు వేయించాడు" అంది.

అక్కడ సూదిపడితే వినిపించేటంత నిశ్శబ్దం వ్యాపించింది. అంత ఆవేశంలోనూ, బోసు కూడా ఆ మాటలకి స్థాణువై, ఒక్కక్షణం పాటు మాట్లాడలేకపోయాడు.

రామ్మూర్తి కల్పించుకుని "అవును. నేనే వద్దన్నాను. ఇప్పటివరకూ ఆ శారద వలన అయిన గొడవ చాలు. ఇంక దాని సంగతి మర్చిపోండి అని చెప్పి ఒట్టు వేయించాను" అన్నాడు.

బోసు మొహం జేగురు రంగుకి మారింది. "అసలేమయింది, ఆ రోజు? అది చెప్పు" అన్నాడు పెదవులు బిగపట్టి.

"పోన్లేరా, అయిపోయిందేదో అయిపోయింది. అవన్నీ ఇప్పుడే మాట్లాడుకోవాలా..." తేలిగ్గా అన్నాడు రామ్మూర్తి. బోసు తనని సంభాళించుకుంటూ అహల్యవైపు తిరిగి, "నువ్వు చెప్పు, అసలేం జరిగింది ఆ రోజు" అని అడిగాడు.

ఆ అమ్మాయి జవాబు చెప్పకుండా రామ్మూర్తివైపు చూసింది. అదొక చిన్న విషయంగా భావించి రామ్మూర్తి నవ్వేడు. దాంతో బోసుకి అగ్నిలో ఆజ్యం పోసినట్టు అయింది. చెలరేగుతున్నట్టు అన్నాడు –"ఒక నిరాశ్రయురాలయిన అమ్మాయిని మనం ఇంటికి తెచ్చి పెట్టుకున్నాం. నాన్నగారు కూడా దాన్ని ఆమోదించారు. ఇప్పుడు ఆ అమ్మాయికి ఏదో ప్రమాదం జరిగితే దాన్ని కప్పిపుచ్చడానికి మీరంతా భగవద్గీత ప్రమాణాలు చేశారు!.. ఇలాంటి

ప్రమాణాలకి ఉపయోగించినందుకు ఆ భగవద్గీత సిగ్గుపడుతుంది. మనలాటి వాళ్ళని కన్నందుకు మన తండ్రి ఆత్మ క్షోభిస్తుంది" అంటూ రామ్మూర్తివైపు చూశాడు.

రామ్మూర్తి మొహం తిప్పుకున్నాడు.

"చెప్పు. ఏం జరిగింది ఆ రోజు ?"

ఆహల్య తలదించుకుంది. బోసు అందరివైపు చూస్తూ –

"దేవుడికన్నా న్యాయం గొప్పదని మీరు నమ్మితే ఏం జరిగిందో చెప్పండి" అన్నాడు.

గోమతి అడుగు ముందుకేసి "నేను చెపుతాను అన్నయ్యా" అంది.

# 5

**ఇన్‌స్పెక్టర్** రాధాకృష్ణమాచారి ఎదురుగా వున్న రెండు కుక్కలకేసి సానుభూతిగా చూశాడు. కేవలం సానుభూతి కాదు, ఆ చూపులో గౌరవం, భయం – అన్నీ మిళితమై వున్నాయి.

ప్రస్తుతం ఆ కుక్కలు బలహీనంగా వున్నాయి. అయినా వాటిలో రాజసం పోలేదు. నోరు లేదుగానీ, లేకపోతే అవికూడా కాబినెట్ మినిష్టర్లయి వుండేవి. అంత ధీమాగా వున్నాయి.

చీఫ్ మినిష్టర్ గారి భార్యకి అవంటే ప్రాణం.

నిన్న రాత్రినుంచీ వాటికి కాస్త నలతగా వుండటంతో, ఆవిడ కంగారుపడి, పి.ఏ.తో పోలీసుస్టేషన్‌కి పంపించింది.

అతను ఆ ఏరియాకి పోలీస్ ఇన్స్పెక్టరో – లేక పెద్దవాళ్ళ కుక్కలకి రోగమొస్తే డాక్టర్‌కి చూపించే పి.ఆర్.వో.నో – అతడికి అర్థంకాలేదు. యస్పీ నుంచీ ముఖ్యమంత్రి వరకూ అందరిళ్ళల్లోనూ కుక్క లుండటం సహజం. తన పోలీస్ స్టేషన్ ఏరియాలో వెటర్నరీ ఆస్పత్రి ఉండటం తిరుపతిలో ఉద్యోగం చేయటమంత దురదృష్టమని ఇప్పుడిప్పుడే అర్థమవుతూంది. ప్రతివాడిదీ ఆబ్లిగేషనే. ఇక్కడ హాస్పిటలు, అక్కడ గుడి.

హెడ్డుని పిలిచి "ఏం చేస్తున్నావు?" అని అడిగాడు.

"పాతపేట దొమ్మీకేసులో నేరస్తుల్ని అరెస్టు చేయటానికి వెళుతున్నాను సార్" అన్నాడు.

"అది తరువాత చేద్దూగాన్లే గానీ ముందు ముఖ్యమంత్రి గారి కుక్కల్ని ఆస్పత్రికి తీసుకెళ్ళు" అని పురమాయించాడు. పి.ఏ. థాంక్స్ చెప్పి లేవబోతూండగా బోసు వేగంగా లోపలికి వచ్చాడు. అతడి మొహం ఉద్విగ్నతతో నిండివుంది. లోపలికి వస్తూనే "శారదని ఎవరు తీసుకువెళ్లారో తెలిసింది. ఆ ధనరాజ్ మొదలియార్‌ని అరెస్టు చేయ్యాలి" అన్నాడు.

రాధాకృష్ణమాచారికి అర్థంకాలేదు. "శారదెవరు?" అని అడిగాడు. ఈ ఎదురు ప్రశ్నకి బోసు దెబ్బతిని, వెంటనే సర్దుకుంటూ, "మా ఇంట్లో వుండేది. మీరు పేపర్లలో కూడా చదివానని చెప్పారు" అన్నాడు.

"ఓ, ఆవిడా!"

"ఇంతకాలం ఆమె తనంతట తానే వెళ్లిపోయింది అనుకున్నాను. కానీ ఇప్పుడే తెలిసింది – ధనరాజ్ మొదలియార్, మస్తాన్ కలిసి మా ఇంటికొచ్చి బలవంతంగా ఆమెను ఎత్తుకు వెళ్ళారని..."

మస్తాన్ పేరు చెప్పగానే ఇన్‌స్పెక్టర్‌కి అంతా గుర్తొచ్చింది. దానితోపాటే మొదలియార్ అంటే ఎవరి గురించో కూడా అర్థమైంది.

ధ....న...రా...జ్... మొ....ద...లి....యా....ర్!

ఒక దారపు వుండ మొదటి చిక్కు తీయబోతే, వరుసగా చిక్కులు పడినట్టు, ఎక్కడ ప్రారంభమైన సమస్య ఎక్కడ తేలింది అనుకున్నాడు.

బోసుకి ఇన్‌స్పెక్టర్ మనసులో ఏ ఆలోచనలు కదులుతున్నదీ తెలీదు. అయినా అతడి ఆవేశంలో అతనున్నాడు. ఆవేశంతో వణికిపోతున్నాడు. ఇన్నాళ్ళూ శారద ఏమైందా అన్న అనుమానం, తమ ఇంట్లో ఆమెకి భద్రత కలిగించ లేకపోయామన్న గిల్టీ ఫీలింగ్‌తో బాధపడుతూ వచ్చాడు. ఇప్పుడు అసలు విషయం తెలిశాక ఇక తననితాను కంట్రోలు చేసుకోవటానికి చాలా కష్టపడ్డాడు.

"ఆమెని వాళ్లు తీసుకువెళ్ళారని మీకు ఎలా తెలిసింది?"

"మా ఇంట్లో అందరూ చూస్తుండగానే తీసుకెళ్ళారు".

"మరింత కాలం రిపోర్టు చేయలేదేం?"

"వాళ్ళు నాకు చెప్పలేదు".

"ఎందుకు?"

"ఇంకా గొడవ పెద్దదవుతుందని" విసుగ్గా అన్నాడు.

"మరి ఇప్పుడు?"

బోసు మరింత విసుగ్గా –"ఇప్పుడు ఈ విషయం నాకు తెలిసింది. కాబట్టి నేను రిపోర్టు చేస్తున్నాను" అన్నాడు.

"ఆమె మీకు ఏమవుతుందని రిపోర్టు చేస్తున్నారు?"

ఊహించని ఈ ఎదురు ప్రశ్నకి బోసు అవాక్కయ్యాడు. "ఏ హోదాలో వచ్చి రిపోర్టు చేస్తున్నారు" అని ఇన్‌స్పెక్టర్ అడుగుతున్నట్టు అర్థమైంది. అతడి పిడికిళ్లు బిగుసుకున్నాయి.

"నలుగురు రౌడీలు ఇంటిముందు వెహికల్ ఆపుచేసి వచ్చి ఒక స్త్రీని ఇంటినుంచి దౌర్జన్యంగా తీసుకువెళ్తే దాన్ని రిపోర్టు చేయటానికి ఆమెకీ మాకూ ఏదో ఒక సంబంధం వుండితీరాలా ఇన్‌స్పెక్టర్? ఆమె 'మా' మనిషి అయితే తప్ప మీరు రక్షించరా? అప్పుడుగానీ మాకు రిపోర్టు చేసే అధికారం వుండదా?" అంటూ అరిచాడు.

ఇంతలో హెడ్ కానిస్టేబుల్ కుక్కల్ని తీసుకొచ్చాడు. పి.ఎ. ఇన్‌స్పెక్టర్‌కి థాంక్స్ చెప్పి వాటిని తీసుకెళ్ళాడు. వాళ్లు వెళ్లిపోయాక – రాధాకృష్ణమాచారి బోసువైపు తిరిగి, "మీ ఇంట్లోవారు చెప్పింది కరెక్టే. ఈ విషయం ఇక్కడితో మర్చిపోండి. 'పెద్దవాడిని, అనుభవంతో చెపుతున్నాను' ఇది చాలా పెద్ద గొడవ అవుతుంది" అన్నాడు.

బోసు పళ్ళు బిగించి, "నేనూ ఒక పౌరుడిగా చెపుతున్నాను. ఈ డ్రస్ విప్పేసి మీరు కుక్కల వైద్యం మొదలుపెట్టండి" అన్నాడు. అన్న తరువాత 'మాట జారానా' అనుకున్నాడు. అయితే ఇన్‌స్పెక్టర్‌కి ఆ మాటలకి కోపం రాలేదు. ఇంకొకరైతే లాకప్‌లో పడేసి కొట్టేవారే. కానీ ఆచారి దైవభక్తుడు.

"చూడు బోసూ, ఆ ధనరాజ్ మొదలియార్ గురించి నీకు ముందే చెప్పాను. అతడు ధనుంజయకీ, ప్రధానమంత్రికీ కుడిభుజం. హోమ్ మినిష్టర్‌కి అతడేం చెపుతే అంత. అటువంటివాడిని అరెస్ట్ చేయడం సామాన్యంకాదు. ఫలితాలు తీవ్రంగా వుంటాయి".

"క్రితంసారి నేను వచ్చినప్పుడు కూడా మస్తాన్ గురించి మీరీమాటే చెప్పారు. నేను వెళ్ళి వాడి పెదాల్ని కాల్చి వచ్చాను. ఏం జరిగింది ?"

"శారద కిడ్నాప్ జరిగింది. ధనరాజ్ మొదలియార్ రంగప్రవేశం జరిగింది" ఇన్‌స్పెక్టర్ సమాధానం బుల్లెట్‌లా వచ్చింది.

"అప్పుడు మీరు కాదంటే మస్తాన్‌కి నేనే బుద్ధి చెప్పాను. ఇప్పుడు మీరు కాదంటే నేనే మొదలియార్‌కి కూడా బుద్ధి చెపుతాను" అదే టోన్‌లో అన్నాడు బోస్.

"నువ్వు మొదలియార్‌ని...." ఆ తరువాత పూర్తిచేయలేక పోయాడు. "...మొదలియార్ సమీపానికి వెళ్లడం కూడా అంత సులభం కాదు" అన్న ఉద్దేశ్యంతో!

"చూడండి ఇన్‌స్పెక్టర్. ఆ శారద నాకేమీ కాదు. కేవలం మానవతావాదంతో ఆమెని మా ఇంట్లో వుంచుకున్నాం. ఇదంతా ఎందుకంటే మనం మనుష్యులం కాబట్టి. మమ్మల్ని రక్షించటానికి జీతాలు తీసుకుంటున్న మీకు, మాకున్నంత ధైర్యం లేకపోవటం దురదృష్టం".

ఇన్‌స్పెక్టర్ గుండెల్లో ఎక్కడో సూటిగా ఆ మాట తగిలింది. "సరే రిపోర్ట్ రాసివ్వండి. ఇన్వెస్టిగేట్ చేస్తాను" అన్నాడు.

"ఇందులో ఇన్వెష్టిగేషన్ ఏముంది?" తెల్లబోతూ అడిగాడు.

"సాక్షుల్ని విచారించాలి. మీ చెల్లెళ్ళనీ, అన్నయ్యనీ కలవాలి. ఆ శారద తనంతట తాను అతనితో వెళ్ళిపోలేదని నిరూపణ కావాలి. ధనరాజ్ మొదలియారే మీ ఇంటికి వచ్చాడని దృఢమైన సాక్ష్యం కావాలి. కంప్లయింట్ ఇచ్చిన వాళ్ళకీ, మాయమైన అమ్మాయికీ ఏ సంబంధముందో రేపు కోర్టులో..."

బోసు అప్పటికే పోలీస్ స్టేషన్ మెట్లు దిగుతూ వెళ్ళిపోయాడు.

ఆశ్చర్యంగా – అతడిలో ఇప్పుడు ఆవేశంలేదు. చాలా మామూలుగా వున్నాడు! ఆటో పిల్చి అడ్రసు చెప్పి పోనీ అన్నాడు. అరగంట ప్రయాణంచేసి, ఒక భవనం ముందు ఆగి, డబ్బులిచ్చి పంపాడు. గూర్ఖాని "మొదలియార్ వున్నాడా?" అని అడిగాడు.

అదే సమయానికి మొదలియార్ లోపల్నుంచి బయటకొచ్చి కారు ఎక్కుతున్నాడు. బోసు ఆ ఆవరణలోకి వేగంగా ప్రవేశించాడు. వెనుక నుంచి గూర్ఖా "ఆ... ఆగు" అని అరుస్తున్నాడు.

అందరూ బోసువైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

అందరికన్నా ముందు మొదలియార్ పక్కనున్న గన్‌మాన్ హోల్‌స్టర్‌లోంచి పిస్టల్ తీశాడు. అదే అతడు చేసిన తప్పు. 'ఇలాటి గన్‌మాన్‌నా తను పెట్టుకుంది' అని మొదలియార్ అనుకునే లోపులోనే బోసు మెరుపుకన్నా వేగంగా అతడి చేతిలో పిస్టల్ లాక్కోవటం – పక్కనుంచి మీదకొస్తున్న అనుచరుణ్ణి అదే పిస్టల్‌తో మొహం పచ్చడయ్యేలా కొట్టడం, మొదలియార్ కణతకి పిస్టల్ ఆన్చి కారులోకి తోయడం జరిగి పోయాయి.

"డ్రైవర్ని కూడా కారులో కూర్చుని, కారు తోలమను. మీ వాళ్లందర్నీ బయట ఆగమను. రెచ్చిపోతే నీ ప్రాణాలు పోతాయి" అన్నాడు హెచ్చరిస్తున్నట్టు.

మొదలియార్ డ్రైవర్ వైపు చూశాడు. డ్రైవర్ వచ్చి కారులో కూర్చున్నాడు.

కారు కదిలింది.

అందరూ చూస్తూండగా కాంపౌండ్ వాల్ గేటులోంచి బయటకువచ్చి – రోడ్డు మీదకు ప్రవేశించింది.

అదే సమయానికి పోలీస్‌స్టేషన్‌లో రాధాకృష్ణమాచారి టేబిల్ మీద ఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తి 'హల్లో' అన్నాడు.

ఆచారి అదిరిపడి "ఎవరూ" అన్నాడు. దానికి అవతల్నుంచి "ఇప్పుడే నా పి.ఏ. వచ్చి చెబుతున్నాడు. ఆ ధనరాజ్ మొదలియార్ మీద ఎవరో కంప్లెయింట్ ఇచ్చారటగా, ఏమిటా కేసు వివరాలు?" అన్నాడు.

తనతో మాట్లాడుతున్నది సాక్షాత్తూ చీఫ్ మినిష్టర్ అని తెలియగానే ఇన్‌స్పెక్టర్ అటెన్షన్‌లో నిలబడ్డాడు. వళ్లంతా చెమట్లు పట్టాయి. జరిగినదంతా చెప్పాడు.

అట్నుంచి వింటూన్న చీఫ్ మినిష్టర్ పెదవులమీద చిరునవ్వు వెలిగింది. ప్రత్యర్థిని తిరుగులేని దెబ్బ కొట్టడానికి అద్భుతమయిన అవకాశం దొరికినందుకు పొంగిపోయాడు. ఏం చెయ్యాలో చెప్పటం ప్రారంభించాడు.

* * *

ముఖ్యమంత్రి నుంచి ఫోన్ రాగానే ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణమాచారి రంగంలోకి దిగాడు. 'లక్ష్మీ శారద' అనే వివాహిత స్త్రీని దౌర్జన్యంగా

ఎత్తుకుపోయినందుకు గాను, బోసు ఇంట్లో అక్రమంగా ప్రవేశించినందుకు గాను ధనరాజ్ మొదలియార్ మీద ఎఫ్.ఐ.ఆర్. వ్రాయబడింది.

అయినా ఇన్‌స్పెక్టర్‌కి భయంగానే వుంది. ఈ కేసు ఇంత తేలిగ్గా వదిలిపోదు. ధనరాజ్ మొదలియార్‌ని అరెస్ట్ చేయటం అంటే సామాన్యం కాదు. కేసులో వీక్ పాయింట్ కూడా వుంది. లక్ష్మీ శారద బోసు కుటుంబానికి ఏమీ కాదు. భర్తని 'వదిలేసి' వచ్చి ఈ ఇంటిలో చేరింది. ఆ భర్తే తన భార్యని తీసుకురమ్మని తనను పంపాడని మొదలియార్ ఎదురుతిరిగితే చాలా కష్టం. మొదలియార్‌ని అరెస్ట్ చేయటం అయినా జరిగితే బోసు చెల్లెళ్ళ సాక్ష్యంతో చేయాలి. ఈ ఆడవాళ్ళను డిఫెన్సు లాయర్ రెండు నిముషాల్లో కన్‌ఫ్యూజ్ చేస్తాడు.

తొందరపడి అరెస్ట్ చేస్తే ఆ తరువాత కేసు లేకపోతే – తను ఏ చింతలపల్లి అడవులకో ట్రాన్స్‌ఫర్ కాబడడం ఖాయం! అప్పుడు ఈ ముఖ్యమంత్రి తనకే విధంగానూ సాయం చేయడు. అంతవరకూ ఎందుకు? ఇంకో రెండు మూడు నెలల్లో అసమ్మతి వర్గం నెగ్గి, ముఖ్యమంత్రి పదవి దిగిపోయినా – తనకి కుక్కపాట్లు తప్పవు! అసమ్మతి వర్గం అంటే హోంమినిష్టర్. మరో రకంగా చెప్పాలంటే మళ్ళీ మొదలియారే!

మొదలియార్‌ని ఏ అంశాలమీద పకడ్బందీగా అరెస్ట్ చేయాలి? అని ఆలోచిస్తుండగా స్టేషన్ ఏరియాలోకి ఒక కారు వేగంగా వచ్చి ఆగటం కనబడింది.

వెనుక డోర్ తెరుచుకోవటం అందులోంచి ధనరాజ్ మొదలియార్ వెనుకనుంచి ఎవరో తోసినట్టుగా బయటకు తూలటం, ఆ వెనుక బోసుబాబు దిగటం క్షణాల్లో జరిగిపోయినయ్!

దాదాపు మెడపట్టుకుని తోసుకొస్తున్నట్టు అతడిని బోసు లోపలకి తీసుకొచ్చాడు.

ఇన్‌స్పెక్టర్ తన కళ్లని తానే నమ్మలేక ఒక అపురూప దృశ్యం చూస్తున్నవాడిలా నిశ్చేష్టుడై వుండిపోయాడు. ఇంతవరకూ తామెవ్వరూ చేయలేని పనిని ఒక చిన్న కుర్రాడు చేయడం అతడికి ముచ్చటేసింది. లోపల్నుంచి ఉత్సాహం తన్నుకొచ్చింది. ఈ దేశం ఇంకా పూర్తిగా నిర్వీర్యమైపోలేదన్న నమ్మకం కలిగింది.

ఈ లోపులో బోసు అన్నాడు."ఇన్‌స్పెక్టర్ గారూ! సాక్ష్యాలేవీ లేకుండా మీరు వీడిని అరెస్ట్ చేయలేమన్నారు. ఇదిగో నేనే వెళ్లి తీసుకొచ్చాను. కార్లో నాలుగు బాదితే అంతా వొప్పుకున్నాడు. అరెస్ట్ చేయండి" అన్నాడు ఆవేశాన్ని అణచుకుంటూ.

ఇన్‌స్పెక్టర్ – ధనరాజ్ మొదలియార్ వైపు చూశాడు. అతడు కోపాన్ని అతి కష్టంమీద కంట్రోల్ చేసుకుంటున్నట్టు కనిపించాడు. అతడి మొహం ఏ క్షణమైనా బ్రద్దలయ్యే అగ్నిపర్వతంలా వుంది. గంభీరమైన స్వరంతో –"నన్ను ఏ ఛార్జిమీద అరెస్ట్ చేస్తున్నావు?" అని అడిగాడు.

ఒకప్పుడు చూపించిన మర్యాద ఇప్పుడు అతని కంఠంలో లేదు.

"లక్ష్మీశారద అనే యువతిని ఈ బోసుబాబు యింటినుంచి మీరు కిడ్నాప్ చేశారని కంప్లెయింట్ ఇచ్చాడు. అతని యింట్లోని వారు దాన్ని స్వయంగా చూశారు కూడా" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేనెవరో తెలుసుకదా. ధనరాజ్ మొదలియార్..."

ఇన్‌స్పెక్టర్ తటాపటాయించాడు.

"నన్ను అరెస్టు చేస్తే పరిణామాలు నీకు తెలుసుగా?"

ఇన్‌స్పెక్టర్ మాట్లాడలేదు.

"ఒకసారి నేను ఫోన్‌లో మాట్లాడతాను" అంటూ ఫోన్ దగ్గరికి లాక్కుని "నేను మా యింటిముందు కాంపౌండ్‌లో మా వాళ్ళతో మాట్లాడుతూ వుంటే వీడొచ్చి బలవంతంగా నన్ను కార్లో యెక్కించాడు. ముందు వీడిని అరెస్ట్ చెయ్యి. తరువాత సంగతి నేను చూసుకుంటాను" అంటూ డయల్ చేశాడు. అట్నుంచి ఎంగేజ్ శబ్దం వచ్చింది. "...ఈ హోమ్ మినిష్టర్ గాడొకడు. ఎప్పుడూ ఎవడో ఒకడితో మాట్లాడుతూనే వుంటాడు. పనీ పాటా లేదు" అంటూ ఫోన్ పెట్టేశాడు.

అదే టైమ్‌కి బయట నాలుగు కార్లు వచ్చి ఆగాయి. ఒక కార్లో హఫీజు, మల్లేశూ వచ్చారు. మరో కారులో హనుమంతు, ఇంకెవరో మినిష్టర్ వున్నారు. అంతా హడావిడి.

బోసు – మొదలియార్ యింటికొచ్చి – గన్‌మాన్‌ని తోసేసి, బలవంతంగా మొదలియార్‌ని కారెక్కించుకుని వెళ్ళిపోయాడన్న వార్త సంచలనం సృష్టించింది. క్షణంలో అది చీకటి ప్రపంచమంతా పాకిపోయింది.

మొదట్లో అందరూ.. ఇదెవరో శత్రువర్గం వాళ్ళు చేసిన పని అనుకున్నారు. కానీ మొదలియార్ అంత బలమైన మనిషికి శత్రువర్గం అంటూ ఏదీ లేదని వాళ్ళకి తెలుసు.

అంతలో కారు డ్రైవర్ ఫోన్ చేసి చెప్పాడు. బోసు మొదలియార్‌ని పోలీస్ స్టేషన్‌కి తీసుకొచ్చాడనీ, ఇద్దరూ లోపల వున్నారని కబురందజేశాడు. దాంతో మొత్తం అతని వర్గమంతా హుటాహుటిన పోలీస్ స్టేషన్ కొచ్చింది. బయట కార్లు ఆగిన శబ్దం వినగానే మొదలియార్ మొహంలో నవ్వు కదలాడింది. "ఇంకా చూస్తావేం ఇన్‌స్పెక్టర్, ఈ లం...కొడుకుని లోపలికి తొయ్యి" అన్నాడు ఆలస్యం దేనికన్నట్టు.

అప్పుడు కొట్టాడు బోసు అతడిని. అప్పటివరకూ బోసు ఒక ప్రేక్షకుడిలా, జరుగుతున్న తతంగాన్నంతా చూస్తున్నాడు. ఈ చివరి మాటలకి ఇక తను కల్పించుకోవలసిన సమయం ఆసన్నమయినట్టు కొట్టాడు. అతడు ఎంత బలంగా కొట్టాడంటే – మొదలియార్ ఆ దెబ్బకి టేబిల్ మీద పడి ఫోన్‌తో సహా క్రిందకి జారాడు.

పక్కన ఇన్‌స్పెక్టర్ వున్నాడనీ, అది పోలీస్ స్టేషన్ అని కూడా బోసు పట్టించుకోలేదు. "ఏరా ? కార్లో యిచ్చింది సరిపోలేదా? అప్పుడు ఒప్పుకుని, ఇక్కడికొచ్చి, మళ్ళీ ప్లేటు ఫిరాయిస్తావా?" అంటూ కాల్తో ఇంకోసారి బలంగా కొట్టాడు.

ప్రధానమంత్రితో దగ్గిర సంబంధాలున్న మొదలియార్ అలా నేలమీద దొర్లుతూ తన్నులు తినటం కలలో కూడా ఊహించలేని పరిస్థితి. అయినా

రాధకృష్ణమాచారి అతడిని చూడడంలేదు; బోసుని చూస్తున్నాడు. ఒకప్పుడు తన ముందు కుర్చీలో కూర్చుని దీనంగా, 'మా ఇంట్లో అమ్మాయిని ఎవరో ఎత్తుకెళ్లారు సార్' అని వాపోయిన యువకుడేనా ఇతను? అని ఆశ్చర్యంగా వుందా ఇన్‌స్పెక్టర్‌కి. బోసులో ఈ ట్రాన్స్‌ఫార్మేషన్ స్పష్టంగా తెలుస్తూంది.

ఈ లోపులో మొదలియార్ మోచేతులమీద నెమ్మదిగా లేచాడు. ఇన్‌స్పెక్టర్ వైపు నిప్పులు కక్కేలా చూశాడు. "నీ ముందే వీడు నన్నిలా కొడుతూంటే సినిమా చూస్తున్నావా? బెదిరించి నేరం ఒప్పించటానికి వీడు పోలీసు డిపార్టుమెంట్ అనుకుంటున్నట్టున్నాడు...." అని బోసువైపు తిరిగి, "ఇంతకు ఇంతా బదులు తీర్చుకుంటాను. మర్చిపోకు" అన్నాడు.

"ఏమిటి నువ్వు తీర్చుకునేది" అన్నాడు రాధాకృష్ణమాచారి వెనుకనుంచి. – ఈ మాట ఇన్‌స్పెక్టర్ నుంచి ఊహించని మొదలియార్ ఆశ్చర్యంగా వెనుదిరిగాడు. లాఠీ తీసుకుని ఫటేల్మని చేతిమీద వాతపడేలా బలంగా కొట్టాడు ఆచారి.

బోసు అమితమైన ఆశ్చర్యంతో చూశాడు. ఆచారి ఎవర్నీ పట్టించుకోలేదు. అణిచిపెట్టి ఉంచబడిన నీటిజల భూమిని ఛేదించుకుని వచ్చినట్లు అతడిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. మొదలియార్ లాంటి వాళ్లు నానా అక్రమాలు చేస్తూంటే ఇన్‌స్పెక్టర్లు రామకోట్లు రాసుకుంటూ, కుక్కలకి ట్రీట్‌మెంట్లు ఇప్పించుకుంటూ వుండడం అతడిలో అంతర్గతంగా ఎప్పటినుంచో బహుశా అసంతృప్తిని కలిగిస్తూ వుండి వుంటుంది.

దానికి కారణం ఒక రకంగా బోసే.

ఒక ఆడకూతుర్ని ఈ దుర్మార్గులు కారేసుకొచ్చి ఎత్తుకుపోతే తను వాళ్ళను అరెస్టు చేయటానికి, వాళ్ళ అంతస్థు చూసి భయపడ్డాడు. కానీ తన కళ్లముందు ఓ కుర్రవాడు వాళ్ళ స్థావరంలోకి వెళ్ళి అతడిని పట్టి తీసుకొచ్చాడు. దార్లోనే నాలుగు కొట్టి, పిస్తోలుతో భయపెట్టి నేరం వొప్పించాడు.

ఈ మాత్రం తను చేయలేకపోయాడు. ఇంకెందుకీ ఉద్యోగం? అనుకున్నాడు. ఎప్పటినుంచో వున్న ఉక్రోషం ఆ విధంగా బయటపడింది. విజృంభించాడు.

ముఖ్యమంత్రి ఫోన్ చేయటం వలన వచ్చిన ధైర్యం కాదిది. బోసుని చూడడం వలన వచ్చిన ఆత్మ విమర్శ.

"మీరు వెళ్ళండి బోసుగారూ.... మీ శారదని వీడెక్కడ దాచాడో రక్తం కక్కించయినా చెప్పిస్తాను" అన్నాడు లాఠీ చేతుల్లోకి తీసుకుంటూ.

అదే సమయానికి మల్లేశు, హనుమంతు, హాఫీజు లోపలికి ప్రవేశిస్తున్నారు.

"వీళ్ళని కూడా లోపలెయ్యండి..." అని పోలీసులకి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు రాధాకృష్ణమాచారి.

*       *       *

ధనరాజ్ మొదలియార్ అరెస్టయ్యాడన్న వార్త ముఖ్యమంత్రి పని గట్టుకుని, పేపర్లలో ప్రముఖంగా ప్రకటింపజేశాడు.

అసమ్మతి వర్గానికి ఇది పెద్ద దెబ్బ.

హోమ్ మినిష్టర్ చాలా విసుగ్గా వున్నాడు. "పులిమీద పుట్రలా ఇదేమిటయ్యా" అన్నాడు. సింహాచలం మాట్లాడలేదు.

"తొందరలో ముఖ్యమంత్రిని మార్చెయ్యవచ్చు అనుకుంటూంటే, మనవాడు అరెస్టు అయ్యాడేమిటి? ఇప్పుడు ప్రధానమంత్రికి మన ముఖ్యమంత్రి మీద ఫిర్యాదులు ఎవరు చెపుతారు? పోలీసు కేసులున్న వాడితో ప్రధానమంత్రి మాట్లాడితే బాగోదు కదా".

సింహాచలం నెమ్మదిగా అన్నాడు. – "ఆ శారద కేసుని కావాలంటే వాళ్ళు విత్ డ్రా చేసుకునేలా చేయవచ్చు సార్".

హోమ్ మినిష్టర్ పర్వతాల నాయుడు ఆశగా, "ఎలా?" అని అడిగాడు.

"బోసుబాబు అన్నయ్య రామ్మూర్తి నాకు కాబోయే అల్లుడు".

హోమ్ మినిష్టర్ అదిరిపడ్డాడు. మొహంలో ఒక్కసారిగా కళ వచ్చింది.

"మరింతసేపూ చెప్పలేదేమిటయ్యా" అన్నాడు కుర్చీలోంచి లేచి నిలబడుతూ.

సింహాచలం మాట్లాడలేదు.

పర్వతాల నాయుడికి అతని మనస్సు అర్థమైంది. దగ్గరకొచ్చి భుజంమీద చెయ్యివేశాడు. "ఇదుగో చూడు సింహాచలం, ఈ కేసు కోర్టు వరకూ వెళ్లకుండా గానీ నువ్వు చేయగలిగితే నీకు ప్రమోషనిప్పిచ్చేస్తాను. ఎప్పట్నుంచో అడుగుతున్నావు కదా. అదే – మీ మామగారి వూరు ట్రాన్స్ఫర్ – ఆ ట్రాన్స్ఫర్ కూడా వేయించేస్తాను! మొదలియార్ కేసు కోర్టు కెళ్లకుండా నీ అల్లుడిని ఇన్ఫ్లుయెన్స్ చేసెయ్యి..." అన్నాడు.

సింహాచలం మొహం విప్పారింది. "థాంక్స్ సర్" అన్నాడు. హోమ్ మినిష్టర్‌కి ఎంత ఇన్‌ఫ్లుయెన్సు వుంటుందో అతడికి తెలుసు. తన కూతురికి రామ్మూర్తిమీద ఎంత ఇన్‌ఫ్లుయెన్సుందో కూడా అతడికి తెలుసు.

* * *

బోసు ఆ సాయంత్రం పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు.

నిజానికి అతను అప్పటివరకూ ఆగటమే కష్టమైంది. లక్ష్మీ శారద ఎక్కడుందో తెలుసుకునేవరకూ అతడి మనసు మనసులో నిలవదు.

అతడు వెళ్ళేసరికి రాధాకృష్ణమాచారి ఒక్కడే వున్నాడు స్టేషన్‌లో. ఒక సెంట్రీ, ఒకరిద్దరు పోలీసులు తప్ప ఎవ్వరూ లేరు.

"రా, కూర్చో" అన్నాడు బోసుని చూస్తూ.

"ఏమైంది సార్. శారద సంగతి తెలిసిందా?" ఆశ్చర్యంగా అడిగాడు బోసు.

"లేదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"లేదా?" ఒక్క సారిగా జావకారిపోతూ అన్నాడు.

"ఆ సాయంత్రమే ఆవిడని వాళ్ళు వదిలేశారట" అన్నాడు ఆచారి. "...వాళ్లు చెప్పేదానిలో నిజం వుందనిపిస్తూంది. మొదలియార్ లాంటివాడు కిడ్నాప్‌లు చేసి తన దగ్గర వుంచుకోడు. పగ తీర్చుకున్నాక వదిలేస్తాడు. తనెంత పవర్‌ఫుల్లో చెప్పటానికి మీ ఇంటికొచ్చి ఆవిడని తీసుకెళ్ళాడంతే..."

బోసుని నిస్సత్తువ ఆవరించింది. అతడికి లక్ష్మీ శారద కన్నా తండ్రే ఎక్కువ గుర్తొచ్చాడు.

ఇన్‌స్పెక్టర్ చెప్పేది నిజమే అయ్యుండవచ్చు. లక్ష్మీ శారదని వీళ్లు వదిలి పెట్టి వుండవచ్చు, లేదా ఏ రెడ్‌లైట్ ఏరియాకో పంపించి వుండవచ్చు. అది కాకపోతే మ...ర్డ..రు చేసి వుండవచ్చు. అతడి కళ్ళు అప్రయత్నంగా తడి అయ్యాయి. మనసులోనే ఆమెకు క్షమాపణలు చెప్పుకున్నాడు.

వాళ్ళు వదిలేసిన తరువాత ఆమె తమ దగ్గరికి తిరిగి ఎందుకు రాలేదు?

మొహం చెల్లలేదా?

వస్తే మళ్ళీ అపాయంలో ఇరుక్కుంటానని భయపడిందా?

అతడు తన ఆలోచన్ల నుంచి తెప్పరిల్లి "మొదలియార్ ఏమయ్యాడు?" అని అడిగాడు.

"నిన్న సాయంత్రమే బెయిల్ మీద రిలీజ్ అయ్యాడు".

బోసు గాఢంగా నిశ్వసించాడు.

అది వూహించిందే, సాయంత్రం వరకూ అతను లాకప్‌లో ఉండడమే గొప్ప.

ఇన్‌స్పెక్టర్ అన్నాడు –"వాళ్ళ మీద కేసు ఫైల్ చేశాను. వాళ్ళని వదిలి పెట్టను".

బోసు మాట్లాడలేదు.

ఇన్‌స్పెక్టర్ ఆగి, నెమ్మదిగా అన్నాడు. "ఈ గూండాల్ని ఎదుర్కోవాలనీ, ఎముకలు విరగ్గొట్టి లోపల పడేయాలనీ మాకూ వుంటుంది బోసూ. సమాజానికి వీళ్లు చేస్తున్న ద్రోహం అంతా ఇంతా కాదు. అరాచకం సృష్టిస్తున్నారు. అన్నీ మాకు తెలుసు కానీ ఏం చెయ్యలేం. ఎక్కడ చూసినా పలుకుబడి! మీలాటి వాళ్ళకి

అందుకే మా మీద నమ్మకం పోతుంది. క్రితం సారి వచ్చినప్పుడు మీరన్న మాటలు నాకు గుర్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఈ ప్రభుత్వమే మా చేతులు కట్టేసింది. నెలరోజులపాటు నాకు అధికారం ఇమ్మనండి. ఈ ఏరియాలో ఒక్క గూండా లేకుండా చేస్తాను".

బోసు అర్థం చేసుకున్నట్టుగా తలూపాడు.

"ఆ మొదలియార్‌ని మాత్రం నేను వదిలిపెట్టను. కేసు చాలా పకడ్బందీగా తయారైంది. ప్రత్యక్ష సాక్షులు కూడా వున్నారు కాబట్టి వాడు తప్పించుకోలేడు. ముఖ్యమంత్రి కూడా ఈ విషయంలో పట్టుదలగా వున్నాడు. అందువల్ల మనమీద ఏ విధమైన 'వత్తిడులూ' రావని ఆశిస్తున్నాను. అయిదారు సంవత్సరాలు శిక్ష ఖాయం. ఒకటే విచారకరమైన విషయం. ఆ లక్ష్మీ శారద ఏమైందో తెలియటంలేదు. బహుశా ఈ కేసు సంగతి పేపర్లో చదివి, ఆమె ఎక్కడున్నా బయటికి వస్తుందని ఆశిద్దాం".

బోసు నిలబడి నమస్కరించాడు –"నాకు సంతోషంగా వుంది ఇన్‌స్పెక్టర్. మీరు న్యాయం వైపు నిలబడ్డారు. అదీ సంతోషం. మీరా మొదలియార్‌ని కొడుతూంటే చూశాను. అది చాలు. రామకోటే కాదు, అవసరం వస్తే రాముడిలా మారగలరని కూడా నిరూపించారు. నాకు మీ డిపార్ట్‌మెంట్ మీద వున్న అపనమ్మకం పోయింది. ఇక శారద విషయమంటారా? చూద్దాం. ఆమె ఎప్పుడు బయటకొస్తుందో" అని బయటకు నడవబోయాడు.

"బోసూ" పిల్చాడు ఇన్‌స్పెక్టరు.

బోసు ఆగాడు.

"తనని బలవంతంగా కారు ఎక్కించి తీసుకెళ్ళినందుకూ, కొట్టి నేరం వొప్పించినందుకూ మొదలియార్ మీమీద కేసు పెట్టవచ్చు. అతడి మాటల్లో అలాటిదేమీ ధ్వనించలేదు. అంటే మనసులో వేరే ఉద్దేశ్యం ఏదో ఉండవచ్చు. మీరు కొంచెం జాగ్రత్తగా వుండండి".

అప్పటివరకూ నిర్లిప్తంగా వున్న బోసు మొహం నవ్వుతో విచ్చుకుంది.

"ఏం చేస్తాడు ఇన్‌స్పెక్టర్? చంపుతాడు. అంతేగా! యుద్ధంలో ఎవరో ఒకరు చావక తప్పదుకదా?" అని అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయాడు ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణమాచారి. అతడి మనసులో అదోలాటి సంతృప్తి భావం కదలాడింది. ఒక చిన్న 'కాజ్' (కారణం) కోసం పోరాడుతున్న ఆ యువకుడిని చూస్తూంటే కలిగిన భావం అది. 'సమాజంలో కనీసం ఒకరిద్దరయినా ఇటువంటి వ్యక్తులుంటే ఎంత బావుణ్ణు' అనుకున్నాడు. కుర్చీ మెనక్కి వాలి చేతివేళ్ళు విరుచుకున్నాడు. టేబుల్ మీద – లాఠీ పక్కనే రామకోటి పుస్తకం కనబడింది. దాన్ని అడుగు డ్రాయర్‌లో పడేశాడు.

*　　　　*　　　　*

బోసు ఇంటికి వచ్చేసరికి అతని కోసమే రామ్మూర్తి ఎదురుచూస్తున్నాడు. నాందీ, ఉపోద్ఘాతమూ లేకుండా డైరెక్టుగా విషయం చెప్పాడు.

"సింహాచలంగారితో హోమ్ మినిష్టరుగారు కబురు చేశార్రా బోసూ".

"ఏమని?" మొహం చిట్లిస్తూ అడిగాడు బోసు.

"ఆ మొదలియార్ మీద కేసు విత్ డ్రా చేసుకుంటే వాళ్ళు నీ మీద కేసు పెట్టకుండా వదిలేస్తారుట" బోసు నవ్వేడు. "నా మీద కేసు పెడితే మూడునెలల కన్నా ఎక్కువ శిక్షపడదు, కానీ వాడికి ఆరు సంవత్సరాలు పడుతుంది".

రామ్మూర్తి గట్టిగా, "నీ కెంత శిక్షపడుతుందో – ఆయనకెంత శిక్షపడుతుందో నా కనవసరం. సింహాచలంగారు చెప్పారు – ఆ లక్ష్మీ శారద విషయం మనకేమీ తెలియదని రాతపూర్వకంగా రాసి ఇవ్వాలి. పోలీస్ స్టేషన్లో వాళ్ళే రిపోర్టు కాన్సిల్ చేయించుకొంటారు" అన్నాడు.

బోసు కామ్‌గా, "ఇంతకుముందు నీకోసారి చెప్పాను. ఇదే సంఘటన అక్కకో, చెల్లికో జరిగితే వూరుకోం గదా" అన్నాడు.

"మన అక్కలూ, చెల్లెళ్ళూ అర్థరాత్రిళ్ళు మొగుళ్లని వదిలేసి బజార్ల వెంట తిరగరని నేనూ అన్నట్టు గుర్తు..." వ్యంగ్యంగా అన్నాడు రామ్మూర్తి.

"ఇప్పుడు, నన్నేం చేయమంటావ్?"

"ఆ శారదని, వాళ్ళాయనవచ్చి తీసుకుపోయాడని చెప్దాం".

"అదే విషయం వాళ్ళాయన్ని కోర్టుకొచ్చి చెప్పమను".

"ఆ తలతిక్క సమాధానాలే వద్దన్నాను. వాళ్ళయన పంపగా మొదలియార్ వచ్చి మనింటి దగ్గర్నించి లక్ష్మీశారదని తీసుకెళ్ళాడని చెపితే ఇక ఈ కేసు వుండదు".

"సారీ అన్నయ్యా! నేనలా చెప్పను".

"చెప్పాల్సింది నువ్వుకాదు, మేము ముగ్గురం" అంటూ అహల్యనీ, గోమతినీ చూపించాడు రామ్మూర్తి. "... ఆ టైమ్‌కి నువ్వసలు ఇంట్లోనే లేవు. మేము ముగ్గురం వున్నాం".

బోసు రామ్మూర్తివైపు సూటిగా చూశాడు. కాబోయే మామగారు తన పోలీసు తెలివి ఉపయోగించి అన్నయ్యకి బాగానే ట్రెయినింగ్ ఇచ్చినట్టు వుందనుకున్నాడు. తన ఆవేశాన్ని అణుచుకుంటూ, "మీ ముగ్గురూ ఒకటి – నేను ఒకటి కాదన్నయ్యా! మనం నలుగురం ఒకటి. నాన్న మనకి చిన్నప్పటి నుంచీ భగవద్గీతలో చెప్పింది ఆచరించటం మన కర్తవ్యం" అన్నాడు.

"మరీ నాటకాల్లో డైలాగులు మాట్లాడ్డం గొప్ప అనుకుంటున్నావా?" అన్నాడు రామ్మూర్తి హేళనగా.

నాటకాల్లో డైలాగులుంటాయి. జీవితాల్లో నిజాలుంటాయి. డైలాగుకి ఎదురు డైలాగు చెప్పి చప్పట్లు కొట్టించుకోవచ్చు. కానీ నిజాన్ని దేనితోనూ అధిగమించలేం. ఎదురుగా వున్నది వాస్తవం! దాన్ని నిరూపించాలన్నదే సమస్య.

రామ్మూర్తి అన్నాడు. "ఒరేయ్ బోసూ! నువ్వు ఇలా మాట్లాడబోతావనీ, మొండిగా జవాబులు చెపుతావనీ నాకు సింహాచలంగారు ముందే చెప్పారు. నువ్వేదో మీ అక్కాచెల్లెళ్ల గురించి చెప్పావుకదా. ఇప్పుడు నేనూ నా సంగతి చెపుతున్నాను విను. నువ్వుగానీ ఈ మాట వినకపోతే నేను విడిపోతాను. ఈ ఇల్లు మొత్తం నువ్వే వుంచుకుని సగం ధర నాకిస్తావో, నాకు యిల్లొదిలేసి వీళ్ళిద్దర్నీ తీసుకుని వెళ్లిపోతావో నీ ఇష్టం".

తలమీద బాంబు పడినట్టు కదిలిపోయాడు బోసు. ఏమీ మాట్లాడడానికి నోటమాట రాలేదు. అతికష్టంమీద "...అన్నయ్యా" అన్నాడు.

రామ్మూర్తి అతని ఫీలింగ్స్ పట్టించుకోలేదు. "నాన్న తాలూకు గ్రాట్యుటీ – పెద్ద కొడుకుని కాబట్టి నాకే వస్తుంది. నేను నిన్ను అన్యాయం చెయ్యను. అందులో సగం నీకు ఇస్తాను. ఈ యింటి సంగతి చెప్పు..." అన్నాడు.

శ్రోతలు ముగ్గురూ నిశ్చేష్టులయ్యారు.

చాలాసేపు నిశ్శబ్దం తరువాత బోసు ఎలాగో నోరు పెకిలించుకొని ఒక నిర్ణయానికి వచ్చినట్టు అన్నాడు. "సరే అన్నయా! నీ ఇష్టం వచ్చినట్లే కానీ, నేనెలాగూ యిల్లు వుంచుకుని, ధరకట్టి అందులో సగం నీకు ఇవ్వలేను. మేమే వెళ్లిపోతాం. అసలు నీ దగ్గిర డబ్బు తీసుకోవటం కూడా నాకు ఇష్టంలేదు. కానీ అక్కయ్యని అత్తారింటికి పంపటానికీ, చెల్లాయికి పెళ్ళి చేయటానికీ డబ్బు కావాలికదా. నా కోసం వాళ్ళ భవిష్యత్తు ఎలా బలిపెట్టను?" అని ఆగి, చివరగా అన్నాడు –"...నాన్న బోధించిన మానవధర్మం నీకు అర్థంకాకపోయినా, మనుష్యులేర్పరచుకున్న ధర్మం బాగా వంటబట్టించుకున్నట్లున్నావు. అందుకే పెద్ద కొడుకుగా బాధ్యతలు తీసుకోకపోయినా, వాటా కరెక్టుగా తీసుకుంటున్నావు".

డబ్బు విషయం ఒత్తిడిచేసి బోసుని వంచుదామనుకున్నాడు. అది కుదరక పోయేసరికి "రేపే ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోండి" అని అరిచాడు ఆవేశంగా.

"మంచిదన్నయ్యా!"

రామ్మూర్తి మరింత ఇరిటేట్ అయి "ఆ లక్ష్మీ శారద వెనుక ఏముందని దానికోసం ఇంత వాదిస్తున్నావ్?" అన్నాడు.

బోసు క్లుప్తంగా అన్నాడు –"లక్ష్మీశారద వెనుక ఓ అన్యాయం వుంది. నా వెనుక ఒక కర్తవ్యం వుంది".

## 6

**కోర్టులో** విషయం పూర్తిగా చెప్పేసి, 'నేనింతకన్నా ఏమీ చేయలేను' అన్న నేరస్థుడి తరఫు డిఫెన్స్ సాక్షిగా నిస్సహాయంగా వున్నాడు సింహాచలం.

ఈ కేసులోంచి నేరస్థుడిని ఎలా బయటపడెయ్యాలా అని ఆలోచిస్తూన్న జడ్జిలా వున్నాడు హోమ్ మినిష్టరు. "మీకివ్వాల్సిన లంచాలన్నీ మీ కిచ్చాను. నన్నెలా బయటపడేసుకుంటారో మీ ఇష్టం" అన్న ముద్దాయిలా ధీమాగా, నిశ్చింతగా వున్నాడు మొదలియార్.

సింహాచలమూ, హోమ్ మినిష్టరే మాట్లాడుకుంటున్నారు.

తన అల్లుడిని సంబోధిస్తూ ఆ 'దొంగ నా కొడుకు' అన్నాడు సింహాచలం. "...ఆ దొంగ నా కొడుకు, తన ఇంట్లో వాళ్ళ విషయం తను చూసుకుంటానన్నాడు. ఇప్పుడొచ్చి తమ్ముడూ, చెల్లెళ్ళూ తన మాట వినటం లేదని అంటున్నాడు".

ఎవరూ మాట్లాడలేదు.

ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

రెండు నిముషాల సుదీర్ఘమైన నిశ్శబ్దం. తరువాత మొదలియార్ తలెత్తి, "నాకో ఆలోచన వచ్చింది" అన్నాడు.

*    *    *

ఆ రోజు శుక్రవారం.

అహల్య ఇల్లంతా కడిగి, ఆ పూజ గదిలో విగ్రహాలు సర్దుతూ వుండగా, బయట ఎవరో వచ్చిన అలికిడి వినిపించి, ఆమె బయటకు వచ్చింది. వస్తున్న వ్యక్తిని చూసి ఆమె సంభ్రమాశ్చర్యాలతో నిలబడి పోయింది. ఆమె భర్త, మామగారు.

ఆమె తత్తరపాటుతో కుర్చీలు జరిపి, "కూర్చోండి" అని లోపలికి పరుగెత్తింది. ఇంతకాలం తరువాత వాళ్ళు ఎందుకు వచ్చారో అర్థం కాలేదు.

వంటింట్లో భోజనం చేస్తున్న బోసు కూడా తొందరగా భోజనం ముగించి, గబగబా బయటికి వచ్చాడు. తండ్రీ కొడుకులు అతని కోసమే ఎదురు చూస్తున్నట్టు సంభాషణ మొదలు పెట్టారు.

"మొన్న మధ్యవర్తిని పంపితే మీరు 'డేట్' ఇచ్చారు. అది అయిపోయింది. అందుకే ఏ విషయమూ తేల్చుకుందామని వచ్చాం".

"అంతా అయిపోయిందండీ" నమ్రతగా అన్నాడు బోసుబాబు. "నాన్నగారి పి.ఎఫ్. రేపు వస్తుంది. అన్నయ్యకూడా ఈ ఇల్లంతా పూర్తిగా తీసుకుని మా వాటా ఇస్తానన్నాడు. ఆ డబ్బు తన మామగారు సర్దుతారనుకుంటాను. ఇక సమస్యేమీ లేదు" అన్నాడు. వాళ్లని కూడా తమ ఇంటి సభ్యులుగానే భావించి, తాము విడిపోవటం గురించి చెప్పాడు.

అహల్య మామగారు నొచ్చుకున్నారు. "ఇదేమిటయ్యా – పెద్దవాడై వుండి, బాధ్యత అంతా నీ మీద తోసేసి అతను తన వాటా తీసుకుని వెళ్లిపోవటం ఏమిటి?" అన్నాడు.

బోసు జీవంలేని నవ్వొకటి నవ్వి వూరుకున్నాడు.

"నిన్ను చూస్తే ముచ్చటేస్తూంది బోసూ! మనిషంటే నీలా వుండాలి. నీలాటి వాడు వున్నందుకు నీ అక్కా చెల్లెళ్లిద్దరూ గర్వపడాలి".

బోసు మాట మార్చటానికి "రెండ్రోజుల్లో డబ్బుతో సహా వస్తానండీ" అన్నాడు.

"డబ్బుదేముంది. లేవయ్యా! రెండ్రోజుల్లో కాకపోతే రెండు నెలల తర్వాత ఇవ్వు. అహల్యని మాత్రం మాతో పంపించు. ఇవాళే, ఇప్పుడే..."

వింటూన్న బోసుకీ, లోపల ద్వారబంధానికి నిలబడిన అహల్యకీ అది కలో నిజమో అర్థంకాలేదు. తను విన్నది వాస్తవమేనా అన్న అనుమానం కలిగింది. బోసుకి. కానీ అంతలోనే బాంబు పేల్చాడు అహల్య మామగారు. "ఆ మొదలియార్ కేసులో నా కోడలు సాక్ష్యం చెప్పదు".

కొన్ని పాపాలు పాపాల్లా వుండవు. కొన్ని తప్పులు తప్పుల్లా కనపడవు. నిద్రపోతున్న పాములల్లే – పురికొస తాడుల్లా పడివుంటాయి. కాటేసి నిశ్శబ్దంగా తప్పుకుంటాయి. నిజం ఉల్లిపాయ లాటిది. దాన్ని విప్పుకుంటూ పోతే ఏమీ మిగలదు కన్నీళ్ళు తప్ప.

లోపల చప్పుడవటంతో అటువైపు చూశాడు బోసు. అహల్య గుమ్మం దగ్గిర్నుంచి కదిలి వేగంగా పెరట్లోకి వెళ్ళిపోతోంది.

ఎలాగో నోరు పెగల్చుకొని, "మీ డబ్బు మీ కిస్తామన్నాం కదండీ" అన్నాడు బోసు. అతనికి అంతకన్నా ఏం మాట్లాడాలో తోచలేదు. చిన్నప్పుడు అన్నం తిననని, పెద్దయ్యాక అన్నం పెట్టననీ తల్లిని ఏడిపించే కొడుకుల్లాగా వాళ్ళు కనపడ్డారు.

"నిన్ను డబ్బు ఎవరడిగారయ్యా? మా కోడల్ని మేము తీసుకుపోతా మంటున్నాం. అంతే" అన్నాడు ఆయన.

"మా కోడలు కోర్టులచుట్టూ తిరగటం. పోలీసుస్టేషన్‌లకి వెళ్ళటం మా కిష్టం లేదు. ఏరా అంతేనా?" కొడుకును చూస్తూ అడిగాడు.

"అవును నాన్నగారూ" నమ్రతగా చెప్పాడు అహల్య మొగుడు.

బోసు కన్నార్పకుండ వాళ్ళవైపు చూశాడు. ఇదంతా సింహాచలం చేసిందనుకున్నాడు. కోడలు కోర్టుకి వెళ్ళకూడదన్నది కేవలం మిషమాత్రమే. సింహాచలం పంపగా వాళ్ళు వచ్చారనుకున్నాడు.

ఇక్కడే లోకానుభవం కావల్సింది. అతడికి మొదలియార్ లాంటి వాళ్ల సంగతి అంతగా తెలియదు. తక్కువ అంచనా వేశాడు వాళ్ళ గురించి. బోసు కుటుంబ సభ్యుల పుట్టిన రోజులతోసహా వాళ్ళు సేకరించారు. కోడలితో సాక్ష్యం చెప్పించకుండా ఆపుచేస్తే పాతికవేలు ఇస్తామని మొదలియార్ ద్వారా కబురు వెళ్ళింది. పరిణామమే ఈ చర్య... అహల్య జీవితాన్ని నిర్దేశించే నిర్ణయం..

'ఇప్పుడే వస్తాన'ని చెప్పి బోసు పెరట్లో అహల్య దగ్గరికి వెళ్ళాడు. "చూడు అక్కయ్యా! ఇది నువ్వు నిర్ణయించుకోవలసిన విషయం. నేను అనవసరంగా ఈ విషయంలో పట్టు పట్టి నీ వైవాహిక జీవితం పాడుచేశానన్న అపప్రధ వొద్దు. వాళ్ళకి ఏం చెప్పమంటావ్?"

ఆమె సమాధానం చెప్పలేదు. గోమతి కల్పించుకుని, "ఇందులో చెప్పటానికే ముందన్నయ్యా! మనం ఏనుకున్నామో అదే చెప్పు" అంది.

బోసుకి సంతోషమేసింది. బయటకొచ్చి ఆ విషయం చెప్పాడు. వాళ్ళ మొహాలు జేవురించాయి. "ఇదే మీ ఆఖరి నిర్ణయమా?" అన్నారు. బోసు తలూపాడు.

"ఇక జన్మలో నా కొడుకు ఈ ఇంటి ముఖం చూడడు. ఆ విషయం తెలుసా? కట్నం మిగులుతుందని సంబరపడుతున్నావేమో, దాని జీవితం కుక్కలు చింపిన విస్తరవుతుంది".

"నా అక్కయ్య జీవితం ఏమవుతుందో మీరు నాకు చెప్పనవసరం లేదు" తాపీగా అన్నాడు బోసు. ఇంట్లోవాళ్ళు తనని సపోర్టు చెయ్యటం అతనికి అమితమయిన నమ్మకాన్ని యిచ్చింది.

తన ఎదురుగా కూర్చుని వున్న ఈ బావగారనబడే మొగాడి (?) తో కాపురం చేయటం కంటే, ఒంటరిగా వుండటమే అహల్యకి ఎక్కువ సంతోషాన్నిస్తుందన్న నిర్ణయానికి ఎప్పుడో వచ్చాడు బోసు. వాళ్ళు ఆప్తుల్లా కాక మాంసాన్ని బేరంచేసే కసాయివాళ్ళలాగా కనపడ్డారు. అందుకే అన్నాడు. "మీ కోడలు కోర్టుకి వెళ్ళడం మీ కిష్టం లేదన్నారు. కానీ ఈ కేసు విషయంలో ఆమె కోర్టు అంటే ఏమిటో తెలుసుకుంటుంది. ఆ తరువాత రెండోసారి మళ్ళీ కోర్టుకి వస్తుంది. మీ విషయం ఏమిటో తేల్చుకోవటం కోసం".

వాళ్ళిద్దరూ విసురుగా కుర్చీల్లోంచి లేచారు. "చూద్దాం అయితే" అంటూ. "మంచిది" అన్నాడు బోసు చేతులు జోడిస్తూ.

"మరొక్కసారి ఆలోచించు" అన్నాడు మామగారు. పాతికవేలు కట్నం పోతాయన్న దుగ్ధతో.

"ఇందులో ఆలోచించటానికేమీ లేదండీ. మీ అబ్బాయి గురించి తెలియనప్పుడు, అతడు పాతికవేలు ఖరీదు చేస్తాడనుకున్నాం. ఇప్పుడు పాతిక పైసలు కూడా విలువ చెయ్యడని అర్థమైంది. డబ్బులు ఇవ్వకముందే బేరం పాడయినందుకు నాకు సంకోషంగా వుంది. లేకపోతే జీవితాంతం బాధపడేవాళ్ళం. మీరు వెళ్ళవచ్చు..."

....వాళ్ళు వెళ్ళిపోయారు.

బోసు కూడా బయటకు నడిచాడు. అతనికెందుకో ఇంటిలో వుండబుద్ధి కాలేదు. అట్నుంచి అటే సినిమాహాలుకి వెళ్ళి అర్ధరాత్రి ఇంటికొచ్చాడు. భోజనం చేసి పడుకున్నాడు. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు. రెండు దాటాక అలికిడి అయితే కళ్ళు విప్పాడు.

కాళ్ళ దగ్గర అహల్య కూర్చుని వున్నది.

అతడు చప్పున లేచి, "ఏమిటక్కయ్యా?" అన్నాడు.

ఆమె సమాధనం చెప్పలేదు. అతడు అనునయిస్తున్నట్టు "ఏమయింది?" అని మళ్ళీ అడిగాడు.

ఆమె చాలా సేపట్నుంచి, ఆ మాట ఎలా చెప్పాలా అనుకుంటున్నదానిలా "నేను ... మా అత్తారింటికి వెళ్ళిపోతాన్రా బోసూ" అంది.

గోడలు అలానే వున్నాయి. దేముడి విగ్రహమూ అలాగే వుంది. భూకంపం రాలేదు. అగ్నిపర్వతాలు బ్రద్ధలవ్వలేదు. బోసుకూడా అలాగే ఉన్నాడు. కంఠమే వణికింది. ఆ వణుకు కనిపించకుండా వుండటానికి శతవిధాలా ప్రయత్నం చేస్తూ, "దానికేముంది అక్కయ్యా, అలాగేలే" అన్నాడు.

ఆమె మొహం విప్పారిందా? ఏమో, చీకటి అతడిని రక్షించింది. ఆమె లేచి వెళ్లిపోయింది. చర్చించటానికేమీ లేదు. ఏమన్నా అంటే, "క్షమించరా తమ్ముడూ! నాకు నైతిక విలువల గురించి అంతగా తెలీదు. ఏదో పాతకాలం నాటి దాన్ని. నన్నిలా పోనీ " అంటుంది.

అతడు తనకితానే ఒంటరి సముద్రంలా కనిపించాడు.

అతడికి భయం వేసింది, ఉప్పెన గుర్తొచ్చినందుకు కాదు. ధర్మరాజు వెళుతుంటే పాండవులు ఒక్కొక్కరే పడిపోయినట్టు – తన వాళ్ళందరూ ఒక్కొక్కరే జారిపోతున్నారు.

తన గమ్యం మాత్రం తెలియటం లేదు.

... దూరంగా రెండు కొట్టింది.

*　　　*　　　*

అర్థరాత్రి దాటి మూడు అవుతుండగా తలుపుకొట్టి లోపలికొచ్చిన బోసుబాబుని చూసి ఆశ్చర్యపోయింది విశారద.

అతనంతా చెప్పాడు. చెప్పి అన్నాడు –"నా కెందుకో అక్కడ ఉండాలనిపించలేదు విశారదా! ఒంటరిగా అనిపించింది, నువ్వు గుర్తొచ్చావు. ఇబ్బంది పెడితే క్షమించు".

అంతా విని "గోమతిని తీసుకుని మీరిక్కడికి వచ్చెయ్యండి" క్లుప్తంగా అంది విశారద.

అతను ఆశ్చర్యంగా తలెత్తాడు.

"అవును బోసుబాబుగారూ! అక్కడ మీకేముంది. గోమతి తప్ప".

అతడి మనసు తేలికైంది. అయినా ఏదో సందిగ్ధం. తలవంచుకుని అన్నాడు. "ఇక్కడ జరుగుతున్న విషయాలన్నీ చూస్తే నా తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందో?"

"అకాశంలో ఉన్న ఆత్మల గురించి ఆలోచించటం మానేసి, క్షోభిస్తున్న మనుష్యుల గురించి ఆలోచించండి బోసూ! మీరొక మాటమీద నిలబడి పోరాడుతున్నారు. అదే మీ బలం".

అతడామెవైపు ఆశ్చర్యంతో చూశాడు. దీపం వెలుగు మొహం మీద ప్రతిబింబిస్తూ వుండగా ఆమె కొనసాగించింది. "...ఒక జ్ఞానం అంకురమై బయటకు రావాలంటే ముందు మనసు బీడు కావాలి. దాని మీద అనుభవం తొలకరి జల్లు కావాలి. ఆ తడికి భూమి బీటలు వారాలి, అప్పుడు జ్ఞానరేఖ విచ్చుకుంటుంది. మిమ్మల్ని చూస్తుంటే నాకు నా తల్లి గుర్తొస్తూంది. ఆమెకూడా యిలాగే తను నమ్మినదాని కోసం పోరాడింది. యుద్ధానంతరమే కదా జీవితం అంటే ఏమిటో అర్థమయ్యేది! యుద్ధమంటే శూన్యం చిగురించటమట. ఆ లక్ష్మీ శారద గారెవరో చాలా అదృష్టవంతురాలు. ఆమె కోసం ఒక వ్యక్తి ప్రపంచంలో పోరాడుతున్నాడు. జీవితం నెత్తిమీద అనుభవం కొట్టినప్పుడు కొందరు బాధతో విలవిలలాడుతూ శోకిస్తారు. మరికొందరు నిద్రలోంచి మేల్కొంటారు. మీరు మేల్కొనే వుండండి బోసుబాబు! విలపించవద్దు. మీ తండ్రిగారు బతికి వున్నా బహుశా ఈ మాటే చెప్పివుండే వాడేమో.."

అతడు ఆమెవైపు విస్మయంగా చూస్తూ వుండిపోయాడు."ఎవరీమె? విశారదేనా? రోజు రోజుకీ ఎలా ఎదిగిపోతున్నది? నిండా ఇరవై ఏళ్ళు కూడా

లేవు. నిరంతరం జ్ఞానతృష్ణతో, సాధనతో పెరిగిపోతుంది. ఒకప్పుడయితే "ఏమి యింత చిన్నపిల్ల యింత పెద్ద మాటలు మాట్లాడుతూంది" అనుకునేవాడు. కానీ భౌతికమైన వయసుకి – మానసికమైన వయసుకి తేడా తెలుస్తూంది. బహుశా తల్లి అంశ ఈమెలో వచ్చి చేరిందేమో, అనుభవం పాఠాలు నేర్పిందేమో"

అతడు అప్రయత్నంగా ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని, "నన్ను పెళ్ళి చేసుకుంటావా విశారదా" అని అడిగాడు.

*　　　*　　　*

సింహాచలం – పర్వతాల నాయుడి దగ్గరికి విసురుగా వచ్చాడు. అతడి మొహం ఆనందంగా వెలిగిపోతోంది. మొదలియార్ కూడా అక్కడే వున్నాడు.

"ఒక వికెట్టు పడిపోయింది సార్! మనం గెలిచాం. అహల్య అత్తారింటికి వెళ్ళిపోయింది" అని దాదాపు అరిచాడు.

పర్వతాల నాయుడు మొహం వికసించింది. "డబ్బుకి లొంగని వాళ్ళెవరయ్యా ఈ లోకంలో" అన్నాడు.

"ఇక ఆ గోమతి ఒకతుంది" అన్నాడు సింహాచలం. "...కానీ అది దేనికీ లొంగదు. అంతా అన్నయ్య పోలిక".

"అన్నయ్యంటే?... రామ్మూర్తా? బోసా?" జోకు వేశాడు పర్వతాల నాయుడు.

మొదలియార్ వీళ్ళ మాటలు వినటంలేదు. లేచి కిటికీ దగ్గరకి వెళ్ళి బైటకు చూస్తూ ఆలోచించసాగాడు.

గోమతి....

*　　　*　　　*

రాతకోతలు పూర్తయ్యాయి.

బోసుబాబు స్తబ్ధుగా నిలబడి వున్నాడు. ఆ ఆస్తి పంపకాల వ్యవహారమంతా సింహాచలమే దగ్గిరుండి చూశాడు. రాతకోతలంటే పెద్ద ఆస్తేమీకాదు. ఉన్నదొక యిల్లే. ఆ ఇల్లు పూర్తిగా రామ్మూర్తికి చెందేటట్టూ, తండ్రి ఉద్యోగం తాలూకు సొమ్ము బోసుకి చెందేట్టూ వ్రాసుకున్నారు.

"అమ్మ నగలు గోమతిని తీసుకోమందాంరా బోసూ – అన్నాడు రామ్మూర్తి బోసు నవ్వేడు. అందులో జీవం లేదు. నగలంటే – చంద్రహారమూ, ముత్యాలనెక్లెసూ కాదు. ఒంటిపేట గొలుసు, రెండు జతల గాజులు. దాంట్లో కూడా తనకి వాటా కావాలని పెద్దక్కయ్య పోటీకి రానందుకు సంతోషం వేసింది.

ఈ వ్యవహారం మొత్తం మీద అందరికన్నా ఎక్కువ ఆనందంగా వున్నది అహల్య.

వరదల్లో వందమంది చస్తే చచ్చారుగానీ, కోర్టులో రికార్డులు కొట్టుకుపోయి క్రిమినల్ కేసు కొట్టేశారన్నంత సంతోషంగా వుంది.

కట్నం డబ్బులే ఇచ్చారో, కొట్టి చంపుతామని బెదిరించారో గానీ, ఆ ధనరాజ్ మొదలియార్ భయానికి, ఇప్పుడా అహల్య అత్తమామలు ఆమెని బాగానే చూసుకుంటున్నారు. సాక్ష్యం చెప్పకుండా వుండిపోయినందుకు ఆమెకు దొరికిన బహుమతి అది.

ఈ సమాజ స్వరూపం తన యింట్లోనే రకరకాల వ్యక్తుల రూపంలో ప్రతిబింబిస్తున్నట్టు అనిపించింది బోసుబాబుకి. ఒక రౌడీ లక్ష్మీ శారదని తన ప్రాపకంలో వుండమని కోరాడు. నైతిక విలువల దృష్ట్యా ఆమె దాన్ని

నిరాకరించింది. నిరాకరించి వుండకపోతే బహుశా ఆమెకిన్ని కష్టాలు వుండివుండేవి కావేమో! అప్పుడప్పుడు మస్తాన్‌ని ఆహ్వానిస్తూ చాలా గుట్టుగా భర్తతో సంసారం చేసుకునేది. కనీసం భౌతికంగా సుఖాలు అనుభవించేది... అహల్యే దానికి ఉదాహరణ! ఒక చెడు జరిగింది. దాన్ని చూడనట్టూ కళ్ళూ, నోరూ మూసుకోవటం వల్ల ఆమె సంసారిక జీవితం ఇప్పుడు బావుంది. ఒక చెడుని ఎదుర్కోవటానికి తనకి సాయపడుతూన్న గోమతి, ఇక రేపట్నుంచీ పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరగాలి. సాక్ష్యం చెప్పాలి.

ఒక ఆక్టోపస్ తన కాళ్ళని విస్తరించినట్టు – బలవంతుడు తన పరిధిని పెంచుకుంటున్నాడు. 'అతడి సంరక్షణలో వుంటేనే తనకు భద్రత' అనే భావాన్ని సామాన్యుల్లో కలిగిస్తున్నాడు. చాలా భయంకరమైన పరిస్థితి ఇది. సమాజంలో చాపకింద నీరులా ప్రవహిస్తూ వస్తోంది. ఒక్కసారి సామాన్యులు ఈ బలవంతులమీద ఆధారపడి, వారి ప్రాపకం కోసం దేబిరించటం ప్రారంభిస్తే ఇక ఆ బలవంతులు ఏం చేసినా అడిగే వారుండరు.

నడివీధిలో ఒక కుటుంబ స్త్రీ చెయ్యి పట్టుకున్నా చుట్టూవున్న ఈ జనం ఏడవలేక నవ్వుతూ, ఆ బలవంతుడినే సపోర్టు చేస్తారు. అప్పుడతడు నెమ్మదిగా పోలీసుస్టేషన్లనీ, అసెంబ్లీని కూడా ఆక్రమించేసుకుని, తనకి కావల్సినట్టు శాసనాలు చేసుకుంటాడు.

అలా కాకుంటే –

విశారద వూహించే సమాజం రావాలి. 'ఇంత సంపాదించటం ఎందుకు?' అన్న భావం ప్రజల్లో కలగాలి.

అతడొకటి గమనించాడు. సమాజం గురించి ఆలోచించినా, అన్యాయం గురించి ఆలోచించినా, ప్రతీదీ 'విశారద' దగ్గరకే వచ్చి ఆగుతోంది. ఏది ఆలోచించినా చివరకు "అక్కడకు" వచ్చి ఆగటమే కదా ప్రేమంటే!

* * *

అన్నయ్య ఇచ్చిన అఫిడవిట్, మిగతా పేపర్లు, డెత్ సర్టిఫికెట్ అన్నీ అందజేసిన రెండు రోజులకి, తండ్రి తాలూకా డబ్బు చేతికి వచ్చింది.

చెల్లెలితో కలిసి వెళ్ళి, డబ్బు ముట్టినట్టుగా సంతకం పెట్టి తీసుకున్నాడు. ఆ రోజు సోమవారం, అందువల్ల లావాదేవీలు ఎక్కువగా వున్నాయి. ఆ ప్రదేశమంతా హడావుడిగా వుంది.

డబ్బు తీసుకుని, వాళ్ళు బయటకు వచ్చారు.

"ఈ డబ్బుతో నీకు పెళ్ళి చేస్తే నా బాధ్యతలు తీరిపోతాయి, నేనూ, ప్రొద్దున్నే పాల ప్యాకెట్లు, రాత్రిళ్ళు సినిమాహాల్లో ఉద్యోగమూ మిగులుతాయి..." అన్నాడు నవ్వుతూ.

"నేను పెళ్ళి చేసుకోను" అంది గోమతి. "నాకు ఈ మనుష్యుల మీద నమ్మకం పోతోంది".

బోసు ఇంకా బిగ్గరగా నవ్వుతూ, "ఏమిటే - సినిమా భాష మాట్లాడుతున్నావ్" అన్నాడు. ఆ అమ్మాయి నవ్వడంలేదు. "నేనింతకాలం దుర్మార్గులు అంటే ఇంతింత మీసాలేసుకుని చుట్టూ రౌడీల్ని పెట్టుకుని భయంకరంగా నవ్వుతూ వుంటారనుకుంటూ వుండేదాన్ని - వాళ్ళు విడిగా ఎక్కడో వుండరనీ, మనతోనే వుంటారని అన్నయ్యని చూశాక తెలిసింది".

"ఛా, అలా అనకు. అన్నయ్య దుర్మార్గుడు కాడు. ఉన్నంతలో ఏ కష్టమూ లేకుండా బ్రతికేద్దాం అనుకునేవాడు" అన్నాడు బోసు, రామ్మూర్తిని తేలిక చేయటం ఇష్టం లేనట్టుగా!

అప్పుడో సంఘటన అకస్మాత్తుగా జరిగింది. ఎవరూ వూహించని సంఘటన.

ఒక కారు వెనుకనుంచి అతన్ని పక్కనుంచి వచ్చి ఢీకొట్టింది. అతని చేతుల్లోని ప్లాస్టిక్ బ్యాగు దూరంగా పడింది. అందులోని నోట్ల కట్టలు చెల్లా చెదురయ్యాయి. అతను పక్కగా పడిపోయాడు. కారు సడన్ బ్రేక్‌తో ఆగింది.

అతను లేస్తూ కోపంగా చూడబోయాడు. అంతలో అతని మనసు కీడు శంకించింది. ఏదో జరగరాని సంఘటన జరగబోతున్నట్టుగా మనసు హెచ్చరించింది. అతడు ఇంకా పూర్తిగా లేవలేదు. గోమతి భయంతో నిశ్చేష్టురాలై చేష్టలుడిగి నిలబడి వుంది. అంతలో కారులోంచి ఒక చెయ్యి బయటకు వచ్చింది. బోసు 'గోమతీ' అంటూ అరవబోయాడు. కానీ ఆ మాట ఇంకా పూర్తిగా బయటకు రాలేదు.

కారులోంచి చెయ్యి బయటకు పెట్టింది. మస్తాన్.

అతని చేతిలో ఆసిడ్ సీసా వుంది.

బోసు పూర్తిగా పైకి లేవటం, మస్తాన్ చేతిలో ఆసిడ్‌ని గోమతి మొహం మీదకు విసిరెయ్యటం, ఆమె హృదయవిదారకంగా అరుస్తూ మొహాన్ని చేతుల్తో కప్పుకుంటూ కూలబడిపోవటం ఒకేసారి జరిగాయి.

చెల్లెలి కళ్ళు రెండూ పోయాయని అతడికా క్షణం ఇంకా తెలీదు.

చర్మం నల్లగా కాలిపోయి క్షణాల్లో వికృతంగా తయారైందని మాత్రమే చూశాడు.

కారు కదిలి వేగంగా వెళ్లిపోయింది.

బోసు ఇంకా నిర్విణ్ణుడై అలాగే వుండిపోయాడు.

అతడి చుట్టూ జనం.

అతడి దగ్గరకి రావటం లేదు. కళ్ళు రెండూ పోయి విలవిలా కొట్టుకుంటున్న అమ్మాయి దగ్గిరికీ వెళ్ళలేదు. కారు గురించి పట్టించుకోవటం లేదు. ఏరుకుంటున్నారు!

బోసు చేతిలోంచి విసురుగా వెళ్ళి రోడ్డుమీద పడిన నోట్లని ఏరుకుంటున్నారు.

తమలో తామే కుమ్ముకుంటూ – ఒకడి చేతిలోది ఒకడు లాక్కోవటానికి ప్రయత్నిస్తూ, డబ్బు దొరికిన వాళ్ళు సంతోషంగా వాటి కోసం వెతుక్కుంటూ –

అంతా గోలగా వుంది.

ట్రాఫిక్ ఆగిపోయింది.

జరిగిన అన్యాయం చూసి సానుభూతితో కాదు – గాలికి ఎగురుతున్న నోట్ల కోసం జనం అటూ ఇటూ పరుగెత్తటంవల్ల.

బోసు ఇంకా నిశ్చేష్టుడై వున్నాడు.

తండ్రి ఆత్మాహుతి చేసుకుని సంపాదించిన డబ్బుని కాట్లకుక్కల్లా తన్నుకుంటూ, తోసుకుంటూ, ఎంగిలి విస్తరాకుల కోసం పోట్లాడుకునే బిచ్చగాళ్ళలా ఏరుకుంటున్న జనాల్ని చూసి అతడు అచేతనుడయ్యాడు.

"ఆమ్... మ్మా... అమ్మా" అంటూ బాధతో గగ్గోలు పెడుతూంది గోమతి. మొహాన్ని చేత్తో కప్పుకున్నచోట – కాలిన చర్మం వూడిపోయి ఎర్రటి మాంసం భయంకరంగా కనపడుతోంది.

ఆమె కళ్ళు పోయాయని తెలియదు. ఒక నిజాన్ని చూసిన నేరానికి ఒక సాక్షి జీవితం పూర్తిగా అంధకార బంధురం చేశారని తెలియదు.

అతడు ఒక క్రొత్త ప్రపంచాన్ని చూస్తున్నాడు.

ఒక మనిషి మీద దౌర్జన్యం జరిపి, ఒక సాక్ష్యాన్ని సమూలంగా నాశనం చేయటం కోసం, ఆ స్త్రీని తమ కళ్ళ ముందే శాశ్వతంగా అంధురాల్ని చేస్తే – జనం ఆ దౌర్జన్యాన్ని ఎదుర్కోలేదు. కనీసం కళ్ళుపోయిన మనిషి మీద సానుభూతి చూపించటం లేదు.

డబ్బులేరుకుంటున్నారు.

మూల మూలలా శోధిస్తూ – ఒక్క రూపాయి కోసం తన్నుకుంటున్నారు. ఇంకా ఏమన్నా నోట్లు దొరుకుతాయేమోనని మట్టి కెలుకుతున్నారు. కాట్ల కుక్కలా పోట్లాడుకుంటున్నారు. వీళ్ళకోసం భగవద్గీత లెందుకు? వీళ్ళ భద్రతకు పోలీస్ స్టేషన్ లెందుకు?... అందుకే ఇన్‌స్పెక్టర్లు రామకోటులు వ్రాసుకుంటారు. తెలివైన వాళ్ళు వీళ్ళ మేధస్సు మీద ఆడుకుని భవంతులు నిర్మించుకుంటారు. తనింతకాలం చాలా తప్పు అభిప్రాయంలో వున్నాడు. మనుషుల్లో చాలామంది మంచి వాళ్ళుంటారనీ, కొద్దిమంది గూండాలు, కొద్దిమంది మోసగాళ్ళు వుంటారని, వీళ్ళని అదుపు చేయటానికి ప్రభుత్వమూ, చట్టమూ వుంటాయనీ

భగవద్గీతలో చెప్పినట్టు – ధర్మ సంస్థాపనార్థం నిరంతరం నైతిక విలువల సాయంతో 'చెడు'తో పోరాటం జరుగుతూ వుంటుందని భ్రమించాడు.

మనుష్యుల్లో చాలా తక్కువమంది నిస్వార్థపరులుంటారు. అవకాశం వుంటే అందరూ అటువైపు గెంతటానికి సిద్ధంగా వుంటారు.

ఇదంతా జరిగి క్షణమే అయింది. అతడు కేవలం క్షణంసేపే చూశాడు. క్షణంలోనే లక్ష ఆలోచనలు. జనం – ఓ జనం మీకు నా నీరాజనం... ఒక మనిషి రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించిన దాన్ని డేగలా ఏరుకుంటున్న మీకు నా అభివందనం.

మరొకసారి ఆర్తనాదం హృదయవిదారకంగా వినిపించటంతో తలతిప్పి చూశాడు.

చెల్లి....

తన పక్కనే బాసింపెట్లు వేసుకుని కూర్చుని నమస్కరిస్తూ, చిన్న చేతుల్ని జోడించి "...చేత వెన్న ముద్ద చెంగల్వ పూదండ – చిన్ని కృష్ణా నిన్ను చేరి కొలుతు" అంటూ ముద్ద ముద్దగా – ముద్దు ముద్దుగా వల్లించిన చెల్లి – గీతాపారాయణం తరువాత హారతి కళ్ళకద్దుకుంటూ దోసిలిలో నాన్న ఇచ్చిన తులసీ తీర్థాన్ని తాగి, భక్తిగా అరచేతులు తలకి రాసుకునే చెల్లి – పెరిగి పెద్దయి, నీతే హద్దయి, ఏ ప్రలోభాలకీ లొంగక తనవైపు నిలబడిన చెల్లి – ఆ పాలవెల్లి...

ఇప్పుడు గుండెలవిసేలా రోదిస్తూంది... బాధ భరించలేక కేకలు పెడుతోంది. మనుష్యుల్లో మానవత్వం ఇంకా పూర్తిగా నశించలేదని

నిరూపించటానికి ఇద్దరు ముగ్గురు ఆమెని పక్కనే నర్సింగ్ హోంలోకి తీసుకువెళ్తున్నారు.

అతడు నిద్రలో నడుస్తూన్నవాడిలా వారిని అనుసరించాడు. ఈ కేసు తను తీసుకోను, పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలి అన్నాడు డాక్టరు. పక్కవారు బ్రతిమాలితే వప్పుకున్నాడు. బోసు బ్రతిమాలలేదు. మౌనంగా వున్నాడు. అతడి మొహంలో దుఃఖం, కోపం లాంటి భావాలేమీ లేవు. నిర్లిప్తంగా నిమిత్తమాత్రుడిలా చూస్తున్నాడు.

అరగంట పరీక్షించి, డాక్టరు చెప్పాడు. "ఆమెకిక కళ్ళు రావు".

"ఎప్పటికీనా?"

"ఎప్పటికీ!" అన్నాడు డాక్టరు. "పూర్తిగా కాలిపోయాయి. ఎవరూ ఏమీ చేయలేరు".

ఒక పేజీ తిప్పినట్టు, నిట్టూర్పుతో ఒక అధ్యాయం ముగిసినట్టు – నిశ్శబ్దంగా ఒక పుస్తకం కాలిపోయినట్టు – అనాసక్తంగా ఒక మేఘం కురిసినట్టు, ఎక్కడనుంచో ఒక పసిపిల్ల ఆగకుండా రోదిస్తున్నట్టు – ఎక్కడో కబేళాలో ఒక మేకపిల్ల, తెగిపడిన తన తలని చూసుకుని రోదిస్తున్నట్టు విషాదం అంచుమీద నుంచి జారిపడిన కన్నీటిచుక్క గుండె మంటల్లో దగ్ధమైనట్టు.

ఈ అమ్మాయి తాలూకు ఎవరూ లేరా?

"ఇదిగో ఇతనున్నాడు సార్ " బోసుని చూపించారు.

డాక్టర్ బోసుని దూరంగా తీసుకువెళ్ళాడు. "కళ్ళకి సంబందించినంత వరకూ మనం చేసేదేమీ లేదు. కానీ మొహనికి మాత్రం తొందర్లో ప్లాస్టిక్ సర్జరీ

చేయించాలి. ఇటువంటి కేసుల్లో – గాయం అయిన ఎంత తొందరగా సర్జరీ చేయిస్తే అంత మంచిది. లేకపోతే చర్మం పీక్కు పోయిందంటే మళ్ళీ పూర్వపు షేపురాదు."

బోసు మాట్లాడలేదు. డాక్టరే అన్నాడు. "ఒక వారం – పదిరోజుల్లోగా ప్లాస్టిక్ సర్జరీ ఏర్పాటు చూస్తే మంచిది. ఇది ఇప్పుడు జరక్కపోతే, మళ్లీ అమెరికా తీసుకు వెళ్ళాల్సి వుంటుంది. దానికి లక్షా రెండు లక్షలు ఖర్చవుతాయి".

బోసు ఒకసారి తలెత్తి డాక్టర్ కళ్ళలోకి చూసి తల దించుకున్నాడు. డాక్టరు కొద్దిగా తటపటాయిస్తూ అన్నాడు. "ఏదో నేను చేయగలిగిన ప్రథమ చికిత్స చేశాను. ఈ ఘోరం నా నర్సింగ్ హోమ్ ముందు జరిగింది కాబట్టి నా కర్తవ్యం. ఇంకొక నాలుగు రోజులన్నా ఆ అమ్మాయి ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. మీకు తెలిసిన వేరే నర్సింగ్ హోమ్ వుంటే తీసుకువెళ్ళవచ్చు".

"ఇక్కడే వుంచండి డాక్టర్" చాలా సేపటి తరువాత మొదటి సారిగా మాట్లాడుతూ అన్నాడు బోసు.

"ఇది... ఇది చాలా ఖరీదైన నర్సింగ్ హోమ్".

బోసు అర్థమయినట్టు తలూపాడు. ఇంట్లో తన వాటా వుంది. ఆది పెద్దన్నయ్య తీసుకుంటున్నాడు కాబట్టి తనకి ఆ డబ్బు వస్తుంది. అది ఈ నర్సింగ్ హోమ్ బిల్లుగా సరిపోతుంది. నాన్న తాలూకు డబ్బు గాల్లో కలిసి పోయింది.

అంటే....

ఇక గోమతి పెళ్ళికి డబ్బులేదు. ఆ అమ్మాయి అందాన్ని చూసి ఎవరైనా చేసుకుంటారన్న ఆశకూడా ఇప్పుడు లేదు. బ్యాండేజి విప్పాక గోమతి ఎలా ఉంటుందో వూహించగలడు.

...అతడు బయటకొచ్చాడు.

మున్సిపాలిటీ వాళ్ళు అప్పుడే వూడ్చిన రోడ్డులా వుంది ఆ దారి. కోనకోనల్లో పడిన నోట్లని కూడా ఏరుకుని పోయారు జనం. అసలక్కడ కొన్ని నిముషాల క్రితం ఒక అరాచకం జరిగిన గుర్తులేదు. లక్ష్మీ శారదకు జరిగిన అన్యాయాన్ని పదిరోజుల్లో మర్చిపోతే, గోమతికి జరిగిన అన్యాయాన్ని పది నిముషాల్లో మర్చిపోయారు.

అతను నెమ్మదిగా నడుస్తున్నాడు.

చుట్టూ సైకిల్ బెల్స్ చప్పుడు – ఆటోల రొద. కారు హారన్‌లు... ఏవీ అతడికి వినిపంచటంలేదు. ఒక హృదయ విదారకమయిన రోదన మాత్రమే వినిపిస్తూంది. చెల్లి కేకలు మాత్రమే వినిపిస్తున్నాయి.

అతను నడుస్తూనే ఉన్నాడు.

కదిలి కదిలి – కడలి కట్ట హద్దు వదలి – వీరభద్రుడావహించి – చెదలుకూలి అచల బెదరి – అహిర్బుధ్న్యుని కన్ను అదిరి – ఆవాహనసేన చెదరి.

"మస్తాన్ నీ దగ్గిర ఎంత చందా వసూలు చేస్తాడు నెలకి?"

మాంసం కొడుతున్న మనిషి ఆ ప్రశ్నకి ఆశ్చర్యంగా తలెత్తి చూశాడు. అతడికి ఆ ప్రశ్న అర్థంకాలేదు. బోసు తిరిగి అదే ప్రశ్న అడిగాడు.

"నువ్వెవరు?"

బోసు జవాబు చెప్పకుండా, అతని పక్కనే వున్న కత్తిని తీసుకున్నాడు. మాంసం కొట్టే కత్తి వేరే... ఇది కైమాకొట్టే కత్తి. ఆకారములో మరింత పెద్దగా, మరింత సునిశితంగా వుంది.

మాంసం కొట్టేవాడికి ఎందుకో భయం వేసింది. అలా అని బోసు ఏమీ భయంకరంగా లేడు. కానీ అతని కళ్లల్లో వున్న ఆ నిస్తేజత – అదీ అతడిని భయపెట్టింది. ఆ డిటాచ్‌మెంట్‌ని మొదలు లక్ష్మీశారద కనిపెట్టింది. ఇప్పుడు అది మరింత స్పష్టంగా కన్పిస్తోంది. కత్తి పదునుని వేలితో పరీక్షిస్తూ మళ్ళీ అదే ప్రశ్న అడిగాడు బోసు.

"...నెలకి వంద" తడబడుతూ చెప్పాడు మాంసం కొట్టువాడు.

" 'ఈ నెల చందా' క్రింద ఈ కత్తిని రాసుకో. వచ్చే నెలనుంచీ వాడికి నువ్వేమీ ఇవ్వనవసరంలేదు" అని ఆ కత్తి తీసుకుని ప్యాంటులో దోపుకుని బయల్దేరాడు. కొట్టువాడు ఇంకా విస్మయం నుంచి తేరుకోలేదు.

ఆ కొట్టుకి నాలుగు పాకల అవతల వుంది సారా డిపో.

మస్తాన్ అక్కడికి వచ్చి అరగంట అయింది. సారా డిపో దగ్గర వాడిని దింపి కారు వెళ్ళిపోయింది.

మస్తాన్ చాలా ఆనందంగా వున్నాడు. మొదలియార్ స్వయంగా చెప్పిన పని పూర్తిచేయటం ఆ ఆనందానికి కారణం. దీనివలన తన పాపులారిటీ పెరుగుతుందని అతడికి తెలుసు. 'ఈ రోజు ఇక్కడున్నోళ్ళందరికీ ఎంత తాగితే అంత ఫ్రీగా పొయ్యి' అని కొట్టువాడికి చెప్పి, తనూ ఓ సీసా తీసుకున్నాడు.

అరగంటలో రెండు సీసాలు పూర్తయ్యాయి. మత్తు నషాళానికి అంటింది. బాగా ఆనందంలో వున్నాడేమో – తన విజయం గురించి శ్రోతలకి చెప్పటం ప్రారంభించాడు.

"ఈ వేళ ఒక ఆడదాని మొహంమీద ఆసిడు కొట్టిన. అసలీ ఆసిడు కొట్టే టెక్నిక్ నాదికాదు – మొదలియార్‌ది. పొడిచే దానికన్నా ఇదే బావుంది. పక్షి కొట్టుకుంటది చూడండి – అట్ల కొట్టుకుంటారు అది మీదపడగానే. నాకే మళ్ళీ మళ్ళీ చూడాలనిపించింది..." అతడి మాటలు పూర్తికాలేదు – గుమ్మం దగ్గర చప్పుడయింది.

మస్తాన్ ముందు చూశాడతన్ని.

వాడి మనసు ఏదో కీడు శంకించింది. లేచి నిలబడ్డాడు.

బోసు దగ్గిరగా వస్తున్నాడు. చుట్టూ వున్న జనం లేచి నిలబడ్డారు. బాగా మత్తుమీద వున్నవాడు ఒకడు "ఎవడ్రా నువ్వు" అంటూ అడ్డు రాబోయాడు. బోసు మోకాలితో వాడి పొట్టలో బలంగా తన్నాడు.

జనం కకావికలమై పరుగెట్టారు. మస్తాన్‌కి – తనకోసమే బోసు వస్తున్నాడని అర్థమయింది. అంతకు ముందులా అజాగ్రత్తగా వుండదల్చుకోలేదు. జేబులోంచి కత్తి తీశాడు. తల గట్టిగా విదిలించి – పూర్తి స్పృహలోకి వచ్చాడు. రెండో చేతితో సీసాని పట్టుకున్నాడు. అతడి కత్తి పిడికిలి దగ్గర కాస్త మెలితిరిగి వుంది.

మస్తాన్‌తో పాటు ఇద్దరు రౌడీలు కూడా బోసుకి చెరోవైపునా ముందుకొచ్చారు. వాళ్ళ చేతుల్లో కూడా కత్తులున్నాయి. సీసా గాలిలోకి ఎత్తి,

మరో చేతితో కత్తిని బలంగా పట్టుకుని బోసు పక్క కడుపులో పొడవటానికి విసురుగా ముందుకొచ్చాడు మస్తాన్. ఈ రకమయిన పోటులు చార్మినార్ ఏరియా గూండాలకి బాగా అలవాటు. ఇందులో ప్రత్యర్థి తప్పించుకోవటానికి అవకాశం వుండదు. పక్కకి వెళితే మరింత ప్రమాదం. అలా అని అక్కడే వుంటే కడుపులో మెలితిప్పి పేగులు బయటకు లాగుతాడు ప్రత్యర్థి. మరో పక్కకి తిరిగితే మొహం మీద సీసా పగులుతుంది. బోసు ఎటూ వెళ్ళలేదు. ఎటు వెళ్ళినా ప్రమాదం అని అతడికి తెలుసు.

మరో క్షణంలో మస్తాన్ పొడవబోతున్నాడనగా – ఫాంటుకీ, బెల్టుకీ మధ్య దోపిన కత్తిని వెనుకనుంచి తీశాడు బోసు. మెరుపులా బయట కొచ్చిన కత్తిని మస్తాన్ గమనించి ఆశ్చర్యపోయాడు. కానీ తన వేగం తగ్గించలేదు. ఎదురెదురు ఫైట్స్‌లో ఇలాంటి పెద్ద కత్తుల వలన లాభం వుండదనీ, వాటిని ఉపయోగించరనీ మస్తాన్‌కు తెలుసు. అందుకే తన ప్రయత్నంలో వెనక్కి తగ్గలేదు. బోసు కడుపులో పొడిచాడు.

ఒక ప్రొఫెషనల్ రౌడీ మామూలు కత్తిని ఎంత చలాగ్గా ఉపయోగించగలడో అంత తేలిగ్గా బోసు ఆ కైమా కత్తిని గాలిలోకి ఎత్తాడు. ఏం జరుగుతుందో మస్తాన్ గ్రహించే లోపులో ఆ కత్తి గాలిని సర్రున కోస్తూ క్రిందికి దిగటం – మస్తాన్ మోచేతి దగ్గర సగానికి ఖండించటం జరిగాయి. ఆ బలానికి కత్తి – ఎముకని కూడా ఒక్క వేటులోనే తెగ్గొట్టింది.

చిన్న శబ్దంతో తెగిన చెయ్యి నేలమీద పడింది.

ఏం జరిగిందో మస్తాన్‌కి అర్థం కాలేదు. బాధ ఇంకా నరాలగుండా మెదడు వరకూ ప్రవహించలేదు. బోసు మెరుపు వేగంతో కత్తి ఎత్తి రెండో చెయ్యి తెగ్గొట్టాడు. సీసాని పట్టుకున్న చెయ్యి అలాగే వుంది. రెండూ కలిసి క్రిందపడ్డాయి. సీసా భళ్ళున బ్రద్దలైంది.

అంతా క్షణాల్లో జరిగిపోయింది.

రెండు చేతులూ నేలమీద కదులుతున్నాయి.

ఫౌంటెన్స్ లోంచి చిమ్మినట్టు – రక్తం బయటకు చిమ్ముతోంది.

మస్తాన్‌కి అప్పుడు తెలిసింది బాధ.

తన కళ్ళముందే తన చేతులు రెండూ, విరిగిన రెక్కల్లా నేల మీదపడి, కొస ప్రాణంతో కొట్టుకుంటూ వుండడం అతడు దిగ్భ్రాంతుడై చూశాడు. తరువాత స్పృహ తప్పి నేలమీద జారిపోయాడు.

ఇద్దరు అనుచరులూ ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. తమ కళ్ల ముందు జరిగింది నమ్మలేకపోతున్నట్టు అలాగే నిలబడిపోయారు.

బోసు కడుపులోంచి రక్తం స్రవిస్తోంది. ఆ దృశ్యం చూస్తే! అవతలి మనిషి ఒక చేత్తో సీసా పట్టుకుని మీదకొస్తే – ఎంత ధైర్యవంతుడయినా... ఈ రకం ఫైట్స్‌లో ఎంత అనుభవం వున్న వాడయినా – ప్రాణభయంతో కత్తినుంచి అప్రయత్నంగా పక్కకి జరుగుతాడు. అలా జరిగి తప్పు చేస్తాడు! కత్తి కంటే సీసా ప్రమాదకరమైంది.

కత్తిని తన కడుపులో దిగనిచ్చి, ఆ మూమెంట్‌లో చేతిని తెగ్గొట్టడం అన్నది కేవలం చెంఘీజ్‌ఖాన్ లాంటి వారికే సాధ్యమవుతుందేమో !

బోసు కత్తితో తమవైపు తిరిగేసరికి ఆ యిద్దరు అనుచరులూ అక్కడనుంచి పరుగెత్తారు.

బోసు కత్తి క్రిందపడేశాడు. టాక్సీ డోరు పైనుంచి తన చెల్లెలి మొహం మీదకు ఆసిడ్ సీసాని విసిరిన ఆ చేతిని క్షణకాలం చూశాడు.

అచేతనంగా పడి వుందది.

కడుపులోంచి స్రవిస్తూన్న రక్తాన్ని ఆపుచేయటం కోసం గాయాన్ని గట్టిగా అదిమిపట్టి అక్కడనుంచి బయటకొచ్చాడు. సారా డిపో నిర్మానుష్యంగా వుంది. ఖాళీ సీసాలూ, కుండలూ చెల్లాచెదురుగా పడి వున్నాయి.

అలాగే బయటకొచ్చాడు.

చెల్లెల్ని చేర్చిన హాస్పిటల్‌వైపు సాగిపోయాడు.

* * *

ఇది జరిగిన పది నిముషాలకి మొదలియార్ ఇంట్లో ఫోన్ మోగింది. జరిగినదంతా అతనికి చెప్పాడు మస్తాన్ పక్కన వుండి అంతా చూసిన అనుచరుడు.

"ఎలా వున్నాడు మస్తాన్" మొదలియార్ సాలోచనగా అడిగాడు.

"అక్కడే పడివున్నాడు సాబ్?"

"బోసు?"

"వెళ్ళిపోయాడు సాబ్."

"కత్తి వదిలేశాడా?"

"అవును సాబ్".

"దానితో మస్తాన్‌ని పొడిచెయ్యి".

అనుచరుడు అదిరిపడి "సాబ్" అన్నాడు.

"రెండు చేతులూ పోయిన ఆ మస్తాన్ మనకి తిండి దండగ... పోలీసులు రాకముందే వెళ్ళి వాడిని పొడిచేసి ఆ విషయం నాకు చెప్పు. కత్తిమీద బోసు వేలిముద్రలు చెరగనివ్వకు."

"అలాగే సాబ్!"

మొదలియార్ ఫోన్ పెట్టేసి పక్కనే కుర్చీలో కూర్చున్నాడు. అతని ఆలోచనలు గతంలోకి వెళ్ళాయి.

తనని కారులో బలవంతంగా పోలీస్ స్టేషన్‌కి తన్నుకుంటూ తీసుకెళ్ళి, తనతో నేరం వప్పించిన బోసు మొహం కళ్ళముందు కదలాడింది.

మొదలియార్ మీద చేయి చేసుకోవటం అంటే అది చిన్న నేరం కాదు.

... అంతలో ఫోన్ మ్రోగింది.

"చెప్పు".

"పొడిచేశాను సాబ్.."

"గుడ్... కత్తి అక్కడే వదిలేశావుగా".

"వదిలేశాను సాబ్!"

"బోసు మస్తాన్ చేతులు నరకటం ఎవరయినా చూశారా?"

"మొత్తం డిపోలో అందరూ చూశారు సాబ్!"

"చాలు, ఇక వచ్చెయ్యి–" ఫోన్ పెట్టేశాడు. అతడి పెదాలమీద చిరునవ్వు కదలాడింది.

మనిషి చేతుల్ని నరికి – నిర్ధాక్షిణ్యంగా చంపినందుకు ఏ శిక్ష పడుతుంది? ఉరిశిక్ష ???

--oOo--

# అధ్యాయం -3

## మూడు సుదీర్ఘమైన సంవత్సరాలు.

ఘనీభవించిన ఏకాంతం. ద్రవిస్తే విషాదమే ప్రవాహం.

జైల్లో అతను అందరితోనూ స్నేహంగానే ఉండేవాడు. కానీ అవసరమయినంత వరకే మాట్లాడేవాడు. అలా అని అహంభావిగానో, భరించలేని 'లావా'ని గుండెల్లో దాచుకున్నట్టుగానో వుండేవాడు కాదు. అతని మనసులో మాత్రం –

గుండె వర్షించేది. వాస్తవం ప్రవహించేది.

చెల్లి గురించిన వాస్తవమది. ఆ అమ్మాయి జీవన మొక్కటే అతని సమస్య. విశారద గోమతి బాధ్యత తీసుకుంది. ఆ విషయం పట్ల అతని మనసు కృతజ్ఞతతో నిండివున్నా, మానవ విలువలపట్ల ఏర్పడిన చేదు నిజం మాత్రం హృదయంలో అంకుశంలా పొడిచేది.

జైలు జీవితం బాగా అలవాటయింది. ప్రతిరోజు భగవద్గీత చదివేవాడు. అది అతడికి మానసికమయిన స్థిరత్వాన్ని ఇచ్చింది. ఒక రకంగా ఈ జైలు జీవితం అతడికి సాయం చేసింది కూడా! బయట వున్నప్పుడు సమయం దొరికేదికాదు. ఇప్పుడు జైల్లో అనుదినం రెండు గంటలపాటు కసరత్తు చేయటానికి వీలు దొరుకుతూంది. అతడి మనసులాగే, శరీరమూ రాటుదేలింది.

కేవలం ఒకేసారి రామ్మూర్తి జైలుకి వచ్చాడు. అదయినా పరామర్శించటానికి కాదు, ఇంటి తాలూకు కాగితాలమీద సంతకం పెట్టించుకోవటానికి.

గోమతి తాలూకు నర్సింగ్ హోం ఖర్చులు రామ్మూర్తి భరించి, దానికి ప్రతిగా బోసు వాటా రాయించుకున్నాడు. నలభై, యాభైవేలు ఖరీదుచేసే పోర్షన్ ఆ పాతికవేల ఖర్చుకి సరి పెట్టాడు. దీని వెనుక సింహాచలం హస్తం వుందని బోసుకి తెలుసు. కానీ అవసరం తనది.

మస్తాన్ మరణించిన రెండు గంటల తరువాత పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. లాకప్‌లో చాలా రోజులు ఉండవలసి వచ్చింది. నర్సింగ్ హోంలో గోమతి బాగోగులన్నీ సుధాకర్, విశారద చూసుకున్నారు. వారికి మనసులోనే ప్రణామం చేశాడు.

అతడికి అందరికన్నా అహల్య ప్రవర్తన ఆశ్చర్యమనిపించింది. తనకి జైలు శిక్ష పడినప్పుడు, ఆమె అత్తవారింట్లో 'ఆ బోసు అంతే. ఎప్పుడూ గూండాల్తో తిరిగేవాడు. దెబ్బలాటల్లో తన్నులు తిని వచ్చేవాడు' అందట. ఆ విషయం అతనికి తెలిసి బాధపడ్డాడు. తమకి కొద్దిగా – చాలా కొద్దిగా లాభం కలుగుతుందని తెలిసినా, మనుష్యులు ఎంత కన్వీనియంట్‌గా తమ దృక్పథాన్ని మార్చుకుంటారో అతడికి అనుభవ పూర్వకంగా అర్థమైంది. ఆమెకు తెలుసు – తన భర్తకీ, మామగారికీ బోసంటే పడదని. తను ఆ ఇంట్లో ఆనందంగా ఉండాలంటే బోసుని తిట్టాలి. అందుకని బోసు జైలుకు వెళ్ళగానే తనుకూడా ఒక రాయి విసిరి చేతులు దులిపేసుకుంది. తన కట్న సమస్య, భర్త తనని హింసించిన విధానం – అన్నీ

మర్చిపోయి, ఈ ప్రపంచపు చాలామంది సగటు సంసార స్త్రీల లిస్టులో చేరిపోయింది. మళ్ళీ ఎప్పుడో ముప్పై ఏళ్ళ తరువాత ఆ బోసే ఈ దేశపు ప్రధానమంత్రి అయితే "వాడు మా తమ్ముడండీ" అంటూ ముచ్చటపడ్డా ఆశ్చర్యపోనవసరం లేదు. సమాజం అంటూ ఎక్కడో వుండదు. మనమే సమాజం! ఒకసారి మన గత అనుభవాల మనోగత భావాల దర్పణంలోకి చూసుకుంటే మనలోనే ఒక రామ్మూర్తో – ఒక అహల్యో ఏదో ఒక స్థాయిలో కనబడతారు. కావలసిందల్లా మనలో మనం చూసుకుని ఆత్మవిమర్శ చేసుకోగలగటమే. గతం ఎప్పుడూ కాండం మొదట్లో కన్నీటి చుక్కల్ని రాలుస్తూ వుంటుంది. వర్తమానం మాత్రం భవిష్యత్ ఫలాన్ని తెంపుకోవటానికి ఆతృతపడుతూ వుంటుంది.

తనకి మూడు సంవత్సరాల శిక్షతో తప్పిపోతుందనుకోలేదు. హత్యానేరం మీద తనని అరెస్టు చేస్తున్నారని తెలిసి అతను ఆశ్చర్యపోయాడు. మస్తాన్ మరణించాడని తెలియగానే మొదలియార్ మాస్టర్ ప్లాన్ అర్థమయింది.

తనకి ఆవేశం వుంది, తెగింపు వుంది. కానీ ప్లానింగ్ లేదు. ఆ 'కుత్సితాన్ని' ఇంకా నేర్చుకోలేదు. మొదలియార్ లాంటి గ్యాంగ్‌లతో తలపడాలంటే ఈ మేధస్సు సరిపడదు.

తనకి యావజ్జీవ కారాగారశిక్ష పడుతుందనుకున్నాడు. కానీ కోర్టులో తన తరఫున పి.యస్. రెడ్డి వాదించటానికి ఆయత్తమవగానే అతడు ఆశ్చర్యపోయాడు.

పి.యస్. రెడ్డి రామ్ జెత్మలానీ లాటి లాయరు. అతని ఫీజు ఆరంకెల్లో వుంటుంది. అలాంటివాడు తన ఆర్థికస్థితి తెలిసీ, ఎందుకు ముందుకు వచ్చాడో అర్థంకాలేదు.

పి.యస్. రెడ్డి కేసుని గమ్మత్తయిన మలుపు తిప్పాడు.

**"...బోస్‌కి అసలు మర్డరు చేద్దామన్న ఆలోచనలేదు... చెల్లెలి మొహంమీద ఆసిడ్ పోసినందుకు మస్తాన్‌ని పోలీస్ స్టేషన్‌కి లాక్కొద్దామని వెళ్ళాడు. (గతంలో మొదలియార్‌ని కూడా అలాగే లాక్కొచ్చాడు. అది అతనికి కొత్తకాదు)... మస్తాన్ కత్తితో బోసు పొట్టలో పొడిచాడు. బోసు కత్తితో అతని చేతులు ఆ ...త్మ... రక్షణార్థం నరకవలసి వచ్చింది. ఆ పెనుగులాటలో మస్తాన్ మరణించాడు. (క్రైమాకత్తి మస్తాన్‌దే అని కూడా నిరూపణ అయింది)... కడుపులో గాయంతో బోసు ఆస్పత్రికి వెళ్తూండగా పోలీసులు అరెస్టు చేశారు. మొదట మస్తానే బోసుని పొడవటం ఇద్దరు ముగ్గురు (దొంగ) సాక్షులు చూశారు.**

ఈ అన్ని కారణాలవల్ల బోసుకి యావజ్జీవ కారాగార శిక్ష పడకుండా క్రిమినల్ ట్రెస్‌పోస్, ఫిజికల్ ఇన్‌జ్యూరీ టు థర్డ్ పార్టీ క్రింద మూడు సంవత్సరాల శిక్షపడింది.

బోసు కిదంతా చాలా ఆశ్చర్యంగానూ, బాధాకరంగానూ అనిపించింది. అసలు జరిగిందేమిటి? ప్రత్యర్థులు దాన్ని ఎలా మర్డర్ కేసుగా మార్చారు? దాన్ని మళ్ళీ తన లాయరు ఎలా మలుపు తిప్పాడు – తెలుసుకుంటే ఈ న్యాయవ్యవస్థ మీదే నమ్మకం పోయింది అతడికి.

గోమతి కోర్టుకు రాలేదు. శిక్ష పడినప్పుడు కూడా రాలేదు. విశారద వచ్చినప్పుడు ఆ విషయం అడిగాడు. ఆమె సరి అయిన సమాధానం ఇవ్వలేదు. రెట్టించి అడిగితే చెప్పింది. "ఆమెని నువ్వు చూడలేవు. చాలా భయంకరంగా మారింది ఆమె మొహం".

అతడికి దుఃఖంతో కూడిన ఆవేశం వచ్చింది. "నా చెల్లెలి మొహం నేను చూడలేనా? ఇదే జైల్లో కాకుండా ఇంట్లో వుంటే నేను చూడనా?" అన్నాడు వేదనగా. తను జైలుకి రాగానే పరాయివ్యక్తి అయిపోయాడా? అన్న బాధ ధ్వనించింది అతని కంఠంలో.

అయితే విశారద అన్నది –"మీరు అనవసరంగా అపోహపడుతున్నారు. గోమతి ఎవరికంటా పడటంలేదు. మొహానికి కొంగు కప్పుకుని రోజంతా ఓ మూల కూర్చుంటుంది. అందంగా వుండే మొహం ఒక్కరోజులో భయంకరంగా మారితే ఎవరికైనా ఆ బాధ సహజమే. మానసికంగా ఆమె చాలా కృంగిపోయిన స్టేజిలో వుంది. తొందర్లోనే మనం ఏదైనా చేయకపోతే ఆమె మరింత కృంగిపోయే ప్రమాదంకూడా వుంది".

మొదటిసారి అతడిని స్వేచ్ఛ హరించటంవల్ల వచ్చిన బాధ తెలిసింది. జైలు బైటవుంటే చెల్లికి నయం చేయగలడని కాదు. కనీసం ఒక తోడుగా నిలిచేవాడు. ఇప్పుడు అదీ కష్టమే.

అతడు విశారదతో అన్నాడు. "నువ్వుగానీ లేకపోతే నేనీ పరిస్థితిలో ఏమైవుండేవాడినో కదా. నా చెల్లిని నీ దగ్గిర వుంచుకుని నువ్వు చేసిన సాయం నా జన్మలో మర్చిపోలేను".

"అంతంత పెద్ద మాటలెందుకు ? మనం మనం ఒకటి అనుకున్నాక ఇక 'సాయం' అన్న ప్రసక్తి ఎందుకు వస్తుంది" అంది.

ఆ చివరి వాక్యం అతడికి మునుపటంత సంతోషాన్ని ఇవ్వలేదు. ఒక మాజీ ఖైదీగా సమాజంలో తనకి ఏ స్థానం లభిస్తుందో అతడికి తెలుసు. ఎక్కడా ఉద్యోగం దొరకదు. దొరకాలంటే అబద్ధం చెప్పాలి. అది ఇష్టంలేదు.

అతడు జైలుకు వెళ్ళిన నెలరోజులకి ఒక సంఘటన జరిగింది.

## 2

"**అయితే** నాకీ అందం సరిపోదంటావు?" అంది పద్మావతి దిగులుగా.

సుధాకర్ ఆమెవైపు భయంగా చూసి "నీకు పిచ్చి వదలదా పద్మావతీ?" అన్నాడు.

"జీవితంలో పైకి రావాలనుకోవటం తప్పా సుధాకర్?" అంది.

"అందమైన అమ్మాయిలు సినిమాల్లో పైకి రావాలనుకుంటారు. కానీ నువ్వేమిటి – రాజకీయాల్లో పైకి రావాలనుకుంటున్నావు?"

"రాజకీయాల్లో పైకి రావాలంటే గూండా అన్నా అయివుండాలి. లేదా జనాన్ని పోగెయ్యగలిగన్నా వుండాలి. మనకా రెండూ లేవు. వయసులో వున్న ఆడదాన్ని కదా, అందుకని లూపు లైనులో వద్దామనుకుంటున్నా!"

"అందుకిదా మార్గం? కనపడిన ఆడదానికల్లా ముఖ్యమంత్రి ఛైర్మన్ పదవి ఇచ్చేస్తాడనుకుంటున్నావా?".

"సింగిల్ నెంబర్ లాటరీ టిక్కెట్టు కొంటే పదిమందిలో ఒక్కడికే ప్రైజు వస్తది! కానీ లక్షమంది కొంటారు. ఎందుకని? అదృష్టం పరీక్షించుకోవాలని! మరి అట్లాంటప్పుడు రాజకీయాల్లో నేను నా అదృష్టం పరీక్షించుకుంటే తప్పేమిటట?"

"ఏం పెరిగిపోయావే పద్మావతీ... రాజకీయాల్లో చేరకముందే లాజిక్కు అర్థం కాకుండా మాట్లాడుతున్నావే. అయినా ముఖ్యమంత్రి అంటే...." అంటూ సగంలో నోరు తెరుచుకుని ఆగిపోయాడు. అంతలో అక్కడికి ఒక పొడవాటి కారు వచ్చి ఆగింది. అందులోంచి ఒక వ్యక్తి దిగి, వీళ్ళని చూసి దగ్గరకు వచ్చి "విశారద అనే ఆమె ఇల్లెక్కడ?" అని అడిగాడు.

దూరంగా వున్న పాకని చూపించి "...మీరెవ్వరూ?" అని అడిగారు సుధాకర్. ఆ వ్యక్తి "...నేను చీఫ్ మినిష్టర్ పి.ఏ.ని" అన్నాడు.

పద్మావతి ఉలిక్కిపడింది.

సుధాకర్ కూడా ఆశ్చర్యపోయాడు. ఈ లోపులో కారు దిగిన వ్యక్తి విశారద పాకవైపు వెళ్లిపోయాడు.

"సుధాకరూ... " అంది పద్మావతి. "వెతకబోయిన లాటరీ నెంబరు మొదట్లోనే కంటికి తగలటం అంటే ఇదేననుకుంటా. వెళ్ళి వెనకాల డిక్కీలో కూర్చోనా?" అని అడిగింది.

"డిక్కీలోనా? ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మొన్న చూసిన జానపద సినిమాలో సముద్రంలో కొట్టుకొచ్చిన పెట్టె రాజకుమారుడు తెరవగానే అందులో రాజకుమార్తె కనబడదూ? అట్టానే ముఖ్యమంత్రి డిక్కీ తెరవగానే నే పైకి వస్తానన్నమాట."

"ముఖ్యమంత్రి డిక్కీ ఎందుకు తెరుస్తాడే పిచ్చిదానా ?"

"ఏమో, పాత రోజులేమన్నా గుర్తొచ్చి ఏదైనా శవం గట్రా వుందా అని తెరిచి చూడొచ్చుగా?"

ముఖ్యమంత్రి మనిషి విశారద ఇల్లు వెతుక్కుంటూ ఎందుకొచ్చాడా అన్న అనుమానం సుధాకర్‌ని తొలిచెయ్యసాగింది.

పద్మావతిని వదిలి తనుకూడా ఆ పాకవైపు నడిచాడు.

లోపల్నుంచి సంభాషణ వినిపిస్తోంది.

సుధాకర్ లోపలికి వెళ్ళే సరికి ఆ వ్యక్తి మాట్లాడటం పూర్తి చేశాడు. "మీరొప్పుకుంటే రేపే ఏర్పాటు చేయిస్తాము" అంటున్నాడు.

"ఈ రోజు సాయంత్రం నేను బోసుని కలుసుకుంటాను. ఆయన్ని అడిగి చెపుతాను" అంది విశారద. ఆ వ్యక్తి ఆశ్చర్యపోయినట్టు కనపడ్డాడు. "మేమే వచ్చి ఈ సాయం చేస్తామంటే ఇక అడిగేదేముంది?" అన్నాడు.

"ఏమో మరి బోసుగారు వప్పుకుంటారో లేదో చూడాలి" అంది.

"సరే రేపు వస్తాను. ఏ విషయమూ చెప్పండి" అని వెళ్ళిపోయాడు.

సుధాకర్ విశారదతో "ఏమిటి విషయం?" అని అడిగాడు.

"ముఖ్యమంత్రి కబురు చేశారు. గోమతికి తమ స్పెషల్ ఫండ్స్ నుంచి ప్లాస్టిక్ సర్జరీ కోసం సహాయం చేస్తారుట."

సుధాకర్ మొహం విప్పారింది. "గుడ్ న్యూస్..." అన్నాడు వూహించలేని సంతోషంతో.

"కానీ దీనికి బోసు ఏమంటాడో?"

"ఇందులో కాదనేది ఏముంది?" ఆశ్చర్యంగా అన్నాడు సుధాకర్. ఆమె సమాధానం చెప్పలేదు. "సాయంత్రం ఇద్దరం కలిసి వెళ్దాంలే" అంటూ అతడు

బయటకొచ్చేసరికి అక్కడ పద్మావతి ఎదురుచూస్తోంది. ఆమె మొహం ఎగ్జయిట్‌మెంట్‌తో వెలిగిపోతోంది.

"ఎందుకొచ్చాడు ముఖ్యమంత్రి మనిషి?" అని అడిగాడు. "మొన్న ముఖ్యమంత్రి మార్నింగ్ షోకి వచ్చినప్పుడు ఎవరో అమ్మాయిని చూశాడట. ఎంక్వయిరీ చేస్తే ఈ స్లమ్స్‌లోనే వుంటుందని చెప్పారట. కబురు పంపాడు" పద్మావతి ఉద్వేగం పట్టలేక పిడికిళ్ళు బిగించి, "ఎవరి గురించి" అని అరిచింది.

"పద్మావతి... అనీ..." నవ్వాపుకుంటూ అన్నాడు.

"నిజమా?... నిజంగా నిజమా?" చేతులు పట్టుకు వూపేసింది.

సుధాకర్ జాలిగా ఆమెవైపు చూస్తూ "ముఖ్యమంత్రి మార్నింగ్ షోకి ఎందుకొస్తాడే పిచ్చి మొహమా? వచ్చినా బ్లాకులో టిక్కెట్లు అమ్ముకునేదాన్ని – నిన్నెందుకు చూస్తాడు? చూసినా నీ అడ్రసు కనుక్కుని మనిషి నెందుకు పంపిస్తాడు" అన్నాడు.

"నా గురించి కాదా?" అంది నిరాశగా.

"కాదులే. బోసు గురించి" అన్నాడు.

పద్మావతి తలవంచుకుని వుంది. ఆమె మొహంలో విచారం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. చిత్రమేమిటంటే ముఖ్యమంత్రి తనను చూసి వరిస్తాడని ఆమె చాలా సిన్సియర్‌గా నమ్ముతోంది. తను వ్రాసింది గొప్ప కథ అనీ, ఎడిటరే చదవకుంటా తిప్పి పంపేసాడనీ కొత్త రచయిత ఎంత సిన్సియర్‌గా అనుకుంటాడో, అలాగే ఆమెకూడా నమ్ముతోంది.

ఆమెని చూస్తే జాలేసింది. అంతలో ఆమె తలెత్తి "నాకీ ప్రపంచం మీదే కోపం వస్తోంది" అంది.

"ఎందుకు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"నేనిలా మనసులో మాట చెప్పేస్తున్నానని ఏమీ అనుకోకు. నాకున్న అందానికి ఇలా బ్లాకులో టిక్కెట్లు అమ్మటం దేనికి? నాకేం తక్కువ?"

"ఈ ప్రపంచంలో ప్రతి మనిషీ తనకున్న అర్హతల గురించి అలాగే అనుకుంటాడు పద్మావతీ! ఈ 'నాకేం తక్కువ' అన్నమాట చాలా నిరర్థకం. నీకేమీ తక్కువ లేకపోతే ఇంత కసి దేనికీ ఈ ప్రపంచంమీద?"

"నన్ను గుర్తించటం లేదీ ప్రపంచం".

దీనికి సమాధానంగా అతడు చెప్పబోయే వాక్యంమీదే తమ జీవితాలు భవిష్యత్తులో నడవబోతున్నాయని వూహించని అతడు చాలా మామూలుగా అన్నాడు. "... గుర్తించాల్సిన అవసరం ప్రపంచానికి లేదు. మనలో ఏముందో ప్రపంచం గుర్తించేలా చేసుకోవలసిన బాధ్యత మనమీదే వుంది. అప్పుడే అది మనకి జోహార్లర్పిస్తుంది. మన కాళ్ళదగ్గరే కుక్కలా పడివుంటుంది".

"ఏమో ఇంకొన్నాళ్ళు చూస్తాను. నాగ్గానీ గుర్తింపు రాకపోయిందో, అడవుల్లో చేరిపోతాను" అంది కోపంగా.

సుధాకర్ నవ్వి, "నీ కోపం చూస్తోంటే నాకు వర్షం కోసం ప్రార్థించిన ప్రభాకరరావు కథ గుర్తొస్తోంది" అన్నాడు.

"ఏమిటా కథ" అంది అనుమానంగా చూస్తూ.

"ప్రభాకరరావు కాంపునించి అకస్మాత్తుగా ఇంటికొచ్చేసరికి బెడ్‌రూమ్‌లోంచి భార్య కిలకిలలు, పరాయి మొగాడి కంఠం వినిపిస్తున్నాయట. గుమ్మం దగ్గర చెప్పులూ, గొడుగూ వున్నాయట. అమితమైన కోపంతో ప్రభాకరరావు గొడుగుని రెండుగా మధ్యకి విరిచేసి, "దేముడా! వర్షం వెంటనే కురిపించు" అని ప్రార్థించాడట.

పద్మావతి మొహం ఉక్రోషంతో కందిపోయింది.

"నువ్వెంత తెలివైనదానివో ప్రపంచం గుర్తించేవరకూ నువ్వు తెలివితక్కువ దానిక్రిందే లెక్క" అన్నాడు. పద్మావతి ధీమాగా తలెగరేసి "చూస్తూ వుండు నేనేమిటో నిరూపిస్తాను తొందర్లోనే" అంది.

* * *

ఆ సాయంత్రం అతను విశారదతో కలిసి జైలుకి వెళ్ళాడు. "గోమతి ఎలా ఉంది?" అడిగాడు బోసు. విశారద జరిగినదంతా చెప్పింది.

అంతా విని సాలోచనగా, మౌనంగా వుండిపోయాడు బోసు. విశారద ఆ మౌనాన్ని ఛేదిస్తూ "ఒక న్యాయానికి నిలబడి గోమతి కళ్ళు పోగొట్టుకుంది. చట్టపరంగా ఆ ధనరాజ్‌ని ముఖ్యమంత్రి ఏమీ చెయ్యలేడు. అందువల్ల కనీసం అన్యాయం జరిగిన వాళ్ళకయినా సాయం చేద్దామని అనుకుని వుంటాడు. గోమతి సర్జరీ ఖర్చులు తను భరిస్తానన్నారు".

"ప్రొద్దున్నించి సాయంత్రం వరకూ ఇలాటి కేసులు ముఖ్యమంత్రికి ఎన్నో వుంటాయి. ఇంతకాలం గుర్తుపెట్టుకుని ఇలా సాయం చేస్తాడనుకోను..." అన్నాడు బోసు.

"నాకూ అలాగే అనిపించింది" అన్నాడు సుధాకర్.

"రాజకీయాల్లో వున్న వాళ్ళకి ఇలాటి కృతజ్ఞతలు వుండవు. ఆ ధనరాజ్ మొదలియార్‌ని జైలుకి పంపించటానికి మనమేమన్నా సాయపడతామేమోనని ప్రయత్నించాడు ఆ ముఖ్యమంత్రి. అంతవరకే ఉంటుంది మనమీద ఇంటరెస్టు".

విశారద కాస్త కోపంగా, "మనుష్యులమీద మీరెందుకు కాస్తయినా నమ్మకం పెంచుకోరు. ఆ ముఖ్యమంత్రే నీ తరఫున లాయర్ని నియమించారు తెలుసా?" అంది.

శ్రోతలిద్దరూ అవాక్కయ్యారు. "నిజమా?" అన్నాడు బోసు ముందు తేరుకుని.

"అవును. ఆ విషయంకూడా, వచ్చిన వ్యక్తే చెప్పాడు" అంది. సుధాకర్ ఏదో 'క్లూ' దొరికినట్టు "నాకు అప్పటినుంచే అనుమానంగా వుంది. 'అంత పెద్ద లాయరు మన తరఫున ఫీజు తీసుకోకుండా ఎందుకు వాదించాడా' అని. ఆ లెక్కన కోర్టులో శిక్ష తక్కువ పడటంలో కూడా ముఖ్యమంత్రి హస్తం వుండి వుండవచ్చు" అన్నాడు. "ఇంతకు ముందు ముఖ్యమంత్రి గురించి నేను చెప్పింది తప్పేమో. అతనికి నిజంగా కృతజ్ఞతాభావం వుందేమో".

విశారద కల్పించుకుని "ఇందులో కృతజ్ఞత ఏముంది? మనం ఆయనకి చేసిందేమీ లేదు" అంది.

"పోనీ అదే. ఒక న్యాయం కోసం నిజాయితీగా చివరివరకూ నిలబడటం... అది ఆయనకు నచ్చి వుంటుంది".

విశారదకు చాలా సంతోషమేసింది. మంచికి ఆ మాత్రమన్నా గుర్తింపు దొరకటం ఆ సంతోషానికి కారణం. ఆ సంతోషంలో "గోమతికి సాయం చేయటానికి కూడా అదే కారణమై వుంటుంది" అంది ఒక ముగింపుకి వచ్చినట్టుగా.

అప్పటివరకూ ఆలోచిస్తున్న బోసు తలెత్తి అడిగాడు. "ఆ ముఖ్యమంత్రి పి.ఏ. మళ్ళీ ఎప్పుడొస్తానన్నాడు ?"

"రేపు.... ఏం?"

బోసు మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. తన తరఫున ఒక పెద్ద క్రిమినల్ లాయరు నియమించబడ్డారంటే – తన విడుదల పట్ల ముఖ్యమంత్రి చాలా ఆసక్తిగా వుండి వుండాలి. ఎందుకా ఆసక్తి? నిశ్చయంగా అది దయ, కరుణవల్ల వచ్చింది కాదు.

ఇప్పుడు తన చెల్లి ఆపరేషన్‌కి అయ్యే ఖర్చులు కూడా ఆయన ఎందుకు భరిస్తానంటున్నాడు?

అతడికెందుకో ఆ ప్రపోజల్ ఇష్టం లేకపోయింది.

కానీ మళ్ళీ ఇంకో ఆలోచన కూడా కలిగింది. ఇప్పటికే తను తన నియమాల్ని చెల్లెలి జీవితం మీద రుద్ది, ఆమె భవిష్యత్తుని సమూలముగా నాశనం చేశాడు. ఇప్పుడు అదృష్టం ఈ రూపంలో వచ్చి తలుపు తడుతూంటే కాదనటానికి తనకేం అధికారం వుంది?

అతడు కొంచెం ఆలోచించి "మళ్ళీ ఆ వ్యక్తి ఎప్పుడొస్తాడు?" అని అడిగాడు మరొకసారి.

"రేపు. ఏం?" అంది విశారద మళ్ళీ.

"ఉచితంగా వద్దు. అప్పుగా అయితే తీసుకుంటామని చెప్పు" అన్నాడు. విశారద ఆశ్చర్యపడింది. అయితే మళ్ళీ ఏమనుకుందో "...సరే" అని వెళ్ళిపోయింది.

సుధాకర్ మాత్రం కదల్లేదు. "ముఖ్యమంత్రి నుంచి దానం తీసుకోవటం నీకెందుకు ఇష్టంలేదు?" అని అడిగాడు.

"ఒకప్పుడయితే మనుష్యులు దానాలు చేస్తారనీ, వాళ్ళ మనసులు మంచివనీ ఎవరైనా చెప్తే నమ్మేవాడిని. కానీ ఇప్పుడా నమ్మకం పోయింది".

"మరి ఆయన ఇదంతా ఎందుకు చేస్తున్నాడంటావ్ ?"

"నాకో అనుమానం వస్తూంది. మస్తాన్‌ని చంపిన మనిషిని నేను. మొదలియార్‌ని పోలీస్ స్టేషన్‌కి లాక్కెళ్ళిన మనిషిని నేను. అలాటి 'నేను' తనవైపు ఉండడం ఆయనకి లాభదాయకం. ఇదంతా దానికోసం వేస్తున్న 'ఎర' గా నేను భావిస్తున్నాను."

సుధాకర్ నమ్మలేనట్టు చూశాడు. ఈ వాస్తవం అర్థం చేసుకోవటానికే అతడికి రెండు నిముషాలు పట్టింది. అతడికి సంతోషం కూడా వేసింది. తన స్నేహితుడు ఒక మెట్టు ఎదిగాడు. ముఖ్యమంత్రి స్వయంగా ఈ లిఫ్టు ఇస్తున్నాడు. అతడికి పద్మావతి కూడా గుర్తొచ్చింది. పాపం ఆ అమ్మాయి ఇటువంటి అవకాశం కోసమే ప్రయత్నిస్తున్నది. ఇప్పుడిది ఆయాచితంగా లభిస్తున్నది. తమలో ఒకరు ముందు ఆశ్రయం పొందితే తరువాత అందరూ బాగుపడవచ్చు. అసలీ వూహే ఎంతో బావుంది.

మనం ఒకప్పుడు ఎంతో గాఢంగా నమ్మిన విషయాలు మరింత ప్రగాఢ విశ్వాసంతో వాదించిన విషయాలు, కాలం గడిచాక మనకే తప్పుగా అనిపించవచ్చు. ఒక అందమయిన అమ్మాయి, తన అందాన్ని ఫణంగాపెట్టి అంచెలంచెలుగా పైకి ఎదుగుతానంటే అది తనకి హాస్యాస్పదంగా కనిపించింది. కానీ ఇప్పుడు తన మిత్రుడి శక్తిని ఒక ప్రముఖ వ్యక్తి గుర్తించాడంటే అది వాస్తవంగా కనపడి సంతోషాన్నిస్తుంది.

ఆ సంతోషంలోనే "మరెందుకు ఆ డబ్బు అప్పుగా తీసుకుని తరువాత తీర్చేస్తానంటున్నావ్?" అని అడిగాడు.

"ఆయనకి రుణపడి వుండటం ఇష్టంలేక" అన్నాడు బోసు.

"మరీ లక్ష రూపాయలు ఎలా తీర్చగలననుకుంటున్నావు?"

బోసు నెమ్మదిగా కళ్ళు పైకెత్తాడు. సుధాకర్ వెనుకవైపు శూన్యంలోకి చూస్తున్నాయి ఆ కళ్ళు. అదే సమయానికి విజిటర్స్ వెళ్ళిపోవలసిన టైముని సూచిస్తూ జైలు గంటలు మోగసాగాయి. సుధాకర్ లేచి తన ప్రశ్నకి ఏం సమాధానం చెపుతాడా అన్నట్టు అలాగే నిలబడి వున్నాడు. బోసు చూపు తిప్పలేదు. తన హృదయాన్ని తనే చదువుకుంటున్నట్టు అన్నాడు.

"నన్ను తన మనిషిగా చేసుకోవటం కోసం ముఖ్యమంత్రి లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టటానికి సిద్ధపడినప్పుడు, నేను నా కోసం లక్ష రూపాయలు సంపాదించుకోలేనా?"

జైలు గంటలు పూర్తయ్యాయి.

# 3

**ఆవేశం** అగ్ని పర్వతమైతే, ఆలోచన మంచు శిఖరం. ఒకటి పెల్లుబుకటానికి ఉద్రూతలాడితే మరొకటి ముందడుగు కూడా ఘనీభవింప చేస్తుంది. రెండింటికి మధ్య సమన్వయం సాధించగలిగే మనిషే గ్రీష్మంలో శీతల పవనంలా సాగిపోగలడు.

కాలం కొలిమిలో అనుభవాల సమ్మెట పోటులు తిని తిని 'నిన్న' నేడయింది. అది 'రేపు'గా వన్నె కెక్కటం కోసం ఎదురుచూస్తోంది. బంగారాన్ని కాల్చి కొడితే వన్నె కెక్కుతుంది. మెడలో ఆభరణ మవుతుంది. ఇనుముని కాల్చి కొడితే సూది తేలుతుంది. అప్పుడది కత్తో, గొడ్డలో అవుతుంది.

...అలాంటి వర్తమానాలు వేయి గడిచాక అతడు జైలునుంచి బయటకొచ్చాడు.

* * *

"మూడు రూపాయల టిక్కెట్టు ముప్పై... మూడు... ముప్పై" బ్లాక్ మార్కెటీర్లు నెమ్మదిగా రహస్యంగా... స్ఫుటంగా, స్పష్టంగా మనుష్యుల మధ్య తిరుగుతూ చెపుతున్నారు.

టిక్కెట్లు హాటుకేకుల్లా అమ్ముడుపోతున్నాయి.

సుధాకర్ సోడా కొట్టు దగ్గర నిలబడి వున్నాడు. జేబులో చిన్న సీసాలో ఉన్న మందు తీసుకుని తాగాలన్న కోరికని అతికష్టంమీద అణుచుకుంటున్నాడు. ఈ కార్యక్రమం పూర్తయి కలెక్షన్ కుట్టి తాలూకు మనిషిని అతని వాటా ఇచ్చేస్తే ఆ

తరువాత తీరిగ్గా రాత్రంతా మందు కొట్టొచ్చు. అందులోనూ ఈ రోజు కలెక్షన్ చాలా గొప్పగా వుంది.

అభిమాన హీరో పిక్చర్ ఆ రోజే రిలీజ్ అయింది. జనం కొట్టుకు చస్తున్నారు.

'షో' ప్రారంభమవుతున్నట్టు బెల్ మ్రోగింది. టిక్కెట్లు అప్పటికే అమ్మేసిన అసిస్టెంట్లు సుధాకర్ దగ్గరకొచ్చేసి కలెక్షన్ డబ్బులిచ్చి తమ బత్తా తీసుకొని వెళ్ళిపోతున్నారు.

పద్మావతి కూడా తీసుకొచ్చి నిలబడింది. డబ్బు లెక్కపెడుతున్న అతన్ని చూస్తూ "ఈ రోజు చాలా హుషారుగా వున్నట్టున్నావే" అంది.

"అవును" అన్నాడు నోట్లు లెక్కపెడుతూనే.

"నీకో మంచివార్త చెప్పనా?"

"ఏమిటది?"

"బోసు జైలునుంచి వచ్చేశాడు".

సుధాకర్ నోట్లు లెక్కపెట్టటం ఆపి – "ఎప్పుడు?" అని అడిగాడు.

"ప్రొద్దున్నే!"

"అరె నాకు తెలీదే. ఎక్కడున్నాడు ఇప్పుడు?"

"నీ వెనుకే!"

సుధాకర్ చప్పున వెనుదిరిగాడు, బోసు నవ్వుతూ నిలబడి వున్నాడు. సుధాకర్ అతని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ "ఇదేమిటి బోసూ! చెప్పా పెట్టకుండా వచ్చేశావు. అసలు నీ రిలీజు డేటు కూడా తెలీదే" అన్నాడు.

"నేనేమన్నా రాజకీయ నాయకుణ్ణా – జైలు బయట దండలు పట్టుకుని నిలబడటానికి" నవ్వేడు బోసు.

"టీ తాగుతావా?"

"వొద్దులే, పద పోదాం".

"ఇదిగో కలెక్షన్ కుట్టి అసిస్టెంట్ కోసం చూస్తున్నా – వాడొస్తే కమీషన్ ఇచ్చేసి పోవచ్చు".

బోసు కొంచెంసేపు మౌనంగా వురుకుని "ఇవ్వకపోతే ఏం చేస్తాడు" అన్నాడు. సుధాకర్‌కి వెంటనే ఆ మాట అర్థంకాలేదు; అర్థమయ్యాక కాస్త అయోమయంగానూ, కాస్త భయంగానూ చూస్తూ – "నీకు తెలీదాభాయ్ ఏమవుతుందో" అన్నాడు.

"నీ వయసెంత సుధాకర్ ?" అడిగాడు బోసు తాపీగా.

"ముప్పై".

"కలెక్షన్ కుట్టి వయసు?"

"ఇరవై ఆరో – ఇరవై ఎనిమిదో ఉంటాయి. ఏం?"

"పది సంవత్సరాల్నుంచీ నువ్వు ఈ టిక్కెట్లు అమ్ముతున్నావు. ఎండలో, వానలో – రాత్రిళ్ళు, పగళ్ళు టిక్కెట్లు అమ్మావు. క్యూల్లో నిల్చున్నావు. పోలీసుల్తో తన్నులు తిన్నావు. పది సంవత్సరాలయ్యేక – ఇప్పుడు – ఇలా ఒక మూల నిల్చుని, నీ ఏజెంట్లు అమ్మిన టిక్కెట్లు డబ్బులు వసూలు చేసుకుంటున్నావు. ఈ థియేటర్ మీద ఈ మాత్రం ఆధిపత్యం సంపాదించేసరికి నీకు ముప్పై సంవత్సరాల వయసు వచ్చేసింది. కలెక్షన్ కుట్టి ఇరవై ఎనిమిదేళ్ళకే అన్ని

థియేటర్ల మీద తన సామ్రాజ్యం స్థాపించుకున్నాడు. అతను ఇలా థియేటర్ల దగ్గర కనీసం నిల్చోను కూడా నిల్చోడు. తన ఇంట్లో డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని అసిస్టెంట్లు తెచ్చి ఇచ్చిన డబ్బు లెక్కబెట్టుకుంటాడు. నీ కన్నా అతడు ఏ విధంగా గొప్ప?"

సుధాకర్ బ్లాంక్‌గా చూశాడు.

"... ఈ ఆలోచన నీకు పది సంవత్సరాల క్రితమే వచ్చినట్టయితే నువ్వే కలెక్షన్ సుధాకర్‌వి అయివుండేవాడివి... ఏమో... ఎవరు చెప్పొచ్చారు? ఆసిడ్ సుధాకర్‌వి కూడా అయివుండేవాడివేమో..."

"బోసూ!"

"తప్పు చేయటం తప్పు కానప్పుడు దాన్ని ఏ లెవల్లో చేస్తేనేం సుధాకర్?"

"కలెక్షన్ కుట్టికి ఈ విషయం తెలిస్తే చంపేస్తాడు. అసలు మనం ఇలా మాట్లాడుకుంటున్నామని కూడా ఈ పాటికి అతనికి తెలిసే వుంటుంది".

"అంటే నీకు లేనిదీ అతడికి వున్నదీ ఒక్కటే.. ధైర్యం! అవునా... ఈ ధైర్యం అనేది అమీబా లాంటిది సుధా! అసలు కనపడదు. కానీ మనిషి రక్తం రుచిచూసిన పులిలాంటిది ఈ ధైర్యం... మస్తాన్ మా ఇంటి మీద విరుచుకుపడతాడేమో అని భయపడ్డాను. భయాన్ని చూసి భయపడటంకన్నా – ధైర్యాన్ని సాయం తెచ్చుకోవటం మంచిదనుకున్నాను. వెళ్ళి ఆ మస్తాన్‌ని పెదాలమీద కాల్చాను. చిత్రమేమిటో తెలుసా సుధా? వాడు మళ్ళీ మా ఇంటికి వచ్చే ధైర్యం చేయలేదు."

"కానీ నువ్వు జైలుకెళ్ళావ్?"

"వాడు చచ్చాడు. అది చెప్పవేం? జైలంటే భయపడతాం మనం. మూడు సంవత్సరాలు అక్కడ గడిపిన నాకు అదంటే భయంపోయింది. ఏ రౌడీ ఇంటికొస్తాడో అన్న భయంతో గడపటం కన్నా ఆ జైలు ఎంతో బావుంది."

"ఇలా మాట్లాడకు బోసూ! నాకు భయంగా వుంది".

"నువ్వు ధైర్యం తెచ్చుకోకపోతే ఈ లెవల్లోనే వుంటావ్ సుధా! నీ అసిస్టెంట్లే ఈ థియేటర్ల మీద అజమాయిషీ సాగిస్తారు. ఆ ఏజెంట్ వస్తే డబ్బులివ్వనని చెప్పు. చూద్దాం ఏం చేస్తాడో?"

"నేనా పని చెయ్యలేను".

"నేను చేస్తాను..."

పక్క నుంచి ఆ మాట వినిపించేసరికి ఇద్దరూ అటు చూశారు. పద్మావతే ముందుకొచ్చింది. "అవును, నేను చేస్తాను" అంది.

"పద్మా..." అన్నాడు సుధాకర్ హెచ్చరిస్తున్నట్టు.

పద్మావతి అంతకన్నా గొంతు హెచ్చించి, "అవును, అసలు నీకే డబ్బులివ్వను. ఏం చేస్తావ్?" అంది. సుధాకర్ కోపంగా, "పిచ్చి పిచ్చిగా మాట్లాడకు" అన్నాడు.

"నేనేం పిచ్చిగా మాట్లాడటంలేదు. బోసుబాబు చెప్పింది నాకు నచ్చింది. ఆ మాటకొస్తే రేపట్నుంచీ నేనే ఈ థియేటర్ దగ్గర టిక్కెట్లు స్వంతంగా అమ్ముకుంటాను. నువ్వూ, ఆ కలెక్షన్ కుట్టి కలిసి ఏం చేస్తారో చూస్తాను" అంది.

బోసు ఆమెవైపే చూస్తూ నిలబడ్డాడు. పద్మావతి కొనసాగించింది. "ఏం చేస్తాడు ఆ కుట్టి? చంపుతాడు. లేకపోతే రేప్ చేస్తాడు. అంతేగా! చెయ్యనీ. అప్పుడు

అవతలి గ్యాంగు నన్ను చేరదీస్తుంది! ఏమీ అవకుండా చారన్నం తినటం కన్నా కత్తిపోట్లు తిని పరమాన్నం భక్షించటం మేలు. అయినా ఏం చేస్తావ్ నువ్వు? నీ డబ్బులు నీ కివ్వను. ఏం చేస్తావో చెయ్యి చూద్దాం" అంది.

అంతలో అక్కడికి మోటర్ సైకిల్ వచ్చి ఆగింది.

కలెక్షన్ కుట్టి అసిస్టెంటు హారన్ మోగించాడు.

"డబ్బులియ్యి" అన్నాడు సుధాకర్ ఆఖరి మాటగా.

"ఇవ్వను" అంది పద్మావతి ఆఖరి నిర్ణయంగా.

మళ్లీ హారన్ అసహనంగా మోగింది.

"పద్మావతీ! నువ్వేం చేస్తున్నావో నీకు అర్థం కావటంలేదు. ఆవేశపడకు".

పద్మావతి జవాబు కూడా చెప్పలేదు. డబ్బు కుచ్చిళ్ళలో దోపుకుంది. హారన్ మళ్ళీ మోగింది. సుధాకర్ అక్కడికి పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. వాళ్ళిద్దరూ మాట్లాడుకోవటం కనిపిస్తోంది. బోసు పద్మావతి వైపు చూశాడు. ఆ అమ్మాయి నిబ్బరంగా నిలబడి వుంది.

సుధాకర్‌తో కలిసి కలెక్షన్ అసిస్టెంటు పద్మావతి దగ్గరికి వచ్చాడు. "ఏవే డబ్బులు?" అని అడిగాడు కర్కశంగా.

పద్మావతి అడుగు వెనక్కివేసింది. అసిస్టెంటు ఆమె రెక్క పట్టుకుని బలంగా ముందుకు తోశాడు. ఆమె గచ్చుమీద పడిపోయింది.

సినిమా జనం ఎవరూ లేరు. షో ప్రారంభమయింది. కేవలం టిక్కెట్లు అమ్మిన కుర్రాళ్ళు, సోడాలవాళ్ళే వున్నారు. ఈ హడావుడికి అందరూ చుట్టూ చేరారు.

"డబ్బులియ్యి" అంటూ కుచ్చిళ్లు పట్టుకుని లాగాడు అసిస్టెంట్. పద్మావతి గింజుకుంటోంది. ఆమె చీర వూడిపోయింది. కానీ డబ్బులు వదల్లేదు. లంగా జాకెట్టుతో నేల మీద నిస్సహాయంగా దొర్లుతూ అసిస్టెంట్‌ని తోసేస్తోంది. పిల్లికి చెలగాటం, ఎలుక్కి ప్రాణసంకటంగా వుంది.

బోసు కల్పించుకోలేదు. సుధాకర్‌నే చూస్తున్నాడు.

ఒక అరుదైన దృశ్యాన్ని వీక్షిస్తున్నట్టు జనం వలయంలా నిలబడి, ఆమె నిస్సహాయ స్థితిని చూస్తున్నారు. ఎంతయినా ఆమె అబల. అతని బలం ముందు నిలవలేకపోతోంది. కలెక్షన్ కుట్టి అసిస్టెంటు ఆమె జాకెట్టులో దోపుకున్న డబ్బు తీయటానికి ప్రయత్నిస్తున్నాడు. చీర కూడా లేకపోవటంతో అతని పని సులువు అవుతోంది.

అక్కడ జరుగుతున్న గొడవ చూసి పోలీసు ఏదో పనున్నట్టు అక్కడనుండి దూరంగా వెళ్ళిపోయాడు.

కలెక్షన్ కుట్టి అసిస్టెంటుకి ఆమె దగ్గర్నుంచి డబ్బు లాక్కోవటం కన్నా, ఈ విధంగా ఆడుకోవటమే బావున్నట్టుంది. ఆమె కుచ్చిళ్ళలో డబ్బు పెట్టుకుంటే చీరలాగాడు. ఇప్పుడు జాకెట్టుంది. దాచుకుంటే మరింత ఉత్సాహంతో దాన్నితీసే ప్రయత్నం చేస్తూ పైశాచిక ఆనందం అనుభవిస్తున్నాడు.

పద్మావతికి దుఃఖం కలుగుతోంది. అతడు చేస్తున్న అత్యాచారం గురించీ, వేస్తున్న చేతుల గురించీ కాదు. ఇంతమంది జనం ముందు యీ విషయం జరుగుతున్నందుకు.

ఆమె జాకెట్‌లోంచి డబ్బుతీసి బయటపడేసే ప్రయత్నం చేసింది. అతడు అసలు దానివైపే చూడలేదు. అప్పటికే అతడు ఆమె సున్నిత భాగాలను తాకటంలో ఆనందం పొందుతున్నాడు. ఇంతమంది ముందు ఆ పనిచేస్తూ వుండటం అతడికి హీరోయిజంలా వుంది. ఆమె జాకెట్‌లో ఇంకా డబ్బులున్నాయన్న మిషమీద "తియ్యవే... తియ్యవే" అంటూ హుక్స్ తెంపటానికి ప్రయత్నించసాగాడు.

బోసుబాబు ఇంకా అలాగే చూస్తూ నిలబడి వున్నాడు. ఒకప్పుడైతే అతడు ఆవేశపడే వాడే. జైలు అతనికి ఓర్పు నేర్పింది. ఏకాంతం అతడికి విచక్షణా జ్ఞానాన్ని యిచ్చింది.

సుధాకర్ మాత్రం కదిలిపోతున్నాడు. అతడి పిడికిళ్ళు బిగుసుకుపోతున్నాయి. మొహంలో రంగులు మారుతున్నాయి. ఒక బోనులో జంతువును బంధించి కర్రల్తో పొడిస్తే అది నిస్సహాయంగా ఎలా తిరుగుతుందో – అలా వున్నాడు. బోసు ఇంకా అతన్నే గమనిస్తున్నాడు.

జీవితం ఒక సంపూర్ణమైన వాక్యం లాటిది. మనం కర్తలం. అనుభవం కర్మ. దానికి మన ప్రతిస్పందన క్రియ. కొందరి జీవితాలు కర్త కర్మలతో ఆగిపోతాయి. మరికొందరి జీవితాలు 'క్రియ' లతో పూర్తవుతాయి. విశేషాలూ, విశ్లేషణలూ మరికొందరికి ఆభరణాలవుతాయి.

అక్కడున్న చాలామంది జనానికి, కలెక్షన్ కుట్టి మనిషి పద్మావతి దగ్గర డబ్బులెందుకు లాక్కుంటున్నాడో అర్థంకాలేదు. బుకింగ్ కౌంటర్ దగ్గర టిక్కెట్లుకొనే మనిషి పద్మావతి. ఆమెకీ కలెక్షన్ కుట్టి మనిషికీ ఎటువంటి

పరిస్థితుల్లోనూ సంబంధం వుండటానికి వీల్లేదు. ఏదైనా గొడవ జరిగితే సుధాకర్‌కీ, కలెక్షన్ కుట్టి మనిషికీ జరగాలి.

అలాటి గొడవలు అప్పుడప్పుడు జరుగుతూ వుంటాయి. కానీ ఇంతసేపు జరగవు. ఎవరో బ్లాక్ మార్కెటీరు చిన్న మోసం చేయటానికి ప్రయత్నిస్తాడు. ఆ విషయం ఎలాగైనా కలెక్షన్ కుట్టికి తెలుస్తుంది. అసిస్టెంట్ వస్తాడు. అయిదు నిముషాలో వ్యవహారం పూర్తయిపోతుంది. మోసం చేయటానికి ప్రయత్నించిన బ్లాక్ మార్కెటీర్ మురిక్కాలువలో తేలతాడు.

ఇక్కడ ఎదురు తిరిగింది స్త్రీ అవటంతో, విషయం రెండు నిముషాల్లో పూర్తికాలేదు.

పద్మావతి జాకెట్ పూర్తిగా వూడిపోయింది. డబ్బు ఎప్పుడో నేలమీద పడిపోయింది. హిస్టీరియా వచ్చినదాన్లా దొర్లుతూ ఆమె అతడిని దూరంగా వుంచటం కోసం శతవిధాల ప్రయత్నిస్తోంది. చేతుల్తో తోసేస్తుంది. మళ్ళీ అంతలోనే తన పరిస్థితి గుర్తొచ్చి, వక్షస్థలాన్ని ఒక చేత్తో కప్పుకొంటూంది.

ప్యారిస్, రోమ్ నగరాల్లో 'బుల్ ఫైట్స్' జరిగేటప్పుడు, ఆ ఎద్దు పూర్తిగా నిర్వీర్యమైపోయిందని తెలిసినా, దానితో పోరాడేవాడు దాన్ని వెంటనే చంపడు. మరింత నిస్సహాయంచేసి, అది ప్రాణభయంతో... కొన ప్రాణంతో కొట్టుకుంటుంటే, ప్రేక్షకుల సాడిస్టు హర్షధ్వానాల మధ్య దాని నుదుటిలోకి ఆఖరి కత్తి దింపుతాడు.

ప్రస్తుతం అక్కడ జరుగుతున్నది అదే. జనం చూస్తున్నకొద్దీ అతను రెచ్చిపోతున్నాడు. చుట్టూవున్న జనం నిస్సహాయంగా, సానుభూతిగా

చూస్తున్నారు. పద్మావతి మంచిపిల్ల అని అక్కడివారికి తెలుసు. చురుగ్గా, తన పని తాను చేసుకుపోతూ, అందరితోనూ హుషారుగా కబుర్లు చెప్పే ఆ అమ్మాయి ఆ క్షణం ఆ రకంగా పడి కొట్టుకుంటూంటే, వెళ్ళి సాయం చేసే ధైర్యం ఎవరికీ లేకపోయింది.

"ఇంకా ఎక్కడెక్కడ దాచావే డబ్బు? ...తియ్యి " అంటూ మోకాలిమీద చెయ్యి వేసి ఆఖరి ఆచ్ఛాదన తొలగించబోయాడు.

అప్పుడు కదిలాడు సుధాకర్. బెలూన్ నిండా గాలినింపి గట్టిగా వత్తితే ఎలా పేలుతుందో, అతడిలో ఆవేశం అలా పేలింది. అప్పటికే అతడు కుతకుతా ఉడుకుతున్నాడు. పద్మావతి మీద అతడికి వాత్సల్యం వుంది; ఆప్యాయత వుంది. అప్పటివరకూ అతడు తన ప్రాణం గురించీ, భవిష్యత్ మనుగడ గురించీ భయపడ్డాడు. కానీ కళ్ళెదుట జరుగుతున్నది ప్రాణంకన్నా ఎక్కువైనదిగా తోచింది. తుఫానులా వెళ్ళి కుట్టి అసిస్టెంటు మీద పడ్డాడు.

ఆ సమయానికి వాడు పద్మావతి మోకాలి మీదనుంచి చెయ్యి పైకి జరపటానికి ప్రయత్నిస్తున్నాడు. సుధాకర్ వెళ్ళి విసురుగా వాడి మీద పడేసరికి – ఆ వూపుకి ఇద్దరూ కలిసి దూరంగా పడ్డారు. ఊహించని ఈ సంఘటనకి వాడు బిత్తరపోయి, తేరుకునే లోపులో సుధాకర్ వాడి కాళ్ళమధ్య తన మోకాలితో బలంగా కొట్టాడు. వాడు చేసిన ఆర్తనాదం అక్కడ ప్రతిధ్వనించింది. సుధాకర్ వాడి బాధ గమనించలేదు. పిడికిలి బిగించి దవడమీద బలంగా కొట్టాడు. వాడు వెళ్ళి జనం మధ్యలో పడ్డాడు.

అక్కడున్న వాళ్ళందరూ చిన్నసైజు బ్లాక్ మార్కెటీర్లు, జేబులు కొట్టేవాళ్ళు, బ్రోకర్లు వగైరా! కేవలం కలెక్షన్ కుట్టి అసిస్టెంటు అయినందుకు తమమీద అధికారం చెలాయిస్తూ వచ్చిన ఆ వ్యక్తిమీద వారికి చాలా కక్ష వుంది. ఒక్కొక్కరూ అయితే ఏమీ చేయలేకపోయేవారేమో కానీ, అందరిమధ్యా వాడొచ్చి పడేసరికి ప్రతీవాళ్ళూ – అందినచోటల్లా తన్నారు.

రెండు నిముషాలు గడిచేసరికి కలెక్షన్ కుట్టి అసిస్టెంటు మురిక్కాలువలో పడి వున్నాడు. అతడికి స్పృహలేదు.

పద్మావతి మోకాళ్లమీద కూర్చుని ఏడుస్తోంది. బోసు ఆమె దగ్గిరగా వెళ్ళి చీర కప్పాడు.

అతడు ఇంతసేపూ మౌనంగా వున్నాడు. సుధాకర్ కుట్టి అసిస్టెంటును కొడుతున్నప్పుడు కూడా కల్పించుకోలేదు. సుధాకర్ అక్కడ గుమిగూడిన వాళ్ళందర్నీ "పొండి, పొండి... ఇక్కడ మీకేం పని" అంటూ తోలేశాడు.

ఈ లోపు పద్మావతి చీర కట్టుకుంది. కట్టుకుంది – అనటం కంటే, చుట్టుకుంది అనటం బావుంటుంది. ఆమెని అక్కడనుంచి థియేటర్ బయటకు తీసుకొచ్చాడు. అక్కడంతా చీకటిగా వుంది. పద్మావతి నిశ్శబ్దంగా వెక్కుతూ వుండటం చూసి అతడామెమీద చెయ్యివేసి లాలనగా "ఊరుకో పద్మా, ఇప్పుడేమయిందనీ " అన్నాడు. ఆ మాత్రం ఓదార్పుకే ఆమె బరస్ట్ అయి, అతడి భుజంమీద తలవాల్చి ఏడ్చేసింది.

కొంచెం సేపు ఆమెని అలాగే ఏడవనిచ్చాడు. కాస్త తేలికపడ్డాక మంద్రస్వరంతో అతనన్నాడు, "ఇప్పుడు నువ్వు ఏడ్చావు చూడు పద్మావతీ...

దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం నేనిలాగే రోదించాను. నాకప్పుడు ఓదార్పు నిచ్చేవారు కూడా ఎవరూ లేరు. నా తండ్రి నిస్సహాయ స్థితిలో ఆత్మహత్య చేసుకున్నప్పుడు, నా ఇంటికి రౌడీలు వచ్చి, అల్లరి చేస్తామని బెదిరించినప్పుడు, నా చెల్లెలి మొహం కాలిపోయినప్పుడు, చేయని నేరానికి జైలుకి వెళ్ళినప్పుడు... ఇంతకన్నా బిగ్గరగా రోదించాను. మనం తప్ప మన దుఃఖాన్ని ఎవరూ పంచుకోరు అని అర్థమవటానికి నాకు సుదీర్ఘమైన మూడు సంవత్సరాలు పట్టింది. కానీ ఒక్కవిషయం గుర్తుంచుకో. కన్నీళ్ళు ఖాళీ అయితే, హృదయపు పాత్ర మళ్ళీ దాహంతో మరో వేదన కోసం ఎదురు చూస్తుంది. వాటిని అసలు పట్టించుకోకపోతే హృదయం, మచ్చిక చేసిన జంతువల్లే నువ్వు చెప్పిన మాట వింటుంది".

పద్మావతి తన దుఃఖం మాని అతడివైపు ఆశ్చర్యంగా చూడసాగింది. అతడు చీకట్లోకి చూస్తూ నడుస్తున్నాడు. అతడి కళ్ళు నిస్తేజంగా శూన్యానికీ – అంధకారానికీ మధ్య వున్న రేఖవైపు శోధిస్తున్నట్టు వున్నాయి. గుండెల్లో భావం గొంతులో ప్రకంపనమైంది. అప్పటివరకూ అతడు తన జీవితానికి ప్రేక్షకుడు. ఇప్పుడు తనే ప్రయోక్తలా జీవితసారాన్ని చెపుతున్నాడు.

"నేనీరోజు అవమానం పాలయ్యాను. అవమానం, ఆకలి, వేదన, నిస్సహాయత, దుఃఖం – ఇవన్నీ మన సోపానాలు. దిగితే క్రిందికి వెళతాము! ఎక్కితే పైకి వెళతాం! సోపానాలు మాత్రం అలాగే వుంటాయి. ఏ బాధా అనుభవించకుండా ఎవరూ పైకి రాలేరు పద్మావతీ. కొందరు బాధల్తో రాజీ పడతారు. మరికొందరు బాధలకి కృంగిపోతారు. కొందరు... కేవలం కొందరు

మాత్రమే బాధల్ని తమ సోపానాలు చేసుకుంటారు. నీలో కోర్కెవుంది. దానికి మొదటి అడుగువేశావు. దెబ్బతిన్నావు. ఫర్వాలేదు పద్మావతీ. ఈ అనుభవంతో రెండో అడుగువెయ్యి. ఈ అనుభవం దానికి తోడ్పడుతుంది. జీవితమంటే పుట్టటం – చావటం కాదు. ఈ రెండింటి మధ్యా ఏం చేశామన్నది జీవితం. అక్కడున్న అంతమంది మొగవాళ్ళకన్నా నువ్వు ధైర్యస్థురాలివని అక్కడున్న అందరికీ అర్థమైంది కదా. అది ఈ రోజు సాధించిన విజయమనుకో".

వెనుకనుంచి సుధాకర్ వచ్చి కలిశాడు.

ముగ్గురూ మౌనంగా తమ నివాసాలవైపు సాగిపోయారు.

## 4

"**ఎందుకిన్ని** గొడవలు?" అంది విశారద దిగులుగా.

గోమతి కూడా వ్యాకులం చెందినట్టు కనిపించింది.

బోసు నవ్వేడు. "ఈ మాటలకి గోమతి భయపడిందంటే అర్థం వుంది. కానీ నువ్వెందుకు దీన్ని గొ...డ...వ అంటున్నావో అర్థం కాలేదు".

"అంటే? అన్నిటినీ అందరూ సమానంగా అనుభవించాలని నీ ఉద్దేశం కదా. మేము రాత్రింబవళ్ళు క్యూలో నిలబడి టిక్కెట్లు కొని అమ్ముతాం. వాడు నలుగురు గూండాలని పెట్టుకుని, మా దగ్గిర 'దందా' వసూలు చేస్తాడు. దీన్ని ఎదుర్కోమనేగా నీ సిద్దాంతం"

"నా సిద్ధాంతం బ్లాక్ మార్కెట్‌లో సమసమాజం ఎలా వస్తుందని కాదు. అసలు బ్లాక్ మార్కెట్ అనేది వుండకూడదని".

"దానికేం చేస్తావు?"

"పోలీసులకి కంప్లయింట్ ఇవ్వాలి..."

"నా చెల్లెలి మొహంమీద నడిబజార్లో ఆసిడ్ పోసేరని కంప్లయిట్ ఇస్తేనే పోలీసులు ఏమీ చేయలేకపోయారు. ఇక ఈ బ్లాక్ మార్కెటీర్లని ఏం చెయ్యగలరు?"

"అందరూ సంఘటితమై ఈ బ్లాక్ మార్కెటీర్లని ఎదుర్కోవాలి. ధియేటర్ల యజమాన్లు ఈ సిస్టమ్‌ని ఆపుచేసేలా ధర్నా చెయ్యాలి. బ్లాక్‌లో టిక్కెట్లు కొనకూడదనే చైతన్యం ప్రజలలో కలిగించేలా చేయాలి... ఆగు! నువ్వు చెప్పబోయేది కూడా నాకు తెలుసు. ఇదంతా అయ్యేసరికి ఎన్ని వందల సంవత్సరాలు పడుతుంది – అని వ్యంగ్యంగా అడగబోతున్నావ్ – అవునా? కానీ ఎక్కడో ఒకచోట ప్రారంభమయితే, అది అంతా వ్యాప్తిస్తుంది. ప్రస్తుతం సారా ఉద్యమంలా..."

"తన సామ్రాజ్యాన్ని వదులుకోవటానికి కలెక్షన్ కుట్టి ఎలా ఇష్టపడడో, వందల కోట్ల లాభాల్ని ఆర్జించిపెట్టే సారా వ్యాపారాన్ని కూడా ప్రభుత్వం వదులుకోదు. అయినా నా ప్రశ్న అదికాదు. బ్లాక్ మార్కెట్‌లో టిక్కెట్లు అమ్మటం మానెయ్యమన్నావ్. మరి సుధాకరు, పద్మావతిలాటి వందలమంది ఎలా బ్రతుకుతారు?"

"చెరుకు రసం అమ్ముకుని – ఫుట్‌పాత్ మీద బూట్ పాలిష్ చేసుకుని" స్థిరంగా అంది.

"నలుగురు గూండాల్తో కలెక్షన్ కుట్టి కార్లలో తిరుగుతూ వుంటే, వీళ్ళు మాత్రం ఫుట్‌పాత్ పక్కన ఎండలో రోజంతా పని చేయాలా?" అంతకన్నా గట్టిగా అన్నాడు.

"మనం ఆలోచించవలసింది కార్ల గురించీ, భవంతుల గురించీ కాదు" అంది. మరింత స్వరం హెచ్చించి, "మనం ఆలోచించవలసింది మనకన్నా తక్కువ స్థాయిలో వున్నవాళ్ళ గురించి, మనకి కనీసం రెండు పూటలా తిండి, వుండటానికి ఒక పాక వున్నాయి. వాళ్ళని మన స్థాయికి తీసుకు రావటం ఎలా అని ఆలోచించాలే తప్ప, మనం కార్లలో తిరగటం ఎలా అని ఆలోచించకూడదు..."

"త్రాసుని ఒకవైపు పైకి లేపాలంటే మరోవైపు క్రిందికి దింపాలి. రెండూ పైకి లేవాలంటే భారతదేశపు వనరులు సరిపోవు".

"అన్నయ్యా" అంది గోమతి ఈ వాదన ఇక ఆపుచెయ్యమన్నట్టుగా. ఆమె మొహం ఇప్పుడు చూడటానికి కాస్త తెరిపిగా వుంది.

బోసు ఏదో చెప్పబోతూంటే బయట ఒక్కసారిగా గొడవ పెద్దదయింది.

బోసు చప్పున బయటకొచ్చాడు.

దూరంగా ఒక పాక తగలబడిపోతుంది. జనం ఆ పాకలోంచి సామాన్లు బయటకు తీసుకురాలేక అవస్థ పడుతున్నారు. పక్క పాకలవాళ్ళు గాలికి ఆ మంటలు తమ ఇంటివైపు రాకుండా తమ ఇళ్ళని నీళ్ళతో తడుపుతున్నారు. అంతా హడావుడిగానూ, గగ్గోలుగానూ వుంది.

ఆ పాక సుధాకర్‌ది.

* * *

అంతా పూర్తయ్యేసరికి అర్థరాత్రి దాటి రెండు గంటలయింది. అదృష్టవశాత్తు పక్క ఇళ్ళు అంటుకోలేదు. సుధాకర్ పాక మాత్రం పూర్తిగా తగలబడి, బూడిద కుప్పగా మారింది.

సుధాకర్ ఏమీ మాట్లాడకుండా దూరంగా కూర్చుని వున్నాడు. నాలుగైదు వేలదాకా నష్టం జరిగి వుంటుంది. కొందరికి అది చాలా చిన్న మొత్తమేమో కానీ, సుధాకర్‌కి మాత్రం అది చాలా పెద్ద నష్టమే. మొత్తం కూడబెట్టినదంతా పోయింది. మళ్ళీ అలా కూడబెట్టాలంటే ఇంకో రెండు సంవత్సరాలు సంపాదించాలి.

ఆ రాత్రి థియేటర్ దగ్గిర తాము చేసిన పనికి కలెక్షన్ కుట్టి రియాక్ట్ అవుతాడని తెలుసుకానీ, మరీ ఇంత తొందరగా ప్రతీకారం – అదీ ఇంత పెద్ద ఎత్తులో తీసుకుంటాడనీ అనుకోలేదు.

ఈ సంఘటనవల్ల బాగా కదిలిపోయింది పద్మావతి. "ఇదంతా నా వల్లే... నా వల్లే" అని బాధపడసాగింది.

బోసు మౌనంగా అక్కడినుంచి కదిలి తన ఇంటికి వచ్చాడు. పెట్టి తెరిచి డబ్బు జేబులో పెట్టుకుంటూన్న బోసుని చూసి విశారద ఆశ్చర్యంగా, "ఇంత రాత్రి ఎక్కడికి?" అని అడిగింది.

"మనం ఇంతకుముందు ఏం మాట్లాడుకుంటున్నాం? భూసంస్కరణల గురించి కదూ –" అన్నాడు.

జరిగిపోయిన వినాశనాన్ని మర్చిపోయి, అతడు మామూలుగా అలా మాట్లాడటం చూసి, విశారద అయోమయంగా, "ఇప్పుడా ప్రసక్తి మళ్ళీ దేనికీ?" అంది.

"తాము దున్నే భూమిమీద హక్కు కోసం రైతులు ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తారు. చట్టమూ, పోలీసులూ కామందుని కాపాడతారు. లాయర్లు లొసుగులు వెతుకుతారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం కూడా ఈ కామందులమీదా, మేధావులమీదా ఆధారపడుతుంది. గూండాలు పొలాల్ని కాపాడతారు. యుద్ధం తప్పదు. ఎక్కడ పోరాటం వుంటుందో అక్కడ విధ్యంసం తప్పదు".

అతడు బయటకు నడిచాడు.

సుధాకర్ ఇంకా అలాగే చీకట్లో కూర్చుని వున్నాడు. పక్కనే పద్మావతి వుంది. బోసు అతని దగ్గరకి వెళ్ళి...."బాధపడున్నావా ?" అన్నాడు.

"లేదు... " అన్నాడు సుధాకర్. "కసితో రగిలిపోతున్నాను".

బోసు వాచీ చూసుకున్నాడు. "ఇప్పుడు రెండున్నర కావొస్తుంది. పోలీస్ స్టేషన్ కెళ్ళు. ఎవరో నీ పాక తగలబెట్టారని కంప్లెయింట్ ఇవ్వు. కంప్లెయింట్ కాదు ముఖ్యం. మూడునుంచీ నాలుగు వరకూ నువ్వు పోలీస్ స్టేషన్‌లో వుండాలి. అదీ ముఖ్యం. నీ రిపోర్టులో టైమింగ్స్ వెయ్యి. పోలీస్ స్టేషన్‌లో నీ దగ్గర రిపోర్టు తీసుకునే వ్యక్తి నిన్ను గుర్తు పెట్టుకునేలా చెయ్యి..."

"ఇది... ఇదంతా ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు సుధాకర్.

"చెపుతాను. సరిగ్గా మూడింటికి పోలీస్ స్టేషన్‌కి చేరుకునేలా బయల్దేరు" అని పద్మావతి వైపు తిరిగి నవ్వుతూ, "నువ్వు కసితో రగిలి పోవటంలేదా?" అన్నాడు.

"చాలా?"

"నాతో రా".

*　　　*　　　*

చాలా చిన్న సందు అది. బాగా చీకటిగా వుంది.

వాళ్ళిద్దరూ నడుస్తూంటే వీధికుక్కలు బిగ్గరగా మొరుగుతున్నాయి. ఆ శబ్దం తప్ప మరేమీ అలికిడి లేదు.

బోసు చిన్న ఇంటిముందు ఆగాడు. తలుపుమీద గట్టిగా కొట్టాడు. రెండు నిముషాల తర్వాత "ఎవరూ..." అన్న మాట వినిపించింది.

"పార్టీ...."

లోపల్నుంచి తలుపు తీసిన చప్పుడు. లోపలి వ్యక్తి తలుపు పూర్తిగా తీయకుండా మొహం బయట పెట్టి, "ఏం కావాలి?" అన్నాడు నిద్రమత్తు నిండిన గొంతుతో.

"తిలవయ్యూరు స్వామి లేడా?"

"నేనే... ఏం కావాలి?"

అతడి తెలుగులో స్పష్టతకి ఆశ్చర్యపడుతూ "ప్రొడక్టు కావాలి" అన్నాడు.

తిలవయ్యూరు స్వామి మొహం చిట్లించి "....ఎవరు నువ్వు?" అన్నాడు.

"రణసింఘె రత్నాయికే, నేనూ మొన్నటివరకూ ఒకే జైల్లో ఉన్నాం. నీ అడ్రసు అతనే చెప్పాడు".

"నీ నెంబరు?"

జైల్లో తన నెంబరూ, సెల్ నెంబరూ చెప్పాడు బోసు, రత్నాయికే కూడా అదే జైలు. ఆ నమ్మకం కుదిరాక తిలవయ్యూరు స్వామి తలుపు తీసి, వాళ్ళని

లోపలికి ఆహ్వానించాడు. పొడవాటి వరండా... చీకటిగా వుంది. ఇనుప గ్రిల్స్ ఉన్నాయి. బయట ఇరుకు సందుకీ, లోపల ఇంటికీ సంబంధంలేదు. పద్మావతి ఇదంతా ఆశ్చర్యంగా చూస్తూ వాళ్ళ సంభాషణ వింటూంది.

"ఈ మధ్య పోలీసు నిఘా ఎక్కువయింది. అందుకే ఇన్ని జాగ్రత్తలు. అన్నట్టు నీకేం కావాలి?"

"థవుజెండ్ పిన్ బాంబులు.... నాలుగు" జేబులోంచి డబ్బుతీస్తూ అన్నాడు.

తిలవయ్యూరు స్వామి లోపలికివెళ్ళి వాటిని తీసుకొచ్చి అందజేసి, డబ్బులు తీసుకున్నాడు. "మా విషయం యెవరికీ తెలియకూడదు" అన్నాడు బోసు, ప్లాస్టిక్ సంచి తీసుకుంటూ.

"ఈ వ్యాపారంలో నాకు పాతిక సంవత్సరాల అనుభవం వుంది".

"వెళ్ళొస్తాం".

"మంచిది".

బోసూ, పద్మావతి బయటికొచ్చారు. బోసు టైమ్ చూసుకున్నాడు. మూడయింది. అప్పటివరకూ యిక ఉండబట్టలేనట్టూ పద్మావతి అడిగింది – "ఇదంతా నాకేమీ అర్థం కావటంలేదు. మనం ఎక్కడికి వెళుతున్నాం?"

"కలెక్షన్ కుట్టి ఇంటికి"

ఆమె శ్వాస పీల్చుకోవటం కూడా మర్చిపోయినట్లు క్షణం ఆగి, తిరిగి నడక కొనసాగించింది. లోపల్నుంచి ఉత్సాహం తన్నుకొస్తూండగా "భలే..." అంది. చిన్నపిల్లాడు తండ్రితో కలిసి దీపావళి సామానులు యింటికి తీసుకొచ్చేటప్పుడు ఎలా సంబరపడతాడో – అలా ఉందామెకి.

"అవునూ..." ఏదో జ్ఞాపకం వచ్చినట్లు అడిగింది. "ఈ తిలవయ్యారు స్వామి, ఈ బాంబులూ, అడ్రసులూ నీకెలా తెలిశాయి? అసలు అప్పటి బోసులా లేవు నువ్వు. ఇవన్నీ ఎవరు నేర్పారు నీకు?"

"జైలు" క్లుప్తంగా అన్నాడు.

* * *

"నువ్విక్కడే వుండు" అని చెప్పాడు బోసు. అతడు వెళ్ళి కలెక్షన్ కుట్టి ఇంటిని జాగ్రత్తగా పరిశీలించాడు. అతడి ఉద్దేశం వ్యక్తుల్ని చంపటం కాదు. "నువ్వేం చేస్తే మేమూ అది చెయ్యగల" మని చెప్పటం.

ముందు చిన్న స్థలం వుంది. చెక్క గ్రిల్స్ ఉన్నాయి. వరండాలో నలుగురైదుగురు అసిస్టెంట్స్ నిద్రపోతున్నారు. వెనుక గదిలో ఫ్యాను చప్పుడు వినిపిస్తోంది.

బోసు వెనుకవైపుకు వెళ్ళాడు.

వంటింటి కిటికీ తెరిచే వుంది. వెనుకవైపు కూడా గ్రిల్స్ వున్నాయి. వరండా ఖాళీగా వుంది.

సమయం మూడూ అయిదయింది. అందరూ ఆ సమయంలో గాఢనిద్రలో వుంటారనేదాంట్లో అనుమానం లేదు.

బోసు వెనక్కి వచ్చాడు. పద్మావతి ఆత్రంగా అతడి కోసం ఎదురుచూస్తోంది. బోసు ఆమెకి ప్లాస్టిక్ సంచి ఇచ్చాడు. "వెనుక వసారా మీదకి విసురు. విసిరేముందు ఆ హుక్ తీసెయ్యి. విసరగానే వెనక్కి వచ్చెయ్యి. అది పేలకపోతే మళ్ళీ ఇంకొకటి విసరాలి. ఇంటిమీద విసరకు..."

ఆమె తలూపింది. అతడు అలాగే దూరంగా నిలబడి వున్నాడు. ఆమె సంచిని పట్టుకున్న తీరుచూస్తే – ఎంత కసితో వున్నదో అర్థమవుతుంది.

ఆమె ప్రహరిలోంచి భవంతి దగ్గరికి వెళ్ళింది. వెనుక వైపుగా వెళ్తూండగా కాలిన బూడిద కనబడింది. ఆమెకు తగలబడిన సుధాకర్ ఇల్లు గుర్తొచ్చింది. ఆ పాక తగలబెట్టినవాళ్ళు ముందు వసారాలోనే పడుకుని వున్నారు. చిన్నసైజు గూండాలు వాళ్ళు. పెద్దగా సెక్యూరిటీ కూడా ఏమీలేదు.

దూరంనుంచి చూస్తున్న బోసుకి – ఆమె తిరిగి ఇంటిముందు భాగానికి ఎందుకు వస్తుందో అర్థంకాలేదు. వెనుకవైపు ఎవరన్నా నిద్రలేచారా? అనుకున్నాడు. ఆమె కోరిక తీర్చటం కోసం అనవసరంగా ఆమెని అపాయంలోకి తోసానా? అనికూడా భయపడ్డాడు.

పద్మావతి ఇవేమీ తెలీదు. ఆమె కళ్ళముందు దగ్ధమవుతున్న పాక వుంది. నిస్సహాయంగా కూర్చున్న సుధాకర్ కనపడుతున్నాడు.

ముందువైపు వరండాలోకి తొంగిచూసింది. నలుగురయిదుగురు అసిస్టెంట్లు పడుకుని వున్నారు. అందులో....

తన చీరె విప్పి అల్లరి చేసిన అసిస్టెంటు కూడా వున్నాడు.

అంతే!!

ఆమె ఇక ఆలోచించలేదు. పర్యవసానాలను లెక్క చేయలేదు. హుక్ తీసి, బాంబుని వరండాలో గ్రిల్ గుండా లోపలికి జారవిడిచింది. ఒకటి రెండు క్షణాలు నిశ్శబ్దం. ఆ తరువాత పెద్ద శబ్దంతో విస్ఫోటనం.

ఆమె కదల్లేదు. అసలు చెదరలేదు కూడా. తనని థియేటర్ బయట గచ్చుమీద పొర్లాడించిన గూండా శరీరం గాలిలోకి ఎగిరిపడటం కళ్ళారా చూడటానికా అన్నట్టు ఆ మంటల వేడిని సహించింది. తన ప్రాణాల్ని కూడా లెక్కచేయలేదు.

ఆ తరువాత రెండో బాంబు తీసి ఇంటిమీదకు విసిరింది. అది పేలకముందే మూడోది... తరువాత నాలుగోది.

బోసుకి ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపులో బ్రహ్మాండం అదిరి పోయేలాటి శబ్దంతో ఆ ఇల్లు తునాతునకలయిపోయింది. ఎంతమంది చచ్చారో శవాలు కూడా లెక్క తెలియకుండా మండిపోయింది.

ఆమె అతని దగ్గిరగా వచ్చి "...పద బోసూ" అంది.

బోసు, పద్మావతి తిరిగి ఇంటికొచ్చేసరికి తెల తెల వారుతూంది. తిరిగి వస్తూండగా వాళ్ళిద్దరూ దాదాపు ఏమీ మాట్లాడుకోలేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

పద్మావతి అయితే ఏదో కలలో వున్నదాన్లా నడుస్తూ వుంది. ఆమె మనసు ఏ ఊహాలోకాల్లోనో తేలిపోతున్నట్టు వుంది. చాలా సింపుల్‌గా అయిపోయింది . ఏదో సినిమాలో జరిగినట్టుగా వుంది.

మొదటి మర్డరు చేసేవరకే అదంటే భయంగానూ, ఏదో పెద్ద వ్యవహారం లాగానూ ఉంటుంది. ఒక్కసారి అనుభవం వచ్చాక చాలా సాధారణ విషయంలాగా కనబడుతూంది అది. ప్రస్తుతం పద్మావతి పరిస్థితి అలాగే వుంది. పక్కన నడుస్తూన్న బోసు ఒక అద్భుతమైన వ్యక్తిలాగా కనపడుతూన్నాడు. చాలా

కమ్‌గా వెళ్ళటం, క్లుప్తంగా మాట్లాడి బాంబులు కొనటం... అవన్నీ సరే... ఇక్కడ సుధాకర్ పాక తగలబడిన రెండు గంటల్లోగా అక్కడ కలెక్షన్ కుట్టి ఇల్లు పేల్చేయటం – అదీ అద్భుతముగా తోచింది. ఇప్పుడు కుట్టి మనుష్యులు ఏమవుతారు?...ఈ విషయం తెలిసి భయంతో ఎలా వణికిపోతూ వుంటారు? వాళ్ళ అనుమానం ఎవరి మీదకు వెళుతుంది? సుధాకర్‌ని పోలీస్ స్టేషన్‌కి పంపటంలోనే బోసు తెలివితేటలు కనపడుతున్నాయి.

'ఇదంతా నేనే చేశాను' అని వాళ్ళందరి ముందూ గర్వంగా చెప్పాలన్న కోరిక బలంగా బలపడుతోంది. వాళ్ళు వణికిపోతుంటే నవ్వుతూ చూడాలనిపిస్తోంది. ఇన్నాళ్ళు... ఎన్నేళ్ళు... తమ శక్తినీ, శ్రమనీ దోచుకున్నారు వాళ్ళు! ఎవరైనా ఎదురు తిరిగితే ఎంత నిర్ధాక్షిణ్యంగా కొట్టిరక్తం చిందించేవాళ్ళు... ఇంత సులభంగా వాళ్ళ పీడ వదిలించుకోవచ్చని తెలిసివుంటే ఇన్నేళ్ళు వాళ్ళకి 'దందా' చెల్లించే అవసరం లేకపోయేదికదా – అని విచారించింది.

లోపలికంటా బలంగా వేళ్ళూనిన ఒక వృక్షపు పక్క కాండాన్ని తెగనరికి అదే అంతిమ విజయం అని పొరపాటు పడుతోందని ఆమెకు ఆ క్షణాన తెలీదు.

## 5

**ధనరాజ్ మొదలియార్** అహమ్మద్‌వైపు సూటిగా చూశాడు. చాలాసేపు మాట్లాడలేదు.

గతరాత్రి – తెల్లవారుఝామున కలెక్షన్ కుట్టి ఇంటిమీద బాంబులు వేశారనీ, కుట్టితో సహా ఆరుగురు మరణించారనీ ప్రొద్దున్నే వార్త వచ్చింది.

ముందతను నమ్మలేదు.

అసలా ప్రాంతంలో గాంగ్‌వార్‌లు లేవు. బాంబులు ఉపయోగించరు. కుట్టిలాటి మొదలియార్ మనుష్యుల మీదనయితే అసలు ఆ ప్రసక్తే లేదు.

కానీ ఇది జరిగింది!

మొదలియార్ అందుకే ఆలోచిస్తున్నాడు. ఈ పని ఎవరు చేసి వుంటారు... ఈ పని ఎవరు చేసి వుంటారా... అని....?

కలెక్షన్ కుట్టి పోవటం ఒక రకంగా పెద్ద దెబ్బే. నగరంలో మొత్తం హాల్స్ అన్నిటినీ ఒక్క తాటిమీదకి తెచ్చింది కుట్టియే! అంతకు ముందు ఏ హాల్‌కి సంబంధించిన బ్లాక్ మార్కెటీర్లు ఆ హాల్‌కి వుండేవారు. అందరూ తమకి 'దందా' ఇవ్వాలని అతడు నిర్దేశించినప్పుడు చాలా మంది లోకల్ గూండాల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఆరేడు మర్డర్లు చేసేక అందరూ తలవొగ్గి సామంతులయ్యారు.

వాళ్ళేమన్నా ఇప్పుడు కక్ష తీర్చుకున్నారా?

అయ్యుండడానికి వీల్లేదు, ఎందుకంటే – ఈ వ్యవహారమంతా జరిగి పది సంవత్సరాలైంది. 'పగ' ఇంతకాలం వుండదు. అదీగాక వాళ్ళందరూ థియేటర్ల దగ్గిర బ్లాకులో టిక్కెట్లు అమ్ముకునేవాళ్ళు. వారికి ఈ విధంగా బాంబులేసే ధైర్యం వుండదు. పోలీసు కనపడితే పారిపోతారు లేదా – ఎక్కువలో ఎక్కువ – జేబులోంచి చిన్న చాకు తీస్తారు.

"ఈ మధ్య కుట్టికి ఎవరితోనైనా గొడవలు జరిగాయా?" అడిగాడు మొదలియార్.

"లేదు. అసలు కుట్టి బయటకు పోరుకదా" అహమ్మద్ జవాబిచ్చాడు.

"పోలీసులే ఈ పని చేసివుంటారా?" సాలోచనగా అన్నాడు.

"వాళ్ళెందుకుచేస్తారు? వాళ్ళ షేర్లు కరెక్టుగా వెళ్తున్నాయి."

"ఇన్వెస్టిగేషన్‌లో ఏమైనా తేలిందా ?"

"బాంబుల మీద తమిళనాడు ముద్ర వున్నదట. ఎల్.టి.టి.ఇ.కి. సంబంధించిన గ్రూపు ఏదో చేసివుండొచ్చు".

"ఎల్. టి.టి.ఇ.కీ, కుట్టికీ సంబంధం ఏమిటి?"

"కుట్టి కేరళ మనిషి కదా! పూర్వపు గొడవలు ఏమైనా వున్నాయేమో!"

"ఈ మధ్యకాలంలో... గత పదేళ్ళుగా అసలు కుట్టి ఆంధ్రరాష్ట్రం వదిలి వెళ్ళినట్టు లేదు. అతనికి ఇలాటి గొడవలు రావటానికి వీల్లేదు".

అంతలో మల్లప్ప వచ్చి అంతకుముందు రోజు జరిగిన గొడవ చెప్పాడు. అక్కడ వున్నవాళ్ళందరూ ఆశ్చర్యంగా విన్నారు.

"...కుట్టీకి బాగా కోపం వచ్చింది. వెంటనే సుధాకర్ పాక తగలబెట్టమని మనుష్యుల్ని పంపాడు. ఒంటిగంటకి వాళ్ళు పాక తగల బెట్టారు".

"...అంటే ఇదంతా ఆ సుధాకర్ చేశాడంటావా?"

"ముందు మాకిదే అనుమానం వచ్చింది. సుధాకర్ గురించి ఎంక్వయిరీ చేసేము. అతడు చాలా మామూలు బ్లాక్ మార్కెటీరు. తన పాక తగలబడగానే ఏడుస్తూ పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు. బాంబులు పడే సమయానికి అతడు పోలీస్

స్టేషన్‌లోనే వున్నాడు. అదీగాక, పాక తగలబడటానికీ – బాంబులు పడటానికీ మధ్య రెండు గంటలే టైముంది. ఈ రెండు గంటల వ్యవధిలో సుధాకర్ లాటి వాడు ఎల్.టి.టి.ఇ.నో తమిళనాడునో కాంటాక్ట్ చేసే అవకాశం లేదు".

"నువ్వు చెప్పింది నిజమే. సుధాకర్ అయివుండడు" అన్నాడు మొదలియార్..." ఈ ఊళ్ళో బాంబులు సప్లై చేసేవాళ్ళని ఎంక్వయిరీ చేశావా?"

"ఇద్దరు ముగ్గుర్నీ చేశాను. మాకేమీ తెలీదన్నారు. ఈ రకం తమిళనాడు బాంబుల్ని వేలుస్వామి సప్లయి చేస్తాడు. అతడినీ ఎంక్వయిరీ చేశాను. తెలీదన్నాడు. కానీ చెప్పలేం... వీళ్ళు ఒక పట్టాన నిజం చెప్పరు. కష్టమర్ల గురించి చాలా సీక్రెట్‌గా వుంచుతారు. అయినా ఈ బాంబులూ అవీ మనవాళ్ళకు చేతకాదు. పైవాళ్ళెవరో అయివుంటారు."

మొదలియార్ తలూపాడు... "ఆ మాట నిజమే".

కలెక్షన్ కుట్టిని బయట రాష్ట్రం వాళ్ళెవరో చంపేరని నిశ్చయం చేసుకున్నాక – ఇక ఆ విషయం మర్చిపోయాడు మొదలియార్. కుట్టి స్థానంలో అహమ్మద్ నియమించబడ్డాడు. అయితే అతను కుట్టి అంత పవర్‌ఫుల్ కాదు. ఇది అన్నిచోట్ల వున్నదే. ఒక పవర్‌ఫుల్ ఆర్గనైజేషన్‌లో ముఖ్యమైన వ్యక్తిపోతే, ఆ స్థానాన్ని భర్తీచేయటం కష్టం. తరువాత వచ్చినవాడు నిలదొక్కుకోవటానికి వాడంత బలమైనవాడు కాకపోతే ఆ ఆర్గనైజేషన్ బీటలు వారుతుంది.

అహమ్మద్ – కుట్టి అంత బలమైనవాడు కాకపోయినా, స్వతహాగా ధైర్యసాహసాలున్నవాడు. కుట్టికి తన అనుచరులతో పనిచేయించుకోవటమెలాగో

తెలుసు. పై ఎత్తునుండి ఆర్గనైజేషన్ నిర్వహించగలడు. అహమ్మద్ అయితే స్వయంగా రంగంలో దిగి ఆటో ఇటో తేల్చుకుంటాడు.

ఎవరి పంథా సత్ఫలితాన్నిస్తుందో కాలమే నిర్ణయించాలి.

*  *  *

ఆ వార్త పేపర్లో చూసి ఆమె కదిలిపోయింది.

మరణించిన ఆరుగురి ఫోటోలూ వేశారు. వికృతంగా కాలిపోయిన శవాలు దారుణంగా వున్నాయి. బాంబులవల్ల కూలిపోయిన ఇల్లు ఫోటో కూడా ప్రచురించారు.

ఇదంతా బోసు చర్యేనని విశారదకి వెంటనే అర్థమైంది. సుధాకర్ ఇల్లు కాలిన వెంటనే ముగ్గురూ బయటకు వెళ్ళటం, ప్రొద్దున్నించీ పద్మావతి హుషారుగా వుండటం, ఆమె అభిప్రాయాన్ని బలపర్చాయి.

బోసు వచ్చేసరికి ఆమె రాసుకుంటూంది.

"ఏం రాస్తున్నావు?" అని అడిగాడు.

"చదువు" అని ఇచ్చింది. అతడు ఆశ్చర్యంగా చూశాడు. అది ఆమె డైరీ. అతడు తటపటాయించటం చూసి, ఆమె "నేనే ఇస్తున్నాగా చదువు" అంది.

అతడు ఆమె చేతిలోంచి పుస్తకాన్ని తీసుకుని చదివాడు.

"మృగం అడవిలో తన ఉనికి కాపాడుకోవటం కోసం సాటిమృగాన్ని చంపుతుంది. మనిషి జనారణ్యంలో తన అధికారాన్ని నిలబెట్టుకోవటం కోసం సాటి మనిషిని చంపుతాడు. రెండింటికీ తేడా లేదా?... గత రాత్రి దారుణం జరిగింది. ఆరుగుర్ని చంపేశారు. ఈ సంఘటన నన్ను కలచివేసింది. మనం ఎటు

పయనిస్తున్నామో నాకు అర్థంకావటంలేదు. బలమున్నవాడిదే రాజ్యమవుతోంది. నా బోసుబాబేనా ఈ విధంగా చేసింది? అని ప్రశ్నించుకుంటే నాకు దిగులుగా వుంది. మనుష్యులు ఇలా... ఇంత తొందరగా మారిపోతారా అని ఆశ్చర్యంగా, విషాదంగా వుంది".

చదివి తల పైకెత్తాడు. ఆమె అతనివైపే చూస్తోంది. అతడు ఆ పుస్తకాన్ని పక్కన పెట్టేస్తూ "నేను వాళ్ళని చంపుదామనుకోలేదు. పద్మావతి చంపింది. అయినా ఇప్పుడు ఆమె చేసింది కూడా నాకు దుర్మార్గంగా అనిపించటంలేదు. ఆమెకి జరిగిన అన్యాయానికి ఆ విధంగా పగ తీర్చుకోవటంలో తప్పులేదు. మీ ఉద్యమంలో కూడా అంతే కదా. డబ్బున్నవాడు తన ఆస్తినీ, భూముల్నీ వదులుకోవటానికి ఇష్టపడడు. అలా వదులుకునేలా చేయాలంటే వాడిలో భయాన్ని ప్రవేశపెట్టాలి. మీలో ఒక 'వింగు' అందుకేగా విప్లవకారుల్లా తయారయ్యారు" అన్నాడు.

ఈ వాదనకి ఆమె బిత్తరపోయింది. తమాయిచుకుని అన్నది – "ఎప్పుడయితే వ్యక్తిగతమైన కక్షలు చోటుచేసుకున్నాయో అప్పుడే ఉద్యమం తాలూకు లక్ష్యం బలహీనపడుతుంది. అయినా ఒక గొప్ప ఉద్యమ లక్ష్యాన్ని, మీ చౌకబారు గ్యాంగువారులకి అన్వయిస్తావా? అసలు ఆ ఆలోచనే నాకు సిగ్గుగా వుంది".

అతని మొహం ఎర్రబడింది. "... వాడిని చంపటం వల్ల ఎంతో మందికి రిలీఫ్ కలిగింది. ఇక వీళ్ళు 'దందా'లు చెల్లించనవసరం లేదు" అన్నాడు కోపాన్ని అణుచుకుంటూ. అయితే ఆమె ఆ వాదనకు ప్రతిగా ఒక సత్యాన్ని చెపుతున్నట్టు–

"ప్రజల ఆమోదం లేనిదే ఏ పనీ విజయం సాధించదు! వాళ్ళని చంపటంవల్ల బాగుపడింది ఎవరు? మీ బ్లాక్ టిక్కెటీర్లు! అంతేకానీ, ప్రజలు కాదు. ప్రజలు ఎప్పటిలాగే బ్లాకులో టిక్కెటు కొనుక్కోవాలి. రిలీఫ్ కలిగింది కేవలం మీ మనుష్యులకి మాత్రమే. ప్రజలకి కాదు" అంది.

"ఒహో. సర్లే అయితే ఈ సారి మనవాళ్ళ చేత ఆ ధనరాజ్ మొదలియార్‌ని చంపిస్తాను. అప్పుడు ప్రజలు కూడా సంతోషిస్తారు" అన్నాడు.

"కేవలం నీ వాదన నిలుపుకోవటానికే యిలా వాదిస్తున్నావని నీకూ తెలుసు. హత్యల్ని ప్రజలెప్పుడూ హర్షించరు".

"హర్షిస్తారో లేదో నీకేం తెలుసు? ఒక వ్యక్తివల్ల నిజంగా కష్టపడ్డ ప్రజలు ఆ వ్యక్తి హత్యని హర్షిస్తారు. నీ సిద్ధాంతాన్ని నువ్వెంత గుడ్డిగా నమ్ముతున్నావో, ఆ సిద్ధాంతాన్ని వాళ్ళూ అంత గుడ్డిగా నమ్ముతారు..."

"నువ్వు చేసిన ఈ హత్యల్ని ఒక విప్లవచర్యగా చెప్పుకోవటం నీ ఆత్మవంచన".

"దాన్ని విప్లవచర్యగా నేను చెప్పుకోలేదు. మా దారిలో అడ్డంగా వుండి, మా దగ్గిర డబ్బు వసూలు చేస్తున్న వాడి అడ్డు తొలగించామని చెపుతున్నానంతే. ఒకసారి బయటకొచ్చి చూడూ, వాడి మరణం వల్ల మన వాళ్ళందరూ ఎంత సంతోషంగా వున్నారో తెలుస్తుంది"

"ఎంతకాలం సంతోషంగా ఉండగలరు? వాడి స్థానంలో మరొకడు వస్తాడు. అంతేగా!... నిజమైన సంతోషం – పూర్తిగా వ్యవస్థ మారితేనే వస్తుంది.

చిన్న రొట్టెముక్క కోసం ఒక వ్యక్తి బ్లాక్ మార్కెట్ చేయనవసరంలేని రోజు వచ్చినప్పుడు వస్తుంది".

"ఆ రోజు కోసం నువ్వు కృషి చేయి, అంతవరకూ మమ్మల్ని ఇలా హాయిగా బ్రతకనివ్వు".

ఆమె నిస్సహాయంగా అతనివైపు చూసింది. దగ్గిరగా వచ్చి చేతిమీద చెయ్యి వేసింది. "ఇలాంటి వాదనలు చెయ్యకు బోసూ! ప్లీజ్, నీలాటి తెలివైనవాడు మాతో వుంటే ఎంతో మంచిది. మమ్మల్ని అర్థంచేసుకో. మనమందరం కలిస్తే 'ఆరోజు' తొందర్లో వస్తుంది" అంది.

"ఆ రోజు రావటం కోసం తప్పక కృషి చేద్దాం విశారదా? అది వచ్చేవరకూ మీ వాళ్ళలో చాలామంది కారులలో తిరుగుతూ, త్రిబుల్ ఫైవ్ సిగరెట్లు కాలుస్తూ ఎలా చైతన్యం కోసం కృ....షి చేస్తున్నారో, అలాగే మా వాళ్ళకోసం ఈ గూండాల్తో పోరాడనివ్వు" అని అక్కడనుంచి వెళ్ళి పోయాడు.

# 6

## ఆ రోజు బ్లాకులో టిక్కెట్లు అమ్మేవాళ్ళకి పండగ!

వందరోజుల ఫంక్షన్‌ని ధియేటర్ లోనే ఏర్పాటు చేశారు.

అంతేకాదు.

ఆ సినిమా నిర్మాత పరిశ్రమలో బాగా పలుకుబడి వున్నవ్యక్తి కావటంతో, అగ్రనటులందరూ ఆ ఫంక్షన్‌కి వస్తున్నారు. ఆ ఫంక్షన్‌కి మినిమమ్ టిక్కెట్టు వందరూపాయలు.

కలెక్షన్ కుట్టీ లేకపోవటంతో – లోకల్ బ్లాక్ మార్కెటీర్లు విజృంభించారు. సుధాకర్ లాంటివాళ్ళు మరీ హుషారుగా వున్నారు. ఎక్కడెక్కడి నుంచో పలుకుబడి ఉపయోగించి డబ్బు సంపాదించాడు సుధాకర్. మరో అయిదుగురు అసిస్టెంట్‌లని ఎక్కువ నియమించాడు. వీళ్లైనన్ని టిక్కెట్లు కొనేస్తున్నారు.

అక్కడ ఇసుకవేస్తే రాలనంత జనం.

అంతలో అక్కడికి ఒక హోండా కారొచ్చింది. ప్రజల్ని వెర్రెక్కిస్తున్న ప్రస్తుతపు సంచలన నటుడు దిగాడు. అందరికీ చెయ్యి వూపుతూ, లోపలికి వెళ్ళాడు. అంతే!

టిక్కెట్టు ఖరీదు పదిహేను వందలైంది.

ప.....ది.....హే.....ను......వం.....ద.....లు!

సుధాకర్ గాలిలో తేలిపోతున్నాడు.

మొదటి బెల్ మోగింది.

అప్పుడొచ్చి ఆగినయ్ రెండు జీపులు. జీపుల్నిండా జనం వున్నారు.

మొదటి జీపు నుంచి అహమ్మద్ దిగాడు.

అతడు తన సామ్రాజ్య స్థాపనకు ఈ రోజునే ఎన్నుకున్నాడు. ఏ పని చేసినా అతడు స్వయంగా చేస్తాడు. ఈ రోజు అందుకే స్వయంగా 'దందా' వసూలు కోసం వచ్చాడు.

కుట్టి మరణం తరువాత కొందరు చిన్న చిన్న బ్లాక్ మార్కెటీర్లు తోకలెత్తుతున్నారని అతడికి తెలిసింది. వాటిని నిర్ధాక్షిణ్యంగా కత్తిరించటానికి పూనుకున్నాడు.

అక్కడ జీపుల్లోంచి దిగిన ఇరవైమంది దగ్గరా దారుణమైన మారణాయుధాలున్నాయి.

అవసరమైతే అక్కడ రక్తపుటేర్లు ప్రవహింపచేయటానికి కూడా వాళ్ళు సిద్ధపడే వచ్చారు.

టిక్కెట్లు అయిపోతున్నాయని తెలిసేసరికి బ్లాక్‌లో ధర అనూహ్యంగా పెరిగింది.

లోపల జరుగుతున్న ఉపన్యాసాలు బయటకు వినిపించేలా మైకులు పెట్టారు. దాంతో జనాలు దాదాపు పిచ్చెక్కిపోతున్నారు. సెక్స్ బాంబ్‌ని స్టేజీమీదకు పిలుస్తున్నట్టు మైకులో వినిపించగానే ధర రెట్టింపయింది. క్రేజీ స్టార్‌ని ఆహ్వానిస్తున్నప్పుడు పదిరెట్లు పెరిగింది టిక్కెట్టు.

బడ్జెట్ ప్రకటించగానే ధరల సూచిపెరిగినట్లు – ఒక్కొక్క ఆహ్వానానికి బయట ప్రేక్షకుల పిచ్చి క్రేజ్ అవధులు లేకుండా పోతుంది.

ఆఖరి రెండు టిక్కెట్లు అమ్మేసి, గుంపులోంచి... నలిగిన బట్టల్తో చెదిరిన క్రాఫుతో బయటకొచ్చాడు సుధాకర్. టిక్కెట్లు దొరకని జనం ఇంకో గుంపు దగ్గిరకి పరుగెత్తారు.

అసిస్టెంట్లు కూడా టిక్కెట్లన్నీ అమ్మేశారు. దాదాపు యాభైవేలు పైగా లాభం. అందరూ చాలా హుషారుగా వున్నారు. అందరి మొహాల్లో నవ్వు తొంగిచూస్తోంది.

టిక్కెట్లు అయిపోయాయని జనానికి తెలిసినా ఇంకా అక్కడే తచ్చాడుతున్నారు.

సుధాకర్ వెళ్ళి కిళ్ళీకొట్టు షెడ్ క్రింద నిలబడ్డాడు. సాధారణంగా అసిస్టెంట్స్ అందరూ అక్కడికే వస్తారు. అప్పటికే నలుగురైదుగురు అక్కడికి చేరుకున్నారు కూడా. ఎవరెవరి కెన్నెన్ని టిక్కెట్లు ఇచ్చిందీ లెక్క వ్రాసుకున్న కాగితాన్ని జేబులోంచి తీశాడు సుధాకర్. దాన్ని విప్పుతూ తలెత్తేసరికి –

అప్పుడు పడింది అతడి దృష్టి వాళ్ళమీద.

ముందు చైన్ అహమ్మద్ నడుస్తున్నాడు. వెనుకే వాళ్ళు...

టెర్రరిస్టు క్యాంపులో సైనిక శిక్షణ పొందిన మిలిటెంట్స్‌లాగా ఒకే 'లయ' లో అడుగులు వేసుకుంటూ సమీపిస్తున్నారు. క్షణాల్లో అక్కడి వాతావరణం నిశ్శబ్దమైంది. థియేటర్ దగ్గర టిక్కెట్లు దొరకని జనం కూడా – ఏదో జరగబోతూందని వూహించినట్టు, చేష్టలుడిగి నిలబడ్డారు.

సుధాకర్ దగ్గరికి రాబోతూన్న అసిస్టెంట్స్ చప్పున వెనుకడుగువేసి జనంలో కలిసిపోయారు.

థియేటర్‌కి బాగా ఎడమవైపున సైకిల్ స్టాండ్ దగ్గిర వున్న పద్మావతి – అక్కడ వాతావరణంలో మార్పుని పసిగట్టిందిగానీ– దూరంగా– జనాలకి అటువైపు వుండటం వలన, ఏం జరిగిందో గ్రహించలేకపోయింది.

చైన్ అహమ్మద్ సుధాకర్ దగ్గిరకి వచ్చాడు. మొహం తిప్పకుండా సూటిగా చూస్తున్నాడు. సుధాకర్ కీడు శంకించి, చేతిలో క్యాష్ బ్యాగ్ గట్టిగా పట్టుకుని కన్నార్పకుండా అహమ్మద్ వైపే చూడసాగాడు. అహమ్మద్ దగ్గరికి వస్తూంటే ఒక కెరటం... దూరంగా చిన్న ఆకారంలో మొదలై... క్రమంగా పెద్దదై... అది ఉప్పెన

అని గ్రహిచే లోపులో తాడిచెట్టు ఎత్తున లేచి... ఆ శబ్దం కర్ణపుటాల్ని చేరేలోపులో పైన పడి కమ్మేసి తనలో కలిపేసుకున్నట్టు...

సుధాకర్ ఏం జరుగుతుందో తెలుసుకునే లోపులో చైన్ అహమ్మద్ చెయ్యి మెరుపు వేగంతో లేవటం, అతడి చేతిలో సైకిల్ చైను సుధాకర్ తలమీద నుంచి – చెంపని చీలుస్తూ క్రిందికి దిగటం – రెప్పపాటులో జరిగిపోయాయి. మాటల్లేవు – తిట్టుకోవటాలు లేవు, ఆవేశాల్లేవు, ఆక్రోశాల్లేవు. అంతా చాలా సాధారణంగా – ఒక అనుభవం వున్న సర్జెను చర్మాన్ని నిలువునా కోసి ఆపరేషన్ చేసినట్లు జరిగిపోయింది.

చైన్ అహమ్మద్ సైగ చేశాడు. వెనుక వున్న ఒక మనిషి చిన్న రేకు పెట్టె తెరచి, నేలమీద క్యాష్ బ్యాగ్‌లో డబ్బు అందులో పడేసుకున్నాడు.

మొహంనుంచి స్రవిస్తున్న రక్తాన్ని సుధాకర్ రెండు చేతుల్తో అదిమి పెట్టి బాధతో దొర్లుతున్నాడు.

చైన్ అహమ్మద్ తాలూకు మనిషి పెట్టెనింకా తెరిచే పట్టుకుని వున్నాడు. అహమ్మద్ చుట్టూ చూశాడు. అతని భావం అర్థమైనట్టు సుధాకర్ మనుష్యులు ఒక్కొక్కరే వచ్చి ఆ పెట్టెలో డబ్బు వేయసాగారు. ఎవరూ ఏమీ దాచడానికి ప్రయత్నం చేయలేదు. అసలా ఆలోచనే అక్కడ ఉత్పన్నమవ లేదెవరికీ.

మొత్తం డబ్బు లక్ష రూపాయలదాకా వుంటుంది. టిక్కెట్లు ధర కూడా అందులోనే వుంది. దాని గురించి కూడా ఎవరూ అడగలేదు. బిక్కుబిక్కుమంటూ – భయం భయంగా, శత్రు దేశానికి దొరికిపోయిన సైనికుల్లా, ఒక క్రమశిక్షణతో వచ్చి ఆ పెట్టెలో డబ్బు వేయసాగారు.

లోపల ఫంక్షన్‌కి విచ్చేసిన హోం మినిష్టరు పర్వతాల నాయుడు తాలూకు ఉపన్యాసం మైకులో బయటకు వినపడుతూంది. "..ఈనాడు ఇలా సమాజం పాడైపోవటానికి సినిమాలే కారణమని చాలామంది అభిప్రాయపడుతున్నారు. సినిమాల్లో హింస, సెక్స్ ఎక్కువైపోతున్నాయి. కాబట్టి వాటిని తగ్గించుకోమని ఈ సభాపూర్వకంగా నిర్మాతలకు వినతి చేస్తున్నాను. ఇదే హింస చిత్రణ ఎక్కువైపోతే, రేపు బయట సమాజంలో కూడా ఇలాగే పట్టపగలు హత్యలు జరుగుతాయి. చైన్లతో కొట్టుకుంటారు. సినిమాల్లో చూపించినట్టే మొహాలమీద ఆసిడ్లు పోసుకుంటారు.

బయట గూండాయిజానికి సినిమాలు స్ఫూర్తి కాకూడదు. వాస్తవిక పరిస్థితుల్ని చిత్రీకరించాలి. ఇక్కడి వేదికమీద రచయితలు, రచయిత్రులు చాలా మంది వున్నారు. ఎప్పుడే సినిమా ఫంక్షను జరిగినా, వీళ్ళు పిలవగానే వచ్చి తమ అమూల్య అభిప్రాయం చెపుతారని విన్నాను. వీళ్ళు మళ్ళీ ఎప్పుడైనా రచనలంటూ చేస్తే – ఆ రచనల్లో ఇలాంటి హింస లేకుండా, కేవలం సమాజానికి ఉపయోగపడే రచనలు మాత్రమే చేయమని కోరుకుంటున్నాను."

సెక్యూరిటీ కోసం వచ్చిన రక్షణాధికారులంతా వింగుల్లో చేరి, క్రేజీస్టారు కేసీ, సెక్స్ బాంబు కేసీ చూస్తున్నారు. వాళ్ళకిక బయట పని లేదనుకున్నారు. వి.ఐ.పి. లంతా లోపలే వున్నారు.

బయట అహమ్మద్ పని పూర్తయినట్లు కదిలాడు. మరో నిముషం గడిస్తే జీపులు అక్కడనుంచి వెళ్ళిపోయేవే కానీ ఈ లోపులోనే ధియేటర్‌కి ఇటువైపు ఏదో గొడవ జరుగుతున్నట్టు పద్మావతికి తెలిసి ఆమె అక్కడికి పరుగెత్తుకుంటూ

వచ్చేసరికి మొహం నిండా రక్తంతో సుధాకర్ కనపడ్డాడు. అహమ్మద్‌ని చూడగానే ఆమెకి మొత్తం విషయం అర్థమైంది. దాదాపు పిచ్చెక్కినట్టు వెళ్ళి అహమ్మద్ కాలర్ పట్టుకుని వూపేసింది. తనేం మాట్లాడుతుందో తనకే అర్థంకాకుండా, "ఒరేయ్, మిమ్మల్ని కూడా వదిలిపెట్టం" అంది ఆవేశంతో వూగిపోతూ.

అహమ్మద్ ఆమె చేతులు బలవంతంగా విడిపించుకుని క్రిందికి తోసేశాడు. ఆమె లేస్తూ, సుధాకర్‌ని పైకిలేపి పట్టుకుంది. అతడి మొహం నుంచి స్రవిస్తున్న రక్తం ఆమె ఎదనంటింది. "కలెక్షన్ కుట్టీ మీద బాంబు లేసి చంపినా మీకు బుద్ధిలేదా? మళ్ళీ వచ్చారు. ఫలితం అనుభవిస్తారు" అని అరిచింది.

ఒక్కసారిగా అక్కడ తుఫాను ముందుండే నిశ్శబ్దం వ్యాపించింది. అంతమంది జనంమధ్య కలకలం ఒక్కసారిగా తగ్గిపోవటంతో ఆ నిశ్శబ్దం భయంకరంగా వుంది. అహమ్మద్ ముందుగడుగు వేసి, "బాంబులేసింది నువ్వా" అన్నాడు.

"అవును నేనే. అనుమానంగా వుందా? నేనూ, బోసన్నా కలిసి వేశాం. ఏం చేస్తావురా?"

అహమ్మద్ ఆమె మాటలు పట్టించుకోలేదు. చుట్టూ బోసు కోసం చూశాడు. అప్పటివరకు సతాయిస్తున్న సందిగ్ధత పోయింది. కుట్టిని హత్య చేసిందెవరో తెలిసిపోయింది... మొదలియార్ సంతోషిస్తాడు. ఇక బోసు...

"ఏదో కేసులో జైలుకి వెళ్ళాడని తెలుసు. ఇంత పెద్దవాడయ్యాడన్నమాట" అనుకున్నాడు. కుట్టిని చంపిన వ్యక్తి ఇక్కడే వున్నాడని తెలిసి ఆవేశం ఆపుకోలేక పోయాడు.

చుట్టూ జనం వణికిపోతున్నారు.

చైన్ అహమ్మద్ కళ్ళు బోసు కోసం వెతుకుతున్నాయి. క్యాంటీన్‌కి మొదటి అంతస్తు వుంది. అది మేనేజర్ ఆఫీసు. దాని బయట ఒక అడుగు వెడల్పు వరండాలా వుంది. మేనేజర్ ఆఫీసు తలుపు తాళంవేసి వుంది.

అక్కడ వున్నాడు బోసు. అహమ్మద్ దృష్టి తనమీద పడగానే గోడ వెనక్కి తప్పుకున్నాడు. అహమ్మాద్ తారాజువ్వలా అటు పరుగెత్తి మెట్లెక్కాడు. ఇక వెనుకవైపు దారిలేదు.

అతడి చేతిలో చైను బిగుసుకుంది.

అతడి చేతిలో చైన్ వుండగా అహమ్మద్‌ని ఎవరూ కొట్టలేరు....

..........

థియేటర్‌లో పర్వతాల నాయుడు ఉపన్యాసం జరుగుతూ వుండగా, ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణమాచారి బయట కొచ్చాడు. నిజానికి అతడిది లోపల డ్యూటీ. కానీ నటీనటుల్ని చూడటానికి బయటి ఆఫీసర్లందరూ లోపలికి రావటంతో అతను చోటులేక బయటకు వచ్చాడు.

థియేటర్ తలుపులన్నీ వేసి వున్నాయి కాబట్టి "ప్రముఖుల ప్రాణాలకి ఢోకా లేదు. బయట జనం ఎలా పోతే ఏం?" అన్నట్టు ఆ థియేటరే ప్రస్తుత వ్యవస్థకి ప్రతీకగా వుంది.

బయటకొచ్చిన రాధాకృష్ణమాచారికి, బయట వాతావరణంలో ఏదో తేడా కనపడింది. రెండు అడుగులు క్రిందికి దిగి చూశాడు.

నేల ఈనినట్టున్నారు జనం. నటీనటులు బయటకి వచ్చేటప్పుడు చూద్దామన్న ఆశతో నిలబడివున్నారు. మధ్యలో ఈ గొడవ రావటంతో ఇక్కడ గుమిగూడారు.

వాళ్ళ మధ్యలో సుధాకర్ రక్తంతో కనిపించాడు.

రాధాకృష్ణమాచారి ఇటు పరుగెత్తుకుంటూ వచ్చాడు. అక్కడి జనం అంతా క్యాంటీన్ వైపు చూస్తూ వుండడంతో అతడు కూడా అటు దృష్టి సారించాడు.

అప్పటికే అహమ్మద్ మెట్లెక్కి పైకి వెళ్ళిపోవటంతో అక్కడెవరూ కనిపించలేదు. అతడు సుధాకర్ వైపు తిరిగి, "ఏం జరిగింది? ఎవరు కొట్టారు?" అని అడిగాడు.

సుధాకర్ "...అహమ్మద్" అన్నాడు.

రాధాకృష్ణమాచారి చుట్టూ చూశాడు. అహమ్మద్‌తో పాటు వచ్చిన మొదలియార్ మనుష్యులు కనపడ్డారు. కుట్టి చచ్చిపోయిన తరువాత ఆ స్థానాన్ని చైన్ అహమ్మద్ తీసుకున్నాడని ఆచారికి తెలుసు. 'ఇప్పుడు ఈ థియేటర్ దగ్గిర తన సామ్రాజ్యాన్ని స్థాపించటానికి సుధాకర్‌కి తన పవరు రుచి చూపించాడన్నమాట' అనుకున్నాడు. ఈ లోపులో పద్మావతి అతని దగ్గరకొచ్చి, "అహమ్మద్ బోసుబాబుని వెతుక్కుంటూ వెళ్ళాడు సార్. చంపేస్తాడేమో చూడండి" అంది అభ్యర్థిస్తున్నట్టు. ఆమెలో ఇప్పుడు ఆవేశం స్థానే భయం చోటుచేసుకుంది.

"బోసెక్కడ?" అని అడిగాడు రాధాకృష్ణమాచారి.

"తెలీదండీ. అసలు థియేటర్ దగ్గరకి రాలేదనుకుంటా" అంది.

అదే సమయానికి వినిపించింది ఒక ఆర్తనాదం! ఆచారి తలెత్తి చూసేసరికి ఒక శరీరం క్యాంటీన్ బాల్కనీ మీదనుంచి క్రిందకి పడింది. నిట్టనిలువుగా... తల క్రిందుగా పడటంతో మెడ విరిగిపోయి, అక్కడి కక్కడే ప్రాణాలు పోయాయి.

అంతకుముందు సరీగ్గా నిమిషం క్రితం అహమ్మద్ వేగంగా మెట్లెక్కాడు. చేతిలో చైన్ బిగించి పట్టుకొని మెట్ల పక్కగోడ మలుపు తిరిగి వెనకవైపు ప్రవేశించబోయే ముందు తగిలింది ఆ దెబ్బ!

అహమ్మద్ రావటం చూడగానే గోడ పక్కనే తప్పుకున్న బోసు, అతడు అటు ప్రవేశించగానే మొహంమీద పడికిలితో బలంగా చరిచాడు. ఆ దెబ్బ ఎంత బలంగా పడిందంటే ఆ బలానికి అహమ్మద్ ముక్కుదూలం విరిగిపోయింది.

చైన్ తీయటానికి అహమ్మద్‌కి కాస్త సమయమిస్తే తన ప్రాణాలు తీస్తాడని తెలుసు. అందుకే మొదటి దెబ్బే అంత బలంగా కొట్టాడు. అయితే తన చేతుల్లో అంత బలముందని బోసుకే తెలీదు. ఊహించని ఆ దెబ్బకి అహమ్మద్ వెనక్కిపడి, అక్కడ బాల్కనీ గోడ అడ్డురావటంతో దానికి తట్టుకుని మరింత వెనక్కిపడి అక్కడ ఏ ఆధారమూ లేకపోవటంతో గాలిలోకి జారిపోయాడు. అక్కడనుంచీ నేలమీద పడటం, మెడ విరిగి మరణించటం క్షణాల్లో జరిగిపోయాయి.

ఈ మరణాన్ని వూహించని బోసుకూడా క్షణకాలం నిర్విణ్ణుడయ్యాడు.

అహమ్మద్ అనుచరులు వూహించని సంఘటన అది! వాళ్ళింకా షాక్ నుంచి తేరుకుని, ఏం చెయ్యాలో ఆలోచించుకోలేదు. అంత హడావుడిలోనూ అసలు విషయం మర్చిపోలేదు. పద్మావతి "అప్పల్నాయుడూ..." అని అరిచింది. అప్పల్నాయుడు సుధాకర్ అసిస్టెంటు. నాలుగు అడుగుల ఎత్తుంటాడు. "క్యాష్

బ్యాగ్... మన క్యాష్..." అని హెచ్చరించింది. జనం గోలలో అది అస్పష్టంగా వినిపించింది అప్పల్నాయుడికి! ఎక్కడ్నుంచో ధైర్యం తన్నుకొచ్చింది. సుధాకర్ రక్తం చూసి కాబోలు – బక్క కోపంలాటి ఆవేశంతో పళ్ళు బిగించి, కిళ్ళీకొట్టు ముందు వరుసలో వున్న సోడాసీసా తీసుకొని అహమ్మద్ అనుచరుడి తల వెనుక నుంచి పగలగొట్టాడు. పెద్ద శబ్దంతో తలతోపాటూ సీసాకూడా పేలింది. వాడి ఆర్తనాదాన్ని పట్టించుకున్న నాధుడే లేడు ఆ గోలలో.

సుధాకర్ మనుషులంతా కసెక్కిపోయి వున్నారు. ప్రొద్దున్నించీ ఎండలో నిలబడి సంపాదించిన డబ్బుని రౌడీల్లా వచ్చి లాక్కోవటం, సుధాకర్‌ని చైన్‌తో కొట్టటం – ఇదంతా వాళ్ళలో ఆవేశాన్ని రగిల్చింది. ఎప్పుడైతే జనం కకావికలమై పరుగెత్తసాగారో, అప్పుడిక వాళ్ళదే పై చెయ్యి అయింది. సంఖ్యలో వాళ్ళే ఎక్కువ. నలుగురైదుగురు కలిసి ఒక్కొక్కణ్ణి పట్టుకుని చావబాదసాగారు. అందులో చాలావరకూ చీకటి దెబ్బలే...

బయట జరుగుతున్న గొడవకి లోపల పోలీసు అధికారులు బిలబిలమంటూ బయటకి వచ్చారు. పోలీసులు గేట్ల దగ్గిర సెక్యూరిటీ పొజిషన్‌లో నిలబడ్డారు.

ఎవరో చచ్చారన్న "వార్త" – క్షణాల్లో థియేటర్లో బాంబు పెట్టారన్న "రూమరు" గా మారి జనాన్ని కకావికలం చేసింది. దొరికిందే సందని సెక్స్ బాంబుని కొందరు పేల్చటానికి ప్రయత్నించారు. పదిమంది గార్డులు తోడురాగా క్రేజీస్టారు కారు దగ్గరికి పయనమయ్యాడు. పర్వతాల నాయుడికి ఎస్కార్టు వెళ్లింది.

అహమ్మద్ అనుచరులు నేలమీద పడ్డారు. జనం వాళ్ళని తొక్కుకుంటూ పరుగెడుతున్నారు. తమ డబ్బు తమకి లభించిందన్న ఆనందంతో సుధాకర్ మనుష్యులు స్వైరవిహారం చేస్తున్నారు. పోలీసులు ఎవర్ని కొడుతున్నారో, ఎందుకు కొడుతున్నారో తెలియకుండా కొడుతున్నారు.

"నన్ను వదులు. నాకేం కాలేదు" అంటున్నాడు సుధాకర్.

రాధాకృష్ణమాచారి అహమ్మద్‌ని పరికించి చూశాడు. అతడు ఎన్నో మర్డర్లు చేశాడనీ, అయినా పోలీసు రికార్డుల్లో ఎక్కడా అతని పేరు లేదనీ తెలుసు. ఎందరి ఎముకలో విరక్కొట్టిన అతని చైను – అతని రక్తంతోనే తడిసి ఉంది.

అతన్ని దాటుకుంటూ మెట్ల దగ్గిరకి నడిచాడు. అదే సమయానికి బోసు మెట్లు దిగుతున్నాడు. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. కేవలం క్షణంసేపే. ఏం చెయ్యాలో తోచనట్టు ఇద్దరూ అచేతనంగా నిలబడ్డారు. ముందు తేరుకున్నది రాధాకృష్ణమాచారే, నెమ్మదిగా పక్కకి తొలగాడు. బోసు జనంలో కలిసిపోయాడు.

యస్సై, ఇంకా కొంతమంది పోలీసులూ అక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు. "మర్డర్..." అంటూ అరిచిన యస్సై... "ఎవరు సార్ చంపింది?" అడిగాడు.

"మర్డర్ కాదు, యాక్సిడెంట్... పై నుంచి పడిపోయాడు. మెడ విరిగింది" అన్నాడు రాధాకృష్ణమాచారి క్లుప్తంగా.

.....

అయిదు నిముషాల్లో అక్కడ పరిస్థితి కంట్రోల్‌లోకి వచ్చింది.

అహమ్మద్ శవాన్ని అంబులెన్స్ తీసుకెళ్ళింది.

# 7

**మొట్టమొదటిసారి** మొదలియార్ వ్యాకులపడ్డాడు. అహమ్మద్ మరణం గురించి కాదు; బ్లాక్ మార్కెటీర్లు సినిమా హాలు దగ్గిర తన మనుష్యులమీద అధిపత్యం సంపాదించినందుకు కాదు, బోసు గురించి.

....ఇప్పుడు అతడికి క్లియర్‌గా అర్థమైంది.

చైన్ అహమ్మద్ మనుష్యులు అతడికి జరిగింది జరిగినట్టు చెప్పారు. పద్మావతి ఆవేశంతో బయటికి వెల్లండించిన రహస్యం విని నిర్విణ్ణుడయ్యాడు. కలెక్షన్ కుట్టీ మీద బాంబులు వేసిన మనిషి బోసు!... తన ఆలోచనా పరిధి నుంచి ఇంత చిన్న విషయం తప్పించుకున్నందుకు సిగ్గుపడ్డాడు. పద్మావతి గురించి ఆలోచించనే లేదు. చాలా చిన్న విషయం అది. బో....సు!

చూస్తూండగానే ఇంత పెద్దవాడయ్యాడా?

తన సామ్రాజ్యంలో ఒక చిన్న సామంతరాజు నెమ్మదిగా తలెత్తి మహా వృక్షమయ్యే పోకడలు ప్రదర్శిస్తూంటే చక్రవర్తి ఎంత వ్యాకులపడతాడో, అంత కంగారూ పడ్డాడు. అయితే, అంత కఠినంగానూ ఆ మనిషిని అణిచివేయటానికి నిశ్చయించుకున్నాడు. కలెక్షన్ కుట్టిని చంపిన వ్యవహారంలో పెద్దగా చింతించలేదు గానీ, చైన్ అహమ్మద్ హత్య అతన్ని చికాకు పరిచింది.

"ఆ క్యాంటీన్ బాల్కనీలో బోసు వున్నాడా?"

"తెలీదు సాబ్. పద్మావతి బోసు గురించి చెప్పగానే అహమ్మద్ అటు పరుగెత్తాడు. ఆ తరువాత బాల్కనీ మీదనుంచి క్రింద పడిపోయేసరికి పోలీసులు అక్కడికి వచ్చారు."

మొదలియార్ వాడి చెంపమీద బలంగా కొట్టాడు. వాడు తల వంచుకొని నిలబడ్డాడు. తన తప్పు వాడికి తెలుసు. అహమ్మద్ బాల్కనీ దగ్గిరకు వెళ్ళగానే అసిస్టెంట్‌గా తనూ అక్కడికి వెళ్ళాలి. కనీసం అహమ్మద్‌ని బాల్కనీలోంచి తోసేసిందెవరో చూడాలి. ఆ రెండూ పనులూ తను చెయ్యలేదు.

మొదలియార్‌కి మాత్రం అర్థమయింది. బాల్కానీలో బోసే వుండి వుంటాడు. అందుకే చైన్ అహమ్మద్ అటు పరుగెత్తాడు. లేకపోతే అంత అవసరం ఏముంది?

మొదలియార్ ఆలోచిస్తున్నాడు. అతనికి చాలా రోజుల క్రితం జరిగిన సంఘటన కళ్ళముందు మెదిలింది. తనని కార్లో బలవంతంగా ఎక్కించుకుని పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళటం.

కలెక్షన్ కుట్టి.... చైన్ అహమ్మద్.

చాలా పెద్ద నష్టం! బోసు ప్రాణాలు చిత్రహింస పెట్టి తీసినా ఆ నష్టం పూడదు. కానీ తన వాళ్ళకి తన రాక్షసత్వం తెలియాలంటే అంత క్రూరంగా చంపాలి.

మొదలియార్ ప్లాన్ వేయసాగాడు.

ఏ టైమ్‌లో బోసు ఏ వీధిగుండా వెళతాడు – వగైరా వివరాలతో కూర్చుని వర్క్ చేయసాగాడు. అదే టైమ్‌కి అక్కడ బోసు కూడా తన సామ్రాజ్యాన్ని మరింత కొల్లగొట్టటానికి వర్క్ చేస్తున్నాడని తెలీదు.

*　　　*　　　*

అక్కడున్న వాళ్ళందరూ షాక్ తిన్నట్టు చూస్తున్నారు. కొందరి మొహాల్లో ఆ నిర్విణ్ణభావం అలాగే వుండిపోయింది. మరికొందరు నమ్మలేనట్టు చూస్తున్నారు. కొంతమంది అసలు వూహించటానికి భయపడుతున్నారు.

బోసు చెప్పటం అవగానే అక్కడి వారిలో వచ్చిన రియాక్షన్ అది.

అక్కడ దాదాపు వందమంది దాకా వున్నారు. అంతా అట్టడుగు వర్గానికి చెందిన మనుష్యులు. కొందరు బ్రాకెట్లు నడుపుతున్నారు. మరికొందరు బ్లాక్ మార్కెటింగ్ చేస్తారు. పగలు బూట్ పాలీష్ చేస్తూ రాత్రిళ్ళు చిల్లర దొంగతనాలు చేసేవాళ్ళు కొంతమంది. పగలు రిక్షాలు తొక్కుతూ రాత్రిళ్ళు ఆడవాళ్లని సప్లయ్ చేసేవారు కొంతమంది. మరికొంతమంది పిక్ పాకెటర్లు... బ్రోకర్లు... మాజీ జైలు పక్షులు... చిన్న చిన్న సారా వ్యాపారాలు చేసే వాళ్ళు... ఫుట్‌పాత్‌ల పక్క దొంగ సామాన్లు అమ్మేవాళ్ళు... సభ్యసమాజం విసిరేసిన ఎంగిలి విస్తరాకులు వాళ్ళు. జీవితాల్లో ఫ్రస్టేషన్ తప్ప మరేమీ లేనివాళ్ళు. వాళ్ళ దగ్గిర తన అభిప్రాయాలు చెప్పటం ప్రారంభించాడు. ముందు ప్రశ్నలతో....

"ఇప్పటికి నువ్వెన్నిసార్లు జైలుకి వెళ్లావు గుండప్పా?" అడిగాడు.

"ఎనిమిది పదిసార్లు".

"ఎందుకు?"

"పిక్ పాకెట్"

"నువ్వు సిద్దూ?"

"జైలు కెళ్ళలా, లాకప్‌లో వున్నా".

"బాగా కొట్టారా?"

"కొట్టారు".

"ఎందుకు?"

"బ్రాకెట్టు రాస్తున్నానని పట్టుకెళ్ళారు. ఇంకేదో దొంగతనం వొప్పుకొమ్మని కొట్టారు... వొప్పుకునే వరకూ కొట్టారు" ఆ జ్ఞాపకంతో అతని కంఠం వణికింది.

బోసు అందరివైపు చూశాడు. "ఇవీ మన జీవితాలు!... మనకు జైలు కొత్తకాదు. దెబ్బలు తినటం కొత్తకాదు. పెద్ద రౌడీల్నుంచి ప్రాణభయం ఎలానూ వుంది. మరి అటువంటప్పుడు పెద్ద రిస్కులే ఎందుకు తీసుకోకూడదు?"

ఎవరూ మాట్లాడలేదు.

"మీలో ధైర్యం వుంది. ఆవేశం వుంది. కావల్సిందల్లా లక్ష్మణరేఖ దాటటమే. దాటకపోతే చిన్న రౌడీల్లా మిగిలిపోతాం. దాటితే పెద్ద వాళ్ళ మవుతాం. ఏమో ఎవరు చెప్పొచ్చారు?... మనలోనే కాబోయే ముఖ్యమంత్రి వున్నాడేమో?"

అందరి మొహాల్లోనూ ముసిముసి నవ్వులు. బోసు మాత్రం నవ్వకుండా కొనసాగించాడు.

"ఒక సిటీబస్‌లో దొంగతనం చేస్తూ పట్టుబడితే ఆర్నెల్లు శిక్ష పడుతుంది. ఒక మర్డర్ చేస్తూ పట్టుబడితే ఆరేళ్ళ శిక్ష పడుతుంది. అంతే తేడా. కానీ ఒక పర్సు కొట్టేస్తే అందులో వందే వుంటుంది. ఒక మర్డర్‌కి అయిదు లక్షలు యిచ్చేవాళ్ళున్నారు. రిస్కు కూడా తక్కువ. ఎలాగూ జైలుకి రెడీ అయ్యే ఈ పనులు చేస్తున్నారు. కాబట్టి పెద్ద రిస్కులు ఎందుకు తీసుకోకూడదన్నదే నా ప్రశ్న?"

"అందుకు ఏం చేద్దామంటావ్?" సుధాకర్ అడిగాడు.

అప్పుడు బోసు చెప్పటం ప్రారంభించాడు. అయిదే నిమిషాల పాటు అలుముకున్న గాఢమయిన ఉద్వేగంలో.... అతడు తన ప్లాను చెప్పగానే అక్కడందరూ నిర్విణ్ణులయ్యారు. కొంచెం సేపు ఎవరూ మాట్లాడలేకపోయారు.

నిశ్శబ్దాన్ని బ్రద్దలు కొడుతూ బోసు అన్నాడు – "ఆలోచించండి. ఈ చిన్న చిన్న దొంగతనాలు, నీళ్ళ పైపులో బ్రతుకులూ, పోలీసుల భయాలూ, దాదాల బెదిరింపులూ ఎందుకు? రిస్క్ ఎలాగూ తప్పనప్పుడు పెద్ద రిస్కే తీసుకుంటే నష్టం ఏమిటి?"

"నేను రెడీ" అంది పద్మావతి హుషారుగా.

"నేను కూడా" సుధాకర్ చెయ్యి ఎత్తాడు.

చైన్ అహమ్మద్ అనుచరుల్ని చావబాదిన ఉత్సాహంలో ఉన్నారందరూ. బోసు చెప్పిన విషయంలో వాళ్ళకి లాజిక్కు కనబడింది. పిక్ పాకెట్ చేస్తే ఆర్నెల్లు. పదిలక్షలు దొంగతనం చేస్తే అయిదేళ్ళు... పిక్ పాకెట్ చేస్తూ పట్టుబడితే పోలీస్ రోడ్డుమీద కొట్టుకుంటూ తీసుకెళ్ళాడు. కోట్లు కుంభకోణంలో ఇరుక్కుంటే వ్యాన్‌లో తీసుకెళ్తారు.

"నువ్వు చెప్పినట్టే చేద్దాం బోసూ" అన్నారు.

"గుడ్" అన్నాడు బోసు. "...రేపు సాయంత్రం బయల్దేరుతున్నాం మనం. ఎక్కడికో రేపు సాయంత్రం బయలుదేరాక చెపుతాను. మీరు మీ ఆడాళ్ళని కూడా తీసుకురండి. పదేళ్ళలోపు పిల్లల్ని వద్దు. మనం తిరిగి రావటానికి మూడు రోజులు పడుతుంది... అన్నిటికన్నా ముఖ్యవిషయం – ఈ విషయం బయటకు పొక్కనీయవద్దు. పెద్ద ప్రమాదం వుంది – సుధాకర్ ఇల్లు ఈ రోజు

తగలబెట్టినట్టుగా... వెళ్ళి రేపు సాయంత్రానికి తయారవండి. మూడు రోజులపాటూ మీ అన్ని ఖర్చులూ మావే – తిండి ఖర్చుతో సహా..."

"మందు?"

"అది కూడా, ఎంత తాగితే అంత –"

వెనుకనుంచి ఎవరో గట్టిగా విజిల్ వేశారు.

....అందరూ వెళ్ళిపోయాక బోసు సుధాకర్‌ని అడిగాడు –"లక్ష రూపాలున్నాయి కదా" అని.

"ఇంకా ఎక్కువే అనుకుంటాను".

"ఇరవై బాంబులు కొను. అయిదు రివాల్వర్‌లు అద్దెకు తీసుకో. మూడు డమ్మీ. రెండు ఒరిజినల్. ఇవన్నీ ఎక్కడ దొరుకుతాయో పద్మావతికి తెలుసు. ఒక్కో రివాల్వర్‌కీ పాతికవేలు డిపాజిట్ చెయ్యాలి. చెయ్యి. అలాగే – అయిదు వేన్‌లు మాట్లాడు. మూడు రోజులపాటు మనతో వుండాలి. విశాఖపట్టణం వరకూ ప్రయాణం అని చెప్పు".

"విశాఖపట్టణమా?" ఆశ్చర్యంగా అడిగాడు సుధాకర్.

"మొదలియార్ దొంగ సరుకు దిగేది అక్కడే కదా!"

సుధాకర్ కొంచెంసేపు వూరుకొని "...నిజమేలే" అన్నాడు. "కానీ పిల్లలెందుకు దీంట్లో" అనడిగాడు.

"ఆకలి ఎక్కువగా వుండేది వాళ్ళకే కాబట్టి..." నవ్వేడు బోసు . "అది కాదులే, మనకి జనాలు ఎక్కువ కావాలి. బయటవాళ్ళని పిలుచుకెళ్ళటం ఎందుకు? మన పిల్లలయితే వాళ్ళూ ఎంజాయ్ చేస్తారు".

"ఇది ఎంజాయ్‌మెంటా?"

"కోట్లు సంపాదించిన రాజకీయ నాయకులు ఇంకా ఎందుకు ఆ లంపటంలోనే గడుపుతారు? ... మనిషి తిండికోసం చేసే వేటలో వున్న ఎంజాయ్‌మెంట్ దేనిలోనూ రాదు".

"కానీ రిస్కు?"

"అవతలివాళ్ళు మనకి రిస్కు కలిగించేటంత ప్రిపేర్డ్‌గా వుండరులే".

నిజమే అన్నట్టు తలూపాడు సుధాకర్. "... నాకు ఫ్రెంచి రివల్యూషన్ గుర్తొస్తూంది".

బోసు నవ్వేడు. "విశారదతో అనకు." ఈ పనికి రివల్యూషన్ అని పేరు పెడతావా?" అని తిడుతుంది".

## 8

**విశాఖపట్టణానికి** వంద కిలోమీటర్ల దూరంలో సముద్రతీరం – నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వుంది. రాత్రి రెండయింది. సముద్రపు ఘోష తప్ప మరేమీ వినపడటం లేదు.

మొత్తం అయిదు బోట్లు.

సముద్రాన్ని చీల్చుకుంటూ ఒడ్డువైపు వచ్చాయి. పది నిముషాల్లో సరుకు దింపటం పూర్తయింది. తిరిగి షిప్పువైపు వెళ్ళాయి. మళ్ళీ సరుకు తీసుకొచ్చాయి.

దాదాపు గంటసేపు ఈ విధంగా జరిగింది.

విదేశాల్నుంచి వస్తువుల స్మగ్లింగ్ సాధారణంగా స్పీడ్ బోట్లద్వారా జరుగుతుంది. లేదా షిప్‌లో కొద్ది కొద్దిగా దొంగతనంగా తీసుకొచ్చి చేరవెయ్యటం జరుగుతుంది.

ఇలా ఏకంగా షిప్‌నే దేశ సరిహద్దుల్లోకి తీసుకొచ్చి నిలబెట్టి దింపుకోవటం ఎవరికీ సాధ్యంకాదు.

- ఒక్క ధనరాజ్ మొదలియార్‌కి తప్ప.

ప్రధానమంత్రితో 'దగ్గిర సంబంధం' వున్న ధనుంజయకి ఇందులో వాటా వుంది. రాష్ట్ర హోం మినిష్టర్ అయిన పర్వతాల నాయుడు ఇందులో పార్టనర్.

ఇక భయమేముంది?

దాదాపు కోటి రూపాయల సరుకు.

అయితే, అంత వ్యవహారం అక్కడ జరుగుతున్నట్టు మూడో కంటికి తెలీదు. అసలా అనుమానమే రాదు. అంత నిశ్శబ్దంగా జరుగుతోంది రవాణా.

"అయిందా?" ఆఖరి బోటు రాగానే అడిగాడు హనుమంతు.

"అయిపోయింది" మల్లేశు అన్నాడు.

అప్పుడు వినిపించింది చప్పుడు. ఏదో దబ్బున నీళ్ళలో పడిన చప్పుడు. ఇద్దరూ ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"ఏమిటది?"

"ఎవరన్నా నీళ్ళల్లో పడ్డారేమో".

"అదికాదు, దానిముందు ఏదో పేలిన శబ్దం".

"పేలటమా? ఇక్కడికెవరొస్తారు?"

అది నిజమే. అది వాళ్ళ సామ్రాజ్యం. గత పదేళ్ళలో ఆ సరిహద్దులో అడుగు పెట్టటానికి ఏ అధికారీ సాహసం చేయలేదు.

అసలా అనుమానమే అక్కడున్న వాళ్ళకి రాలేదు. కానీ అంతలోనే పడవలోంచి ఎవరిదో అరుపు వినిపించింది –"హాఫీజు పడిపోయాడు, నీళ్ళలో పడిపోయాడు" అని.

హనుమంతు, మల్లేశులకు అర్థంకాలేదు. నీళ్ళలో పడిపోతే తిరిగి పడవ ఎక్కుతాడు. అందులో కంగారేముంది? గంటల తరబడి నీళ్ళలో వుండటం, సెక్యూరిటీ ఫోర్స్ తాలూకు పెట్రోలింగ్ జరిగినప్పుడు మైళ్ళ తరబడి నీళ్ళలో ఈత కొట్టుకుంటూ పారిపోవటం – స్మగ్లర్స్ నేర్చుకోవలసిన ప్రథమ పాఠాలు.

"ఏమైందిరా?" గట్టిగా అరిచాడు మల్లేశు.

"హాఫీజు పడిపోయాడు" పడవలోంచి ఎవరో అరిచారు.

నీళ్ళలోకి చూసివుంటే అవి ఎరుపెక్కటం కనపడేది. చీకట్లో తెలియలేదు.

"హ...ఫీజ్" ఎలుగెత్తి కేకవేశాడు హనుమంతు.

సమాధానం లేదు.

మల్లేశుకి అనుమానం వచ్చింది. మొట్టమొదటసారి సందిగ్ధం కలిగింది. హనుమంతు ఏదో చెప్పబోతూ ఆగిపోయాడు. అతడి కళ్ళు ఏదో వూహించని దృశ్యం చూస్తున్నట్టు విభ్రాంతితో పెద్దవయ్యాయి. నోరుతడి ఆరిపోయింది. అతడి పరిస్థితి చూసి, అనుమానం వచ్చి మల్లేశు వెనక్కి తిరిగి చూశాడు.

అతడు కూడా నిర్విణ్ణుడయ్యాడు.

ఇసుకమేట.

ఎత్తుగా చిన్న గుట్టలా వుంది.

ఆ గట్ట వెనుకనుంచి – స్పష్టాస్పష్టంగా... వందల సంఖ్యలో కాగడాలు... జనం పరుగెత్తుకుంటూ వస్తున్నారు. ఎంతమంది వున్నారో తెలియటం లేదు. అది గాలి హోరో – జనపద ఘట్టనో తెలియటం లేదు.

హనుమంతు – మల్లేశు శిలాప్రతిమల్లా నిలబడి వున్నారు.

గత యాభై సంవత్సరాల స్మగ్లింగ్ చరిత్రలో కనీవినీ ఎరుగని ఘట్టం. నక్షత్రాలన్నీ ఆకాశం మీద నుంచి రాలుతున్నట్లు – ముంచుకొస్తున్న కాగడాల వెలుగు.

వస్తున్నవాళ్ళు 'పక్క పల్లెలో పడవవాళ్ళు' అనుకున్నాడు హనుమంతు ముందు. కానీ అయ్యుండరు అనిపించింది. వాళ్ళకి అంత క్రమశిక్షణ, తెగింపు కలలో కూడా రావు.

ముందు తేరుకున్నది మల్లేశు. స్టెన్‌గన్ తీసుకున్నాడు చేతుల్లోకి.

మళ్ళీ చిన్న చప్పుడు.

మల్లేశు వెనక్కి విరుచుకు పడిపోయాడు.

అప్పుడు అనుమానం వచ్చింది హనుమంతుకి. చప్పున చేతిలో బ్యాటరీ లైటు ఆర్పేసేడు. చీకట్లో తడుముకుంటూ మల్లేశు దగ్గరకు వెళ్ళాడు. ఇసుకమీద వెల్లకిలా పడివున్నాడు. మల్లేశు ఛాతీ దగ్గిర రక్తం స్రవిస్తూంది.

హాఫీజు నీళ్ళల్లో ఎందుకు పడిపోయాడో అర్థమైంది.

పరిస్థితి తీవ్రత అర్థమయింది.

మల్లేశు పక్కనే పడివున్న స్టెన్‌గన్ తీసుకున్నాడు. కానీ కాల్చటం కష్టం. ఆ చప్పుళ్ళకి తను ఎక్కడ వున్నదీ తెలిసిపోతుంది. గన్‌తో సహా, నీళ్ళలో ఆగివున్న బీడు వెనక్కి పరుగెత్తాడు. బోట్లలో షిప్పు దగ్గర్నుంచి దొంగ సరుకు తీసుకు వస్తూన్న వాళ్ళకి కూడా జరుగుతున్నదేమిటో తెలిసింది. వాళ్లు కూడా అలర్ట్ అయ్యారు.

పడవల క్రిందకి దిగి, నీళ్ళలో నిలబడి లైట్లు వేశారు. బలమైన టార్చిలైట్ల వెలుతురు ఆ ప్రదేశాన్నంతా కాంతితో నింపింది. సరుకు రవాణా చేస్తున్నవాళ్ళు మొత్తం ముప్పైమంది దాకా వుంటారు. వాళ్ళ వద్ద స్టెన్‌గన్స్ కాక అధునాతనమైన ఆయుధాలున్నాయి.

హనుమంతు అలర్ట్‌గా నిలబడ్డాడు. పక్కనే అతని అనుచరులిద్దరూ మిషన్ గన్స్‌తో నిలబడ్డారు.

దూరంనుంచి వస్తున్న మనుష్యులు ఏ ధైర్యంతో పరుగెత్తుకు వస్తున్నారో అర్థంకాలేదు హనుమంతుకి. సీలేరు ప్రాంతానికి సంబంధించిన గిరిజనులేమో అని భావించాడు. లేకపోతే శ్రీశైలం అడవుల్లోని 'ఒగార్లు' కూడా అయ్యుండవచ్చు. వాళ్ళు ఇలాగే గ్రామాలమీద పడి దోచుకుంటారు. కొంచెం దగ్గరకొచ్చాక, ట్రిగ్గర్ నొక్కితే నల్లుల్లా మాడిపోతారు.

అందరూ తమ తమ పొజిషన్లలో నిలబడి వున్నారు.

హనుమంతుకి హఫీజు, మల్లేశు గుర్తొచ్చారు. వాళ్ళకేమయిందో సరిగ్గా తెలియలేదు. దగ్గర రేంజిలో ఎవరో పేల్చి వుంటారు.

ఈ విషయమై మొదలియార్‌కి తాను సమాధానం చెప్పుకోవాల్సి వుంటుంది. నిజానికిది తన అశ్రద్ధ కాదు. ఏళ్ళ తరబడి రొటీన్‌గా జరుగుతున్న వ్యవహారం కాబట్టి గార్డులు, విజిలెన్స్ లేకుండా నిర్లక్ష్యంగా వున్నమాట నిజమే. కానీ అంత ధైర్యంతో తమమీద కాల్పులు సాగించేది ఎవరు? అసలు ఈ రోజు ఇంత సరుకు వస్తుందని తెలిసేదెవరికి?

కాగడాల వెలుగు మరింత దగ్గరైంది. స్లోమోషన్ సినిమాలోలా దీపం వెలుగులు ఆరుతూ, వెలుగుతూ, గాలికి చెలరేగుతూ నెమ్మదిగా దూసుకువస్తున్నాయి. పది రోజులు ఆకలితో వున్న జనాల పైకి రొట్టెల వర్షం కురిపిస్తే ఎలా పరుగెత్తుకు వస్తారో – అలా వస్తున్నారు వాళ్ళు.

ఇంకొక్క క్షణమే!

వాళ్ళు మరో పది అడుగులు దగ్గరకు వస్తే మిషన్‌గన్ ఆన్ చెయ్యొచ్చు. వాళ్ళు అలాగే నేల మీదకు రాలిపోతూంటే.. ఆ దృశ్యం చూడటానికి బావుంటుంది.

హనుమంతు వేళ్ళు బిగపట్టాడు. ట్రిగ్గర్ మీద అతని వేలు బిగుసుకుంది.

మరోక్షణంలో ... వాళ్ళు తుపాకులు పేల్చబోతున్న సమయంలో వెనుకనున్న పడవనుంచి దిక్కులు బ్రద్ధలయ్యే విస్ఫోటనం వినిపించింది. నీళ్ళు ఒక్కసారిగా ఉవ్వెత్తున పైకి లేచాయి. సముద్రమే, ఆ మంటల ఎరుపుకి రక్త సాగరంలా కనిపించింది. హనుమంతు అదిరిపడి వెనుతిరిగి చూశాడు.

సముద్రం మీద పడవ తాలూకు చెక్కముక్కలు తేలుతున్నాయి, కొన్ని ఇంకా మండుతూనే వున్నాయి. అది తప్ప మిగతా సముద్రం అంతా అలాగే

నిర్మలంగా వుంది. రెప్పపాటు కాలంలో జరిగిన ఆ సంఘటన చూసి హనుమంతు నిర్విణ్ణుడయ్యాడు.

మల్లేశు, హాఫీజు ఎందుకు అంత నిశ్శబ్దంగా పడిపోయారో అర్థమైంది. శత్రువులు నీళ్ళలోనే వున్నారు.

అది తెలిసేసరికి హనుమంతు సన్నగా వణికాడు.

శత్రువు తెలివితేటల్ని తను చాలా తెలివితక్కువగా అంచనా వేశాడని అతనికి అర్థమైంది.

నీళ్ళలో 'స్ట్రా'ల సాయంతో శత్రువులు పొంచివున్నారు. బాంబుల్ని ప్లాస్టిక్ బ్యాగుల్లో సీల్ చేయించి వుంచుకున్నట్టున్నారు. అక్కడినుంచే హాఫీజుని, మల్లేశుని కాల్చేశారు.

ఓడనుంచి ఆఖరి బ్యాచ్ సరుకు పడవలమీద తెచ్చి ఒడ్డున దింపిన కూలీలు అయిదుగురూ, ఆ పడవనే తోసుకుంటూ చీకట్లో కలిసిపోయారు. పక్క పడవ వున్నట్టుండి పేలిపోవడం వాళ్ళని భయభ్రాంతుల్ని చేసింది. ఏదయినా విపత్కర పరిస్థితి ఏర్పడినప్పుడు అనుచరులంతా ప్రాణాలకు తెగించి పోరాడుతారన్నది కేవలం సినిమాలలో మాత్రమే జరిగే విషయం. నిజ జీవితంలో సగంమంది, ఆపద సమయంలో తమ యజమానిని వదిలేసి అలాగే వెళ్ళిపోతారు.

చెదిరిపోయిన ధైర్యాన్ని కూడగట్టుకుని హనుమంతు మళ్ళీ అటెన్షన్‌లో నిలబడ్డాడు.

మిగతా అనుచరులంతా పడవల వెనుక పొజిషన్లు సరిచూసుకున్నారు. శత్రువులు నీళ్ళలోనే వున్నారన్న ఆలోచన వాళ్ళకింకా రాలేదు. హనుమంతుకి

వున్నన్ని తెలివితేటలు వాళ్ళకి లేవు. ఒడ్డుమీంచే ఎవరో ముందున్న పడవపైకి బాంబు విసిరారని, ఆ విసిరినవాడు ఇంకా ఒడ్డునే వున్నాడనీ అనుకుంటున్నారు వాళ్ళు. తాము పడవల వెనుక భద్రతాస్థానంలో వున్నారు కాబట్టి తమకి ఏ ప్రమాదమూ లేదనుకుంటున్నారు. హనుమంతుకి కూడా వాళ్ళు ఆ అభిప్రాయంతోనే వుండటం మంచిదనిపించింది. కాగడాలతో వున్న వాళ్ళని ముందు అటాక్ చేసి, ముందు శత్రునష్టం పెద్ద సంఖ్యలో కలిగించవచ్చు. తన మనుష్యులకి ప్రాణాపాయం లేనంతకాలం, పడవలెన్ని పేలిపోయినా ఫర్వాలేదు.

ఇక్కడే హనుమంతు మరో పొరపాటు చేశాడు.

తనని మరింత అయోమయపరచటానికే శత్రువు ఒక్కొక్క పావు ముందుకు జరుపుకుంటూ వస్తున్నాడని హనుమంతుకి తెలీదు.

అంతలో అతడికి గాలిలో పెట్రోలు కలిసిన వాసన వచ్చింది. అతడికి అదికూడా అర్థంకాలేదు. ఏదో పెట్రోలు బోటు లీకేజ్ వాసన అనుకున్నాడు.

నీళ్ళలో మొత్తం ఆరుగురు వ్యక్తులు దాక్కొని వున్నారు. పడవ పేలిపోగానే, కాళ్ళ దగ్గిర వున్న డ్రమ్ములుపైకిలాగి, వాటి సీళ్ళు ఓపెన్ చేశారు. డ్రమ్ములోంచి బయల్పడిన పెట్రోలు సముద్రజలాలతోపాటు తీరంవైపు వస్తోంది.

ప్యాకెట్లలో వున్న భాస్వరం ఆ పెట్రోలు మీద జల్లి, తిరిగి నీళ్ళలోకి మునిగిపోయారు.

....లోపల్నుంచి ఫైర్ ప్రూఫ్ గొట్టాల ద్వారా గాలి పీలుస్తూ నీళ్ళల్లో కూర్చుండిపోయారు. ఈ విధంగా ఆరు రోజులపాటు వారికి ట్రయినింగ్ యిచ్చాడు బోసు.

కొద్దిసేపు విరామం.

ఆ తర్వాత ఒక్కసారిగా – మొత్తం సముద్రం కాలిపోతున్నట్టుగా మంటలు పైకి లేచాయి. భయంకరమయిన దృశ్యం అది.

నీళ్ళమీద మంటలు క్రమ క్రమంగా దగ్గిరవుతూంటే, ఎంతటి ధైర్యవంతుడికయినా గుండె జారిపోతుంది. పరుగెత్తుకొస్తున్న మృత్యువు తాలూకు పాశాల్లా వున్నాయి ఆ మంటలు. సముద్రంమీద మంటలు చెలరేగగానే – కాగడాల్తో జనం ముందుకు రాసాగారు. ఒకవైపు దగ్గిరకొస్తున్న జనాలు – మరోవైపు ముంచుకొస్తూన్న మంటలు. హనుమంతుకి ఏం చేయాలో పాలుపోలేదు. దుర్గం కూలిపోతూంటే, రక్షణ కట్టులోంచి బయటకొచ్చిన రాజులా, ప్రాణాలకు తెగించి అనుచరులతో ఒడ్డుకు పరుగెత్తాడు. అతడి చేతిలో మిషన్‌గన్ పేలసాగింది.

అదే సమయానికి నీళ్లలోంచి ఎవరో బాంబు విసిరారు. అది వచ్చి పది అడుగుల దూరంలో పేలింది. వస్తూన్న జనంలో ఒకరిద్దరికి మిషన్ గన్ బుల్లెట్స్ తగిలాయి.

అయినా ప్రవాహం ఆగటంలేదు. అన్నిటికీ తెగించినట్టు వస్తూనే వున్నారు. ఒక్క అయిదు నిముషాలు ప్రాణాలు లెక్కచేయకపోతే ఇక జీవితాంతం హాయిగా బ్రతకవచ్చుననే సత్యం వాళ్ళని ఎంతకయినా తెగించేటట్టు చేస్తోంది.

పదడుగుల దూరంలో బాంబు పేలటంతో హనుమంతు మానసికంగా కృంగిపోయాడు. దాదాపు పిచ్చెక్కినవాడిలా మిషన్‌గన్ వృత్తాకారంలో తిప్పుతూ పేల్చబోయాడు. సరిగ్గా ఆ టైమ్‌కి పోలీసు సైరన్‌లు వినిపించసాగాయి. మూడు

వైపుల్నుంచీ సైరన్ శబ్దాలు చేసుకుంటూ వ్యాన్లు చుట్టుముట్టాయి. దూరంనించి ఇసుకలో లేచి పడుతూ వేగంగా వస్తూన్న పోలీసు వ్యాను వస్తూండటంతో హనుమంతు వెనుకనున్న అనుచరులు అప్రయత్నంగా ఆయుధాలు వదిలేసి నీళ్ళలోకి పరుగెత్తారు. అప్పటికి నీటిమీద మంటలు ఆరిపోయాయి.

పడవల్లో పారిపోదామని వారు చేస్తున్న ప్రయత్నానికి వెనుకనుంచి కెరటంలా విరుచుకుపడిన జనప్రవాహం గండికొట్టింది. ఎవరు ఎవర్ని కొడుతున్నారో తెలియలేదు. ఎవరు ఏది దోచుకుంటున్నారో తెలీదు.

మిగిలిన కొద్దిమందితో హనుమంతు పడవలో తప్పించుకోవటానికి చాలా కష్టపడవలసి వచ్చింది.

సముద్రంలో చాలా దూరం వెళ్ళిపోయాక అతను ఒడ్డుకేసి బైనాక్యులర్స్‌తో చూడసాగాడు.

అవి పోలీసు వ్యాన్లు కావు; టూరిస్టు వ్యాన్లు.

కోటి రూపాయల విలువగల స్మగుల్డ్ గూడ్స్‌ని బిర్లానగర్‌కి సంబంధించిన గుడిసెవాసులు పంచుకోవటం కనిపించింది.

బోసుకి సుధాకర్ షేక్ హ్యాండివ్వటం కనిపించింది.

* * *

మొదలియార్ మాట్లాడలేదు. పర్వతాల నాయుడే హనుమంతుతో మాట్లాడుతున్నాడు.

కోటి రూపాయల విలువగల సరుకు పోయినప్పటినుంచీ మొదలియార్ మౌనంగానే వుంటున్నాడు. అసలా వార్త చెప్పగానే తనని చంపేస్తాడనుకున్నాడు హనుమంతు. కానీ అటువంటి ఆవేశమేమీ కనపడలేదు.

అప్పుడే వచ్చిన వార్తకి పర్వతాల నాయుడు మాత్రం కుతకుతా వుడికి పోతున్నాడు.

మద్రాసులో బర్మా బజారులాంటి ఒక షాపింగ్ కాంప్లెక్సుని బోసు పెడుతున్నాడన్న వార్త అది. కస్టమ్స్ నోటిఫైడ్ షాపులు అవి.

"దీనికి లైసెన్స్ ఎవరు ఇచ్చారు?" ఆవేశంతో వణికిపోతూ అరిచాడు హోమ్ మినిస్టర్.

"ముఖ్యమంత్రి..."

"రాష్ట్ర ముఖ్యమంత్రి కస్టమ్స్ లైసెన్స్ ఎలా ఇవ్వగలడు?"

"అటువంటిదేమీలేదు. నిరుద్యోగులకి స్వయం ఉపాధి కల్పన పథకం క్రింద అన్నాడు. సినిమాహాళ్ళల్లో బ్లాక్ టిక్కెట్లు అమ్ముకునే వాళ్ళనీ, పిక్ పాకెటర్స్‌ని సంస్కరించే స్కీము క్రింద షాపులు అలాట్ చేస్తున్నామన్నాడు. కస్టమ్స్ వాళ్ళు పట్టుకున్న సరుకు వెయ్యి రూపాయలుంటే, దొంగ సరుకు పదివేలుంటుంది. అదీ ఇదీ కలిపి అమ్ముతారు. మొత్తం అయిదుకోట్ల విలువగల షాపింగ్ కాంప్లెక్స్ తయారవుతోంది. ఆ బజార్ పేరు "బోస్ బజార్". లైసెన్సు ముసుగులో స్మగుల్డ్ వస్తువులు అమ్మటానికి ఇంతకన్నా పెద్ద ఛాన్సు వుండదు. వచ్చేనెల ప్రారంభోత్సవం..."

"ఆ ప్రారంభోత్సవం వరకూ బోసు వుండదు...."

చాలాసేపటి నుంచీ మౌనంగా వున్న ధనరాజ్ మొదలియార్ అన్నాడు. అందరూ అటువైపు చూశారు.

అప్పటి వరకూ చూస్తున్న కాగితాన్ని అతడు హనుమంతువైపు తోశాడు. "ఇది బిర్లా నగర్ నుంచి మెయిన్ రోడ్డు మీదకు వచ్చేదారి... చాలా ఇరుగ్గా వుంటుంది. ఇదిగో – ఈ ఇల్లు ఎప్పటినుంచో ఖాళీగా పాడుబడి వుంది. దీంట్లో మనవాళ్ళు నలుగురు గన్స్‌తో దాక్కుని వుంటారు. మొదటి రెండు కాల్పులకే అతను చనిపోతాడు. ఒకవేళ గురితప్పి అతను వెనక్కు పరిగెత్తినా, బిర్లానగర్ మొదట్లో ఇంకో ఆరుగురు కిళ్ళీకొట్టు దగ్గిర కూర్చుని ఉంటారు. మెయిన్ రోడ్డు మీద ఒక కారు ఆగి వుంటుంది. అందులో నువ్వుంటావు. నీ దగ్గిర బాంబులుంటాయి. ఒక వేళ బోసు ముందువైపుకి పరుగెత్తుకు వస్తే నిన్ను తప్పించుకు వెళ్ళలేడు. ఇదంతాకాక, ఇదిగో..... ఈ భవంతి పైకప్పుమీద ఒక మనిషి మొత్తమంతా మానిటర్ చేస్తూ వుంటాడు. అందరూ వాకీటాకీలు పెట్టుకుంటారు. అతను ఎటువెళ్ళినా – అతన్ని చంపిగాని మీరు అక్కణ్ణుంచి రారు. పద్మవ్యూహంలోలా అతను ఇరుక్కుపోవాలి. లేడిని వేటాడినట్టు వేటాడి చంపాలి".

'ఒక మనిషిని చంపటానికి పన్నెండు మందా?'అని అడగలేదు హనుమంతు.

"సార్! ఒక చిన్న రిక్వెస్టు" అన్నాడు.

తను చెప్పిన ప్లానుకి మరొకరు అలా ఎదురుచెప్పటం మొదటిసారి – "ఏమిటి?" అని అడిగాడు.

"ఈ బిల్డింగ్‌లో నేనుంటాను".

"ఎందుకు?"

"నా మొదటి బుల్లెట్‌తోనే వాడు చావాలి" కసిగా అన్నాడు హనుమంతు.

మొదలియార్ హనుమంతు భుజంమీద చెయ్యి వేశాడు. సాధారణంగా అతడు అనుచరుల్ని అలా ట్రీట్ చెయ్యడు. నవ్వుతూ అన్నాడు –"ఎవరు చెయ్యాల్సిన పని వాళ్ళు చెయ్యాలి హనుమంతూ.. ఆ బిల్డింగ్‌లో నేను పెట్టిన నలుగురూ వంద గజాల దూరంలో వున్న ఈగనైనా షూట్ చేయగల సమర్థులు..." ఆగి, అన్నాడు – "...బోసు నిన్ను ఫూల్‌ని చేశాడు. నిజమే, నీ అహం దెబ్బతిన్నది. కానీ నాకు కోటి రూపాయలు నష్టం వచ్చింది. దాన్ని నేనెలాగూ రికవర్ చేస్తాననుకో. ముందు ఆ బోసు చావాలి. తరువాత బోసు బజారు వుండదు, బిర్లానగరూ వుండదు".

## 9

**విశారద** ఆఖరిసారి పేపర్లు చదువుకుంది. ఆ రోజునుంచి ఆమెకి పరీక్షలు. ప్రైవేట్‌గా ఎమ్మే చదువుతూంది. ప్రొద్దున్న ఎనిమిదయింది. ఆ రోజు మొదటి పరీక్ష. ఆమె పాకకి తాళంవేసి బయటకొచ్చింది. గోమతి సుధాకర్‌తో కలిసి గుడికి వెళ్ళింది.

ఆమె పాకల మధ్యనుంచి నడుస్తూ మెయిన్ రోడ్డు మీద కొచ్చింది. రిక్షా ఎక్కి పరీక్ష సెంటర్‌కి బయల్దేరింది.

కానిస్టేబుల్ ధర్మరాజు ఆ పోలీస్ స్టేషన్‌కి కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. అతడికి ఆ రోజు డ్యూటీ వ్యభిచారుల్ని బుక్ చేయటం. కోటా పూర్తికాలేదు. యస్సై వస్తే తిడతాడు. ఏం చేద్దామా అని ఆలోచిస్తూ స్టేషన్ అరుగుమీద నిలబడి వుండగా రిక్షాలో వెళుతూన్న విశారద కనపడింది. మంచి చీరె కట్టుకుని నీట్‌గా తయారై వెళుతూన్న విశారదని చూసి అతడు ముందు ఆశ్చర్యపోయాడు. తరువాత కర్తవ్యం గుర్తొచ్చి "ఆగు" అని అరిచాడు. రిక్షావాడు బెదిరి, విశారద దిగగానే అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. అతడామెని గుర్తుపట్టాడు.

దగ్గిరకి వెళ్ళి "బాగున్నావే. బిజినెస్సు బాగా సాగుతోందా?" అన్నాడు.

విశారద ఆశ్చర్యంతో "బిజినెస్ ఏమిటి?" అంది.

జైలునుంచి బయటపడిన ఒంటరి స్త్రీలు 'ఆ' బిజినెస్ తప్ప మరేమీ చెయ్యలేరనే ప్రగాఢ విశ్వాసంతో వున్న చాలా మందిలో అతనొకడు.

"రా, చెపుతాను" అన్నాడు.

ఆమె అర్థంకాక "ఎక్కడికి?" అంది.

నడి రోడ్డుమీద గొడవ ఎందుకన్నట్టు – మొహంమీద నవ్వు పులుముకుని "ఇంతకాలం తరువాత కలిశాం. ఇక్కడే మాట్లాడుకోవాలా? గదిలో కూర్చుందాం పద" అన్నాడు. పోలీస్ స్టేషన్‌లో తనకో గది వున్నట్టు.

అప్పటికే ఇద్దరు ముగ్గురు చిత్రంగా చూస్తున్నారు.

పరీక్షకి ఇంకో అరగంటే టైముంది. అతని మాట కాదన్లేకో, రోడ్డుమీద కానిస్టేబుల్‌తో మాట్లాడటం బావుండదనో ఆమె అతన్ని అనుసరించింది. పోలీస్ స్టేషన్ కాంపౌండ్‌లో పది మందిదాకా ఆడాళ్ళు వున్నారు.

ఒక్కసారి స్టేషన్‌లో ప్రవేశించాక ధర్మరాజు ప్రవర్తన మారిపోయింది.

"ఆ ఇప్పుడు చెప్పవే. ఎక్కడ పెట్టావ్ వ్యాపారం?" అన్నాడు. అర్థమై మొహం జేవురించింది – "హోల్డ్ యువర్ టంగ్" అంది. అతడు నవ్వేడు.

"ఓహో. ఇంగ్లీషు కూడా నేర్చావే" అన్నాడు నవ్వుతూ.

ఈ లోపులో యస్సై వచ్చాడు. విశారద అందం చూసి కన్ను చెదిరింది.

'చాలా ఫ్రెష్‌గా వుందే' అనుకున్నాడు.

ఆమె మాట్లాడలేదు.

"నువ్వుండేది ఎక్కడా? అని అడుగుతున్నారు యస్సైగారు" గద్దించాడు ధర్మరాజు.

"బిర్లానగర్‌లో" అంది. యస్సై పెదవులమీద చిరునవ్వు కదలాడింది.

"ఒహో! ఆ పిక్ పాకెటర్ల బస్తీలోనా?" అన్నాడు.

"యస్సై గారూ! నేను ఎమ్మే పరీక్షలకి వెళ్తున్నాను" అంది.

యస్సై వినిపించుకోలేదు. ధర్మరాజు ఆమెని లాకప్‌లో పెట్టబోయాడు.

"వెనకాల రూమ్‌లో కూర్చోబెట్టు" అన్నాడు.

ధర్మరాజుకి అర్థమైంది. "పద" అన్నాడు.

ఆమె కదల్లేదు, ధర్మరాజు ఆమె రెక్క పట్టుకుని బలవంతంగా ఆ గదిలోకి తీసుకెళ్ళాడు. అక్కడో పొడవాటి బల్లవుంది. చిన్న దిండు కూడా వుంది. యస్సై వాచీ చూసుకున్నాడు. ఎనిమిదిన్నరయింది. కోర్టుకి ఇంకా గంట టైముంది. విశారదలాంటి అమ్మాయిల్ని అతడు చూడలేదు.

ఈ లోపులో తలుపు దగ్గరగా వేసి ధర్మరాజు బయటకి నడిచాడు.

"ఏమ్మే చదివానంటుంది?" అన్నాడు లోపలికి వెళ్ళబోతూ యస్సై.

"అదంతా పోజులెండి. ఆళ్ళకి తెలుసు... ఎనిమిదో క్లాసంటే ఎనభై రూపాయలొస్తాయి. ఏమ్మే అంటే ఎనిమిదొందలొస్తాయి".

విశ్వపు ప్రతి కదలికా విస్తుబోయేట్టు ఆమె దుఃఖించింది. ఆమె కళ్ళు సాగరాలయ్యాయి. అయినా నీళ్ళు రాలేదు. హృదయం అగ్నిపర్వతమై బ్రద్దలయితే సాగరం ఆవిరై – ఇంకిపోతుంది.

ఓ జీవితమా గతం మురికితో గంగని వైతరణిని చేశావు. తరతరాల రోదనతో, నరనరాల వేదనతో బ్రతుకుని రసాతలానికి జార్చావు. బ్రతుకంటే చీకట్లో చావు కాదనే – నా పట్టుదలని మృతి చెందని స్మృతిలో మృతి చెందేలా చేస్తున్నారు.

* * *

విశారదని పోలీస్ స్టేషన్ దగ్గర ధర్మరాజు అటకాయించి, రైడింగ్ కేసుక్రింద బుక్ చేయగానే ఆ రిక్షావాడు కస్టమ్స్ బజారు కొచ్చాడు.

రిక్షావాడు వచ్చి విషయం చెప్పగానే సుధాకర్ కంగారుపడ్డాడు. క్షణాల్లో ఆ వార్త బోసుకి చేరింది. ఎప్పుడూ తొణకని బోసుకూడా ఈ విషయానికి ఒక్కక్షణం తొణికాడు. దగ్గిరే పి.టి. కారుంటే బేరమాడకుండా ఎక్కి స్టేషనుకి పోనిమ్మన్నాడు.

సరీగ్గా రెండు నిముషాలలో టాక్సీ పోలీస్ స్టేషను దగ్గరకొచ్చి ఆగింది. ఆవరణలో ఆడాళ్ళు చెట్లక్రింద నిలబడి వున్నారు. సెంట్రీ సెల్యూట్ చేశాడు.

అతడు డైరెక్టుగా లోపలికొచ్చి రైటర్‌తో "యస్సై గారికి చెప్పు, నేనొచ్చానని" అన్నాడు.

రైటర్‌కి బోసు తెలుసు. ఆ ఏరియా పి.యస్.కి. కూడా నెలనెలా వాటా అందుతుంది. అందుకని నమ్రతగా, "ఒక్క అరగంట కూర్చోండిసార్! వస్తారు. అర్జెంటు పనిలో వున్నారు" అన్నాడు.

ఈ లోపులో ఒక లారీ వచ్చి ఆగింది. దాన్నిండా జనం వున్నారు. రైటర్‌కి అర్థంకాలేదు. బోసు ఆ అవకాశం తీసుకుని అన్నాడు. "అందుకే తొందరగా చెప్పమన్నాను. ధర్నా జరగబోతూంది. ఇప్పుడాయన ఉద్యోగం పోతే నీదే బాధ్యత అవుతుంది" అన్నాడు.

రైటర్ లోపలికి వెళ్ళాడు. బోసు కూడా క్షణం ఆగి అతనితో పాటే యస్సై రూమ్‌లోకి నడిచాడు. ఈ లోపులో యస్సై బయటకి వచ్చాడు.

"ఆ రిక్షావాడు వెళ్ళి బి.జె.పి. వాళ్ళకి చెప్పినట్టున్నాడు. జనాలు చేరుకున్నారు. అది హెచ్చరిద్దామనే వచ్చాను" అన్నాడు బోసు. యస్సై మొహం వాడిపోయింది.

"ఏమిటి? ఇప్పుడేం జరిగిందని?" అన్నాడు తడబడుతూ.

"పోలీస్ స్టేషన్ ముందు నుంచి వెళ్ళుతూన్న ఆడవాళ్ళని లోపలికి లాక్కెళ్తున్నార్ట".

"లేదే. బ్రోతల్స్‌ని బుక్ చేసేమంతే" అన్నాడు యస్సై.

"అయితే ఏదో పొరపాటు జరిగి వుంటుంది. మా అమ్మాయిని కూడా కలిపి తీసుకొచ్చినట్టున్నారు. బయట చెట్లదగ్గర చూశాను. లేదు. ఇంతలో మొదటి లారీ జనం వచ్చేసేరు. లోపలుంటే పంపించండి ఆమెని".

ఇన్‌స్పెక్టర్‌కి ఏం చెప్పాలో తెలియలేదు. ఇంకొంచెం లాగితే తాడు తెగుతుందని తెలుసు. "ఇంటరాగేషన్ కోసం ఆవిణ్ణి లోపలికి తీసుకెళ్ళాం. ఆమేనేమో..." అంటూ లోపలికి హడావుడిగా వెళ్ళి, అంతే తొందరగా బయటకొచ్చాడు. మధ్యలో ... తలుపు తీసిన చప్పుడైంది.

"ఇంతకీ ఎవరా అమ్మాయి" యస్సై వస్తూ అడిగాడు.

"నా భార్య".

యస్సై కంగుతిన్నట్టు చూశాడు. పక్కనున్న సుధాకర్ ఆశ్చర్యపోయి, చప్పున తలెత్తాడు.

బోసు మొహం భావరహితంగా వుంది. అయితే 'నా భార్య'... అని చెపుతున్నప్పుడు అతడి కంఠంలో నిజాయితీ ధ్వనించింది. సుధాకర్ గమనించింది దాన్నికాదు. బోసు – ఈ మొత్తం వ్యవహారాన్నంతా హాండిల్ చేసిన విధానాన్ని.

ఎక్కడా పోలీసుల్తో గొడవ పడలేదు. యస్సైని ఇరకాటంలో పడేసి కోపం తెప్పించలేదు. తలుపులన్నీ వేసికొడితే పిల్లి అయినా తిరగబడుతుంది. యస్సై తప్పుని రెడ్‌హాండెడ్‌గా పట్టుకుని గొడవ చేస్తే, ఆ తరువాత సంబంధాలు చెడిపోతాయి. అదికూడా దృష్టిలో వుంచుకుని వ్యవహారాన్ని నడిపాడు. లారీలో జనాన్ని తీసుకురమ్మని పురమాయించడం... "నా భార్యని 'పొరపాటున' పట్టుకున్నావు. అయినా నేనేమీ గొడవ చేయడం లేదు చూశావా" అని చెప్పడం...

ఇక ఆ యస్సై గిల్టీ ఫీలింగ్‌తో జీవితాంతం కృతజ్ఞుడిలా పడివుండేలా చెయ్యటం, అంతా ఒక ప్లాన్ ప్రకారం చేసినట్టు చేశాడు. మంచి నాయకత్వ లక్షణం అది. సుధాకర్ సంభ్రమంతో దాన్నంతా గమనించాడు.

అయితే బోసుకూడా మనిషే. ఆవేశానికి అతడేమీ అతీతుడు కాదు.

తలుపు తీయగానే విశారద పరుగున వచ్చి బోసు దగ్గిర ఏడ్చేసింది.

అది పోలీస్ స్టేషన్ అనీ, అందరూ వున్నారని కూడా చూడలేదు. బోసు ఆమెని ఓదారుస్తున్నట్టు పొదివి పట్టుకున్నాడు. అలాగే పట్టుకుని బయటకు తీసుకువచ్చాడు.

లోపల ధర్మరాజు యస్సైతో అనటం వినిపించింది. "అంతా అబద్ధం సార్! దానికసలు పెళ్ళే కాలేదు. మెళ్ళో మంగళసూత్రం లేదు. చూశారా! వాళ్ళు ఇలాగే ఎత్తులేస్తారు. అదొక పెద్ద లం... సారూ! నాకు బాగా తెలుసు. జైలు క్కూడా వెళ్ళొచ్చింది".

వరండాలో నడుస్తూన్న బోసు ఆగాడు. అక్కడ గాలికూడా స్థంబించినట్టు అనిపించింది సుధాకర్‌కి. బోసు వెనుదిరిగి లోపలికి వెళ్ళాడు. 'మళ్ళీ ఎందుకొచ్చావు' అన్నట్టు యస్సై అతనివైపు చూశాడు. బోసు మాట్లాడలేదు. అతనివైపు చూడలేదు కూడా.

పిడికిలి గట్టిగా బిగించి, ధర్మరాజు దవడమీద బలంగా కొట్టాడు. అహమ్మద్ ముక్కుదూలం విరిచిన దెబ్బ అది. ఆ దెబ్బకి ధర్మరాజు వెళ్ళి గది మూలగా పడ్డాడు. పెద్ద శబ్దమైంది. టోపీ వెళ్ళి మరో మూలగా పడింది. నూతిలో

జల పడినట్టు నోట్లోంచి రక్తం ఉబికి వచ్చింది. ఏ డెంటిస్టూ సరిచెయ్యలేనంతగా పక్కదంతాలు మూడు విరిగిపోయాయి.

బోసు మరోక్షణం వేచి చూశాడు. 'డ్యూటీలో వున్న పోలీసును కొట్టినందుకు....' లాటి దేమన్నా యస్సై అంటాడేమో అన్నట్టు ఆగాడు. స్వీయరక్షణా ప్రయత్నంలో యస్సై – ఈ విషయంలో పెద్ద ఆసక్తి చూపించలేదు. తీగెలాగితే డొంక కదుల్తుందని అతనికి తెలుసు.

బోసు బయటికి వచ్చాడు. విశారదని తీసుకుని వచ్చి టాక్సీ ఎక్కాడు. సుధాకర్ లారీ ఎక్కాడు. రెండు వాహనాలూ కదిలాయి.

...కార్లో విశారద దుఃఖం మళ్ళీ మొదలైంది. ఒక్క నిముషం వూరుకుని బోసు అన్నాడు – "చూడు విశారద..... నువ్వు నాకన్నా ఎక్కువ చదువుకుంటున్నావు. నాకన్నా పెద్ద ప్రపంచాన్ని చూశావు. అయినా నీకు చెపుతున్నందుకు ఏమీ అనుకోకు. మనం బాధపడేకొద్దీ బాధ మనల్ని బాధ పెడుతుంది. మనసు అద్దంలాంటి దంటారు. బుగ్గమీద జారిన కన్నీటిని తుడుచుకున్నట్టే అద్దంమీద బాధని కూడా ఎప్పటికప్పుడు తుడిచేసుకుంటూ వుండాలి. లేకపోతే అది అంతర్ దర్శనానికి వీల్లేకుండా పాడైపోతుంది. నీకు అవమానం జరిగిందని బాధపడుతున్నావు. కానీ ఒకటి ఆలోచించావా? మేము రావటం మరో పది నిముషాలు ఆలస్యమై వుంటే యింకా పెద్దఘోరం జరిగి వుండేది".

ఆమె వెక్కుతూ, "ఇప్పుడు మాత్రం అంతకన్నా తక్కువ ఏం జరిగిందనీ?" అంది.

"ఇప్పుడు జరిగింది నీకూ, ఆ పోలీసుకీ, యస్సైకీ మధ్య జరిగింది. రేపటికల్లా వాళ్ళా సంగతి మర్చిపోతారు. గుర్తుంచుకుని నువ్వు మాత్రం చేసేదేముంది? నువ్వూ మర్చిపో. మన బాధలన్నిటికీ మూలకారణం – 'ఎవరేమనుకుంటారో' అన్నదే. మనం అనుకున్నంతగా వాళ్ళు మన గురించి అనుకోరు. వాళ్ళకున్న లక్ష పనుల్లో 'మనం' ఒకటి. మనకి మాత్రం ఒకటే పని. మన గురించి మనమే నిరంతరం ఆలోచిస్తూ ఉండటం! ఆ ఆలోచన మానేస్తే మనం ఇంకా చాలా పనులు చెయ్యొచ్చు. నేను చెప్పింది అర్థమవుతుందా?"

ఆమె నిశ్శబ్దంగా వుండిపోయింది.

"కాబట్టి ఇదంతా మర్చిపో. మర్చిపోయినట్టు సూచనగా ఒకసారి నవ్వేసి కారు దిగు".

ఎక్కడికి వచ్చామా అన్నట్టు ఆమె ఆశ్చర్యంగా బయటకు చూసింది. కారు ఎగ్జామినేషన్ సెంటర్ ముందు ఆగి వుంది. ఆమె అయోమయం నుంచి ఇంకా తేరుకోలేదు. అతనివైపు చూసింది.

అతడి కళ్ళలోంచి అదో రకమైన హిప్నాటిక్ సజెషన్.. ప్రోత్సహిస్తున్నట్టు .... పోయిన శక్తి తిరిగి ఇస్తున్నట్టు... ఆమెని చేరుతోంది. అతడు మామూలుగా... చా... లా... మామూలుగా వున్నాడు. "పరీక్ష ప్రారంభమవటానికి ఇంక అయిదు నిముషాలే వుంది" అన్నాడు.

ఆమె కారు దిగింది.

కిటికీలోంచి అతనివైపు చూసింది.

ఆమె పెదవులమీద నవ్వు పువ్వులా విచ్చుకుంది.

# 10

"**అబ్బా** – చాలా సాధించేవే" అన్నాడు సుధాకర్, బోసు చెప్పిందంతా విని.

"అవును. ఇకనుంచీ మనకి 'మధ్యవర్తు'లుండరు. డైరెక్టుగా జపాన్ నుంచే సరుకు దిగుతుంది. మనం చేయవలసిందల్లా కస్టమ్స్ నుంచి జాగ్రత్తగా వుండటమే..."

"మొదలియార్ నుంచి కూడా".

"ఏడిశాడు" అన్నాడు బోసు. "...నేను లేని ఈ రెండు నెలల్లో ఏమన్నా చేశాడా?"

"లేదు..."

"మా కోసం జపాన్ నుంచి ఏం తెచ్చావ్?" అంది పద్మావతి కల్పించుకుని. "జపాన్‌లో మంచి చీరెలు దొరుకుతాయటగా?"

"అక్కణ్ణుంచే మనం సరుకు తెప్పించుకొంటూ వుంటే, మళ్ళీ స్పెషల్‌గా బోసు ఎందుకూ తేవడం?" అన్నాడు సుధాకర్. "మొత్తానికి ఆడదానివనిపించావ్".

పద్మావతి మూతి మూడు వంకర్లు తిప్పింది.

"మంచి వార్త తెచ్చాగా. అది చాలదా?" పద్మావతిని ప్రశ్నించాడు బోసు నవ్వుతూ.

"మంచి వార్తేమిటి?"

"ఇకమీదట మన బజార్లో 'జపనీస్ మేడ్' అన్న పేరుమీద ఇండియాలో తయారైన వస్తువులు అమ్మడు కావు. అసలు సిసలైన జపనీస్ సరుకు మాత్రమే లభ్యమవుతుంది. దాంతో మన అమ్మకాలు రెట్టింపు అవుతాయి. అవి చాలదా? దొంగ సరుకులో కూడా నాణ్యమైనది ఇవ్వటం అంటే మాటలు కాదు".

అంతలో తలుపు దగ్గిర చప్పుడైంది. ముగ్గురూ అటు చూశారు.

విశారద నిలబడి వుంది. ఆమె చేతిలో పేపరుంది. మొహం ఆనందంతో విప్పారి వుంది.

"రిజల్ట్స్ వచ్చాయా?" అడిగాడు బోసు లేచి నిలబడుతూ.

"పోయింది" అంది.

ముగ్గురూ ఒక్కసారిగా 'ఏమిటీ' అన్నారు.

చిన్నపిల్లాడు తల్లి దగ్గర ఎక్కువసేపు రహస్యం దాచలేనట్టుగా –

"...ఫస్ట్ క్లాస్" అంది ఫక్కున నవ్వేస్తూ.

* * *

కారు వేగంగా వెళ్తోంది.

"ఎక్కడికి వెళుతున్నాం మనం?" అడిగింది విశారద.

"ఇప్పటికి ఆరోసారి ఇలా అడగటం. కొంచెం సేపు ఓపిక పట్టరాదా" బోసు నవ్వుతూ అన్నాడు.

ఆమె కోపం నటిస్తూ కారులోంచి బయటకు చూడసాగింది. ఊరిపొలిమేరలు దాటి పది నిముషాలైంది. రోడ్డు కూడా నిర్మానుష్యంగా వుంది. చల్లటి గాలి రివ్వున వీస్తోంది.

కారు మరో అయిదు నిముషాలు ప్రయాణించి, ఒక కాంపౌండ్‌లో ప్రవేశించింది. కనపడనంత దూరం కంచె వుంది. దాదాపు పదెకరాలుంటుంది ఆ స్థలం.

దూరంగా బావి దగ్గర మోటార్ శబ్దం వినిపిస్తోంది. కారు వెళ్తున్న దారి పక్కనే కాలువలోంచి నీళ్లు గలగలా ప్రవహిస్తున్నాయి. రోడ్డుకిరువైపులా అరటిచెట్లు, బంతిపూలు.

ఒక పల్లెటూరి వాతావరణం అక్కడ ప్రతిబింబిస్తోంది.

దూరంగా – అక్కడక్కడా పాకలు విసిరేసినట్టు వున్నాయి. చిన్న చిన్న పిల్లలు కనబడుతున్నారు.

కారు ఒక పెద్ద పాకముందు ఆగింది, కాస్త దూరంగా గాంధీతాత విగ్రహం, జెండా స్తంభం వున్నాయి.

ఇద్దరూ కారు దిగారు.

"ఏమిటిది?"

"స్కూలు".

"అది తెలుస్తూనే వుంది. ఇక్కడి కెందుకొచ్చాం?"

"ఈ రోజు నుంచీ ఇది నీదే కాబట్టి ".

ఇసుక ఎడారిలో నడుస్తున్న మనిషికి ఒక్కసారిగా మలయమారుతం చుట్టుముట్టినట్టు ఆమె కదిలిపోయింది. చెట్టు కొమ్మల్లో చిక్కుకున్న గాలిపటం చిరక్కుండా జాగ్రత్తగా బయటకు తీస్తున్న పిల్లవాడి మొహంలో భయాందోళన

స్థానే క్రమక్రమంగా తృప్తి చోటు చేసుకుంటున్నట్టు – ఒక్కొక్కమాటే అర్థమై ఆమె పనిపిల్లే అయింది! అది ఆశ్చర్యమూ కాదు, ఆనందమూ కాదూ, సంభ్రమం....

అయినా అనుమానం ఇంకా తీరనట్టు చూసింది.

'బాలుండెక్కడ? బండి ఎక్కడ? నభోభాగంబుపై జేడ్పడన్ కాలం దున్నుట ఎక్కడ' అని బమ్మెర పోతనే ఆశ్చర్యపోయినట్టు... ముప్పిరిగొన్న ఆనందాశ్చర్యాలతో "ఇది... ఇది... నువ్వు..." అంది.

"కొన్నాను".

"ఎంత?"

"పాతిక లక్షలు?"

ఆమె వూపిరి బిగపట్టి అతనివైపు చూసింది. ఆమె అనుమానం అర్థమైనట్టు అతను చెప్పసాగాడు.

"నీ జీవితాశయం కదా విశారదా ఇది! దీన్ని సాధించటానికే నేను పైసా పైసా కూడబెట్టాను. పాకల్లోనే మనం ఇంతకాలం గడపటానికి కారణం కూడా ఇదే. ఇకనుంచి ఈ వేయిమంది విద్యార్థులూ నీ వాళ్ళే. ఈ సామ్రాజ్యానికి నువ్వే మహారాణివి... విశారదా.." అతడి గొంతు వణికింది. "...నీ ఆశయం నెరవేరితే సంతోషపడే మొదటి వ్యక్తిని నేనే... ఎందుకంటే... ఎందుకంటే...దార్లు వేరైనా ...నా తండ్రిదీ – నీ తల్లిదీ – అందరి ఆశయమూ అదే... ఎలా చేస్తావో – ఏం చేస్తావో నీ ఇష్టం".

ఆమె వినడం లేదు. ఆమె చెంపలమీద నుంచి ఆనందాశ్రువులు జలజలా రాలిపోతున్నాయి. వంగి దోసిళ్ళలో మట్టి తీసుకుని గాలిలోకి విసిరేసింది.

నవ్వింది. ఏడ్చింది. పిల్లకాల్వలో నీళ్ళు చెల్లాచెదురు చేసింది. ఆశ తూర్పులో అవకాశం సూర్యుడొస్తున్న ఎరుపు సందడి –

మదిలో ఆనందం జొరబడి – ఉద్వేగంతో ఎద అలజడి!

ఆనందంతో అడుగులు తడబడి – ఏం చెయ్యాలో తెలియక నిలబడి – దూరంగా గమ్యం కనపడి – మళ్ళీ అదే హడావుడి.

వారిని అక్కడికి తీసుకొచ్చిన డ్రైవరు ఆశ్చర్యంగా ఆమెని చూస్తున్నాడు.

బోసు మాత్రం ఆమె ఉద్వేగాన్ని అర్థం చేసుకున్నట్టు వున్నాడు.

...నా ఆశ ఆకాశం అంచుల్లోకి వెళ్ళిపోయిందని దిగులుపడుతూ రాలుతూన్న ప్రతి నక్షత్రం వంకా చూస్తూ నిట్టూర్చాను. చందమామే ఆశని ఆశయం చేసి చేతుల్లో పెట్టింది. శిల దొరికింది. శిల్పం చెక్కడం మిగిలింది.

# 11

**"సుధాకర్!** నాకొక గొప్ప ఆలోచన వచ్చింది" అంది పద్మావతి.

"మళ్ళీ ఏం వొచ్చింది?" అన్నాడు సుధాకర్ భయంగా ఆమెవైపు చూస్తూ.

"నేనొక కంపెనీ పెట్టదల్చుకున్నాను".

సుధాకర్ అదిరిపడి "కంపెనీయా? నువ్వు... కంపెనీ పెడతావా? ఏం కంపెనీ? ఆడాళ్ళ కంపెనీయా?" అన్నాడు. పద్మావతి మాట్లాడలేదు. అప్పుడే ఊహా లోకాల్లోకి తేలిపోయినట్టు, కళ్ళు అరమోడ్పులు చేసి ఆలోచనల్లోకి జారిపోయింది.

సుధాకరే ఆమె చెవి దగ్గరికి చేరి, "ఓసీ పద్మావతీ! ఇప్పుడు నీకేం తక్కువైందనే? బోలెడు డబ్బు సంపాదిస్తున్నావు కదా. మళ్ళీ బ్రోతల్ కంపెనీ ఎందుకు – రిస్కు" అని బ్రతిమాలటం మొదలు పెట్టాడు.

ఆమె కళ్ళు విప్పి, "బ్రోతల్ కంపెనీ కాదసే... పబిలీక్ కంపెనీ" అంది.

"పబ్ – లీక్ కంపెనీనా? అదేమిటి?"

"పబ్‌లీక్ ఇల్లెటరేట్ కంపెనీనో అదేంటో".

"పబ్లిక్ లిమిటెట్ కంపెనీనా?" అనుమానంగా అడిగాడు.

"ఆ... ఆ – అదే". మళ్ళీ కళ్ళు మూసుకుంది. "నేనంతా వాకబు చేశాన్లే పబ్‌లీక్ కంపెనీ పెడ్తే కోట్లు వస్తాయట. జనానికి షేర్లు అమ్మొచ్చునంట. ఆ తరువాత విదేశాలకి వెళ్ళొచ్చునంట".

"ముఖ్యమంత్రిని వుంచుకుంటానన్నావ్. ఆ విషయం ఏమైంది?"

"లాభం లేదని చెప్పాను సుధాకరూ! ముఖ్యమంత్రే ఏదో సెటప్పు పెట్టాడట. అదీగాక అతని పొజిషను కూడా బాలేదట".

"లేటెస్టు వ్యవహారాలు తెలుసుకోవటంలో వున్న ఈ మాత్రం ఇంటరెస్టు – మాములు జ్ఞానంలో ఉంటే ఎంత బావుండేది..." అని.

"...ఇదంతా సరేకానీ – నిరంతరం వూహల్లో తేలటమేనా, పెళ్ళీ గట్రా చేసుకునేదేమైనా వుందా?"

"పెళ్ళి చేసుకోను. ముఖ్యమంత్రి మారగానే, కొత్తవాడితో 'గట్రా'కి అభ్యంతరం లేదు".

"ఆడదానివై వుండీ అలా మాట్లాడటానికి సిగ్గులేదూ?"

"మొగాళ్ళు మాట్లాడితేనూ, పబ్లిగ్గా చేస్తేనూ ఫర్వాలేదా?" ఎదురు ప్రశ్న వేసింది.

సుధాకర్ గతుక్కుమని, "అయితే పెళ్ళి చేసుకోనంటావ్" అని మాట మార్చాడు.

"మనకి సరిపోయేవాడు ఈ భూప్రపంచం మీదే లేడులే" ఓరగా చూసి కవ్విస్తున్నట్టు అంది.

పెళ్ళి ప్రసక్తి వచ్చేసరికి సుధాకర్ ఎప్పట్నుంచో చెపుదామనుకున్నది గుర్తొచ్చినట్టు, కాస్త తటాపటాయించి, "నాకో సాయం చేస్తావా పద్మావతీ" అని అడిగాడు.

ఆమె మొహంలోకి మరింత దర్జా తెచ్చుకుంటూ, "మినిస్ట్రీ రాకముందే సాయమా?...చెప్పు" అంది.

"గోమతిని చేసుకోవాలని వుంది నాకు".

పెద్ద రొద చేస్తున్న మిషన్లు ఒక్కసారి ఆగిపోయినట్లు నిశ్శబ్దం! పద్మావతి మొహంలో నవ్వు మాయమైంది. ఒక ఇసుక తుఫాను చెప్పాపెట్టకుండా వచ్చేసి, క్షణంలో అంతా వూడ్చేసుకుని భయంకర శూన్యాన్ని మిగిల్చేసి వెళ్లిపోయినట్టుగా వుంది.

ఆమె మౌనాన్ని సుధాకర్ మరో విధంగా అర్థం చేసుకున్నాడు.

"...బోసు వప్పుకోడంటావా?" అన్నాడు అనుమానంగా.

ఆమె మామూలు మనిషి అవటానికి కొంచెం సమయం పట్టింది. "ఎందుకొప్పుకోడు? చాలా సంతోషిస్తాడు కూడా!" సూర్యుడి మీదగా దట్టమైన

మేఘం వస్తూంటే ఎలా నీడ భూమ్మీద పాకుతుందో – అలా ఆమె మొహం క్రమంగా వివర్ణమైంది. తమాయించుకుంది. "...చాలా మంచి పని చేస్తున్నావు సుధాకరూ! బోసు అదృష్టవంతుడు. అంతకన్నా గోమతి అదృష్టవంతురాలు. ఆమెని గుడ్డిదాన్ని చేసి దేముడు అన్యాయం చేసేడనుకున్నాను. నిన్ను ఇవ్వటం ద్వారా అదృష్టవంతురాల్ని చేశాడు".

"మరి బోసుకి నువ్వు చెపుతావా?"

ఆమె వెంటనే సమాధానం చెప్పలేదు.

"బోసుతో మాట్లాడడానికి నీకూ భయంగా వుందా?"

కంట తడి అతడికి కనిపించకుండా చేయటానికి ప్రయత్నిస్తూ, "భయమెందుకు?" అంది. "అసలు నాకు వచ్చిందే మాట్లాడడం కదా! అయితే నాతో వచ్చిన చిక్కేమిటంటే, మనసులో వున్నది మాటల్లోరాదు. మాటల్లో వచ్చేదంతా మనసులోది కాదు".

"నువ్వు చెప్పేది నాకు అర్థంకావటంలేదు".

"నేను అర్థం కాలేదని నా కర్థమైందిలే..."

"ఈ మధ్యవర్తిత్వం నీ కిష్టం లేదా?"

ఆమె నవ్వింది. "ఇష్టం లేకపోవటమా? రాజకీయ నాయకులకీ ఇష్టాయిష్టాలంటూ విడిగా వుండకూడదు సుధాకరూ. ముఖ్యమంత్రి పదవి నాశిస్తూన్న అసమ్మతి నాయకుడు కూడా, అధిష్టాన వర్గం చెప్పితే, కొత్త ముఖ్యమంత్రి పేరు నవ్వుతూ ప్రతిపాదించాలి... మనసులో ఏముందో

తెలియనివ్వకపోవటమే రాజకీయ నాయకుల ముఖ్య లక్షణం. కనీసం దాన్ని ప్రాక్టీసు చేయనీ..."

*    *    *

"ఈ స్కూలు నీ కెందుకు వద్దంటున్నావో అర్థంకావటంలేదు" నిస్సహాయంగా అన్నాడు బోసు.

పది నిముషాలనుంచీ వారిద్దరి మధ్యా వాగ్వివాదం జరుగుతోంది. "ఈ డబ్బు సంపాదించటానికి నేను చాలా కష్టపడ్డాను" అన్నాడు.

ఆమె చివ్వున తెలత్తింది. "...నాకు తెలుసు బోసూ... నువ్వు చెప్పేవరకూ ఇంత డబ్బు నువ్వు సంపాదించావని మా కెవరికీ తెలీదు. స్వంత చెల్లిని కూడా ఆ పాకలోనే వుంచి, నువ్వీస్థలం కొన్నావంటే, ఈ పనికోసం నువ్వెంత పట్టుదలతో వున్నావో అర్థమవుతుంది. అందుకే బోసూ నాకు ఆనందంతో దుఃఖం కూడా వచ్చింది".

"మరేమిటి నీ అభ్యంతరం?"

ఆమె సమాధానం చెప్పలేదు.

"మాట్లాడు విశారదా! నువ్వు చెప్పకపోతే ఎలా తెలుస్తుంది?"

ఆమె తనలో తనే అనుకుంటున్నట్టు "ఈ డబ్బంతా ఎలా వచ్చింది? దొంగ సరుకు అమ్మి... అలా అమ్మేవాళ్ళని చంపి... లంచాలు ఇచ్చి... నేరాలు పెంచి..." అంది.

అతడామె వైపే చూస్తున్నాడు.

"నన్నర్థం చేసుకో బోసూ! ఒక పవిత్రమైన ఆశయాన్ని 'ఇలాటి డబ్బు'తో మొదలు పెట్టనా?"

అతనికి కోపం రాలేదు. బాధ కలగలేదు. ఆ అభియోగానికి నవ్వొచ్చింది. "సమ సమాజ స్థాపన అంటూ పోరాడే పార్టీకి – చందాలిచ్చే వారందరూ నీతీ నిజాయితీలతోనే డబ్బు సంపాదిస్తున్నారంటావా? అలా నీతిగా సంపాదించిన డబ్బే మా పార్టీ ఫండుకి ఇవ్వాలని ఆ పార్టీ కండిషను పెడుతున్నదంటావా?" అన్నాడు.

ఆమె బ్లాంక్‌గా తలెత్తింది. అహం దెబ్బతిన్నట్టు – ఆమె అంది. "నా తండ్రి ఇచ్చింది కూడా నేనందుకే తీసుకోలేదు. ఆయన అమర్చిన సకల సౌఖ్యాలూ కాలదన్ని వచ్చేసింది కూడా ఈ అంతర్ సంఘర్షణ భరించలేకే ... దేన్నైతే నేను పోరాడి గెలవాలనుకున్ననో, ఆ పోరాటానికి కావాల్సిన సహకారాన్ని మళ్ళీ 'దాన్నుంచే' తీసుకోమంటావా ?"

"చూడు విశారదా! మన భావాలూ, గమ్యాలూ మనకుంటాయి. వాటికి కావలసిన శక్తిని మనమున్న సమాజం నుంచే తీసుకోవాలి. మనం విడిగా వుంటూ ఈ సమాజాన్ని మార్చలేం. దీనిలోంచే మనం బాట వేసుకోవాలి. నీ గమ్యం ఒక కార్యకర్తగా, నా లక్ష్యం ఒక సానుభూతిపరుడుగా వుంచుకుందాం. నువ్వు సాధించే సమాజం వచ్చేవరకూ మమ్మల్ని ఇలా బ్రతకనివ్వు..."

"ఎలా? ఏ.సి. కార్లలో తిరుగుతూ, త్రిబుల్ ఫైవ్ సిగరెట్లు కాలుస్తూ – మాకు చందాలిస్తూ – మా మీద సానుభూతి చూపిస్తూ..." కసిగా అంది.

"అవును..." అతను కూడా దృఢంగా అన్నాడు. "అలా వద్దంటే నీకు సపోర్టుకి కూడా ఎవరూ మిగలరు! కనీసం వచన గేయాలూ, కవిత్వం వ్రాసేవాళ్ళు కూడా మిగలరు".

"మిగులుతారు. సిద్ధాంతం కోసం సర్వస్వం వదులుకున్నవాళ్ళు కొన్ని వేలమంది వున్నారు".

"వదులుకోకుండా సిద్ధాంతంమీద సానుభూతి చూపించేవాళ్ళు కొన్ని లక్షల మంది వున్నారు... అంతేకాదు, ఫ్యాషన్ కోసం సిద్ధాంతం గురించి మాట్లాడేవాళ్ళు కొన్ని కోట్లమంది వున్నారు".

అతడు దగ్గిరగా వచ్చి ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు –"...నేను లక్షలమందిలో ఒకడిని అయినందుకు సంతోషిస్తున్నాను. కోట్లలో ఒకడిని కానందుకు మరీ సంతోషిస్తున్నాను".

"ఓహో అయితే ఈ సమరంలో నువ్వు గాంధీవా? బోసువా? భగత్ సింగ్వా?"

అతడు నవ్వాడు. "...స్మగ్లర్ని కొట్టి మీకు యిచ్చాను కాబట్టి అల్లూరి సీతా రాబిన్హుడ్ రాజు ననుకో" అన్నాడు.

ఆమె నవ్వలేదు.

"కానీ నువ్వుకూడా స్మగ్లింగే చేస్తున్నావు! హత్యలూ... నేరాలూ"

"మీ సిద్ధాంతాన్ని అమలు జరపటం కోసం మీరు మాత్రం ఆయుధాలు విదేశాల్నుంచి స్మగుల్డ్ చేసుకోవడం లేదా? హత్యలు చేయటం లేదా?" సూటిగా అడిగాడు బోసు.

"దాంట్లో స్వార్థం లేదు. లక్ష్యం మాత్రమే వుంది".

"నాకూ స్వార్థం లేదు. నా లక్ష్యం మా బ్లాక్ మార్కెటీర్ల జీవితాలు బాగుపర్చటమే".

"దానికీ దీనికీ పోలికా?"

"ఏం తప్పా?" అన్నాడు బోసు. "... ఇదే నేను కస్టమ్స్ డిపార్టుమెంటులో వుండి వుంటే నాకు రాష్ట్రపతి పతకం కూడా లభించి వుండేది".

ఆమె అతడివైపు నిస్సహాయంగా చూసింది! "బోసూ, నీది వింతండవాదమనీ, నువ్వు చేసుకుంటున్నది ఆత్మవంచననీ నీకు తెలుసు. కేవలం వాదించాలనే వాదిస్తున్నావు కదూ" అంది.

అతడు దగ్గిరగా వచ్చి, "ఈ స్కూలు ఈ రోజునుంచీ నీది. కాదనకు" అన్నాడు.

"సరే... ఒక షరతుమీద".

అతడు ఆశ్చర్యంగా "ఏమిటి?" అన్నాడు.

ఆమె పాకలో ఒక మూలన్న పెట్టెలోంచి తల్లి తాలూకు మంగళసూత్రం తీసింది. "నన్ను నా దార్లో వెళ్ళమన్నావ్. కానీ మనిద్దరిదార్లూ వేరు కాదు! భార్యభర్తలం కదా".

అతడింకా విస్మయంనుంచి తేరుకోలేదు.

"ఒక కార్యకర్తగా నీ పంథా మార్చుకోమని అనలేదు. కానీ భార్యగా నిన్ను కట్టి పడెయ్యగలను. ఇంతవరకు చేసింది చాలు. నీ వాళ్ళందరూ బాగానే వున్నారు కదా. ఇక ఈ వ్యవహారాలన్నీ వదిలి పెట్టు".

అతడు మాట్లాడలేదు. ఆమె దగ్గరగా వచ్చింది. "ఏమిటి ఆలోచిస్తున్నావు బోసూ? ఆ రోజు పోలీస్ స్టేషన్‌లో 'ఆమె నా భార్య' అని ఎందుకన్నానా అని చింతిస్తున్నావా?"

ఆమె చేతిలో సూత్రం తీసుకుని ఫోటో దగ్గిరపెట్టి "సరే, ఈ సూత్రం నీకు మెడలో కట్టి దానిమీద ప్రమాణం చేస్తాను. సరేనా" అన్నాడు నవ్వుతూ. "... ముందు గోమతికి సంబంధం చూడాలి".

ఆమె సిగ్గుపడి "నేనేం తొందరపడడం లేదులే" అంది.

వాతావరణం తేలిక పడినట్టు అనిపించింది ఇద్దరికీ.

బయట వాతావరణం మాత్రం అంత తేలిగ్గా లేదు.

బోసు విదేశాల్నుంచి వచ్చాడని తెలిసి మొదలియార్ అతడి హత్యకి సన్నాహాలు పూర్తిచేశాడు.

## 12

**మంగళవాద్యాలు** మోగుతున్నాయి.

పెళ్ళి పనులన్నీ అప్పారావూ, పద్మావతీ మీద వేసుకున్నారు.

అహల్య, ఆమె భర్త చుట్టపు చూపుగా ముహూర్తానికి అరగంట ముందు వచ్చారు. రామ్మూర్తి ఒక్కడే వచ్చాడు. అతని భార్యకి అరో నెలట.

అన్నకీ, అహల్యకీ విశారదని పరిచయం చేశాడు బోసు. ఆ అమ్మాయి ఎమ్మే చదువుకుంది అంటే ఆశ్చర్యపోయింది అహల్య.

"నీకు అమ్మా. నాన్నా లేరా?" అడిగింది.

"లేరు. చిన్నప్పుడే పోయారు".

"మరి ఎవరు పెంచారు?"

"జైలు".

తలమునకలయ్యేటంత ఆశ్చర్యంతో ఆమెవైపు చూశారు రామ్మూర్తి, అహల్యలు! విశారదకి ఇప్పుడు తనమీద తనకి బాగా నమ్మకం కలిగింది. మునుపటి విశారద కాదు. గతం అంటే భయంలేదు. దాన్నెవరయినా ఎద్దేవా చేస్తే దుఃఖం రాదు. పోలీస్ స్టేషన్ సంఘటనా, ఆ తరువాత బోసు చెప్పిన సూక్తీ ఆమె మీద గొప్ప ప్రభావాన్ని చూపాయి.

తన గతాన్నించి తాను విడిపోలేననీ, అది తనతోపాటే వుంటుందని ఆమె గుర్తించింది.

తనని తనుగా ఇష్టపడే వ్యక్తులే తనతో వుంటారు! తనని తనుగా స్వీకరించగలిగేవారే స్నేహితులూ – ఆప్తులూ అవుతారు! తను జైలుకి వెళ్ళిందన్న మాట వాస్తవం. అది ఎప్పుడూ వాస్తవంగానే ఉంటుంది. దాని వెనుకనున్న తన నిజాయితీ గానీ, నిరపరాధినన్న వాదాన్ని గానీ అందరికీ బొట్టు పెట్టి చెప్పవలసిన అవసరంలేదు. ఇంతకుముందు గతాన్ని తల్చుకుంటే దుఃఖమూ, గిల్టీ ఫీలింగ్, ఆత్మన్యూనతా భావమూ కలిగేది. బోసు ఆసరాతో దాని స్థానే ఆత్మవిశ్వాసం కలిగింది.

అయితే, ఆమెని అంత తొందరగా వదిలిపెట్టలేదు వాళ్ళు. ఒక వైపు మంగళసూత్రధారణకి టైమ్ అవుతున్నా ఆమెని ప్రశ్నిస్తూనే వున్నారు.

"ఎన్నాళ్ళున్నావ్ జైల్లో?"

"మూడు సంవత్సరాలు... పిక్ పాకెట్ చేస్తూంటే పట్టుకున్నారు... అక్కడే గ్రాడ్యుయేషన్ చేశాను" మళ్ళీ మళ్ళీ అడక్కుండానే అన్ని వివరాలూ చెప్పింది. "అన్నట్టు మీ మామగారు కూడా నాకు తెలుసు. ఇన్‌స్పెక్టర్ గారు కదూ" అంది చివరగా.

"అవును" గర్వంగా అన్నాడు రామ్మూర్తి. "...నిన్ను అరెస్టు చేసింది ఆయనేనా?"

"కాదు జైల్లో వుండగా హోమ్ మినిస్టర్ దగ్గర తార్చటానికి పోలీసు జీపులో తీసుకెళ్ళాడు".

రామ్మూర్తి గతుక్కుమని, ఆ అలజడి కప్పిపుచ్చుకోవటానికి అక్షింతలు జల్లే నెపం మీద అక్కణ్ణుంచి వడివడిగా పెళ్లి వేదిక దగ్గిరికి వెళ్ళిపోయాడు. అహల్య మాత్రం వదల్లేదు. ఆమె సస్పెన్సుతో చచ్చిపోతోంది. "ఏం జరిగింది హోమ్ మినిష్టర్ దగ్గిర?" అని అడిగింది కుతూహలంగా.

"రేప్ జరిగింది" అని చెప్పి వుంటే గొప్ప సంతృప్తి కలిగి వుండేది. ఒక మనిషిలో విషాదాన్ని చూడటానికి పక్క మనిషిలోని శాడిస్టు ఎప్పుడూ ఉత్సాహపడుతూనే వుంటాడు.

విశారద ఏదో చెప్పబోతూంటే బోసు హడావుడిగా వచ్చి, "ఇక్కడున్నావా నువ్వు?" అంటూ అహల్యని తీసుకెళ్ళాడు.

వాళ్ళు వెళ్ళాక పద్మావతి విశారదని అడిగింది. "వాళ్ళిద్దరికీ జైలు సంగతి ఎందుకు చెప్పావు?"

"వాళ్ళకి ఎప్పటికయినా తెలుస్తుంది. అంతకన్నా నేనే ముందు చెప్పటం మంచిదికాదా!"

"వాళ్ళు వెళ్ళి పదిమందితోనూ చెపుతారు. ప్రచారం చేస్తారు".

"చెయ్యనీ"

"దానివల్ల నీకేం అపకారమూ జరగదా?"

విశారద నవ్వింది. "ఏం జరుగుతుంది? అన్నా చెల్లెళ్ళ చెప్పుడు మాటలు విని బోసు నన్ను పెళ్లిచేసుకోవటం మానేస్తాడా? నాక్కాబోయే భర్తమీద నాకా మాత్రం నమ్మకం వుందిలే".

ఇక్కడ ఈ చర్చ జరుగుతున్న సమయానికి, అక్కడ వధూవరులు దంపతులయ్యారు. లేచివచ్చి బోసు కాళ్ళకి దణ్ణం పెట్టారు. బోసు గోమతినీ, సూధాకర్నీ చేరో చేత్తో లేపాడు.

"నువ్వు కూడా తొందరగా పెళ్ళి చేసుకోవాలి అన్నయ్యా" అంది గోమతి.

"అవును. రెండు పెళ్ళిళ్ళూ ఒకేసారి జరిగితే బావుండేది" అన్నాడు సుధాకర్.

"విశారదకి ఈ తతంగమంతా యిష్టం వుండదుగా" నవ్వేడు బోసు.

"కాబోయే భార్యని ఇప్పట్నుంచే వెనకేసుకొస్తున్నావే -" అంది గోమతి నవ్వుతూ. బోసు ఇబ్బంది పడ్డాడు.

"కాదులే, పెళ్ళయిన తర్వాత ఈ వ్యాపారాలన్నింటికీ స్వస్తి చెపుతానని విశారదకి మాటిచ్చాను. ఈ లోపల చెయ్యవలసిన పని ఒకటి వున్నది. అది పూర్తిచేసి, ఈ పనులకి గుడ్ బై చెపుతాను".

"నిజంగానా అన్నయ్యా?..." గోమతి మొహం ఒక్కసారి ఆనందంతో వెలిగింది. బోసు ఆశ్చర్యంగా ఆమెవైపు చూశాడు. అతనికి విస్మయం కలిగింది. గోమతి కూడా తనలో మర్పుని కోరుకుంటూందా? ఇంత కాలం బయటపడలేదే... తను చేస్తున్న పనులపట్ల అసంతృప్తి వున్నా మౌనంగా వుండిపోయిందా...

విశారద కనీసం వాదించేది. గోమతి తనలోనే దాచుకుంది. ఎంత లోతయిన మనసు...!

అతడికి ఆ క్షణం చెల్లెలిమీద గౌరవంతోపాటూ అంతులేని ప్రేమ కలిగింది. పొదివి పట్టుకుని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.

అతడి మనసు అకారణంగా వ్యాకులమైంది. అప్పటివరకూ వున్న హుషారంతా ఎవరో లాగేసుకున్నట్టు అయింది.

ఒకనేరానికి సాక్షిగా వుండటం వలన ఆమె దృష్టినీ, అందాన్నీ కోల్పోయింది. మొదలియార్ పాశవిక చర్యకి బలయిపోయింది.

ఎప్పుడూ విచారంగా కనపడలేదు. దుఃఖించలేదు కానీ –

ఇంతవరకూ అతడు గమనించలేదు. గోమతి ఎప్పుడూ మామూలుగానే కనపడుతుంది. లోపల ఎన్ని ఆలోచనలు ఉన్నాయో ఇప్పుడే మొదటిసారి తెలిసింది.

మరి... వ్యధ కూడా వుందా?

ఎందుకుండదు? ఆ గాజు కళ్ళ వెనుకనుంచి బయటపడదంతే... ఇక్కడ దినముంది. సూర్యుడే లేడు. ఇక్కడ వనముంది. వసంతమే లేదు. ఇక్కడ మనసుంది. స్పందనే లేదు.

అతడు గదిలోకి నడిచాడు. మూలనున్న ట్రంకు పెట్టెలో, బట్టల అడుగునించి ఒక సీసా తీశాడు.

ఎప్పటినుంచో దాచి వుంచాడు దాన్ని.

ఆసిడ్ సీసా!

"చెయ్యవలసిన పని ఒకటున్నది. అది పూర్తిచేసి ఈ పనులకి స్వస్తి చెపుతాను" అని అతడన్నది ఈ పని పూర్తిచేయటానికే...

ధ....న....రా....జ్.... మొ....ద....లి....యా...ర్.

విలవిలా కొట్టుకోవాలి. జీవితాంతం గుడ్డివాడుగా బతకాలి.

* * *

బోసు స్కూలు దగ్గరకి చేరుకునేసరికి సాయంత్రం నాలుగైంది. స్కూలు తమ ఆధీనంలోకి వచ్చాక అతడు అసలు రాలేదని ఆమె నిష్ఠూరమాడితే, అతను ఆ రోజు బయల్దేరాడు.

నిజానికి అతడు చాలా బిజీగా వున్నాడు. స్మగ్లింగ్ చేసేవారూ, పైరవీలు నడిపేవారూ.... గ్లాసులో డ్రింకు పోసుకుని ఖాళీగా కూర్చుని, అనుచరులకి 'ఫలానాచోటుకి వెళ్ళి మర్డరు చెయ్యి' అని సూచనలు యిస్తూ వుంటారని కేవలం సినిమాల్లోనే చూస్తూ వుంటాం. తెలియనితనం వల్ల చూపించే అవాస్తవిక దృశ్యాలవి. ప్రతి పాయింటు లోనూ అడ్డంకుల్ని అధిగమించి, అధికారులతోనూ, వైరి పక్షాలతోనూ జాగ్రత్తగా మెసులుకుంటూ, సరుకు సప్లయి చేసేవారితో ఎప్పటికప్పుడు కొత్త కాంట్రాక్టులు కుదుర్చుకుంటూ వుండాలి. ఊపిరి పీల్చుకునే టైమ్ కూడా లేకుండా నిరంతరం పనిలో మునిగివుంటేనే తప్ప ఈ పొజిషన్‌లో

వుండటం కష్టం. తెలివితేటలు, తెగింపు, కృషి – మూడూ కావాలి! ఆ అవసరం లేనిపక్షంలో, రాజకీయ నాయకుల మల్లే స్మగ్లర్లూ కుక్కగొడుగుల్లా పుట్టుకొచ్చేవారు.

బోసు స్కూలు ఆవరణలోకి ప్రవేశించాడు.

అక్కడ దృశ్యం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. అందులోనూ – సాయంత్రమవుతోందేమో దక్షిణం వైపునంచి చల్లటిగాలి అప్పుడే ప్రారంభమయింది! అరటి చెట్ల ఆకులు వింజామరల్లా వూగుతున్నాయి. పిల్ల కాలువలు వయ్యారంగా పాడుతున్నాయి. పచ్చటిగడ్డి తివాచీలా ఆహ్వానం పలుకుతోంది.

అతడు క్లాసురూములు సమీపించాడు. వాటి పక్కనే అసెంబ్లీ హాలు వుంది.

అంత మంది విద్యార్థులున్నా అక్కడ అంత నిశ్శబ్దంగా వుండటంతో అతడు ఆశ్చర్యపోతూ మరింత ముందుకు సాగాడు. అక్కడ విద్యార్థులు కూర్చుని ఉన్నారు.

ఆమె చెప్పేది శ్రద్ధగా వింటున్నారు. చిన్న వేదికమీద విశారద నిలబడి చెపుతోంది. ఆమె కళ్ళలో దీక్ష, అకుంఠిత బావం కనపడుతోంది. ఆమె మొహంలో ఉద్వేగంతో కూడిన ఒక మెరుపు ప్రస్ఫుటిస్తోంది. ఆ అంకితభావానికి అతడు ముగ్ధుడయ్యాడు. అతడు లోపలికి వెళ్ళి డిస్టర్బ్ చేయదల్చుకోలేదు. అక్కడే చాటుగా నిలబడి ఆమె చెపుతున్నది వినసాగాడు.

"...వందేమాతరంతో ప్రారంభమైన మన స్కూలు దినచర్య జనగణమనతో పూర్తవుతుంది. జెండా కింద నిలబడి, దానికి సెల్యూట్ చేస్తూ మనం ఆ గీతాలు

ఆలపిస్తాం! మన గొంతులు జాతీయగీతాలు ఆలపిస్తున్నా మన మనసులు మాత్రం దేశం గురించి ఆలోచించవు. మన జెండాకి ఇచ్చే గౌరవం మనం సాటి ప్రజలకి యివ్వం. కనీసం దేశానికి ఇవ్వము. అందుకే ఈ రోజు జాతీయగీతం బదులు మనం జాతీయత గురించి చర్చించుకుందాం".

పిల్లలు శ్రద్ధగా వింటున్నారు.

"మన దేశంలో చాలా కొద్దిమందే – మనుష్యులకి ఉపయోగపడే పనులు చేస్తారు. చాలామంది సాటి మనుష్యులమీద జీవిస్తూ బ్రతుకుతారు".

"...ఒక లక్షాధికారి కొడుకుంటాడు. కేవలం ధనవంతుడికి కొడుకుగా పుట్టటమే అతడు చేసుకున్న పుణ్యం. కార్లో స్కూలు కొస్తాడు. మేధావులైన ప్రయివేటు టీచర్లు అతని మెదడులోకి విజ్ఞానాన్ని ఎక్కిస్తారు. ఈ రాష్ట్రంలో కాకపోతే మరో రాష్ట్రపు సాంకేతిక కళాశాలల్లో అతని సీటు రిజర్వు కాబడి వుంటుంది. చదువు పూర్తికాగానే విదేశాలకి వెళ్ళే ఏర్పాటు కావించబడి వుంటుంది. అతడు డాక్టరై ప్రాణాలు తీయడానికి మన దేశానికి వస్తాడు. అదే సామాన్యుడి కొడుకయితే, బాగా చదవాలి. చదివినా సీటు వస్తుందన్న గ్యారంటీ లేదు. వచ్చినా, ఆ తరువాత అతడి కోసం ఎవరూ నర్సింగ్ హోమ్ కట్టించి వుంచరు. గవర్నమెంటులో జీతానికి పనిచేయాలి. ఇంకా దురదృష్టకరమైన ఉదాహరణ – ఒక కార్మికుడికో, కూలికో మేధావి కొడుగ్గా పుట్టడం... ఎన్ని తెలివి తేటలున్నా, ద్వారాలు మూసుకుపోయి వుంటాయి".

ఆమె స్వర తరంగాలు వాళ్ళ గుండెల్ని తాకుతున్నాయి. వాళ్ళంతా శ్రద్ధగా వింటున్నారని ఆ నిశ్శబ్దమే తెలుపుతోంది. ఆమె కొనసాగించింది.

"పట్నాల్లో, హోటళ్ళలో దిగి, ఖరీదయిన డ్రింకులు తాగుతూ ఉల్లాసంగా గడిపే యువకుల్ని గమనించండి. పల్లెటూళ్ళలో రోజుల తరబడి పేకాడే వ్యక్తుల్ని చూడండి. ఏమీ పనిచేయకుండా వీళ్ళంతా ఎలా ఇంత విలాసవతంగా గడుపుతున్నారు? కేవలం పెద్దలు గడించిన ఆస్తి వుండటం వల్ల! లేదా పొలాలు వుండటంవల్ల... డబ్బు అప్పులకిచ్చి, ఆ వడ్డీతో లేదా పొలాలు కౌలుకిచ్చి ఆ రాబడితో వీళ్ళు సర్వసౌఖ్యాలూ అనుభిస్తూంటే, వీళ్ళ కోసం అక్కడ కార్మికులూ కర్షకులూ ఎండలో, వానలో చలిలో రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడతారు. అవునా? ఇలాటి వాళ్ళకి రక్షణ కల్పించడానికి పోలీసు వ్యవస్థ, ప్రజాస్వామ్యం పేరిట రాజకీయ నాయకులు, వీరికి సుఖాలు అందించడానికి విదేశాల్నుంచి సరుకు తెప్పించి అందజేసే స్మగ్లర్లూ – శ్లేష్మంమీద ఈగల్లా ఈ వ్యవస్థ చుట్టూ మూగి, తమ వంతు జుర్రుకుంటూ వుంటారు".

బోసు మొహం పాలిపోయింది. అతను అక్కడ వున్నాడని ఆమెకి తెలీదు. ఆమె చెప్పుకుంటూ పోతుంది. "... మేము వూహిస్తున్న వ్యవస్థలో అవేమీ వుండవు. కేవలం కష్టపడేవారికే ఆనందించే హక్కు వుంటుంది. కష్టంలోనే ఆనందం దొరుకుతుంది. కొడుకుల కోసం సంపాదించాలన్న తపన లేకపోతే స్వార్థం వుండదు. కట్నం సమస్యే లేదు. ఎప్పుడయితే వారసత్వపు హక్కులేదో, అప్పుడిక 'ఆస్తి' అన్నమాట మన డిక్షనరీలో వుండదు. కానీ అంతా మనదే.. పిల్లల చదువు బాధ్యత, వృద్ధాప్యంలో రక్షణభారం ప్రభుత్వమే తీసుకుంటుంది. దేశం సుభిక్షమయ్యేటంత పని.. పని.. పని! ఆకలి చావులు లేనంతవరకూ పని... పని... పని! పనే మన జాతీయగీతం. జైహింద్".

"జైహింద్" వేయిగొంతులు ఒకేసారి పలకడంతో ఆ ప్రాంగణం ప్రతిధ్వనిస్తూ పులకించింది.

అతడు అక్కడినించి కదిలాడు.

* * *

"నాన్నా!"

"ఏమిటి బాబూ–"

"చిన్నప్పుడు నువ్వు నాకు వేదాన్ని నేర్పావు. పెద్దయ్యాక ఉపనిషత్ సారాన్ని చెప్పావు. చెప్పిన నువ్వు ఆత్మహత్య చేసుకున్నావు. నిన్న నేను జైలుకి వెళ్ళాను. ఆ కసిలో వేదసారంకన్నా జీవితసారం గొప్పదన్న భ్రాంతిలో బ్రతికాను. కానీ నాకు జీవితం ఇప్పుడు నాలుగు రోడ్ల కూడలిలో కనిపిస్తోంది. ప్రతి దారీ ముళ్ళబాటలాగా తోస్తూంది. ప్రతి గమ్యమూ ఆనందంగానే కనిపిస్తోంది. ఈ నిరంతర ఘర్షణలో, నేను ఏది నిజమో, ఏది అసత్యమో గ్రహించలేకపోతున్నాను".

"అగ్ని సర్వాన్నీ భస్మం చేసినట్టే, జ్ఞానమనే 'అగ్ని' ఫలకాంక్షనూ – ఫలితం పొందలేక పోవడం వలన కలిగే నిరాశనూ దహించి వేస్తుంది. జ్ఞానం కంటే పవిత్రమైనది మరొకటి లేదు బాబూ".

కాంతిపుంజం అదృశ్యమైంది. ఆ తరువాత అతడి కల మరో మలుపు సంతరించుకుంది. వేల లక్షల సంఖ్యలో పిల్లలు పరిగెత్తుకు వస్తున్నారు. తనమీద నుంచి పదఘట్టన చేసుకుంటూ సాగిపోతున్నారు. తను అణిగిపోతున్నాడు. వారిని ఉత్సాహపరుస్తూ వెనుకనుంచి వ్యూహ రథసారధి వస్తోంది.

ఆమె విశారద.

... అతడికి మెలకువ వచ్చింది.

భయం వేయలేదు.

సంతోషం వేసింది. ఏదో ఒక మబ్బు విడిపోయినట్టు అనిపించింది. అతడు లేచి తలుపు తీశాడు. చల్లటిగాలి రివ్వున లోపలికి వచ్చింది. బయటంతా చీకటిగా వుంది. కానీ అతని మనసంతా వెలుగుతో నిండి వుంది.

పెట్టె తెరిచాడు.

అందులోంచి ఆసిడ్ సీసాతీసి చీకట్లోకి బలంగా విసిరేసేడు. అది భళ్ళున బ్రద్ధలైంది. శృంఖలాలు తెగిపోయిన చప్పుడులా తోచింది.

మరుసటిరోజు ప్రొద్దున్నే అతను విశారదతో చెప్పాడు. "నీకు అభ్యంతరం లేకపోతే ఈ రోజే మనం వివాహం చేసుకుందాం విశారద."

* * *

మొత్తం పదిమంది.

రెండు కార్లలో బయల్దేరారు.

ఒక టాక్సీలో అతనూ, గోమతీ, విశారద, సుధాకరూ, పద్మావతీ కూర్చొని వున్నారు.

ఆర్య సమాజ మండపంలో వివాహం. చాలా క్లుప్తంగా, సామాన్యముగా జరిగిపోవాలని అనుకున్నారు.

సుధాకర్ వుండబట్టలేక అడిగాడు."ఇంకా కొంతకాలం ఆగాలని అన్నావుగా బోసూ! ఎందుకింత హఠాత్ నిర్ణయం?"

బోసు సమాధానం చెప్పకుండా నవ్వి వూరుకున్నారు."నాలో నిబిడీకృతమైన పోరాడే శక్తిని నా వ్యక్తిగత కక్షకోసం వినియోగించదల్చుకోలేదు" అని చెప్పాలి! ఎందుకు చెప్పడం? అదీ స్వార్థమే. ప్రస్తుతం అతడు దానికే అతీతుడయ్యాడు.

.... కార్లు కదుల్తున్నాయి.

మలుపులు తిరిగాయి.

ఆ తరువాత అంతా క్షణాల్లో జరిగిపోయింది. ముందొక బాంబు పేలింది. కారుముందు దట్టమైన పొగ, ముందుభాగం అంతా ధ్వంసమయింది.

బోసు క్షణాల్లో అటెన్షన్‌లోకి వచ్చాడు. కారుదిగి బయటకు వెళ్ళడం ప్రమాదమని తెలుసు. కానీ కార్లోవుంటే అందరికీ ప్రమాదమే. తన ఒక్కడికోసం అందర్నీ బలిపెట్టడం భావ్యంకాదని తెలుసు. తను అందులో వుంటే, బాంబు దానిమీదే పడటం – తునాతునకలు అయిపోవటం ఖాయం.

క్షణంలో అంతా ఆలోచించుకుని, అతడు కారు దిగి మెరుపులా పరుగెత్తాడు. సుధాకర్, విశారద వారిస్తూనే వున్నారు. గోమతికి జరుగుతున్నది అర్థంకావడంలేదు.

బోసు రోడ్డుకి అడ్డంగా పరుగెత్తి ఎదుటి బిల్డింగ్ వైపు వెళ్ళడానికి ప్రయత్నించాడు. అట్నుంచి కూడా కాల్పులు మొదలయ్యాయి.

ప్రత్యర్థులు చాలా పకడ్బందీగా వ్యూహం పన్నారనీ, తన ప్రాణాలకి రక్షణ లేదనీ అతడికి తెలిసిపోయింది.

చక్ర వ్యూహంలో చిక్కుకుపోయాడు.

ఒక బుల్లెట్ అతడి చెవి పక్కగా దూసుకుపోయింది.

మరో బుల్లెట్ అతడి భుజంలో దిగబడింది. రక్తం ధారగా స్రవించసాగింది.

అదే సమయానికి ఒక అనూహ్యమైన సంఘటన జరిగింది.

ఒక పొడవాటి కారు వేగంగా అక్కడికి దూసుకు వచ్చింది. బుల్లెట్ ప్రూఫ్‌లా వుందది. దాని ఖరీదు పదిహేను లక్షలకి తక్కువ చేయదు.

అది వేగంగా రావటం, అతని పక్కగా ఆగటం, తెరుచుకుని 'కమిన్ క్విక్' అని వినపడటం, అతడు మరేమీ ఆలోచించకుండా అందులో ప్రవేశించడం – రెప్పపాటు కాలంలో జరిగిపోయింది.

కారు వేగంగా అక్కణ్ణుంచి దూసుకుపోంది.

అతడు ఈ ఆకస్మిక పరిణామం నుంచి తేరుకుని తెప్పరిల్లడానికి రెండు క్షణాలు పట్టింది. ఈ కొద్ది సమయంలోనే కారు ఆ వీధిలోంచి బయటకు వచ్చేసింది.

అతడు కారు డ్రైవ్ చేస్తున్న వ్యక్తివైపు చూశాడు.

నీరెండ ఆమె చెంపలమీద జీరాడుతోంది. పెదవులమీద లిప్ స్టిక్ పడమటి సూర్యుడితో పోటీపడుతోంది. చెవులకున్న ఇయర్ స్టడ్ హుందాగా వూగుతోంది. ఆమె మీదనుంచి వచ్చే పరిమళం చాలు ఆమె ఖరీదు చెప్పటానికి! ఆమె చేతిగాజుల ముత్యాలే వేల ఖరీదు చేస్తాయి.

... బ్రతుకు సరిహద్దు వరకూ మృత్యువు వచ్చినప్పుడు కన్నా – ఆమెను చూసినప్పుడు కలిగిన దిగ్భ్రమ వేయిరెట్లు ఎక్కువైంది అతడికి.

ఆమె ... లక్ష్మీ శారద.

# అధ్యాయం - 4

ఆ గదిలో ఖరీదైన కార్పెట్ – కర్టెన్స్‌కు కరెక్టుగా మ్యాచ్ అయింది. షాండ్లియర్ లైటు ధర దాదాపు పాతికవేలు వుండివుంటుంది. విశాలమయిన సోఫాసెట్ వృత్తాకారంగా తిరిగి, ఆ గదిని మరింత శోభాయిమానంగా చేస్తోంది.

మధ్య సోఫాలో కూర్చొని వున్నాడు బోసు. కాళ్ళమీద మోచేతులు ఆన్చి, చేతివేళ్లు కణతలమీదుగా జట్టులో జొనిపి, తల దించుకొని కూర్చున్నాడు. అతడు కళ్ళు మూసుకుని వున్నాడో, క్రింద కార్పెట్‌ని చూస్తున్నాడో చెప్పటం కష్టం.

ఆమెకూడా అతడిని డిస్టర్బ్ చేయడం ఇష్టం లేనట్టుగా అలాగే నిశ్శబ్దంగా వుండిపోయింది. కొంచెం సేపటికి అతడు తేరుకుని "ఇదంతా నేను నమ్మలేకుండా వున్నాను" అన్నాడు.

ఆమె సమాధానం చెప్పలేదు.

...కార్లో అతడిని శత్రువుల బారినుండి కాపాడి ఇంటికి తీసుకువచ్చే టైమ్‌లో వారిద్దరి మధ్యా సంభాషణ సాగలేదు. ఎవరి టెన్షన్‌లో వారున్నారు. విశాలమయిన భవంతిలోకి కారు ప్రవేశించటం – ఆ నౌకర్లు – ఖరీదైన వాతావరణం – అన్నీ చూసి అతడు అమితమైన ఆశ్చర్యంతో – "ఏమిటిది లక్ష్మీ? ఎక్కడికి వచ్చాం?" అని అడిగాడు.

"మనింటికే..." ఆమె నవ్వింది.

"ఈ ఇల్లు..."

"ముఖ్యమంత్రిది".

అతడు అదిరిపడి "నువ్వు... ?" అన్నాడు.

"ఆయన అనాథరైజ్డ్ భార్యని" నవ్వుతూ అంది.

కళ్ళు మిరుమిట్లు గొల్పేలా మేఘాల మధ్యనుంచి మొదలయిన వెలుగు, పిడుగుగా మారి వారి కపాలాన్ని చీల్చుకుంటూ భూమిలోకి వెళ్ళిపోయినట్లు కదిలిపోయాడు. చప్పున తలెత్తి ఆమెవైపు చూశాడు. ఆమె నవ్వుతూంది. ఆ నవ్వులో విషాదమేమీలేదు. మామూలుగానే వుంది. ఆమె కాఫీ కప్పు అతనిముందు పెడుతూ ఎదుటి సోఫాలో కూర్చుంది. "...లేకపోతే ఇవన్నీ ఎలా వస్తాయి బోసూ? ఆయనకి బాగా డబ్బూ పలుకుబడీ వుంది. నాకు అందం వుంది. అదృష్టం మా ఇద్దర్నీ కలిపింది."

అతడు, ఆమెవైపు కన్నార్పకుండా చూశాడు. ఆమె తల దించుకోలేదు. అతడివైపే సూటిగా చూస్తూ, "ఏమిటి ఆలోచిస్తున్నావు బోసూ? ఇంకా ఈ వాస్తవం నీకు జీర్ణమవడం లేదా?" అంది.

అతడు సమాధానం చెప్పలేదు. ఆమె కొనసాగించింది.

"...నీ గురించి మాత్రం నాకు ఎప్పటికప్పుడు తెలుస్తూనే వుందిలే. మస్తాన్‌ని చంపి నువ్వు జైలుకి వెళ్ళావన్న రోజు చాలా బాధపడ్డాను. నీ తరఫున వాదించటానికి లాయర్‌ని పంపింది నేనే. అదృష్టవశాత్తు నీకు పెద్దగా శిక్ష పడలేదు".

"అంటే.. అంటే... గోమతికి ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తానని ముఖ్యమంత్రి మనిషిని పంపించడం...?"

"నేను పంపగా వచ్చినవాడే..."

బోసు నమ్మలేనట్టు చూశాడు. అతడింకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేక పోతున్నాడు. అతడి మానసిక స్థితి గమనించినట్టు ఆమె అంది –"...చెప్పానుగా నువ్వెక్కడున్నావో, ఏం చేస్తున్నావో నాకు ఎప్పటికప్పుడు అంతా తెలుస్తూనే వుంది. ఈ మధ్య 'బోసు బజారు' పెట్టావని కూడా తెలుసు. దాంతో ఇక నేను నీకు చేయగలిగిన అవసరం ఏమీ లేక పోయింది... ఇంతలో నీ పెళ్ళి అని తెలిసింది. అప్పుడు కూడా దూరం నుంచి చూసి వెళ్ళిపోదామని అలా వచ్చినా – అనుకోని పరిస్థితుల్లో నిన్ను కలుసుకోవలసి వచ్చింది" ఆమె నవ్వింది. "...చెప్పు ఇప్పుడు నీ ఆశ్చర్యం తగ్గిందా?"

"లేదు. ఇంకా ఎక్కువైంది. ఇంతకాలం నా గురించి తెలుసుండీ నన్నెందుకు కలుసుకోలేదు? ఇలా తెరచాటున ఎందుకుండిపోయావు?"

"ముఖ్యమంత్రి పెషీనుంచి బయటకు రావటం అంత సులభం కాదు. అదీగాక, ప్రస్తుతం ఆయనకి వ్యతిరేకత ఎంతుందో తెలుసుకదా. ప్రెస్‌కి తెలిస్తే దాన్ని ఆధారంగా తీసుకొని, అసమ్మతి వర్గం చెలరేగి పోతుంది. అప్పుడు నేను చేయాలనుకున్న పనులేమీ చేయలేను. నీకు తక్కువ శిక్ష పడేట్టు చూడటం, గోమతికి ఆపరేషనూ – అదికదా ముఖ్యం. నేను నిన్ను కలిస్తే ఎంత? కలవకపోతే ఎంత? అదీగాక..." ఆగింది.

"అదీగాక?" ప్రశ్నించాడు.

"ఏం లేదులే".

అతడు నెమ్మదిగా, "నేను అర్థం చేసుకోగలను" అన్నాడు.

ఆమె నవ్వి "ఏం అర్థం చేసుకోగలవు?" అని అడిగింది కుతూహలంగా. అతడు ఇబ్బందిగా, "ఏమీ లేదులే" అన్నాడు. ఆ తరువాత ఆ టాపిక్ మార్చడానికా అన్నట్టు "నీకీ పెద్ద పెద్ద పరిచయాలు ఎలా జరిగాయి?" అని అడిగాడు.

"నాకు న్యాయం చేకూర్చమన్న అభ్యర్థనతో ఆయన దగ్గిరకి వెళ్ళాను. అభ్యర్ధనలో న్యాయంకన్నా నా అందం ఆయనకి నచ్చినట్టుంది. డైరక్టుగా అడిగాడు. వద్దనటానికి నాకూ కారణం కనిపించలేదు".

అతడికి చప్పున పద్మావతి గుర్తొచ్చింది!

పద్మావతికీ – లక్ష్మీ శారదకీ తేడా లేదా? అవకాశం వస్తే ఎవరయినా అలాగే ప్రవర్తిస్తారా? భర్తని వదిలి తమ దగ్గిర కొంతకాలం ఆశ్రయం పొంది, తరువాత ముఖ్యమంత్రి పేషీలో....

అతడికెందుకో ఇదంతా సంతృప్తిగా అనిపించలేదు. ఆ అసంతృప్తిని ఎలా చెప్పాలో కూడా అర్థంకాలేదు. చెప్పాలనుకున్న దానికి వేదిక నిర్వహిస్తున్నట్టు – "నిజంగా నువ్వు తల్చుకుంటే మమ్మల్ని కలుసుకోవటం అంత కష్టమా లక్ష్మీ? నా గురించి కాకపోయినా, నీ స్నేహితురాలు గోమతి గురించి అయినా రావొచ్చు కదా!" అన్నాడు నిష్టూరంగా!

"చెప్పానుగా బోసూ! నేను నీ దగ్గరికి వచ్చినట్టు మొదలియార్‌కి తెలిసిందనుకో, ప్రస్తుతం నేనెక్కడున్నానా అని ఎంక్వయిరీ చేస్తాడు. ముఖ్యమంత్రి సంగతి బయటకు వస్తుంది... ఇక దాంతో పత్రికలు చెలరేగిపోతాయి".

"అప్పుడు నీకున్న అధికారం, డబ్బు –అంతా పోతాయి" అప్రయత్నంగా అనేశాడు. అయితే ఆమె అందులో వ్యంగ్యం గుర్తించలేదు. మామూలుగా – "అవును" అంది.

అతడు ఆమె నిరాసక్తతకి మరింత ఇరిటేట్ అయ్యాడు "అందుకా నీకు రావాలనిపించలేదు?" అని రెట్టించాడు.

ఆమె ఆశ్చర్యంగా "ఎందుకు ఇన్నిసార్లు అడుగుతున్నావు బోసూ" అంది.

"మనం అంతకాలం ఒక ఇంట్లో కుటుంబ సభ్యుల్లా కలిసి మెలిసి వున్నాం. పంచుకోవటానికి సుఖాలు లేకపోయినా కష్టాలు కలిసి పంచుకున్నాం. తరువాత విడిపోవలసి వచ్చింది. నువ్వు పై అంతస్థుకి వెళ్ళావు. నేను జైలుకు వెళ్ళాను. అయినా నీకు ఒక్కసారి కూడా గోమతిని కలుసుకోవాలనిపించలేదా? వచ్చి ఎలా వుందో, పరామర్శించాలనిపించలేదా? ఒక్కసారి చూస్తేనే నీ 'భర్త' పొజిషనుకి భంగం వస్తుందనుకుని భయపడ్డావా?"

ఆమె నెమ్మదిగా అంది. "అవును భయపడ్డాను. పొజిషన్‌కి భంగం వస్తుందని కాదు... పొజిషన్‌కి భంగం వస్తే నేను నీకిక ఏ విధంగానూ ఉపయోగ పడనని భయపడ్డాను".

"కాదు" అతడు కసిగా అన్నాడు. "నీకు మొహం చెల్లక రాలేదు. నైతిక విలువల్ని అధిగమించి నువ్వు చేసిన ఈ పనికి, మాకు మళ్ళీ కనపడటానికి ధైర్యం చాలలేదు. ఒక పవిత్రమైన గుడినుంచి పారిపోయి ఒక రొచ్చుగుంటలో చిక్కుపడి – దాన్నే రమ్య హర్మ్యంగా భ్రమపడి – మమ్మల్ని వదిలేశావు! నువ్వు చేసిన ఈ పనికి నీకే సిగ్గేసి – దాన్ని కప్పిపుచ్చుకోవటానికి ఈ విధంగా ఆత్మవంచన

చేసుకుంటున్నావు! వప్పుకో లక్ష్మీ శారదా... కనీసం ఈ నిజాన్ని ఇప్పుడయినా వప్పుకో.."

కన్నార్పకుండా, ఆమె తదేకంగా అతడివైపే చూస్తూ, సాలోచనగా అంది – "నీ వ్యధ ఇప్పుడు నాకర్థమైంది బోసూ!" ఆమె నెమ్మదిగా అన్న ఆ మాటలకి అతడు కాస్త సర్దుకున్నాడు.

కానీ, ఆ మాటలవల్ల అతడిలో కలిగిన ఉపశమనాన్ని – సుడిగాలి సమూలంగా తుడిచిపెట్టేస్తున్నట్టుగా తుడిచేస్తూ ఆమె ఈ విధంగా అంది. "ఎలా అయితే బావుండేది బోసూ? నువ్వు నన్ను కలుసుకోగానే నేను కళ్ళనీళ్ళు పెట్టుకుని 'చూశావా! నా జీవితం ఎలా అయిపోయిందో –' అని వుంటే నీకు బాగా తృప్తిగా వుండి వుండేదా?"

అతడి మొహం జేవురించింది.

సూదికన్నా పదునైన బాణం గుండెల మధ్యలోంచి దూసుకుపోయినట్టు అతడు విలవిలలాడేడు. కానీ అందులో నిజముంది. అతడామాటే మరో విధంగా అన్నాడు. "అందులో తప్పేముంది శారదా? ఆప్తుల దగ్గిర కూడా మనసుకు ముసుగేసుకుని వుండము కదా".

ఆమె అతడివైపు అభినందిస్తున్నట్టు చూస్తూ "నీకు కోపం రాలేదు కదా! నాకు సంతోషంగా వుంది. నీలో నాకు నచ్చేది అదే! ఇవే మాటలు ఇంకెవరి దగ్గరయినా అని వుంటే చెంప పగలగొట్టి వుండేవారు. అయితే ఒక సంగతి. నేను విషాదంగా వున్నానని ఎందుకు అనుకున్నావు? నాకు అసలా ఆలోచనే రాలేదు."

అతను విస్తుబోయాడు. ఆమె కొనసాగించింది. "నువ్వన్నట్టు ఒక పవిత్రమైన గుడినుంచి పారిపోయిన మాట నిజమే. కానీ గుడే కూలిపోతే ఏం చేస్తాం? అన్నట్టు నాకు తెలియక అడుగుతాను. నువ్వెప్పుడయినా అ రొచ్చుగుంటలో పడినందుకు విచారించావా బోసూ?"

ఒక అణువు బ్రద్ధలై విశ్వం కంపించినట్టు అయింది. "నేనే... నేనేం చేశాను?" అన్నాడు.

"నువ్వు చేసింది తప్పు అని నేననడంలేదు. నీకు లేని దుఃఖం నాకెందుకు వుంటుందని అడుగుతున్నానంతే! ఇద్దరం ఒక బోటులో పయనిస్తున్న వాళ్ళమేగా".

ఆమె ఏం చెప్తుందో అతడికి పూర్తిగా అర్థమైంది. ఆమె వ్యభిచారం చేస్తూంటే – తను హత్యలు చేస్తున్నాడు....

...అతని మనసు తలుపులన్నీ ఒక్కసారిగా తెరుచుకున్నట్టు అనిపించింది. ప్రపంచం ఇరుకు గది అయినప్పుడు – మదికీ, గదికీ వున్న గవాక్షాలన్నీ హఠాత్తుగా తెరుచుకోవటం అపూర్వమైన అనుభూతి! ఆమె చెప్పింది నిజమే.. ఎవడూ, తను వున్న స్థితి గురించి ఆలోచించడు, పక్కవాడిని చూసి జాలిపడతాడు. సానుభూతి కోసం వాడు తనమీద ఆధారపడాలని కోరుకుంటాడు.

జీవితాన్ని స్పర్శించే సిద్ధాంతంపట్ల అవగాహన వున్న వాళ్ళకే అది తొందరగా అర్థమవుతుంది!

అందుకే బోసుకి అది తొందరగా అర్థమైంది. సిగ్గుపడ్డాడు. "నన్ను క్షమించు" అన్నాడు.

"ఇందులో క్షమించడానికేముంది? మనం మన శరీరాలకి ఏ బట్టలు సరిపోతాయో, ఏ మాచింగ్ బావుంటుందో అని నిరంతరం ఆలోచిస్తూ వుంటాం. కానీ మన మనసుకి ఏ జీవిత విధానం సరిపోతుంది – ఏ అలవాట్లు బావుంటాయి? అని అనుకోం. ఇక్కడ మనం చూడాల్సిన దర్పణం – సమాజం! అందులో మనని మనం చూసుకుంటే... అది సమాజం కదా. దానికి నచ్చకపోతే మనని వికృతంగా చూపిస్తుంది. అది మన భయం. ఇక్కడ మనకి మనం ముఖ్యంకాదు. మన ఛాయే ముఖ్యం. అయితే నీలాటి వాళ్ళూ, నాలాటి వాళ్ళూ అసలా దర్పణాన్నే పట్టించుకోరు. మనకి మనమే ముఖ్యం. అందుకే సమాజం మనల్ని వెలివేస్తుంది, మనం సమాజాన్నే వెలివేస్తాం... నేను ఒకసారి చెప్పాను గుర్తుందా బోసూ? ఈ ప్రపంచంలో బలమైనవాడూ, తెలివైనవాడూ నీతిని వదిలేస్తే – ఇక వారిని ఎదుర్కొనేవారే వుండరని! ఇప్పుడు నా మాట నిజమైంది చూశావా... సమాజ దర్పణం ముందు ముసుగు వేసుకోకుండా నిలబడగలిగాం".

అతడు ఆమెనే చూస్తున్నాడు. ఆమె నిజంగా లక్ష్మీశారదేనా అని అనుమానం వస్తోంది అతడికి.

ఆమె తన మూడ్‌లోంచి బయటపడి నవ్వింది, "ఏం బోసూ, నేను చెప్పినదాన్లో ఏమైనా తప్పుందా, అహం కనపడుతుందా?" అంది. అయితే అతడు దాన్ని తేలిగ్గా తీసుకోలేదు. "రెండు రోజుల క్రితమైతే నువ్వు చెప్పినదాన్ని పూర్తిగా వప్పుకుని వుండే వాడిని లక్ష్మీ" అన్నాడు."కానీ ఇప్పుడు వప్పుకోను. యుగయుగాల అనుభవంతో సమాజం ఏర్పరచుకున్న సూత్రాల్ని నమ్మే స్థితికి

మొన్నే వచ్చాను. నువ్వన్నట్టు దర్పణం సమాజం కాదు. మన మనసు. మనం దానికేం జవాబుదారి".

"మనసు కోరినదల్లా మనం దానికి ఇవ్వలేకపోతే...?"

"అంటే?"

"మనసు కోరిన దానికి నైతిక విలువలు అడ్డొస్తే?"

"నువ్వేం చెప్పుతున్నావు లక్ష్మీ?"

"సమాజం ఏమనుకుంటుందో అన్న భయంతో కోరికలు అణచుకోవలసి వస్తే? అని అడుగుతున్నాను".

"నువ్వేం చెప్పదల్చుకున్నావో నాకు అర్థంకావటంలేదు".

"నీకు అన్యాయం జరిగినప్పుడు మొదలియార్‌ని పోలీస్ స్టేషన్‌కి లాక్కెళ్ళావ్. నీ చెల్లికి అన్యాయం జరిగినప్పుడు మస్తాన్ చేతులు నరికావు. బీదతనం పరిహసించినప్పుడు స్మగ్లర్స్‌ని అణిచివేసి కోట్లు సంపాదించావు. ఇప్పుడు మనసు గురించీ, నైతిక సూత్రాల గురించీ మాట్లాడుతున్నావు. ఎప్పుడు నీ మనసు నీకేది చెప్తే అది చేయగలిగే అవకాశం నీకు వుంటుంది. కానీ నాకది లేదే... నా మనసు అడిగింది నేనెప్పుడూ దానికి ఇవ్వలేదు".

"ఎందుకు లేదు?"

"ఎందుకు లేదా?" ఆమె మొహంలో అకస్మాత్తుగా మర్పొచ్చింది.

"కొత్త వధువుగా అత్తారింట్లో అడుగు పెట్టినప్పుడు కోటికలలు కన్న మనసుని వాస్తవం భర్త రూపంలో వెక్కిరించింది. అర్ధరాత్రి బయట కొచ్చి, మీ

ఇంట్లో ఆశ్రయం పొందినప్పుడు – నీ వ్యక్తిత్వం చూసి మనసు చెదిరింది. కానీ మాట బయటకు రాలేదు."

అతడు నివ్వెరపోయి, "లక్ష్మీ" అన్నాడు.

అప్పటివరకూ బిగపట్టుకున్న ఉద్వేగం కట్టలు తెగింది.

"అవును. మొగ్గ విచ్చుకుంటున్నట్టు ప్రేమభావం కలుగుతూంటే, వాస్తవం మళ్లీ నవ్వింది. 'మనసా నీకా అర్హత లేదే' అని హేళనగా హెచ్చరించింది. ఒకరికి భార్య కావడమే నా అనర్హతగా మిగిలింది".

అతడు విభ్రమం నుంచి తేరుకోలేదు. ఆమె కొనసాగించింది. "రాటుదేలక పోయివుంటే ఈ విషయం ఇప్పుడు కూడా నా నుంచి బయటకు వచ్చి వుండేది కాదు. శాశ్వతంగా నా మనసు పొరల్లో నిక్షిప్తమై వుండేది".

ఆమె మాటలు పూర్తికాకుండానే, పెదవులు వణకసాగాయి, కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. దుఃఖాన్ని కంఠంలోనే ఆపుకుంటూ, "ఐ లవ్డ్ యూ .... ఐ...లవ్డ్ యూ బోసూ..." అంది.

ఆ రోజుల్లో వెన్నెల్లో ఆమెతో కలిసి నడవటం, ఆమె మౌనం, నెమ్మది ... బిడియం అన్నీ అతనికి గుర్తొచ్చాయి. అతనికి ఏ సమాధానం చెప్పాలో అర్థంకాలేదు. అతడింకా షాక్ నుంచి తేరుకోలేదు. మనసు అచేతనమైంది. ఆమె ఇంకా అదే ఉద్వేగంలో వుంది.

"ఇదంతా అప్పుడు నేను చెప్పలేకపోయాను. మొగుడు గెంటేసిన దానికి పాపమని ఆశ్రయమిస్తే, ఆశ్రయమిచ్చిన వాడికే 'ప్రేమ' అంటూ గాలమేస్తావా? అని ఈ సమాజం నవ్వుతుందని భయమేసింది. సాంప్రదాయం తన చూపుడు

వేలితో నన్ను నా మనసుకి దూరంగా తోసేసింది. కట్టుబాట్లు నా కోరిక చుట్టూ కోట కట్టాయి".

అతడు మాట్లాడలేదు. చాలా సేపటివరకూ ఇద్దరిమధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది. ఆమె నెమ్మదిగా తేరుకుంది – "ఇప్పుడు చెప్పు బోసూ! నేనెందుకు ఈ సమాజాన్నీ, కట్టుబాట్లనీ గౌరవించాలి? నాలో కోరికని చంపేసినందుకా? భర్త గెంటేసినా కాళ్ళ దగ్గిరే పడివుండమని నిర్దేశించినందుకా?"

అతడి వాదనకి ఆధారం దొరికింది. "నీకు జరిగిన అన్యాయానికి మొత్తం సామాజిక కట్టుబాట్లనే కాదనటం అన్యాయం లక్ష్మీ" అన్నాడు. అతడికి అంత విషాదంలోనూ నవ్వొచ్చింది. మొన్నటిరోజు ఆమె చేసిన వాదననే తను చేశాడు. విశారద ఖండించింది. తను అప్పుడు ఏ వాదనని వ్యతిరేకించాడో, దాన్నే ఇప్పుడు చేస్తున్నాడు. మరి ఏది అబ్‌సొల్యూట్ సత్యం?

అతడి ఆలోచనలను భంగపరుస్తూ "సామాజిక కట్టుబాట్లను గౌరవించి, నువ్వేం సాధిద్దామనుకుంటున్నావు బోసూ?" అని అడిగింది.

"ఎవ్వరికీ అన్యాయం జరగని సర్వమానవ సమాన సమాజం".

"అది పుస్తకాల్లోనూ, కలల్లోనూ తప్ప మరెక్కడా సాధ్యంకాదు. నువ్వు ఎలాటి సమాజాన్ని సృష్టించినా, అందులో మొదలియార్లు, పర్వతాల నాయుళ్ళూ వుంటూనే వుంటారు. ఎప్పుడో నువ్వు ఏదో సమాజాన్ని సృష్టిస్తావని ఎదురుచూస్తూ, అప్పటివరకూ ఈ నీచులు సర్వసౌఖ్యాలూ అనుభవిస్తూంటే చేతులు ముడుచుకుని వుండలేను".

"అంత ఆవేశం పనికిరాదు లక్ష్మీ".

"నీ ప్రతీకారం తీరిపోయింది కాబట్టీ, నీ ఆవేశం చల్లారిపోయింది కాబట్టీ, నువ్వు ఎన్నైనా ప్రవచనాలు చెపుతావు బోసూ..."

"ఎందుకు నీకింత కసి?" విసురుగా అడిగాడు.

"ఎందుకా?" ఆమె కళ్ళు ఆవేశంతోనూ, దుఃఖంతోనూ ఎర్రబడ్డాయి.

"... నువ్వు ఆడపిల్లవై వుంటే తెలిసేది. కలలుకంటూ, ఆ కలలు నిజంచేసుకోవటానికి, మనసులో మాట చెప్పటానికి కావలసిన ధైర్యాన్ని కూడకట్టుకుంటూ, ఇక చెప్పేద్దామని అనుకున్న రోజున నీ జీవితంలోనూ ఒక దారుణమైన సంఘటన జరిగివుంటే ఈ రోజు నువ్వు నాకీ సలహా ఇచ్చి వుండేవాడివి కాదు. మీ ఇంట్లో ... నట్టింట్లో... గచ్చుమీద నలుగురు నన్ను రేప్ చేశారు. నీ కుటుంబసభ్యులు ముగ్గురూ చూస్తుండగా, వాళ్ళ ముందే నగ్నంగా నన్ను నలుగురూ అనుభవించారు. కనురెప్ప మూస్తే చంపేస్తామని నీ అన్ననీ, నీ చెల్లెళ్ళనీ కత్తుల్తో బెదిరించారు – ఆ దారుణమైన దృశ్యాన్ని ఉచితంగా చూడమని..." ఆమె బావురుమంది. "...వాళ్ళని కత్తి మొనమీద నిలబెట్టి మరీ చూపించారు. నవ్వుతూ కేరింతలు కొడ్తూ నన్ను అనుభవించారు. అదీ చాలదన్నట్టు నన్ను వాళ్ళతో తీసుకుపోయి మూడు రోజులు వుంచుకుని వదిలేశారు. నాకు బాగా గుర్తుంది బోసూ! నేల మీద నగ్నంగా నేను గింజుకుంటూంటే, నన్ను మొదలియార్ పాశవికంగా ఆక్రమించుకుంటూంటే, ఆ దృశ్యం చూడలేక గోమతి లోపలికి పరుగెత్తబోతే – కత్తితో ఆ అమ్మాయి వెన్నెముకమీద గాటు పెట్టారు. ఇదంతా నీకెవరయినా చెప్పారా బోసూ? చెప్పివుండర్లే. సభ్యసమాజ సభ్యులు కదా..."

అతడు సమాధానం చెప్పలేదు. అతడికి జైలు గుర్తొచ్చింది. యావజ్జీవం అనుకున్న శిక్ష – మూడు సంవత్సరాలే అయినప్పుడు, దానికి కారణం మఖ్యమంత్రి అనుకున్నాడు. 'ఇక నుంచీ నీ జీవితం నాది' అని ముఖ్యమంత్రి బేరం పెడతాడనుకున్నాడు కానీ ఇది లక్ష్మీ శారదది.

ఆమె తనని అడగక్కర్లేదు. అది తన కర్తవ్యం కూడా.

కానీ – కానీ

విశారద!

ఆమె తనలో తెచ్చిన మార్పు...

అటెళ్ళి – మళ్ళీ ఇటు

ఇద్దరు స్త్రీలు – తమ జీవితపు అనుభవాల్ని పాఠాలుగా నేర్చుకుని, రెండు విభిన్న లక్ష్యాల్ని ఏర్పరచుకున్నారు.

గడియారంలో పెండ్యులంలా అతను వూగుతున్నాడు.

...ఏ శారద దగ్గిర అతడి కాలం నిలుస్తుంది?

ఏ శారద జీవిత గమ్యపు డైరీలో అతడు ఆఖరి వాక్యం అవుతాడు?

## 2

**"పెళ్ళయిపోయిందా?"** అడిగాడు పర్వతాల నాయుడు.

"వాళ్ళిద్దరికీ అవలేదు. వాడి చెల్లెలికి అయింది" మొదలియార్ అన్నాడు. "....ఆ రోజు పెళ్ళికోసమే వెళ్తున్నారు వాళ్ళు. నాలుగు వైపుల్నుంచీ అటాక్ చేసి, ఏ

విధంగానూ తప్పించుకోలేని చక్రబంధం వేశాము. కానీ ఆ టైమ్‌లో బుల్లెట్ ప్రూఫ్ కారు వస్తుందని అసలు ఎవరూ వూహించలేదు".

"ముఖ్యమంత్రి కారు అక్కడికి ఎందుకొచ్చింది?"

"అనధికారికంగా వచ్చిందట. లోపల ఎవరో స్త్రీ వుందట. బహుశా ముఖ్యమంత్రి 'కీప్' అయివుంటుంది. ఈ మధ్య ఎవరితోనో వుంటూన్నాడుగా!"

"ఎవరావిడ?"

"వివరాలు తెలీదు. చాలా అందంగా వుంటుందట. మరి ఆవిడకి అంత అకస్మాత్తుగా అలాంటి ధైర్యం ఎలా వచ్చిందో – వర్షంలా కురుస్తున్న బుల్లెట్స్ మధ్య కారు ఆపి వాడిని ఎక్కించుకుందట".

"వాడిని చంపటం పెద్ద కష్టం కాదనుకో –" సాలోచనగా అన్నాడు పర్వతాల నాయుడు. "కానీ దానివల్ల ఏం లాభం? ఆ బోస్ బజార్ ఎప్పటికీ నీకు కాంపిటీషన్‌గా అలాగే వుంటుంది. వాడు పోతే ఇంకొకడువచ్చి మానేజి చేస్తాడు. వాడిని మానసికంగా చంపాలి. వాడి చెల్లెలిమీద ఆసిడ్ పోశాం చూడు. అలా...! అలాంటివి చేస్తే వాడు విలవిలలాడి పోతాడు. అప్పుడు వాడిమీద మనం ఆధిపత్యం సంపాదించవచ్చు. మన శత్రువు అసల్లేకపోవటం కన్నా, వుండి బాధపడడం మనకి ఎక్కువ సంతృప్తినిస్తుంది కదా! అన్నట్లు వాడి చెల్లెలు గుడ్డిది కదూ!"

"అవును".

"మొన్నే పెళ్ళయింది కదూ? శోభనం జరిగిందా ?"

"తెలీదు". పర్వతాల నాయుడు ఎందుకు అడుగుతున్నాడో అర్థం కాక జవాబిచ్చాడు మొదలియార్. సాధారణంగా పర్వతాల నాయుడిని చీమకన్నా అల్పప్రాణిగా చూస్తాడు మొదలియార్. కానీ మొన్నటి ప్లాను ఫెయిల్ అవటంతో కాస్త తగ్గాడు.

పర్వతాల నాయుడు అన్నాడు. "...నీ మనిషి నెవర్నయినా పంపి ఆ అమ్మాయి శోభనం ఎప్పుడో కనుక్కో మొదలియార్ !"

* * *

లక్ష్మీశారద చిత్తరువులా చూస్తోంది.

బోసు ఇప్పుడో కొత్త వ్యక్తిలా కనపడుతున్నాడు. తనకి తెలిసిన బోసుకాదు. మరోవ్యక్తి. తనకు తెలియని మరో కోణం కనపడుతోంది.

ఇంతకుముందుకూడా ఆ కోణం వుంది, కానీ సరియైన అవకాశం లేక అది అంతగా కనపడలేదు. ఇప్పుడు ప్రస్ఫుటంగా కనపడుతోంది.

అప్పటివరకూ ముఖ్యమంత్రికి ఆమె బోసు గురించి ఏమీ చెప్పలేదు. అతడు తనకి తెలుసునని ఆమె చెప్పగానే ముఖ్యమంత్రి ఆశ్చర్యపడ్డాడు. అతడు కూడా ఆమె గతం గురించి ఎప్పుడూ అడగలేదు. అతడి జీవితంలో చాలామంది స్త్రీలున్నారు. చాలామంది వచ్చారు. అలాగే వెళ్ళిపోయారు.

రాజకీయ నాయకులు చొక్కాలు మార్చినట్టు పార్టీలే కాదు, స్త్రీలని కూడా మారుస్తారు. సినీ తారల విషయాలు బయటకు వచ్చినట్టు వీరివి రావు. అంతే తేడా!

లక్ష్మీ శారద కూడా ఆ విధంగానే ముఖ్యమంత్రి పెషీ చేరింది.

అయితే ఆమెది కన్ను తిప్పుకోనివ్వని అందం.

కాస్త మెరుగు పెట్టేసరికి మరింత వన్నె తేలింది.

అయినా అదికాదు అక్కడ ముఖ్యం. ఏ స్త్రీ కూడా కేవలం తన అందంతో మొగవాడిని ఎక్కువకాలం కట్టి పడెయ్యలేదు. ఆ అందం ఎక్కువకాలం నిలబడదు కూడా!

త్వరలోనే ఆమె పేషీ మొత్తంమీద ఆధిపత్యం సంపాదించింది. ఆ విధంగానే ముఖ్యమంత్రి మీద కూడా!

సంవత్సరం తిరిగేసరికల్లా ముఖ్యమంత్రి ఆమెని వదలి వుండలేని పరిస్థితికి వచ్చాడు.

ఆమె మనసులో భావాలు మాత్రం ఎవరికీ తెలియవు, మామూలుగానే వుండేది. బోసు మీద హృదయాంతరంగంలో వున్న ప్రేమ, ముఖ్యమంత్రితో భౌతిక సంబంధం, మొదలియార్ మీద పగ – ఇన్ని మిశ్రమమయిన భావాల్తో కూడా ఆమె నిండు కుండలా వ్యవహరించేది.

బోసు గురించి మఖ్యమంత్రికి ఆమె చెప్పగానే అతడు సంతోషించాడు.

అతడికి బోసులాంటి వ్యక్తి అవసరం చాలా వుంది. బోసుగురించి అతడు అప్పటికే చాలా విని వున్నాడు కూడా. పర్వతాల నాయుడికి ప్రధానమంత్రి దగ్గర అంత పలుకుబడి రావటానికి ధనరాజ్ మొదలియార్ లాటి స్మగ్లర్ కారణమని అతనికి తెలుసు. ఇప్పుడు తను నిలదొక్కుకోవాలంటే అలాంటి మనిషి ఒకరి అవసరం చాలావుంది.

గూండాలూ, రౌడీలూ చాలా మంది దొరుకుతారు. కాని 'బలానికి ' తెలివి తేటలు జోడయినవారు అరుదు. అలాంటివారే తమస్వంత 'సామ్రాజ్యం' నిర్మించుకోగలుగుతారు. బోసు అలాటి మనిషని తెలుసు.

"రా... రా... నీ గురించి లక్ష్మీశారద చెప్పింది. నా కెక్కువ టైమ్ లేదు. చాలా అప్పాయింట్ మెంట్లున్నాయి. లక్ష్మీ శారదకి కావల్సిన వాడివి అంటే నాకూ కావల్సినవాడివే. నీ కేమన్నా పన్లుంటే చెప్పు, చేయిస్తాను. మొహమాటపడకు" అన్నాడు.

"చాలా థాంక్స్ సర్ " అన్నాడు బోసు. "...నేను జైలుకి వెళ్ళాక శారద ఏమైందా అని చాలా కంగారుపడ్డాను. మీ పేషీలో సురక్షితంగా వుందని మొన్నే తెలిసింది. ఇక పనులంటారా – మీ అంత పెద్దవాళ్ళతో చేయించుకోగలిగినవి మాకేమి వుంటాయి? అన్నీ చిన్న చిన్న పనులే. ఎక్సైజుకీ, కస్టమ్స్‌కీ సంబంధించినవి. సెంట్రల్ గవర్నమెంటు వాళ్ళవి. భగవంతుడి దయవల్ల అన్నీ సజావుగానే సాగుతున్నాయి" అని లక్ష్మీశారదవైపు తిరిగి, "ఏమి లక్ష్మీ? ఆయనకి అన్ని పనులున్నప్పుడు ఎందుకు తొందరపెట్టి రమ్మన్నావు? తీరిగ్గా కలుసుకునేవాళ్ళం కదా?" అన్నాడు.

లక్ష్మీ బిత్తరపోయింది. బోసు ఆమెను పట్టించుకోలేదు. ఆయన వైపుతిరిగి అన్నాడు. "–మాకు కష్టాలు అధికారుల నుంచి రావటంలేదు సార్. పొలిటికల్ పార్టీల దగ్గర్నుంచే వస్తున్నాయి. అధికారంలో వున్న పార్టీతో మంచి సంబంధాలు కలిగి వుండాలి. మీకు తెలియనిదేముంది? మీ పార్టీకి "బోసు బజారు మర్చెంట్స్" తరఫున చాలా ఇచ్చాం. చాలా సంతోషంగా ఇచ్చాం. కానీ మళ్ళీ మీ పార్టీవాళ్ళే

కబురు చేశారు. ఒక పార్టీకి ఇస్తే, మరో పార్టీ –'మాకు ఇమ్మని' వత్తిడి చేయడంలో అర్థంవుంది కాని, ఒక పార్టీలోనే రెండు వర్గాలు చందాలు అడిగితే కష్టం. వాళ్ళని అదే అడిగితే ఏవేవో కాకమ్మ కథలు చెపుతారు. 'ముఖ్యమంత్రి వుండడు. మేమే అధికారంలోకి వస్తాం. మాతో మంచి రిలేషన్స్ పెట్టుకుంటే మంచిది' అంటారు. మాలాంటి వాళ్ళకి ఏం చెయ్యాలో తోచదు ".

ముఖ్యమంత్రి మొహం జేవురించింది. "ఎవరు వాళ్ళు?" అన్నాడు.

"పర్వతాల నాయుడు, హోం మినిష్టర్". బోసు ముఖ్యమంత్రి మొహంవైపు చూడలేదు. నమ్రతగా చెప్పుకుపోతున్నాడు. "..మీరు కలుసుకోమన్నారు అని లక్ష్మీ శారద చెప్పగానే నేనదే అనుకున్నాను. 'ఏదైనా గొడవ జరిగిందేమో – మా అవసరం మీకేమైనా పడిందేమో' అనుకున్నాను. విపత్కర కాలంలో మా శారదని ఆదుకున్నారు. దానికి ప్రతిగా మీ కోసం నేనేం చేయవలసి వచ్చినా సంతోషంగా చేస్తాను. బస్తరు నుంచీ కోస్తాదాకా మావాళ్ళు చాలామంది వున్నారు. పైకి మామూలుగా కనబడతారు గానీ ఒక్కొక్కరు రాత్రికి రాత్రి బల్లలు తిప్పించగలవాళ్ళు. లేకపోతే ఇంత పెద్ద పెద్ద వ్యాపారాలు ఎలా చేస్తారు చెప్పండి!"

....ముఖ్యమంత్రికి కాదు, వింటూన్న లక్ష్మీశారదకి మతిపోయింది. బోసు చాలా ఇన్‌డైరెక్టుగా, కానీ స్పష్టంగా – తను చెప్పదలుచుకున్నది చెప్పేసేడు.

"ఏ ప్రభుత్వం వున్నా ఏది ఏదయినా నాకొచ్చే నష్టం ఏమీలేదు. మీ అవసరం నాకేమీ లేదు... నా అవసరమే మీకుంది... నీ ప్రత్యర్థి నా సాయం

అడుగుతున్నాడు. ఎవరివైపు వుండాలా అన్నదే ప్రస్తుతం నేను నిర్ణయించుకోవల్సిన విషయం..."

ఇదంతా కలిసి మొత్తంగా తేలినదేమిటంటే –

"నీ అప్పాయింట్‌మెంట్ కాదు నాక్కావల్సింది. నా అప్పాయింట్‌మెంట్ నీక్కావాలి" అని అన్యాపదేశంగా చెప్పటం!

...లక్ష్మీ శారద ఇంకా దిగ్భ్రమ నుంచి తేరుకోలేదు. పర్వతాల నాయుడు బోసుని కలుసుకోవడమన్నది పచ్చి అబద్ధం అనీ, వాళ్ళిద్దరిమధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతుందనీ ఆమెకి తెలుసు. బస్తరు నుంచి కోస్తా వరకు విస్తరించిన సామ్రాజ్యమేమిటో ఆమెకి అర్థంకాలేదు. బోసు మొహం చూస్తోంటే అతడు ఒక్క అక్షరం అబద్ధం చెప్పటం లేదన్నట్లుగా వున్నాడు. ముఖ్యమంత్రి బింకంగా, "అసమ్మతి వర్గం అన్నది ఎప్పుడూ వుంది. కానీ అది అధికారంలోకి రావడం కల్ల" అన్నాడు.

"నేనూ అదే అనుకున్నానండీ. కానీ ధనుంజయ అని ఇండస్ట్రియలిస్టు కూడా ఆ పక్కనే వున్నాడు. ప్రధానమంత్రికి ఆయన బాగా దగ్గిరంట. ఆయనే స్వయంగా ఈ విషయం చెప్పారు" అన్నాడు.

తనకన్నా ముందే యీ వ్యక్తిని తన ప్రత్యర్థులు కలుసుకున్నారన్న విషయం ముఖ్యమంత్రిని కంగారు పెట్టింది.

బోసు అన్నాడు, "ఏవో అల్లర్లు లేవదీస్తారట. గ్రూప్‌ని సాయం అడిగేడు. చార్మినార్ పక్కనున్న 'బారకాస్' తెలుసుగా! అక్కడ మాత్రం గొడవలు

జరక్కూడదని కండీషన్ పెట్టాను. అది మా ఏరియా. కొన్నికోట్ల సరుకు అక్కడ వుంటుంది. దానికి నష్టం జరిగితే కష్టం కదండీ".

"బారకాస్" అంటే స్మగ్లింగ్ స్థావరం. అది కాదు ముఖ్యమంత్రి ఆలోచిస్తూంది. ధనుంజయకే కండీషన్‌లు పెడుతున్న ఈ బోసు ఎవరా అని.

బోసు వాచీ చూసుకుని "మీకు చాలా పనులున్నట్టున్నాయి. మళ్ళీ మీకు ఖాళీ వున్నప్పుడు కలుసుకుంటాను" అన్నాడు.

"పనులకేముంది. వాయిదా వేసుకోవచ్చు. ఈ అసమ్మతి వర్గం గొడవ ఎక్కువైపోతోందయ్యా! దీన్ని ఎలాగయినా అణిచివెయ్యాలి" అన్నాడు.

"దానిదేముందండీ. మనమే గొడవలు చేయిస్తాం. మీ ప్రసక్తి అసలు రాకుండా, ...దీనికంతా బాధ్యత వహించి హోం మినిష్టరు రాజీనామా చేయాలని మిగతా ప్రతిపక్షంతో గొడవ చేయించి, ఆ పర్వతాల నాయుడి మీదే వత్తిడి తీసుకొస్తాం. అంతా మనమే చేయించామని తెలిసినా, అసమ్మతి వర్గం ఏమీ చేయలేదు".

"ఈ ఆలోచన బావున్నట్టుందే".

"మరి నేను వెళ్ళొస్తానండీ" అంటూ లేవబోయాడు బోసు.

"ఆగాగు. మనం మాట్లాడుకోవాల్సింది చాలావుంది".

"మీకేవో అప్పాయింట్ మెంట్లు..." అర్ధోక్తిలో ఆపుచేశాడు.

"వాటికేముందయ్యా. అవి ఎప్పుడూ వుండేవే " అంటూ సెక్రటరీకి ఫోన్ చేయటానికి తిరిగాడు.

బోసు లక్ష్మీశారదవైపు చూసి నవ్వేడు.

ఆమె ఇంకా ఎగ్జయిట్‌మెంట్ నుంచి తేరుకోలేదు.

శత్రువుల్ని తమ రాజు చీల్చి చెండాడుతున్నప్పుడు చూస్తుంటే స్వదేశ సైనికుడికి కలిగే తృప్తి అది.

ముఖ్యమంత్రి ఆమె జీవిత పోరాటంలో ఆఖరి శత్రువు.

## 3

**సుధాకర్** నిస్సహాయంగా చూస్తున్నాడు. కాళ్ళు తాళ్ళతో కట్టి వేయబడి వున్నాయి. కాబట్టి కదలటానికి లేదు. కళ్ళకి గంతలులేవు కాబట్టి చూడక తప్పటం లేదు.

చూడకుండా వుండడానికి చూసే ప్రయత్నంలో కళ్ళు గట్టిగా మూసుకున్నా, చెవులు మూసుకోవటానికి వీల్లేకుండా చేతులు వెనక్కి విరిచి కట్టేయబడి వున్నాయి. అందుకని ఆ మాటలు చెవిన పడుతూనే వున్నాయి.

గోమతి పాలగ్లాసుతో లోపలికి ప్రవేశించింది. వెనుకే తలుపులు మూసుకున్నాయి. "అతడు" దగ్గిరగా వెళ్ళి తలుపు బిగించాడు. ఆమెని పొదివి పట్టుకుని మంచం దగ్గిరకి నెమ్మదిగా తీసుకొచ్చాడు.

గోమతి తడుముకుంటూ మంచంమీద కూర్చుంది.

'అతడు' గ్లాసు ఆమె నోటికి అందించాడు. తను కాస్త తాగి, ఆమెతో మిగతా పాలు తాగించాడు.

సుధాకర్ గింజుకున్నాడు. కనీసం కాళ్ళ బంధాలన్నా లూజు అవుతాయేమోనని బలంగా విదిలించాడు. నోటికున్న టేపు విడగొట్టుకోవటానికి

విశ్వప్రయత్నం చేశాడు. లాభం లేకపోయింది. ఆ గదిలోనే ఒక మూల నిస్సహాయంగా పడివున్నాడు సుధాకర్.

"నన్ను చేసుకోవటం నీ కిష్టమేనా గోమతీ?" అతను అడుగుతున్నాడు.

"ఆ ప్రశ్న నేను అడగాలండీ. మొహం కాలిపోయినదాన్ని, కళ్ళు లేనిదాన్ని – మీరు కావాలని చేసుకున్నారంటే అది నా అదృష్టం " అంటూ అతని చేతిని తన మొహానికి ఆన్చుకుంది. అతడు ఆ చేత్తోనే ఆమె మొహాన్ని దగ్గిరగా తీసుకుని పెదవులమీద గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు.

"నో... నో" అరవటానికి చేస్తున్న ప్రయత్నం విఫలమవుతోంది. సుధాకర్‌కి దుఃఖం వస్తోంది.

అతడు గోమతితో ప్రేమగా మాట్లాడుతున్నాడు. కాలం గడుస్తూ వుంది.

ఆ ఆగంతకులు గదిలో ఎప్పటినుంచి కాపువేసి ఉన్నారో తెలీదు. సుధాకర్ రాగానే, వెనుకనుంచి గట్టిగా పట్టుకుని, ముందు నోటికి టేపు వేసేసేరు. వాళ్ళు చాలా బలిష్టంగా ఉన్నారు. సుధాకర్ ఏం జరిగిందో తెలుసుకునేలోపులో బంధించారు.

బయట వున్న వారికెవరికీ అనుమానం రాలేదు. అసలే బంధువులు తక్కువ. గోమతిని పద్మావతి తీసుకొచ్చి తలుపు దగ్గిర వదిలింది. ఆమెకూడా లోపలికి వచ్చి సుధాకర్‌తో రెండు మూడు మాటలు మాట్లాడదామని అనుకున్నా ఈ దారుణం బయటపడి ఉండేది.

ఆగంతకులకి – ఆ ఇంటి టోపోగ్రఫీ చాలా క్షుణ్ణంగా తెలియటమే కాదు, ఆ యింట్లో వ్యక్తుల గురించి కూడా తెలిసినట్టు వుంది. ఎంత చిన్న చిన్న

విషయాలు తెలుసుకున్నారంటే – చివరికి గోమతి, సుధాకర్ అప్పటివరకూ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదనీ, గోమతి అతడి కంఠస్వరాన్ని గుర్తుపట్టే అవకాశమే లేదని కూడా కనుక్కున్నారు.

ఇంత మెటిక్యులస్ ప్లానింగ్ ధనరాజ్ మొదలియార్‌ది! పర్వతాల నాయుడు తన ఆలోచన చెప్పగానే, అతడు రంగంలో దిగాడు. ఆలోచన నాయుడిది. ప్లానింగ్ మొదలియార్‌ది.

సాడిస్టులకి – ఒక్కొక్కరికి ఒక్కొక్క అభిరుచి వుంటుంది. ధనరాజ్ మొదలియార్ ప్లానింగ్ కూడా అతడి అభిరుచి వుంటుంది. అయితే ఇది అతడి సాడిజానికి పరాకాష్ట. ఒక దారుణం చేస్తూంటే మరొకరు చూడాలన్న అభిరుచి!... ఇక్కడ –

....అతడామె పెదవుల్ని ముద్దాడి తన మొహాన్ని క్రిందకి వంచాడు. మెడ మీదుగా మరింత క్రిందకి వంగాడు.

సుధాకర్ అటూ ఇటూ పొర్లటానికి ప్రయత్నిస్తున్నాడు. కాళ్ళతో ఏదైనా వస్తువు దొరికితే తన్నటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఆగంతకులు ఇవన్నీ ముందే వూహించినట్టున్నారు. తగు జాగ్రత్తలు చేసి వెళ్ళిపోయారు.

గోమతి ఆ కౌగిలిలో కరిగిపోతుంది. ఆచ్ఛాదన తొలగిన ఒక్కొక్కభాగం మీద ముద్దుపెట్టుకున్నాడు. ఎక్కువ మాటలు లేవు. చేతల్లో తేడాని తెలుసుకునే అనుభవం ఆమెకి లేదు.

మాల్లెపూల పక్కమీద ఆమెని పరుండబెట్టాడు. పూల తెల్లదనంతో ఆమె వంటి తెల్లదనం పోటీ పడుతోంది. సుధాకర్ కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. 'వద్దు గోమతీ, పారిపో. ఈ గదిలోంచి వెళ్ళిపో..' అతడి హృదయం ఆక్రోశిస్తోంది.

అతడు బట్టలు విప్పుతున్నాడు.

ఆ గదిలో సూదిపడితే వినపడేటంత నిశ్శబ్దం అలుముకుని వుంది.

అప్పుడే ఆ హాలు దగ్గిరకి వచ్చాడు – బోసు.

తలుపు దగ్గిర నిలబడి వున్న పద్మావతిని చూసి "ఏం పని అది పద్మావతీ" అని మందలించాడు. వెనుకనుంచి హఠాత్తుగా వినపడిన మాటలకి వులిక్కిపడి – నాలిక్కరుచుకుని పద్మావతి అక్కణ్ణుంచి దూరంగా పరుగెత్తింది.

బోసు హాలులో లైటు ఆర్పి తన గదిలోకి వెళ్ళాడు.

లోపలి గదిలో అగరొత్తి చివరివరకూ కాలి ఆరిపోయింది.

## 4

ప్రతి రాత్రీ వెళ్ళిపోతూ – వీడ్కోలుగా ఒక ఉదయాన్నిస్తుంది! ప్రతి ఉదయమూ – వస్తూ తనతో ఒక అనుభూతిని తెస్తుంది.

ఆ అనుభూతి నిన్నటిరోజు తాలూకు అనుభవానిదైనా కావొచ్చు. ఆ రోజు జరగబోయే సంఘటన తాలూకు ఉద్వేగమైనా కావొచ్చు.

చాలా మందికి 'ఉదయాలు' ఏమీ తీసుకురావు. తల్చుకోటానికి నిన్న జరిగిందేమీ వుండదు. ఎదురు చూడడానికి నేడు జరగబోయేదేమీ వుండదు.

ఒక 'నిన్న' గోమతికి – అనుభూతిని మిగిల్చింది. ఒక నేడు – బోసుబాబుకి ఏం మిగులుస్తుందో కాలమే చెప్పాలి.

చెల్లెలి హనీమూన్ కోసం బోసు ఒక ఖరీదైన గెస్ట్‌హౌస్ తీసుకున్నాడు. మొదటిరాత్రి అక్కడే ఏర్పాటు చేశాడు. పద్మావతిని తోడుగా వుంచాడు. అహల్య పెళ్ళికి వచ్చి వెళ్లిపోయిందంటే.

మరుసటిరోజు ప్రొద్దున్న అతడు కార్లో గెస్ట్‌హస్‌కి వెళ్ళాడు. అప్పటికి ఎనిమిదయింది. ముందు హాల్లో గోమతి పక్కనే కూర్చుని పద్మావతి కాఫీ తాగుతోంది. అన్నయ్య వస్తున్న అలికిడికి గోమతి సిగ్గుపడి లోపలికి వెళ్ళిపోయింది.

"సుధాకర్ లేవలేదా?" అడిగాడు బోసు.

"లేదు. కొత్త పెళ్లికొడుకు కదా" నవ్వింది పద్మావతి.

బోసు మెట్లెక్కి బెడ్ రూంలోకి ప్రవేశిస్తూండగా క్రిందనుంచి పద్మావతి అన్నది "కొంచెంసేపు పడుకోనివ్వరాదూ.."

"...పనుంది" అంటూ అతడు తలుపు తోసుకుని లోపలికి వెళ్ళాడు. అక్కడ అతడు సుధాకర్‌ని చూశాడు.

అర్థరాత్రి – ఒక కుర్రవాడు తల్లి చేతుల మధ్య నిద్రపోతూ వుంటాడు. చిన్న కదలికతో మెలకువ వస్తుంది. నెమ్మదిగా వూగిపోతూ కనిపిస్తూంది. దూరంగా ఎక్కడో పతేలున ఏదో పగిలినట్టు శబ్దం దిగంతాలు దద్దరిల్లేలా వినిపిస్తూంది. భూమి రెండుగా చీలిపోతుంది. ఇంటిదూలం విరిగి తల్లి మొహాన్ని చూర్ణం చేస్తుంది. బయట్నుంచి జనం హాహాకారాలు వినిపిస్తాయి. ఏమీ మిగలదు. దుఃఖం తప్ప – ఆ తరువాత తెలుస్తుంది భూకంపం వచ్చిందని.

వాస్తవం తెలిస్తే ఏం లాభం? అప్పటికే జరగవలసింది జరిగిపోతుంది. అక్కడ అదే జరిగింది.

సుధాకర్ ఒక పక్కకి వాలిపోయి వున్నాడు. స్పృహ తప్పేడో, నిస్పృహతో నిద్రపోతున్నాడో – తెలియదు. బోసు కట్లు విప్పాడు. నోటికి అడ్డుగా వున్న ప్లాస్టర్ తీసేసేడు.

సుధాకర్ చాలాసేపు దుఃఖించాడు. దుఃఖం అంటే రోదించటం కాదు, అంతర్గతమైన వేదనతో – మోకాళ్ళమీద తల ఆన్చుకుని నిశ్శబ్దంగా వుండిపోయాడు. బోసుకి కూడా అర్థమైంది. అర్థమనుతున్నకొద్దీ రక్తం మరగసాగింది. తన చెల్లెలు ఇంకెవరితోనో తొలిరాత్రి గడిపింది!... మామూలుగా కాదు. మనసా, వాచా, కర్మణా – పాలగ్లాసు అందించటం నుంచీ, పడక పంచుకోవటం దాకా... అన్నీ... మ..న..స్ఫూ...ర్తి...గా...

భర్త నిస్సహాయుడై చూస్తుండగా...

చరిత్రలో తన ప్రత్యర్థిమీద ఇంతకన్నా 'గ్రాండ్' గా ఎవరూ కసితీర్చుకుని వుండరు. 'దటీజ్ మొదలియార్' అన్నట్టు ప్రత్యర్థి నవ్వుతూ కనిపించాడు.

బోసు లేచాడు.

"బోసూ" పిల్చాడు సుధాకర్. బోసు ఆగాడు.

"... ఈ విషయాలేమీ గోమతికి చెప్పకు".

"ఏమిటీ?" అయోమయమూ, అనాలోచితమూ రంగరించిన సందిగ్ధత – బోసు కంఠంలో ధ్వనించింది.

సుధాకర్ లేచి బోసు దగ్గిరకి వచ్చాడు. భుజం మీద చెయ్యి వేశాడు. అంత చొరవ అతడెప్పుడూ తీసుకోలేదు. అనుభవం పెద్దరికాన్ని ఆపాదించింది.

"అవును బోసూ! ఎందుకు చెప్పటం? అదొక ఆక్సిడెంట్. అంతే అంతకన్నా ఎక్కువ ప్రాముఖ్యత వున్నదా దానికి? - ఆమె అది నేనని నమ్మింది. నమ్మకం ముఖ్యం. తప్పు లేనప్పుడు ఆమె ఎందుకు శిక్షింపబడాలి? అయినా ఇందులో శిక్ష ప్రసక్తి ఎందుకు? నేనీ విషయం నిన్న రాత్రే మర్చిపోయాను. నువ్వూ మర్చిపోలేవా బోసూ?"

బోసు కళ్ళు అప్పుడు తడి అయ్యాయి. అప్పటివరకూ అతడు ఎన్నో ఆటుపోట్లు చూసినవాడు. ప్రకృతి వైపరీత్యాలన్నిటినీ చూసి చూసి హిమశిఖరం గడ్డ కట్టుకుపోతుంది. లోపలి లావా కూడా ఏమీ చేయలేనంతగా అది ఘనీభవించిపోతుంది. ఏ ప్రళయకాల ఝుంఝూమారుతమూ దాన్నేమీ చేయలేదు. అంత కఠిన శిఖరంకూడా, శీతలపవన తాకిడికి తన అంచుమీద మరణించిన పక్షిని చూసి, గుండె కరిగి నీహారికా అశ్రువుని రాలుస్తుంది. ఇప్పుడు అతని పరిస్థితి అదే. శిఖరమయిన స్నేహితుడి వ్యక్తిత్వానికి అతడి కళ్ళు చెమర్చాయి. ఏమీ మాట్లాడలేకపోయాడు. సుధాకర్ చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా నొక్కాడు.

అక్కణ్ణుంచి కదిలి, నిశ్శబ్దంగా క్రిందికి వచ్చేశాడు. వచ్చేసేముందు ఒకే ఒక ప్రశ్న అడిగాడు. "అతనెవరు సుధాకర్?"

"పర్వతాల నాయుడు"

బోసు నుదుటి నరం ఉబికింది. అతడు లేస్తూంటే సుధాకర్ అన్నాడు. "దీన్ని గురించి పూర్తిగా మర్చిపో బోసూ, పూర్తిగా అంటే..." అర్థోక్తిలో ఆపు చేశాడు.

బోసు నెమ్మదిగా తలెత్తాడు.

అతడి కళ్ళు జేగురు రంగులో వున్నాయి. వాటిని చూసి సుధాకర్ భయపడ్డాడు. "వద్దు బోసూ ... ప్లీజ్ – ఇది ఇక్కడితో ఆగదు. నువ్వేదో చేస్తావ్. వాళ్ళు మరో..." అని తడబడి, "... సారీ నేను నీకు ఎప్పుడూ ఏమీ చెప్పలేదు. సలహా ఇచ్చేటంత గొప్పవాడిని కాదు. కానీ –"

బోసు అప్పటికే అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

క్రింద హాల్లో గోమతి వుంది. ఆమె మొహంలో కాసింత విషాదాన్ని గమనించాడు. "ఏమ్మా అలా వున్నావ్" అని అడిగాడు.

"ఏం లేదు".

"కాదు, ఏదో వుంది".

"నాన్నా – అక్కయ్య – అన్నయ్య – అందరూ వుంటే బావుండేది కదన్నయ్యా".

అతడు మాట్లాడలేదు.

అవును. బావుండేది. అప్పుడు అక్క పక్క సర్దేది. వదిన పరాచికాలాడేది. ఈ ఊరి చివర గెస్ట్‌హౌస్‌లూ, సెక్యూరిటీలూ వుండేవి కావు. క్షణ క్షణం ప్రాణభయం వుండేది కాదు.

అతడి మౌనాన్ని ఆమె మరోలా అర్థం చేసుకుంది. "చూసేవా నేనెంత స్వార్థపరురాలినో, నువ్వు ఇంత ఇస్తూంటే, నేను లేనిదాన్ని గురించి ఆలోచిస్తున్నాను" అంది నవ్వుతూ. అతడామెని దగ్గరగా తీసుకుని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.

అక్కడినుంచి బయటకు వచ్చేసేడు.

అతడిలో ఇప్పుడు ఆవేశమేమీలేదు. ఆలోచనే వుంది.

ఆలోచనతోనే ఇంటికి వెళ్ళాడు. తన పనులను సాధారణ రీతిలోనే నిర్వర్తించాడు. ఏడింటికి ఫోన్ వచ్చింది. ఇన్ఫర్మేషన్ తెలిసింది. మొదలియార్ ఆ రాత్రికి రెస్ట్‌హౌస్‌లో గడపబోతున్నాడు. లేక్‌వ్యూ పక్కనున్న రెస్ట్‌హౌస్. అదృష్టం కలిసొచ్చింది. ఇద్దరూ ఒకేచోట దొరికారు. సెక్యూరిటీ వుంటుంది... కానీ అది పెద్ద ప్రతిబంధకం కాబోదు. తన అనుచరులు సెక్యూరిటీ వలయాన్ని చీమ చిటుక్కుమనకుండా ఛేదించగలరు.

రాత్రి పదింటికి అతడు బయల్దేరాడు.

బయట మంచు కురవటం మొదలైంది. వీథులు నిర్మానుష్యంగావున్నాయి. అతడు కారు నెమ్మదిగా డ్రైవ్ చేస్తున్నాడు. అతడి మొహం నిర్వికారంగా వుంది. అతడు లేక్ వ్యూ రెస్ట్‌హౌస్‌కి వెళ్ళలేదు. పేషీకి వెళ్ళాడు.

ముఖ్యమంత్రి పేషీలో అతడు లక్ష్మీ శారదని కలుసుకున్నాడు. అంత రాత్రి వచ్చిన బోసుని చూసి, ఆమె ఆశ్చర్యపోయింది.

"నాతో వస్తావా లక్ష్మీ?"

"ఎక్కడికి?" విస్మయంగా అడిగింది.

"నీ చిరకాల వాంఛ తీర్చుకోవటానికి! ... మొదలియార్ మొహం కాల్చెయ్యటానికి..."

ఆమె ఇంకేమీ అడగలేదు. అడిగే టైమ్ కూడా వేస్టు చేయడం ఇష్టం లేనట్లుగా, అలాగే వచ్చి కారులో కూర్చుంది. దాన్నిబట్టి – ఆమె ఆ క్షణం కోసం ఎంతగా ఎదురు చూస్తోందో తెలుస్తుంది.

*　　　*　　　*

లేక్‌వ్యూ రెస్ట్‌హౌస్.

"ఎందుకు ఈ రాత్రి కలుద్దామన్నావ్?" బాటిల్ ఓపెన్ చేస్తూ అడిగాడు మొదలియార్.

"నీకో మంచి వార్త చెపుదామని " నవ్వేడు పర్వతాల నాయుడు.

"ఏమిటి?"

"ధనుంజయ ఇక్కడి కొస్తున్నాడు".

"అందులో విశేషమేముంది ?"

"కూతుర్ని తీసుకొస్తున్నాడు".

"అప్పుడు ఇంట్లోంచి పోయిందిగా ?"

"మళ్ళీ దొరికింది. ఎక్కడుందో తెలిసింది"

"అయితే ఏమిటట? ఈ అర్ధరాత్రి ఆయన కూతురు ఇక్కడికెందుకు?"

"బోసుకి కాబోయే భార్య ఆ అమ్మాయే కాబట్టి.."

మొదలియార్‌కి పొలమారింది. బ్లాంక్‌గా చూశాడు. పర్వతాల నాయుడు నవ్వేడు. "అవును. నిజం. ఇప్పుడు ధనుంజయ తన కూతురి పలుకుబడితో

బోసుని మార్చబోతున్నాడు. కానీ బహుశా ఆ అమ్మాయి వప్పుకోదు. ఏవో సిద్ధాంతాలూ గాడిదగుడ్డూ అంటుంది. వప్పుకుంటే సరేసరి. లేకపోతే బోసుకి మరో షాకు తగుల్తుంది. నిన్న చెల్లెలు.. ఈ రోజు కాబోయే భార్య..."

"నిన్ను తగలెయ్య. రేప్ వారోత్సవం పెడుతున్నావా ఏమిటి?"

ఫోన్ మోగింది. నాయుడు మాట్లాడి రిసీవరు పెట్టేసి వెనుదిరిగి అన్నాడు...

"ధనుంజయ బయర్దేరాడు విశారదతో కలిసి".

* * *

"ఏమిటది?" డాష్ బోర్డులోంచి బోసు తీసిన సీసాని చూస్తూ అడిగింది లక్ష్మీ శారద.

"ఆసిడ్"

ఆమె ఆప్యాయంగా దాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. ఆమె దృష్టి డాష్ బోర్డులోని మరో వస్తువుమీద పడింది.

చురకత్తి.

"అది దేనికి?"

"నీ పగ నువ్వు తీర్చుకుంటున్న సమయానికి నేనూ నాది తీర్చుకోవటానికి..."

"ఏవర్ని?"

"పర్వతాల నాయుడ్ని"

ఆమె ఆశ్చర్యంగా అతడ్ని చూసింది. ఆమె కళ్ళలో భయం కనబడింది. "నువ్వు స్వయంగా ఈ పని చేయటం ఎందుకు బోసూ? అనవసరంగా హత్యకేసు

– గొడవ... అయినా ఇప్పుడా నాయుడిమీద నీ కెందుకు అంత ఆకస్మికంగా పగ వొచ్చింది?"

అతడి ప్రశ్నకి సమాధానం చెప్పకుండా అన్నాడు... "నేనే ఈ పని చేయడం ఎందుకు అన్నావ్. అదే ప్రశ్న నిన్నడుగుతే నీ సమాధానం ఏమిటి?... వుండదు. కొన్ని ప్రశ్నలకి సమాధానం వుండదు లక్ష్మీ. మనం వున్న పరిస్థితిల్లో అవతలి వారుంటే, వాళ్ళు చెప్పేదాకా మనంకూడా అదే పరిస్థితుల్లో వున్నామని మనకి తెలీదు. ఈ విషయం కూడా నువ్వే నాకు చెప్పావు. దారుణంగా 'రొచ్చుగుంట' తో పోల్చి.." నవ్వేడు.

ఆమె నవ్వలేదు.

కత్తిని చేతిలోకి తీసుకుంటూ, "ఈ పనికూడా నేనే చేస్తాను. నాకు వదిలి పెట్టు" అంది.

"అదే మాట నేనంటే నువ్వొప్పుకుంటావా?"

ఆమె కన్విన్స్ అయినట్లు కనపడలేదు. కానీ కత్తిని యధాస్థానంలో పెట్టేసింది.

కారు రెస్ట్ హౌస్ ముందు ఆగింది.

*　　　*　　　*

దూరంనుంచి టార్చిలైటు వెలిగి ఆగింది.

"దిగు" అన్నాడు బోసు. లక్ష్మీశారద దిగింది. సెక్యూరిటీ మనిషి దగ్గరగా వచ్చాడు. అతడు మొదలియార్ సెక్యూరిటీ వ్యక్తికాదు. అదే డ్రస్‌లో వున్న బోసు మనిషి.

"అంతా ఓకే సార్! మీరు వెనుక వైపునుంచి లోపలికి వెళ్ళొచ్చు..."

లక్ష్మీ శారదకి ఆశ్చర్యంగా వుంది. మాఫియా ఇంత సిస్టమాటిక్‌గా పనిచేస్తుందని ఆమెకి తెలీదు. చూడడం కూడా మొదటి సారే.

లోపల మొదలియార్ "...బోయ్" అని పిలిచాడు.

ఎవరూ రాలేదు.

మొదలియార్ విసుక్కుంటూ కిచెన్‌లోకి వెళ్ళాడు.

వెనుకనుంచి మెట్లెక్కి వెళ్ళిన బోసు, లక్ష్మీశారదతో "వెళ్ళు" అన్నాడు.

హాల్లో పర్వతాల నాయుడు ఒక్కడే కూర్చొని వున్నాడు.

కిచెన్‌లో మొదలియార్ ఐస్ క్యూబ్స్ తీసుకుని ఫ్రిజ్ తలుపులు మూశాడు.

అంతలో గది తలుపు బోల్టు పడిన శబ్దం వినపడి వెనుతిరిగాడు.

చేతిలో సీసాతో తలుపు దగ్గిర లక్ష్మీశారద నిలబడి వుంది. "హాల్లో మొదలియార్ – హౌఆర్యూ...." అంది నవ్వుతూ.

మొదలియార్ వెనుదిరిగేసరికి ఆమె చెయ్యి ఎత్తింది.

ఆసిడ్ విసరటానికి కూడా ఒక టెక్నిక్ కావాలి. అవతలివ్యక్తి మొహం తిప్పుకునే లోపులో, సీసాలోంచి ఆసిడ్ వెళ్ళి మొహంమీద పడాలి. అలా విసురుతున్నప్పుడు మనమీద ఒక చుక్క కూడా చిందకూడదు.

ఆమెలో ఆ ప్రొఫెషనిలిజం లేదు.

కానీ కసి వుంది! తనకు జరిగిన ప్రతి అన్యాయానికీ బాధ్యుడు అతడు అన్న కసి వుంది. ఆ కసి యిచ్చిన స్ఫూర్తి వుంది!

ఆ పగతో ఆమె సీసా విదిలించింది.

అంతా కనురెప్పపాటున జరిగిపోయింది! అంతకుముందు ఎందరినో అలా కాల్చాడు అతడు. కొందర్ని అంధుల్నిచేశాడు. మరి కొందరి మొహాలు చూడటానికి వీల్లేనంత భయంకరంగా తయారు చేశాడు.

ఇప్పుడా నరకం ప్రత్యక్షంగా అనుభవిస్తున్నాడు అతడు. కొలిమిలో బాగా కాల్చిన ఇనుప వూచలు వేల సంఖ్యలో మొహంమీద పెట్టినట్టు చెవుల నుంచీ ప్రారంభమై... పెదవులు కాలిపోయి, బుగ్గలు వికృతంగా కరిగిపోయి... క్షణాల్లో అతడి చూపు మారిపోయింది.

అతడి కేక ఆ భవంతిలో ప్రతిధ్వనించింది.

లక్ష్మీశారద అతడివైపే కన్నార్పకుండా చూసింది. మొహాన్ని చేతుల్లో కప్పుకుని అటు ఇటూ పొర్లుతున్నాడు అతడు. ఆమెకు అదే దృశ్యం గుర్తొచ్చింది... గచ్చుమీద తనని అనుభవించటానికి వాళ్ళు చేసే ప్రయత్నంలో తాను అటూ ఇటూ పొర్లటం.

ఆమె నెమ్మదిగా ఆ గదిలోంచి బయటకు – బోసు దగ్గరకు రాబోయింది.

ఇంతలో బయట గేటులోంచి ఒక కారు లోపలికి వస్తూ – ఆ లైట్లు వెలుతురు కిటికీ మీద పడింది.

ధనుంజయ, విశారద వస్తూన్న కారు అది.

ఆమెకి ఎటు వెళ్ళాలో తోచలేదు. అంతలో వెనుకవైపు తలుపు చప్పుడయింది.

సెక్యూరిటీ గార్డు వేషంలో వున్న బోసు తాలుకు మనిషి లోపలికి వచ్చి "వెళ్దాం పదండి మాడమ్" అన్నాడు. సాధారణంగా, అనుకోని పరిస్థితులు ఎదురయితే ఏం చేయ్యాలో... దాన్ని "సెకండ్ లైన్ ఆఫ్ యాక్షన్" అంటారు.

ఊహించని ఆ కారు వచ్చేసరికి, సెకండ్ లైన్ ఆఫ్ యాక్షన్ రంగంలోకి దిగింది. లక్ష్మీశారదరని ఆమె ఇంటిదగ్గర దింపే బాధ్యత సెక్యూరిటీ చీఫ్ తీసుకున్నాడు.

"మరి బోసు?" అడిగింది.

"ఆయన తన సంగతి చూసుకోగలరు మాడమ్".

సరీగ్గా ఆ సమయానికి మరో కేక వినపడింది. చావుకేక.

ఆ స్వరాన్ని ఆమె సులభంగానే గుర్తుపట్టింది.

అది పర్వతాల నాయుడిది.

ఆమె పెదవులమీద చిరునవ్వు కదలాడింది. "...బోసు కూడా తన పగ తీర్చుకున్నాడన్నమాట" అనుకుంది మనసులో.

ఇంటి వెనుకవైపు వచ్చి, అక్కడ ఆగి ఉన్న కారు ఎక్కింది.

కారు ఇంటివైపు సాగిపోయింది.

* * *

మొదలియార్ కేక వినగానే బోసుకి మొదటి అంకం పూర్తయిందని అర్థమయింది. ఇక తన పనే మిగిలి వుంది.

అతడు మెట్లెక్కి లోపలికి వెళ్ళబోతూండగా కారు లైటు వెలుతురు లోపలికి పడింది. వెంటనే అతడు మెట్లపక్క నున్న స్టోర్‌రూమ్‌లో నక్కాడు.

కార్లో ఎవరు వస్తున్నారో అతడికి అర్థంకాలేదు. అతడు ఆ ఆలోచనలో వుండగా మరో కేక వినపించింది. అది పర్వతాల నాయుడిది. అతడొక క్షణం నిశ్చేష్టుడయ్యాడు.

అతడా నిశ్చేష్టత నుంచి తేరుకునే లోపులో లక్ష్మీ శారద ఇంటి వెనుక కారు ఎక్కుతూ కనిపించింది. పోర్టికోలో వున్నవారికి అనుమానం రాకుండా ఆ కారు చీకట్లో కలిసిపోయింది.

పోర్టికోలో ఆగిన కారులోంచి ధనుంజయ దిగుతున్నాడు.

బోసు మేడపైకి పరుగెత్తాడు. అతడికి లక్ష్మీశారద సంగతి బాగా తెలుసు. ఒక మాటంటే ఇక దాన్ని వదలదు.

అతడు పైకి వెళ్ళేసరికి పర్వతాల నాయుడు రక్తంతో విల విల కొట్టుకుంటున్నాడు. బోసు వూహించినట్టే జరిగింది. లక్ష్మీ శారద కత్తి అక్కడే వదిలి వెళ్ళిపోయింది అనుకున్నాడు.

హత్యాస్థానంలో మరణాయుధాల్ని వదిలివేయటం ఎమెచ్యూర్స్ చేసే పని. రేపు కోర్టులో డిఫెన్సు లాయర్ చేతులు కట్టిపడవేసే పని!...అతడు కత్తిని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

ఇంకా ఏమైనా ఆధారాలు అక్కడ వదిలివేయబడి వున్నవేమో అని చూశాడు. ఏమీలేదని సంతృప్తి చెంది నెమ్మదిగా క్రిందికి వచ్చాడు. మొదలియార్ గదిలో ఆసిడ్ సీసామీద లక్ష్మీ శారద వేలిముద్రలుంటాయని తెలుసు. ఆ సీసా తీసి కోటు జేబులో వేసుకున్నాడు. మొదలియార్ స్పృహతప్పి వున్నాడు.

....ఈ పన్లన్నీ అతడు – ఒక డాక్టరు ఆపరేషన్ చేసిన విధంగా ఒకదాని తరువాత ఒకటి నిర్వర్తించాడు. ఎక్కడా కంగారు పడకుండా, సిస్టమాటిక్‌గా పూర్తిచేశాడు. అన్నీ క్షణాల్లో అయ్యాయి.

ధనుంజయ లోపలికి వస్తూండగా అతడు తలుపుచాటున నిలబడ్డాడు. ధనుంజయ హడావుడిగా మెట్లెక్కి పైకి వెళ్ళటం గమనించాడు. బహుశ అతడికి కూడా ఈ కేక వినిపించి వుంటుంది. కంగారుగా పైకి వెళ్ళాడు.

అతడు కనుచూపుమేర దాటగానే బోసు బయటకొచ్చాడు. పోర్టికోలో అలికిడి లేదు – ఎడమ పక్కకి తిరిగి, అక్కడవున్న కారు ఎక్కాడు.

అప్పటివరకూ పర్వతాల నాయుడి ఇంటి కాపలాదార్లుగా వ్యవహరించిన 'బోసు మనుష్యులు' కూడా అక్కణ్ణుంచి మాయమయ్యారు.

ఇదంతా ఎంత నిశ్శబ్దంగా జరిగిందంటే, అక్కడ ఇంత ఘాతుకం జరిగిపోయిందని అక్కడి కాపలా కుక్కకి కూడా తెలీదు.

వర్షం వచ్చి వెలిసిన తరువాత ప్రశాంతత అక్కడ మళ్ళీ ఆవరించుకుంది.

పర్వతాల నాయుడు శవాన్ని చూసి ధనుంజయ నిశ్చేష్టుడయ్యాడు. అయితే అతడు కూడా చాలా మర్డర్లు చూసినవాడూ, చేసినవాడూ అవటం చేత కంగారుపడలేదు. అక్కడనుంచి పారిపోయే ఆలోచన కూడా చేయలేదు. మెట్లు దిగి క్రిందకి వచ్చాడు.

ఫ్రిజ్ దగ్గిర మొదలియార్‌ని చూసినప్పుడు మాత్రం రవ్వంత వణికాడు. భయంవల్ల వచ్చింది కాదు – ఇక జీవితాంతం మొదలియార్ ఎలా బ్రతకవలసివస్తుందో వూహించుకుంటే వచ్చిన వణుకు అది.

అక్కడనుంచి అతడు హాల్లోకి వచ్చి పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాడు.

పది నిముషాల్లో వ్యాన్ వచ్చి ఆగింది. ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణమాచారి లోపలికి వచ్చాడు.

హోం మినిష్టర్ పర్వతాల నాయుడు హత్య అనగానే రాధాకృష్ణమాచారి గాఢంగా నిశ్వసించాడు. రేపట్నుంచీ బంద్‌లూ..... కర్ఫ్యూలూ...

తాము వస్తూంటే లోపల్నుంచి కేక వినిపించటం – వచ్చి చూసేసరికి ఈ దారుణం జరిగి వుండడం – అంతా వివరంగా చెప్పాడు ధనుంజయ. ఈ లోపులో మొదలియార్‌కి స్పృహవచ్చింది. మూలుగుతున్నాడు. అతడికోసం అంబులెన్స్ వచ్చింది.

"మీ మీద ఆసిడ్ జల్లింది ఎవరో చెపుతారా?" ఇన్‌స్పెక్టర్ వంగి అడిగాడు.

"నేను చూడలేదు".

'అబద్ధం' అనుకున్నాడు ధనుంజయ. కోర్టులో ఆ ఆసిడ్ జల్లిన వ్యక్తికి మహా అయితే అయిదారు సంవత్సరాలు శిక్షపడుతుంది. మొదలియార్ మొహాన్ని ఇంత దారుణంగా మార్చేసిన వ్యక్తికి అంత తక్కువ శిక్షా?... ఆ శిక్షేదో తను విధించడం కోసమే మొదలియార్ అబద్ధం చెప్పాడని అతనికి తెలుసు.

...ఈ రెస్ట్‌హౌస్‌కి ఇంత తక్కువ సెక్యూరిటీ ఎలా వుందో కూడా ధనుంజయకి అర్థం అయింది. ఇది సీక్రెట్ మీటింగ్ ప్లేస్ అని అతడికి తెలుసు.

రోడ్డుమీద వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ అంతా ఆపుచేసి ఫంక్షన్‌లో సెక్యూరిటీ ఏర్పాట్లు కోసం లక్షలు ఖర్చుచేయించి మంత్రులూ, ముఖ్యమంత్రులూ అర్ధరాత్రి –

చీకటి పనుల కోసం 'దాదాపు' ఒంటరిగా బయల్దేరి వెళ్తూ ఉంటారని కొద్దిమందికి మాత్రమే తెలుసు.

ఆ అవకాశాన్ని ప్రత్యర్థి వాడుకుని చాలా సులభంగా 'ఓవర్ పవర్' చేశాడు. ఫలితమే ఈ దారుణ మారణకాండ.

ధనుంజయ పర్వతాల నాయుడి శవంవైపు చూసేడు. ఒకప్పుడు ఒక సిద్ధాంతానికి సానుభూతిపరుడిగా వ్యవహరించి, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్లేటు మార్చి, రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి, మర్డర్లు చేసి – చేయించి, హోమ్ మినిష్టర్ స్థాయికి ఎదిగిన పర్వతాల నాయుడు, కూలిన శిఖరంగా పడివున్నాడు.

"మీ మీద అసిడ్ జల్లిన వ్యక్తి మెట్లు యెక్కి పైకి వెళ్ళాడా?" ఇన్‌స్పెక్టర్ మొదలియార్‌ని అడిగాడు.

"నాకు తెలీదు. వెంటనే స్పృహ తప్పింది"

బయట కార్లు – మోటారు సైకిళ్ళు అగుతున్న చప్పుడు, రణగొణ ధ్వని.

హోమ్ మినిష్టర్ మరణవార్త పొక్కిపోయినట్టుంది. ప్రెస్ రావటం ప్రారంభమయింది. నిద్రలో వున్న రాజకీయ ప్రపంచం మేల్కొంది.

అంతా హడావిడి.

బయట నుంచి జనాన్ని ఆపుచేయలేక పోలీసులు సతమవుతున్నారు.

మొదలియార్‌ని అంబులెన్స్ ఎక్కించారు.

రాధాకృష్ణమాచారి ధనుంజయవైపు తిరిగాడు. "మీరు లోపలికి వస్తూండగా మొదలియార్ కేక వినపడిందన్నారు కదూ!"

"అవును. ఆ తరువాత నాయుడిది".

ప్రెస్ జర్నలిస్టులు వ్రాసుకుంటున్నారు.

"మీరు వెళ్ళి చూసేసరికి పర్వతాల నాయుడు చచ్చిపడి ఉన్నారు".

"అవును. అప్పటికి ఒకటి రెండు నిముషాలు కూడా అయివుండదు. వెంటనే క్రిందికి వచ్చేసరికి కిచెన్‌లో మొదలియార్ కనపడ్డాడు".

"మీరు మొదలియార్‌ని చూస్తున్న సమయంలో బహుశ హంతకుడు బయటకు తప్పుకుని ఉంటాడు".

"అంతే జరిగి ఉంటుంది".

"అటువంటి పక్షంలో మీ కారు డ్రయివర్ అతడిని చూసి ఉంటాడుగా?"

"నేను డ్రయివర్‌ని తీసుకురాలేదు".

"హంతకుడు మారణాయుధంతో సహా వెళ్ళిపోయాడు. అతడిని చూసే అవకాశం ఎవరికీ లేదంటారా? ఎవరూ చూడలేదా?"

"...నేను చూశాను".

ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణమాచారి, ధనుంజయ రిపోర్టర్లు, పోలీసులు – అంతా ఆ మాటలు వినవచ్చిన వైపు చూశారు.

అక్కడ విశారద నిలబడి వుంది. సూదిపడితే వినపడేంత నిశ్శబ్దాన్ని చీలుస్తూ "అవును ఇన్‌స్పెక్టర్ గారూ, ఆ మనిషిని నేను చూశాను" అన్నదామె.

"ఎవరా వ్యక్తి" బుల్లెట్‌లా వచ్చింది ప్రశ్న.

"....బోసు"

క్షణంలో అక్కడి పరిస్థితి మారిపోయింది. ఫోటోగ్రాఫర్లు ఫ్లాష్ లైట్‌ల వెలుతురు ఆ గదంతా నిండిపోయింది. అందరూ చకచకా వ్రాసుకుంటున్నారు. విశారద మీద ఎడతెరపి లేకుండా ఫ్లాష్ కెమేరాలు వెలుగుతున్నాయి. దేశపు బిగ్గెస్ట్ మాఫియాకింగ్ మొహంమీద ఆసిడ్ పోసి, హోమ్ మినిష్టర్ చుట్టూ వున్న రక్షణ వలయాన్ని ఛేదించి, అతడిని హత్య చేసిన మరో మాఫియా లీడర్ – ఆ హత్యకు ప్రత్యక్ష సాక్షి ఆమె... అంతకన్నా సంచలన వార్త మరేముంటుంది?

రాధాకృష్ణమాచారి ఒక్కడే అక్కడ నిజంగా విచారించాడు. నాయుడి గురించి కాదు, బోసు గురించి. అంత అజాగ్రత్తగా అతడు ఎందుకు ప్రవర్తించాడో అర్థం కాలేదు.

"ధనుంజయ కారు దిగి లోపలికి రావటంతో బయట ఎవరూ లేరనుకుని హంతకుడు బయటకు వెళ్ళిపోయాడు. కారులో మీరున్నారని అతడు వూహించలేకపోయి వుండవచ్చునని నేను అనుకుంటున్నాను. అవునా?"

"అవును".

"మీరు అతన్ని బాగా గుర్తుపట్టగలరా?"

"తను నాక్కాబోయే భర్త" నిర్వికారంగా చెప్పింది.

పత్రికలకి మరో సెన్సేషనల్ న్యూస్. "...మాఫియా డాన్‌ని పట్టించిన భార్య" లాటి టైటిల్స్ అప్పుడే రిపోర్టర్ల మనసుల్లో చోటు చేసుకుంటున్నాయి.

# 5

"**పోలీసుల** దగ్గర నువ్వలా సాక్ష్యం చెబుతావని నేను కలలో కూడా వూహించలేదు. నేను అండర్‌గ్రౌండ్‌లో దాక్కోవడం క్షణాలు ఆలస్యమై వుంటే – పట్టుబడి వుండేవాడిని" అన్నాడు బోసు.

విశారద మాట్లాడలేదు.

"అసలు నీకేమయింది? నా మీద చెప్పాలని నీకెందుకు అనిపించింది! ధనుంజయ లాంటివాళ్ళు వత్తిడి చేశారా? పోలీసులు అలా చెప్పమన్నారా?" ఆమె తలవంచుకు కూర్చుని వుంది.

బోసు కుర్చీలోంచి లేచాడు. "ఇప్పటికయినా మించిపోయింది లేదు. వెళ్ళి – నేనేమీ చూడలేదని, సాక్ష్యం చెప్పననీ చెప్పు. మిగతా విషయాలు నేను చూసుకుంటాను".

ఆమె నెమ్మదిగా తలెత్తి "క్షమించు బోసూ" అంది. అతడికొక క్షణం అర్థంకాలేదు. ఇంతకాలం అతడు ఆమె తండ్రి వత్తిడివల్ల ఆ విధంగా పోలీసులకి చెప్పి వుంటుందనుకున్నాడు. చాలా క్లుప్తంగా కేవలం రెండే రెండు మాటల్లో 'క్షమించు బోసూ' అని ఆమె అనగానే అతడికి అర్థమైంది. ఆమె మనస్ఫూర్తిగానే పోలీసులకు ఈ విషయం చెప్పిందని తెలిసిపోయింది. అతడు నిశ్చేష్టుడయ్యాడు. తన కళ్ళని తానే నమ్మలేనట్టు ఆమెవైపు దిగ్భ్రాంతుడై చూశాడు.

లోపల్నుంచి కోపం తన్నుకొస్తుండగా, "నువ్వు చెప్పిన సాక్ష్యం ఎక్కడికి దారితీస్తుందో ఆలోచించావా?" అని అడిగాడు విసురుగా.

"చూసిందేగా నేను చెప్పింది".

"నేను అడుగుతున్నది – నువ్వేం చూశావని కాదు. నువ్వు చెప్పింది ఏ పరిణామానికి దారితీస్తుందో ఆలోచించావా? అని..."

"పరిణామాల్ని బట్టి పనులు చేయంగా బోసూ !"

"చాలా గొప్పగా మాట్లాడుతున్నాననుకుంటున్నావు కాబోలు".

"నేనేమీ అలా అనుకోవడం లేదు. జరిగిన పరిణామాలన్నింటినీ చూసి దుఃఖంతో కుమిలిపోతున్నాను".

"దుఃఖం ఎందుకు? నీతికీ నిజాయితీకీ నిలబడినదానిగా చరిత్రలో ప్రసిద్ధి కెక్కుతావుగా" అతడి కంఠంలో రవ్వంత వెటకారం ధ్వనించింది. ఆమె ఒకసారి కళ్ళెత్తి అతనివైపు చూసి, మళ్లీ దించుకుంది. అతడు ఆమె దగ్గరగా వచ్చాడు. "...నేను నీ కోసం ఎంతో చేశాను కాబట్టి, నువ్వు నాకు తిరిగి ఈ సాయం చేయాలని నేను అనుకోవడంలేదు. నువ్వు ఒక ఆవేశంలో వున్నావు. దాన్ని తగ్గించుకో. ఈ మాఫియా యుద్ధాల గురించి నీకు సరిగ్గా తెలీదు. ఇదే స్థానంలో నువ్వుకాక ఇంకెవరయినా వున్నట్లయితే, ఆ సాక్షి కోర్టువరకు వెళ్ళకుండా చేసేవాడిని. కానీ ...కానీ..." అతడు ఆమె తలమీద చెయ్యివేశాడు. మాటలు చెప్పలేని భావాన్ని స్పర్శ చెబుతుంది. ఆమె కరిగిపోతుంది. కరిగిపోకుండా వుండడానికి చేసే ప్రయత్నంలో ఆమె పంటి క్రింద నలుగుతున్న పెదవి రక్తం చిమ్ముతోంది.

అతనన్నాడు –"ఇదంతా నేనేదో శిక్షకు భయపడి నిన్ను బ్రతిమాలడం లేదు. మన ఉమ్మడి శత్రువుని హతమార్చడానికి నేను వేసిన పథకంలో చిన్న లొసుగు ... నీ రూపంలో బయటపడింది. ఏదో ఆవేశంలో నీవా విషయాన్నీ

పోలీసులకి చెప్పి వుంటావని అనుకుంటున్నాను. ఇప్పటికయినా ఆ తప్పు సరిదిద్దుకుని – నీ సాక్ష్యాన్ని విరమించుకో. మిగతా విషయాలన్నీ నేను చూసుకుంటాను. అది చెప్పడానికే నిన్ను ఇక్కడికి పిలిచాను" అతను అనునయంగా అన్నాడు. "...పర్వతాల నాయుడు ఎంత దుర్మార్గుడో నీకు తెలుసు విశారదా! పోతే అతడు వ్యక్తిగతంగా నాకెంత ద్రోహం చేశాడో నీకీ క్షణం అనివార్య కారణాలవల్ల చెప్పలేను. క్షమించు..."

ఆమె కొంచెం సేపు మౌనంగా వుండి – నెమ్మదిగా అంది. "నీకు నీ కారణాలు వున్నట్టే – అతనికీ అతని కారణాలు వుండొచ్చుగా !"

అతడు మొహం చిట్లించి –"ఏమిటి నీ వుద్దేశ్యం?" అన్నాడు.

"మనం ఏ పని చేసినా దాన్ని సమర్థించుకునే కారణం ఏదో ఒకటి వుంటుందని చెప్పడమే నా ఉద్దేశ్యం".

"అయితే నాకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పటం మాననంటావు".

ఆమె జవాబివ్వలేదు.

"దాని వల్ల నాకు ఉరిశిక్ష పడినా నీ అభిప్రాయం మార్చుకోవా?"

నూతిలోంచి వినపడినట్లు ఆమె స్వరం –"నన్ను ఇబ్బంది పెట్టకు బోసూ..." ఆమె నిర్ణయం అతడికి స్పష్టంగా అర్థమైంది. అతడు కూడా ఒక నిర్ణయానికి వచ్చినట్టు క్షణం ఆగి నెమ్మదిగా అడిగాడు. "..నన్ను వివాహం చేసుకుంటావా విశారదా?"

ఆమె చివుక్కున తలెత్తింది.

ఆదిలో నేను. అంతంలో నువ్వు. మధ్య చీకట్లో అంధకారం నిండిన నా ఆశల భవంతి. ప్రేమ ప్రమిదలో హృదయం వత్తివేసి వెలుగు నింపుతానంటే వద్దంటావా?

"ఏమిటాలోచిస్తున్నావు విశారదా? ఎలా వద్దందామన్నా వివాహం?"

"ఇప్పుడు ఆపద లేదని నువ్వెందుకు అనుకుంటున్నావా అని" అంది.

అతని చేయి జేబులోకి వెళ్ళింది. అది దుఃఖమో - హర్ష జనితమో తెలియక ముందే నీటిచుక్క చెక్కిలిమీద ఆరిపోయినట్టు - అభావంగా అతడు జేబులోంచి మంగళసూత్రం తీశాడు. ఆమె అంత స్పష్టాస్పష్ట సందిగ్ధావస్థలోనూ దాన్ని గమనించి, "ఇది నీకెలా వచ్చింది?" అని అడిగింది. అతడు సమాధానం చెప్పకుండా ఆమె మెడలో మూడుముళ్ళు కట్టసాగాడు.

ఆమె కళ్ళు మూసుకుంది. వాలిన రెప్పలే మంగళతోరణాలు, నుదుట స్వేదమే బాసికము.

నా జీవితంలో ఏ మధుర సంఘటనా మధురంగా నిలువలేదు. పాదాలు రోదించినా మజిలీలు జాలి చూపలేదు. హృదయం వీధుల్లో ఆశయం పచార్లు చేస్తునే వుంది. గమ్యం చివర అనంతం సంతకం పెట్టింది. మధురనాదం సమరనినాదంలో కలిసిపోతుంది. అయ్యో నేనెలా చెప్పను? ఈ క్షణాన్ని నేను ఆనందిస్తున్నానని నీకు చెప్పడానికి ఏ విషాదాన్ని సాయమడగను?

....అతడు మంగళసూత్రం కట్టడం పూర్తిచేసేడు. భుజాల చుట్టూ చేయివేసి తనవైపుకి తిప్పుకున్నాడు. ఆమె ఆర్తిగా హృదయానికి చేరువ కాబోయింది. చేరువలోనే... దూరంగా ఆపుచేశాడు.

"ఇప్పుడు చెప్పు మిసెస్ శారదా! నీ భర్తని ఉరికంబం ఎక్కిస్తావా?"

ఆమె నోటికి చేతిని అడ్డుగా పెట్టుకొని రోదించసాగింది.

అతడు విసుగ్గా "ఎందుకా ఏడుపు? అయిదోతనం పోతుందనా?" అన్నాడు. ఆమె జవాబు ఇవ్వకుండా ఇంకా రోదించసాగింది. అతడు ఆమె రెక్క పట్టుకుని విసురుతో దగ్గరికి లాక్కున్నాడు. "ఎందుకు నీకింత పట్టుదల? అసలు ఈ న్యాయస్థానాల గురించీ చట్టాల గురించీ నీకు తెలుసా? అయినా నువ్వేం చూశావని? నేను కత్తితో పొడవటం చూశావా? ఎంతోమంది ఎన్నో విషయాలు స్వయంగా చూసినా కోర్టులకిరారు. అటువంటిది నాకు ఇంత ఆప్తురాలివైయుండి ఎందుకు యిలా చెప్పాలనుకుంటున్నావ్?"

"న్యా... న్యాయం కోసం" వెక్కుతూ అంది.

"న్యాయం కోసం..." వెటకారంగా అన్నాడు. న్యాయాన్ని నాలుగు పాదాల నడిపించడానికే పుట్టావా? ప్రపంచంలో రోజూ లక్ష విషయాలు జరుగుతాయి. ఎవరైనా – 'మనకెందుకులే' అని తప్పుకు పోతారే తప్ప – ఎక్కడో ఏదో జరిగితే అందులో తలదూర్చి – తనకుమాలిన ధర్మాన్ని తలకు చుట్టుకోవాలనీ, అన్యాయాన్ని ఎదుర్కోవాలని అనకునే సుభాష్ చంద్రబోసులు ఎవరూ లేరు."

"ఉన్నారు".

"ఎవరు?"

"నువ్వే".

అతడు అప్రతిభుడై, "...విశారదా" అన్నాడు.

కిటికీ అవతల పిచ్చిమొక్కలు గాలికి వూగుతున్నాయి. ఆమె వాటిని చూస్తోంది. అతడు అసహనంగా కదిలాడు. ఆమె మాట్లాడటం ప్రారంభించింది. ఒక భావాన్నీ – ఒక సత్యాన్నీ సంపూర్ణంగా వ్యక్తీకరించ గలిగే మాటలు అవి.

"నీకు గుర్తుందా బోసూ! నాకు నువ్వు చెప్పిన ప్రతి మాటా గుర్తుంది. లక్ష్మీశారద కనపడకుండా పోయినప్పుడు పోలీస్ స్టేషనులో 'ఆమె నీకేమవుతుంది?' అని వాళ్ళు అడిగినప్పుడు ఏమన్నావు? 'ఒక స్త్రీని నలుగురు రౌడీలు బలవంతంగా కిడ్నాప్ చేస్తే ఆమెను రక్షించాలనుకోవడానికి – ఆమె మన రక్తం పంచుకుని పుట్టింది కానవసరంలేదు. మానవతావాదం చాలు' అన్లేదూ? ...నీ అన్నయ్య రామ్మూర్తి, నీ కుటుంబ సభ్యులతో – లక్ష్మీ శారద గురించి నీతో చెప్పవద్దని భగవద్గీత మీద ఒట్టువేయిస్తే – దేముడికన్నా న్యాయం గొప్పదని నువ్వు గోమతికి బోధించలేదూ? ధర్మరాజుతో పాటు వెళ్ళే పాండవులు ఒక్కొక్కరే జారిపోయినా నువ్వొక్కడివే గోమతితో సాక్ష్యం చెప్పించలేదూ?"

ఇప్పుడు చెప్పు బోసూ... ఏ ప్రతిఫల మాశించి నువ్వు నీ చెల్లిన్ని సాక్షిగా కోర్టులో నిలబెడదామనుకున్నావు? ప్రత్యర్థులు ఆసిడ్‌తో చర్మం కాల్చేసే దుర్మార్గులని తెలిసి కూడా నువ్వు న్యాయంవైపు ఎందుకు నిలబడ్డావో... నీ చెల్లిని ఏ "ధర్మం" కోసం బలిచేశావో – అదే ధర్మం కోసం నేనూ బలైపోదల్చుకున్నాను. ఇక నేనెందుకు ఏడ్చానో చెప్పమంటావా బోసూ? నా అయిదోతనం పోతుందనీ, నేను విధవరాలి నవుతాననీ తల్చుకుని కాదు. ఒక దుర్మార్గుడు నీ ఇంటిలో చేసిన అఘాయిత్యాన్ని ప్రత్యక్షంగా చూసిన చెల్లిని పోలీస్ స్టేషన్‌కి తీసుకువెళ్ళావు. నువ్వు మరో ఇంటిలో చేసిన అదే అఘాయిత్యాన్ని చూసిన నన్ను ఆ విషయం

మర్చిపొమ్మంటున్నావు. అందుకు. . అందుకు దుఃఖం వచ్చింది బోసూ.. 'నీకూ మొదలియార్‌కూ తేడా ఏముంది?' అది తల్చుకుని ఏడ్చాను బోసూ..."

ఆమె బల్లమీద తల వాల్చుకుని కళ్ళు మూసుకుంది. ఆమె చెక్కిళ్ళమీద నుంచి నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి.

బోసు వెళ్ళి తన కుర్చీలో కూర్చున్నాడు. ఫోన్ దగ్గరకు లాక్కుని డయల్ చేయసాగాడు.

"హలో" అట్నుంచి వినపడింది.

"ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణమాచారిగారున్నారా?"

"మాట్లాడుతున్నాను".

"నేనూ బోసుని... నేను సరెండర్ అవుతున్నాను" ఫోన్ పెట్టేశాడు.

పోలీస్ స్టేషన్‌కి వెళ్ళడానికి అతను ఆయత్తమవుతుంటే ఆమె అతడి దగ్గరగా వచ్చింది. "నన్ను... నన్నుక్షమించు బోసూ!'

ఆమె అతడు దగ్గరకు తీసుకున్నాడు. అతడి హృదయం మీద తలవాల్చి ఆమె దుఃఖానికి కూడా అతీతమైన వేదనతో స్తబ్ధుగా వుండిపోయింది. ఆమె తలని అతడి చెయ్యి ఆప్యాయంగా నిమిరింది. మొదటి సారి .... అదే ఆఖరిసారేమో కూడా...

"మనకి తెలిసిందంతా సత్యమనీ – తెలియనిది అసత్యమనీ అనుకుంటాం. కానీ ఒక్కోసారి చూసింది కూడా సత్యం కాకపోచ్చు. ఈ ప్రపంచంలో అబ్‌సొల్యూట్ సత్యం అంటూ ఏదీ లేదు విశారదా!"

అతడు పైకి అనలేదు. మనసులో అనుకున్నాడు.

## 6

**కోర్టు హాలు** కిటకిట లాడుతోంది.

హోం మినిష్టర్ హత్యకేసు కాబట్టి పేపర్లు విపరీతంగా పబ్లిసిటీ ఇచ్చాయి. అందులోనూ, హంతకుడు బోస్ బజార్ యజమాని. స్మగ్లర్స్ కింగ్ అనేసరికి ఆ ప్రాముఖ్యత మరీ ఎక్కువైంది.

సాక్షిగా విశారద బోనులో ప్రవేశపెట్టబడింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆమెని ప్రశ్నించాడు. తను వెళ్ళేసరికి బోసు మారణాయుధంతో బయటికి వస్తున్నాడని, లోపల ఇంకెవరూ లేరనీ, మొదలియార్ మొహం కాలి స్పృహతప్పి పడివున్నాడని, పర్వతాల నాయుడు హత్య చేయబడ్డాడనీ చెప్పింది. బోసు ఒక్కడే చీకట్లో వెళ్ళిపోవటం కూడా చూశానని చెప్పింది.

ప్రాసిక్యూటర్ గర్వంగా అందరివైపు చూస్తూ వెళ్ళి కూర్చున్నాడు.

తరువాత క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభమైంది.

"అంత రాత్రిపూట మీరు గెస్ట్‌హౌస్‌కి ఎందుకు వెళ్ళారు? ఎవరితో వెళ్ళారు?" లాయర్ ప్రశ్నించాడు.

"ధనుంజయగారితో వెళ్ళాను" సమాధానం చెప్పింది.

"ఎందుకు?"

"పర్వతాల నాయుడు నాతో ఏదో మాట్లాడాలన్నారట".

"ధనుంజయ మీకు ఏమవుతారు?"

ఆమె విజిటర్స్ గాలరీవైపు చూసింది. మొదటి వరుసలో కూర్చుని వున్నాడు ధనుంజయ. పక్క వరుసంతా 'ప్రెస్' వుంది. ధనుంజయ మొహంలో టెన్షన్ కొట్టొచ్చినట్టు కనపడుతోంది. ఆమె చెప్తే ఆ న్యూస్ ప్రెస్ అంతా దావానలంలా పాకిపోతుందని అతడికి తెలుసు. అదే భయం. ఆమె నెమ్మదిగా అంది –

"ఏమీ కారు".

ధనుంజయ తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు. డిఫెన్స్ లాయర్ అడిగాడు.

"ఏమీ కాని వ్యక్తి ఒక రాత్రి తనతో మిమ్మల్ని గెస్ట్‌హౌస్‌కి రమ్మంటే వెళ్తారా?"

ప్రాసిక్యూటర్ లేచి "అబ్జెక్షన్ యువరానర్" అన్నాడు.

"- ఈ హత్యకీ ఆ ప్రశ్నకీ ఏ సంబంధమూ లేదు".

"అబ్జెక్షన్ సస్టెయిన్డ్".

డిఫెన్స్ లాయర్ తారువాత ప్రశ్న అడిగాడు – "మీరు కొంతకాలం పాటు జైల్లో వున్నారా?"

ప్రాసిక్యూటర్ మళ్ళీ లేచి అబ్జెక్షన్ చెప్పాడు. డిఫెన్స్ లాయర్ అన్నాడు – "యువర్ ఆనర్, ఈ సాక్షి గతంలో కొంతకాలం దొంగతనం నేరంమీద జైల్లో వుంది. ధనుంజయ ఆమెకు తెలుసు. అందుకనే ఈ హత్యానేరాన్ని బోసుమీద వేయటానికి మొదలియార్, ధనుంజయ కలిసి ఈ సాక్షిని ప్రోత్సహిస్తున్నారని చెప్పటం నా ఉద్దేశం. నా వాదన కొనసాగించటానికి అనుమతి ఇవ్వమని వేడుకుంటున్నాను".

"అబ్జెక్షన్ ఓవర్ రూల్డ్" అన్నాడు జడ్జి.

"నేను కొంతకాలం పాటు జైల్లో వున్నమాట నిజమే".

"మధ్యలో మీ శిక్షాకాలాన్ని తగ్గిస్తూ, మిమ్మల్ని విడుదల చేయటం జరిగింది అవునా?"

"అవును".

"దానికి కారణం పర్వతాల నాయనడు – అవునా?"

ప్రెస్‌లో జర్నలిస్టులందరూ వ్రాసుకుంటున్నారు. డిఫెన్స్ లాయర్ చాలా సామర్థ్యం వున్న వ్యక్తి. చాలా లోతుగా స్టడీచేశాడని అర్థమవుతుంది. అతని ఫీజు లక్షల్లో వుంటుంది.

విశారద జవాబు ఇచ్చింది – "నాకు తెలీదు".

డిఫెన్స్ లాయర్ ఇంకో ప్రశ్న వేశారు. " మిమ్మల్నొకసారి వ్యభిచారం నేరం మీద అరెస్టు చేశారు. నిజమేనా?"

విశారద తల బాగా వంచుకుంది. కోర్టులో సూదిపడితే వివపడేటంత నిశ్శబ్దం.

ప్రాసిక్యూటర్ లేచి "ఐ అబ్జెక్ట్ యువర్ ఆనర్" అన్నాడు. అతడు మాట్లాడుతూ వుండగా – బోసు డిఫెన్స్ లాయర్‌ని దగ్గరగా పిలిచాడు. అతడి మొహం ఎర్రగా కందిపోయి వుంది. అతికష్టంమీద తన ఎమోషన్స్ ఆపుచేసుకుంటున్నట్టు కనపడ్డాడు.

డిఫెన్స్ లాయర్ దగ్గరగా వచ్చాక అన్నాడు – "ఆమెని ఇంకే ప్రశ్నలూ అడగవద్దు".

లాయర్ తెల్లబోయాడు. కానీ ఆమె కారెక్టర్ ఎలాటిదో నిరూపించక పోతే...

"ఇంకొక్క ప్రశ్నకూడా వేయవద్దంతే" కఠినంగా అన్నాడు.

డిఫెన్స్ లాయర్‌కి – ఆమే ఏకైక సాక్షి అని తెలుసు. ఆ సాక్ష్యాన్ని చీల్చి చెండాడగల్గితే కేసు నెగ్గినట్టే.

కానీ బోసు...

బోసు మాటకి ఎదురుచెప్పే సాహసం లేదు.

"మీరు మీ ప్రశ్నలు కొనసాగించవచ్చు" జడ్జి అన్నాడు.

"నో మోర్ క్వచ్చన్స్ సర్" క్లుప్తంగా అన్నాడు లాయరు.

కోర్టులో ఒక్కసారి కలకలం రేగింది. జడ్జి చాలాసేపు 'ఆర్డర్' చెప్పవలసి వచ్చింది.

విశారద బోను దిగుతూ బోసు వైపు చూసింది. అది కృతజ్ఞతకాదు. గిల్టీ ఫీలింగూ లేదు. ఆ రెండింటినీ కలగలిపిన భావం. దాన్ని నిర్వచించటానికి భాష లేదు.

బోసు మొహం మాత్రం నిర్లిప్తంగా, అన్నిటికీ సిద్ధపడ్డట్టూ వుంది. ఆ తరువాత వాదోపవాదాలు ముగిశాయి.

తనుకున్న పలుకుబడినంతా ఉపయోగించి, రహస్యంగా మూడో కంటికి తెలియకుండా బోసుని జైల్లో కలుసుకుంది లక్ష్మీశారద! ఆమెకి చాలా రోజుల్నుంచి నిద్రాహారాలు లేవని మొహం చూస్తుంటే తెలివి పోతుంది.

అతడిని చూస్తూనే దుఃఖాన్ని ఆపుకోలేక చాలాసేపు రోదించింది. అతడు ఓదార్చలేదు. దుఃఖం ద్వారానే బాధ తక్కువవుతుందన్నట్టు అలాగే వుండిపోయాడు.

"ఎందుకు? ఎందుకిలా చేశావు బోసూ? ఇంతకన్నా ప్రమాదకరమయినవి ఎంతో జాగ్రత్తగా ప్లాన్ చేసేవాడివి. ఇలా చేసి ఎందుకు దొరికిపోయావ్?" అన్నది కన్నీళ్ళతో.

"ఆ మారణాయుధం అక్కడే పడివుంటే కష్టంకదా శారదా! దాని మీద వేలి ముద్రలుంటాయి".

"ఉంటే ఏం? ఆ హంతకుడెవరో – వాడు ఉరికంబం ఎక్కేవాడు."

"అంటే ... అంటే నువ్వు కాదా నాయుడిని చంపింది?" అయోమయంగా అడిగాడు బోసు.

లక్ష్మీశారద విస్తుబోయింది. "నేనా...." అంది. "నువ్వని నేననుకుంటున్నాను".

ఇద్దరూ దిగ్భ్రాంతులై ఒకరివైపు ఒకరు చూసుకుంటూ చాలాసేపు వుండిపోయారు.

ఇక చేయగలిగిందేమీ లేదు. రేపే జడ్జిమెంటు. చాలా కరెక్టుగా ఇరుక్కుపోయాడతను. లక్ష్మీశారదని 'సేవ్' చేస్తున్నానన్న భ్రమలో హత్య జరిగిన ప్రాంతం అంతా 'క్లీన్' చేశాడు. డిఫెన్స్ లాయర్‌ని మరీ వత్తిడి చేయవద్దని 'ఆదేశించాడు'.

"అసలేం జరిగింది బోసూ?" లక్ష్మీ శారద ఆతృతగా అడుగుతోంది.

"ఏమీ జరగలేదు. ఇక మిగిలినదంతా జరగవలసిందే" అన్నాడు నిర్లిప్తంగా .

*                    *                    *

చీకట్లో కూర్చుని వుంది విశారద. కిటికీలోంచి మసక వెలుతురు ఆమె మొహంమీద పడుతోంది. ఆమె చాలా సేపట్నుంచీ అలానే కూర్చుని వుంది.

అడుగులు ఏడైనా, ముళ్ళు మూడైనా, ఉంగరాలు రెండైనా – జీవితం మాత్రం ఒకటవ్వటమే ప్రేమ! అది భూతద్దంలో కనపించేది కాదు. చాలా బాధలు మొదట్లో ఎక్కువగా మనసుని కష్టపెట్టి, కాలం గడిచేకొద్దీ గాయాల్లాగా మాసిపోతాయి. ప్రేమ ఒక్కటే మొదట్లో ఎంత బాధపెడుతుందో, కాలంతోపాటూ బాధనీ పెంచుతుంది. ఎంతో నిబ్బరంగా... ఒక నిజాన్ని కోర్టులో చెప్పి, ఒక ఆశయాన్ని నిలబెట్టానన్న సంతృప్తిని పొందింది.

కానీ అది క్షణికమే!

ఆ తరువాతంతా వ్యధే!!

ఆ వ్యధతో ఆమె కూర్చొని వుండగా తలుపు దగ్గర అలికిడి అయింది. ఆమె తలెత్తి చూసింది.

"చాలా గొప్పగా సాక్ష్యం చెప్పాననుకున్నావ్ కదూ!"

ఆమె లేచి నిలబడింది.

"అసలు విషయం చెపుతాను విను. ఆ పర్వతాల నాయుడిని హత్య చేసింది నేనే" అడుగు ముందుకువేస్తూ అన్నాడు అతను. "ఈ రోజు నేను కోర్టులో అసలు జరిగిన విషయం చెప్పబోతున్నాను".

* * *

కోర్టు ప్రారంభమయింది.

ప్రాసిక్యూషన్, డిఫెన్స్ వాదనలు పూర్తయ్యాయి. ఆ రోజే జడ్జిమెంటు.

హాలంతా కిటకిటలాడుతోంది. ప్రెస్ రిపోర్టర్స్ న్యూస్ పంపటానికి ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. లక్ష్మీశారద తనీ హత్య చేయలేదని చెప్పటం బోసుకి పెద్ద షాక్. ఆ షాక్ నుంచి అతనింకా తెరుకోలేదు. మరోవైపు విశారద డిఫెన్స్ లాయర్ లోతుగా ప్రశ్నించకపోవటంతో బోసుమీద కేసు మరింత బలపడింది.

అఫీషియల్‌గా తీర్పు బయటకు రాకముందే, అదేమిటో అనధికారికంగా బయటకు తెలుస్తుంది.

ఆ విధంగానే బోసుకి ఉరిశిక్ష ఖాయమని తెలిసింది!

...అతడిని తీసుకొచ్చి బోనులో నిలబెట్టారు.

ఈ లోపులో డిఫెన్స్ లాయరు జడ్జి దగ్గిరకు వెళ్ళి ఏదో మాట్లాడటం కనిపించింది. దూరంగా వున్న ప్రేక్షకులకి అవి వినిపించడంలేదు. డిఫెన్స్ లాయరు జడ్జికి కొన్ని కాగితాలు సమర్పించాడు. జడ్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో మాట్లాడుతున్నాడు. డిఫెన్స్ లాయర్ కూడా వారి సంభాషణలో పాల్గొంటున్నాడు. దూరంగా వున్నవాళ్ళు అర్థంగాక వీరివైపే చూస్తున్నారు.

ఇంతలో ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణమాచారిని పిలిపించినట్టున్నారు. అతను వచ్చాడు. జడ్జి అతనితో మాట్లాడుతున్నాడు. జనంలో ఉత్సుకత ఎక్కువైంది. ఏం జరుగుతూందో తెలియడంలేదు.

కోర్టు ద్వారం దగ్గిర నిలబడి, "ఆ హత్య చేసింది నేను మిలార్డ్" అని అరుచుకుంటూ లోపలికి రావటం అనేది కేవలం సినిమాల్లో మాత్రమే సాధ్యమయ్యే దృశ్యం. కోర్టులో ఆ విషయం జడ్జికి తెలిపితే ఎంక్వయిరీచేసి, పోలీసుల్ని మళ్ళీ కేసు రివైజు చేయమంటాడు.

ఆ విధంగానే అక్కడ జరగుతోంది. డిఫెన్స్ లాయర్ ద్వారా సమర్పింపబడిన పత్రాలు పరిశీలించి అందులో కారణాలు గమనించి, జడ్జి సంతృప్తుడైనట్టు కనపడ్డాడు.

కేసు వాయిదా వేయబడింది. పోలీసులు రివైజ్డ్ కేసు పెట్టారు.

పదిరోజుల తరువాత సెషన్స్ తిరిగి ప్రారంభమయ్యాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముద్దాయిని ప్రశ్నించసాగాడు. "ఇంతకాలం వూరుకుని ఆఖరిక్షణంలో ఎందుకు నీకు లొంగిపోవాలననిపించింది?"

"బోసు హత్య చేస్తూండగా ఎవరూ చూడలేదు. అందువల్ల అతడికి శిక్ష పడదనుకున్నాను. కేవలం విశారద మాత్రమే చూసింది. అదైనా హత్య చేయటంకాదు. మారణాయుధంతో అతడు బయటకు రావటం మాత్రమే చూసింది. అందువల్ల కేసు బలహీనమవుతుందనుకున్నాను. ఒకవేళ ఇవన్నీ జరిగినా, బోసు తరపున, వాదించే లాయరు – విశారద గతం తవ్వి తీసి, ఆమె సాక్ష్యం పక్షపాతంతో కూడుకున్నదని నిరూపిస్తాడనుకున్నాను. ఇవేమీ జరగకపోయేసరికి, నేను బయటపడాల్సి వచ్చింది".

"ఇప్పుడు నువ్వు బయట పడకపోయివుంటే బోసుకి మరణశిక్ష ఖాయమై వుండేది. నేరం ఋజువైన పక్షంలో ఇప్పుడు నువ్వా శిక్ష అనుభవించవలసి వుంటుంది. ఆ విషయం తెలుసా నీకు?"

"తెలుసు"

"కేవలం బోసుని రక్షించటానికి నువ్వీ అబద్ధం చెప్పడం లేదని ఏమిటి?"

చిన్న నవ్వు. "బోసుని రక్షించాలన్నదే నా ప్రయత్నమయితే ఇంతకాలం ఎందుకు వూరుకుంటాను? మొదటిరోజే నామీద నేరం వేసుకోవటం జరిగేదిగా!"

చివరి ప్రశ్న "ఎందుకు నువ్వీ హత్య చేశావు?"

డిఫెన్స్ లాయరు లేచి "నా క్లయింటు 'ఇన్ కెమేరా' ప్రొసీడింగ్స్ కోసం ప్రార్థిస్తున్నాడు యువరానర్" అన్నాడు. కారణాలు వివరించాక జడ్జి దానికి ఒప్పుకున్నాడు.

ప్రొసీడింగ్స్ మళ్ళీ ప్రారంభమయ్యాయి. కోర్టులో సంచలనం రేగింది. అప్పటివరకూ మరణశిక్ష ఖాయమనుకున్న బోసు... బయట పడబోతున్నాడన్న వార్త బయటకు తెలిసింది.

## 7

**జనం** ఎవరూ లేకుండా, కేవలం జడ్జి – లాయర్లు మాత్రమే వుండే కోర్టు ప్రొసీడింగ్స్‌ని – 'ఇన్ కెమేరా' అంటారు. కోర్టులో చెప్పే కొన్ని విషయాలు ఎవరి ప్రతిష్టకయినా, జీవితానికైనా హాని కలిగిస్తాయని కోర్టువారు భావిస్తే –'ఇన్ కెమేరా' కి వప్పుకుంటారు.

పర్వతాల నాయుడు కేసులో కొత్తగా నేరం వప్పుకున్న ముద్దాయికి ఆ సౌలభ్యం ఇవ్వబడింది.

జడ్జి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకోసాగాడు.

"నా పేరు సుధాకర్. ఒకప్పుడు థియేటర్ దగ్గర బ్లాక్‌లో టిక్కెట్లు అమ్ముతుండేవాడిని. తరువాత బోస్ బజార్‌కి మానేజర్ని అయ్యాను".

"పర్వతాల నాయుడికీ నీకూ ఏమిటి సంబంధం?"

"నా భార్యని అతడు రేప్ చేశాడు".

ఆ మాటలకి జడ్జికూడా ఆశ్చర్యపోయాడు. ప్రాసిక్యూటర్ అడిగాడు. "హోం మినిష్టర్ స్థాయిలో వున్న వ్యక్తికి రేప్ చేయవలసిన అవసరం ఏముంది?"

సుధాకర్ జరిగినదంతా వివరించాడు. దుండగులు శోభనం గదిలోకి ప్రవేశించటం – అంధురాలైన తన భార్య నాయుడినే భర్త అనుకోవటం – అంతా వివరించి చెప్పాడు.

ఛాంబర్‌లో సూదిపడితే వినబడేటంత నిశ్శబ్దం! ఆ కథ ఎంత విషాదకరమంటే – పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కి కూడా జాలేసింది. ఆ దృశ్యం తల్చుకుంటేనే వళ్ళు జలదరించింది.

కానీ జడ్జి మాత్రం మొదలియార్ మనిషి.

"రేప్ విషయం నా భార్యకి తెలీదు. తెలియటం నాకు ఇష్టంలేదు కూడా! అందుకే ఈ విచారణ రహస్యంగా జరగాలని కోరుకున్నాను..."

జడ్జి వ్రాసుకుంటూ వుండగా సుధాకర్ చెప్పటం కొనసాగించాడు. "నా భార్యని కిరాతకుడి కన్నా పాశవికంగా అనుభవించిన ఆ పర్వతాల నాయుడిని

నిర్ధాక్షిణ్యంగా చంపాలనుకున్నాను. ఆ రాత్రి వెళ్ళి వాళ్ళ గెస్ట్‌హౌస్‌లో రహస్యంగా దాక్కున్నాను. పర్వతాల నాయుడు పైకి రాగానే అతన్ని చంపేసేను. బోసు అక్కడికి వస్తాడని నాకు తెలీదు. నేను చేసిన హత్యానేరం బోసుమీద పడింది. నేను కలలో కూడా వూహించని విషయం అది!"

"మరి నువ్వు ఈ కన్‌ఫెషన్ స్టేట్‌మెంట్ ముందే ఎందుకివ్వలేదు?"

"బోసు బయటకొస్తే – నాకు ఆ స్టేట్‌మెంట్ యివ్వవలసిన అవసరం లేదు. బోసుకు శిక్ష పడదనుకున్నాను. ఆ విధంగా ఇద్దరమూ ఆ నేరం నుంచి బయటపడవచ్చుననుకున్నా. ఎప్పుడయితే బోసుకి ఉరిశిక్ష పడిందో, ఇక నేను బయటకు రాక తప్పలేదు".

"నువ్వు హత్య చేశావని బోసుకి తెలుసా?"

"తెలీదు. తెలిస్తే నన్ను యిలా తప్పు ఒప్పుకోవటానికి కూడా అంగీకరించేవాడు కాదు. అతని వ్యక్తిత్వం నాకు తెలుసు. తను నేరం నుంచి బయటపదే అవకాశం వుండికూడా, విశారదని డిఫెన్స్ లాయర్ ఇబ్బంది పెట్టే ప్రశ్నలు వేస్తుంటే వద్దని ఆపుచేశాడు".

"బోసు నీకు ఏమవుతాడు?"

"నా భార్యకు అన్నయ్య".

"ఓహో ! అందుకని త్యాగం చేస్తూన్నావన్నమాట".

జడ్జి కంఠంలో వెటకారం ధ్వనించింది. బోసు శిక్షనుంచి తప్పించుకుంటున్నాడన్న వాస్తవం అతడిని ఇరిటేట్ చేస్తోంది,

సుధాకర్ చెప్పాడు –"ఇందులో త్యాగమేమీలేదు. నేను స్వార్థపరుడిని కాబట్టే బోసు యింతకాలం బోనులో నిల్చున్నా – మౌనంగా వుండిపోయాను. నాలో ఆ స్వార్థం లేకపోతే మొదటరోజే కోర్టుకి వచ్చే వాడిని..."

...ఆ మరుసటిరోజు సుధాకర్‌కి ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చాడు జడ్జి.

* * *

బోసుకి శిక్ష పడలేదనీ, హంతకుడు సుధాకర్ అనీ వెలుపడిన వార్త సంచలనం రేపింది. పర్వతాల నాయుడుని సుధాకర్ ఎందుకు చంపవలసి వచ్చిందో – అసలు కారణం ఎవరికీ తెలీదు. రకరకాల వూహాగానాలు చెలరేగాయి. బోసే చంపించాడని కొందరూ, బోసుని తప్పించడానికి నేరం తనమీద వేసుకున్నాడని కొందరూ, ఇలా ఎవరికీ తోచిన రీతిలో వారు చర్చించుకున్నారు.

ఈ జడ్జిమెంటువల్ల అందరికన్నా ఎక్కువ బాధపడింది పద్మావతి. కోర్టులోనే భోరున ఏడ్చేసింది.

పర్వతాల నాయుడిని సుధాకర్ చంపేడన్న సత్యం బోసుకి కూడా షాకే! ఉరిశిక్ష అన్న జడ్జిమెంట్ వచ్చేసరికి అతడి పెదవుల మీద నవ్వు కదలాడింది. అదే ఏ యావజ్జీవ కారాగార శిక్షో అయితే అతడు బాధపడేవాడు. దానికి కారణం ఏమిటో, అతడి మనసులో ఏముందో తెలుసుకోవాలంటే – కొంతకాలం ఆగక తప్పదు.

సుధాకర్‌కి ఉరిశిక్ష పడిన విషయం ఎటువంటి పరిస్థితుల్లోనూ గోమతికి తెలియకూడదని మాత్రం తన వాళ్ళందరికీ స్ట్రిక్టుగా సూచన లిచ్చాడు. బోసు.

అతడు విడుదల కాగానే చేసిన మొదటి పని సుధాకర్‌ని కలుసుకోవటం. అతడికి ధైర్యం చెప్పి వచ్చేసేడు.

గోమతికి ఇంకా ఆ విషయం తెలియలేదు. అన్నయ్య బయట పడ్డాడన్న సంతోషంలో వుంది. సుధాకర్ అర్జెంటు పనిమీద బయట వూరు వెళ్ళాడని, రెండు నెలల తరువాత వస్తాడనీ మాత్రం చెప్పారా అమ్మాయికి.

"కానీ ఈ విషయం ఎప్పటికయినా గోమతికి తెలియక తప్పదుగా" అంది పద్మావతి.

"ఆ వార్త తెలిసిన రెండు రోజుల్లోనే నువ్వు ఇలా అయిపోయావు. ఇక గోమతి తట్టుకోగలదా?"

"అందుకని ఇలా రహస్యంగా చివరి క్షణంవరకూ వుంచుతావా?"

"చివరి క్షణంలోగా ఏదయినా జరగొచ్చుగా!"

"హైకోర్టు తీర్పు మనకి అనుకూలంగా వచ్చి, శిక్ష తగ్గవచ్చు అంటావా?"

"సుధాకర్‌తో ఇప్పుడే మాట్లాడి వస్తున్నాను నేను. హైకోర్టుకి అప్లయి చేయటం లేదు మేము" ముక్తసరిగా అన్నాడు బోసు.

## 8

**రెండు రోజుల** తరువాత ముఖ్యమంత్రికీ, బోసుకీ మధ్య మీటింగ్ జరిగింది. అయితే అది అంతకు పూర్వం సమావేశంలాగా క్లుప్తంగా జరగలేదు.

రాత్రి పదింటికి ప్రారంభమైంది. రెండింటి వరకూ సాగింది. వారితోపాటు ఇంటెలిజెన్స్ చీఫ్ కూడా వున్నాడు. అతను ముఖ్యమంత్రికి ప్రధమ సలహాదారు.

ఎంత రహస్యమైన విషయమైనా సరే తన పక్కన వుండాల్సిందే అని ముఖ్యమంత్రి పట్టుబట్టాడు.

కొంచెం సేపు మామూలు సంభాషణ జరిగింది. పదో పెగ్‌లో వుండగా తనకి కావల్సిన విషయం చెప్పాడు బోసు.

ముఖ్యమంత్రికి ఒక్కసారిగా మత్తు దిగిపోయినట్టు అనిపించింది.

"ఏమిటి నువ్వు మాట్లాడేది?" అని అడిగాడు తల విదిలిస్తూ. బోసు మళ్ళీ చెప్పాడు.

"అసంభవం. జస్ట్ అసంభవం అంతే. ఇంతవరకూ ఎక్కడా ఇలా జరగలేదు. జరగబోదు" అన్నాడు ఇంటెలిజెన్స్ చీఫ్.

బోసు నవ్వేడు. "ఏదీ ఎప్పుడూ ఎక్కడో ఒకచోట ఇంతకు ముందే జరిగి వుండదు. ప్రతీ దానికి ప్రారంభం అంటూ ఒకటి వుంటుంది".

చాలా సేపు వాదోపవాదాలు జరిగాయి. ఇదెలా సాధ్యమంటాడు ముఖ్యమంత్రి. చేస్తానంటే వివరంగా చెప్తానంటాడు బోసు.

"అసలు ఇందులో ఎంత రిస్కు వుందో తెలుసుకోవాలి కదా!"

"మీకు రిస్కు లేదుకానీ మీరొక్కరే చేయగలరు?"

"సరే చెప్పు".

"క్షమించండి. మీరు చేస్తానంటేనే చెపుతాను. చెప్పిన తరువాత చెయ్యనంటే మా ప్లాను బయటకు చెప్పినట్టు అవుతుంది".

"అంత కష్టమైనదా?"

"అవును".

ముఖ్యమంత్రి కొద్దిసేపు మౌనంగా వూరుకొని, "ఇంత కష్టపడి చేస్తే – నాకేమిటి లాభం?" అన్నాడు.

"సుధాకర్ నాకు కావల్సిన మనిషి. అతడిని విడుదల చేయించటం కోసం నా సర్వస్వం ధారపోయటానికైనా వెనుదీయను... మీకేం కావాలన్నా చెప్పండి. ఏ...దై...నా సరే".

ముఖ్యమంత్రి లక్ష్మీ శారదవైపు చూసి "నువ్వు లోపలికి వెళ్ళు" అన్నాడు. ఆమె మనస్సు చివుక్కుమంది. ఈ మీటింగ్ ఏర్పాటు చేసింది తనే. అందులో తను థర్డ్ పార్టీగా గుర్తించబడటం...

బోసు ఇదేమీ పట్టనట్టు కూర్చున్నాడు. అతడికిప్పుడు లక్ష్మీ శారద, విశారద వీరెవరూ గుర్తులేరు. తన ప్రాణ స్నేహితుడు, అనుచరుడు, తనని రక్షించటం కోసం, మరణించబోతున్న వాడు అయిన సుధాకర్‌ని ఉరికంబం బారినుంచి తప్పించటం కోసం ఆలోచిస్తున్నాడు. లక్ష్మీశారద లోపలికి వెళ్ళేవరకూ ఆగి, ముఖ్యమంత్రి చెప్పాడు.

"మూడు నెలల్లో జనరల్ ఎలక్షన్లు వస్తున్నాయి తెలుసుకదా. ఈ టైమ్‌లో ప్రధానమంత్రి నన్ను వదులుకోవటానికి సుముఖంగా లేడు. అలా అని మొదలియార్ గ్రూప్‌నీ, ధనుంజయనీ కాదనలేడు. ఆయన సంగతి తెలియనిదేముంది? విషయం చివరివరకూ వచ్చాక ఎటు సహజంగా మలుపు తిరిగితే అదే తన పాలసీ అంటాడు. అంటే, రాష్ట్రంలో మా ఇద్దరిలో ఎవరు ఎక్కువ బలం వున్నట్లు నిరూపించుకోగలిగితే వారినే కేంద్రం సపోర్టు చేస్తుందన్నమాట".

ముఖ్యమంత్రి ఏం చెప్పబోతున్నాడో బోసుకి చూచాయగా తెలుస్తోంది. మొదలియార్ గ్రూప్‌కి వ్యతిరేకంగా తనని పనిచేయమంటున్నాడు అనుకున్నాడు. కానీ ఇంత చిన్న కోరిక అయివుండదు.. అన్న అనుమానం కూడా మరోవైపు వుంది.

అదే నిజమైంది.

"వచ్చే నెల మొదలియార్‌కి ధనుంజయ నుంచి పది కోట్లు రాబోతూంది. అంత డబ్బు ఏ విధంగా వస్తుంది? వ్యాన్‌లోనా, ట్రెయిన్‌లోనా దఫాలు గానా – అన్నది ఇంకా తెలియదు. దీన్ని ప్రభుత్వ యంత్రాంగం సాయంతోనే పట్టుకోవచ్చు. కానీ ఆ డబ్బు నాకు ఎలక్షన్ కోసం కావాలి. నీ వాళ్ళందరి ప్రాణాలు వొడ్డి అయినా సరే ఆ డబ్బు నాకు చేరేలా చూడాలి..." అని ఆగి, "నీ సుధాకర్ ప్రాణాలు కాపాడుకోవటం కోసం" అంటూ పూర్తిచేసేడు.

తనకి ఎంత ప్రమాదకరమైన పని అప్పగింపబడిందో అర్థమైంది. గాఢంగా నిశ్వసించి "చేస్తాను" అన్నాడు.

కొంచెం సేపు మామూలుగా సంభాషణ జరిగాక బోసు వెళ్ళిపోయాడు.

ముఖ్యమంత్రి అతడు వెళ్ళినవైపే చూస్తూండిపోయాడు. అప్పటివరకు వారిమధ్య నిశ్శబ్దంగా కూర్చున్న ఇంటెలిజెన్స్ చీఫ్ మొదటిసారిగా మాట్లాడుతూ "ఎందుకు అబద్ధం చెప్పారు?" అన్నాడు.

ముఖ్యమంత్రి నవ్వేడు. "వస్తున్నది పదికోట్లు కాదని, నాలుగు వ్యాన్‌ల గుండా మారణాయుధాలు ధరించిన మనుష్యులనీ – నిజం చెప్తే బోసు మరింత జాగ్రత్తగా వుంటాడు కాబట్టి..." అన్నాడు నవ్వుతూ.

ఎలక్షన్స్ ముందు రాష్ట్ర రాజధానిలో కల్లోలం సృష్టించటానికి మొదలియార్ గూండాల్ని తెప్పించుకున్నాడని రహస్య వార్త అందింది. వాళ్ళు పచ్చి రక్తం తాగే ప్రొఫెషనలిస్టులు. పోలీసు ఫోర్సుని కూడా ఎదుర్కొనగల సామర్థ్యం వున్నవారు.

ముఖ్యమంత్రి తనే ప్లాన్ చెప్పాడు. "ఊరి పొలిమేరల్లో రణరంగాన్ని ఏర్పాటు చెయ్యి. మొదలియార్ ఎలాగయినా అక్కడికి ఆ సమయానికి చేరుకునేలా చూడు. దూరంగా నీ వాళ్ళని రహస్యంగా ఏర్పాటు చెయ్యి. ఈ బోసు వున్నాడు చూడు – అతను ఆడి తప్పడు. మొత్తం తన బలాన్నంతా సమీకరించి అక్కడకు వెళతాడు. వచ్చేవాళ్ళు. కూడా తక్కువవాళ్ళు కాదు. ఆ యుద్ధంలో బోసో – మొదలియారో ఛస్తారు. మిగిలిన వాడిని పోలీసు ఫైరింగ్ మిషమీద నువ్వు చంపు. మూడో కంటికి అనుమానం రాదు".

చీఫ్ కొద్దిగా తటపటాయించి, అనుమానంగా అడిగాడు. "ఆ గూండాల్ని చంపటమే మనక్కావాల్సిందయితే దాన్ని మాకు వదిలి పెట్టండి".

"ఎలా చంపుతావు? ఎన్‌కౌంటర్ పేరు చెప్పి చంపటానికి వాళ్ళేమీ నక్సలైట్లు కారు, గూండాలు!"

"ఎలక్షన్స్ పూర్తయ్యేవరకూ ఏదో నెపంమీద అరెస్టుచేసి వుంచుతాను".

"ఎందుకు ఇంత వెనుకాడుతున్నావు?" ముఖ్యమంత్రి ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ వ్యాన్‌లలో వచ్చేది మామూలు వ్యక్తులు కాదు. వివిధ రాష్ట్రాలలో వుండే "క్రైమ్". వాళ్ళు తెచ్చే మారణాయుధాలతో మొత్తం రాజధానిని

తగలబెట్టవచ్చు. మీరన్నట్టు బోసుకూడా తక్కువ వాడేమీ కాకపోవచ్చు. అటువంటప్పుడు ఆ రెండు గ్రూపులూ తలపడితే అక్కడ మరో దారుణ హింసాకాండ జరుగుతుంది. చరిత్రలో మరో కురుక్షేత్రం జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు".

"నాక్కావల్సింది అదే – రెండు గ్రూపులూ సర్వనాశనం అయిపోవాలి".

"మొదలియారూ, అతని మనుష్యులూ నాశనమవ్వాలని మీరు కోరుకుంటే అందులో ఆశ్చర్యంలేదు. కానీ ఆ బోసు మన మనిషే కదా".

"మన మనిషా?" నవ్వేడు ముఖ్యమంత్రి. "నువ్వు ఎప్పుడైనా ఎవర్నైనా ప్రేమించావా చీఫూ!"

ఏ మాత్రం సంబంధంలేని ఈ ప్రశ్నకి చీఫ్ ఆశ్చర్యంగా "ఏం?" అన్నాడు.

"నువ్వు ఒకదాన్తో వుండగా, అది ఇంకెవర్నో లవ్ చేసిందని తెలిస్తే, వాడే నీకు ప్రధమ శత్రువు అవుతాడు. వాడు ఛస్తేగానీ నీకు కసితీరదు..." అని లేచాడు. "అందుకే నిన్ను నీ వాళ్ళతో అక్కడుండమన్నది. ఆ ఇద్దర్లో ఎవరు మిగిలినా వాళ్ళని నువ్వు చంపెయ్యి. మొత్తం అంతా ఆ దొమ్మీ కేసులో కొట్టుకుపోద్ది వెళ్ళిరా".

పోలీస్ చీఫ్ కూడ లేచాడు. ఇది మామూలు దొమ్మీకేసు కాదనీ న్యూక్లియర్ బాంబ్ పేలిన దానికన్నా పెద్ద విధ్వంసం జరగబోతూందని అతడికి తెలుసు.

## 9

**సూర్యుడు** ఇంకా పైకి రాలేదు.

ఆరుగంటల పది నిముషాలు కావొస్తుంది. మేఘాలు దట్టంగా పట్టి వుండటంవల్ల అక్కడ వెలుతురు లేదు.

చలిగా వుంది.

ఉరికంబం ముద్దాయిని ఆహ్వానిస్తున్నట్టు నిలబడి వుంది. మేజిస్ట్రేటు, డాక్టరు, తలారి, నలుగురు కానిస్టేబుల్స్, శవాన్ని తీసుకువెళ్ళటానికి వ్యాన్ రెడీగా వున్నాయి.

సుధాకర్‌ని ఉరికంబం దగ్గరకు తీసుకువచ్చారు. అందరి మొహాల్లోనూ టెన్షన్.

రెండు నిముషాల్లో అయిపోయింది.

సుధాకర్ శరీరం కందకంలోకి దిగిపోయింది.

కానిస్టేబుల్స్ వెళ్ళిపోయారు.

సుధాకర్ ప్రాణం పోయినట్టు డాక్టరు సంతకం పెట్టాడు.

శరీరాన్ని బంధువులకి 'హాండోవర్' చేస్తున్నట్లు జైలరు తన రికార్డుల్లో వ్రాశాడు.

దాన్ని రిసీవ్ చేసుకున్నట్టు బోసు సంతకం పెట్టాడు.

వ్యాన్ వెళ్ళిపోయింది.

......

ఈ సంఘటన జరగటానికి నాలుగువారాల ముందు రాష్ట్రంలో మూడు నాలుగు ట్రాన్స్‌ఫర్లు జరిగాయి. జైలరు, మేజిస్ట్రేటు, ఒకరిద్దరు కానిస్టేబుల్స్...

బోసు ముఖ్యమంత్రిని అడిగిన ఏకైక సాయం ఇదే!

మిగతా విషయాలన్నీ అతడే స్వయంగా చూసుకున్నాడు. అన్నిటికన్నా ముందు – సుధాకర్‌కి మరణశిక్ష అమలు జరిపే జైలరు భయస్థుడు. మేజిస్ట్రేటు నిజాయితీపరుడు.

రాష్ట్రంలో వున్న మిగతా జైలర్లు, మేజిస్ట్రేట్ల వ్యక్తిగత చరిత్రలన్నీ ఫైళ్ళ కాపీలు తెప్పించీ వాకబుచేసి తెలుసుకున్నాడు. వాళ్ళజీవిత విధానాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు.

వాళ్ళు చేయవలసిన పని చిన్నది కాదు. ఎంతో రిస్కుతో కూడుకున్నది. చేసింది బయటపడితే ఉద్యోగాలు పోవటమేకాదు. జైలుశిక్ష కూడా తప్పదు.

బోసు ఏరుకున్నది 'అలాటి' ధైర్యం వున్న వాళ్ళనే. అలాటి వారిని ఏరి పేర్లు ముఖ్యమంత్రికి ఇచ్చాడు. భయస్థులు, నిజాయితీపరులు అయిన ఉద్యోగస్థుల్ని బదిలీచేసి, డబ్బుకోసం ఏదైనా చేసేవారిని ఆ స్థానంలోకి ట్రాన్స్‌ఫర్ చేశాడు ముఖ్యమంత్రి.

....బేరసారాలేమీ జరపలేదు. డబ్బు నీళ్ళలా ప్రవహించింది. తమ జీవితకాలంలో అంత డబ్బు ఎవరూ చూసి వుండరు. ఆ డబ్బు బ్యాంక్‌లో చేసుకుంటే జీతంకన్నా అయిదురెట్లు ఎక్కువ నెలసరి ఆదాయం వస్తుంది.

చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని సంఘటన ఆ విధంగా జరిగింది. న్యాయస్థానం ఉరిశిక్ష విధించిన ఒక వ్యక్తి జైలు రికార్డుల ప్రకారం మరణించాడు. కేవలం జైలు రికార్డుల్లో మాత్రమే.

సుధాకర్ కయితే ఇంకా నమ్మశక్యం కాలేదు.

"నేను... నేను ఇంకా బ్రతికే వున్నానా?" అని అడిగాడు అపనమ్మకంగా.

"ఇదంతా ఎలా సాధ్యమయిందో నాకు అర్థం కావటంలేదు".

వ్యాన్ డ్రైవ్ చేస్తూన్న బోసు నవ్వేడు, "ఈ ప్రపంచంలో డబ్బు సాధించలేనిది ఏదయినా ఉందా?"

"ఎంత ఖర్చయింది?"

"నువ్వీ ప్రశ్న ఆర్గనైజేషన్ మనిషిగా అడుగుతున్నావా? చెల్లెలి భర్తగా అడుగుతున్నావా?" నవ్వుతూనే ప్రశ్నించాడు.

"ఆర్గనైజేషన్ మనిషిగానే..."

"దాదాపు కోటి".

సుధాకర్ వెంటనే మాట్లాడలేదు. ఆ షాక్ నుంచి తేరుకోవడానికి కొంచెం సేపు పట్టింది. "అం...త డబ్బా"అన్నాడు.

"ఇంతకుముందు ఎప్పుడూ ఎవరూ చేయనిది. అందుకే అంత ఖర్చయింది. అందరూ చాలా భయపడ్డారు. అసలు ఇది ఎలా సాధ్యపడుతుంది అని వాళ్ళ అనుమానం. అందరూ కలిసి చెయ్యాల్సిన పని అది. అందర్నీ కూడగట్టటం కష్టమైంది".

"నా కోసం నువ్వింత ఖర్చుపెట్టడం నాకు ఇబ్బందిగా వుంది".

"ఎందుకు?"

"ఎందుకా? నేను నీ చెల్లెలి భర్తని కాకుండా కేవలం ఆర్గనైజేషన్ మనిషినే అయితే అంత ఖర్చు పెట్టేవాడివా?"

"పెట్టేవాడిని–" ఏకాగ్రతతో డ్రైవ్ చేస్తూ అన్నాడు బోసు.

"అసలు నీకా అనుమానం ఎందుకొచ్చింది?"

సుధాకర్ దానికి సమాధానం చెప్పలేదు. కొంచెం నిశ్శబ్దం తరువాత అన్నాడు "... ఇప్పుడు నాకు అర్థమైంది నువ్వెందుకు 'బాస్' వయ్యావో!"

*　　　*　　　*

విమానం బయల్దేరటానికి సిద్ధంగా వుంది.

పాస్‌పోర్టు, టిక్కెట్లు సుధాకర్ చేతిలో పెట్టాడు బోసు. "జనం పూర్తిగా ఈ విషయం మర్చిపోయే వరకూ ఈ దూరం తప్పదు. మరీ అవసరమయితే తప్ప ఫోన్ చేయకు" అన్నాడు.

సుధాకర్ అతడివైపు బాధగా చూశాడు. అతడి కళ్ళు తడి అయ్యాయి. "నేనిక నీతో కలిసి పనిచేయలేక పోతున్నానంటే అది తల్చుకోవటానికే బాధగా వుంది బోసూ! ఆ చీకటి రాత్రిలో సెకండ్ షో సినిమా టిక్కెట్లు అమ్మి, టీకొట్టు బల్లమీద కూర్చుని సగం సగం రొట్టెలు తిన్న రోజులు గుర్తొస్తున్నాయి. నా ప్రాణం పోకుండా వున్నందుకు సంతోషించాలో, నిన్ను విడిచిపోతున్నందుకు విచారించాలో తెలియటం లేదు. వెళ్ళొస్తాను ఫ్రెండ్. గుడ్ బై..."

....బోసు చెల్లెలి దగ్గరకు నడిచాడు. విమానం బయల్దేరబోతోందని ఆఖరి అనౌన్స్‌మెంట్ వినిపించింది.

అతడు స్వరంలోకి బలవంతంగా నవ్వు తెచ్చుకున్నాడు. "వెళ్ళిరామ్మా..." అన్నాడు.

"వెళ్ళగానే ఫోన్ చేస్తానన్నయ్యా..." అంది.

అది సాధ్యంకాదని అతడికి తెలుసు. అతడు సుధాకర్‌కి ఆ విషయం స్ట్రిక్టుగా చెప్పాడు.

తమ చెల్లెలు ఏమైందన్న విషయం రామ్మూర్తి, అహల్యల మధ్య తప్పకుండా చర్చకి వస్తుంది. తనేదో సర్దిచెప్పినా, ఆ విషయం సింహాచలానికీ, అతని ద్వారా మొదలియార్‌కీ తెలుస్తుంది.

మొదలియార్‌కి అనుమానం రాగానే, తన టెలిఫోన్‌ల మీదా, ఉత్తరాల మీదా టాపింగ్ పెడతాడు. సుధాకర్, గోమతిలు విదేశాలకి వెళ్ళిపోయారన్న అనుమానం ఏ మాత్రం కలిగినా, మొత్తం ప్రభుత్వ యంత్రాంగాన్ని కుదుపుతాడు.

అందుకే ఉత్తరాలు గానీ, ఫోన్‌లు గానీ వద్దని చెప్పాడు.

ఈ విషయాలేమీ గోమతికి తెలీదు. ఏదో పనిమీద భర్త విదేశాలకి వెళుతూ తనని తీసుకువెళ్తున్నాడనుకుంటోంది. అందుకే ఉత్సాహంగా బయల్దేరింది.

గోమతి విమానం మెట్లెక్కి లోపలికి వెళ్ళిపోయింది.

అతడలాగే నిలబడి వున్నాడు. అతడు చిన్నతనం నుంచీ తన చెల్లెలిని అమితంగా ప్రేమించాడు. పద్దయ్యాక ఆమె వ్యక్తిత్వానికి ముగ్ధుడయ్యాడు. కానీ ఆమె అనందాన్నీ నాశనమవటానికి కూడా తనే కారణమయ్యాడు. అందుకే చరిత్రని తిరిగి సృష్టించి, ఆమె భర్తని బ్రతికించుకున్నాడు.

అయినా ఏదో విషాదం.

పోగొట్టుకోవటం కన్నా గొప్ప విషాదం ఏముంది? జీవితం ఉల్లిపాయలాటిది, ఒక్కొక్క అనుభవపు పొర తీసేస్తూ పోతే మిగిలేవి కన్నీళ్ళే. ఈ కన్నీరెంత త్యాగమయి! ఆనందంలోనూ విషాదంలోనూ మనిషి దాన్ని వెలివేస్తూన్నా – సాంత్వనపర్చటం కోసం అది అతనితోనే వుంటుంది.

కోట్లాది ఉదయాస్తమయాల్ని నీలో జీర్ణం చేసుకున్న ఓ సూర్యుడా! ప్రతి ఉదయం నేను పంపే శుభాభినందనల్నీ, ఆశీర్వచనాలనీ, పడమటి దేశంలో వున్న నా చెల్లెలికి ప్రతి సంధ్యలోనూ అందజెయ్యి. అంతకన్నా నాకేమీ అవసరంలేదు.

## 10

**ఇంటెలిజెన్స్** చీఫ్ వాచీ చూసుకున్నాడు.

తొమ్మిదింపావయింది. బోసు తన మనుష్యులతో ఇంకా అక్కడికి రాలేదు. చీఫ్‌కి కంగారుగా వుంది. మొదలియార్ తెప్పిస్తున్న మనుష్యులు గత రాత్రే బయల్దేరారు. ఏ క్షణాన్నయినా అక్కడికి చేరుకోవచ్చు.

బోసు రాని పక్షంలో వారు నిరాటంకంగా నగరంలో ప్రవేశిస్తారు. అక్కడ ఘర్షణ జరిగితే తన ప్లాను అమలు జరపటం కష్టం. జనం మధ్యలో మొదలియార్‌ని గానీ, బోసుని గానీ చంపటం వీలుకాదు. నగరంలో, పోలీసు ఫైరింగ్ అని చెప్పటం అసాధ్యం.

అతడు ఆలోచనల్లో వుండగా రోడ్డుమీద వాహనాల చప్పుడు వినిపించింది. అతడు చప్పున చెట్లచాటునుంచి బయటకు చూశాడు.

ఆ దృశ్యం చూసి షాక్ తగిలినట్టు అనిపించింది.

రోడ్డుమీద వరుసగా నాలుగు పోలీసు వ్యానులు వచ్చి నిలబడ్డాయి. అతడి మనసులో ఏదో అనుమానం ప్రవేశించింది. అక్కడికి పోలీసులు ఎందుకు వచ్చారో అర్థంకాలేదు.

అంతలో మొదటి జీపులోంచి ఇన్‌స్పెక్టర్ దిగాడు. వెనుక వ్యాన్‌లలోంచి బిలబిలమంటూ పోలీసులు దిగసాగారు. రోడ్డుకి ఇరువైపులా వాళ్ళు వలయంలా నిలబడుతూన్న విధానాన్నిచూసి చీఫ్‌కి అర్థమైంది. వస్తూన్న ప్రతి వాహనాన్ని చెక్ చేయటానికి వాళ్ళు అలా నిలబడ్డారని.

పోలీసులకి ఈ టిప్-అఫ్ ఎలా అందిందో చీఫ్‌కి అర్థంకాలేదు. బైనాక్యులర్స్‌తో చూశాడు.

జీపులోంచి దిగిన ఇన్‌స్పెక్టర్ ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాడు.

అతడు సింహాచలం.

* * *

ముఖ్యమంత్రి పర్సనల్ ఫోన్ మ్రోగింది. రిసీవరు ఎత్తి 'హల్లో' అన్నాడు.

"నేను బోస్‌ని".

ముఖ్యమంత్రి మొహం చిట్లించి "ఎక్కణ్ణుంచి" అని అడిగాడు.

"ఇంటి దగ్గర్నుంచి".

ముఖ్యమంత్రి అదిరిపడి, "అదేమిటి - నేను చెప్పిన పని చేయటానికి వెళ్ళలేదా?" అని అడిగాడు.

"అది చెప్పటానికే ఫోన్ చేశాను. మొదలియార్ తాలూకు మనుష్యులు తమతో పాటు డబ్బు తేవటం లేదు".

ముఖ్యమంత్రి చెయ్యి రిసీవర్ మీద బిగుసుకుంది. "నీకెలా తెలుసు" అని అడిగాడు అనుమానంగా.

"రాష్ట్ర సరిహద్దుల్లోనే మా వాళ్ళని పంచర్ షాపుల్లో పెట్టాను రోడ్డుమీద మేకులు చల్లించాను. ఇప్పుడే అక్కడనుంచి ఫోన్ వచ్చింది. నాలుగు వ్యాన్‌ల నిండా మనుష్యులు వస్తున్నారట కానీ – డబ్బు ఏమీ ఆ వ్యాన్‌లలో లేదట. మా వాళ్ళు పంచర్ వేసే నెపంమీద పరిశీలించారు".

ముఖ్యమంత్రి అతి కష్టంమీద తనని తాను నిభాయించుకున్నాడు.

"నేనుంటాను సర్" అట్నుంచి బోసు వినయంగా అన్నాడు. "....ఎప్పుడు నా అవసరం వచ్చినా తప్పక తెలియజేయండి. నేనూ, మా మనుష్యులూ సర్వదా మీ సేవకోసం ఎదురుచూస్తూ వుంటాం".

ఫోన్ కట్ అయింది.

రిసీవర్ విరిగిపోతుందేమో అన్నంత బలంగా పెట్టేసేడు ముఖ్యమంత్రి. అతడి కోపం కట్టలు తెగుతోంది. పిడికిలి బిగించి అరచేతిలో బలంగా కొట్టుకున్నాడు. అతడికేం చెయ్యాలో పాలుపోవడంలేదు. బోసు ఇలా చేస్తాడని, చేయగలడనీ వూహించలేదు.

అతడో క్షణం ఆలోచించాడు. కనీసం వూరి పొలిమేరల్లో మొదలియార్ మనుష్యుల్ని ఆపుజేయమని బోసుకి చెప్దామనుకున్నాడు.

అప్పుడు తప్పకుండా దొమ్మీ జరుగుతుంది. ఆ గొడవలో బోసుని కాల్చెయ్యమని చీఫ్‌కి చెపితే, మొదలియార్ సంగతి తరువాత చూసుకోవచ్చు. ఒకవేళ బోసు తప్పించుకున్నా అతడికీ, మొదలియార్‌కీ మరింత వైరం పెరుగుతుంది!

....అతడు తిరిగి ఫోన్ చేయబోతుంటే వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది. అట్నుంచి ఇంటెలిజెన్స్ చీఫ్ మాట్లాడుతున్నాడు.

"ఎక్కడున్నావ్ నువ్వు?" చిరాగ్గా అడిగాడు చీఫ్ మినిష్టర్.

"సరస్వతి నిలయం స్కూలు దగ్గిర సరుగుడు తోపుల్లోంచి...." చీఫ్ చెప్పాడు. "...బోసు ఇక్కడికి రాలేదు".

"రాడు, ఇప్పుడే ఫోన్ చేశాడు. వ్యాన్‌లో డబ్బు రావటంలేదని అతడికి తెలిసిపోయింది. వ్యాన్‌లలో వస్తున్న వాళ్ళని ఆపు చెయ్యమని ఇప్పుడే వాడికి మళ్ళీ ఫోన్ చేద్దామనుకుంటున్నాను. కనీసం ఆ గొడవలోనైనా ఎవడో ఒకడు చచ్చే అవకాశం వుంది".

శతృదేశం పైనుంచి విమానం వెళ్ళిపోతూ ఆఖరి బాంబు వేసినట్టు చీఫ్ చెప్పాడు. "..కానీ ఇప్పుడే పోలీసులు వ్యాన్‌లలో దిగారు".

"వ్వాట్!" ముఖ్యమంత్రి కంఠం కీచుమంది. "ఎవరు?... వాళ్ళకి ఎవరు చెప్పారు?" గట్టిగా అరిచాడు.

"తెలీదు... అదిగో! మొదలియార్ వ్యాన్లు వస్తున్నాయి, పోలీసులు చెకింగ్ కోసం ఆపుచేస్తున్నారు..." రన్నింగ్ కామెంటరీలా చెప్పుకుపోతున్నాడు చీఫ్. "...మేమీ ప్రదేశం ఖాళీచేసి ఇక్కణ్ణుంచి తొందరగా వెళ్ళిపోవటం మంచిదనుకుంటాను..."

ముఖ్యమంత్రి వినటంలేదు. ఫోన్ పెట్టేసేడు.

అతడికి మొహమంతా చెమట్లు పట్టాయి. బోసు – మొదలియార్ కొట్టుకోవటం వేరు. పోలీసులు మొదలియార్ మనుష్యుల్ని అరెస్టు చేయడం వేరు.

ఎలక్షన్‌ల ముందు ఈ గూండాల్ని అరెస్టు చేస్తే తమ పార్టీ అల్ల కల్లోలం అయిపోతుంది. తనకీ మొదలియార్‌కీ స్పర్ధలు వుండొచ్చుగాక. కానీ ఇద్దరిదీ ఒకే పార్టీ. రేపు మొదలియార్ ప్రధానమంత్రికి "మన పార్టీ గెలవటం కోసం నేను నాలుగు వ్యానులనిండా మనుష్యుల్ని పంపించాను. ముఖ్యమంత్రి వాళ్ళని అరెస్ట్ చేయించాడు" అని చెపుతాడు. ఇది చాలు తన కెరీర్ ఎలక్షన్ల ముందు సమూలంగా నాశనమవటానికి. ప్రధానమంత్రి ఈ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోడు. తమ పార్టీని గెలిపించటానికి వస్తూన్న గూండాల్ని తన రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారంటే అది చిన్న విషయం కాదు. తన అసమర్థతకి నిదర్శనం.

ఐ.జి.కి ఫోన్ చేసి వెంటనే పోలీసు ఫోర్స్‌ని ఆ రోడ్డు దగ్గిర్నుంచి ఖాళీ చేయించమని చెప్పటం కోసం అతడు ఫోన్ అందుకోబోతూంటే – ఫోన్ మోగింది.

ఎత్తి "హల్లో" అన్నాడు.

"నేను సర్ బోసుని..." అట్నుంచి వినయంగా వినపడింది. "...ఇంకో విషయం చెప్పటం మర్చిపోయాను. ఆ గూండాల్ని అరెస్టు చేయించమని నేనే ఐ.జి.కి చెప్పాను".

ఇంకో షాక్ తట్టుకోలేని స్థితిలో వున్నాడు చీఫ్ మినిష్టర్. బలహీనమైన స్వరంతో "ఎందుకు?" అన్నాడు.

"వాళ్ళు ఎలాగూ క్యాష్ తీసుకురావడం లేదని తెలిసింది. మనకి కావల్సింది క్యాషేగా. అది లేనప్పుడు ఆ సంఘ విద్రోహ శక్తుల్ని పోలీసులకి పట్టించటం నా కర్తవ్యంగా భావించాను సర్! మీరు కూడా దీన్ని మెచ్చుకుంటారని

నాకు తెలుసు. మొదలియార్ ప్రాణాలన్నీ ఈ గ్యాంగ్‌లోనే వున్నాయి. అది నాశనమై పోవడం మీకూ నాకూ మంచిదేగా" అని ఫోన్ పెట్టేశాడు.

ముఖ్యమంత్రి ఒక్కరోజులో వృద్ధాప్యం ముంచుకు వచ్చినవాడిలా కూర్చుండి పోయాడు.

తన చేతికి 'తడి అంటకుండా – బోసు అటు మొదలియార్ సైన్యానికి, ఇటు పోలీసులకీ మధ్య సృష్టించి తను మాత్రం హాయిగా వుండిపోయాడని అర్థమైంది. బోసు మాస్టర్ మైండ్‌కి మెచ్చుకోవాలో, తన చేతగానితనానికి తిట్టుకోవాలో అర్థంకాలేదు.

ఏం చెయ్యాలా అని అతడు ఆలోచిస్తూండగా పియ్యే వచ్చి... "మీ కోసం పద్మావతి వచ్చారు" అని చెప్పాడు.

"ఇప్పుడెవర్నీ చూడటానికి వీల్లేదని చెప్పు" చిరాగ్గా అన్నాడు ముఖ్యమంత్రి. పియ్యే వెళ్ళి నిముషం తర్వాత వెనక్కి వచ్చి – "మీతో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలట... లక్ష్మీ శారదగారి గురించి" చెప్పాడు.

ముఖ్యమంత్రి తన ఉలికిపాటుని కప్పిపుచ్చుకుంటూ "రమ్మను" అన్నాడు.

రెండు నిముషాల తరువాత పద్మావతి అతడి ఛాంబర్‌లోకి ప్రవేశించింది.

ఒకప్పుడయితే ఆమె అందాన్ని చూసి ముఖ్యమంత్రి సరస సంభాషణ ప్రారంభించేవాడే. కానీ ఇప్పుడతడి మూడ్ వేరు. "...కూర్చో" అని, "ఏమిటి? లక్ష్మీశారద గురించి చెపుతానన్నావట. అసలెవర్నువ్వు?" అంటూ ప్రశ్నించాడు.

ఆమె తాపీగా చుట్టూ చూసి "చాలా ఖరీదైన గది" అంది. ముఖ్యమంత్రి మొహం చిట్లించి "వ్యాట్" అన్నాడు. ఆమె అతని ఆశ్చర్యాన్ని పట్టించుకోలేదు.

అదే స్వరంతో కొనసాగించింది. "ఒకప్పుడు నేను యీ భోగభాగ్యాలన్నీ ఆశించాను. నీకు ఉంపుడుకత్తెనయితే ఇవన్నీ దొరుకుతాయని అనుకున్నాను".

ఆ ఏకవచన సంబాధనకి ముఖ్యమంత్రి దాదాపు పిచ్చివాడై కోపంగా కుర్చీలోంచి లేస్తూ "గెటౌట్ ఫ్రమ్ హియర్" అన్నాడు.

"సరే చెపుతాను విను. మొదలియార్ వ్యాన్‌లలో డబ్బు తేవటం లేదనీ, అందులో గూండాలు వస్తున్నారనీ బోసుకు నెలరోజుల ముందే తెలుసు".

ముఖ్యమంత్రి అదిరిపడి, "బోసుకి ఎలా తెలుసు" అని అడిగాడు.

"లక్ష్మీ శారద చెప్పింది".

మిన్ను విరిగి మీదపడ్డట్టు కంపించిపోయాడు. "లక్ష్మీ శారదకి ఎలా తెలిసింది?"

"ఎవర్నయితే నువ్వు నీ మనిషి అని నమ్మావో, ఎవరి దగ్గిర రాష్ట్ర రహస్యాలన్నీ వుంటాయో – ఆ ఇంటెలిజెన్స్ చీఫ్ చెప్పాడు. "

ముఖ్యమంత్రి చేతులు వణుకుతున్నాయి. "ఇది .... ఇది నేను నమ్మలేను" అన్నాడు. "నా ఉంపుడుకత్తెకి ఇంటెలిజెన్స్ చీఫ్ ఈ విషయాలన్నీ చెప్పాడంటే నేను నమ్మలేను".

"లక్ష్మీశారద పట్ల నువ్వా పదం వాడినట్టు తెలిసిందంటే బోసు నీ నాలుక చీరేస్తాడు. ఇంతకీ ఏం చెపుతున్నాను? ఆ..! బోసుకి 'గూండాల' విషయం తెలియటం గురించి కదూ! నీ చేతికి మట్టి అంటకుండా, బోసుని చంపటానికి మొదలియార్ గూండాల్ని వాడుకుంటున్నావని తెలిసి, బోసు ఆ గూండాలమీదకి మళ్ళీ నీ పోలీసు ఫోర్సునే ఉపయోగించాడు. "తాంబూలాలిచ్చేసేను. తన్నుకు

చావండి" అన్నట్టు మీకూ మీకూ యుద్ధం సృష్టించి మీ బాణాలు మీ మీదకే తిప్పకొట్టాడు. అర్థమైందా?" అంది వివరిస్తున్నట్టు. ముఖ్యమంత్రి ఇంకా తన ఆలోచనలోనే వున్నాడు. "కానీ చీఫ్ లక్ష్మీశారదకి ఈ విషయం ఎందుకు చెప్పాడు?" ఉడికిపోతూ అన్నాడు.

"బహుశ కాబోయే ముఖ్యమంత్రిని ఇప్పుడే మంచి చేసుకుందామనుకుంటున్నాడేమో" అతడి బాధని మరింత ఎగదోస్తూ అంది.

"....కాబోయే ముఖ్యమంత్రా?"

"నువ్వూ మొదలియార్ ఈ రాష్ట్రంలో రెండు బలమైన వర్గాలు. పర్వతాల నాయుడు పోవటంతో మొదలియార్ కాస్త బలహీనపడిన మాట నిజమే. కానీ ఈ లోపులో మీ ఇద్దరికన్నా బలంగా ఉద్భవిస్తూన్న మూడో శక్తిని మీరు గమనించలేదు. ఆ శక్తే 'బోసు'".

"బోసా?" అంత షాక్‌లోనూ ముఖ్యమంత్రి నవ్వేడు బిగ్గరగా. "బోసు రాజకీయాల్లో ప్రవేశిస్తున్నాడా?"

పద్మావతి అతడివైపు సూటిగా చూస్తూ "బ్రోకర్లూ, గూండాలూ, సినిమా నటులు చేరగాలేంది అతడు చేరటానికేమొచ్చింది? అందుకే ప్రధానమంత్రి స్వయంగా బోసుతో మాట్లాడాడు" అంది.

ముఖ్యమంత్రి గొంతు తడారిపోయింది. "ఎప్పుడు?" అన్నాడు హీనమైన స్వరంతో.

"నాలుగు రోజుల క్రితం, ఢిల్లీనుంచి ఫోన్ చేశాడు. అతడిని పార్టీలోకి ఆహ్వానించాడు. పోతే అతడు శిక్ష అనుభవించాడు కాబట్టి "పదవికి అనర్హుడు.

అందుకే లక్ష్మీశారదని కాబోయే ముఖ్యమంత్రి అన్నాను" అంటూ లేచింది పద్మావతి. "అది చెప్పటానికే వచ్చాను" గుమ్మం దగ్గిరకి వెళ్తూ ఆగింది. "పూర్వకాలంలో రాకుమార్తెలు కథానాయకుల్ని చూడకుండానే, వారి గురించి కథలుగా విని పరోక్షంలోనే ప్రేమించేవారట. నేను కూడా నిన్ను... అంటే... ముఖ్యమంత్రిని ప్రేమించాను. నా ప్రేమికుడు – పాపం తన వెనుక ఏం జరిగిందో తెలియక కొట్టుకుచస్తూ వుంటాడని ఈ విషయాలన్నీ చెప్పటానికి వచ్చాను. బై".

ఆమె వెనుక తలుపు మూసుకుపోయింది.

నాలుగు వైపుల్నుంచీ సముద్రం తనని ముంచేస్తున్నట్టు అనిపించింది ముఖ్యమంత్రికి. ఎలక్షను సజావుగా జరిపించటానికి (?) వస్తూన్న గూండాల్ని తను అరెస్టు చేయించాడని ప్రధానమంత్రికి మొదలియార్ ఎలాగూ చెపుతాడనీ, దాంతో తనకి ప్రమాదమని వూహించాడు. అంతే తప్ప, నాలుగురోజులక్రితమే ప్రధానమంత్రి – బోసుని చేరదీసే ప్రయత్నం చేశాడని కలలో కూడా అనుకోలేదు. ఇప్పుడిక బోసుకి దగ్గరయ్యే అవకాశం కూడా లేదు.

తన రాజకీయ జీవితం అంతం కాబోతూందా? ఈ ఆలోచన వచ్చేసరికి వెన్ను జలదరించింది. అలాగే నిశ్శబ్దంగా చాలాసేపు తన ఛాంబర్‌లో కూర్చుండి పోయాడు.

....ఇక అతడి గురించి చెప్పుకోవటానికేమీ లేదు.

* * *

"వ్వాట్" అని అరుస్తూ కుర్చీలోంచి లేచాడు బోసు. అతడి చేతిలో రిసీవరు బిగుసుకుంది. లక్ష్మీశారద విస్తుబోయి అతడివైపు చూసింది. అతను అంత టెన్షన్

ఫీలవటం ఆమె ఎన్నడూ చూడలేదు. ఆమే కాదు, అతడితో నిరంతరం వుండేవాళ్ళు కూడా చూడలేదు. అట్నుంచి చెపుతూన్న మాటల్ని ఉద్వేగంగా విని, "ఇప్పుడే వస్తున్నాను" అంటూ ఫోన్ పెట్టేసి, అతడు వేగంగా బయటకొచ్చాడు.

"ఏం జరిగింది?" అతడితోపాటు బయటకు వస్తూ కంగారుగా అడిగింది లక్ష్మీశారద. అతడామెకి సమాధానం చెప్పకుండా తన వాళ్ళతో "అందరూ బయల్దేరండి క్విక్" అని కారెక్కాడు. అతడి డ్రైవర్ కార్ రేస్ విన్నర్ బుల్లెట్‌లా దూసుకుపోతూ అయిదు నిముషాల్లో అతడి కారు ఊరి పొలిమేర్లు చేరుకుంది.

అక్కడ వాతావరణం భీభత్సంగా వుంది. ఇంకా పొగలు లేస్తూనే వున్నాయి. అతడు వాటిని పట్టించుకోలేదు. కారు కుడివైపుకి తిరిగింది. పొగల్ని దాటి ముందుకు దూసుకుపోయింది. అతడి అనుచరుల కార్లు దాన్ని ఫాలో అవుతున్నాయి.

అక్కడ అంత గొడవ జరిగినా పోలీసులు రాకపోవటానికి కారణం... ఆ గొడవలో ఒక పార్టీ పోలీసువారే కావటం!

పక్క రాష్ట్రంనుంచి వస్తూన్న గూండాలని సోదా చేయమని చెప్పింది ఐ.జి.యే కావటంతో ఇన్‌స్పెక్టర్ సింహాచలం రెచ్చిపోయాడు. అతడికి రెండు విషయాలు తెలియవు. వస్తూన్నది తమ (మొదలియార్) మనుష్యులేనని! వాళ్ళు అన్నిటికీ తెగించిన రౌడీలని.

బయల్దేరినప్పటినుంచీ వాళ్ళు తాగుతూనే వున్నారు. ఒక్కడికీ స్పృహలేదు.

పోలీసులకి మొదటి వ్యాన్‌లోనే మరణాయుధాలు దొరికాయి. అవి ఎంత విలువయినవంటే, పోలీసులే తమ జీవిత కాలంలో అటువంటివి చూడలేదు.

"ఎవరి తాలూకు మీరు?" అడిగాడు.

"అడగటానికి నువ్వెవరివిబే?" ఇలాంటి వ్యవహారాల్తో తలమాసిన గూండా ఎదురు ప్రశ్నించాడు. సింహాచలం – వాళ్ళని అరెస్ట్ చేయమని ఆర్డర్ ఇచ్చాడు. పోలీసులు దానికి సమాయత్తం అవుతుండగా, బాగా తాగివున్న ఒక గూండా వాళ్ళమీద స్మోక్ బాంబు విసిరాడు.

దాంతో అక్కడంతా అల్లకల్లోలం రేగింది. దట్టమైన పొగ ఆ ప్రాంతాన్ని ఆవరించింది. ఒక పోలీసు కన్నుకి గాయమైంది.

ఏం జరుగుతుందో తెలుసుకునే లోపులో, పొగ మధ్యనుంచి వ్యాన్‌లు దూసుకుని ముందుకు వెళ్ళాయి.

వెనుకనుంచి వెంటాడుతూ వస్తున్న పోలీసుల్ని తప్పించుకునే ప్రయత్నంలో మెయిన్ రోడ్ వదిలి ఎడమపక్కకి తిరిగాయి.

అది సరస్వతీ నిలయానికి వెళ్ళేదారి –

* * *

విశారదకి ముందేమీ అర్థంకాలేదు. అప్పటికి స్కూలు వదిలి ఐదు నిముషాలయింది. పిల్లల్ని నగరంలోకి తీసుకువెళ్ళే బస్‌లు వరుసగా నిలబడి వున్నాయి. పిల్లలు క్యూల్లో నడుస్తూ బస్‌లు ఎక్కుతున్నారు. అప్పుడు దూసుకొచ్చాయి వ్యాన్‌లు అక్కడికి.

అది పదెకరాల విశాలమైన ఆవరణ. కొబ్బరిచెట్లు, అరటి చెట్లతో కళకళలాడుతూ వుంది. క్లాస్ రూమ్‌లు విసిరేసినట్టున్నాయి.

ఆ మట్టిరోడ్డు, ఊళ్ళోకి వెళ్ళేదారి కాదనీ, తామొక స్కూలు ఆవరణలోకి ప్రవేశించామనీ మొదలియార్ మనుష్యులకి అర్థమైంది. వెనక్కి తిరిగి వెళ్ళటానికి దారిలేదు. ఆ దారి వెంబడే పోలీసు వ్యాన్‌లు వస్తున్నాయి. దాంతో గూండాలు, చేతికి అందిన ఆయుధాలు పట్టుకుని తలో దిక్కుకీ పరుగెత్తారు.

కొందరు స్కూలు పాకల వెనక్కి, మరికొందరు చెట్లలోకి...

ఈ లోపులో పోలీస్ వ్యాన్ వచ్చి ఆగింది. అది ఆగీ ఆగకముందే దానిమీద ఎవరో స్మోక్ బాంబు విసిరారు.

పుట్టలోకి కిరసనాయిలు పోస్తే చీమలు బయటకు వచ్చినట్లు, వ్యాన్ లోంచి పోలీసులు బిలబిలమంటూ బయటకొచ్చారు. ఆ ఏరియా మరో పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుంది. వైర్‌లెస్‌లో అదనపు బలగాలకోసం మేసేజ్ పంపించారు.

పిల్లల పరిస్థితి మాత్రం దారుణంగా వుంది. బాంబు చప్పుళ్ళకి, పొగకీ బెదిరిపోయిన విద్యార్థులు క్యూలు వదిలి నలుదిక్కులకీ చెల్లాచెదురయ్యారు. టీచర్లు ఆందోళనతో అరవటం ప్రారంభించారు. ఎవరు ఎవరిమీద కాల్పులు సాగిస్తున్నారో, ఎవరు చస్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది. మధ్యలో పిల్లలు నలిగిపోతున్నారు. రక్తం కాల్వలై ప్రవహిస్తోంది.

ఆ సమయానికి మొదలియార్ అక్కడ దిగాడు. బోస్‌కి అందినట్టే అతడికి ఈ వర్తమానం అందింది. అతడు సింహాచలం దగ్గరికి వస్తూ "వాటీజ్ దిస్! స్టాపిట్! వాళ్ళు మావాళ్ళు" అని అరిచాడు.

పోలీసులకి సూచనలిస్తున్న సింహాచలం ఆ ఆకస్మిక మలుపుకి ఆశ్చర్యపోయి, "సర్ ఐ.జి. గారు..." అంటూ ఏదో చెప్పబోయాడు. మొదలియార్

కోపం కట్టలు తెంచుకుంది. అప్పటికే అతడు జరుగుతున్నదంతా చూసి చికాకుతో వున్నాడు. సింహాచలం చెంపమీద బలంగా కొట్టి "సీజ్ ఫైర్" అని అరిచాడు.

సింహాచలం తన వాళ్ళని వెనక్కిపిలవబోయాడు. వాళ్ళకి సంబంధించినంత వరకూ కథ సుఖాంతమయ్యేదే గానీ, అంతలో అదనపు బలగాలతో, ఆ స్కూలున్న ఏరియా ఇన్‌స్పెక్టర్ జీపు దిగాడు.

అతడు రాధాకృష్ణమాచారి.

రావటంతోనే అతడు పరిస్థితిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. మొదలియార్ అడ్డుపడబోతే అతడు ఒకేమాట అన్నాడు. "మిస్టర్ మొదలియార్! ఈ పరిస్థితుల్లో మీరే మాత్రం అడ్డొచ్చినా మిమ్మల్ని అరెస్ట్ చేయవలసి వస్తుంది! ఇది నా ఏరియా అన్న విషయం మర్చిపోకండి".

...మొదలియార్ మెదడు పాదరసంకన్నా చురుగ్గా ఆలోచించింది. అప్పటికే ఇద్దరు పోలీసులు చావు బ్రతుకుల మధ్య వున్నారు. ఎలక్షన్స్ ముందు ఇటువంటి గొడవల్లో తను వుండటం అంత మంచిదికాదు – అనుకున్నాడు.

అతడికి తన మనుష్యుల గురించి బాగా తెలుసు. ఇంకో నాలుగురెట్లు పోలీసులొచ్చినా వాళ్ళు తప్పించుకోగలరు. ఆ నమ్మకంతో తను వెళ్ళిపోతున్నట్టు సింహాచలానికి సైగచేశాడు. సింహాచలం కూడా పరిస్థితి అర్థం చేసుకున్నాడు. తలూపాడు.

మొదలియార్ కారెక్కగానే అది రివర్స్ అయి, ఆ ఆవరణలోంచి వెనక్కు రాసాగింది. అయితే రెండు నిముషాల ప్రయాణం తరువాత ఆగిపోయింది. అది

ఎందుకు ఆగిందో అర్థంకాక, వెనుక సీట్లో వున్న మొదలియార్, ఫ్రంట్ గ్లాస్‌లోంచి బయటకు చూశాడు.

...సుశిక్షితుడైన నాయకుడు ముందు నడుస్తూంటే, క్రమశిక్షణతో వెనుక మస్తూన్న సైనికుల్లా – ఒకే వరసలో కార్లు వస్తున్నాయి.

ఫ్లీట్ ఆఫ్ కార్స్!

బోసు తన వాళ్ళతో వస్తున్నాడు. అప్పటివరకూ జరిగినదంతా అతడికి ఏ క్షణానికా క్షణం ఇన్‌ఫార్మర్ల ద్వారా తెలుస్తూంది. గూండాలు స్కూల్లోకి ప్రవేశించారని తెలియగానే అతను కంగారుపడ్డాడు. అతను భయపడినంతా జరిగింది. విద్యార్థులు మధ్యలో ఇరుక్కుపోయి వున్నారు. గూండాలు బాలబాలికల్ని 'కవర్' చేసుకుని తప్పించుకోవటానికి ప్రయత్నిస్తారని అతడు వూహించింది నిజమైంది.

అతడు వెళ్ళేటప్పటికి రాధాకృష్ణమాచారి తన బలగానికి సూచన్లు యిస్తున్నాడు. సింహాచలం ప్రేక్షకుడిలా చూస్తూ నిలబడి వున్నాడు. అవతలున్నది మొదలియార్ మనుష్యులని తెలియగానే అతడికి సగం ప్రాణాలు పోయాయి. ఎలక్షన్స్ 'నిర్వహించటానికి' వస్తూన్న వాళ్ళని తాను ఎదుర్కొన్నాడని అర్థమైంది. దీని ఫలితం చాలా దారుణంగా వుంటుందనీ, తాను రేపు మొదలియార్ చేతిలో శిక్ష అనుభవించక తప్పదనీ తెలుసు. ఆ ఆలోచనతోనే నిమిత్తమాత్రంగా అక్కడ నిలబడి వున్నాడు.

మరోవైపు – బోసు కార్లు తమని దాటి వెళ్ళిపోగానే మొదలియార్, కారు అక్కడే వుంచమని చెప్పి, తాను కారు దిగాడు.

బోసుని చంపటానికి ఇంతకన్నా మంచి అవకాశం మరొకటిరాదని అతడికి తెలుసు. ఒకవైపు రక్తంతాగే గూండాలు, మరొకవైపు పోలీసు కాల్పులు... ఎవరు చచ్చినా, ఎవరు చంపినా ఆ హడావుడిలో నేరస్థులు పట్టుబడరు.

అతడు చెట్ల వెనుకనుంచి, బోసు వున్నవైపు రాసాగాడు. అతడు అక్కడకు చేరుకునే సమయానికి రాధాకృష్ణమాచారి బోసుతో మాట్లాడుతున్నాడు. "మీరు వెంటనే ఇక్కడినుంచి వెళ్ళిపోండి, క్విక్" అంటున్నాడు.

బోసు కదల్లేదు. "మా వాళ్ళు మీకు సాయం చేస్తారు" అన్నాడు.

ఆచారి మొహం చిట్లించి, "మీ వాళ్ళు ఇటువంటి పోలీసులకి ఏం సాయం చేస్తారు?" అని అడిగాడు.

"అవతలివాళ్ళ గురించి మీకు తెలీదు. వాళ్ళు ఇటువంటి విషయాల్లో తల పండినోయినవాళ్ళు. వాళ్ళ దగ్గరి అధునాతనమైన ఆయుధాలున్నాయి. మీ దగ్గరున్న మామూలు తుపాకుల్తో వాళ్ళని ఎదుర్కోలేదు" అన్నాడు బోసు.

రాధాకృష్ణమాచారి అతడి మాటలకి సమాధానం చెప్పకుండా మైక్ అందుకుని "...లొంగిపొండి. అంతా పోలీసులున్నారు" అని బిగ్గరగా అరిచాడు. సమాధానంగా ఒక బాంబు వచ్చి పోలీస్ వ్యాన్ మీద పడి విస్ఫోటనం చెందింది. గాజు పెంకులు గాలిలోకి లేచాయి. ఒక అద్దం చక్రంలా గిర్రున తిరుగుతూ వచ్చి, దూరంగా నిలబడివున్న సింహాచలం మెడని సర్రున కోసింది. ఆర్తనాదం చేస్తూ అతడు మోగాళ్ళమీద కూలబడి పోయాడు. ఈ ఆకస్మిక సంఘటనకి ఆచారి నిర్విణ్ణుడయ్యాడు.

బోసు కూడా ఇంత దారుణకాండ వూహించలేదు. రోడ్డుమీదే అరెస్టులు జరుగుతాయనుకున్నాడు. రాధాకృష్ణమాచారిని రక్షించవలసిన బాధ్యత తనమీద వుందని అతడు భావించాడు.

ఈ లోపులో –"మీ పోలీసుల్ని తీసుకుని ఈ ప్రదేశాన్ని ఖాళీచెయ్యి ఇన్‌స్పెక్టర్. లేకపోతే పిల్లల్నందర్నీ శవాల్ని చేస్తాం" అని అట్నుంచి వినపడింది.

బోసు ఇక ఆలోచించలేదు. వాళ్ళతో తలపడి అరెస్టు చేసే సామర్థ్యం పోలీసులకి లేదని అతడికి తెలుసు. తన వాళ్ళకి సైగ చేశాడు.

అతని అనుమతి కోసమే చూస్తూన్న అతడి మనుష్యులు నిశ్శబ్దంగా అక్కణ్ణుంచి జారుకున్నారు. గెరిల్లా పద్ధతిలో ప్రత్యర్థుల్ని అటాక్ చేయగల సమర్థులు వాళ్ళు. అందులోనూ అవతలివాళ్ళు బాగా తాగి వున్నారు. వాళ్ళని లోబర్చుకోవటం పెద్ద కష్టంకాకపోవచ్చు. పోతే ఈ సమరంలో ఎంత నష్టం జరుగుతుందని అంచనా వేయటమే కష్టం.

అతడి అనుమానం నిజమైంది. బుల్లెట్స్ గాలిలో తూనీగల్లా పరుగెడుతున్నాయి. చెట్ల అవతల్నుంచి స్మోక్ దట్టంగా వస్తూంది. ఆ పొగ ఆధారంగా అక్కణ్ణుంచి బయటపడాలని గూండాల ప్రయత్నం. ఒకసారి బయటపడి, జనంలో కలిసిపోతే, ఇక ఎవరూ పట్టుకోలేరని వాళ్ళ నమ్మకం. అది నిజంకూడా.

పిల్లల ఏడుపులు హృదయ విదారకంగా వినిపిస్తున్నాయి. ఎంత మందికి ఎంత తీవ్రమైన గాయాలయ్యాయో, ఎంతమంది మరణించారో కూడా తెలీదు. రాధాకృష్ణమాచారి వాళ్ళని సేవ్ చేయటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు.

కానీ వాళ్ళు మరీ చిన్న పిల్లలవటంతో, అతడి అరుపులు పట్టించుకోకుండా, అటూ ఇటూ పరుగెడుతున్నారు. హాలు ముందు ప్రార్థన చేసే జెండా మంటల్లో తగలబడిపోతోంది. మనుష్యుల తొక్కిడికి అరటి చెట్లు విరిగిపోయాయి. ఒక పాక పూర్తిగా కాలిపోయింది. సరస్వతీ నిలయం స్మశానంలా రూపుదిద్దుకుంటోంది.

బోసు మనుష్యులు రహస్యంగా తోటంతా ఆక్రమించుకున్నారు. ఇటువంటి టైపు యుద్ధాలలో పోలీసులకన్నా పదిరెట్లు అనుభవం సామర్థ్యం వున్నవారు వాళ్ళు. మరొక ఆలోచన లేకుండా మొదలియార్ మనుష్యుల్ని ఒక్కొక్కర్ని షూట్ చేయసాగారు.

ఈ పరిస్థితిలో అందరికన్నా ఎక్కువ దెబ్బలు తిన్నది విశారద. స్కూలు సమూలంగా నాశనమైపోవటం, తన కళ్ళముందే పిల్లలు పిట్టల్లా రాలిపోవడం – తన కలల ఆలయం, సరస్వతీ నిలయం శ్మశానంగా మారటం చూసి ఆమెకి దుఃఖం రాలేదు. దానికన్నా అతీతమైన "షాక్" లోకి వెళ్ళిపోయింది. ఒక శిలా ప్రతిమలా కాలుతున్న జెండా ప్రక్కన నిశ్చేష్టంగా నిలబడిపోయింది. చెవి పక్కనుంచి బుల్లెట్స్ దూసుకుపోతున్నా. పొగ పూర్తిగా చుట్టుముట్టినా ఆమెకు స్పృహలేదు. బ్రతికున్న శవంలా నిలబడి నిర్వేదంగా చూస్తోంది.

ఆ పరిస్థితిలో ఆమెని చూసిన బోసు చప్పున ఆమె దగ్గిరికి పరుగెత్తుకు రాబోయాడు.

సరీగ్గా ఆ పరిస్థితి కోసమే చూస్తున్నాడు మొదలియార్. పోలీసుల పక్కనుండగా బోసుని కాల్చటం ప్రమాదకరం. తను నిలబడి వున్న పొద మీదకి వాళ్ళు తిరిగి కాల్పులు సాగించవచ్చు. అందువల్లే అంతసేపు ఆగాడు.

బోసు విశారద వైపు వస్తూండగా మొదలియార్ రివాల్వర్ గురి చూసుకున్నాడు. ఎన్నాళ్ళు – ఎన్నేళ్ళ పగో అది! తనని కొట్టుకుంటూ పోలీస్ స్టేషన్‌కి తీసుకు వెళ్ళడం దగ్గర్నుంచి తనముందే అంచెలంచెలుగా ఎదిగి తన వాళ్ళని చంపడం వరకూ ప్రత్యక్ష సాక్షిగా చూడటం వల్ల పెరిగిన పగ అది!

మొదలియార్‌కి కొద్ది దూరంలో నిల్చుని వుంది విశారద. బోసు ఆమె దగ్గరికి వచ్చేవరకూ, ఆగి, గురిచూసి పేల్చేడు మొదలియార్. బుల్లెట్ సూటిగా బోసు భుజంలో దిగబడింది. కాలుతున్న చువ్వ గుచ్చినట్టు భగ్గున మండింది. మొదలియార్ మరోసారి పేల్చటానికి ట్రిగ్గర్ నొక్కాడు. అయితే అక్కడే బోసు శక్తిని తక్కువ అంచనా వేశాడు. మొదలియార్ రెండోసారి పేల్చబోయే లోపులోనే బోసు చేతిలోని పిస్టల్ అతడివైపు అంత బాధలోనూ గురి చూడటం – షూట్ చేయటం జరిగాయి.

అరక్షణం తేడాలో రెండూ ఒకసారి పేలాయి.

కానీ దానికి రెప్పపాటు ముందు ఒక అనూహ్యమైన సంఘటన జరిగింది.

విశారద బోసుని చూడలేదు. మొదటి శబ్దానికి పొదవైపు చూసింది. ఆమెకి మొదలియార్ కనపడ్డాడు. అతడి 'గురి' కనపడింది. ఆ సమయానికి బోసు తన పిస్టల్ కూడా పొదవైపు గురిపెడుతున్నాడు. మైకంనుంచి తేరుకున్న దానిలా "వద్దువద్ద"ని అరుస్తూ అతడికి అడ్డుగా వెళ్ళింది.

అంతే!

బోసు పేల్చిన బుల్లెట్ ఆమె గుండెల్లోంచి, వెనుకనుంచి మొదలియార్ పేల్చిన బుల్లెట్ వెన్నముకలోంచి దూసుకుపోయాయి. ఆమె కుప్పకూలిపోయింది. మొత్తం నిశ్శబ్దం. అంతా నిశ్శబ్దమే.

ఈ హఠాత్ చర్యకి బోసు స్థాణువయ్యాడు.

గాలికి వూగే కొమ్మలు కదిలే ప్రకృతి కూడా నిర్విణ్ణమైనట్టుంది. తమ శత్రువైనా – అతడొక మనిషిని అడ్డువెళ్ళిందో – తనని హంతకుడిగా మిగల్చకుండా వుండేటందుకు ఆమె అడ్డు వచ్చిందో అతడికి తెలియలేదు.

మొదలియార్‌కి కూడా కొంచెంసేపు పాటు ఏం జరిగిందీ అర్థంకాలేదు. విశారద తనని 'రక్షించింది'! ఈ సత్యం జీర్ణించుకోవటానికి అతడికి ఒక క్షణం పట్టింది.

ఒక్క క్షణమే!

క్షణంలో అతను మామూలు మనిషయ్యాడు. అతడి పెదవులమీద చిరునవ్వు కదలాడింది. బోసు ఇంకా ఆ షాక్ నుంచి తేరుకోలేదు. మొదలియార్ తన పిస్టల్‌ని ఎవరికీ కనపడకుండా విసిరేసేడు. దూరంనుంచి చూస్తున్న ఇన్‌స్పెక్టర్‌కి తను పిస్టల్ పేల్చటం కనపడి వుండదని అతడికి తెలుసు. పరుగెత్తుకుంటూ అక్కడికి వెళ్ళాడు.

"బోసు హత్య చేశాడు చూశావుగా. నువ్వే ప్రత్యక్ష సాక్షివి" అన్నాడు.

రాధాకృష్ణమాచారి అతడివైపు సాలోచనగా చూస్తూ "మీరు పేల్చటం కూడా చూశాను" అన్నాడు నెమ్మదిగా. మొదలియార్ నిరుత్తరుడయ్యాడు. అతడి మొహం జేవురించింది.

"విశారద మరణించింది అతడి బుల్లెట్ వలన ..." అన్నాడు శాసిస్తున్నట్టు.

"బోసు భుజానికి గాయమైంది మీ బుల్లెట్ వలనే ..." అన్నాడు ఆచారి.

"- మీరిక్కడనుంచి వెంటనే వెళ్ళిపోండి".

ఈ చివరి మాటకు మొదలియార్ తెల్లబోయాడు. అతని అనుమానాన్ని గ్రహించినట్టు "మీరిక్కడ వుంటే మీరుకూడా నేరంలో భాగస్వామి అవుతారు. తొందరగా ఇక్కడనుండి వెళ్ళిపోండి" అన్నాడు – మనం మనం ఒకటే అన్న భావన ధ్వనింపచేస్తూ.

మొదలియార్ మొహం విచ్చుకుంది. అభినందిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ వైపు చూసి, 'గుడ్' అన్నాడు. "ఇంతమందిలో ఎవరు ఎవర్ని చంపారో తెలీదు. ఏ బుల్లెట్ ఎవరిదో, ఎందుకు చంపారో కూడా తెలీదు. బోసు మాత్రం తప్పించుకుపోకుండా చూడు. పోతే... రేపొచ్చి నన్ను కలువు. నిన్ను అంచెలంచెలుగా పైకి తెచ్చే బాధ్యత నాది..." అని అక్కడినుంచి వేగంగా తన కారున్నవైపు వెళ్ళసాగాడు.

అతడిని కొంతదూరం వెళ్ళనిచ్చి, రాధాకృష్ణమాచారి తన రివాల్వర్ పైకి ఎత్తాడు. ఎప్పడో ట్రైనింగ్ నేర్చుకోవటమే, ఆ తరువాత టార్గెట్‌ని గురిచూసి కాల్చే అవసరం ఎప్పుడూ ఏర్పడలేదు. తన ఇష్టదైవమైన శ్రీరాముణ్ణి ఒక్కక్షణం ప్రార్థించాడు.

ఏకాగ్రత అంతా నిలిపి ట్రిగ్గర్ నొక్కాడు.

ముందు మెదడు చిట్లింది. తరువాత నుదిటిగుండా బుల్లెట్ బయటకొచ్చింది.

మొదలియార్ నేలమీద కూలిపోయాడు. అతడి కళ్ళు శూన్యంలోకి చూస్తున్నాయి. రాధాకృష్ణమాచారి నెమ్మదిగా అతడి దగ్గరకి వెళ్ళాడు. అతని మాటలు అతనికే వప్పచెపుతున్నట్టు అన్నాడు – "ఇంతమందిలో ఎవరు ఎవర్ని చంపారో, ఎందుకు చంపారో తెలీదు. ఏ బుల్లెట్ ఎవరిదో కూడా తెలీదు" అన్నాడు. మొదలియార్ కనుగుడ్లు కొద్దిగా కదిలాయి. రాధాకృష్ణమాచారి మోకాళ్ళమీద అతని పక్కనే కూర్చున్నాడు. "....నేను జీవితంలో చేసిన మంచిపని ఏదైనా వుందంటే ఇదేనని భావిస్తున్నాను. వెయ్యి రామకోటులు వ్రాసిన పుణ్యం నా కొస్తుందని కూడా భావిస్తున్నాను".

మొదలియార్ వినటం లేదు. అతడి ప్రాణాలు ఎప్పుడో గాలిలో కలిసిపోయాయ్.

# ఉపసంహారం

తరువూ, తనువూ – తమస్సూ... అన్నీ విషాదానికి సంకేతాలుగా నిలచేయి. హృదయ వేదనకి కన్నీటిపొరే చెలియలి కట్ట అయింది. నోటమాట గొంతు కట్ట దాటటానికి యుగమైంది. విశృంఖల నాట్యం చేసిన పగలు వెళ్ళిపోగానే ప్రపంచం రంగస్థలంమీద రాత్రి తెరపరుచుకునన్నీట్లు శబ్దాలన్నీ విజృంభించి వెళ్ళిపోయి తరువాత మిగిలిన నిశబ్దాన్ని చీలుస్తూ వణుకుతున్న కంఠంతో "విశారద... విశారదా" అన్నాడు అస్పష్టంగా గొణుగుతున్నట్లు.

ఆమె అతి కష్టంమీద కనురెప్పలు పైకెత్తింది.

అతడామె మీద చేయి వేశాడు.

అది ఏ స్నేహమో కలసిన మనసులకే తెలుసు. అది ఏ రుధిరమో స్రవించిన గాయానికే తెలుసు. అది ఏ బాధో .... దుఃఖించిన మనసుకే తెలుసు. ఆమె సర్వశక్తులూ కూడగట్టుకుంది.

"చూసేవా బోసూ ఇక్కడ కురుక్షేత్ర సంగ్రామం జరిగింది" అంది. దూరంగా పిల్లలు ... గాయాలతో.... రుధిరాశ్రువుల్తో... హాహాకారాల్తో...

ఆమె చూపులు జాలిగా వారిమీదనుంచి ప్రసరించాయి. ఆమె మనసు మాట్లాడింది. "...మేమెవరిమో కాదు, ఈ దేశపు సామాన్యులం. ప్రజలకి ప్రతీకలం..."

ఛెర్నాకోలతో ఛెళ్ళున కొట్టినట్టు అతను వులిక్కిపడ్డాడు.

"ఈ వ్యవస్థలో... ఒకరు బ్రతకాలంటే మరొకలు చావాలని నిరూపించావు. బోసూ! మీ మీ యుద్ధాల్లో, రాజకీయ రణరంగపు ఎత్తుల్లో మమ్మల్ని బలిపశువుల్ని

చేశావు. ఒకరు మేడ కట్టాలంటే మరొకరు పునాది కావాలనీ, ఒకరు కేకు తినాలంటే మరొకరు గంజి మానుకోవాలని, ఒకరు పదవిలోకి రావాలంటే ఒకరు ఆలయాన్ని ధ్వంసం చేయాలనీ, సోదాహరణంగా నిరూపించావు".

అతడి కళ్ళలో నీరు చిప్పిల్లింది. "ఇది... ఇదంతా ఇలా అవుతుందని నేను అనుకోలేదు శారదా! నన్ను నమ్ము" అన్నాడు.

ఆమె విషాదంగా నవ్వింది. "... మంచి రాజకీయ నాయకుడిగా మాట్లాడుతున్నావు బోసు! ప్రేరేపణకి – పరిణామానికి సంబంధంలేదని వాదించేది అతడే. అన్నట్టు... కాబోయే ముఖ్యమంత్రి కదూ ... ప్రధానమంత్రి రెండు గ్రూపుల్నీ కాదని నిన్ను చేరదీస్తున్నాడట కదూ!"

"ప్లీజ్ ... విశారదా ... నా గుండె తూట్లు పొడవకు".

"నేను నీ గురించి మాట్లాడటం లేదు బోసూ! మనం ... మనం నిర్మించుకున్న వ్యవస్థ గురించి మాట్లాడుతున్నాను. పూర్వకాలంలో వ్యక్తులు ప్రజలకోసం పాటుపడి, మహనీయులై, మాననీయులై అప్పుడు నాయకులయ్యేవారు. ఇప్పుడు నటులై, లేక ముందు గూండాలై తరువాత నాయకులవుతున్నారు".

ఆమె ఆయాసంతో ఆగింది. ఆమెనే చూస్తున్నాడు అతను. ఆమెను కదల్చే వీలులేదు. వెన్నెముకలో బుల్లెట్ వుంది. అంబులెన్స్ రావాలి. దూరంగా చప్పుళ్ళు తగ్గిపోయాయి. మొదలియార్ మనుష్యులు లొంగిపోతున్నారు. అతడి భుజం దగ్గిర రక్తం గడ్డకట్టింది. మనసు బాధతో పోల్చుకుంటే అది చాలా చిన్నది. అతడామెవైపే కన్నార్పకుండా చూస్తున్నాడు.

"బోసూ..." అంది.

"మాట్లాడకు విశారదా! విశ్రాంతిగా వుండు. అంబులెన్స్ వస్తుంది".

"నేను మాట్లాడాలి బోసూ! ఇప్పుడు చెప్పకపోతే మరెప్పుడూ చెప్పలేనేమో నన్ను మాట్లాడనివ్వు.." ఆమె ఆగి అంది. "బలమైన వాడు, తెలివైనవాడు నీతిని వదిలేస్తే రాజకీయ నాయకుడు అవ్వొచ్చేమోకానీ... కానీ ... నాయకుడు అవటానికి తప్పనిసరిగా నీతిని వదిలెయ్యనవసరం లేదు. చరిత్రని చూడు బోసూ... గొప్ప గొప్పనాయకులెవరూ నీతిని వదిలెయ్యలేదు. అందుకే చరిత్రలో నిలిచిపోయారు. తమ ఆశయాల్ని సాధించారు. గతం మనకి అదే చెప్పింది! వర్తమానంతో నువ్వు దాన్ని నిరూపించు. చెడుని గెలవటానికి యుద్ధాలూ, రక్తపాతాలూ తప్పని సరియైతే యుద్ధం చెయ్యి. కానీ, మంచివైపు వుండి చెడుతో చెయ్యి. ఆ విధంగా పాండవులు యుద్ధం చేశారు తప్ప, నీతిని వదిలెయ్యలేదు".

ఆ చివరి మాటలకు అతను అప్రతిభుడయ్యాడు.

ఎంత నిజం!

భగవద్గీత సారాంశాన్నంతా ఒక్క వాక్యంలో చెప్పిన నిజం!

అతడికి అతడి తండ్రి గుర్తొచ్చాడు. తండ్రి కూడా అదే చెప్పాడు. యుద్ధం చెయ్యమన్నాడు. కానీ ఇలా మాఫియాల, రాజకీయాల ఆసరాతో కాదు. ముఠాలు పెంచుకోవటానికి కాదు.

భగవంతుడు కూడా 'భక్తి, కర్మ, ధ్యాన, జ్ఞాన' యోగాలు మాత్రమే చెప్పాడు. కాని అన్నిటికన్నా పెద్ద యోగం "అర్థం చేసుకోవటం".

జీవితం అనే నాణేన్ని 'కర్మ' అనుక్షణం ఎగరేస్తూ వుంటుంది. దాని బొమ్మ, బొరుసులే తప్పు, ఒప్పులు.

సత్యం అనేది ఏకముఖం కాదు. బహుముఖం అదే అనేకాంతవాదం.

ఇక్కడ సత్యం – చుట్టూ శవాకారంలో వున్న మనుష్యులు! విశారద అన్నట్టు 'ప్రజ'కి ప్రతీకలు, వీళ్ళు అన్నార్తులు. ఓటర్లు, అమాయకులు, పీడిత వర్గాలు. ఎవరో వస్తారనీ, ఏదో చేస్తారనీ గాజు కళ్ళతో ఆశని నింపుకున్న ప్రజలు. తమలాటి తెలివైన వాళ్ళ రాజకీయాలకీ బలమైనవాళ్ళ స్మగ్లింగ్ యుద్ధాలకీ బలిపశువులు. తాము నాశనం చేస్తున్న ప్రపంచం ఎక్కడో లేదు. తన కళ్ళముందే వుంది. దానికి ప్రతినిధిగా విశారద తన కళ్ళముందే చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టులాడుతోంది.

అతడికి ఒక్క విషయం అర్థమైంది.

విశ్వాసమూ, అవిశ్వాసమూ అనేవి..... అనుభవం అనే వృక్షానికి పుట్టిన రెండు ఫలాలు. విశారదలాటి వారికి విశ్వాసం ప్రాధమికమైంది. తనలాటి వారికి అవిశ్వాసం ప్రాధమికమైంది. అందుకే తను.... జీవితంలో తగిలిన ఎదురు దెబ్బలకి, సాటి మనుష్యులమీద అవిశ్వాసాన్ని పెంపొందించుకున్నాడు. బలహీనతల మీద ఆడుకోవటం ప్రారంభించాడు. విశారద అలాకాదు. తగిలిన ప్రతి ఎదురుదెబ్బా ఆమెలో విశ్వాసాన్ని పెంచింది.

.... అతడు తనని తాను ప్రశ్నించుకోవటం ప్రారంభించాడు. మనిషికీ మృగానికీ తేడా అక్కడే! మనిషి ప్రశ్నించుకోగల. అదే అతడిని పై మెట్టున

నిలిపింది. సత్యాన్వేషణ! సత్యం అవనిలోనూ అణువులోనూ వుంటుంది. శోధించటమే మనం చేయవలసింది!

అతడామె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"నీ స్నేహం, గుండె గోడలమీద లిపి లేని చిత్తరువులా వుంది. జ్ఞాపకం..... నీ బొమ్మని నా కనురెప్పల వెనుక వ్రాసింది! మూసినా నీవే. తెరచినా నీవే నేస్తమా! నా సమస్తమూ –! నా హృదయం నీ క్షమకోసం అంజలి పట్టి వుంది. ఈ దుఃఖం..... నిన్ను దగా చేశానని కాదు. ఈ దుఃఖం వైఫల్యానికి.....! ఇంతకాలం నువ్వు నాకు అర్థం కాకపోవటానికి . కాకపోతే ఆ తప్పు నీదికాదు..... నాది! నీ కోసం నేను జీవితకాలమంతా వెతికాను. చివరికి నేను మరణించాక ఈ శ్మశానంలో దొరుకుతావనుకోలేదు".

అతడు చేతిని హృదయానికి హత్తుకున్నాడు. ఆ కరస్పర్శకి ఆమె కనులు విప్పింది.

దూరంగా అంబులెన్స్ వస్తూన్న శబ్దం వినిపిస్తోంది.

"ఈ సరస్వతీ నిలయం సాక్షిగా నాకో వాగ్దానం చేస్తావా బోసూ!"

"చెప్పు శారదా! ఏం చెయ్యమంటావు?"

"తెలివైనవాడూ, బలమైనవాడూ అందలం ఎక్కటానికి నీతిని వదిలెయ్యనవసరం లేదని నిరూపించే రోజు కోసం ప్రయత్నిస్తానని వాగ్దానం చెయ్యి. అసలు అందలాలే లేకుండా యంత్రాలూ నాగళ్ళూ వుండే రోజు కోసం యుద్ధం సాగిస్తానని ఒట్టెయ్యి..."

అతడు ఆమె చేతిలో చేయి వేశాడు.

అంబులెన్స్ వచ్చి ఆగింది

*                *                *

ఆస్పత్రి వరండా జనంతో కిటకిట లాడుతోంది. అందరి మొహాల్లోనూ దిగులూ ఆదుర్దా.

చేతులు కట్టుకుని, కిటికీకి ఆనుకుని వున్నాడు బోసు. అతడికి ఆ క్షణం చూసిన వారెవరూ ఒక చీకటి సామ్రాజ్యపు అధినేత అనుకోరు.

అతడికి పక్కనే నిల్చుని వుంది పద్మావతి. దూరంగా బెంచిమీద కూర్చుని చూస్తోంది లక్ష్మీశారద. బ్రతకటానికి ఛాన్సు తక్కువ అని చెప్పారు డాక్టర్లు. అదే నిజమయితే బోసు బహుశ మళ్ళీ మామూలు మనిషి కాలేకపోవచ్చు.

తన మీద చాలా బాధ్యత వుంది. బోసుని మళ్ళీ మామూలు మనిషిని చేయాల్సిన బాధ్యత.

ఆమెకి ఆశ్చర్యంగా అనిపించింది. ఎక్కడ ప్రారంభమైన జీవితం ఎక్కడికి చేరుకుంది? ఒక్కొక్క అనుభవమూ తన ఒక్కొక్క అభిప్రాయాన్ని మార్చింది. అమాయకత్వంలోంచి బెదురుతనంలోకి, ఆ తరువాత (మనుష్యుల మీద) నమ్మకం పోగొట్టుకోవటంలోకి, అట్నుంచి డబ్బులోకీ –

చివరికి మిగిలిందేమిటి?

ప్రతీ అభిప్రాయమూ రిలేటివే. ఏ అభిప్రాయంలో వుంటే అదే కరెక్టనుకోవటమే మిగిలింది.

ఆమె దృష్టి పద్మావతి మీద పడింది. పద్మావతి కూడా సుధాకర్‌ని ప్రేమించింది. అతడు గోమతికి చేరువయ్యాడు. ఆమె ఒంటరిగా మిగిలిపోయింది.

తర్కశాస్త్రం మీద సెటైర్‌గా ఒక గమ్మత్తయిన ఉదాహరణ చెపుతారు. పిల్లికి నాలుగు కాళ్ళు... మేకకి నాలుగు కాళ్ళు,.. కాబట్టి పిల్లీ – మేకా ఒకటే.

ఆమె ఆలోచనలని భంగపరస్తూ థియేటర్ తలుపు తెరుచుకుంది. అందరూ టెన్షన్‌తో అటు చూశారు.

డాక్టర్ మొహం చిరునవ్వుతో వుంది.

* * *

విశారదకు స్పృహ రాగానే డాక్టర్ మరో ఇంజెక్షన్ యిచ్చి వెళ్ళిపోయాడు. ఆమె చుట్టూ చూసింది. బోసూ ... లక్ష్మీశారద... పద్మావతి...

వాళ్ళిద్దరూ కొంచెంసేపు మాట్లాడి వెళ్లిపోయారు.

బోసూ – ఆమె మిగిలారు.

"స్కూలు ఎలా వుంది?" ఆమె అడిగిన మొట్టమొదటి ప్రశ్న అది.

"అదృష్టవశాత్తు మరణాలు ఎక్కువలేదు. గాయపడ్డ పిల్లలందరూ ప్రమాదం నుంచి బయటపడుతున్నారు".

ఆమె ఒక్కక్షణం వూరుకుని, "అసలు ఎందుకింత గొడవ జరిగింది?" అని అడిగింది.

చాలా చిన్న ప్రశ్న! ఎం....దు...కు? ఎందుకు బాంబులు పేలతాయి? ఎందుకు రైళ్ళు తగలబడతాయి? ఎందుకు? ఎం...దు...కు?

అతడు సమాధానం చెప్పకుండా మౌనంగా వూరుకోవటాన్ని ఆమె మరోలా భావించి, "బోసూ.." అంది. "నేను బ్రతికానని చెప్పి, మళ్ళీ నీ వాగ్దానాన్ని వెనక్కి తీసుకోవుగా?"

"లేదు" నిజాయితీగా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

నువ్వూ నేనూ కలిసి – 'మనం' అనే బహువచనాన్ని చెరిపి – నువ్వు మిగిలి – నీలో నేను కరిగి.

...తలుపు చప్పుడైంది. రాధాకృష్ణమాచారి ఆమె స్టేట్‌మెంట్ తీసుకోవటానికి లోపలికి వచ్చాడు. బోసు బయటకు నడిచాడు.

పది నిముషాల తరువాత ఆచారి బయటకొచ్చాడు. "ఈ స్టేట్‌మెంట్ రికార్డు చేసుకోవటం... ఇదంతా ఫార్మల్..." అన్నాడు. "ఎనీవే – కంగ్రాచ్యులేషన్స్ ఆమె బతికింది. అన్నట్టు నీకు తెలుసా? ముఖ్యమంత్రి అంటే ప్రధానమంత్రి మండిపడుతున్నాడట. ఎలక్షన్స్ అని వూరుకున్నాడు కానీ లేకపోతే పదవిలోంచి తీసేసేవాడట... దీనిమీద నీ అభిప్రాయం ఏమిటి?"

"ఏమీలేదు. అవేమీ ఆలోచించే స్థితిలో నేను లేను. చాలా బిజీగా వున్నాను".

"ఏ విషయంలో?"

"బోస్ బజార్‌ని జనతా బజార్‌గా మార్చే విషయంలో..."

రాధాకృష్ణమాచారి ఒక్కక్షణం షాక్ తగిలినవాడిలా నిశ్చేష్టుడై, తేరుకుని.... "గుడ్ మాకు పని తగ్గిస్తున్నావన్నమాట" అని తలూపి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. బోసు అక్కడనుంచ లక్ష్మీ శారద దగ్గిరకు నడిచాడు.

"ఏమిటి? జనతా బజారంటున్నావు?" అని అడిగింది.

"చౌక దుకాణాల షాపులు ప్రభుత్వమే ఎందుకు పెట్టాలి? మనమే ఎందుకు పెట్టకూడదు? అన్న ఆలోచన వచ్చింది. స్మగుల్డ్ గూడ్స్ అమ్మే బజారుని జనతా బజారుగా మారుద్దామనుకుంటున్నాను".

"చాలా మంచి ఆలోచన " అంది లక్ష్మీశారద మెచ్చుకోలుగా.

"నిజంగానా?"

"నిజంగానే బోసూ! మొత్తం బజారంతా... ఈ చివర్నుంచి ఆ చివరి వరకూ రకరకాల చౌక దుకాణాలు షాపులు... దేశంలో ఎక్కడా లేవు. ఇంత మంచి ఆలోచన ఎలా వచ్చింది?"

"ఒక పెద్ద కార్యం ప్రారంభానికి చిన్న మొదలు అన్నట్టు – ఆ బజార్ మానేజ్‌మెంట్ నువ్వు తీసుకుంటావా?"

ఊహించని ఈ ప్రశ్నకు ఆమె మొదట నిరుత్తురాలై, తరువాత తేరుకుంటూ "...చెయ్యగలనంటావా?" అని అడిగింది.

"నువ్వు చెయ్యలేని పనంటూ వుంటుందని నేననుకోను".

ఇంతలో పద్మావతి అక్కడికొచ్చింది. "ఎక్కడికి కెళ్ళావ్?" అడిగాడు.

"విశారదని చూసి వస్తున్నాను"అంది. "...బాగా తేరుకుంది అదృష్టవంతురాలు. దేముడు ఎప్పుడూ మంచివాళ్ళని చల్లగా చూస్తాడు".

ఆ మాటలకి లక్షీశారద ఆపుకోలేక నవ్వింది. ఇద్దరూ ఆశ్చర్యంగా ఆమెవైపు చూసి, "ఎందుకు నవ్వేవు?" అని అడిగారు.

"ఏం లేదు" అంది అక్కడనుంచి కదుల్తూ. పిల్లికి నాలుగుకాళ్ళు మేకకి నాలుగుకాళ్ళు – కాబట్టి పిల్లీ మేకా ఒకటే అనేది తర్కరహితం.

దేముడు ఎప్పుడెప్పుడూ మంచివాళ్ళని చల్లగా చూస్తాడు. కాబట్టి ఈ ప్రపంచంలో మంచివాళ్ళు దేనికీ భయపడనవసరం లేదు అనేది తర్కరహితం.

మంచివాళ్ళని దేముడు చల్లగా చూస్తాడు. కాబట్టి దేవుడిచేత చల్లగా చూడబడని (తనలాటి) వాళ్ళందరూ చెడ్డవాళ్ళనేది కూడా తర్కరహితమేనా? అందుకే ఆమె నవ్వింది.

--oOo--

# యండమూరి వీరేంద్రనాథ్

# ది డైరీ ఆఫ్ మిసెస్ శారద

"ఒక మనిషి భోగభాగ్యాలతో తులతూగాలంటే మరో మనిషి గంజి తాగాలి. ఒక మనిషి శవాల్ని పీక్కుతినాలంటే మరో మనిషి శవంగా మారాలి."

-వి. శారద

"ఈ ప్రపంచంలో తెలివైనవాడు నీతిని వదిలేస్తే కాపిటలిస్టు అవుతాడు. వదిలెయ్యకపోతే మేధావో, టీచరో అవుతాడు. బలమైనవాడు నీతిని వదిలేస్తే రాజకీయ నాయకుడు అవుతాడు. వదిలెయ్యకపోతే శ్రామికుడు అవుతాడు."

-లక్ష్మి శారద

రెండు విభిన్న లోకరీతుల్ని రెండు విభిన్న కోణాల్లో వీరేంద్రనాథ్ వివరించిన విలక్షణమైన నవల

"ది డైరీ ఆఫ్ మిసెస్ శారద"



నవసాహితి బుక్ హౌస్
ఏలూరు రోడ్ • విజయవాడ-520002